# నూట పదహారు
# మహర్షుల దివ్యచరిత్రలు



రచన

శ్రీమతి భమిడిపాటి .వి. బాలా త్రిపుర సుందరి

## నూట పదహారు

# మహర్షుల దివ్య చరిత్రలు



రచన :

**శ్రీమతి భమిడిపాటి వి. బాలాత్రిపురసుందరి**

శ్రీమధులత పబ్లికేషన్స్
డోర్. నెం. 28-3-49, సంజీవయ్య కాలనీ,
అరండల్‌పేట, విజయవాడ - 520 002

Noota Padahaaru
Maharshula Divyacharitralu

Written by :
Smt.Bhamidipati V.Bala Tripura Sundari
Vijayawada.

© PUBLISHER

Ist Adition :
September, 2004

Price : Rs. 100/-

Cover Design & Type Setting :
Madhulatha Graphics, Vijayawada.

Printed At :
Vaasu Offset Printers
Vijayawada.

Published by :
Sree Madhulatha Publications
28-3-49, Sanjeevaiah Colony,
Arundalpet, Vijayawada - 520 002
Ph : 2434320 (O), 2436936 (R)
Cell : 94401 72936

# విషయసూచిక


1. అగస్త్య మహర్షి 7
2. అత్రి మహర్షి 11
3. అరణ్యక మహర్షి 13
4. అర్వావసువు పరావసువు జంట మహర్షులు 15
5. అరుణి మహర్షి 16
6. ఆస్తీక మహర్షి 17
7. అష్టావక్ర మహర్షి 19
8. అంగిరస మహర్షి 22
9. ఉతథ్య మహర్షి 25
10. ఉదంక మహర్షి 26
11. ఉద్దాలక మహర్షి 30
12. ఉపమన్యు మహర్షి 31
13. ఋచీక మహర్షి 33
14. ఋభు మహర్షి 35
15. ఋష్యశృంగ మహర్షి 38
16. ఔర్వ మహర్షి 41
17. కచ మహర్షి 45
18. కణ్వ మహర్షి 47
19. కర్దమ మహర్షి 49
20. కశ్యప మహర్షి 51
21. కపిల మహర్షి 55
22. కాత్యాయన మహర్షి 59
23. కామందక మహర్షి 62
24. కాశ్యప మహర్షి 64
25. క్రతువు మహర్షి 66
26. కృత్సమద మహర్షి 66
27. కౌశిక మహర్షి 68
28. కండు మహర్షి 70
29. గర్గ మహర్షి 72
30. గౌతమ మహర్షి 74
31. గౌరముఖ మహర్షి 77
32. చ్యవన మహర్షి 80
33. జడ మహర్షి 84
34. జమదగ్ని మహర్షి 88
35. జరత్కారు మహర్షి 90
36. జాబాలి మహర్షి 91
37. జైగీషవ్య మహర్షి 93
38. జైమిని మహర్షి 94
39. తండి మహర్షి 97
40. దత్తాత్రేయ మహర్షి 98
41. దధీచి మహర్షి 100
42. దక్ష మహర్షి 103
43. దీర్ఘతమ మహర్షి 106
44. దుర్వాస మహర్షి 107
45. దేవద్యుతి మహర్షి 111
46. దేవల మహర్షి 112
47. ధౌమ్య మహర్షి 114
48. నరనారాయణ మహర్షులు 116
49. నారద మహర్షి 119
50. నిదాఘ మహర్షి 124
51. పరాశర మహర్షి 125
52. పిప్పలాద మహర్షి 127
53. పులస్త్య మహర్షి 130
54. పైల మహర్షి 132
55. బకదాల్భ్య మహర్షి 133
56. భరద్వాజ మహర్షి 136
57. భృగు మహర్షి 138
58. బృహస్పతి మహర్షి 141
59. మతంగ మహర్షి 145
60. మరీచి మహర్షి 147
61. మంకణ మహర్షి 148
62. మార్కండేయ మహర్షి 149
63. మాండవ్య మహర్షి 152
64. ముద్గల మహర్షి 153
65. మృకండు మహర్షి 155
66. మృగశృంగ మహర్షి 156
67. మైత్రేయ మహర్షి 158
68. యాజ్ఞవల్క్య మహర్షి 160
69. రురు మహర్షి 162
70. రోమశ మహర్షి 164
71. రైభ్య మహర్షి 166
72. లోమశ మహర్షి 168
73. వసిష్ఠ మహర్షి 170
74. వామదేవ మహర్షి 173
75. వాల్మీకి మహర్షి 177
76. విపుల మహర్షి 180
77. విశ్రవస మహర్షి 181
78. విశ్వామిత్ర మహర్షి 182
79. వ్యాఘ్రపాద మహర్షి 185
80. వైశంపాయన మహర్షి 186
81. వ్యాస మహర్షి 188
82. శక్తి మహర్షి 192
83. శతానంద మహర్షి 193
84. శమీక మహర్షి 194
85. శృంగి మహర్షి 195
86. శరభంగు మహర్షి 196
87. శంఖలిఖిత మహర్షులు 196
88. శాండిల్య మహర్షి 198
89. శుక మహర్షి 200
90. శుక్ర మహర్షి 202
91. శ్వేతకేతు మహర్షి 206
92. శౌనక మహర్షి 207
93. సనక సనంద సనత్కుమార, సనత్సుజాత మహర్షులు 209
94. సహస్రపాద మహర్షి 212
95. సంవర్త మహర్షి 213
96. సారస్వత మహర్షి 215
97. సాందీపని మహర్షి 216
98. సుకృశ మహర్షి 218
99. స్థూలకేశు మహర్షి 219
100. సౌభరి మహర్షి 220
101. హరీత మహర్షి 221
102. అప్రవానుడు 223
103. అరిష్టివేనుడు 223
104. అశ్వలాయనుడు 223
105. ఇంద్రమిత్ర 223
106. ఉషస్తి 223
107. కంథుడు 223
108. చిరకారి 223
109. పంచరఖుడు 223
110. మనస్వి 223
111. మందకర్ణి 223
112. మహీదాసుడు 223
113. మాండూకేయుడు 223
114. శిలాదుడు 223
115. సుతీక్ష్ణుడు 224
116. సుమంతుడు 224



శ్రీవారు

వీరఘంట సూర్యనారాయణ శర్మ గార్కి

సగౌరవంగా

- భమిడిపాటి వి. బాలాత్రిపుర సుందరి

# ముందుమాట

**పి**ల్లలూ ! ఈ పుస్తకం ప్రత్యేకంగా మీ గురించే మొదలుపెట్టాను. ఎందుకో తెలుసా ? మీరు అమ్మకడుపులోంచి బయటికి వచ్చాక ఆడుకునేందుకు కూడ లేకుండ బడికి వెళ్లిపోతున్నారు. ఇంక చదువులు మొదలూ....... అసలు చదువుకీ, విద్యకీ తేడా తెలియదు కదూ ! చదువు బ్రతుకు తెరువుకి, తినడానికి, బట్ట కట్టడానికి, ఉండడానికి ఒక గూడు కోసం, కాని విద్య ఉంది చూశారూ...అది జ్ఞానాన్ని ఇస్తుంది. బ్రతకడం నేర్పుతుంది, మనం మనకోసం, మనం ఇతరుల కోసం బ్రతకడం కూడా నేర్పిస్తుంది. పెద్దలంటే భక్తి, వినయం, దైవభక్తి అన్ని సుగుణాల్ని నేర్పుతుంది. మనంట వచ్చే జన్మకి పెట్టుబడి ఈ జన్మలోనే పెట్టాలిట. చూడండీ.... మనం అవయవాలు లేకుండా గానీ జబ్బులతో గానీ పుట్టామనుకోండి ఏమనుకుంటాం? పూర్వజన్మలో ఏ మహాపాపం చేశానో ఈ జన్మలో ఇలా పుట్టాను, అనుకుంటాం కదా! అందుకే మంచి పన్లు చేస్తూ, న్యాయంగా, ధర్మంగా ఎలా ఉండాలి అనేది మనం నేర్చుకోవాలి. అది మనకి క్లాసు పుస్తకాల వల్ల రాదు. మంచి మంచి పుస్తకాలు పెద్దవాళ్ళు మనకోసం రాసి పెట్టారు కదా ! అవి చదవడం మొదలు పెడ్తే వస్తుంది.

మనం పుట్టక ముందు ఈ భూమి మీద ఎంతో మంది గొప్పవాళ్ళు పుట్టేశారు కదా ! వాళ్లందరూ ఎలా ఉన్నారో తెలుసుకొని మనం కూడా అలాగే గొప్పగా ఉండాలంటే మంచి పుస్తకాలు చదవాలన్నమాట. ఇలాంటి మంచి పుస్తకాలు చదవడం వలన మనం చూడలేకపోయిన చాలామంది గురించి చాలా విషయాల గురించి తెలుసుకోగలుగుతాం. అంతేకాదు...

మనం దొరల చదువులు చదివేస్తున్నాం కదా ! మన తెలుగు భాష మనకి కాకుండాపోతోంది. మిగతా భాషలు మనకి ఎక్కడికైనా వెళ్ళినపుడు బ్రతకడానికి, ఉద్యోగాలకి ఉపయోగపడతాయి. మాతృభాష ఉంది చూశారూ... దీన్ని మనం వదలకూడదు. మీకు అర్ధమయ్యేలా చెప్పాలంటే మనం బాగా చదువుకుని ఉద్యోగానికి వెళ్ళాక అమ్మని వదిలేస్తున్నామా...? ఇంత  పెద్ద అవడానికి ఎవరు కారణం... అమ్మ ! అమ్మ అంటే మనకి ఎంత గౌరవమో, ఎంత మర్యాదో మాతృభాష మీద కూడా అంతే ఉండాలి.

వేరే భాషల్లో పుస్తకాలు చదవద్దని కాదర్రోయ్! జ్ఞానం కావాలంటే పుస్తకాలు చదవాలి. అవి ఏ భాషలో దొరికినా సరే.

ఇప్పుడు ఈ పుస్తకం మహర్షుల దివ్య కథల గురించి రాస్తున్నానన్నమాట. ఎందుకో తెలుసా? మన పవిత్రమైన భారతదేశంలో మన హిమాలయ పర్వతాల మీద, ఒక్కచోటేమిటి ఎన్నోచోట్ల ఎంతోమంది మహర్షులు తపస్సు చేసి భగవంతుణ్ణి చూసి, మన కోసం భూమి మీదకి ఎన్నో సౌకర్యాలు మనం బ్రతకడానికి తెచ్చారు.

ఉదాహరణకి గంగానదిని భగీరధథుడు భూమి మీదకి తెచ్చాడని తెల్సుకుని ఉంటారు కదా! అలాగనమాట. అంతమంది మహర్షులు గొప్ప తపస్సంపన్నులు ఉన్నప్పుడు మనం కొంతమంది గురించైనా తెలుసుకోవాలి కదా... అందుకే శ్రమ అనుకోకుండా ఈ పుస్తకం చదవండి. ఇంకా మీకు ఏ విషయాల మీద కావాలో అడగండి. ఇపుడు రచనలన్నీ ప్రత్యేకంగా మీకోసం. ఎందుకంటే రేపు మీరే కదా మన దేశానికి పెద్దలు. మీరంతా దేశాన్ని రక్షించాలి. న్యాయబద్ధంగా పాలించాలి. ఎక్కడా హింస ఉండకూడదు.

పిల్లలూ ! ఈ దేశాన్ని పూర్వం రామరాజ్యం అంత గొప్పగా పాలించవలసిన వాళ్ళు మీరే... చూశారా! ఎంత బాధ్యత మీమీద ఉందో. అందుకే పుస్తకాలు చదవడం అలవాటు చేసుకుని చాలా విషయాలు తెల్సుకోండి. ఇవన్నీ కేవలం మీ కోసమే!!

నాకు జన్మనిచ్చిన తల్లిదండ్రులకు నమస్కరిస్తూ, నేను రచయిత్రిగా ఎదగాలని ఆకాంక్షిస్తూ, సలహాలిస్తూ ఈ నా రచనకు మార్గదర్శకులయి ముందుకు నడిపించిన బహు గ్రంథకర్త డా॥ జి.వి.పూర్ణచంద్ గారికి నా కృతజ్ఞతలు తెలియచేసుకుంటూ, నాకు సహకరించిన నా చిరంజీవులు శ్రీలత శ్రీనివాస చక్రవర్తి, శ్రీదేవిలను ఆశీర్వదిస్తూ... నా రచనలన్నీ భావిభారత పౌరులయిన మీకు అందజేస్తున్నాను,

ఇవన్నీ కేవలం మీ కోసమే...

మీ

భమిడిపాటి బాలాత్రిపుర సుందరి....

# 1. అగస్త్య మహర్షి

శ్రీలు పొంగిన పుణ్యభూమి. భారతావనిలో అనితర సాధ్యమైన మహత్కార్యాలు చేసిన మహాత్ముడు అగస్త్య మహర్షి.

ఈయన పుట్టడం కూడా చాలా విచిత్రంగా పుట్టాడు. అగ్నిదేవుడూ, వాయుదేవుడూ ఈ ఇద్దరి అంశతో నిండుగా నీళ్ళున్న ఒక పాత్రలోంచి పుట్టాడు అగస్త్య మహర్షి.

అందుకే ఆయనకి పేరు ఏం పెట్టారో తెలుసా? కలశజుడు. కుంభసంభవుడు, ఔర్వశేయుడు, మిత్రావరణ పుత్రుడు, వహ్నిమారుత సంభవుడు అని ఇంకా అనేక పేర్లున్నాయి.

అగస్త్య మహర్షికి చిన్నతనంలో ఉపనయనం, ప్రణవ పంచాక్షరీ మంత్రోపదేశం అన్నీ దేవతలే చేసేశారు. ఆయన బ్రహ్మచర్యం తీసుకుని తపస్సు చేస్తూ ఉండేవాడు. ఒకసారి అడవిలో తిరుగుతూ సల్లకీ చెట్టుకి తలక్రిందులుగా వ్రేలాడుతూ ఉన్న మునులని చూసి మీరెందుకు ఇలా ఉన్నారని అడిగాడు అగస్త్య మహర్షి.

ఆ మునులు అగస్త్యుణ్ణి చూసి నాయనా ! మమ్మల్ని పితృదేవతలంటారు. నీకు పెళ్లయి సంతానం కలిగితేనే మాకు పైలోకాలకి వెళ్ళే అర్హత వస్తుంది. నిన్ను చూస్తే బ్రహ్మచర్యం వదలనంటున్నావు. మాకు పుణ్యలోకం రావాలంటే నువ్వు పెళ్ళి చేసుకోవాలి. లేకపోతే మా గతి ఇంతే అన్నారు.

అగస్త్యుడు ఇది విని మరి పెళ్ళి చేసుకోవాలంటే మంచి వధువు కావాలి కదా! అందుకని తన తపోబలంతో పుత్రకాముడనే పేరున్న విదర్భరాజుకి ఒక చక్కటి కుమార్తె పుట్టాలని వరం ఇచ్చాడు.

ఆ అమ్మాయి పేరు లోపాముద్ర. లక్ష్మీదేవంత అందంగా సరస్వతీ దేవికున్నంత విద్యతో సుగుణాల రాశిలా ఉంది. ఆ లోపాముద్రని అగస్త్యుడు పెళ్ళి చేసుకుని తనతో ఆశ్రమానికి తీసుకువచ్చాడు.

మరి పెళ్ళి చేసుకున్నాక కొంచమయినా ధనం వుండాలిగా. అగస్త్యుడు తన తపశ్శక్తిని నష్టపోవడం ఇష్టం లేక 'శ్రుతర్వుడ'నే రాజుని అడిగాడు. ఆ రాజు దగ్గర కూడ సరిపడ ధనం లేదని ఇద్దరూ కలిసి 'ప్రధ్నశ్వుడు' దగ్గరికి వెళ్ళారు. ఆయన దగ్గర కూడ అదే జరిగింది. ముగ్గురు కలిసి 'త్రిసదస్యుడు' అనే రాజు దగ్గరకి వెళ్ళారు. ఆయనది కూడా అదే పరిస్థితి.

మణిమతీ పురానికి రాజు 'ఇల్వలుడు'. ఆయనకి 'వాతాపి' అనే తమ్ముడుండే వాడు. ఇల్వలుడు తన తమ్ముడు వాతాపిని చంపి బ్రాహ్మణులకి వండిపెట్టేవాడు. తర్వాత వాతాపిని పిలవగానే వాతాపి బ్రాహ్మణుల కడుపులో నుంచి బయటకి వచ్చేవాడు. ఈ విధంగా అన్నదమ్ములిద్దరూ కలిసి బ్రాహ్మణులని చంపేసేవాళ్ళు.

అగస్త్యుడు తను కలిసిన రాజులు ముగ్గుర్నీ తీసుకుని ఇల్వలుడి ఇంటికి వెళ్ళాడు. మామూలుగానే ఇల్వలుడు వాతాపిని చంపి, వండిపెట్టి, మళ్ళీ వాతాపిని పిలిచాడు. కానీ అగస్త్యుడు భోజనం చెయ్యగానే 'జీర్ణం జీర్ణం వాతాపి జీర్ణం' అన్నాడు. వాతాపి జీర్ణం అయిపోయాడు. ఇల్వలుడు ఎంత పిలిచినా వాతాపి బయటికి రాలేదు. ఉంటే కదా !... రావడానికి !

మీరెప్పుడయినా గమనించారా. పసిపిల్లలకి పాలుపట్టగానే 'జీర్ణం జీర్ణం వాతాపి జీర్ణం' అని పసిపిల్లల పొట్ట మీద రాస్తారు. వాతాపిని కూడా అరగించుకోగలిగినంత జీర్ణశక్తి పిల్లలకి రావాలని అలా అంటారు. అప్పటి అగస్త్యుడి మంత్రం ఇప్పటి పిల్లలకి కూడా ఉపయోగపడుతోంది చూశారా !

ఇల్వలుడు అగస్త్యుడికి ధనం, బంగారం, ఆవులు అన్ని ఇచ్చి పంపించాడు. తర్వాత అగస్త్యుడికి ధృడస్యుడు అనే కొడుకు, తేజిస్వి అనే మనుమడు కలిగారు. పితృదేవతలు పుణ్యలోకాలకి వెళ్ళిపోయారు.

ఒకసారి బ్రహ్మదేవుడు అగస్త్యుల వారి ఆశ్రమానికి వచ్చాడు. అగస్త్యుడు ఎదురువెళ్ళి తీసుకువచ్చి ఆయన్ని తగిన విధంగా సత్కారం చేసి ఆజ్ఞాపించండి స్వామీ ! అన్నాడు. నీ భార్య లోపాముద్ర విష్ణుమాయ అంశాన పుట్టింది. ఇప్పుడు విష్ణుమాయ కవేరరాజుకి ముక్తి నివ్వడానికి ఆయన కుమార్తెగా పుట్టి ఘోరతపస్సు చేస్తోంది. ఆమెను నువ్వు పెళ్ళి చేసుకో అన్నాడు బ్రహ్మదేవుడు.

అగస్త్యుడు బ్రహ్మదేవా! నీ ఆజ్ఞప్రకారమే చేస్తాను అని చెప్పి ఆమెను పెళ్ళి చేసుకున్నాడు. పెళ్ళి అవగానే కవేరకన్య కావేరీ నదిగా ప్రవహించింది. కావేరి నదిలో స్నానం చేసిన కవేరరాజుకి ముక్తి కలిగింది.

వృత్రుడు అనే రాక్షసుడు ఇంద్రుణ్ణి జయించి ధర్మచరిత్ర గల మహర్షులందర్నీ రాత్రి సమయంలో చంపి పగటి సమయంలో సముద్రంలో దాక్కుని ఉండేవాడు.

మహర్షులందరూ కలిసి ఆ సముద్రజలాన్ని అగస్త్యమహర్షికి దానమిచ్చారు. అగస్త్యుడు ఆ సముద్రాన్ని తన కమండలంలోపట్టి ఒక్క గుటకలో త్రాగేశాడు వృత్రాసురుడు బైటపడ్డాడు. దధీచి దేహాన్ని ఆయుధాలుగా చేసుకుని దేవతలు వృత్రుణ్ణి చంపేశారు.

అగస్త్యమహర్షి దండకారణ్యంలో నివసిస్తూ ఉండగా శ్రీరాముడు అరణ్యవాసం చెయ్యడానికి వెడుతూ అగస్త్యమహర్షి ఆశ్రమానికి వెళ్ళాడు. ఖడ్గము, విల్లు, బాణాలు, అక్షయమైన అమ్ములపొది రాముడికి ఇచ్చి దీవించాడు అగస్త్యుడు.

కొంతకాలం తర్వాత రామరావణ యుద్ధంలో రావణ బాణాలకి రాముడు గాయపడి బాధపడుతుండగా అగస్త్యుడు రాముడిని విష్ణుమూర్తిగా గుర్తుచేసి స్తోత్రం చేసి రాముడికి ఆదిత్యహృదయం అనే మహాస్తవం ఉపదేశించాడు.

అంటే మనం ఇప్పటికీ ఉదయాన్నే చదువుకుంటున్న ఆదిత్యహృదయం అగస్త్యమహర్షి శ్రీరాముడికి ఉపదేశించిందేనన్నమాట.

పూర్వం నహుషుడనే రాజు నూరు అశ్వమేధ యాగాలు చేసి ఇంద్రపదవిని పొందాడు. కానీ, ఐశ్వర్యం ఉందన్న అహంకారంతో శచీదేవిని తనతో ఉండమని అడిగాడు. శచీదేవి మునులను వాహనంగా చేసుకుని రమ్మంది. నహుషుడు శచీదేవి దగ్గరికెడుతూ మునులని రథం మొయ్యమని చెప్పాడు. పూర్వాచార్యుల మంత్రాల్నీ, బ్రాహ్మణుల్నీ నిందించటం తప్పని చెప్పిన అగస్త్యుడి తల మీద తన్నాడు నహుషుడు. నహుషుడిని క్రూరసర్పంగా మారమని శపించాడు అగస్త్యుడు. తర్వాత నహుషుడి కోరిక మీద పూర్వజ్ఞానం ఉండేలా కరుణించాడు అగస్త్యుడు.

అగస్త్యుడు 'ద్వాదశ వార్షిక యజ్ఞం' చేశాడు. అంటే ఆ యజ్ఞం పన్నెండు సంవత్సరాలు జరిగింది. దానికి ఇంద్రుడు సహకరించలేదు. అప్పుడు అగస్త్యుడు తానే ఇంద్రపదవి పొంది వర్షాలు కురిపించి నిధులు తెచ్చుకుంటాను అన్నాడు. మునులు ఇంద్రుడు భయపడి కుంభవృష్టి కురిపించాడు.

సూర్యుడు మేరు పర్వతం చుట్టూ తిరుగుతూ తన చుట్టూ తిరగడం లేదని వింధ్యపర్వతం కోపగించి సూర్య, చంద్ర, నక్షత్రాల గమనం ఆపేసినప్పుడు అగస్త్యుడు కాశీని వదలలేక వదిలి వింధ్య పర్వతం దగ్గరకు వచ్చాడు. పర్వతరాజా! మా దంపతులం పెద్దవాళ్ళం. నీ మీద ఎక్కడం దిగడం మాకు కష్టం. మేం తిరిగి వచ్చే వరకు నువ్వు భూమికి సమానంగా ఉండు. మేమిప్పుడు దక్షిణాపథం వెడుతున్నామని చెప్పాడు. ఈ విధంగా వింధ్య పర్వతానికి సహజంగా ఉండే పెరుగుదల కూడా లేకుండా దాని గర్వాన్ని అణిగించాడు అగస్త్యుడు.

తర్వాత అగస్త్యుడు భార్యతో కలసి యాత్రలు చేస్తూ గోదావరీ తీరంలో ఉన్న పంపాసరోవరం, దండకారణ్యం, గోదావరీ తీరం, కోటిపల్లి, పలివెల, భీమేశ్వరం,

ద్రాక్షారామం, వీరభద్రశిఖరం మొదలయినవి చూసి కొల్లాపురం చేరి అక్కడ లక్ష్మీదేవికి స్తోత్రం చేశాడు. లక్ష్మీదేవి అగస్త్యుణ్ణి ద్వాపర యుగంలో వేదవ్యాసుడవై పుట్టి వారణాశిలో ఉంటావని దీవిస్తుంది.

లోపాముద్ర అగస్త్య మహర్షిని ఏఏ తీర్థాలు ముక్తినిస్తాయని అడిగింది. బాహ్య తీర్థాలకంటే మానస తీర్థాలే ముక్తినిస్తాయి. ఎందుకంటే బాహ్య తీర్థాలలో ఎప్పుడు ఉండే కప్పలు, తాబేళ్ళు, చేపలు, మొసళ్ళు లాంటివి అన్నీ మోక్షం పొందాలి కదా! అలా జరగట్లేదేం ? మానసికంగా పవిత్రంగా వున్నప్పుడే తీర్థాలలో మునిగిన ఫలితం కూడ ఉంటుంది అన్నాడు అగస్త్యుడు.

అగస్త్యుడు శ్రీశైలం వెళ్ళినప్పుడు ఆయనకు కుమారస్వామి దర్శనం ఇచ్చి కాశీమహత్యం గురించి తెలియచేశాడు. శిష్య సమేతుడైన వ్యాస మహర్షి కూడా కనిపించాడు. మహర్షులిద్దరు కుశలప్రశ్నలు వేసుకున్నారు. వ్యాసుడు తాను కాశీ వదిలి అన్నపూర్ణాదేవి ఆజ్ఞతో ఈ దక్షిణకాశికి వచ్చిన కారణం చెప్పాడు. అగస్త్యుడు తన తపోమహిమతో వ్యాసుడికి ద్వాదశ క్షేత్రాల గురించి చెప్పి పంచతీర్థాలలో స్నానం చేయించి తన ఆశ్రమానికి వెళ్ళిపోయాడు.

పరశురాముడు అగస్త్యుడు ఇచ్చిన కృష్ణకవచాన్ని ధరించే ఇరవై ఒక్కసార్లు రాజుల్ని చంపగలిగాడు. అందుకు అగస్త్యుడి ప్రోత్సాహ ప్రోద్బలాలు కూడా ఉన్నాయన్నమాట!

ఒకప్పుడు ఇంద్రద్యుమ్నుడు విష్ణుమూర్తిని ధ్యానిస్తూ అగస్త్యుడు రావడం చూడలేదు. అగస్త్యుడికి కోపం వచ్చి ఏనుగువై పుట్టమని శపించాడు. శ్రీమద్భాగవతంలో గజేంద్రమోక్షంలో ఉన్న గజేంద్రుడే ఈ ఇంద్రద్యుమ్నుడు.

కుబేరుడు కుశపతి చేస్తున్న సత్రయాగానికి రాక్షస బలాలతో విమానంలో వెడుతూ కుబేరుడి స్నేహితుడు మణిమంతుడు క్రిందకి ఉమ్మేశాడు. అది తపస్సులో ఉన్న అగస్త్యుడి మీద పడింది. అతణ్ణి అతని బలగాలని ఒకే మనిషి చేతిలో చనిపోయేట్లుగా అగస్త్యుడు శపించాడు. అదేవిధంగా వాళ్ళందరూ భీముడి చేతిలో చచ్చిపోయారు.

కొంతకాలం అగస్త్యుడు పుష్కర తీర్థంలో కుమారస్వామిని పూజచేసి అందిలావృతవర్షంలో ఉండగా నారాయణుడు అగస్త్యుడికి కనిపించి నీకు ఎప్పుడు ఏలోటూ ఉండదని చెప్పి వెళ్ళిపోయాడు.

అగస్త్యుడు రాసిన గ్రంథాలు 'అగస్త్యగీత' 'అగస్త్యసంహిత'.

అగస్త్య మహర్షి ఎప్పుడూ లోకం కోసమే పాటుపడ్డాడు. ఎంతో మందికి విద్యాదానం చేశాడు. ఎంత చెప్పినా అయిపోని గొప్పతనం ఆయనది. ఇప్పటికీ అగస్త్య మహర్షి భాద్రపద మాసంలో భూలోకంలో నక్షత్ర రూపంలో కనిపిస్తాడు. నక్షత్ర దర్శనం అవగానే బ్రాహ్మణులు అగస్త్యుడి బొమ్మ చేసి పూజ చేసి రాత్రి జాగారం చేస్తారు. అలా చేస్తే అగస్త్యలోపాముద్రల అనుగ్రహం వుంటుందని వారి నమ్మకం.

ఇదర్రా ! అగస్త్య మహర్షి దివ్య చరిత్ర. ముందే చెప్పానుగా ! అగస్త్యుడు మహర్షులందరిలోకి గొప్పవాడని. చదివారా ! ఎంత చెప్పినా ఇంకా మిగిలిపోతుంది. ఎప్పుడూఎవరికో ఒకళ్ళకి సహాయపడ్తూ, ముక్తి పొందడానికి ఉపదేశాలు చేస్తూ, ఇప్పటికీ మనకి కూడా ఉపయోగపడేలా విష్ణుపూజా విధానం, ఆదిత్యహృదయం మొదలయినవి చెప్పిన గొప్ప మహర్షి. మనం చూసి ఉంటే తరించేవాళ్ళం. అదెలాగాలేదు కాబట్టి కనీసం ఆయన గురించి చదువుదాం.

కొంచెం ఫలితమైనా ఉండదా...? తప్పకుండా వుంటుంది!

# 2. అత్రి మహర్షి

**అ**త్రి మహర్షి ఎవరో తెలుసా ? మనం సప్తమహర్షులు అనేమాట వింటూంటాం కదా... వాళ్ళల్లో ఈయన ఒకడన్నమాట.

అత్రి మహర్షి బ్రహ్మదేవుడి మనస్సులోంచి పుట్టాడు. అంటే బ్రహ్మమానస పుత్రుడన్నమాట. అలా పుట్టిన అత్రి మహర్షిని బ్రహ్మదేవుఁడు "లోక రక్షణ కోసం నేను కొంతమందిని సృష్టిస్తున్నాను, నువ్వు గొప్ప తపశ్శక్తిని పొంది నాకు ఈ సృష్టికార్యంలో సాయపడాలి" అని అడిగాడు.

అందుకు అత్రి మహర్షి సరే ! అలాగే సాయపడతానని చెప్పి ఒక మంచి అనుకూలమయిన ప్రదేశాన్ని చూసుకుని తపస్సు ప్రారంభించాడు.

ఈ మహర్షి చేసిన ఘోరతపస్సుకి ఆయన కళ్ళల్లోంచి ఒక గొప్ప తేజస్సు బయటికి వచ్చి భూమి, ఆకాశం అన్ని దిక్కులా వ్యాపించి పోయింది. ఆ తేజస్సుని భూమ్యాకాశాలు కూడా భరించలేక పోవడం వల్ల అది సముద్రంలో పడిపోయింది.

ఇది బ్రహ్మదేవుడికి తెలిసి ఆయన ఆ తేజస్సుని అత్రిమహర్షికి పెళ్ళయ్యాక తేజస్సు యొక్క కొంత అంశతో చంద్రుడు కుమారుడుగా పుడతాడని, క్షీరసాగర మథన సమయంలో మిగిలిన అంశ వచ్చి చంద్రుడిని కలుస్తుందని చెప్పి వెళ్ళిపోయాడు.

కొంతకాలం తర్వాత, అత్రి మహర్షికి దేవహూతి కర్దముడు అనే దంపతులకు పుట్టిన తొమ్మిదిమంది కూతుళ్లలో ఒక కూతురయిన అనసూయతో పెళ్ళి జరిగింది. పెళ్ళి చేసుకున్న అత్రి మహర్షి అనసూయాదేవితో కలిసి జీవిస్తున్నాడు. అనసూయాదేవి గొప్ప పతివ్రతగా వినుతికెక్కింది.

ఒకనాడు బ్రహ్మ విష్ణు మహేశ్వరులు ముగ్గురు అనసూయాదేవిని పరీక్షిద్దామని బయలుదేరి అత్రిమహర్షి ఆశ్రమానికి వచ్చారు. అత్రి మహర్షి అనసూయాదేవి వారికి ఆతిథ్యం ఏర్పాట్లు చేస్తున్నారు. అప్పుడు త్రిమూర్తులు మహర్షితో మాకు వడ్డించే స్త్రీ నగ్నంగా వడ్డించాలి

అన్నారు. అనసూయాదేవి అంగీకారంతో అత్రిమహర్షి మీ కోరిక ప్రకారమే అన్నాడు.

త్రిమూర్తులు స్నానం చేసి కూర్చున్నాక అనసూయ వారిమీద మంత్రజలం చల్లి, చంటిపిల్లల్లా చేసి నగ్నంగా వడ్డించింది. మళ్ళీ దుస్తులు ధరించి వాళ్ళ ముగ్గుర్ని మంత్రజలంతో మామూలుగా చేసి తినండి అంది. భోజనం తర్వాత మళ్ళీ చంటిపిల్లల్ని చేసి ఉయ్యాలలో వేసింది.

త్రిమూర్తుల్ని వెతుక్కుంటూ సరస్వతి, లక్ష్మి, పార్వతి వచ్చి అనసూయ దగ్గర చంటిపిల్లల్ని చూసి మా భర్తల్ని మాకియ్యమని అడిగి అత్రి అనసూయలను మా ముగ్గురి అంశలతో ముగ్గురు పిల్లలు కలుగుతారని దీవించి తమ భర్తల్ని తీసుకుని వెళ్ళిపోయారు.

ఒకసారి కౌశికుడి భార్య, సూర్యుడు ఉదయించగానే తన భర్త చనిపోతాడని తెలిసి సూర్యుడు ఉదయించకుండా చేసింది. అనసూయాదేవి సూర్యుడు ఉదయించేటట్లు చేసి కౌశికుణ్ణి కూడా బ్రతికించింది.

అత్రి మహర్షికి పిల్లలు లేరని వంద సంవత్సరాలు భార్యతో కలిసి తపస్సు చేశాడు. అప్పుడు త్రిమూర్తులు ప్రత్యక్షమై పిల్లలు కలిగేలా వాళ్ళని ఆశీర్వదించారు.

కొన్నాళ్ళయ్యాక అత్రి మహర్షి కంట్లోంచి చంద్రుడు, అనసూయాదేవికి దత్తాత్రేయుడు, దుర్వాసుడు అనే పేర్లతో ముగ్గురు పిల్లలు పుట్టారు.

ఒకనాడు అత్రి మహర్షి అనసూయని పిలచి మనకి మంచి ప్రవర్తన కలిగిన పిల్లలు కలిగారు కదా... నేనింక తపస్సు చేసుకోవడానికి వెళ్ళిపోదామనుకుంటున్నాను. నువ్వుకూడా నాతో వస్తావా ? పిల్లల దగ్గరుంటావా? అని అడిగాడు.

అప్పుడు అనసూయ స్వామీ ! మీకంటే నాకు పిల్లలు ఎక్కువ కాదు. కానీ, పిల్లలు బాగా చిన్నవాళ్ళు. వాళ్ళు కొంచెం పెద్ద వాళ్ళయ్యాక మనం వెడితే ధర్మంగా ఉంటుంది, ఈ లోగా పిల్లల్ని పోషించడానికి కొంచెం ధనం కావాలి కదా ! మీరు పృథు చక్రవర్తి దగ్గరకు వెళ్ళి ధనం తీసుకురండి అంది.

ఆ సమయంలో పృథుచక్రవర్తి అశ్వమేధయాగం చేస్తున్నాడు. ఆ యాగాశ్వాన్ని రక్షించడానికి తన కుమారుడితో వెళ్ళమని పృథు చక్రవర్తి అత్రి మహర్షిని అడిగాడు. అత్రి మహర్షి సరేనని బయల్దేరాడు.

పృథు చక్రవర్తి వైభవాన్ని చూడలేక ఇంద్రుడు యాగాశ్వాన్ని దాచేశాడు. అత్రి మహర్షి తన దివ్యదృష్టితో చూసి ఆ విషయం పృథు చక్రవర్తి కుమారుడికి చెప్పాడు. అతడు ఇంద్రుణ్ణి జయించి ఆ యాగాశ్వాన్ని తీసుకుని వచ్చాడు.

అశ్వమేధయాగం పూర్తయ్యాక పృథు చక్రవర్తి ఇచ్చిన ధనం, వస్తువులు మొదలయిన వాటిని తీసుకువెళ్ళి పిల్లలకిచ్చి అత్రి మహర్షి అనసూయా దేవితో కలిసి తపస్సు చేసుకుందుకు వెళ్ళిపోయాడు.

ఒప్పుడు దేవతలకి రాక్షసులకి యుద్ధం జరిగింది. అందులో రాహువు వేసిన అస్త్రాలకి సూర్యచంద్రుల్లో వెలుగు తగ్గిపోయి లోకమంతా చీకటయిపోయింది. అప్పుడు

అత్రి మహర్షి తన చూపుల్తోనే రాక్షసులందర్ని చంపేశాడు.

ఎంతోమంది ఋషులు అత్రిమహర్షి నడిగి పూజావిధానం అభిషేకం, దేవతాప్రతిష్ఠ, ఉత్సవాలు, దోషాలకు ప్రాయశ్చిత్తాలు మొదలయిన వాటి గురించి తెలుసుకుంటూ ఉండే వాళ్ళు.

అత్రి మహర్షి రచించిన ఆత్రేయ ధర్మశాస్త్రంలో దాన ధర్మాలు, జపతపాలు రహస్య పాయశ్చిత్తాలు మొదలయిన వాటి గురించి తెలియచేయబడ్డాయి. అలాగే అత్రి సంహితలు అనే గ్రంథాల్లో ఆచారాలు, గురుప్రశంస, చాతుర్వర్ణ ధర్మాలు, జపమాలాపవిత్రత, పుత్రులు దత్తపుత్రులు మొదలయినవాటి గురించి తెలియచేయబడ్డాయి.

దత్తపుత్రుణ్ణి స్వీకరించవచ్చు అనే దాన్ని గురించి మొట్టమొదట ప్రవేశపెట్టింది అత్రిమహర్షే.....!

అత్రి మహర్షి గురించి చాలా విషయాలు మనకి తెలిసినట్టే కదా !

అత్రి మహర్షి గురించే కాదు ఆయన భార్య అనసూయాదేవి గురించి కూడా తెలుసుకున్నాం.

చదివారు కదా ! సప్తమహర్షుల్లో ఒకడయిన అత్రి మహర్షి గురించి. మనం కూడ అంతగొప్పవాళ్ళం అవ్వాలన్నమాట. పెద్ద కష్టమేం కాదనుకుంటా....!

# 3. అరణ్యక మహర్షి

ఇప్పుడు మనం తెలుసుకుంటున్నది ఎవరి గురించో తెలుసా ! అరణ్యక మహర్షి. అరణ్యం అంటే అర్థం మీకు తెలుసుకదా... అరణ్యం అంటే దట్టమయిన అడవి అని.

అరణ్యక మహర్షి పుట్టింది అడవిలోనే, పెరిగింది అడవిలోనే, తపస్సు చేసిందీ అడవిలోనే. ఆయనకి అడవి తప్ప వేరే ప్రదేశాలు ఏమీ తెలియవు. అందుకనే ఆయనకి అరణ్యక మహర్షి అని పేరు వచ్చింది.

ఈ మహర్షి ఆశ్రమం రేవానదీ ఒడ్డున ఉండేది. చాలా ప్రశాంతంగా ఉండేది. పెద్దపెద్ద జంతువులు కూడ అక్కడ కలిసి మెలిసి ఉండేవి. ఆయన ఎప్పుడూ రామనామం చేస్తూ ఉండేవాడు.

ఆయన రామనామ జపం ఎప్పుడూ చెయ్యడం వల్ల ఆశ్రమంలో ఎప్పుడూ రామనామం వినపడుతూ ఉండేది. అది ఎలా వినపడ్తుందీ ? అని మీ సందేహం కదూ... నేను చెప్తాను కదా....!

పండిపోయిన ఆకులు రాలి పడుతున్నప్పుడు, ఎండిపోయిన పుల్లలు విరిగి కింద పడుతున్నప్పుడు, చీమలు పాకుతున్నప్పుడు, గాలి వేసినప్పుడు, చెట్లు ఊగుతున్నప్పుడు

ఏం జరుగుతున్నా రామనామమే వినిపించేది.

అంటే అరణ్యక మహర్షికి రామ మంత్రం, రామ ధ్యానం, రామ స్మరణం, రామ పూజనం, రామ చింతనం, రామ మననం, మొత్తం రామ మయంగా ఉండేవాడు.

ఒకసారి శత్రుఘ్నుడు ఆయన ఆశ్రమానికి వచ్చి నమస్కరించి, ఆయన రామ భక్తి చూసి స్వామీ ! నేను ఎప్పుడు రాముడితోనే ఉంటాను, అయినా నాకంటే మీకే ఎక్కువ రామ భక్తి ఎలా వచ్చింది? అని అడిగాడు.

అరణ్యక మహర్షి శత్రుఘ్నుడికి ఏం చెప్పాడో చదవండి మరి.... నేను ఎప్పుడు ఈ అడవి వదిలి ఎక్కడికీ వెళ్లలేదు. అయినా నాకు చిన్నప్పటి నుంచి జ్ఞానం సంపాదించాలని కోరిక ఉంది. కాని నాకు గురువు లేడు కదా... ఇలా అనుకుంటూ ఉండగా లోమశ మహర్షి వచ్చి నీకు గొప్ప మంత్రం, సంసార సాగరం నుంచి బయట పడేసేది చెప్తాను అని మంత్రం ఉపదేశించాడు.

ఆ మంత్రం ఏమిటో మీకు తెలుసా... 'రామనామం'. 'రామ' అనే రెండు అక్షరాల్ని ఎప్పుడూ మనస్సులో జపిస్తూ వుంటే వేరే వ్రతాలు, పూజలు, యాగాలు, దానాలు, మౌనవ్రతాలు ఇలాంటివి ఏమీ అక్కర్లేదు. అందుకని 'రామ'నామం జపించుకో అని చెప్పాడు.

తర్వాత అరణ్యక మహర్షి లోమశ మహర్షిని అడిగి రామకథ అంతా తెలుసుకుని ఆయన రూపురేఖలు ఎలా ఉంటాయో తెలుసుకుని రామ నామం చేసుకుంటున్నాడు.

ఇదంతా విన్నాక శత్రుఘ్నుడు అరణ్యక మహర్షికి సాష్టాంగనమస్కారం చేసి ఆయన్ని అయోధ్యకి పంపించాడు. ఆ సమయంలో శ్రీరాముడు అశ్వమేధయాగం చేస్తున్నాడు.

అరణ్యక మహర్షి సరయూనది ఒడ్డున యజ్ఞదీక్షలో ఉన్న రాముడ్ని చూసి ఆనందంతో కళ్లనుంచి జలజల నీళ్ళు రాలుతుంటే భక్తితో ఆయన తన దేహాన్నే మరిచిపోయాడు.

శ్రీరాముడు అరణ్యక మహర్షిని చూసి ఎదురు వెళ్ళి మహర్షిని కౌగిలించుకుని, చేతులు పట్టుకుని తీసుకువచ్చి కూర్చోపెట్టాడు.

అరణ్యక మహర్షి శ్రీరాముడి పాదాలమీద పడి నమస్కారం చేసి స్వామీ! ఈ క్షణం కోసమే నేను ఎదురు చూస్తున్నాను. నా తపస్సు పండింది. నా జన్మధన్యమైంది. నాకు మోక్షం ప్రసాదించు అన్నాడు.

వెంటనే ఆయన కపాలం పగిలి అందులోంచి ఒక తేజస్సు శ్రీరాముడిలో కలిసిపోయింది.

చూశారా ! అరణ్యక మహర్షి 'రామ' అనే నామంతోనే భగవంతుడిలో ఎలా కలిసిపోయాడో! రామనామం అంత గొప్పదన్నమాట. దీనికి 'తారకమంత్రం' అని కూడా పేరుంది.

ఇది పిల్లలూ! అరణ్యక మహర్షి కథ!!

# 4. అర్వావసువు, పరావసువు మహర్షులు

**రం**డి పిల్లలూ! ఇప్పుడు మనం జంట ఋషుల గురించి తెలుసుకుందాం. మొదలుపెట్టండి మరి....

బ్రహ్మజ్ఞానియైన రైభ్య మహర్షి పితరుల ఋణం తీర్చుకోవడానికి గృహస్థాశ్రమం తీసుకుని వివాహం చేసుకున్నాడు. రైభ్య మహర్షికి ఇద్దరు పిల్లలు కలిగారు. వాళ్ళపేర్లు 'అర్వావసువు', 'పరావసువు'.

వాళ్ళిద్దరికి యుక్తవయస్సు రాగానే ఉపనయనం చేసి రైభ్యుడు తానే గురవయి వాళ్ళకి వేదాలు నేర్పించి వేదాధ్యాయన సంపన్నులని చేశాడు.

అర్వావసువు, పరావసువులు కూడా తండ్రి చెప్పినట్లు విని గొప్ప పండితులయ్యారు. రైభ్యుడు తన ఇద్దరు కొడుకులతో వేదం చదువుతుంటే బ్రహ్మాది దేవతలు, బృహస్పతి మొదలైన ఋషులు వచ్చి మెచ్చుకుని వీళ్ళని ఆశీర్వదించి వెళ్ళేవాళ్ళు.

అర్వావసువు, పరావసువులకి పెళ్ళిచేశాడు రైభ్యుడు. రైభ్యుడి ఆశ్రమం చాలా మనోహరంగా ఉండేది. పరావసువు భార్య ఆశ్రమంలో తిరుగుతుంటే అవక్రీతుడు అవమానించాడు. ఆమె మామగారైన రైభ్యుడికి చెప్పింది. రైభ్యుడు అవక్రీతుడ్ని చంపించాడు. భరద్వాజుడు బాధపడి దేహత్యాగం చేశాడు.

అర్వావసువు, పరావసువులు తండ్రి అనుమతి ప్రకారం బృహద్యుమ్నుడు చేస్తున్న సత్రయాగానికి ఋత్విజులుగా వున్నారు.

ఒక రాత్రివేళ పరావసువు ఇంటికి వస్తూ చీకటిలో ఒక జంతువు తన మీదపడితే కర్రవిసిరాడు. అది తగిలి అక్కడే వున్న రైభ్యుడు మరణించాడు.

అర్వావసువు తపశ్శక్తికి, వ్రతదీక్షకి మెచ్చి అగ్ని, మొదలయిన దేవతలు వరం కోరుకోమనడిగారు. అర్వావసువు తన తండ్రిని, అవక్రీతుడ్ని, భరద్వాజుడ్ని బ్రతికించమనడిగాడు. దేవతలు అర్వావసువు, పరావసువుల్ని ఆశీర్వదించి వాళ్ళు కోరినట్లే చనిపోయినవాళ్ళని బ్రతికించారు.

ఆవక్రీతుడు బ్రతకడమే కాకుండా ఈర్ష్యాసూయలు లేకుండా అర్వావసువు, పరావసువులతో కలిసిపోయాడు.

ఇదర్రా మన జంట ఋషులకథ!!

మనం మాత్రం ఈర్ష్య అసూయల్లాంటి వాటికి దూరంగా వుందాం సరేనా?

# 5. అరుణి మహర్షి

ఇప్పుడు అరుణి మహర్షి గురించి తెల్సుకుందామా...

అరుణుడు అనే ఒక ముని ఉండేవాడు. ఆయన కొడుకే మన అరుణి మహర్షి.

అరుణి మహర్షి చిన్నప్పటి నుంచే దేవికానది తీరంలో వున్న ఆశ్రమంలో తపస్సు చేసుకుంటూ ఉండేవాడు. ఆయన ఎక్కువ మౌనంలోనే వుండి గొప్ప తేజస్సుతో ఉండేవాడు.

ఒకరోజు అరుణి మహర్షి దేవికానదిలో స్నానం చేసి వస్తుంటే చేతిలో విల్లు అమ్ములు పట్టుకొని ఎర్రటి కళ్ళతో ఒక భయంకరమైన దొంగలరాజు అరుస్తూ వెంబడించి వస్తున్నాడు. అరుణి మహర్షి భయపడకుండా మౌనంగా అలాగే వెళ్ళిపోతున్నాడు. కొంత దూరం వెంట వెళ్ళాక ఆ దొంగలరాజుకి భయం వేసింది. అమ్మో ! ఈయనేదో చాలా గొప్ప మనిషిలా ఉన్నాడు. ఈయనతో పెట్టుకోకూడదు అనుకున్నాడు.

వెంటనే చేతిలో ఉన్న బాణాలు కిందపారేసి సాష్టాంగ నమస్కారం చేశాడు. అరుణి మహర్షి ఏమీ మాట్లాడలేదు. మహర్షికి సేవచేస్తూ, ఆ దొంగ ఆయనతోనే వుండిపోయాడు. మహర్షితోపాటే దొంగకూడా మౌనవ్రతుడయిపోయాడు.

ఒకనాడు మహర్షి నదిలో స్నానం చేస్తుంటే ఒక పులి ఆయన మీద పడింది. దొంగ దాన్ని కొట్టాడు. ఆ శబ్దానికి మహర్షి కళ్ళు తెరిచి 'నమో నారాయణాయ' అన్నాడు. వెంటనే పులి మనిషి రూపంలోకి వచ్చి స్వామీ ! నేను పూర్వజన్మలో ఒక రాజుని, అహంకారంతో బ్రాహ్మణోత్తములకి అవమానం చేశాను. ఆ శాపం వల్ల పులి రూపం వచ్చింది. మీవల్ల మళ్ళీ మనిషనయ్యాను అని చెప్పి వెళ్ళిపోయాడు.

అప్పుడు అరుణి మహర్షి దొంగను కూడా దొంగతనం మాని నేను చెప్పిన మంత్రాన్ని జపించుకో అని ఒక మంత్రం ఉపదేశం చేశాడు దొంగలరాజుకి. అప్పటి నుంచి ఆ బందిపోటు దొంగ గొప్ప తపస్వి అయిపోయాడు.

కొంతకాలం తర్వాత అరుణి మహర్షి చక్కటి అందమయిన గుణవంతురాలైన అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడు. వాళ్లకి శ్వేతకేతుడనే కొడుకు పుట్టాడు. గురుకులంలో వుండి విద్య నేర్చుకుంటున్నాడు శ్వేతకేతుడు.

శ్వేతకేతుడికి నా అంత పండితుడు లేడని గర్వంగా ఉండేది. ఒకనాడు తండ్రి కొడుకుని పిలిచి మందలించి నీకు బ్రహ్మజ్ఞానము, పరమాత్మ గురించి చెప్తాను వినమన్నాడు. శ్వేతకేతుడు సరేనన్నాడు.

నాయనా ! పరమాత్మ సృష్టి చెయ్యాలని అనుకుని ముందు అగ్ని, నీరు, అన్నము సృష్టించాడు. అగ్ని అంటే ఎర్రని తేజస్సు, నీరు అంటే తెలుపు. అన్నము అంటే నలుపు అని అన్నాడు.

కొడుకు అడిగాడు మరి , మనిషికీ వీటికి ఉన్న సంబంధం ఏమిటి? అని.

మనిషిలో అన్నము అనేది ఒక భాగం చెడుపదార్ధంగానూ, రెండవ భాగం మాంసంగానూ, మూడవ భాగం మనస్సు గానూ ఉంటుంది.

అలాగే నీరు మనిషిలో మూత్రము, రక్తము, ప్రాణముగా ఉంటుంది.

తేజస్సు మనిషిలో అస్థులు, మజ్జ కొవ్వు మాటగా మారుతుంది అని అరుణి మహర్షి చెప్పాడు.

మనిషి నిద్రపోయేటప్పుడు మనస్సు రకరకాలుగా తిరిగి మళ్ళీ మనిషిలో ప్రవేశిస్తుంది.

కుమారా ! మనిషి మరణకాలంలో ఇంద్రియాలు మనస్సులోనూ, మనస్సు ప్రాణంలోనూ, తేజస్సు భగవంతుడిలోనూ కలిసిపోతాయి.

అది ఎలా అంటే రకరకాల నదులు ఎత్తు పల్లాల్లో ప్రవహిస్తూ చివరికి సముద్రంలో కలిసినప్పుడు ఏ నది నీరు ఏదో తెలియనట్లే జీవులన్నీ భేదం తెలియకుండా భగవంతుడిలో కలిసిపోతాయి.

భగవంతుడిలో విశ్వం అంతా నిండి ఉంటుంది. అది ఎలా అంటావా? ఒక పెద్ద మట్టి చెట్టు కాయలు పగులకొడితే చిన్న గింజ ఉంటుంది. గింజ పగులకొడితే ఏమీ ఉండదు. కానీ, ఆ చిన్న గింజలో పెద్ద మట్టి చెట్టు ఎలా ఇమిడి ఉంటుందో, అలాగే పరమాత్మలో విశ్వం మొత్తం లీనమయి ఉంటుంది.

మరణకాలంలో మనిషిని బంధువులందరు చేరి నన్నెఱుగుదువా ? అని అడుగుతారు. జీవి భగవంతుడిలో చేరిపోతున్నప్పుడు బంధువుల్ని ఎలా గుర్తపడతాడు? మనిషికి చావు పుట్టుకలు తప్పవు. తిరిగి చేరేది భగవంతుడి దగ్గరకే కాబట్టీ, ప్రేమలు, బంధాలు ఇలాంటివి ఏమీ ఉండవు అవి ఉండకూడదు అని ఉపదేశం చేశాడు అరుణి మహర్షి.

చివరికి అరుణి మహర్షి కొడుక్కి ఏం చెప్పాడో తెలుసా ? నువ్వు పెద్దవాడివయ్యావు. జ్ఞానవంతుడివయ్యావు. ఇంక నీ బ్రతుకు నువ్వు బ్రతుకు వెళ్ళు అని.

ఇదర్రా అరుణి మహర్షి చరిత్ర!!

మనిషి చావు, పుట్టుకల గురించి చాలా వివరంగా చెప్పాడు కదూ ! అసలు పుట్టేది చావడానికే.

# 6. ఆస్తీక మహర్షి

**ఒ**క్కొక్క మహర్షి ఒక్కొక్క గొప్పతనంతో లోకాన్ని ఉద్ధరించడం కోసమే తపస్సు చేశారు. ఆస్తీక మహర్షి మనకు దేన్ని గురించి వివరంగా చెప్పారో చదవండి మరి.

పూర్వకాలంలో జరత్కారుడు అనే మహర్షి ఉండేవాడు. ఆయన ఘోటక బ్రహ్మచారి. ఆయన అన్ని తీర్థాల్లోను స్నానం చేస్తూ, అన్ని పుణ్యక్షేత్రాలు చూస్తూ తిరుగుతున్నాడు.

ఒకనాడు తలక్రిందుగ ఒక చెట్టుకొమ్మని పట్టుకుని వ్రేలాడుతున్న ఋషుల్ని చూసి, వారికి క్రింద ఉన్న లోయల్ని చూసి, ఈ స్థితిలో ఉన్న మీకు నేను ఏమైనా సాయం చెయ్యగలనా? అనడిగాడు.

నాయనా ! నువ్వు చెయ్యగల సాయం ఏమీ లేదు. మేమే బాగా తపస్సు చేసిన వాళ్ళం. ఏం కావాలన్నా మేమే చేసుకోగలం. మాకు ఒక కొడుకున్నాడు. వాడు బ్రహ్మచారి. వాడు పెళ్ళి చేసుకుని సంతానం పొందితేనే మాకు పుణ్యలోకాలకి వెళ్ళే అర్హత వస్తుంది. మా తపస్సు ఇక్కడ ఉపయోగం లేదు.

నాయనా ! నువ్వు మాకొక సహాయం చెయ్యి. మా పరిస్థితిని మా కుమారుడికి చెప్పి పుణ్యం కట్టుకో అన్నారు. అది విని స్వామీ ! మీ కుమారుడి గురించిన వివరాలు చెప్పండి అన్నాడు జరత్కారుడు.

అప్పుడు వాళ్ళు మా అబ్బాయి పేరు జరత్కారుడు. వేదవేదాంగ వేత్త. గొప్ప తపస్వి. అతడు పెళ్ళి చేసుకుని సంతానం పొందితేనే మాకు ముక్తి అన్నారు.

జరత్కారుడు చాలా బాధపడి వాళ్ళు తన తల్లిదండ్రులే అని తెలుసుకుని క్షమించమని అడిగి త్వరలో మీరు చెప్పినట్లే చేసి మీకు విముక్తి కలిగిస్తానని చెప్పాడు.

తన పేరు కలిసిన పేరు కల అమ్మాయినే పెళ్ళి చేసుకుని సంతానం కలగగానే వదిలేస్తానని తల్లిదండ్రులకి చెప్పి బయలుదేరాడు జరత్కారుడు.

ఒకసారి వినత కద్రువ అనే నాగ వనితలు పందెం వేసుకుని, ఓడిపోయిన వాళ్ళు రెండో వాళ్ళకి దాసిగా ఉండాలి అనుకున్నారు. వినత ఓడిపోయింది. కద్రువకి దాసిగా వినతని పంపించడానికి నాగపుత్రులు ఒప్పుకోలేదు. అప్పుడు కద్రువ జనమేజయ మహారాజు సర్పయాగం చేసినప్పుడు సర్పాలన్నీ చచ్చిపోవాలని శపించింది.

వాసుకి మొదలయిన వాళ్ళంతా సర్పయాగం ఆపించాలి అని ఆలోచిస్తున్నారు. వాసుకి చెల్లెలయిన జరత్కారువుకి అస్తీకుడు అనే వాడు పుట్టి సర్పయాగాన్ని ఆపగలడని బ్రహ్మ దేవతలు కలిసి మాట్లాడుకుంటుంటే విన్నాను అన్నాడు నాగుడు.

ఒకనాడు జరత్కారుడు బిక్షకోసం వచ్చినపుడు వాసుకి తన చెల్లెలు జరత్కారువును బిక్షగా ఇచ్చి నా చెల్లెల్ని నేనే పోషించుకుంటాను, పెళ్ళి చేసుకుని ఇక్కడే ఉండిపొమ్మని అడిగాడు. జరత్కారుడు ఆమెని పెళ్ళి చేసుకున్నాడు.

కొంతకాలానికి జరత్కారువు గర్భవతి అయింది. జరత్కారుడు సంతానం కలిగే వరకు ఉంటే మళ్ళీ బంధాలు ఏర్పడతాయని భార్యని పిలిచి నీకు ఇద్దరి వంశాల్ని ఉద్ధరించకలిగిన కొడుకు పుడతాడు. నేను వెళ్ళిపోతున్నాను అని చెప్పి తపస్సు చేసుకుందుకు వెళ్ళిపోయాడు. ఈ విధంగా మన అస్తీక మహర్షి పుట్టాడనమాట. ఈయన పుట్టుకకి ఎంత కథ నడిచిందో చూశారా...

అస్తీక మహర్షి చ్యవన మహర్షి కొడుకైన ప్రమతి దగ్గర వేదవేదాంగాలు నేర్చుకుని గొప్ప జ్ఞాని అయ్యాడు.

జనమేజయ మహారాజు తండ్రి పరీక్షిత్తుని పాము కరిచింది. పరీక్షిత్తు పాము కాటుకి చనిపోయాడు. జనమేజయుడు పాములన్నిటి మీద కోపం వచ్చి సర్పయాగం మొదలు పెట్టి పాములన్నిటినీ చంపడం మొదలుపెట్టాడు.

అప్పుడు అస్తీకుడు జనమేజయమహారాజు దగ్గరకి వెళ్ళి మహారాజుని, యాగానికి అక్కడికి వచ్చిన వాళ్ళందర్నీ స్తోత్రం చేశాడు. జనమేజయుడు సంతోషించి అస్తీకుడిని ఏం కావాలో కోరుకోమన్నాడు. అస్తీకుడు సర్పయాగం ఆపి నాగుల్ని రక్షించమన్నాడు.

ఈ విధంగా అస్తీక మహర్షి జరత్కారుని తల్లిదండ్రులు పుణ్యలోకాలకి వెళ్ళడానికి, నాగుల్ని రక్షించడానికి కారకుడవడమేకాకుండా. గొప్ప తపస్సంపన్నుడు అయ్యాడు.

మన అస్తీక మహర్షి నాగలోకాన్ని ఉద్ధరించాడన్నమాట.

ఇదర్రా అస్తీక మహర్షి కథ !!

# 7. అష్టావక్రమహర్షి

**పి**ల్లలూ ! ఇపుడు మనం అష్టావక్ర మహర్షిని గురించి తెలుసుకుందాం. తమాషాగా వుంది కదూ! ఈ మహర్షిపేరు. అసలు మహర్షులే మనకి తమాషాగా కనిపిస్తారు. ఏంటో ఎప్పుడు తపస్సులు చెయ్యడమే గాని ఒక టివి ఛానల్ చూడరు, ఒక కొత్త సినిమా చూడరు కదా...!!

ఇక్కడే మీరు పొటపాటు పడ్తున్నారు. ఈ అష్టావక్ర మహర్షి తల్లి కడుపులో ఉండగానే అన్ని వేదాలు, మంచి చెడు అన్నీ తెలిసేసుకున్నాడు.

ఈయన తల్లి పేరు సుజాత. తండ్రి ఏకపాదుడు అనే తపస్సంపన్నుడైన బ్రాహ్మణుడు.

అసలు అష్ట అంటే మీకు తెలుసా ? ఎనిమిది అని అర్థం. వక్రుడు అంటే తెలుసా? వంకరలు కలవాడు అని అర్థం.

ఈ ఎనిమిది వంకర్లు అష్టావక్ర మహర్షికి ఎలా వచ్చాయో తెలుసా... ఈయన తల్లి కడుపులోంచే వేదాలన్నీ వినేస్తూ ఉండేవాడు. ఒకసారి తండ్రి పిల్లలకి పాఠాలు చెప్తూ తప్పు చెప్పాడు. అష్టావక్రుడు నాన్నగారూ! మీరు తప్పు చెప్పారు అని సరిగా ఎలా చెప్పాలో చూడా చెప్పాడు. అంతే తండ్రికి కోపం వచ్చి నువ్వు ఇప్పుడే నన్ను తప్పులు పట్టుకుంటున్నావు, రేపు నువ్వు బయటకు వస్తే ఇంకా ఏమేం చేస్తావో! నువ్వు అష్టావక్రుడుగా అంటే ఎనిమిది వంకర్లతో పుట్టమని శపించాడు. అష్టావక్రుడికి ఆపేరు పాపం పుట్టకుండానే శాపం వచ్చింది. అదీ... కన్న తండ్రి నుంచి వచ్చింది.

ఒకనాడు సుజాత ఏకపాదుడిని చక్రవర్తిగారి దగ్గరికి వెళ్ళి కొంచెం ధనం తీసుకురమ్మంది. అప్పుడు ఏకపాదుడు జనక చక్రవర్తిగారి దగ్గరికి వెళ్ళాడు. నందితో వాదించి గెలిస్తే ధనం ఇస్తాను, ఓడిపోతే ఇక్కడే నీళ్లల్లో ముంచేస్తాను అన్నారు చక్రవర్తిగారు. ఏకపాదుడు ఓడిపోయి నీళ్లల్లో ఉండిపోయాడు.

ఇక్కడ మన అష్టావక్రుడు ఎనిమిది వంకర్లతో పుట్టేశాడు. అదే సమయంలో అష్టావక్రుడికి శ్వేతకేతుడు అనే పేరుతో మేనమామ పుట్టాడు. ఇద్దరు కలిసి చదువుకుంటున్నారు.

కొంతకాలం తర్వాత అష్టావక్రుడు తండ్రికి జరిగిన అవమానం తెలిసి నందితో వాదించడానికి మేనమామతో కలిసి బయలుదేరాడు. చక్రవర్తిగారు అష్టావక్రుడిని చూసి "నువ్వు చిన్నవాడివి, నందితో వాదించలేవు" అన్నారు. అందుకు అష్టావక్రుడు ముందు జనకమహారాజుతో వాదించి గెలిచి, తర్వాత నందితో వాదించి గెలిచి తండ్రిని రక్షించాడు.

అష్టావక్రుడి తండ్రి సంతోషించి వంకరలన్నీ పోయి అందంగా తయారవమని దీవించాడు. అంతే ! మన అష్టావక్ర మహర్షి గారు చాలా అందంగా మారిపోయారు. మహర్షులు కదా... ఏమయినా చెయ్యగలరు.

జనకమహారాజు గారు అష్టావక్రుడితో నువ్వు అద్వైత వేదాంత రహస్యాలన్నీ నాకు చెప్పావు. ఇది 'అష్టావక్ర సంహిత' అనే పేరుతో కావ్యంగా వస్తుందని చెప్పి అష్టావక్రుడిని సన్మానించి చిన్నవాడు కదా.. దీవించి పంపారు.

ఒకనాడు తండ్రి ఏకపాదుడు కొడుకుని పిలిచి నాయనా! సదాన్య మహర్షికి సుప్రభ అనే అమ్మాయి ఉంది. నువ్వు పెళ్ళి చేసుకో అని చెప్పాడు.

అష్టావక్రుడు సదాన్య మహర్షిని మీ అమ్మాయిని నాకిచ్చి పెళ్ళి చేయండి అని అడిగాడు. అప్పుడు సదాన్యుడు అష్టావక్రా ! నువ్వు చాలా మంచివాడివే కానీ, నా కూతుర్ని పెళ్ళి చేసుకోవాలంటే ఒక షరతు ఉంది. అది ఏమిటో చెప్తాను వినమని ఇలా చెప్పాడు.

ఉత్తర దిక్కుకి వెడితే కుబేరుడి నగరం వస్తుంది. అది దాటి హిమవత్పర్వతం మీద ఉన్న పార్వతి పరమేశ్వరులని పూజించు, మళ్ళీ ఉత్తర దిక్కు వైపే వెళ్ళు. అక్కడ పెద్ద పువ్వులతోట వస్తుంది. అందులో నగరం వుంది. దాన్ని పాలిస్తున్న రాణిగారి ఆశీర్వాదం కూడా తీసుకునిరా! నా కూతుర్నిచ్చి అపుడు పెళ్ళి చేస్తాను అన్నాడు సదాన్యుడు.

దానికి అష్టావక్రుడు సరేనని తల్లిదండ్రులకి చెప్పి బయలుదేరి వెళ్ళి సదాన్య మహర్షి చెప్పినట్లే అన్నీ చేసి వచ్చాడు. అసలే అమ్మకడుపులోంచే అన్నీ తెలుసుకున్నాడు కదా ! ఇదేం కష్టం అనిపించలేదేమో.

సదాన్య మహర్షి సుప్రభనిచ్చి పెళ్ళి చేశాడు. బ్రహ్మర్షులు ఆశీర్వదించారు. దేవతలు పూలవాన కురింపించారు.

అష్టావక్ర మహర్షి పిల్లలు కలిగిన తర్వాత తపస్సు చేసుకునేందుకు వెళ్ళిపోయాడు. రంభ మొదలయిన అప్సరసలు వచ్చి వాళ్ల నాట్యం చూపించి విష్ణుమూర్తి భార్యలుగా ఉండాలని ఉందని వరం అడిగారు అష్టావక్రుణ్ణి. మీ ఇష్టప్రకారమే జరుగుతుందని చెప్పాడు అష్టావక్రుడు.

కృష్ణావతారంలో గోపికలు లేరూ... వాళ్ళే వీళ్ళు.

సగరుడు అనే మహారాజు కొడుకులు కపిల మహర్షి శాపంతో భస్మమయిపోయారు. వారి భార్యలు విష్ణుమూర్తిని ఆరాధించి భగీరథుడు అనే కొడుకుని పొందారు. ఈ భగీరథుడు. చాలా బలహీనంగా ఉండేవాడు. భగీరథుడు బలంగా వుండేలా చేసి, గంగానదిని భూలోకానికి తీసుకురాగల శక్తిని కూడ ప్రసాదించాడు అష్టావక్రుడు.

అష్టావక్ర మహర్షి చాలా సంవత్సరాలు తపస్సుచేసి ఒకనాడు బృందావనంలో ఉన్న శ్రీకృష్ణుడిని చేరి స్తోత్రం చేసి ఆయన పాదాల దగ్గర ప్రాణాలు విడిచాడు. ఆయన దేహానికి అంత్యక్రియలు శ్రీకృష్ణపరమాత్ముడే చేశాడు. ఎంత అదృష్టవంతుడో కదూ...

అష్టావక్ర మహర్షి పూర్వజన్మ గురించి శ్రీకృష్ణుడు అక్కడ వున్న అందరికీ ఇలా చెప్పడం మొదలుపెట్టాడు.

విష్ణుమూర్తి నాభి నుంచి బ్రహ్మను సృష్టిస్తే బ్రహ్మ తన మనస్సు నుంచి కొంతమంది పిల్లల్ని పుట్టించి సృష్టి చెయ్యడానికి సాయపడమని వాళ్ళని అడిగాడు. అందులో ప్రచేతనుడికి అసితుడనే వాడు పుట్టి గొప్ప విష్ణుభక్తుడయ్యాడు.

అసితుడు పెరిగి పెద్దవాడయి పెళ్ళి చేసుకున్నాడు. కానీ అతడికి పిల్లలు కలగకపోతే ఈశ్వరుడు రాధామంత్రం జపించమన్నాడు. ఆయన జపం భగ్నం చెయ్యాలని ఇంద్రుడి మాటతో రంభ ప్రయత్నించి వీలు గాక అసితుణ్ణి శపించింది.

ఆయనే మన అష్టావక్ర మహర్షి. ఆయనచేత చెప్పబడిన 'అష్టావక్ర సంహిత'. రోజూ పారాయణ చేస్తే చాలా పుణ్యం.

సాక్షాత్తూ శ్రీమన్నారాయణుని చేత్తోనే అంత్యక్రియలు జరిపించుకున్న అష్టావక్రుడు ఎంత గొప్ప మహర్షో అర్థమయింది కదా.

చూశారా ! మన అష్టావక్ర మహర్షి వంకర్లు లేకుండా అందంగా అవడమే కాకుండా ఎంతోమందికి సహాయం చేసి అన్ని శాపాల్ని దాటుకుని చివరికి భగవంతుడైన శ్రీ మహావిష్ణువు పాదాల మీద ప్రాణాలు విడిచాడు.

ఆహా ! ఎవరికి దక్కుతుంది ఇంత అదృష్టం!

# 8. అంగిరో మహర్షి

మనం ఇప్పుడు 'అంగిరస' మహర్షి గురించి తెలుసుకుంటున్నాము. ఈ మహర్షి ఎలా పుట్టాడో తెలుసా ! బ్రహ్మదేవుడు ముఖం నుంచి. బ్రహ్మ మానసపుత్రులు అంటూంటారు మీరెప్పుడైనా విన్నారా.... అందులో మూడవవాడు ఈ అంగిరస మహర్షి.

అంగిరస మహర్షి వేదమంత్రాలు నేర్చుకుని తపస్సు చేసి గొప్ప విజ్ఞానాన్ని వివేకాన్ని పొంది గొప్ప తేజస్సుతో వెలుగుతున్నాడు.

కర్దమ, ప్రజాపతి అనే ఆయన పదివేల సంవత్సరాలు తపస్సు చేసి తొమ్మిది మంది కూతుళ్ళని పొందాడు. అందులో శ్రద్ధ అనే పేరు గల అమ్మాయిని అంగిరస మహర్షికిచ్చి పెళ్ళి చేశాడు.

బ్రహ్మదేవుడు అంగిరస మహర్షిని సృష్టి చెయ్యడంలో సాయం చెయ్యమని అడిగాడు కదా... అందుకే అంగిరస మహర్షి శ్రద్ధా దేవికి ఏడుగురు కూతుళ్ళని, ఏడుగురు కొడుకుల్ని అనుగ్రహించాడు.

వాళ్లకి మళ్ళీ పిల్లలు, ఆ పిల్లలకు మళ్లీ పిల్లలు అలా వంశం వృద్ధి పొందింది. ఆయన ఇలా ఒక వంశానికి మూలపురుషుడయ్యాడు.

ఒకసారి అగ్నిదేవుడికి కోపం వచ్చి ఎక్కడికో వెళ్ళిపోయి తపస్సు చేసుకుంటున్నాడు. మనమయితే కోపం వస్తే ఎంచక్కా సినిమాకి వెళ్ళిపోతాం కదా.. కాని ఆయన తపస్సు చేసుకుంటున్నాడు.

దేవతలు యజ్ఞాలు చేస్తుంటే అగ్నిదేవుడు లేడు కదా? ఏం చెయ్యాలి ? అని ఆలోచిస్తుంటే బ్రహ్మదేవుడు కల్పించుకొని, అంతకంటే గొప్పవాడు అంగిరసుడు వున్నాడు కదా! ఆయన్నే అగ్నిదేవుడుగా అనుకొని యజ్ఞం పూర్తిచేసుకోండి అన్నాడు.

ఇది విని నిజం అగ్నిదేవుడు అమ్మో ! నా పదవి అంగిరసుడికి ఇచ్చేస్తున్నారని కోపం అక్కడే వదిలేసి పరిగెత్తుకొని వచ్చేశాడు. అప్పటి నుంచి అంగిరసుడు రెండో అగ్నిదేవుడయ్యాడు.

శూరసేన దేశాన్ని చిత్రకేతుడు అనే రాజు పరిపాలించే వాడు. అతనికి చాలా సంపద, కోటిమంది అందమయిన భార్యలు ఉన్నారు. కానీ, అతనికి పిల్లలు లేరు. అంగిరస మహర్షిని ప్రార్థించాడు. కృతద్యుతి అనే పేరుగల భార్య యందు ఒక కొడుకు పుట్టాడు. మిగిలిన భార్యలు ఆ అబ్బాయికి విషం పెట్టి చంపేశారు. మహారాజు దుఃఖంతో మూర్ఛపోయాడు.

అంగిరస మహర్షికి ఈ విషయం తెలిసి చిత్రకేతుడి దగ్గరికి వెళ్ళి లోకంలో చావు పుట్టుకలు తప్పవు. ఇపుడు నీకు కొడుకయినా పూర్వజన్మలో వాడు ఏమిటో నీకు తెలుసా.

ప్రతీజీవుడు చస్తూనే ఉంటాడు . ఇంత బాధపడవద్దని నారద మహర్షి సాయంతో చచ్చిపోయిన కొడుకిని బతికించి చూపించి నువ్వు తెలుసేమో అడుగు అతనికి అన్నారు. చిత్రకేతుడు "నాయనా!" అని పిలుస్తే ఆ కొడుకేమో నువ్వు ఎవరో నాకు తెలియదన్నాడు.

ఈ విధంగా అంగిరసుడు, చిత్రకేతుడికి భార్య పిల్లలు, సంపదలు, భోగభాగ్యాలు ఇవన్నీ ఋణంతో కూడుకున్నవే. కానీ, భగవంతుడు మాత్రం సత్యం అని ఉపదేశం చేశాడు.

తర్వాత అంగిరస మహర్షి తీర్థయాత్రలకి బయలుదేరి ఎక్కడెక్కడ ఎన్నెన్ని పుణ్యనదులున్నాయో అన్నింటిలోను స్నానం చేసి తిరిగి ఆశ్రమానికి వచ్చాడు.

ఒకసారి గౌతమ మహర్షి అంగిరసుడిని ఇన్ని తీర్థాల్లో స్నానం చేశారు కదా... వాటి గురించి కొంచెం చెప్పండని అడిగాడు.

మనం కూడా కొన్నింటి గురించైనా తెలుసుకుంటే బాగుంటుందేమో ! పోనీ తెలుసుకుందాం. మనం కూడ ఎవరకయినా చెప్పచ్చు కదా !

చంద్రభాగ అనే తీర్థంలో వరుసగా ఏడురోజులు స్నానం చేస్తే చాలా సంపదలు, ముక్తి కలుగుతాయి.

పుష్కర తీర్థ, ప్రభాస, నైమిష, దేవిక, ఇంద్రమార్గ, స్వర్ణబిందు అనే తీర్థాల్లో స్నానం చేస్తే స్వర్గలోకం చేరుతారు.

కుశేశయ, దేవాంతము, ఇంద్రతోయ, కరతోయ, కన్యాకూపసుందరికాహ్రద, వైమానిక, విపాశ, కాళికాశ్రమం, కృత్తికాశ్రమం, దేవదారువనం, ద్రోణశర్మపదము ఇలా ఎన్నెన్నో తీర్థాలు, పుణ్యక్షేత్రాలు లెక్కలేనన్ని ఉన్నాయి.

అలాగే గంగా యమునల సంగమం, ప్రయాగ మొదలయిన వాటి గురించి కూడ అంగిరస మహర్షి గౌతముడికి చెప్పాడు.

ఒకసారి అగ్నిదేవుడు ఋషుల భార్యలని చూసి ఇష్టపడి ఒక్కొక్క రోజు ఒక్కొక్క ముని వేషం వేసుకుని ఆ భార్యతో గడపటం మొదలుపెట్టాడు. అంగిరస మహర్షికి కోపం వచ్చి ఋషుల భార్యల్ని భూలోకంలో పుట్టండి అని శపించాడు. పాపం వాళ్ళు తమ దగ్గరకు వచ్చింది భర్త అనుకున్నారే గానీ, అగ్నిదేవుడే అలా చేస్తాడని తెలియదు కదా ! భూలోకంలో బ్రాహ్మణులకు భార్యలుగా పుట్టి శ్రీకృష్ణుడి సేవ చేసుకున్నారు.

పోన్లే భగవంతుణ్ణి సేవించుకున్నారు హాయిగా కదా.....

శాపం ఇస్తే ఇచ్చాడు కానీ మంచే జరిగింది.

శౌనక మహర్షి అంగిరస మహర్షి దగ్గరకు వచ్చి బ్రహ్మవిద్యని గురించి చెప్పమన్నాడు. అప్పుడు అంగిరస మహర్షి ఇలా చెప్పాడు.

విద్యలు రెండు రకాలు. ఒకటి పరవిద్య. రెండవది అపరవిద్య. అపరవిద్య అంటే వేదాలు, శిక్ష, వ్యాకరణము, కల్పము, నిరుక్తము, జ్యోతిషము, ఛందస్సు మొదలయినవి. అపరవిద్య అంటే భగవంతుడ్ని గురించిన జ్ఞానము.

ముక్తి పొందడానికి రెండు మార్గాలూన్నాయి. ఒకటి కర్మ మార్గం. రెండవది జ్ఞానమార్గం.

యజ్ఞాలు, యాగాలు చెయ్యడం, మనస్సు మంచిగ ఉంచుకోవడం, భగవంతుడికోసం పూజలు, వ్రతాలు చెయ్యడం మొదలయినవి కర్మమార్గం.

తపస్సు చెయ్యడం గురువు ద్వారా జ్ఞానం పొందడం గురువు చెప్పన విధంగా నడుచుకొని భగవంతుణ్ణి చూడడం ఇది జ్ఞానమార్గం.

ఇవన్నీ తెలుసుకోవడానికి మీకు కొంచెం వింతగాను, కష్టం గాను అనిపిస్తున్నాయా! కొంచెం పెద్దవాళ్ళయ్యాక మీకే అర్ధమవుతాయి.

భగవంతుడు ఎక్కడయినా ఉంటాడు అని ఎందుకు చెప్తారో తెలుసా ! అంగిరస మహర్షి కూడా శౌనక మహర్షికి ఇదే చెప్పాడు. భగవంతుడు సర్వవ్యాపి అంటారు కదా. ప్రహ్లాదుడు కూడా అదే చెప్పాడు కదా.... అది ఏమిటో తెలుసుకుందాం ఏం ?

భగవంతుడికి తల అగ్ని, కళ్ళు సూర్యచంద్రులు, చెవులు దిక్కులు, మాట వేదము, ప్రాణము వాయువు, హృదయం ప్రపంచం, భూమి పాదాలు. ఇంక ఆయన లేనిదెక్కడ ? అందుకే సర్వవ్యాపి, అర్ధమయిందా ?

అంగిరస మహర్షి మహాతపశ్శాలి, మహాభక్తుడు, మహావిజ్ఞాని, బ్రహ్మనిష్టాగరిష్టుడు అని చదువుకున్నాం కదా. ఆయన 'అంగిరస్స్మృతి' అనే ధర్మశాస్త్రం కూడా రాశాడు.

దీంట్లో పరిషత్తు అంటే ఉత్తములయిన నూట ఇరవయి ఒక్కమంది వేదవిదులుండాలనీ మనిషి శాస్త్ర ప్రకారమే కర్మలు చెయ్యాలనీ, పశుపక్షి సంతతిని చంపకూడదనీ, మాంసాహారం మానాలనీ, బ్రాహ్మణుడైనా మహాదోషాలు చేస్తే క్షమించకూడదనీ, తప్పులు చేసినప్పుడు దానికి తగిన ప్రాయశ్చిత్తాలు చేసుకోవాలనీ ఇలాగే చాలా విషయాల గురించి వున్నాయి.

అంగిరస మహర్షి వంశంలో పుట్టిన వాళ్ళందరూ బ్రహ్మదేవుడి సృష్టిలో మొట్టమొదటి వాళ్లన్నమాట. అశ్వమేధయాగం చేసేటప్పుడు చదివే అధర్వణవేదాన్ని అంగిరసులు చదివేవాళ్ళు. అందుకే దానికి అంగిరోవేదం అని కూడ పేరుంది. మహారాజులకి అంగిరసులు పురోహితులుగా, బ్రహ్మవిద్యను బోధించేవారుగా కూడా ఉండేవాళ్ళు.

మీకు తెలుసా ? గౌతమ బుద్ధుడికి అంగిరసుడు అని కూడ పేరుంది.

అంగిరస మహర్షి తన తండ్రి బ్రహ్మదేవుడికి సృష్టికార్యంలో సహాయపడి గొప్ప జ్ఞానుల్ని తపస్సంపన్నుల్ని, విద్యాధికుల్ని తయారు చేశాడన్న మాట.

ఇది పిల్లలూ అంగిరస మహర్షి కథ!!

# 9. ఉతథ్య మహర్షి

బ్రహ్మదేవుడు మనస్సునుండి పుట్టిన మానసపుత్రులు అనబడే వారిలో మూడవవాడయిన అంగిరస మహర్షి కొడుకే మన ఉతథ్య మహర్షి. అంగిరసుడికి పెద్దకొడుకన్నమాట.

ఉతథ్య మహర్షి గొప్ప తపస్సంపన్నుడు. నెమ్మదయిన వాడు, తీర్థయాత్రలంటే చాలా ఇష్టమున్నవాడు. ఈయన భార్య పేరు మమత. వారికి సంతానం కలగగానే ఉతథ్యుడు తీర్థయాత్రలకి వెళ్ళిపోయాడు.

దేవతలు రాక్షసుల్ని ఓడించి వాళ్ళని కష్టాలు పెట్టడం మొదలు పెట్టారు. రాక్షసులు తమ గురువయిన శుక్రాచార్యుడికి విషయం చెప్పి రక్షించమన్నారు. శుక్రాచార్యుడు వాళ్ళ కష్టాలు తీర్చడానికి అస్త్రాలు, శస్త్రాలు తీసుకుని వస్తానని శివుణ్ణి గురించి తపస్సు చెయ్యడానికి వెళ్ళాడు.

ఆ సమయంలో బృహస్పతి శుక్రాచార్యుడి రూపం ధరించి రాక్షసులందర్నీ వశపరచుకున్నాడు. శుక్రాచార్యుడు వచ్చాక విషయం తెలుసుకుని బృహస్పతిని శపించాడు.

ఒకసారి బృహస్పతి తన అన్న ఉతథ్య మహర్షి ఇంటికి వెళ్ళాడు. వదిన మమత అతన్ని ఆదరించి భోజనం పెట్టింది. బృహస్పతి శుక్రాచార్యుడి శాపం వల్ల ధర్మం, మంచితనం మర్చిపోయి వదినగారితో అనుచితంగా ప్రవర్తించాడు. అతని వల్ల ఒక కుమారుడు కలిగాడు మమతకి. కానీ అప్పటికే ఆమె కడుపులో వున్న బిడ్డ బృహస్పతి శాపం వల్ల గుడ్డివాడయ్యాడు.

ఉతథ్య మహర్షి యాత్ర ముగించుకుని వచ్చి జరిగింది అంతా విన్నాడు. ఇదంతా శుక్రచార్యుడి వల్లనే జరిగిందని చెప్పి మమతని ఓదార్చాడు.

కొంతకాలం తర్వాత మాంధాత అనే చక్రవర్తి ఉతథ్య మహర్షికి శిష్యుడయి రాజనీతి గురించి తెలుసుకున్నాడు. దాని పేరే 'ఉతథ్యగీత'.

'ఉతథ్య గీత' రాజధర్మాన్ని బోధిస్తుంది. రాజధర్మం అంటే రాజు అనేవాడు ప్రజలతో ఎలా ఉండాలి, ధర్మాన్ని ఎలా నిలపాలి అని తెలియపరుస్తుంది. దాన్లో ఏముందో మనం కూడా తెలుసుకుందామా.....

రాజు ధర్మంగా ఉంటే ప్రజలు నిశ్చింతగా భయం లేకుండా బ్రతుకుతారు. ధర్మం వేదవిదుల వల్ల కలిగింది కాబట్టి రాజెప్పుడూ వేదవిదులను పూజించాలి.

అసూయ దురభిమానం ఉంటే ఆ రాజు దగ్గర లక్ష్మీదేవి ఉండదు. నాలుగు వర్ణాల వాళ్ళు ఎవరి ధర్మం వాళ్ళు చేస్తున్నారా లేదా అని రాజు చూడాలి. శూద్రుడికి సేవ, వైశ్యుడికి కృషి, క్షత్రియుడికి దండనీతి, బ్రాహ్మణునికి బ్రహ్మచర్యం, తపస్సు చేయడం, నిజం పలకడం ధర్మాలు.

ప్రజలు దీనంగా వేడుకుంటున్నప్పుడు కూడా రాజుదగ్గర ఉండే ఉద్యోగులు కఠినంగానూ, ధనాశతోనూ ప్రవర్తించకూడదు. ఏ రాజ్యంలో ప్రజలు ధర్మంగా ఉంటారో ఆ రాజు కీర్తి నాలుగు దిక్కులా వినపడుతుంది. తప్పు చేసినది కొడుకయినా రాజు క్షమించకూడదు.

సాధువులని పూజించడం, ఎప్పుడు నిజాన్నే మాట్లాడడం, భూదానాలు చెయ్యడం, అతిథులని గౌరవించడం లాంటివి రాజు చెయ్యాల్సిన ధర్మాలు.

ధర్మాత్ముడైన రాజు ఇంద్రుడితో సమానం. ఇలాంటి రాజుని దేవతలు, ఋషులు, గంధర్వులు కూడ కీర్తిస్తారని మాంధాతమహారాజుకి ఎన్నో రాజధర్మాల్ని గురించి ఉతథ్య మహర్షి చెప్పాడు.

అందుకే ఉతథ్య మహర్షి ధర్మోపదేశకుడు అనే పేరుతో ప్రసిద్ధి చెందాడు.

ఇది పిల్లలూ ! ఉతథ్య మహర్షి కథ !!

# 10. ఉదంక మహర్షి

**పి**ల్లలూ ! మనం ఇప్పుడు ఉదంక మహర్షిని గురించి తెలుసుకుందామా. ఉదంక మహర్షిని గురించి మనం ఏం తెల్సుకోగలమా అని ఆలోచిస్తున్నారా ? బహుశ గురువుగార్ని ఎలా గౌరవించాలి అనేమో? మనం ఎందుకు ఆలోచించి బుర్ర పాడుచేసుకోవడం. చదివేద్దాం... సరేనా !

ఉదంక మహర్షి భృగువంశంలో పుట్టాడు. గౌతమ మహర్షి దగ్గర విద్య నేర్చుకున్నాడు. ఆ కాలంలో గురువుగారికి సేవచేస్తూ విద్య నేర్చుకునేవారు. గురువుగారు శిష్యుడ్ని పిలిచి శిష్యా ! నీ చదువు అయిపోయింది. ఇంక నువ్వు వెళ్ళిపోవచ్చు అంటే చదువయిపోయినట్లే. అంతే గానీ, ఇప్పట్లా సర్టిఫికెట్లు లాంటివి ఏమీలేవు.

చాలా సంవత్సరాలు గడిచిపోయినా ఉదంక మహర్షి చదువయిపోయిందని గౌతమ మహర్షి చెప్పలేదు. ఉదంకుడు కూడ అలా సేవ చేస్తూనే ఉండిపోయాడు. ఒకసారి అడవినుంచి కట్టెల మోపు తీసికొచ్చి కిందపడేసినప్పుడు ఉదంకుడి జుట్టు దాంట్లో చిక్కుకుని కట్టె పుల్లలతో పాటు ఊడి వచ్చేసింది. ఆ ఊడిపోయిన జుట్టు తెల్లగా ఉండడం చూసి ఉదంకుడు అయ్యో ! నా బాల్యం, యౌవనం అంతా ఇక్కడే గడిచిపోయింది. నా చదువు ముసలితనం వచ్చినా పూర్తవలేదని బాధపడ్డాడు.

గౌతమ మహర్షి ఉదంకుణ్ణి పిలిచి నాయనా ! బాధపడకు నీ గురుభక్తిని పరీక్షించాను. నీ ముసలితనం పోయేలా చేస్తాను. నాకూతుర్నిచ్చి పెళ్ళి చేస్తాను అన్నాడు. మరి గురువుగారి కూతుర్ని చేసుకోకూడదు కదా అని ఆలోచించకు నీ శరీరాన్ని మార్చినట్టే ఆమె శరీరాన్ని కూడా మార్చి పెళ్ళి చేస్తానని చెప్పి తన కూతుర్నిచ్చి పెళ్ళిచేశాడు గౌతమమహర్షి.

మన ఉదంకుడు అంతటితో ఊరుకున్నాడా.... స్వామీ ! మీకు గురుదక్షిణ ఇస్తాను అన్నాడు. గౌతమ మహర్షి నీ గురుభక్తే నాకు గురుదక్షిణ. ఇంకేమీ వద్దు నాయనా ! అన్నాడు. ఉదంక మహర్షి ఊరుకోక గురువుగారి భార్యని అడిగాడు. ఆవిడ కూడ అదే చెప్పింది. కాని ఉదంకుడు ఏదో ఒకటి అడగమన్నాడు. అపుడు గురువుగారి భార్య మిత్రసహుడు అనే మహారాజు భార్యకి కుండలాలు ఉన్నాయి, అవి నాకు కావాలి అనడిగింది.

ఉదంకుడు బయలుదేరి మిత్రసహుడనే రాజు దగ్గరకి వచ్చాడు. ఆ రోజుల్లో ఆ రాజుకి ఒక శాపం ఉంది. రాక్షసుడిగా తిరుగుతూ మనిషి మాంసం తినమని. ఉదంకుడిని చూడగానే రా ! రా! వచ్చావా.. ఇప్పుడే నిన్ను తినేస్తా అన్నాడు.

ఉదంకుడు మహారాజా ! నీ భార్య కుండలాలు నాకు ఇప్పించు. అవి నా గురువుగారి భార్యకిచ్చి మళ్ళీ వస్తాను, అప్పుడు నన్ను తినెయ్యి అన్నాడు. సరే నిన్ను చూస్తే మంచివాడిలా ఉన్నావు ఇప్పిస్తానని భార్యకి చెప్పి కుండలాలు ఇప్పించాడు రాజు.

ఉదంకుడు ఆ కుండలాలు తీసుకుని, ఇవి గురువుగారి భార్యకిచ్చి వస్తాను నన్ను తింటానన్నావు కదా ! అప్పుడు తిను అన్నాడు. అన్నమాట ప్రకారం తిరిగివచ్చిన ఉదంకుని చూసి రాక్షసుడి మనసు కరిగిపోయింది. స్వామీ! “నన్ను క్షమించు” అన్నాడు. ఉదంక మహర్షి రాక్షసుడి వీపు నిమిరి పరవాలేదులే, అన్నాడు. ఉదంక మహర్షి చెయ్యి తగలగానే రాక్షసుడికి రాజు రూపం వచ్చేసింది.

మిత్రసహమహారాజు ఉదంక మహర్షిని మా ఇంట్లో భోజనం చేసి వెళ్ళండి అన్నాడు. భోజనం చేస్తుండగా అన్నంలో తలవెంట్రుకలు వచ్చాయి. ఉదంక మహర్షి రాజుని గుడ్డివాడయిపోతావని శపించాడు. రాజు తిరిగి ఉదంక మహర్షిని శపించాడు. ఉదంక మహర్షి రాజుకిచ్చిన శాపం ఉపసంహరించుకుని వెళ్ళిపోయాడు. ఏమయినా మహర్షులకి కోపం ఉండకూడదు కదా....

ఉదంక మహర్షి కుండలాల్ని ఒక పట్టుబట్టలో చుట్టుకొని తీసికెడుతున్నాడు. మధ్యలో ఆకలికి ఆగలేక ఒక చెట్టెక్కి ఆ మూటని ఒక కొమ్మ మీద పెట్టి పండ్లు కోసుకుంటున్నాడు. ఆ మూట క్రింద పడిపోయింది.

ఆ మూటని ఒక నాగరాజు తీసికుని పుట్టలోంచి పాతాళంలోకి వెళ్ళిపోయాడు. అప్పుడు ఉదంక మహర్షి ఆ పుట్టని తవ్వడం మొదలెట్టాడు. ఇది చూసి ఇంద్రుడు బ్రాహ్మణ రూపంలో వచ్చి ఉదంకా ! ఆ కుండలాలు పాతాళలోకంలో ఉన్నాయి. నువ్వు పడుతున్నది అనవసర శ్రమన్నాడు. ఉదంకుడు ఎక్కడ ఉన్నా సరే అవి నా గురువుగారి భార్యకివ్వాల్సిందే అని మళ్ళీ తవ్వడం మొదలుపెట్టాడు.

అప్పుడు ఇంద్రుడు ఉదంకుడు ఉపయోగిస్తున్న కర్రకి వజ్రాయుధానికి వున్నంత శక్తినిచ్చాడు. అలా తవ్వుతుంటే భూదేవి భయపడిపోయి పాతాళానికి దారిచ్చేసింది. పాతాళ లోకంలో కుండలాలు ఎక్కడ ఉన్నాయో తెలియక ఉదంకుడు నాగుల్ని ప్రార్థించాడు.

ఉదంకుడు నలుపు తెలుపు దారాలతో బట్టలు నేస్తున్న ఇద్దరు ఆడవాళ్ళనీ, చక్రాన్ని తిప్పుతున్న ఆరుగురు కుమారులనీ, పెద్ద గుఱ్ఱమెక్కి ఉన్న ఒక గొప్ప పురుషుణ్ణి చూసి స్తోత్రం చేశాడు. వాళ్ళు నీకేం కావాలో అడగమన్నారు.

ఉదంక మహర్షి ఈ నాగులన్నీ నాకు వశమయిపోవాలన్నాడు. అయితే నువ్వు ఈ గుఱ్ఱం చెవిలో ఊదమన్నాడు ఆ మహాపురుషుడు. ఉదంకుడు అలా చెయ్యగానే పాతాళలోకమంతా కూడ మంటలు వచ్చేశాయి. తక్షకుడు అనే పాము తక్షణమే కుండలాలు తెచ్చి ఉదంకుడకి ఇచ్చేసింది.

ఉదంకుడికి గురువుగారి భార్య ఇచ్చిన గడువు ఆ రోజుతో అయిపోతుంది. అతడు బాధపడ్తుంటే గుఱ్ఱం మీద ఉన్న ఆ దివ్య పురుషుడు ఈ గుర్రమెక్కి ఎక్కడికి వెళ్లాలో తల్చుకో అక్కడికి వెళ్ళిపోతావన్నాడు. ఉదంకుడు గుఱ్ఱం మీద కూర్చుని గౌతమ మహర్షి ఇంటికి వచ్చాడు. గురుపత్ని అహల్య కుండలాలు ధరించి పూజ పూర్తిచేసుకుని బ్రాహ్మణులకి భోజనం పెట్టింది.

ఉదంక మహర్షి గురువుగార్ని దివ్యపురుషుడు, ఆరుగురు కుమారులు, తెలుపు, నలుపు దారాలతో బట్టలు నేస్తున్న ఇద్దరు స్త్రీలు వీళ్ళందరూ ఎవరు స్వామీ? అని అడిగాడు.

గౌతమ మహర్షి నాయనా ! ఆ దివ్య పురుషుడు ఇంద్రుడు, ఆరుగురు కుమారులున్నారే వాళ్ళు ఆరు ఋతువులు, ఆడవాళ్ళని ఇద్దర్ని చూశావు కదా! అది రాత్రి పగలు, ద్వాదశ చక్రం చూశావు కదా అది పన్నెండు నెలలు అంటే ఒక సంవత్సర కాలం. ఇంద్రుడికి స్నేహితుడున్నాడే పర్జన్యుడు అతడే ఆ గఱ్ఱం. ఇవన్నీ చూడగలిగిన నువ్వు ఎంతో అదృష్టవంతుడివి. ఇంక నువ్వు ఎక్కడికి కావాలంటే అక్కడికి నీ భార్యతో కలిసి వెళ్ళమన్నాడు.

ఉదంక మహర్షి తపస్సు చేసుకోవడానికి వెళ్ళినా కూడ నాగరాజు తక్షకుడు చేసిన అవమానం మర్చిపోలేక జనమేజయ మహారాజుతో సర్పయాగం చేయించాడు. అస్తీక మహర్షి వచ్చి ఆ యాగం ఆపించి నాగుల్ని రక్షించాడు.

ఉదంక మహర్షి శివుడ్ని గురించి గొప్ప తపస్సు చేశాడు. శివుడు ప్రత్యక్షమై ఉదంకా ! నీకు ఏంకావాలో కోరుకో అన్నాడు. మన ఉదంకుడు డబ్బుకావాలి లేకపోతే మంత్రి పదవి కావాలి అని అడగలేదు. స్వామి ! నేను ఎప్పుడు ధర్మాన్ని విడవకుండా, నిజాన్నే మాట్లాడుతూ నీ మీద భక్తి కలిగి ఉండాలి అన్నాడు. శివుడు నువ్వు లోకం కోసం మంచి పనులు చేస్తూ జీవించు అని దీవించాడు ఉదంకుణ్ణి.

ఆ కాలంలో మధుకైటభులు అనే రాక్షసుల వంశంలో ధుంధుడు అనే వాడు పుట్టాడు. వాడు బ్రహ్మదేవుడి గురించి తపస్సు చేసి వరం తీసుకుని దేవతల్ని, గంధర్వుల్ని., రాక్షసుల్ని అందర్నీ చంపేస్తున్నాడు. సముద్రం దగ్గర పెద్ద గొయ్యి చేసుకుని దాంట్లో పడుకుంటూ వుండేవాడు. వాడు విడిచిన గాలి సంవత్సరానికి ఒకసారి పైకి వచ్చి పెద్దగాలి దుమారం లేపేది. అది వచ్చినప్పుడు ఏడు రోజులదాకా చెట్లు ఊగుతూనే ఉండేవి. అందరూ చాలా భయపడ్తున్నారని ఉదంక మహర్షి బృహదశ్వుడు అనే రాజుకి చెప్పి ఆ రాక్షసుణ్ణి చంపించమని అడిగాడు. బృహదశ్వుడి కొడుకు కువలాశ్వుడు తండ్రి మాట ప్రకారం ఆ రాక్షసుణ్ణి చంపేశాడు.

ఒకసారి శ్రీకృష్ణుడు హస్తినాపురం నుంచి ద్వారకానగరానికి వెడుతూ ఉదంక మహర్షి ఆశ్రమానికి వచ్చాడు. ఉదంక మహర్షి ఆయన్ని పూజించి స్వామీ! నువ్వు సంధి చెయ్యకలిగి కూడ కౌరవులకీ, పాండవులకీ యుద్ధం జరిగేలా ఎందుకు చేశావు ? అని అడిగాడు.

శ్రీకృష్ణుడు ఉదంక మహర్షితో సత్త్వ,రజ, తమోగుణాలు నావశంలో ఉంటాయి. మరుత్తులు, వసువులు అందరూ నాలోంచే పుట్టారు. ఓంకారంతో ఉన్న వేదాలు నేనే. నాలుగు ఆశ్రమాలు, అన్ని కర్మలు, అన్ని మోక్షాలు నావశంలో ఉంటాయి. మనస్సు చేసే ధర్మాలన్నింటికి కారణం నేనే. బ్రహ్మ, విష్ణువు, ఈశ్వరుడు ఈ మూడూ నేనే. లోక రక్షణకోసం అధర్మాన్ని జయించి ధర్మాన్ని కాపాడతాను. కౌరవులు అధర్మం గల పన్లే చేశారు, వాళ్ళని చంపడం కోసమే యుద్ధం జరిగేలా చేశానని చెప్పాడు.

అప్పుడు ఉదంక మహర్షి విశ్వరూపం చూపించమని అడిగి విశ్వం అంతా వ్యాపించి ఉన్న ఆయన రూపాన్ని చూసి నా జన్మ ధన్యమైందని ఆనందించాడు.

శ్రీకృష్ణుడు నీకు ఏం వరం కావాలో కోరుమన్నాడు. నేనుండే ప్రదేశంలో నీళ్ళు లేక అందరూ బాధపడుతున్నారు. నీరు ఇమ్మని అడిగాడు ఉదంకుడు.

బ్రతికినంత కాలం నువ్వు తల్చుకోగానే వర్షాలు పడతాయని వరమిచ్చాడు శ్రీకృష్ణుడు. ఆ మేఘాన్ని 'ఉదంకమేఘం' అంటారు.

ఉదంకుడు బ్రతికినంతకాలం లోకాన్ని ఉద్ధరించడానికే బ్రతికి చివరకి మోక్షం పొందాడు.

ఉదంక మహర్షి మనం గురుభక్తితో, స్వార్థం లేకుండ అందరి కోసం మంచి పన్లు చెయ్యడం ఎలాగో తెలియచెప్పాడన్నమాట.

# 11. ఉద్దాలక మహర్షి

**పి**ల్లలూ! మనమిప్పుడు ఉద్దాలక మహర్షి గురించి తెలుసుకుందాం. విశ్రాంతి కావాలా మీకు? మొదలుపెడ్దామా.... చెప్పండి! అక్కర్లేదా. అయితే మొదలుపెట్టెయ్యండి మరి...

పూర్వం మహాతపస్వి, మహాతేజస్వి, మహాస్వాధ్యాయవేత్త అయిన ఉద్దాలక మహర్షుండేవాడు. అతడు మంత్రద్రష్ట, మంత్రవేత్త, మంత్రమహితుడు. ఉద్దాలకుడి ఈ గురువు ధౌమ్యుడు.

ఉద్దాలకుడి భార్య కూడా ఆయనలాగే ధర్మకార్యాలు చేస్తూ అనుకూలంగా వుండేది. వారిద్దరికీ ఒక కూతురు కలిగింది. ఆమె పేరు సుజాత.

ఉద్దాలకుడు సుజాతని ఏకపాదుడనే తపస్వికిచ్చి పెళ్ళిచేశాడు. ఆమెకి అష్టావక్రుడనే కొడుకు కలిగాడు. కానీ, తర్కశాస్త్రానికి సంబంధించిన వాదనలో ఓడిపోయి, ఏకపాదుడు కూపశిక్షను అనుభవించసాగాడు.

అదే సమయంలో ఉద్దాలకుడికి కూడా ఒక కొడుకు కలిగాడు. అతని పేరు శ్వేతకేతుడు.

అష్టావక్రుడు, శ్వేతకేతుడు ఒకే వయస్సు వాళ్ళవడంవల్ల సుజాత దగ్గరే పెరిగారు. ఉద్దాలకుడే తండ్రి అనీ, శ్వేతకేతుడు అన్న అనీ అష్టావక్రుడనుకునేవాడు. ఉద్దాలకుడి దగ్గర సమస్త వేదశాస్త్రాలు నేర్చుకున్నారు.

ఆ పిల్లలిద్దరు ఉద్దాలకుడినే గురువుగా ధ్యానించి సర్వవేదశాస్త్రాలు నేర్చుకుని పౌర్ణమి చంద్రుడిలా వెలిగిపోయారు.

ఒకసారి అష్టావక్రుడు ఉద్దాలకుడి ఒళ్ళో కూర్చుంటే చూసి నీ తండ్రి ఒళ్ళో కూర్చో అన్నాడు శ్వేతకేతుడు.

అష్టావక్రుడి తండ్రి ఏకపాదుడెక్కడున్నాడో ఉద్దాలకుడి వల్ల విని కూపంలో ఉన్న ఏకపాదుడిని శ్వేతకేతుడు, అష్టావక్రుడు వెళ్ళి విడిపించారు.

ఉద్దాలకుడు తనకొడుకు శ్వేతకేతుడికి పెళ్ళిచెయ్యాలని నిర్ణయించుకున్నాడు. శ్వేతకేతుణ్ణి పిలిచి విషయం చెప్పాడు ఉద్దాలకుడు. తగిన అమ్మాయి దొరకగానే చేసుకుంటానన్నాడు శ్వేతకేతుడు.

ఆకాలంలో మహాతపస్వి, వేదవేత్త, శాస్త్రవిజ్ఞుడు ఆచారమతుడు, ధర్మజ్ఞుడు అయిన దేవల మహర్షికి సువర్చలనే పేరుగల కూతురుంది. సువర్చలకి అందచందాలే కాకుండా విద్య, వినయం, జ్ఞానం అన్నీ వున్నాయి.

దేవల మహర్షి సువర్చలని ఎవరికిచ్చి చెయ్యాలా అని అనుకుంటుంటే తండ్రితో మునికుమారులని పిలిపించు, నేనే ఎన్నుకుంటానంది సువర్చల.

దేవల మహర్షి ముని కుమారులని అందర్నీ పిలిపించాడు. అందులో ఆమె వేసిన ప్రశ్నలకి శ్వేతకేతుడు సరయిన సమాధానాలిచ్చాడు.

ఉద్దాలకుడు సవర్చలతో శ్వేతకేతుడి పెళ్ళి జరిపించి వాళ్ళిద్దర్ని వేరే ఆశ్రమంలోకి పంపించాడు.

ఆనాటి ఆచార ప్రకారం స్త్రీలు కూడా చాలామంది మగవాళ్ళలాగే సంతానం కోసం ఎవరితో కావాలంటే వాళ్ళతో వెళ్ళి గడుపుతూండేవాళ్ళు. ఒకనాడు ఒక ముసలి బ్రహ్మణుడు తనకు ఒక కొడుకు కావాలని ఉద్దాలకుడి భార్యని అడిగాడు. అది విన్న శ్వేతకేతుడికి కోపం వచ్చి ఆచారాన్ని నిషేధిస్తూ స్త్రీలు ఎప్పుడూ పరపురుషుడి దగ్గరకి వెళ్ళకూడదని శాసించాడు. అప్పటినించీ పాతివ్రత్యం అనేది పవిత్రమైన ధర్మంగా భావించడం మొదలయ్యింది.

ఉద్దాలకుడు తనకంటే గొప్పవాడు, సరస్వతీదేవినే చూడగలిగినవాడు అయిన కొడుకుని పొంది ఇంకా గొప్పవాడయ్యాడు.

పిల్లలవల్లేకదా మంచి పేరయినా, చెడ్డ పేరయినా నిలబడేది.

ఇదర్రా! ఉద్దాలక మహర్షి కథ!!

మనం కూడా మంచిగా వుండి మన అమ్మానాన్నల పేర్లు నిలబెడదాం! మంచిగానే సుమండీ!

# 12. ఉపమన్యు మహర్షి

**మ**నం ఇప్పుడు ఉపమన్యు మహర్షిని గురించి చదువుతూ పోదాం, ఉపమన్యు మహర్షి నుండి మనకి ఏం తెలియబోతోందో! సరేనా ? కానివ్వండి మరి...

ఉపమన్యు మహర్షి కృతయుగంలో వ్యాఘ్రపాదుడు అనే మహర్షికి పెద్దకొడుకుగా పుట్టాడు. ఉపమన్యుకు ధౌమ్యుడనే పేరుకల తమ్ముడుండేవాడు. వీళ్ళిద్దరూ వాళ్ళ అమ్మ చెప్పినట్లు విని బుద్ధిగా, ముద్దుగా ఉండేవాళ్ళు.

ఒకరోజు బంధువుల ఇంటికి వెళ్ళి పరమాన్నం తిన్నారు. తిని ఊరుకున్నారా! ఇంటికొచ్చి అలాంటి పరమాన్నం నువ్వుకూడా చేసిపెట్టు అన్నారు తల్లిని. అది మహర్షిగారి ఇల్లు కదా ! రకరకాల వంటలు ఎక్కడ ఉంటాయి. అన్ని కోరికలు తీరాలంటే ఈశ్వరుడి గురించి తపస్సు చెయ్యండి. ఆయనే మీకేం కావాలన్నా ఇవ్వగలడు అంది తల్లి.

శివుడు ఎలా ఉంటాడు ? అని ఉపమన్యు తల్లిని అడిగాడు. శివుడు ఎలా ఉంటాడో ఆవిడకి తెలిసినంతవరకు వివరంగా చెప్పింది. ఉపమన్యు తల్లికి నమస్కారం చేసి "నేను తపస్సు చేసుకుందుకు వెళ్ళిపోతున్నాను" అని వెళ్ళిపోయాడు తమ్ముడితో కలసి.

అలా వెళ్ళీ, వెళ్ళీ ఒక మంచి చోటు చూసుకుని ఎడంకాలి బొటనవ్రేలిమీద నిలబడి తపస్సు చేయడం ప్రారంభించాడు. ఒక వంద సంవత్సరాలేమో పండ్లు తిన్నాడు. ఇంకో వంద సంవత్సరాలు ఆకులు తిన్నాడు. ఇంకో వంద సంవత్సరాలు నీరు మాత్రమే త్రాగి, మిగిలిన సంవత్సరాలు గాలే భోజనం అనుకుని మొత్తం వెయ్యి సంవత్సరాలు తపస్సు చేశాడు.

ఈశ్వరుడు ఇంద్రుడి రూపంలో వచ్చి ఉపమన్యు ! నీ తపస్సుకు నేను చాలా సంతోషపడ్డాను. ఏం కావాలో కోరుకో అన్నాడు. అపుడు ఉపమన్యు నువ్వు ఈశ్వరుడు కాదు, నన్ను ఈశ్వరుడు వచ్చి ఏదైనా పురుగు అయిపో అంటే పురుగయిపోతాను, చెట్టు అయిపో అంటే చెట్టయిపోతాను, అంతేకానీ, ఇంకెవరయినా వచ్చి రాజ్యాలిచ్చినా నేను తీసికోనన్నాడు. ఈశ్వరుడు కనిపించేవరకు ఎన్నిజన్మలయినా ఇలాగే తపస్సు చేసుకుంటాను గాని, వేరే వాళ్ళు ఏమిచ్చినా తీసికోను అన్నాడు ఉపమన్యు.

ఇంద్రుడన్నాడు శివుడు, శివుడు అంటున్నావు, అతడు ఎలా ఉంటాడో చెప్పు? అని అడిగాడు. మహర్షులందరూ ఎవరినైతే సత్, అసత్, వ్యక్త, అవ్యక్త రూపం గలవాడంటారో, ఆది మధ్య అంతములేని వాడెవడో, జ్ఞానవంతుడు, అచింత్యుడు, పరమాత్మ అయినా వాడెవడో, అన్ని సంపదలూ ఎవరినుంచి వస్తున్నాయో, బీజ అబీజ సంభూతుడెవడో, లోకం ఎవరిలో లీనమయిందో వాడే ఈశ్వరుడు. ఆ సర్వేశ్వరుడు వరం ఇస్తే తీసుకుంటాను లేకపోతే లేదు. ఇంకెవరిచ్చినా నాకు వద్దన్నాడు ఉపమన్యు.

వెంటనే ఉపమన్యు మహర్షికి తెల్లని తోక, బూడిదరంగులో పర్వతమంత శరీరం, వజ్రాల్లాంటి కొమ్ములు, బంగారు నగలు ఉన్న ఐరావతం అంటే పెద్ద ఏనుగు కన్పించింది. తర్వాత ఎద్దునెక్కి తెల్లటి బట్ట ధరించి మహాతేజస్సుతో పార్వతిదేవితో కలిసి ప్రశాంతమైన ముఖంతో పరమేశ్వరుడు కన్పించాడు. శివుడు అగ్ని శిఖలాగ వెలిగిపోతున్నాడు. ఆయనకి కుడివైపు హంసవాహనం మీద బ్రహ్మ, ఎడమవైపున గరుడవాహనం మీద గద, శంఖం, చక్రంతో విష్ణుమూర్తి, నెమలి వాహనం మీద కుమారస్వామి తల్లి పార్వతి దగ్గర శక్తి ఘంటాలతో రెండవ అగ్నిలా కనిపిస్తూ, ఆయన ఎదుట నంది ఉన్నారు.

మనువులు, మహర్షులు ఇంద్రాది దేవతలు శివుడి చుట్టూ ఉన్నారు. సర్వభూత గణాలు, సర్వమాతృకలు ఆయనకు నాలుగు ప్రక్కలా ఉన్నారు. దేవతలు శివుడికి స్తోత్రం చేశారు. బ్రహ్మ, విష్ణువు ఆయన్ని వేదాల్తో కీర్తించారు. ఇంద్రుడు ఆయన్ని ఎన్నో విధాల కీర్తించాడు.

ఇవన్నీ చూసి ఉపమన్యు మహర్షికి ఆనందంతో కళ్ళ నుంచి నీరు ధారగా కారిపోతున్నాయి. ఉపమన్యు పరమేశ్వరుడి పాదాల మీద పడి ఆయన్ని ఆనందంతో స్తోత్రం చేశాడు. దాన్నే ఉపమన్యు శివస్తోత్రంగా ఇప్పటికీ మనం చదువుతూ ఉంటాం.

దేవతలు పుష్పవర్షం కురిపించారు. పరమేశ్వరుడు ఉపమన్యు మహర్షిని మూడు వరాలు కోరుకోమన్నాడు. ఉపమన్యుడు స్వామీ ! మొదటి వరం నాకు ఎప్పుడూ నీమీదే భక్తి ఉండేటట్లు , రెండవ వరం నాకు భూత, భవిష్యత్, వర్తమాన కాలాల గురించి తెలిసేట్లు, మూడవ వరం నీకు అభిషేకం చేయడానికి క్షీరం ఎప్పుడూ దొరికేటట్లు అనుగ్రహించమన్నాడు. శివుడు సరేనని చెప్పి అంతర్ధానమయ్యాడు.

ఉపమన్యు మహర్షి హిమత్పర్వతం మీద చక్కటి ఆశ్రమం ఒకటి వేసుకుని తపస్సు చేసుకుంటున్నాడు.

ఒకసారి శ్రీకృష్ణుడు పన్నెండు సంవత్సరాలు తపస్సు చేసి తన భార్య అయిన జాంబవతికి ఒక కొడుకునివ్వాలని ఉపమన్యు ఆశ్రమానికి వచ్చాడు.

ఉపమన్యు మహర్షి శివుడి గురించి శ్రీకృష్ణుడికి అన్నీ వివరంగా చెప్పి అక్కడే ఉండి తపస్సు చేసుకోమన్నాడు.

శ్రీకృష్ణుడు ఉపమన్యుడికి శిష్యుడై పన్నెండు సంవత్సరాలు తపస్సు చేసి శివుడి దర్శనం పొందాడు. ఆ సమయంలో శివుణ్ణి అర్ధనారీశ్వరుడుగా ఉపమన్యు స్తోత్రం చేశాడు.

ఈ రకంగా ఉపమన్యు పాయసం కోసం మొదలుపెట్టి పరమేశ్వరుడ్నే దర్శనం చేసుకున్నాడు. అంటే తల్చుకుంటే సాధించలేనిది ఏమీ లేదు అని అర్ధమయింది కదా...

ఇది పిల్లలూ! ఉపమన్యు మహర్షి కథ !!

# 13. ఋచీక మహర్షి

ఇపుడు ఏమహర్షి గురించి తెలుసుకుంటున్నామా అని ఆలోచిస్తున్నారా! అంత కష్టం ఎందుకమ్మా... నేనే చెప్తాను కదా!

ఆకాలంలో కృతవీర్యుడు అనే మహారాజు భృగువంశంలో బ్రాహ్మణుల్ని కులగురువులుగా పెట్టుకుని వాళ్ళకి చాలా సంపదలిచ్చాడు. ఆయన పిల్లలకి ఈ కారణంగా భృగువంశంలో బ్రాహ్మణుల మీద ఈర్ష్య వుండేది. అందుకని భృగువుల్ని చాలా కష్టాలు పెట్టడం మొదలు పెట్టారు. ఆడవాళ్లని కూడా తరిమి తరిమి కొట్టారు.

అప్రవాన మహర్షి భార్య ఋచి గర్భవతి. ఆమె ప్రాణభయంతో పారిపోతూ వున్న సమయంలోనే ఒక గొప్ప తేజస్సునిండిన కొడుకును ప్రసవించింది. ఆ తేజస్సుకి రాజకుమారులకి కళ్లుపోయాయి. వాళ్ళ మీద దయతో వాళ్లకి కళ్ళు వచ్చేలా చెయ్యమని కొడుకుకి చెప్పింది ఋచి. రాజకుమారులు క్షమించమని అడిగి వెళ్ళిపోయారు. ఆ కొడుకు పేరు ఔర్వుడు.

ఔర్వుడు పెళ్ళి చేసుకోకుండా తన తపశ్శక్తితో ఒక కొడుకుని, ఒక కూతుర్ని పొందాడు. ఆ కొడుకే మన ఋచీక మహర్షి.....!

ఋచీక మహర్షి బ్రహ్మచారిగా ఉండి గొప్ప తపశ్శక్తిని సంపాదించాడు. ఒకనాడు గాధి అనే రాజు కూతురు సత్యవతిని పెళ్ళి చేసుకునేందుకు నిశ్చయించుకొని గాధి రాజు దగ్గరికి వెళ్ళి తన కోరిక చెప్పాడు.

పాపం గాధిరాజుగారికి ఋచీక మహర్షికి తన కూతురు సత్యవతినిచ్చి పెళ్ళి చేయ్యాలంటే బాధగా అనిపించింది. కాని ఏం చేస్తాడు? మహర్షే అడగడానికి వచ్చాడంటే అదేదో భగవంతుడే సంకల్పించి వుంటాడనుకుని ఎందుకయినా మంచిదని ఒక షరతు పెట్టాడు.

మహర్షీ ! నువ్వు వాయువేగంతో సమానమైన వేగం వున్నవీ, నల్లని చెవులు, తెల్లని శరీరాలు వున్న వెయ్యి గుర్రాలు తీసుకురా. అప్పుడు నా కూతుర్నిచ్చి పెళ్లి చేస్తానని చెప్పాడు. ఋషీక మహర్షి సరేనని వెళ్ళిపోయాడు.

ఋచీక మహర్షి ఇలాంటి గుఱ్ఱాలు ఎక్కడ ఉంటాయో తెలియక తిరిగి, తిరిగి, అవి వరుణదేవుడి దగ్గర ఉన్నాయని తెలుసుకున్నాడు. వెంటనే తన తపశ్శక్తితో వరుణలోకానికి వెళ్ళి వరుణుడికి వచ్చిన విషయం చెప్పాడు. వరుణదేవుడు ఋచీక మహర్షికి నమస్కారం చేసి, కబురు చేస్తే నేనే పంపించేవాడిని కదా ! అని చెప్పి 'తురంగతీర్థం'లో స్నానం చేయించి వెయ్యి గుఱ్ఱాలు ఇచ్చి పంపాడు.

వెయ్యి గుఱ్ఱాల్ని తీసుకుని గాధి మహారాజుకిచ్చి అతని కూతురు సత్యవతిని పెళ్ళి చేసుకున్నాడు ఋచీక మహర్షి.

ఋచీక మహర్షి భార్యను తీసుకుని ఒక ఆశ్రమంలో ఉంటూ సంతానం కలగడానికి వేదమంత్రాలతో అగ్ని దేవుడికి ఆహుతి చెయ్యడానికి తయారు చేసిన అన్నం ఋచీక మహర్షి తన భార్యల చేత తినిపించాలనుకున్నాడు.

"స్వామీ! నా తల్లికి కూడ ఒక కొడుకుని ప్రసాదించండి అంది సత్యవతి. ఈ అన్నం మేమిద్దరం తింటాము అని చెప్పింది. ఋచీక మహర్షి ఇద్దరికి విడిగా పెట్టి పండ్లు మొదలయినవి తెచ్చుకోడానికి అడవికి వెళ్ళాడు.

అప్పుడు సత్యవతి తల్లి సత్యవతితో అంటుంది, అమ్మా ! నీ మొగుడు నీకే మంచి అబ్బాయి పుట్టాలని నీకు ఇచ్చిన అన్నం మీద పవిత్రమయిన మంత్రజలం చల్లాడు. నా అన్నం మీద మామూలు మంత్రజలం చల్లాడు. అందుకే మనం ఇద్దరం మార్చుకుందాం అని అన్నం మార్చుకుని తినేశారు.

ఋచీక మహర్షి ఇంటికి వచ్చి జరిగింది తెలుసుకుని భార్యని పిలిచి మంత్రజలం చల్లిన అన్నాన్ని, నేను చెప్పినట్లు కాకుండ మార్చుకుని తిన్నారు. నీకు క్షత్రియ ధర్మాలున్న కొడుకు, నీ తల్లికి వేదాంతవేది, మహాతపస్సంపన్నుడు అయిన కొడుకు పుడతారు అన్నాడు.

సత్యవతి భయపడి క్షమించమని భర్తని వేడుకుంది. ఋచీక మహర్షి జరగవల్సింది జరిగిపోయింది. ఇది దైవ నిర్ణయం ఇంక చెయ్యగలిగింది ఏమీ లేదు అన్నాడు.

కొంతకాలానికి సత్యవతికి జమదగ్ని అనే కొడుకు, ఆమె తల్లికి విశ్వామిత్రుడు అనే కొడుకు పుట్టారు. ఋచీక మహర్షి సంసారం వదిలి పెట్టేసి భగవంతుడిలో చేరిపోవడానికి బయలుదేరాడు. వెడుతూ వెడుతూ సత్యవతికి శాశ్వతంగా నదీరూపంలో ఉండేలా వరం ఇచ్చాడు. ఆ నదే కౌశికీ నది. గొప్ప పుణ్య తీర్థంగా పేరు పొందింది.

చదివేశారా... ఋచీక మహర్షి గురించి! పెద్దవాళ్ళు చెప్పినట్టు చెయ్యకపోతే ఎన్ని అనర్థాలు జరిగిపోతాయో చదివారు కదా !

అందుకే చక్కగా పెద్దవాళ్ళు చెప్పినట్లు వినాలన్న మాట. వింటారుగా మరి! మీరు మంచి పిల్లలు వింటార్లెండి.

ఇదర్రా! ఋచీక మహర్షి కథ !!

# 14. ఋభు మహర్షి

**మ**నం ఋభువు అనే పేరు గల మహర్షి గురించి తెలుసుకుందాం. పేరు రాయడానకి చదవడానికి కూడ కొంచెం కష్టంగా ఉంది కదూ... ఈయన పేరులాగే చెప్పినవి తెలుసుకోవడం కూడా కష్టమేమో! ఆలోచనెందుకు, చదవడం మొదలుపెడదాం.... చదవండి మరి !

ఋభు మహర్షి బ్రహ్మకి ఇష్టమయిన పుత్రులంటారే వాళ్ళల్లో ఒకడు. అంటే బ్రహ్మ మానసపుత్రుడన్నమాట. ఈయనకి పూర్వజన్మ జ్ఞానం ఉంది. అసలు ఋభు మహర్షి ముందు జన్మలో వత్సుడు అనే పేరుతో గొప్ప తపస్సు చేసి విష్ణుమూర్తి నుండి వరం తీసుకున్నాడు. అదేంటో తెలుసా? వచ్చే జన్మలో నేను ఋభువు అనే పేరుతో పూర్వజన్మ జ్ఞానం, గొప్ప తత్త్వజ్ఞానం కలిగి మోక్షం పొందాలని, వత్సమహర్షి ఆ జన్మ అయిపోయాక ఋభువు అనే పేరుతో మళ్ళీ పుట్టాడు.

భగవంతుడు వరాహావతారం ఎత్తినపుడు ఋభువు ఆయనకి శిష్యుడుగా ఉండేవాడు. చాలా సంవత్సరాలు తపస్సు చేసినవాడు మంచి నిష్ఠ కలిగిన వాడు అయిన ఋభు మహర్షి దగ్గరికి పులస్త్య మహర్షికి కొడుకయిన నిదాఘుడు అనే మహర్షి వచ్చి శిష్యుడిగా చేర్చుకోమన్నాడు. గొప్ప తపశ్శక్తితో సంపాదించిన జ్ఞానాన్ని ఉపదేశించడానికి తగిన శిష్యుడు దొరికాడని అనుకుని ఋభువు సరేనన్నాడు.

నిధాఘుడు గురువయిన ఋభువు నుండి అన్ని శాస్త్రాల జ్ఞానాన్ని నేర్చుకున్నాడు. ఒక్క అద్వైతాన్ని గురించి మాత్రం నేర్పలేదు ఋభువు. ఒకనాడు ఋభు మహర్షి శిష్యుణ్ణి పిలిచి నీ చదువు అయిపోయింది వెళ్ళి పెళ్ళి చేసుకుని హాయిగా ఉండు అన్నాడు.

నిదాఘుడు పెళ్ళి చేసుకుని యజ్ఞాలు, యాగాలు, జపాలు, తపస్సు, అతిధులకి సేవచేస్తూ, గురువుని పూజిస్తూ కాలం గుడుపుతుండగా వెయ్యి సంవత్సరాలు గడిచిపోయాయి.

ఒకరోజు ఆయన ఇంటికి ఒక మహర్షి వచ్చాడు,. నిధాఘుడు ఆయన్ని ఆదరించి మహాత్మా ! భోజనం చెయ్యండి అన్నాడు. నాకు అన్నం తినాలని లేదు. ఆరు రుచులు కలిగిన భోజనం పెట్టమన్నాడు. నిదాఘుడు భార్యకి చెప్పి వండించి భోజనంపెట్టాడు. మహర్షి భోజనం పూర్తయ్యాక నిదాఘుడు మహాత్మా! ఆకలి తీరిందా? భోజనం బాగుందా? అనడిగాడు.

ఆకలి వున్నవాడికి ఆకలి తీరిందా? లేదా? తెలుస్తుంది. నాకు ఆకలి అంటే ఏమిటో తెలియదు. భోజనము రుచిగా ఉందా? లేదా? అనేది దేహానికి సంబంధించింది. మట్టిగోడలు మళ్ళీ మట్టి రాస్తే ఎలా గట్టిపడతాయో ఈ శరీరం కూడ పంచభూతాల వల్ల పుట్టింది కాబట్టి ఆ పదార్థాలతోనే పోషింపబడుతుంది. ఏది రుచి ఏది రుచి కాదు, నువ్వు, నేను ఇల్లాంటివన్నీ విడిచిపెట్టి ముక్తికి మార్గం చూసుకో అన్నాడు.

నిదాఘుడు మహాత్మా ! మీ పేరు చెప్పలేదు అన్నాడు. ఆ మహర్షి నా పేరు ఋభుడు. నేను నీ గురువుని అనగానే నిదాఘుడు ఆయన కాళ్ళమీద పడి మిమ్మల్ని చూసి వేయి సంవత్సరాలయిపోయింది. అందుకే గుర్తించలేకపోయాను క్షమించండి అన్నాడు.

ఇంకొక వెయ్యి సంవత్సరాలు గడిచిపోయాయి. మళ్ళీ ఋభు మహర్షి. శిష్యుడు నిదాఘుడు ఉన్న నగరానికి వచ్చాడు. నిదాఘుడు అడవికి వెళ్ళి కట్టెలు, పండ్లు మొదలయినవి పట్టుకొని వస్తూ దార్లో నడవడానకి వీలవక ఒకచోట కూర్చున్నాడు.

ఋభుమహర్షి నిదాఘుణ్ణి చూసి ఒంటరిగా ఇక్కడ కూర్చున్నావేమిటి ? అని అడిగాడు. శిష్యుడికి మళ్ళీ మామూలే. గురువుగార్ని గుర్తుపట్టలేదు. నడుస్తుంటే రాజబలగం అడ్డొచ్చింది, అందుకే ఆగానన్నాడు.

గురువు మళ్ళీ అడిగాడు. ఇందులో రాజెవరు? బలం ఎవరు? అని. శిష్యుడు అది కూడ తెలియదా! ఏనుగు మీద ఉన్నవాడు రాజు అన్నాడు. గురువు గారు ఊరుకోలేదు. రాజెవరు? ఏనుగెవరు ? అన్నాడు. శిష్యుడు ఓపిగ్గా పైన ఉన్నది రాజు, క్రింద ఉన్నది ఏనుగు అన్నాడు. గురువు శిష్యుణ్ని వదిలిపెట్ట దలుచుకోలేదు. పైన అంటే ఏమిటి? క్రింద అంటే ఏమిటి ? అన్నాడు. ఇంక శిష్యుడికి కోపం ఆగలేదు. ఒక్క ఉరుకు ఉరికి గురువుగారి మెడమీద కూర్చుని ఇప్పుడు నేను పైన నువ్వు క్రింద అన్నాడు. గురువుగారు ఇంకా వదలదల్చుకోలేదు శిష్యుణ్ణి. నువ్వంటే ఎవరు ? నేనంటే ఎవరు? అన్నాడు. శిష్యుడు వెంటనే క్రిందకి దూకేసి గురువుగారి పాదాలమీద పడి మహాత్మా ! వేయి సంవత్సరాలు గడిచిపోయింది కదా.. మిమ్మల్ని గుర్తించలేదు. క్షమించండి అన్నాడు.

ఋభు మహర్షి నిదాఘుడ్ని లేవదీసి నీకు బ్రహ్మవిద్య గురించి చెప్పాలని వచ్చాను. నీకేమయినా సందేహాలుంటే అడుగు. ఇంక రాను అన్నాడు. శిష్యుడు మహాత్మా ! ఈ సంసార సాగరాన్ని దాటే ఉపాయం చెప్పండి అన్నాడు.

ఆత్మ అంటే భగవంతుడే అని తెలుసుకో. సర్వకర్మల్ని చేయించేవాడు పరమాత్మ, చేసేది నువ్వు. కనుక నువ్వనేది లేదు. ఆత్మ ఒక్కటే సత్యం. ఆత్మ అంటే నేనే. భగవంతుణ్ణి కూడ నేనే. నాకు చిత్తము లేదు కాబట్టి చింత లేదు, దేహం లేదు కనుక రోగం లేదు, పాదాలు లేవు కనుక నడక లేదు, చేతులు లేవు కనుక పనులు లేవు, రోగం లేదు కనుక చావు లేదు, బుద్ధి లేదు కనుక సుఖం లేదు, శుభం లేదు అశుభం లేదు, భయం లేదు, బంధాలు లేవు, మోక్షము లేదు, ఉన్నది ఒక్కటే, అదే పరబ్రహ్మం. లోకమంతా బ్రహ్మమే కాబట్టి నాకున్న ఆలోచన కూడ అదే ఆ పరబ్రహ్మ గురించే కదా... అన్నాడు.

ఋభు మహర్షి నిదాఘుడికి ఇంకా ఇలా చెప్పాడు. మాటలతో చెప్పడం, మనస్సుతో చింతించడం, బుద్ధితో నిశ్చయించడం అన్నీ మిథ్య. శాస్త్రాల వల్ల చెప్పబడిందీ, కళ్ళతో చూస్తున్నదీ. చెవులతో వింటున్నదీ అన్నీ మిథ్యే. నాది-నీది, నాకు-నీకు, నాకోసం-నీకోసం ఇలా అనుకోవడం కూడ మిథ్యే అని చెప్పాడు.

నిదాఘుడు స్వామీ ! మీరు చెప్పిన బ్రహ్మజ్ఞానం బాగానే ఉంది. కానీ, ఈ సంసార సాగరాన్ని దాటడం ఎలాగా అని అడుగుతున్నాను చెప్పండి అని అడిగాడు.

ఋభుష మహర్షి వత్సా! ఈ శరీరం మాయచే కప్పబడింది. మేలుకొని వున్నంతవరకు ఈ శరీరం సుఖాలు కోరుతుంది. నిద్రపోయినపుడు అజ్ఞానాంధకారంలోకి వెళ్ళిపోతుంది. పూర్వజన్మ కర్మల వల్లనే మనిషి సుఖదుఃఖాలు అనుభవిస్తున్నాడు. ఆత్మే పరబ్రహ్మం. దాని వల్లనే సర్వేంద్రియాలు పంచభూతాలు పుడుతున్నాయి. ఏది పరబ్రహ్మ స్వరూపమో, ఏది సూక్ష్మాతి సూక్ష్మంగా ఉందో, ఏది నిత్యమో అదే నేను. బ్రహ్మము నేను, నాలోంచే అన్నీ పుడుతున్నాయి. నశిస్తున్నాయి. నేనే విశ్వమంతా ఉన్నాను. కళ్ళు లేకపోయినా చూడగలను, చెవులు లేకపోయినా వినగలను, నాకు పాపము లేదు, చావు లేదు, వేరే జన్మము లేదు, నాకు దేహబుద్ధి లేదు అంతా నేనే. నేనే బ్రహ్మను అని తెలుసుకున్నప్పుడు నీకు దేని గురించి చింత ?

అంతా నేనే వేరే ఏమీ లేదు. నేనే పరబ్రహ్మ అని అనుకున్నప్పుడు ఈ సంసారం కూడ పరబ్రహ్మ కదా... దాని గురించి నీకు ఆలోచన ఎందుకు ? అది కూడ వదిలేసి పరబ్రహ్మని అంటే నీ ఆత్మని గురించి తెలుసుకో. అప్పుడు నీకు ప్రపంచంలో ఏమీ లేదు అనేది తెలుస్తుంది. అప్పుడే ఈ సంసారంతో బంధం కూడ ఉండదు. నువ్వు ఎక్కడనుండయితే వచ్చావో అక్కడికి పోవడానికి దారి వెతుక్కో. దానికి మార్గం భగవన్నామం.

భగవన్నామం చేసుకుని నువ్వు ఎవరో ఎక్కడనుండి, ఎందుకు వచ్చావో తెలుసుకుని అక్కడకి వెళ్ళడానికే నీ తపస్సు ఉపయోగించుకోమని ఋభు మహర్షి నిదాఘుడుకి బ్రహ్మజ్ఞానం గురించి చెప్పాడు.

ఇది పిల్లలూ ! శిష్యుడికి గురవెంత ముఖ్యమో, గురువుకి మంచి శిష్యుడు కూడ అంతే ముఖ్యం. గురువు ఎప్పుడూ శిష్యుడికి మంచి జరగాలనే కోరుకుంటాడు.

చూశారా ! గురువుగారు ఎన్ని వేల సంవత్సరాలయినా తన శిష్యుణ్ణి ఎలా కాపాడుకుంటూ, జ్ఞానం, మోక్షం కలిగేలా బోధిస్తూ ఉన్నాడో! అదేనర్రా! గురశిష్య సంబంధం, తండ్రికి కొడుక్కి, భగవంతుడికి భక్తుడికి మధ్య ఉండే సంబంధం కన్న కూడా పవిత్రయిందన్నమాట!

ఇదర్రా! ఋభు మహర్షి కథ!!

# 15. ఋష్యశృంగ మహర్షి

**త**ర్వాత ఎవరి గురించీ... అని ఆలోచనలోపడ్డారా ? అంత చించకండి మరి... నేనే చెప్పేస్తున్నాగా... ఇప్పుడు మనం తెలుసుకోబోయేది ఋష్యశృంగ మహర్షి గురించి, ఈయన్ని తక్కువ అంచనా వెయ్యకండి మరి. చాలా చాలా గొప్పవాడు. నేను చెప్పడం ఎందుకు? చదివాక మీరే నాకు చెప్తారుగా....

పూర్వం కశ్యపుడు అనే పేరుగల గొప్ప మహర్షి ఉండేవాడు. ఆయన కొడుకు వింభాడకుడు, బ్రహ్మచారి. ఎప్పుడూ తపస్సు చేసుకుంటూ వుండేవాడు. ఒకనాడు ఆయన నదిలో స్నానం చేసి వచ్చాక ఆ నది నీళ్ళు తాగిన ఒక మృగానికి అంటే జంతువుకి ఒక అబ్బాయి పుట్టాడు. పుట్టింది జంతువుకే అయినా అతని రూపం మాత్రం మనిషి రూపంలోనే ఉన్నాడు.

ఆ జంతువు ఎవరో తెలుసుకందాం. ఒకసారి చిత్రరేఖ అనే అప్సరస ఇంద్రుడి సభలో నాట్యం చేస్తోంది. ఆవిడ నాట్యానికి చాలా లేళ్ళు వచ్చేశాయి. అంత చక్కటి నాట్యంట ఆవిడది. పాపం అన్ని లేళ్ళు ఒకేసారి వచ్చేసరికి చిత్రరేఖ నాట్యం చేస్తూ ఆ లేళ్ళవైపు చూసింది. ఇంద్రుడికి కోపం వచ్చి చిత్రరేఖని మృగం అయిపొమ్మని శపించాడు. పాపం చిత్రరేఖ బాధపడింది. ఎలాగూ శపించేశాను, అది తిరిగి తీసుకోవడానికి కుదరదు. నీకు మనిషి రూపంలో ఒక అబ్బాయి పుడతాడు. అప్పుడు నీకు శాపవిమోచనం అవుతుంది అన్నాడు ఇంద్రుడు.

ఆ చిత్రరేఖే ఈ మృగం అన్నమాట. మృగానికి పుట్టాడు కాబట్టి ఆ అబ్బాయికి ఒక చిన్న కొమ్ము కూడ వుంది. ఆ అబ్బాయి ఎవరోకాదు ఇప్పటి మన ఋష్యశృంగ మహర్షి.

ఋష్యశృంగుడు పుట్టాక చిత్రరేఖకి శాపవిమోచనం కలిగి మళ్ళీ ఇంద్రుడి దగ్గరికి వెళ్ళిపోయింది.

ఒకసారి విభాండకుడు ఆ అడవిలోకి వచ్చి ఋష్యశృంగుణ్ణి చూసి దివ్యదృష్టితో ఆ పిల్లవాడు తనవల్ల పుట్టినవాడేనని తెలుసుకుని తనతో తీసుకువెళ్ళి అన్ని విద్యలూ నేర్పించాడు.

ఆకాలంలో రోమపాదుడు అనే పేరుగల రాజు వంగదేశాన్ని పాలించేవాడు. అతనికి పిల్లలు లేరు. ఒకసారి తన స్నేహితుడైన దశరథమహారాజు ఇంటికి వెళ్ళాడు. దశరథుడికి శాంత అనే ఒక కూతురుంది. ఆ పిల్లని చూసి రోమపాదుడు తాను పెంచుకుంటాను ఇవ్వమని అడిగాడు. దశరథుడికి ఇంక పిల్లలు లేరు కదా ! అందుకని పెంచుకుందుకు ఇవ్వనన్నాడు.

కాని వసిష్ఠ మహర్షి త్రికాలాలు తెలిసినవాడు కావడం వల్ల దశరథుడికి నచ్చచెప్పాడు. శాంతని రోమపాదుడుకి పెంపకం ఇవ్వడం వల్ల మంచే జరుగుతుందనీ దాని వల్ల వాళ్ళిద్దరికి మగపిల్లలు పుట్టే అవకాశం ఉందనీ చెప్పాడు. చివరకి ఆరునెలలు దశరథమహారాజు ఇంట్లోనూ, ఆరునెలలు రోమపాదుని ఇంట్లోనూ శాంత పెరిగేటట్లుగా వసిష్ఠ మహర్షి ఒప్పందం కుదిర్చాడు. శాంతను తీసుకుని రోమపాదుడు వంగదేశానికి వెళ్ళిపోయాడు.

కొంతకాలం తర్వాత రోమపాదుడు పిల్లల కోసం బ్రాహ్మణులకి దాన ధర్మాలు చేయడం మొదలుపెట్టాడు.

ఒక బ్రాహ్మణుడు తాను దానం తీసుకుని మళ్ళీ తన కొడుకుని తీసుకువచ్చి అతనికి ఒక గోవునిమ్మన్నాడు. దానికి రోమపాదుడు ఈ బ్రాహ్మణులకి ఆశ ఎక్కువ ఎంత ఇచ్చినా చాలదు అని నిందించాడు. దానికి ఆ బ్రాహ్మణుడు తన కొడుక్కి ఒక్క గోవు ఇమ్మని అడిగితే మొత్తం బ్రాహ్మణజాతినే అవమానించావు కాబట్టి నీ రాజ్యంలో వర్షాలే లేకుండాపోతాయి అని శపించి తండ్రి కొడుకులిద్దరూ వెళ్ళిపోయారు.

రోమపాదుడు పశ్చాత్తాపంతో మిగిలిన బ్రహ్మణులని సంప్రదించాడు. వాళ్ళు రోమపాదుడికి ఋష్యశృంగ మహర్షి గురించి వివరించి ఆయన్ని రాజ్యంలోకి రప్పిస్తే మంచి వర్షాలు పడతాయని చెప్పారు. రోమపాదుడు కొంతమంది వేశ్యల్ని పంపి ఋష్యశృంగ మహర్షిని ఎలాగయినా రాజ్యంలోకి రప్పించమని చెప్పాడు.

అందమయిన ఆ వేశ్యలు ఋష్యశృంగుడి తండ్రి విభాండకుడు ఆశ్రమంలో లేకుండా ఉన్న సమయం చూసి ఆశ్రమంలోకి వెళ్ళారు. ఋష్యశృంగుడు వాళ్ళు కూడా ముని కుమారులనుకొని వాళ్ళకి ఆతిథ్యం ఇచ్చాడు. కొంచెం సేపు అతనితో గడిపేసి వెళ్ళిపోయారు. మర్నాడు కూడ వాళ్ళు అలాగే వచ్చి ఋష్యశృంగుడ్ని తపస్సు చేసుకునేందుకు వాళ్ళ ఊరు రమ్మని చెప్పారు.

పాపం ఋష్యశృంగుడికి ఎప్పుడూ తండ్రితో అడవిలోనే ఉండటం వల్ల మగ, ఆడ తేడా కూడ తెలియదు. తండ్రి వద్దని చెప్పినా వినకుండా వాళ్ళతో వంగదేశం వెళ్ళాడు.

ఋష్యశృంగుడు వంగదేశంలో అడుగుపెట్టగానే వానలు కురిసి చక్కగా పంటలు పండాయి. ఒకనాడు ఋష్యశృంగుడు శాంతని చూసి ఆమెని పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు.

శాంత దశరథుని కూతురని తాను పెంచుకుంటున్నానని చెప్పాడు రోమపాదుడు. దశరథుడ్ని పిలిపించి శాంత ఋష్యశృంగుల పెళ్ళి ఘనంగా జరిపించాడు.

రోమపాదుడు ఋష్యశృంగుడి ఆశీర్వాదంతో పిల్లల కోసం యాగం చేసి ఒక కొడుకుని పొందాడు. ఆనందంతో శాంతాఋష్యశృంగుల్ని భక్తితో చూసుకున్నాడు.

కొంతకాలం గడిచాక ఋష్యశృంగుడు శాంతతో కలిసి అయోధ్యకి వెళ్ళాడు. శాంత వస్తోందని అయోధ్యా నగరం అంతా చక్కగా అలంకరించారు. కౌసల్య, సుమిత్ర, కైకేయి అనే పేరు గల దశరథుని ముగ్గురు భార్యలు ఎదురువచ్చి శాంతా ఋష్యశృంగుల్ని తీసికెళ్ళారు.

ఋష్యశృంగుడు దశరథుడికి మగపిల్లలు లేరని అశ్వమేధయాగం, పుత్రకామేష్టి చేయించాడు. కులగురువయిన వసిష్ఠ మహర్షి సహాయంతో పుత్రకామేష్టి శాస్త్రోక్తంగా చేయించాడు ఋష్యశృంగుడు. ఆ అగ్నిహోత్రంలోంచి ఒక దివ్య పురుషుడు వచ్చి ఒక బంగారు పాత్రలో పాయసాన్ని ఇచ్చి దశరథుణ్ణి ఈ పాయసం నీ భార్యలకు ఇస్తే సంతానం కలుగుతుందని చెప్పాడు. పాయసాన్ని నలుగురు భార్యలకు తినిపించి శ్రీరామ భరత లక్షణ శత్రుఘ్నులనే నలుగురు కొడుకుల్ని పొందాడు దశరథుడు. పరమపవిత్రమైన యాగాన్ని పూర్తిచేయించి ఋష్యశృంగుడు భార్య శాంతను తీసుకుని తన తండ్రి విభాండకుడి ఆశ్రమానికి వెళ్ళిపోయాడు.

ఋష్యశృంగుడు ఎంత గొప్ప ఋషో తెలిసిన వాడు కనుక విభాండకుడు కొడుకు తనకు చెప్పకుండా ఆశ్రమాన్ని విడిచి వెళ్ళి పెళ్లి చేసుకున్నాడని కోపగించక ఋష్యశృంగుణ్ణి శాంతని ఆదరించాడు. తర్వాత ఋష్యశృంగుడు ద్వాదశ వార్షిక యజ్ఞం చేశాడు.

ఋష్యశృంగుడు రాసిన గ్రంథం "ఋష్యశృంగ స్మృతి" అనే పేరుతో ప్రసిద్ధికెక్కింది. దానిలో ఆచారం, శౌచం, శ్రాద్ధం, ప్రాయశ్చిత్తం మొదలయిన వాటి గురించి రాయబడి ఉంది. పూర్తిగా ఆయన రాసిన గ్రంథం ఇంకా దొరకలేదనే అంటుంటారు.

ఏమయినా ఋష్యశృంగుడు గొప్ప తపస్సంపన్నుడే కాకుండా శ్రీ మహావిష్ణువునే శ్రీరాముడుగా లోకానికి అప్పగించి రామరాజ్యాన్ని ప్రసాదించి రాక్షస బాధలతో సతమతమవుతున్న ప్రజల్ని కాపాడిన గొప్ప పుణ్యాత్ముడు కూడ.

ఋష్యశృంగుడు పిల్లలు లేని వారికి యజ్ఞయాగాదులు చేయించి వాళ్ళకి పిల్లలు కలిగేలా చేసి ఎన్నో రాజవంశాలు నిలబెట్టాడు. ఆయన ఎక్కడ ఉంటే అక్కడ చక్కటి వర్షాలు పడి, పంటలు బాగా పండి ఆ రాజ్యం అంతా ధనధాన్యాలతో తులతూగుతూ ఉండేది. ఆయన మన రాజ్యంలో కాలు పెడితే చాలు అనుకునే వాళ్ళుట అప్పటిరాజులు.

ఇప్పటి మన 'ఐరన్‌లెగ్' లాంటివాడు కాదు. అలాంటి పుణ్యాత్ముడు ఈ రోజుల్లో కూడా ఒకడైనా ఉంటే బాగుంటుంది కదా..

అదేమంత కష్టం కాదు. కృషి చేస్తే మనం కూడ ఋషులంత గొప్ప వాళ్ళం అయిపోయి మన దేశాన్ని కూడా సుభిక్షింగా ఉంచుకోవచ్చు. ఏదయినా సాధించాలి అనుకుంటే సాధ్యం కానిది లేదని ఒప్పుకుంటారా ?

ఇదన్నమాట ఋష్యశృంగ మహర్షి కథ!

# 16. ఔర్వ మహర్షి

**పి**ల్లలూ ! ఇపుడు మనం ఔర్వమహర్షి గురించి తెలుసుకుందాం... సరేనా... పేరుకొంచెం పలకడానికి కష్టంగా ఉంది కదూ.... కష్టమైన పదాలు పలుకుతుంటేనే నాలుక బాగా తిరుగుతుంది.

ఔర్వ మహర్షి తండ్రి పేరు అప్రవానుడు. తల్లిపేరు ఋచి. ఆయన ఎలా పుట్టారో తెలుసుకుందాం. హైహయ వంశంలో వాడయిన, కార్తవీర్యార్జునిడి తండ్రి కృతవీర్యుడు అనే మహారాజు యజ్ఞాలు చేసి భార్గవ వంశంలో గొప్పగొప్ప బ్రాహ్మణులని పిలిచి వాళ్ళకి గురుదక్షిణగా తన సంపదలన్నీ ఇచ్చేశాడు. కానీ, కృతవీర్యుడి పిల్లలు మాత్రం బ్రాహ్మణులే మోసం చేసి వాళ్ళ తండ్రి నుంచి సంపదలన్ని తీసేసుకున్నారని నిందించారు. ఇదీ హైహయులకీ, ఆర్య బ్రాహ్మణులకూ మధ్య వైరానికి మూలకారణం.

కృతవీర్యుడి కొడుకులు భార్గవవంశ బ్రాహ్మణుల్ని, వాళ్ళ భార్యల్ని, పిల్లల్ని వెతికి వెతికి చంపడం మొదలుపెట్టారు. వాళ్ళల్లో ఋచి కూడ ఉంది. ఋచి గర్భంతో ఉందని కూడా చూడకుండా తరుముతూ వచ్చారు. ఆవిడ పరుగెత్తలేక ఒకచోట కూర్చుండిపోయింది.

ఆ సమయంలో ఋచి గొప్ప తేజస్సు కల్గిన కొడుకుని ప్రసవించింది. అతడు పుట్టగానే ఆ తేజస్సుకి ఋచిని తరుముకుంటూ వచ్చిన రాజు కొడుకులంతా గ్రుడ్డివాళ్ళయిపోయారు. ఋచికి పుట్టిన ఆ పిల్లవాడే ఔర్వుడు. మన ఔర్వ మహర్షిఎలా పుట్టాడో తెలిసిందిగా.

కృతవీర్యుడు కొడుకులు ఋచి కాళ్ళమీద పడి, అమ్మా ! మమ్మల్ని క్షమించు. బుద్ధిలేక ఇలాంటి పని చేశాము. ధర్మంగా లేని పన్లు చేస్తే ఇలాగే జరుగుతుందని తెలిసికూడ తప్పు చేశాము, క్షమించమన్నారు.

ఋచి నాయనలారా! ఇందులో నేను చేసింది ఏమీ లేదు. ఇప్పుడే పుట్టిన ఈ భార్గవ వంశ కులానికి దీపం లాంటి ఈ పిల్లాడే చేసి ఉంటాడు. ఇతడు గర్భంలోంచి బయటికి రాకుండానే వేదవేదాంగాలను నేర్చుకున్నాడు. తపస్సంపన్నుడు, సర్వశక్తి సంపన్నుడు. ఈ పిల్లవాడే మిమ్మల్ని శపించి ఉంటాడని అంది. కొడుకు ఔర్వుడితో "నాయనా!

తెలియక తప్పు చేశారు. వాళ్ళని క్షమించి వాళ్ళకి కళ్ళు కనిపించేలా" చెయ్యమని చెప్పింది. తల్లి అలా కోరిన వెంటనే రాజకుమారులకు పోయిన కళ్ళు తిరిగి వచ్చాయి. రాజకుమారులు ఔర్వుడికి నమస్కారం పెట్టి వెళ్ళిపోయారు.

ఔర్వుడు కొంత పెద్దవాడయ్యాక, తన తండ్రితో సహా తమ బంధువులు అందరూ రాజుల వలన చనిపోయారని కోపంతో తపస్సు మొదలుపెట్టాడు అతని తపస్సుకి అందరూ భయపడిపోయారు.

పితృదేవతలు భూలోకానికి వచ్చి నాయనా ! నీ తపోబలానికి లోకాలన్నీ భయపడుతున్నాయి. మమ్మల్ని రాజకుమారులు చంపలేదు. మాకు ధనాశకూడ లేదు. ఉంటే మాకు కుబేరుడే స్వయంగా వచ్చి ఇచ్చేవాడు. మా తపస్సు వల్ల మాకు ఆయుష్షుకూడ ఎక్కువగానే ఉంది.

మాకు మనుష్యలోకంలో ఉండటం ఇష్టంలేదు. చచ్చిపోతే గాని స్వర్గానికి వెళ్ళలేం. ఆత్మహత్య చేసుకుంటే పుణ్యలోకం రాదు. ఇవన్నీ ఆలోచించుకుని హైహయవంశ రాజులతో శతృత్వం పెంచుకుని మాకు మేమే వారి వల్ల చచ్చిపోయాం. నువ్వు కోపం విడిచి పెట్టు. దీనివల్ల లోకానికి చెడుచేసిన వాడివవుతావు అని చెప్పారు.

ఔర్వుడు పితృదేవతలకు సాష్టాంగ నమస్కారం చేసి మీరు చెప్పినట్లే చేస్తాను. కాని నా కోపాన్ని ఉపసంహరిస్తే అది నన్నే దహించేస్తుంది కదా... ఏం చెయ్యమంటారు...? అని అడిగాడు. నీ కోపాన్ని నీళ్ళల్లో విడిచిపెట్టు. ఎందుకంటే నీళ్ళకి నీ కోపాగ్నిని తట్టుకునే శక్తి ఉందని చెప్పి ఔర్వ మహర్షిని దీవించి వెళ్ళి పోయారు పితృదేవతలు. ఔర్వుడి ఆ కోపాగ్నిని "ఔర్వాగ్ని" అంటారు.

ఔర్వ మహర్షి బ్రహ్మచర్యం తీసుకుని మళ్ళీ తపస్సు మొదలుపెట్టాడు. ఈయన చేసే తపస్సుకి మళ్ళీ లోకాలన్ని గడగడలాడాయి. మహర్షులు, దేవతలు, రాక్షసులు, అందరూ వచ్చేశారు కుమారా ! ఇంత చిన్నతనంలో బ్రహ్మచర్యం తీసుకుని ఇంత తపస్సు చేస్తున్నావు. నువ్వు పెళ్ళి చేసుకోకపోతే భార్గవకులం నాశనమయిపోతుంది. నువ్వు వెంటనే పెళ్ళిచేసుకో అన్నారు.

ఔర్వ మహర్షి చిరునవ్వు నవ్వి వేదాధ్యయనం, యజ్ఞం, సంతానం పొందడం ఇవన్నీ గృహస్థులకు ఉండవలసిన ధర్మాలు. నేను అడవిలో ఉండేవాణ్ణి, నాది వానప్రస్థ ధర్మం. అంటే ఉపవాసం, గాలి నీళ్ళు భోజనంగా తీసుకోవడం నా ధర్మం.

బ్రహ్మచర్యం వల్ల బ్రహ్మగతి వస్తుంది. బ్రహ్మదేవుడు బ్రహ్మచారి అయినా మానసపుత్రులు ఉన్నారు కదా ! పిల్లల్ని కనడమే ముఖ్యమనుకుంటే నేను కూడ పెళ్ళి కాకుండానే పిల్లల్ని చూపించమంటారా ? చూడండి అని అగ్ని హోత్రంలో తన కాలు పెట్టి ఒక దర్భతో రాశాడు. అతని కాలు నుంచి అగ్నిహోత్రుడే కొడుకుగా బయటికి వచ్చాడు.

అతడు అంతకంతకి పెరిగిపోతుంటే బ్రహ్మదేవుడు వచ్చి ఔర్వ మహర్షీ! నీ కొడుక్కి ఉండటానికి చోటు, ఆహారము నేను ఇస్తాను. అతన్ని నాకు విడిచిపెట్టు అన్నాడు. ఈ అగ్ని కూడ సముద్రంలో ఉన్న ఔర్వాగ్నితో కలిసి ప్రళయ సమయంలో నీరుగా మారిపోతుంది అన్నాడు. బ్రహ్మదేవుణ్ణి మీ ఇష్టప్రకారమే జరగనియ్యండి అన్నాడు ఔర్వ మహర్షి. ఆ కొడుకు రూపంలో ఉన్న అగ్ని సముద్రంలో కలిసిపోయింది. అందరూ వెళ్ళిపోయారు.

హిరణ్యకశిపుడు మాత్రం ఆగిపోయి ఔర్వ మహర్షికి సాష్టాంగనమస్కారం చేశాడు. ఔర్వుడు హిరణ్యకశపా ! నీకు 'విద్యమాని' అనే విద్యను ఇచ్చాను తీసుకోమన్నాడు. అదే రాక్షసమాయ అంటే. ఈ విద్య నీ వంశంలో వాళ్ళకే ఉంటుంది అని చెప్పాడు.

ఒకసారి ఔర్వ మహర్షి బ్రహ్మచర్య వ్రతంలో ఉండే ఒక కూతుర్ని కూడా పొందాడు. 'కందని' అని ఆమెకు పేరుపెట్టాడు. 'కందని' ఎంత అందంగా ఉంటుందో అంత కఠినంగా మాట్లాడుతుంది. 'కందని' పెరిగి పెద్దయ్యాక దూర్వాస మహర్షి గురించి విని దుర్వాసుడితో పెళ్ళి చెయ్యమని తండ్రిని కోరింది.

ఔర్వుడు "కందని"ని తీసుకుని దుర్వాస మహర్షిని కలవాలని బయలు దేరాడు. "కందని" అందం వల్ల కలిగిన తేజస్సుతోను, ఔర్వ మహర్షి తపశ్శక్తితో వచ్చిన తేజస్సుతోనూ వాళ్ళిద్దరూ కలిసి వెడుతుంటే ఆ దారంతా కాంతితో నిండిపోయింది.

ఔర్వ మహర్షి దుర్వాస మహర్షిని కలిసి "కందని"ని ఆయనకిచ్చి పెళ్ళి చెయ్యాలని అనుకుంటున్నట్లు చెప్పాడు. దుర్వాసుడు అందుకు ఒప్పుకున్నాక ఇద్దరికి పెళ్ళి చేయించి ఔర్వ మహర్షి తన ఆశ్రమానికి వెళ్ళిపోయాడు.

చాలాకాలం కందని దుర్వాసులు కలిసి ఉన్నారు. ఒకనాడు కందని కటువైన మాటలు భరించలేక దుర్వాసుడు కందనిని కోపంగా చూశాడు. తపశ్శక్తితో ఉన్న ఆ చూపుకి కందని భస్మమయిపోయింది. అది తెలిసి ఔర్వుడు అవమానాలతో బాధపడే మనిషిగా పుట్టమని శపించాడు దుర్వాసుణ్ణి.

అయోధ్యానగరాన్ని పాలిస్తున్న బాహురాజు తన రాజ్యాన్ని పోగొట్టుకుని గర్భవతియైన భార్యను తీసుకొని ఔర్వ మహర్షి ఆశ్రమంలో ఆశ్రయం పొందుతున్నాడు. సవతి పెట్టిన విషం వల్ల రాజు భార్యకి ఏడు సంవత్సరాలయినా కొడుకు పుట్టలేదు. కాని, రాజు పెద్దవాడవడం వల్ల చనిపోయాడు. రాజు భార్య కూడా సతీసహగమనం చేస్తుంటే ఔర్వ మహర్షి రాజుభార్యని ఆమె కడుపులో వున్న పిల్లాడు గొప్ప చక్రవర్తి అవుతాడని సహగమనం చెయ్యద్దని చెప్పాడు.

రాజు భార్య పరమేశ్వరుణ్ణి తల్చుకుంటూ కాలం గడుపుతోంది. ఒకనాడు ఆమెకి కొడుకుపుట్టాడు. విషంతో కూడ బయటికి వచ్చిన ఆ పిల్లాడికి ఔర్వ మహర్షి సగరుడు

అని పేరు పెట్టి అక్కడే పెంచుతూ ఉన్నాడు. అతనికి ఉపనయనం చేసి వేద విద్యలు, శాస్త్ర విద్యలు మొదలయిన అన్ని విద్యలు నేర్పించాడు.

ఒకనాడు సగరుడు తల్లితో అమ్మా ! మన రాజ్యం ఏమయింది ? మనం అడవుల్లో ఎందుకు ఉన్నాం ? అని అడిగాడు. తల్లి జరిగినదంతా కొడుక్కి చెప్పింది. సగరుడు గురువుగారి దగ్గర తల్లి దగ్గర అనుమతి తీసుకుని శత్రువుల్ని జయించివస్తానని బయలుదేరి హైహయ వంశ రాజులందర్ని జయించాడు. సగరుడికి భయపడి శక, యవన, కాంభోజ, పారప్లవ దేశాల రాజులు వసిష్ఠ మహర్షిని శరణు వేడారు. వసిష్ఠుడు సగరుడికి నచ్చచెప్పి వాళ్ళ రాజ్యాలు వాళ్లకి ఇప్పించాడు.

తర్వాత సగరుడు అయోధ్యా నగరానికి వచ్చి పట్టాభిషేకం అయ్యాక పెళ్ళి చేసుకున్నాడు. అతని భార్యలు సుమతి, సుకేశి. కాని సగరుడికి పిల్లలు పుట్టలేదు. సగరుడు భార్యలను తీసుకుని ఔర్వ మహర్షి ఆశ్రమానికి వచ్చి గురువుగారికి పరిచర్యలు చేస్తూ అక్కడే ఉండిపోయాడు.

ఒకనాడు ఔర్వ మహర్షి సగరుడి భార్యల్ని పిలిచి వంశాన్ని ఉద్ధరించే కొడుకు ఒకడు కావాలా? సామాన్యమైన అరవై వేలమంది కొడుకులు కావాలా? అని అడిగాడు. సుకేశి ఒక్క కొడుకు చాలంది. సుమతి అరవై వేల కొడుకులు కావాలని అడిగింది. ఔర్వ మహర్షి వాళ్ళడిగినట్లే అనుగ్రహించాడు. గురువుగారి ఆశీర్వాదంతో సగరుడికి అరవైవేల ఒక్క కొడుకులు పుట్టారు.

సగరుడు చాలా కాలం రాజ్యం చేశాడు. ఒకనాడు గురువుగార్ని విష్ణువుని పూజిస్తే ఏం ఫలితం పొందచ్చని గురువుగార్ని అడిగాడు. ఔర్వుడు సగరుడితో రాజా ! వర్ణాశ్రమ ధర్మాల్ని శ్రద్ధ, భక్తితో నిర్వహించే వాళ్ళంటే విష్ణుమూర్తికి ఇష్టం. ఇతరుల ధనాన్ని ఆశించకుండా, జీవహింస చెయ్యకుండా, సాధువుల్ని తిట్టకుండా, అహంకారం లేకుండా, గురుభక్తి కలిగి బ్రాహ్మణులని సేవించి, అన్ని జీవుల్లోనూ భగవంతుడున్నాడని తెలుసుకుని ఎవరి వృత్తిని వాళ్ళు చేసే వాళ్ళంటే విష్ణుమూర్తికి చాలా యిష్టం. అలాంటి వాళ్ళకి విష్ణుమూర్తి ఏమడిగితే అది ఇచ్చేస్తాడు అని చెప్పాడు ఔర్వ మహర్షి.

గురువర్యా ! గృహస్థ ధర్మాల్ని గురించి చెప్పండన్నాడు సగరుడు. ఔర్వుడు రాజా! గృహస్థు ధర్మాన్ని పాటించిన వాళ్ళు ఇహలోకంలోనూ, పరలోకంలోనూ కూడా సుఖంగా ఉంటారు. రాజా ! గృహస్థు బ్రహ్మ ముహూర్తంలో లేచి గురువుని స్మరించి కాలకృత్యాలు తీర్చుకుని స్నానం చేసి తెల్లని మడిబట్ట కట్టుకుని సంధ్యావందనం చేసుకుని సూర్యనమస్కారం ఇష్టదేవుడి పూజచేసి అతిథుల్ని ఆదరించాలి. రోజూ చెయ్యవలసిన పనులు చేసుకుంటూ వేద శాస్త్రప్రసంగాలతోనూ, ధర్మకార్యాల గురించీ మాట్లాడుకుంటూ పగటి సమయాన్ని గడపాలి.

సాయంకాలం సంధ్యా సమయంలో చెయ్యాల్సిన పనులు పూర్తిచేసుకుని భోజనం చేసి తాంబూలం వేసుకుని తూర్పుకు గానీ, దక్షిణానికి గానీ తలపెట్టుకుని నిద్రపోవాలి. ఇలా చేస్తూ ఉంటే గృహస్థుకి పుణ్యలోకాలు కలుగుతాయని ఇంకా శ్రాద్ధకర్మల గురించి కూడ సగరుడికి చెప్పాడు ఔర్వ మహర్షి.

ఇదర్రా ఔర్వ మహర్షి కథ!.

ఔర్వ మహర్షి నిగ్రహం, అనుగ్రహం, బ్రహ్మచర్యం, మహాతపశ్శక్తి ఉన్నవాడన్నమాట. ఆయన చెప్పిన గృహస్థ ధర్మాలు పెద్దయ్యాక మనం కూడ ఆచరించాలి. అన్నీ చదివి వదిలెయ్యడం కాదు.

దీని వల్ల మనకేం తెలిసింది? నీతిగా ధర్మంగా దయగా పద్ధతిగా గురుభక్తి దేవుని యందు భక్తి అన్నీ వున్నవాడు సాధించలేనిది ఏమీ లేదు. అర్థమయిందా! మనం కూడా సాధించగలం !!

# 17. కచ మహర్షి

**పి**ల్లలూ! చాలా హుషారుగా కనిపిస్తున్నారే! ఏమిటో కథ? మహర్షుల కథలా! అంత ఇష్టంగా వున్నాయన్నమాట. అయితే ఎందుకు ఆలస్యం. మిమ్మల్ని నిరుత్సాహ పరచను, చదువుకోండి మరి....

అంగిరస మహర్షికి శ్రద్ధ అనే భార్య యందు పుట్టినవాడు బృహస్పతి. బృహస్పతికి పుట్టుకతోనే లోకాతీతమైన బుద్ధి వుండేది. బృహస్పతి శాస్త్రవేది, దేవగురువు, ఇంద్రుడికి కూడా ధర్మాలు బోధించాడు. మాంధాతకి గోపూజని గురించి చెప్పాడు. మనువుకి జ్ఞాన బోధ చేశాడు. భరద్వాజుడి పుట్టుకకి కారణమయ్యాడు.

బృహస్పతి తారని పెళ్ళి చేసుకున్నాడు. ఆమె ద్వారా కచుడనే కొడుకుని పొందాడు. కచుడు పెరిగి పెద్దవాడయ్యాడు. మన కచుడు బృహస్పతి కొడుకన్న మాట!

ఆ సమయంలో శుక్రాచార్యుడు మృతసంజీవనీ విద్యని నేర్చుకుని రాక్షసుల్ని బ్రతికిస్తున్నాడు. వృషపర్వుడనే రాక్షస రాజు శుక్రాచార్యుణ్ణి తన దగ్గరే ఉండమన్నాడు. ఇద్దరూ కలిసి రాక్షసులకి చావు లేకుండా చేస్తున్నారు.

దేవతలు ఏంచెయ్యాలా అనే ఆలోచనలో పడ్డారు. ఎలాగయినా మృత సంజీవని విద్యని శుక్రాచార్యుడి నుండి పొందాలని బృహస్పతి కొడుకయిన కచుణ్ణి పంపేందుకు నిర్ణయించుకున్నారు.

కచుడు దైవకార్యం కాబట్టి ఆపనికి అంగీకరించి బయలుదేరి శుక్రాచార్యుడి దగ్గరికి వెళ్ళి సాష్టాంగ నమస్కారంచేసి, ఆచార్యా! నేను బృహస్పతి కొడుకుని. మీదగ్గర విద్య నేర్చుకోవాలని వచ్చానని చెప్పాడు. నన్ను మీ శిష్యుడిగా అనుగ్రహించమని ప్రార్థించాడు కచుడు.

దేవతలవైపు వాడయినా చిన్నవాడు, సుకుమారుడు, ప్రకాశవంతుడు, ప్రశాంతుడు, అంతేకాక బృహస్పంతటి గొప్పవాడికి కొడుకు అయిన తనని అడుగుతున్నప్పుడు కాదని అనలేక ఆలోచించి, చివరికి కచుడిని శిష్యుడిగా అంగీకరించాడు శుక్రాచార్యుడు.

గురుసేవ చేస్తూ, గురువుగారి కూతురయిన దేవయాని ఏంచెప్తే అది చేస్తూ గురువుగారికి ప్రియ శిష్యుడు, దేవయానికి ప్రియ మిత్రుడూ అయ్యాడు కచుడు.

ఇది చూసి రాక్షసులకి ఈర్ష్యగా ఉండేది. వాళ్ళకి బృహస్పతి అన్యాయం చేస్తున్నాడని కచుడిని ఎలాగయినా చంపెయ్యాలని నిర్ణయించుకున్నారు.

ఒకనాడు కచుడు ఆవుల్ని తోలుకుని వస్తుంటే అతన్ని చంపి శవాన్ని చెట్టుకి కట్టేశారు. అది చూసి దేవయాని ఏడ్చి, అతన్ని బ్రతికించమని తండ్రిని అడిగింది. శుక్రుడు కచుడిని బ్రతికించాడు.

ఇలా కాదని కచుడిని చంపి, కాల్చి బూడిద చేసి మధువులో కలిపి శుక్రాచార్యుడితో తాగించారు రాక్షసులు. మళ్ళీ దేవయాని తన స్నేహితుణ్ణి బ్రతికించమని తండ్రిని ప్రార్థించింది.

శుక్రాచార్యుడు ఎక్కడ వెతికినా తన దివ్యదృష్టికే కచుడు కనపడలేదు. చివరకి తన కడుపులోనే వున్నాడని తెలుసుకుని కడుపులోవున్న కచుణ్ణి కడుపులోనే బ్రతికించాడు.

కచుడు గురువు గారూ! నేనెలా బయటికి రావాలి? నేను బయటకి వస్తే మీరు చచ్చిపోతారుకదా! అన్నాడు.

గురువు, "వత్సా! నేను నీకు మృతసంజీవని విద్య నేర్పిస్తే నువ్వు బయటకు వచ్చాక నన్ను బ్రతికిస్తావు. కానీ, దానివల్ల నన్నే నమ్ముకున్న రాక్షసులకి కీడు జరుగుతుంది. విద్య, వినయం, గురుభక్తి వున్న నీకు నేర్పించకుండా దాచుకుంటే నేను గురువుని అవను. అది అధర్మమవుతుంది. ఏది ఏమైనా కానీ, నీకు మృతసంజీవని విద్య నేర్పుతాను. నువ్వు బయటకి వచ్చి నన్ను బ్రతికించమన్నాడు శుక్రాచార్యుడు.

లోకోత్తరమైన మృతసంజీవని విద్యని, లోకోత్తరుడైన కచుడికి, లోకోత్తర పద్ధతిలో లోకోత్తరుడైన గురువు శుక్రాచార్యుడు నేర్పించాడు. కచుడు బయటకివచ్చి, గురువుగార్ని బ్రతికించాడు. ఆ గురుశిష్యుల మీద పుష్పవర్షం కురిసింది. దేవయాని ఎంతో ఆనందపడింది.

విద్యా విషయంలో శత్రు, మిత్ర భేదభావం చూపించకుండా శిష్యుడికి విద్య నేర్పించి మహా పురుషుడయ్యాడు శుక్రాచార్యుడు.

కచుడు దేవలోకానికి వెడుతూ దేవయానికి చెప్పాడు. దేవయాని కచుణ్ణి తనను పెళ్ళిచేసుకోమని అడిగింది. గురువుగారి కూతుర్ని చేసుకోవడం అధర్మమని హితవు చెప్పాడు కచుడు. దేవయాని "నువ్వు నేర్చుకున్న విద్య నీకు పనిచెయ్య"దని శపించింది కచుణ్ణి.

కచుడు నేను నేర్చుకున్నది నా కోసం కాదనీ నా వలన గ్రహించిన వాళ్ళకి పని చేస్తుందనీ చెప్పి, నన్ను కారణం లేకుండా శపించావు గనుక నిన్ను బ్రాహ్మణుడు పెళ్ళి చేసుకోకుండా శపిస్తున్నానని చెప్పి వెళ్ళిపోయాడు.

మృతసంజీవని విద్య నేర్చుకుని వచ్చాక కచుణ్ణి చూసి బృహస్పతి, దేవతలు సంతోషించారు.

ఇదర్రా! కచ మహర్షి కథ!!

కచుడు చిన్నవాడైనా ఎంత పెద్ద పని సాధించుకొచ్చాడో చూడండి! సాహస బాలుడనిపించుకున్నాడు.

# 18. కణ్వ మహర్షి

**అ**మ్మో ! నాకంటే ముందు వచ్చేస్తున్నారే ! అసలు మీకు తెలియచెప్పే వాళ్ళు లేకకాని, తెలిసేలా చెప్తే ఎన్నయినా తెలుసుకోగలరు మీరు. చదవడానికి మహర్షుల కథలు చాలా బాగున్నాయి కదూ... దీంట్లో మనం కణ్వమహర్షి గురించి తెలుసుకుందాం...

కణ్వ మహర్షి కశ్యప ప్రజాపతి వంశంలో పుట్టాడు. ఈయనని 'మునికుల చూడామణి' అంటారు. అంటే మునులందరిలో గొప్పవాడు అని అర్థం. ఈయన చిన్నప్పటి నుంచి తపోనిష్ఠలో ఉండి జీవితమంతా బ్రహ్మచారిగానే గడిపాడు. సామవేద మంత్రాలు బాగా తెలిసినవాడు.

కణ్వ మహర్షి ఆశ్రమం మాలినీ నదీ తీరంలో ఉండేది. ఇంద్రుడి ఖాండవవనం, కుబేరుడి చైత్రరథం ఎంత గొప్పగా ఉంటాయో కణ్వుడి ఆశ్రమం అంత గొప్పగా ఉండేది. ఆయన ఆశ్రమంలో ఎప్పుడూ వేదఘోష వినిపిస్తూ ఉండేది. అగ్నిహోత్రాలు నిత్యము ఉండేవి. శాస్త్ర ప్రవచనాలతో, వేదార్థ మీమాంస గోష్ఠిలో జరిగే వాదనలతో, గొప్ప తపస్సంపన్నులతో దివ్యాశ్రమంలా ఉండేది. అక్కడ పక్షులు గానం చేస్తుంటే ఏనుగులు చెట్ల నీడల్లో నిలబడి వినేవి. మహర్షులు పెట్టే పిండాలు తినడానికి ఎలుకలు పిల్లులు స్నేహంతో వచ్చి వంతులు వేసుకుని తినేవి. ఆ ప్రాంతానికి వచ్చిన రాజర్షులు కానీ, బ్రహ్మర్షులు కానీ కణ్వ మహర్షి దగ్గర ఆశీర్వాదం తీసుకోకుండా వెళ్ళేవారుకాదు. అంత పవిత్రమయింది కణ్వాశ్రమం.

ఒకనాడు కణ్వ మహర్షి మాలినీ నదిలో స్నానం చెయ్యడానికి వెళ్ళినపుడు ఒక చిన్నపిల్ల ఏడుపు వినిపించింది. కణ్వుడు ఆ ఏడుపు వినిపించిన వైపు వెళ్ళి అక్కడ తామరాకులమీద పడుకోబెట్టి ఉన్న చంటిపిల్లని చూశాడు. ఇంతలో ఆకాశవాణి "మహర్షీ! ఈ బాలిక మేనక విశ్వామిత్రులకి పుట్టిన అమ్మాయి. ఈ అమ్మాయికి శకుంతల అని పేరు పెట్టి నువ్వు పెంచు. ఆ అమ్మాయికి పుట్టిన అబ్బాయి గొప్ప చక్రవర్తి అవుతాడు" అని చెప్పింది. కణ్వ మహర్షి ఆ అమ్మాయిని తీసుకుపోయి తనే తల్లి, తండ్రి అయి పెంచాడు.

శకుంతలని ముద్దుగా పెంచుతూ కణ్వ మహర్షి అన్ని విద్యలు నేర్పించాడు. శకుంతల పెద్దదయి తండ్రి పూజకి కావలసిన పువ్వులు కోసి సహాయపడేది.

ఒకనాడు దుష్యంత మహారాజు వేటకోసం వచ్చి అలసిపోయి కణ్వాశ్రమానికి వచ్చాడు. అక్కడ శకుంతలని చూసి ఆమె గురించి తెలుసుకుని పెళ్ళి చేసుకోమని అడిగాడు. శకుంతల కూడా దుష్యంతుణ్ణి చూసి ఇష్టపడింది.

కణ్వ మహర్షి లేని ఆ సమయంలో దుష్యంతుడు శకుంతలని గాంధర్వ పద్ధతిని పెళ్ళిచేసుకుని చాలాకాలం అక్కడే ఉండిపోయాడు. కణ్వ మహర్షి వచ్చాక నిన్ను తీసుకువెడతానని, నీకు పుట్టబోయే వాడే నా తరువాత రాజవుతాడని చెప్పి రాజధానికి వెళ్ళిపోయాడు దుష్యంతుడు.

కణ్వ మహర్షి తిరిగి వచ్చి జరిగినది తెలిసికొని శకుంతలని దీవించి నీకేం కావాలో అడగమన్నాడు. పుట్టబోయే కుమారుడ వంశోద్ధారకుడు, ఆయురారోగ్య ఐశ్వర్య బలాలతో ఉండాలని తన మనస్సు ఎప్పుడు ధర్మకార్యాలు చెయ్యడం గురించే ఆలోచించాలని కోరింది శకుంతల.

శకుంతలకి కొడుకు పుట్టిన తర్వాత కణ్వ మహర్షి ఆ పిల్లవాడికి భరతుడు అని పేరు పెట్టాడు. భరతుడు క్రూరజంతువుల్ని తన బలంతో చంపేస్తుండేవాడు. అందుకే అతనికి 'సర్వదమనుడు' అని పేరు కూడా ఉంది.

కణ్వ మహర్షి భరతుణ్ణి చూసి యువరాజ్య పట్టాభిషేకానికి తగినవాడని ఆలోచించి శకుంతలని పిలిచి దుష్యంత మహారాజు దగ్గరకి పంపుతానని చెప్పాడు. ఆశ్రమంలో ఉన్న అందరికి భోజనాలు పెట్టించి శకుంతలాభరతుల్ని కొంతమంది శిష్యుల్ని తోడుగా ఇచ్చి దుష్యంతుడి దగ్గరికి పంపాడు.

దుష్యంతుడు మొదట శకుంతల నాకు తెలియదు అని అన్నాడు. కాని, ఆకాశవాణి చెప్పిన విషయాలు విని జరిగినది గుర్తుకువచ్చి శకుంతలా, భరతుల్ని ఆదరించాడు.

'ధర్మశాస్త్రము' అనేది కణ్వ మహర్షి రచించిన గ్రంథము.

ఇది పిల్లలూ... కణ్వ మహర్షి చరిత్ర! కణ్వ మహర్షి మహాతపస్వి, బ్రహ్మనిష్ఠుడు, ధర్మప్రవక్త, మహర్షి కూడా.

చూశారా ! బ్రహ్మచారి అయిఉండి కూడ ఒక కుమార్తెను పెంచి మన భారతావనికి భరతుణ్ణి అప్పగించాడు.

ఇదర్రా! కణ్వ మహర్షి కథ!!

# 19. కర్దమ మహర్షి

వచ్చేశారా ! ఇదివరకు నా వెనకాల ఉండేవాళ్ళు. ఇప్పుడేమో నాతోనే వచ్చేస్తున్నారు. చూస్తుంటే నాకంటే ముందే వెళ్ళిపోయేలా ఉన్నారు. చదవడం మొదలు పెట్టండి. ఇంకెందుకు ఆలస్యం. అసలు ఏ మహర్షి గురించో చెప్పనేలేదు కదూ.... వస్తున్నా... చెప్పేస్తున్నా .... ఇపుడు మనం చదవబోయేది కర్దమ మహర్షి గురించి....

బ్రహ్మదేవుడు, గంధర్వుల్ని, అప్సరసల్ని, సిద్ధుల్ని, కిన్నెరల్ని, కింపురుషుల్ని సృష్టించాక ఋషుల్ని సృష్టించాడు. వీళ్ళందర్ని ప్రజాసృష్టికి ఉపయోగించుకున్నాడు బ్రహ్మ. అందులో ఒక ఋషి మన కర్దమ మహర్షన్నమాట.....!

కర్దమ మహర్షి కృతయుగంలో వాడు. ఒకసారి బ్రహ్మ కర్దముణ్ణి పిలిచి నువు పెళ్ళి చేసుకుని నాకు సృష్టి కార్యంలో సహాయం చెయ్యమన్నాడు. కర్దముడు నీ మాట నేను ఎందుకు కాదంటాను సరేనన్నాడు.

ఒకసారి కర్దముడు సరస్వతీ నదీ తీరంలో ఒక ఆశ్రమం కట్టుకుని విష్ణుమూర్తి దర్శనం కోరి తపస్సు చేశాడు. పదివేల సంవత్సరాలు అలా తపస్సు చేశాక విష్ణుమూర్తి ప్రత్యక్షమయ్యి ఏంకావాలో కోరుకో అన్నాడు. కర్దమ మహర్షి విష్ణుమూర్తిని చూసి ఆనందం పట్టలేక సాష్టాంగ నమస్కారం చేసి స్వామీ ! నేను పెళ్ళి చేసుకోవాలని తపస్సు చేశాను. సృష్టి కార్యానికే గాని సుఖాలకోసం కాదు. నీ అనుమతి ప్రకారమే నేను కోరుకున్నాను అన్నాడు.

కర్దముడి మాటలు విని విష్ణుమూర్తి మహర్షీ ! నువ్వు కోరుకున్నట్లుగానే జరుగుతుంది. బ్రహ్మవర్త దేశపురాజు భార్యతో కలిసి నీ దగ్గరకు వచ్చి వారి కూతుర్ని నీకిచ్చి పెళ్ళి చేస్తారు. నీకు తొమ్మిది మంది కూతుళ్ళు వాళ్ళకు గొప్ప మునులు పుడ్తారు. తర్వాత నువ్వు నాలోనే లోకాలన్ని వున్నాయనీ, నీలో కూడ నేనే ఉన్నానని తెలుసుకుని నన్నే పూజించు. నాఅంశతో నీ భార్య వలన నేనే కొడుకుగా నీకు పుడతాను అని చెప్పాడు.

కర్దముడు మళ్ళీ తపస్సు చేసుకుందుకు వెళ్ళిపోయాడు. స్వాయంభువుడు భార్య శతరూపతోను, కూతరు దేవహూతితోను కలిసి వచ్చి తన కూతుర్ని పెళ్ళి చేసుకోమని అడిగాడు. కర్దముడు పెళ్ళి చేసుకుంటాను కాని పిల్లలు పుట్టేవరకే ఉంటాను, తర్వాత తపస్సు చేసుకుందుకు వెళ్లిపాతాను అన్నాడు. రాజు, భార్యని కూతుర్ని అడిగి వాళ్ళు సరే అన్నాక కర్దముడికి దేవహూతినిచ్చి పెళ్ళిచేసి తిరిగి వెళ్ళిపోయాడు.

దేవహూతి తన భర్త అయిన కర్దముడికి సేవచేస్తూ ఉండిపోయింది. కొంతకాలం తర్వాత వాళ్ళకి తొమ్మిదిమంది కూతుళ్ళు పుట్టారు. కర్దముడు పిల్లలు పుట్టారు కనుక సన్యాసం తీసుకుని తపస్సు చేసుకునేందుకు వెళ్ళిపోతానని చెప్పాడు. దేవహూతి ఆడపిల్లలు

పెళ్ళిళ్ళయి అత్తవారిళ్ళకు వెళ్ళేవరకు తనకు ఒక కొడుకు పుట్టేవరకు ఉండమని భర్తని వేడుకుంది. కర్దముడు కొడుకు కావాలంటే విష్ణుమూర్తిని ధ్యానం చెయ్యమని చెప్పాడు.

కొంతకాలం తర్వాత దేవహూతికి సాక్షాత్తూ శ్రీ మహావిష్ణువే కొడుకుగా పుట్టాడు. అతనికి కపిలుడు అని నామకరణం చేశారు. మరీచి మొదలయిన మునులతో కలిసి వచ్చి కపిలుడు దేవదేవుడని లోకాల్ని ఉద్ధరించడానికే పుట్టాడని మరీచిని అక్కడే వుంచి కర్దముడి కూతుళ్ళకు మునులనే ఇచ్చి పెళ్ళి చెయ్యమని చెప్పి వెళ్ళిపోయాడు బ్రహ్మ.

బ్రహ్మదేవుడు చెప్పినట్లుగానే కర్దముడు తన తొమ్మిదిమంది కూతుళ్ళకు మునులతో వైభవంగా పెళ్ళి చేశాడు. కపిలుణ్ణి కనిపెట్టుకుని దేవహూతీ కర్దములు ఉండిపోయారు. కొంతకాలం గడిచాక కర్దముడు దేవదేవుడే తన కొడుకుగా ఇంట్లో ఉన్నాడని కొడుకయిన కపిలుడికి నమస్కారం చేసి స్వామీ ! ఆదివిష్ణువయిన నువ్వే నా ఇంట్లో పుట్టావు. నేను చాలా అదృష్టవంతుణ్ణి. నా మనస్సు నీలోనే లగ్నం చేసి తపస్సు చేసుకోవాలనుకుంటున్నాను అన్నాడు కర్దముడు.

కపిలుడు నేను నీకు మాట ఇచ్చినట్లే నీకు కొడుకుగా పుట్టాను. మునులందరికి తత్త్వజ్ఞానం గురించి చెప్తాను. నువ్వు కూడ కోరికలు వదిలేసి భక్తి కలిగి నన్ను మనస్సులో తలచుకుంటూ మోక్షాన్ని పొందు అని చెప్పాడు.

కర్దముడు కపిల మహర్షికి ప్రదక్షిణ చేసి నమస్కారం చేసి ఆశ్రమానికి వెళ్ళి పరబ్రహ్మని మనస్సులో నిలుపుకుని లోకమంతా భగవంతుడే వ్యాపించి ఉన్నాడని తెలుసుకుని మోక్షాన్ని పొందాడు.

ఇది పిల్లలూ ! కర్దమ మహర్షి జీవితచరిత్ర!

విష్ణుమూర్తికే తండ్రి అయిన కర్దముడు ఎంత గొప్పవాడయ్యాడో! కపిల మహర్షిని కొడుకుగా లోకానికి అప్పగించి ఎంతో మేలు చేసి మోక్షాన్ని పొందాడు.

తల్లిదండ్రులు తమకు పుట్టిన పిల్లలు మంచి వాళ్ళు, ధర్మాత్ములు వినయవిధేయతలున్న వాళ్లు అయితే మనం ఇంత మంచి పిల్లల్ని దేశానికి అప్పగించాం కదా.... అని ఆనందపడ్తారు.

అదే పిల్లలు దుర్మార్గులు, దొంగలు, పెద్దలంటే గౌరవం లేని వాళ్ళు, భక్తి లేని వాళ్ళు అయితే దేశమాత మాత్రమే కాదు. భూమాతకి కూడ బరువుగా అనిపిస్తారు. అందుకే మనం మాత్రం మంచిగానే ఉందాం....... సరేనా !

# 20. కశ్యప మహర్షి

రండర్రా ! ఇంత నెమ్మదా ! కశ్యప మహర్షి గురించి తెలుసుకుందామా! ఒక్కొక్క మహర్షిని గురించి తెలుసుకుంటూ మనం ముందుకి వెడుతున్నాం కదా! ఎంత ఆసక్తిగా ఉందో కదూ...

ఈ మహర్షులు ఎవ్వరూ వాళ్ళకోసం వాళ్ళు బ్రతకలేదు. ఇతరులకి మంచి చెయ్యడం కోసం తపస్సు చేసుకోవడం ఆ తపస్సు వల్ల వచ్చిన ఆ తపోధనాన్ని అంటే శక్తిని వేరేవాళ్ళకి ఉపయోగించడం. పాపం వాళ్ళకి స్వార్థం అంటే తెలియదనుకుంటాను.

దేవహూతి కర్దమప్రజాపతికి విష్ణుమూర్తి కపిల మహర్షి రూపంలో పుట్టినప్పుడు బ్రహ్మదేవుడితో మరీచి మహర్షి కూడ వచ్చాడు. తిరిగి వెళ్ళేటప్పుడు బ్రహ్మ మరీచిని కర్దమ ప్రజాపతి దగ్గరే వదిలేసి వెళ్ళిపోయాడు. అప్పుడు కర్దముడు మరీచికి తన కూతురు కళ నిచ్చి పెళ్ళి చేశాడు. మరీచి కళలకి పుట్టిన వాడే మన కశ్యప మహర్షి. కశ్యపుడు కొంచెం పెద్దవాడయ్యే వరకు ఉండి అతనికి ఉపనయనం చేసి జాగ్రత్తగా చూసుకోమని భార్యకి చెప్పి తపస్సుచేసుకునేందుకు వెళ్ళిపోయాడు మరీచి మహర్షి.

కశ్యపుడు పెద్దవాడయ్యాడు. దక్షప్రజాపతికి పదముగ్గురు ఆడపిల్లలున్నారు. వాళ్ల పేర్లు కూడ చెప్తాను. మనకు ఈ పేర్లు ఎప్పుడయినా ఉపయోగించవచ్చు కదా ! అదితి, దితి, తనువు, కాల, అవాయువు, సింహిక, ముని, కపిల, క్రోధ, ప్రథ, క్రూర, వినత, కద్రువ. వీళ్ళని దక్షప్రజాపతి కశ్యపుడికిచ్చి పెళ్ళి చేశాడు. కశ్యపుడు వాళ్ళ వల్ల పిల్లల్ని పొంది వంశాన్ని వృద్ధి చేశాడు.

కద్రువ, వినత కశ్యప మహర్షిని వెయ్యి సంవత్సరాలు పూజచేశారు. కశ్యపుడు వాళ్లని ఏంకావాలో అడగమన్నాడు. కద్రువ వెయ్యిమంది పిల్లలు కావాలని అడిగింది. వినుత ఆ వెయ్యమందికంటే బలం ఉన్న ఇద్దరు మగపిల్లలు కావాలంది.

అప్పుడు కశ్యపుడు పుత్రకామేష్టి యజ్ఞాన్ని ప్రారంభించాడు. ఋషులందర్ని పిలిచి యజ్ఞం చేస్తుంటే ఇంద్రుడు వాళ్ళందర్ని చూసి నవ్వాడు. మునులకి కోపం వచ్చి ఇంద్రుడి కంటే వందరెట్లు బలంవున్నవాడు కశ్యపుడికి పుట్టి రెండవ ఇంద్రుడవుతాడని చెప్పి మహామంత్రాల్ని చదవడం మొదలుపెట్టారు. ఇంద్రుడికి భయంవేసి కశ్యపుణ్ణి క్షమించమని వేడుకున్నాడు.

కశ్యపుడు మంత్రాలు చదవడం మొదలయిపోయింది కాబట్టి ఇంద్రుడి కంటే బలం ఉన్నవాడు పక్షి జాతిలో పుట్టాలని మంత్రాలను మార్చాడు. మునులకి కూడ నచ్చచెప్పాడు. అందరూ సరే అన్నారు. కద్రువ వినత గర్భవతులయ్యారు.

కొంతకాలం తర్వాత కద్రువ వినతలకి గ్రుడ్డు రూపంలో పిల్లలు పుట్టారు. వాటిని కుండల్లో పెట్టి రక్షించారు. వందసంవత్సరాల తర్వాత కద్రువకి సంబంధించిన గ్రుడ్లు చిట్లిపోయి శేషుడు, వాసుకి, తక్షకుడు మొదలైన నాగజాతిలో గొప్పవాళ్ళయిన వాళ్ళందరూ పుట్టారు.

వినత తన గ్రుడ్లు ఇంకా పగలలేదని ఒక గ్రుడ్డు తీసి పగలకొట్టింది. దాంట్లోంచి అసురుడు బయటకు వచ్చాడు. గ్రుడ్డుని ముందే పగలగొట్టడం వల్ల వికలాంగుడుగా పుట్టాడు. తను వికలాంగుడయి నందుకు తల్లిని రెండో గ్రుడ్డయినా కాపాడుకోమని చెప్పి సూర్యుడుకి సారథిగా వెళ్ళిపోయాడు. చాలా కాలం తర్వాత గానీ రెండో గ్రుడ్డు పగలలేదు అది పగిలి గరుత్మంతుడు అనే పక్షి పుట్టింది.

గరుత్మంతుడు పుట్టగానే తన తల్లి దాసిగా ఉంటోందని తెలిసి ఆవిడని విముక్తురాల్ని చెయ్యాలని అమృతం తీసుకురావడానికి బయలుదేరాడు. తల్లి చెప్పినట్లు ఆకలికి సముద్రంలో ఉన్న జంతువుల్ని తిన్నాడు. ఇంకా ఆకలి తీరక తండ్రి అయిన కశ్యపుడ్ని తినడానికి ఏమయినా చూపించమన్నాడు. కశ్యపుడు గరుత్మంతుడ్ని ఆశీర్వదించి "నాయనా! విభావసుడు, సుప్రతీకుడు అనే ఇద్దరు బ్రాహ్మణులు తాబేలు ఏనుగు రూపంలో కొట్టుకుంటున్నారు. వాళ్ళను తిను అని చెప్పాడు.

గరుత్మంతుడు తండ్రి చెప్పనటు వెళ్ళి ఒక చెట్టు మీద కూర్చున్నాడు. ఆ చెట్టు పేరు రౌహిణ. గరుత్మంతుడు కూర్చోగానే ఆ కొమ్మ విరిగిపోయింది. ఆ కొమ్మ మీద కూర్చొని తనస్సు చేసుకుంటున్న మునులకి దెబ్బతగలకుండా ముక్కుతో పట్టుకుని మళ్ళీ తండ్రి దగ్గరకి వచ్చాడు. కశ్యపుడు అది చూసి ఆ మునులకి ఇంకోచోటుకి వెళ్ళి తపస్సు చేసుకోమని చెప్పాడు. కశ్యపుడు ఆ చెట్టుకొమ్మని నిష్పురుష అనే నగరంలో పడెయ్యమన్నాడు. తర్వాత గరుత్మంతుడు, తాబేలు ఏనుగులను తినేసి అమృతం తీసుకువచ్చి తల్లిని దాసీతనం నుంచి విముక్తురాల్ని చేశాడు.

పూర్వం పరశురాముడు ఇరవయి ఒక్కసార్లు భూమి అంతా తిరిగి రాజులందర్నీ చంపిన పాపం పోవాలని అశ్వమేధయాగం చేశాడు. యాగం పూర్తయ్యాక భూమంతటినీ కశ్యప మహర్షికి దానంగా ఇచ్చాడు. కశ్యపుడు దానం తీసుకుని తెలుసుకుని పరశురాముణ్ణి దక్షిణంవైపు ఉన్న పారదేశానికి వెళ్ళిపొమ్మని భూమిని రాజులకిచ్చేసి తపస్సు చేసుకుందుకు వెళ్ళిపోయాడు. అప్పటి నుంచి భూమికి 'కాశ్యపి' అనే పేరు వచ్చింది.

కశ్యప మహర్షి నైమిశారణ్యంలో ఉన్న మునుల్ని చూడడానికి వెళ్ళాడు. అక్కడి ఋషులు కశ్యప మహర్షిని గౌరవంగా తీసికెళ్ళి పూజచేశారు. కశ్యపుడు వాళ్ళని అందరూ బాగున్నారా ? అని అడిగాడు. మునులు స్వామీ ! మాకు స్నానానికి కూడ నదిలేదు. లోకాన్ని రక్షించేందుకు గంగాజలాన్ని భూమిమీదకి వచ్చేలా చెయ్యగల సమర్థులు మీరే అన్నారు.

కశ్యపుడు వాళ్ళ కోరిక తీర్చడం కోసం పరమశివుడ్ని గురించి కఠోరమైన తపస్సు చేశాడు. శివుడు ప్రత్యక్షమై కశ్యపుణ్ని ఏంకావాలి ? అని అడిగాడు. గంగానదిని భూలోకంలో ప్రవహించేలా చెయ్యమన్నాడు కశ్యపుడు. శివుడు తన జడనుంచి గంగని ఒకపాయగా విడిచిపెట్టాడు. ఆ పాయని తీసుకుని కశ్యపుడు మునులకి భూలోకంలో ఇచ్చాడు. వాళ్ళు చాలా సంతోషించి ఆ గంగాజలాలకి 'కాశ్యపి' అని పేరు పెట్టారు.

ఆ పాయకి కృతయుగంలో 'కృతవతి' అని త్రేతాయుగంలో 'గిరికర్ణిక' అని, ద్వాపరయుగంలో 'చందన' అని, కలియుగంలో 'సాభ్రమతి' అని పేర్లున్నాయన్న మాట.

సౌభమతీ నది చాలా పవిత్రమైంది. నది దగ్గర గొప్పగొప్ప ఋషులు తపస్సు చేశారు. కొంతమంది ఋషుల పేర్లు తెలుసుకుందామా – క్రేత, రైభ్య, భృగు, అంగిరస, దత్తాత్రేయ, విశ్వామిత్ర, భరద్వాజ మొదలైన ఋషులు, ఈ నదిలో వ్రాద, రుద్ర మహాలయ, మందాకిని లాంటి కొన్ని నదులు కలుస్తున్నాయి. ఈ నది వల్ల ఎన్నో పుణ్యతీర్థాలు ఏర్పడ్డాయి.

కశ్యప మహర్షి తపస్సు చేసిన ప్రదేశాన్ని ఏమంటారో తెలుసా ? 'కాశ్యపతీర్థం' అంటారు. అక్కడ కశ్యప మహర్షి పూజించిన ఈశ్వరుడి పేరు 'కుశేశ్వరుడు' ఆయన కట్టించిన నగరానికి 'కాశ్యప' అని పేరు. కాశీనగరానికి ఎంత గొప్ప తనం ఉందో ఆ నగరానికి అంతే గొప్పతనం వుంది.

కొంతకాలం తర్వాత భూమి మీద ధర్మం తగ్గిపోయి అధర్మం పెరిగి భూమి పాతాళంలోకి వెళ్ళిపోవడం మొదలయింది. అప్పుడు కశ్యపుడు తన తొడమీద భూమిని మోపుచేసి ఎత్తి పట్టుకున్నాడు. భూదేవి కశ్యపుడితో ఉత్తములైన అంటే ధర్మంగా పరిపాలించ గల క్షత్రియులుంటే మళ్ళీ నేను సురక్షితంగా ఉంటాను అంది. అసలు భూమిమీద క్షత్రియులందర్ని పరశురాముడు చంపేశాడు కదా ! అని కశ్యపుడు భూదేవితో అన్నాడు.

హైహయులు, పౌరవవంశంలో వారు, సాదాసుని వంశం వారు, వత్సరాజు, శిబి మనవడు ఇలా కొంతమంది రాజులు ఇంకా బ్రతికి ఉన్నారు, వాళ్లని పిలిపించమంది భూదేవి. కశ్యపుడు వాళ్ళందర్ని పిలిచి భూమిని భాగాలుగా చేసి వాళ్ళని ధర్మంగా పాలించమని చెప్పాడు. కొన్నాళ్ళకి వాళ్ళ వంశాలు పెరిగి రాజులు పెరిగి భూదేవి కూడా సంతోషించింది.

ఒకసారి బలిచక్రవర్తి తపస్సు చేసి బాగా బలం సంపాదించి స్వర్గలోకం ఆక్రమించేశాడు. ఇంద్రుడు మొదలయిన వాళ్ళంతా ఎక్కడెక్కడికో వెళ్ళిపోయారు. అదితి తన పిల్లల స్థితి గురించి కశ్యపుడికి చెప్పింది. అదితికి నారాయణమంత్రం ఉపదేశించాడు కశ్యపుడు. 'పయోభక్షణ' అనే వ్రతం చేస్తే రాక్షసుల వల్ల దేవతలకి కలిగిన బాధలన్ని పోతాయి అని వ్రతం ఎలా చెయ్యాలో చెప్పాడు. అతిదికి నారాయణుడు ప్రత్యక్షమై నీ భర్తని పూజించు నీకు కొడుకు పుడతాడు అని చెప్పాడు.

అదితి కశ్యప మహర్షిని భక్తితో పూజచేసింది. విష్ణుమూర్తి అంశ కశ్యపుడి ఆత్మలో ప్రవేశించింది. దాన్ని అదితి గర్భంలోకి పంపించాడు కశ్యపుడు. కొంతకాలం గడిచాక అదితికి విష్ణుమూర్తి కొడుకుగా పుట్టాడు.

విష్ణు కశ్యపుడు అనేక విధాలుగా స్తోత్రం చేశాడు. శంఖం, చక్రం, గద ఇన్ని బంగారు నగలు ఇంతపెద్ద విష్ణుమూర్తి నా కడుపులో ఎలా ఉన్నాడా ! అని ఆశ్చర్యపోయింది అదితి. చూస్తూ ఉండిపోయింది. అప్పుడు విష్ణుమూర్తి వామనరూపంలో కశ్యపుడి ఇంట్లో పెరిగాడు.

వామనుడు పెరిగాక మహర్షులు అందరూ కలిసి ఉపనయనం చేశారు. సవిత సావిత్రిని ఉపదేశం చేసింది. బృహస్పతి యజ్ఞోపవీతం ఇచ్చాడు. కశ్యపుడు మౌంజినిచ్చాడు. అదితి కౌపీనం ఇచ్చింది. బ్రహ్మదేవుడు కమండలం ఇచ్చాడు. సరస్వతి అక్షరమాల ఇచ్చింది. అందరూ ఎవరు ఇవ్వగలిగినది వాళ్ళు ఇచ్చి సాక్షాత్తూ విష్ణుమూర్తికి ఉపనయనం చేశారు. తర్వాత వామనుడు తల్లిదండ్రుల ఆజ్ఞ తీసుకుని బలిచక్రవర్తి దగ్గరకెళ్ళి మూడడుగులు దానం అడిగి బలిచక్రవర్తిని పాతాళంలోకి తొక్కేశాడు.

కద్రువ అనేక సంవత్సరాలు సేవ చేసి కశ్యపుడితో ఉంది. భర్తతో కలిసి ఉన్న కద్రువని చూసి అదితి ఈర్ష్యతో వాళ్ళని మానవరూపంలో పుట్టమని శపించింది. కశ్యపుడు విష్ణుమూర్తిని ప్రార్థించి ప్రతి జన్మలోనూ తనకే కొడుకుగా పుట్టాలని అడిగాడు. విష్ణుమూర్తి సరేనన్నాడు. అదేవిధంగా కశ్యపుడు వసుదేవుడి రూపంలో ఉన్నప్పుడు శ్రీకృష్ణుడి గాను, దశరథుడి రూపంలో ఉన్నప్పుడు శ్రీరామచంద్రుడి గాను పుట్టి కశ్యపుడి కోరిక తీర్చాడు.

పూర్వం సముద్రుడు కశ్యపుడికి ఆవులనిచ్చాడు. అవి కూడ చాలాకాలం కశ్యపుడి దగ్గరే ఉన్నాయి. ఒకనాడు సముద్రుడు వచ్చి తన ఆవుల్ని తనకిమ్మని అడిగాడు. కశ్యపుడి భార్య ఇవ్వనంది. ఆ శాపం వల్లనే కశ్యపుడు వసుదేవుడిగా పుట్టి కంసుడి ఆవులకి అధిపతి అయ్యాడు.

ఇంద్రుడు దితి కొడుకుల్ని బాధలు పెడ్తున్నాడని దితి కశ్యపుణ్ణి తనకి ఇంద్రుడి కంటే బలవంతుడైన ఒక కొడుకు కావాలని అడిగింది.న కశ్యపుడు అనుగ్రహించాడు. కాని, ఇంద్రుడికి ఈ విషయం తెలిసి దితి కడుపులో ఉన్న బిడ్డ ఏడుముక్కలవ్వాలని శపించాడు. ఆ ముక్కలు మళ్ళీ ఏడు ముక్కలవ్వాలని శపించాడు. దితి ఇంద్రుణ్ణి వాళ్ళు నీ మిత్రులుగానే ఉంటారు కాని శత్రువులు కాదు, వాళ్ళని రక్షించమని ప్రాధేయపడింది. ఇంద్రుడు వాళ్ళని అనుగ్రహించి వెళ్ళిపోయాడు. వాళ్ళు నలభైతొమ్మిది మంది 'మరుద్గణం' అనే పేరుతో ప్రసిద్ధికెక్కారు.

దితి తన పిల్లల్ని దేవతలు చంపేశారని ఏడిచింది. కశ్యపుడు దితిని ఓదార్చి పూర్వజన్మ కర్మఫలం అనుభవించక తప్పదు. నీ పిల్లలు ధర్మం లేనివాళ్ళు కాబట్టి నశించారు. పుణ్యం తగ్గిపోవడమే దుఃఖానికి కారణం. సర్వమూ తానే అయిన విష్ణుమూర్తిని ధ్యానించి జీవుడు జీవత్వభావాన్ని విడిచిపెట్టి తానే పరమాత్మ, తనలో కూడ భగవంతుడున్నాడు, అనే దాన్ని తెలుసుకుని ఎప్పుడూ ధర్మకార్యాలే చేస్తూ మోక్షం పొందాలి అని దితికి కశ్యపుడు ఉపదేశం చేశాడు.

కశ్యప మహర్షి 'కశ్యపస్మృతి' అనే గ్రంథంలో అగ్నిసాక్షిగా పెళ్ళి చేసుకున్న భార్య మాత్రమే దేవకార్యాలు, పితృకార్యాలు, చెయ్యడానికి పనికివస్తుందని వివరించాడు. కశ్యపగీతలో క్షమాగుణాన్ని గురించి చెప్పాడు. వేదాలు, యజ్ఞాలు, సత్యం, విద్య, ధర్మం, ఇంతేకాక

లోకమంతా కూడా క్షమాగుణంతోనే నిండి ఉంది. తపస్సు, యజ్ఞాలు వంటివి చేసి పొందిన పుణ్యం ఎంత ఉంటుందో క్షమాగుణం వల్ల పొందే పుణ్యం కూడ అంతే ఉంటుంది.

ఇది పిల్లలూ కశ్యప మహర్షి కథ!

కశ్యప మహర్షి నాగజాతికి, పక్షిజాతికి, రాక్షసులకి, దేవతలకి కూడా తండ్రిగా ఉండి సాక్షాత్తూ విష్ణుమూర్తికీ తండ్రి అయి ఎంత గొప్పవాడయ్యాడో చూశారా ? పరమశివుడి తల మీద ఉన్న గంగను కూడ భూమి మీదకి తెచ్చి ప్రజలకి ఎంతో మేలు చేశాడు.

# 21. కపిల మహర్షి

**రం**డి పిల్లలూ... వచ్చేశారా.. ఇపుడు మనం కపిల మహర్షి గురించి చదువుదాం. చూశారా ! మీకు కూడా ఎంత ఇష్టం వచ్చేసిందో మహర్షుల గురించి తెలుసుకుందామని. మరి చదవడం మొదలుపెట్టండి.

కపిల మహర్షి ఎవరో తెలుసా? సాక్షాత్తూ శ్రీ మహావిష్ణువే!! ఇప్పుడు మనం ఆయన కథలోకి వద్దాం. పూర్వం అంటే కృతయుగంలో కర్దమప్రజాపతి అనే ఆయన సరస్వతీనదీ తీరంలో పదివేల సంవత్సరాలు తపస్సు చేశాడు. విష్ణుమూర్తి ప్రత్యక్షమై నీకు దేవహూతి అనే భార్యయందు తొమ్మిది మంది కూతుళ్ళు, నా అంశతో ఒక కొడుకు పుడతారని చెప్పాడు. కొంతకాలానికి కర్దమ ప్రజాపతికి తొమ్మిది మంది కూతుళ్లు పుట్టారు.

కర్దమప్రజాపతి భార్య దేవహూతిని పిలిచి నేను తపస్సు చేసుకుందుకు వెడుతున్నానని చెప్పాడు. అప్పుడు దేవహూతి స్వామీ ! ఆడపిల్లలకి పెళ్ళిళ్ళు చేసి వంశం ఉద్ధరించడానికి ఒక కొడుకుని ప్రసాదించి తరువాత తపస్సు చేసుకుందుకు వెళ్ళండి అంది. విష్ణుమూర్తే నీకు కొడుకుగా పుడతాడు. కాబట్టి, నువ్వు విష్ణుమూర్తిని ప్రార్థించు అని భార్యకి చెప్పాడు. దేవహూతి కూడ భర్త చెప్పినట్లే భగవంతుణ్ణి ప్రార్థించింది.

కొన్నాళ్ళకి ఆమెకి ఒక కొడుకు పుట్టాడు. దేవతలు పుష్పవర్షం కురిపించారు. గంధర్వులు, కిన్నెరలు గానం చేశారు. అప్సరసలు నాట్యం చేశారు. బ్రహ్మదేవుడు, గొప్పగొప్ప మునులు అందరూ వచ్చి ఆ పిల్లాడిని చూసి కర్దమ ప్రజాపతికి దేవహూతికి ఆ పిల్లవాడు విష్ణుమూర్తి అవతారమేననీ, అతడు కపిల మహర్షిగా ప్రసిద్ధి కెక్కుతాడనీ చెప్పి మరీచి అనే ఒక మునిని అక్కడ ఉంచి తిరిగి వెళ్ళిపోయారు.

కొంతకాలమయ్యాక ప్రజాపతి తన కూతుళ్ళకి మహర్షులతో పెళ్ళిళ్ళు జరిపించాడు. ఒకనాడు కపిల మహర్షిని పిలిచి మహాత్మా ! భగవంతుడవైనా నువ్వు నా యింట్లో నాకు కొడుకుగా పుట్టావు. నాకు ఇంతకన్న భాగ్యం మేముంటుంది? ఇంక నేను తపస్సు చేసుకుందుకు వెళ్ళిపోతున్నాను అన్నాడు.

కపిల మహర్షి – “నేను ఈ మునివేషంలో పుట్టింది నాకోసం కాదు మునులందరికి భగవంతుడి గురించి తెలియచెప్పడానికే” అన్నాడు. నువ్వు కూడ నా మీదే దృష్టిపెట్టి తపస్సు చేసుకో, మోక్షం వస్తుంది వెళ్ళిరా... అని తండ్రి కర్దమప్రజాపతిని పంపించాడు.

దేవహూతి కొడుకుని రక్షించమని వేడుకుంటుంది. కపిల మహర్షి నీ మనస్సు సంసారం మీద పెట్టకుండా భగవంతుడి మీద పెట్టమని సాంఖ్య యోగం, భక్తి యోగం ఉపదేశం చేశాడు. దేవహూతి మోక్షం పొందిన చోటుని ‘సిద్ధిప్రద’ అంటారు.

కపిల మహర్షి ఒకసారి గోవుని అది వేదస్వరూపం అని తెలిసినా కూడా నిర్లక్ష్యంగా దాన్ని చూశాడు. సూర్యరశ్మి అనే ఒక ముని కపిల మహర్షికి వేదాలంటే అసలు ఏ భావం ఉందో తెలుసుకుందామని ఆవులో ప్రవేశించాడు. కపిలుడి ముందుకు వచ్చి వేదాలంటే చాలా గొప్పవంటారు కదా ! నీ అభిప్రాయం ఏమిటి అని అడిగాడు.

కపిలుడు నాకు వేదాల మీద సదభిప్రాయం లేదు అన్నాడు. భగవంతుణ్ణి మనస్సులో ప్రతిష్టించి, వాక్కుని పరిశుద్ధంగా ఉంచుకోవాలి, బ్రాహ్మణులు మాత్రం వేదోక్తంగా వాళ్ళ కర్మలని వాళ్ళు చెయ్యాలి. వేదపాఠకులు, వేదజ్ఞులు అవ్వాలి. అంటే వూరికే వేదాలు చదవడం కాదు, ఆచరించాలని చెప్పాడు. సూర్యరశ్మి కపిల మహర్షికి నమస్కారం చేసి వెళ్ళిపోయాడు.

పుండరీక మహారాజు వేటాడుతూ దాహం వేసి కపిల మహర్షి ఆశ్రమంలో వున్న ఒక సరస్సులో మంచి నీళ్ళు త్రాగి, అక్కడ పరుగులు పెడుతున్న లేడిని చూసి దాన్ని చంపాడు.

అది పరిగెత్తుతూ వెళ్ళి కపిల మహర్షి ముందు ప్రాణాలు వదిలింది. అది చూసి కపిలమహర్షి ఆ పుండరీకుణ్ణి మందలించాడు. నీ విలాసం కోసం నోరులేని జంతువును చంపావు. నీ శరీరం మీద నీకెంత ప్రేమ ఉందో దానికి కూడా దాని శరీరం మీద అంత ప్రేమ ఉండదా ? అని మందలించాడు.

పుండరీకుడు పశ్చాత్తాపంతో సిగ్గుతో ఆత్మహత్య చేసుకోబోయాడు. కపిల మహర్షి పుండరీకుణ్ణి ఆపి ఆత్మహత్మ మహాపాపమనీ, సంపదలు క్షణికమేననీ, పరులను హింసించడం పాపమనీ, గురువాజ్ఞతో గురువు చెప్పిన ప్రకారం నడుచుకోవాలనీ, అప్పుడే మోక్షం కలుగుతుందనీ చెప్పాడు.

పుండరీకుడు తన రాజ్యం, సంపదలూ వదిలేసి కపిల మహర్షిని, తనని శిష్యుడిగా చేసుకోమన్నా కపిల మహర్షి మాట్లాడలేదు.

పుండరీకుడు నీళ్లల్లో కూర్చుని ఆ పదమూడు రోజులు కపిల మహర్షిని గురించే తపస్సు చేశాడు. పధ్నాలుగో రోజు కపిలుడు పుండరీకుడికి కర్మ, భక్తి, వైరాగ్యం, జ్ఞానం మొదలయిన నాలుగు యోగాల గురించి బోధించాడు. పుండరీకుడు కపిల మహర్షి చెప్పిన విధంగా చేసి మోక్షాన్ని పొందాడు.

ఒకసారి సగర చక్రవర్తి ఎన్నో అశ్వమేధయాగాలు చేసి ఇంకా ఆశ తీరక మళ్ళీ ఇంకొక యాగం మొదలుపెట్టాడు. ఇంద్రుడికి అసూయ కలిగి ఆ గుఱ్ఱాన్ని నాగలోకం తీసుకువెళ్ళి కపిల మహర్షి ఆశ్రమం దగ్గర కట్టేసి వెళ్ళిపోయాడు.

సగరుడి కొడుకులు అరవై వేలమంది ఆ గుఱ్ఱం కోసం వెతుకుతూ వచ్చి కపిల మహర్షి ఆశ్రమం దగ్గర తమ గుఱ్ఱాన్ని చూశారు. వాళ్ళు కపిల మహర్షే తమ గుఱ్ఱాన్ని అక్కడ కట్టేసుకున్నాడని అనుకున్నారు. కపిల మహర్షిని చంపుదామనుకున్నారు. కపిల మహర్షి కళ్ళు తెరిచి చూశాడు. అంతే అరవై వేలమంది భస్మం అయిపోయారు.

అప్పుడు సగరుడి మనవడు అంశుమంతుడు గుఱ్ఱాన్ని వెతుకుతూ వచ్చి కపిల మహర్షికి నమస్కారం చేసి గుఱ్ఱాన్ని ఇమ్మని ప్రార్థించాడు. కపిలుడు తీసుకుపోయి మీ తాత యాగాన్ని పూర్తి చేయించు అన్నాడు. అంశుమంతుడు గుఱ్ఱాన్ని తాతకి ఇచ్చి యాగం పూర్తి చేయించాడు. కొంతకాలం తర్వాత భగీరథుడు గంగాజలాన్ని భూమిమీదకు తెచ్చినప్పుడు ఆ నీళ్ళు తగిలి సగరుడి కొడుకులు అరవైవేల మంది మళ్ళీ బ్రతికారు.

పూర్వం అశ్వశిరుడు అనే మహారాజు యాగాలు చేస్తూ బ్రాహ్మణులకి దానధర్మాలు చేస్తూ ఉండేవాడు. ఒకరోజు కపిల మహర్షి జైగీషవ్య మునిని తీసుకుని అశ్వశిరుడి దగ్గరకి వెళ్ళాడు. అశ్వశిరుడు కపిల మహర్షికి నమస్కారం చేసి స్వామీ! నేను విష్ణుమూర్తి అనుగ్రహాన్ని పొందాలంటే ఏం చెయ్యాలి? అని అడిగాడు.

కపిల మహర్షి రాజా ! నేనే విష్ణుమూర్తిని అన్నాడు. దానికి రాజు విష్ణుమూర్తి అంటే ఇలా ఉండడు గదా? శంఖం, చక్రం, గరుడవాహనం ఉంటాయి కదా. నువ్వే విష్ణుమూర్తివని నాకు నమ్మకం లేదు అన్నాడు. కపిల మహర్షి విష్ణుమూర్తి రూపంతో, జైగీషవ్య ముని గరుడవాహనంగా కనిపించారు. మళ్ళీ రాజు అనుమానంతో విష్ణుమూర్తి బ్రహ్మమనస్సులోంచి పుట్టినవాడు కదా! బ్రహ్మ నాభిలోంచి పద్మంతో పాటు పుడతాడు కదా! మరి నువ్వు అలాలేవేం? అన్నాడు. కపిల మహర్షి రాజుకి కావలసినట్లే కనిపించాడు. రాజు ఇంకా నమ్మకుండ ఇదంతా మోసం అనుకుంటాడు.

అప్పుడు సభలో ఆశీనులైన వారంతా మాయమయిపోయి క్రూరజంతువుల్తో ఆ సభ నిండిపోయింది. అప్పుడు రాజు భయపడి కపిల మహర్షిని ప్రార్థించాడు.

కపిల మహర్షి రాజుకి కనపడి రాజా ! నువ్వు విష్ణుభక్తుడవే కాని, విష్ణువు లోకం అంతా నిండిపోయి ఉన్నాడు అని అర్థం చేసుకోలేక పోతున్నావు. ఇంక అది తెలుసుకుని నీ కులానికి తగిన ధర్మాలు, వేదవిహితాచారాలు చేస్తూ విష్ణుమూర్తిని ధ్యానిస్తే నీకు మోక్షం వస్తుందని చెప్పి వెళ్ళిపోయాడు.

కపిల మహర్షి సాంఖ్యయోగాన్ని గురించి బోధించాడు. దీన్ని 'కపిలస్మృతి' అని కూడ అంటారు. దీంట్లో ఆయుష్షు క్షణికమని, సుఖదఃఖాలు కాలాన్ని బట్టి వస్తూ పోతూ

ఉంటాయని ఆత్మ అంటే నారాయణుడే అని, అత్మని తెలుసుకుని మోక్షం పొందాలని చెప్పాడు. వేద, శాస్త్ర పురాణాల్లో ఉన్నంత జ్ఞానం దీంట్లో ఉంది. మనం కొంచెం చిన్నవాళ్ళం కదా ! ముందు ముందు తెలుసుకుందాం.

కపిల మహర్షి భక్తియోగాన్ని గురించి కూడ చెప్పాడు. ఎప్పుడూ హింసతో కూడిఉన్న పన్లేచేస్తూ, ఈర్ష్య, అసూయ లాంటి చెడ్డ గుణాలు ఉండి భగవంతుడంటే భక్తి ఉన్నవాణ్ణి తామస భక్తుడు అంటారు. అన్ని రకాలయిన సుఖాలు అనుభవిస్తూ భక్తి కలిగి ఉండేవాణ్ణి రాజస భక్తుడు అంటారు. ఇతరుల కోసం భక్తుడయ్యేవాణ్ణి సాత్త్విక భక్తుడు అంటారు. అసలైన భక్తుడు భగవంతుడి గురించి వింటే చాలు భక్తితో పరవశించిపోతాడు. అతడే అసలయిన భక్తుడు, పరమ భక్తుడు అని చెప్పాడు.

కపిల మహర్షి ఒకసారి పశ్చిమ సముద్రతీరంలో పద్మాసనం వేసుకుని, కళ్ళుమూసుకొని ధ్యానంలో ఉన్నాడు. రావణాసురుడు ఈశ్వరుడి వల్ల వరం పొంది బలవంతుల్ని అందర్నీ చంపేద్దామని తిరుగతూ కపిల మహర్షిని చూశాడు. రావణుడి కంటికి కపిల మహర్షి చేతుల్లో ఆయుధాలతో వక్షస్థలం మీద లక్ష్మీదేవి, కళ్ళలో సూర్యచంద్రులు, ధాత, విధాత, రుద్రులు అందరూ కలిసి కనిపిస్తున్నారు. రావణుడు ఇందంతా ఋషులమాయేలే అనుకుని కపిల మహర్షిని కొట్టాడు. వేంటనే కపిల మహర్షి కూడ రావణుడ్ని ఒక దెబ్బ వెయ్యగానే రావణుడు మూర్ఛపోయాడు. కపిలుడు గుహలోకి వెళ్ళిపోయాడు.

రావణుడు తెలివొచ్చి మళ్ళీ గుహలోకి వెళ్ళాడు. కపిల మహర్షిని చూసి మహాత్మా! మీరెవరు? అని అడిగాడు. కపిల మహర్షి నోరు తెరవగానే రావణుడు విష్ణుమూర్తి విశ్వరూపం చూసి మహాత్మా ! మీ చేతిలో చచ్చిపోవడంకంటే నాకింకేం కావాలి? అనుగ్రహించండి అని కళ్ళు మూసుకున్నాడు. కపిల మహర్షి ఆ గుహలో మాయమైపోయాడు.

కపిల మహర్షి చరిత్రలో ఇలాంటి కథలు అనేకం వున్నాయి!

కపిల మహర్షి చెప్పిన సాంఖ్య యోగం, భక్తియోగం, ఇప్పటికి మనకి అందుబాటులో ఉన్నాయి. అవి చదివి ఆచరించి ముక్తిని పొందవచ్చు. మనం కూడ విష్ణుమూర్తి విశ్వరూపాన్ని చూడవచ్చు.

చూశారా ! మనలాంటి అజ్ఞానుల్ని ఉద్ధరించడానికి మనిషి రూపంలో పుట్టి, తపస్సు చేసుకుంటున్న ఎంతోమంది మునులకి జ్ఞానబోధ చేసి, ఎంతోమంది మహాత్ముల్ని మనకోసం ఈ భూలోకంలోకి పంపి, మనకి ధర్మంగా ఎలా బ్రతకాలో కపిల మహర్షి రూపంలో సాక్షాత్తు విష్ణుమూర్తే బోధించాడు.

ఎంతోమంది గొప్పవాళ్ళు పుట్టిన దేశంలో పుట్టిన మనంకూడ చాల గొప్పవాళ్ళం. అందుకేనర్రా! మనం ఎప్పుడు మంచిపన్లే చేద్దాం. నిస్సహాయులకి సహాయం చేద్దాం ! సరేనా !

# 22. కాత్యాయన మహర్షి

**మ**నం చదవబోయేది ఎవరి గురించో తెలుసా ? కాత్యాయన మహర్షి. ఇప్పటి వరకూ ఒక్కొక్క మహర్షిలో ఒక్కొక్క విశేషం గురించి తెలుసుకున్నాం. మరి కాత్సాయన మహర్షి దేనిలో గొప్పవాడో చదివి తెలుసుకుందాం. సరేనా ? ఇంక ఆలస్యమెందుకు చదివెయ్యండి మరి.....

పూర్వం పుష్పదంతుడు అనే మహాతపస్వి ఉండేవాడు. ఆయన ఎప్పుడు శివుణ్ణి సేవిస్తూ శివసేవకులలో మొదటివాడుగా ఉండేవాడు. కాని దేవి శాపంతో పుష్పదంతుడు బాధపడుతుంటే శివుడు దయతో "ఏది జరిగినా మన మంచికే జరుగుతుంది. నువ్వు భూలోకంలో ఒక బ్రాహ్మణుడికి కొడుకుగా పుట్టి శివభక్తి కలిగి మళ్ళీ నన్నే చేరుకుంటావు బాధపడకు" అన్నాడు.

పుష్పదంతుడు శివుడితో నీ పాదాలు వదలకుండ భక్తితో ఉండ గలిగినప్పుడు ఎన్ని జన్మలెత్తినా నేను బాధపడను అన్నాడు.

శాపకారణంగా పుష్పదంతుడు భూలోకంలో సోమదత్తుడు వసుదత్త అనే పేరు గల దంపతులకి కొడుకుగా పుట్టాడు. చక్కటి కాంతితో వెలుగుతున్న అతణ్ణి కాత్యాయనుడని వరుచి అని పిలిచేవాళ్ళు.

కాత్యాయనుడు పుట్టినప్పుడు ఆకాశవాణి ఇతడు శ్రుతధరుడు అనే పేరుతో వర్షుడికి శిష్యుడయి వ్యాకరణశాస్త్రాన్ని వృద్ధిలోకి తీసుకొస్తాడని చెప్పింది.

మనిషి నా పిల్లలు చాలా గొప్ప వాళ్ళయిపోవాలి, నాకు చాలా డబ్బు వచ్చెయ్యాలి, అని ఏవేవో ఆశలు పెట్టుకుంటాడు. కాని భగవంతుడు ఏమి చెయ్య దల్చుకున్నాడో మనిషికి తెలియదు కదా !

అలాగే కాత్యాయనుడు పుట్టిన అయిదు సంవత్సరాలకి సోమదత్తుడు చచ్చిపోయాడు. తల్లి వసుదత్త ఆ పిల్లవాణ్ణి పెంచుతోంది. కాని అతనికి ఉపనయనం చేసి ఏ గురువు దగ్గరైనా చదివించాలి కదా.... ఏంచెయ్యాలో తెలియక వసుదత్త బాధపడుతోంది.

అదే కాలంలో వేతసము అనే ఊళ్ళో ఇద్దరు అన్నదమ్ములు ఉండేవారు. వాళ్ళ పేర్లు దేవస్వామి, కరంభుడు. వాళ్ళిద్దరికి ఇంద్రదత్తుడు, వ్యాడి అని ఇద్దరు పిల్లలుండేవారు. అంతలో కరంభుడు చచ్చిపోయాడు. అన్నగారయిన దేవస్వామి కరంభుడు పోవడాన్ని తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నాడు. అన్నదమ్ములు ఇద్దరూపోయేసరికి వాళ్ళ భార్యలు కూడ సహగమనం చేశారు.

చిన్నవాళ్ళు ఇంద్రదత్తుడు, వ్యాడి అనాథలయిపోయారు కదా... వాళ్ళకేమో గొప్ప పండితులవ్వాలని చాలా ఆశ. అందుకని కుమారస్వామిని గురించి తపస్సు చేశారు. కుమారస్వామి ఆ పిల్లలిద్దరికి కనిపించి పాటలీపుత్రంలో వర్షుడు అనే గురువు దగ్గర మీరు విద్య నేర్చుకోండి, గొప్ప పండితులవుతారు అని చెప్పాడు.

ఆ పిల్లలిద్దరు పాటలీపుత్రం వెళ్ళి వర్షోపధ్యాయుడు ఎక్కడవున్నాడు అని అడిగారు. ఊరివాళ్ళు ఉపాధ్యాయుడి గురించి తెలియదు కాని, వర్షుడు అనే మూర్ఖుడు గురించి తెలుసు అన్నారు. ఆయన మూర్ఖుడో, పండితుడో ఎందుకు గానీ ఆయన ఇల్లు ఎక్కడవుంది? అనడిగి వాళ్ళింటికి వెళ్ళారు పిల్లలు.

ఒక చిన్న గుడిసెలాంటి ఇంట్లో వర్షుడు భార్యతో కలిసి వుంటున్నాడు. పిల్లలు అక్కడికి వెళ్ళి వర్షోపధ్యాయులవారి ఇల్లు ఇదేనా ? అని అడిగారు. వర్షుడి భార్య బయటికి వచ్చి పిల్లల్ని లోపలికి తీసుకువెళ్ళింది.

అమ్మా ! మేము వర్షుడి దగ్గర విద్య నేర్చుకుందుకు వచ్చాము. ఆయన్ని అందరూ మూర్ఖుడు అని ఎందుకంటున్నారు ? అని అడిగారు పిల్లలు.

వర్షుడి భార్య తన భర్తని గురించి వాళ్ళని ఇలా చెప్పింది. వర్షుడు, ఉపవర్షుడు అన్నదమ్ములు. ఉపవర్షుడు గొప్ప పండితుడు. వర్షుడు మాత్రం ఏమీ తెలియనివాడు. మమ్మల్ని ఉపవర్షుడు చాలాకాలం పోషించాడు. ఒకనాడు నేను నాభర్తని అవమానంగా మాట్లాడాను. దానికి ఆయన బాధపడి వెళ్ళిపోయి పరమేశ్వరుణ్ణి గురించి తపస్సు చేశాడు. ఆయనకి కుమారస్వామి కనిపించి శ్రుతధరుడు అనే శిష్యుడికి ఓంకారంతో ఎప్పుడయితే వేదం చెప్పడం మొదలుపెడతావో అప్పుడు నీకు సకల విద్యలూ వచ్చేస్తాయని చెప్పాడు. అందుకే శ్రుతధరుడు అనే శిష్యుడికోసం చూస్తున్నాము. నాయనా ! మీరు కొంచెం అతన్ని తీసికొస్తే మీరు కూడ అతనితో పాటే విద్యనేర్చుకోవచ్చు అని చెప్పింది వర్షుడి భార్య.

అప్పుడా పిల్లలు అమ్మా ! కుమారస్వామి చెప్పింది తప్పదు. మేమే శ్రుతధరుడు ఎక్కడ ఉన్న వెదికి తీసికొస్తామని చెప్పి ఆమెకి నమస్కారం చేసి బయలుదేరారు. వాళ్ళు తిరిగి, తిరిగి వసుదత్త ఇంటి అరుగు మీద కూర్చున్నారు.

ఆ ఊరికి నందుడు అనేవాడు నాట్యం చెయ్యడానికి వచ్చాడు. వసుదత్త కొడుకుతో నాయనా ! నీ తండ్రి ఉన్నప్పుడు నందుడు చేసిన నాట్యం చూసి అతనిని మన యింటికి పిలచేవాళ్ళం. ఇప్పుడు నాకు ఆ నాట్యం చూసే యోగం లేదని బాధపడింది. కాత్యాయనుడు నేను వెళ్ళి నాట్యం చూసి అంతా నీకు చేసి చూపిస్తాను అని తల్లిని ఓదార్చాడు.

ఇదంతా అరుగుమీద కూర్చున్న వ్యాడి ఇంద్రదత్తులు విని కాత్యాయనుడితో కలిసి నాట్యం చూడ్డానికి వెళ్ళారు. వచ్చాక కాత్యాయనుడు చూసింది చూసినట్లు తల్లికి చేసి

చూపించాడు. అతనే శ్రుతధరుడు అని తెలుసుకుని వసుదత్తకి చెప్పి ముగ్గురు కలిసి వర్షుడింటికి వచ్చారు. గురుపత్ని ఆనందంతో ఆ ముగ్గుర్ని గురువుగారికి నమస్కారం చెయ్యమని చెప్పింది. వాళ్లు అలా చెయ్యగానే వర్షుడు వాళ్లగురించి అడిగి తెలుసుకుని ఒక మంచి రోజు చూసి కుమారస్వామికి నమస్కారం చేసి విద్యాబోధన మొదలుపెట్టాడు. ఓంకారంతో చెప్పడం మొదలుపెట్టగానే వర్షుడు గొప్ప పండితుడయ్యాడు.

ఒకసారి చెప్పగానే కాత్యాయనుడు చెప్పేసేవాడు, అతడు ఏకసంతగ్రాహి. రెండుసార్లు చెప్పగానే వ్యాడి చెప్పేసేవాడు, అతడు ద్విసంతగ్రాహి. మూడుసార్లు చెప్పగానే ఇంద్రదత్తుడు చెప్పేసేవాడు, అతను త్రిసంతగ్రాహి. ఈ విధంగా వీళ్ళు ఒక సంవత్సరంలో మూడు వేదాలు నేర్చుకున్నారు.

పాటలీపుత్రం మహారాజు, వర్షుడు అనే గురువుగార్ని గురించీ ఆయన ముగ్గురి శిష్యుల గురించీ విని, వాళ్ళని రాజ్యానికి తీసుకువెళ్ళి గురువుగారికి కనకాభిషేకం చేశాడు. వాళ్ళకి చక్కటి ఇల్లు ఇచ్చి ఆ మహారాజు కూడ వర్షుడికి శిష్యుడయిపోయాడు.

గాంధార దేశంలో పాణి అనే పిల్లవాడొకడుండేవాడు. అతడు కూడ వర్షుడి దగ్గర శిష్యుడుగా చేరాడు. కానీ, అతనికి ఎంత చదివినా వచ్చేది కాదు. తప్పులు చెప్తుంటే మిగిలినవాళ్ళు నవ్వేవాళ్ళు. గురువుగారి భార్య పాణిని పిలిచి బాధపడకు గురువుగారు కూడ నీలాగే ఉండేవారు. ఆయనలాగే నువ్వు కూడ కుమారస్వామిని గురించి తపస్సు చెయ్యి. నీకు అన్ని విద్యలూ వస్తాయని చెప్పింది.

గురువుగారి భార్య చెప్పినట్లే తపస్సు చెయ్యడం మొదలుపెట్టాడు పాణి. గుహుడు ప్రత్యక్షమయి పంచాక్షరీ మంత్రం చెప్పి ప్రయాగ వెళ్ళి శివుణ్ణి గురించి తపస్సు చెయ్యమన్నాడు. శివుడు కరుణతో పాణికి వ్యాకరణ శాస్త్రాన్ని అనుగ్రహించాడు.

పాణి తిరిగివచ్చి కాత్యాయనుణ్ణి వ్యాడి ఇంద్రదత్తుల్ని కూర్చోపెట్టి వ్యాకరణం గురించి చెప్పాడు. కాత్యాయనుడు పాణి వాదించుకున్నారు. ఇలా ఏడు రోజులు వాదించుకున్నాక పాణి ఓడిపోయాడు. ఏడుస్తూ కూర్చున్నాడు. మళ్ళీ శివుడు కనిపించి నీకేం ఫర్వాలేదు మళ్ళీ వాదించు అన్నాడు. ఈ సారి కాత్యాయనుడు ఓడిపోయాడు.

ఒకరోజు పాణి గురువుగారికి శిష్యులకి వ్యాకరణం గురించి చెప్పాడు. శిష్యులు ముగ్గురూ వ్యాకరణంలో గొప్ప పండితులయ్యారు. పాణి గురువుగారి దగ్గర అనుమతి తీసుకొని వేరే చోట ఒక ఆశ్రమం ఏర్పాటు చేసుకుని అక్కడ శిష్యులకి పాఠాలు చెప్పుకుంటూ ఉండిపోయాడు.

కాత్యాయనుడు శివుడు గురించి తపస్సు చేశాడు. శివుడు కాత్యాయనుణ్ణి ఏంకావాలి? అని అడిగాడు. అతడు శబ్దశాస్త్రం కావాలి అన్నాడు. అలా శివుణ్ణి అడిగి

తీసుకున్న శబ్దశాస్త్రం సహాయంతో పాణి రాసిన వ్యాకరణశాస్త్రాన్ని వృద్ధి పరిచాడు కాత్యాయనుడు. దాంట్లో పాణి చెప్పనిదీ, చెప్పినదానికి ఇంకా చెప్పీ, ఇంకా చెప్పడానికి సాధ్యం కాకుండాను వ్యాకరణ శాస్త్రాన్ని రాశాడు.

ఇదంతా తెలుసుకున్న పాణికి కాత్యాయన మహర్షి మీద కోపం వచ్చి అతని దగ్గరకి బయలుదేరి వెళ్ళాడు. కాత్యాయన మహర్షి పాణికి ఎదురుగా వెళ్ళి తీసుకుని వచ్చాడు. కాని పాణి అసూయతో నీతల ఈ రాత్రికే ముక్కలు ముక్కలుగా అయిపోతుందని శపించాడు.

కాత్యాయన మహర్షి నేను శివుడి ఆజ్ఞ తీసుకుని ఈ గ్రంథాన్ని రాశాను. అదే నిజమయితే నువ్వు నాకిచ్చిన శాపం నీక్కూడ జరుగుతుంది అన్నాడు. చివరికి ఇద్దరూ ప్రాణాలు వదిలి శివలోకం చేరుకున్నారు.

శివుడు దేవి శాపం వలన పుష్పదంతుడు అనే శివసేవకుడు కాత్యాయనుడగా పుట్టాడనీ, అతని శాపం పోగొట్టడానికే తన తేజస్సుతో పాణిని పంపంచాననీ ఇద్దర్నీ తనదగ్గరే ఉంచుకున్నాడు శివుడు.

ఈ విధంగా శాపం వల్ల కలిగిన మానవ రూపం వదిలేసి మళ్ళీ శివసేవకుల్లో కలిసిపోయాడు "కాత్యాయన మహర్షి". ఇదర్రా ! కాత్యాయన మహర్షి కథ!!

ఈయన వ్యాకరణశాస్త్రం, కాత్యాయన స్మృతి, బుధకవచ స్తోత్రం మొదలయిన గ్రంథాలు రాశారు.

ఈ కథవల్ల మీకు ఏం తెలిసింది ? అంత గొప్ప తపస్సంపన్నులు, పండితులు అయి కూడ ఈర్ష్యవల్ల ఒకళ్ళని ఒకళ్ళు శపించుకుని మరణించారు. అందుకే మనిషికి అసూయ అనేది ఉండకూడదు. అది ఎంత గొప్పవాణ్ణయినా పతనం చేస్తుంది. అర్థమయిందా!! అందుకే అసూయని వదిలేద్దాం సరేనా !!

# 23. కామందక మహర్షి

**కా**మందక మహర్షి గొప్ప తపస్సు చేసి ధర్మాశాస్త్రాలన్నీ చదివేశాడు. వేదవిద్యలు నేర్చుకున్నాడు. ఆయనకి ధర్మతత్వజ్ఞుడు, నీతిశాస్త్రజ్ఞుడు అని మంచి పేరుంది.

కామందక మహర్షికి అంగరిష్ఠుడు అనే రాజు శిష్యుడుగా ఉండేవాడు. ఆ రాజు నాలుగు రకాలయిన పురుషార్థాల గురించి అంటే ధర్మం, అర్ధం, కామం, మోక్షం గురించి తెలుసుకుందుకే కామందక మహర్షికి శిష్యుడయ్యాడు.

మనం కూడ కొన్ని విషయాలు అర్ధం చేసుకోగలమేమో చూద్దాం. మంచిగా నడచుకోవాలి అంటే ఏమిటో అర్థం అవ్వాలి కదా! మనం పెద్దవాళ్ళం అయిపోతున్నాం.

ఇంక కొంతమందికి చెప్పి చేయించాలి. మనం చెయ్యాలి... అందుకే చదివి తెలుసుకుందాం. ఏదయినా మనకి తెలిస్తే కదా చెప్పగలుగుతాం. అందుకే చదివేద్దాం. తెలుసుకుందాం.. ఆచరిద్దాం... ఇంకెందుకు ఆలోచన కానియ్యండి.. చదవండి మరి !!

ఒకసారి అంగరిష్ఠుడు "మహాత్మా ! కామమోహాలు కలిగిన రాజు పాపాలు చేస్తే దానికి విరుగుడు ఏమయినా ఉందా ? ఏఏ మంచి పనులు చేస్తే చేసిన పాపాలు పోతాయి? తెలియకుండా చేసిన తప్పులకి ప్రాయశ్చిత్తం ఏమిటి ? ఇలా నాకు చాల అనుమానాలున్నాయి మీరే సమాధానం చెప్పాలి అనడిగాడు కామందక మహర్షిని.

కామందక మహర్షి చెప్పడం మొదలు పెట్టాడు. రాజా! ధర్మార్ధకామాలు ఒకదానికొకటి సంబంధం కలిగి ఉంటాయి. అర్ధమునకు మూలం ధర్మం, ఫలం, కామం వీటికి సంకల్పం కారణం . ఇక్కడ అర్ధం అంటే ధనం అనీ ధనాన్ని ధర్మంగా సంపాదించాలనీ, ధర్మకార్యాలు చేసినప్పుడు ఫలితాన్ని ఆశించకూడదనీ, సంపాదించిన ధనాన్ని ధర్మకార్యాలకే ఖర్చుపెట్టాలనీ చెప్పాడు.

ఇంకా ఇలా చెప్పాడు. రాజు అనే వాడు వేదాల్ని, బ్రాహ్మణుల్ని, ధర్మాన్ని పూజించాలి. 'క్షమ' అంటే ఓర్పు కలిగి ఉండాలి. సత్యాన్ని ఆరాధించాలి. ఎప్పుడూ రాజ్యంలో శాంతిని నెలకొల్పాలి. గురువు చెప్పిన దానిమీద నమ్మకం ఉండాలి. గురువు ఏం చెప్పినా వాదించకుండా వినాలి.

రాజా ! 'కామందక నీతిశాస్త్రము' అనే గ్రంథంలో ముప్పయి ఆరు ప్రకరణలతో ఇరవై సర్గలతో ఈ విషయాలన్నీ రాసి ఉన్నాయి. ఆ గ్రంధాన్ని చదవడం వల్ల ఇంకా తెలుసుకునేందుకు వీలవుతుంది అన్నాడు కామందక మహర్షి.

ఇంకా ఇలా చెప్పాడు. రాజు ఎప్పుడూ ప్రజలని సంతోషపెడ్తూ ఉండాలి. రాజ్యము అంటే ఏడు అవయవాలు కలది. అవి ఏమిటంటే 1. స్వామి అంటే రాజు. 2. మంత్రి 3. రాష్ట్రము 4. బలం 5. దుర్గం 6. మిత్రులు 7. కోశాగారం అంటే ధనం దాచేది బ్యాంకు లాంటిది అన్నమాట. ధనం ధర్మమార్గంలో సంపాదించి మంచి పనులకే ఖర్చు చెయ్యాలి. మంచి నడవడిక ఉన్నటువంటి రాజు వీటిని జాగ్రత్తగా చూసుకోవాలని చెప్పాడు.

రాజు పంచేద్రియాల్ని వశంలో ఉంచుకుని వినయంగా ఉండాలి. శబ్ద రూప, స్పర్శ రస గంధ అనేటువంటివి అయిదూ ఇంద్రియాలు చేసే పనులే. ఇవి నాశనానికి సహాయపడతాయి. శాఖాహారి అయిన జంతువు కూడ శబ్ద మాధుర్యం వల్ల నాశనమయిపోతుంది. పర్వతమంత ఉన్న ఏనుగు కూడా ఆడ ఏనుగు స్పర్శ వల్ల చెడిపోతుంది. దీపం యొక్క రూపాన్ని చూసి మిడత చచ్చిపోతుంది, గాలానికి కట్టిన మాంసపు ముక్కకి ఆశపడి చేప వలలో పడి చచ్చిపోతుంది. గంధం వాసన కోసం తుమ్మెదలు ఏనుగుల మీద

వాలి వాటి చెవుల దెబ్బలతో నశించిపోతాయి. ఏ ఒక్కటయినా ప్రమాదమే అయినప్పుడు, మనిషికి అన్నీ కలిసి ఎంత ప్రమాదమో ఆలోచించు అన్నాడు కామందక మహర్షి.

రాజా ! రాజు ఎప్పుడూ వేట, జూదము, పానము తప్పకుండా విడిచిపెట్టాలి. వీటికి బానిసలైన వాళ్ళు ఎంత గొప్పవాళ్ళయినా పాండురాజు, నలమహారాజు, యాదవులయిన సాంబాదులు ఎలా నాశనమయ్యారో నీకు తెలుసుకదా !

రాజా ! కామము, క్రోధము, మోహము, మదము, మాత్సర్యము కలిగిన వాళ్ళు ఎంతమందో నాశనమయిపోయారు. విద్యతోపాటు వినయం, న్యాయం, ధర్మం మొదలయిన మంచి లక్షణాలు కలిగిన రాజు మేలిమి బంగారంలా రాణిస్తాడు.

కామందక మహర్షి 'కామందకనీతిశాస్త్రం' అనేగ్రంథాన్ని రాశాడు. దాన్లో ప్రజల్ని పరిపాలించేవాడు ఎలా ఉండాలి అనేది చాలా బాగా వివరించాడు. అప్పుడయితే రాజులుండేవారు. కాని ఇప్పుడు పరిపాలన మారిపోయింది కదా....

ప్రజల్ని పరిపాలించేవాడు మహారాజు అయినా, ముఖ్యమంత్రి అయినా, ప్రధానమంత్రి అయినా, రాష్ట్రపతి అయినా పాలన అన్నది ఒకే విధంగా ఉంటుంది. కాబట్టి ఈ కామందక నీతిశాస్త్రం అప్పటి రోజుల్లోనే కాదు ఈ రోజుల్లో కూడ చక్కగా ఉపయోగపడుతుంది.

ఇది పిల్లలూ ! మనకు కామందక మహర్షి చెప్పింది. మనిషి మంచిగా ఉండాలి, డబ్బు ధర్మంగా సంపాదించాలి, మనం తిన్నాక మిగిలింది ధర్మకార్యాలకే ఉపయోగించాలి.

ప్రజాప్రతినిధి ప్రజల్ని పాలించడానికి అతనికి ఉండాల్సిన గుణాలు, మంచి మనిషి తెలిసీ తెలియక చేసే తప్పుల్ని ఎలా సరిదిద్దుకోవాలి అనే చాలా విషయాలు గురించి చెప్పాడు.

ఎక్కడైనా ఆ గ్రంథం దొరికితే చదవండి మరి. మనం టివిల ముందు కంటే గ్రంథాలయాల్లో ఎక్కువ సమయం గడిపితే చాలా విషయాలు తెల్సుకోవచ్చు. అవునా ! ఎందుకంటే రేపు మనమే కదా దేశానికి పెద్దలం.

# 24. కాశ్యప మహర్షి

**చూ**డండి ! మీకంటే ముందే నేను వచ్చేశాను. అంత నెమ్మదా ? రండి త్వరగా. అసలే మనం తెలుసుకోవలసిన మహర్షులు చాలా మంది ఉన్నారు. సరే, మరి ఇపుడు మనం తెలుసుకోబోతున్నది కాశ్యప మహర్షి చరిత్ర అన్నమాట. మొదలు పెట్టేద్దామా ....

కాశ్యపుడు కశ్యప ప్రజాపతి వంశంలో పుట్టాడు. కాశ్యపుడు ధర్మం, దయ, తేజస్సు అన్నీ ఉన్నవాడు. ఇంకా భూతదయ ఎక్కువ. ఆ కాలంలో పాముల బాధ ఎక్కువగా వుండేది. విషంతో భూప్రపంచాన్నే గడగడలాడించేవి. కాశ్యపుడు బ్రహ్మదేవుడు గురించి తపస్సు చేసి ఈ పాముల బాధనుండి సకలజీవులను రక్షించమని అడిగాడు. బ్రహ్మ కాశ్యపుడికి 'జీవసంజీవని' మంత్రాన్ని ఉపదేశించాడు.

అప్పటినుండి కాశ్యపుడు అన్నిరకాల జీవుల్ని రోగాల్నుంచీ, విషసర్పాల్నుంచీ రక్షిస్తున్నాడు. దయగల మనసున్న వాళ్ళకి ప్రపంచమంతా తమ కుటుంబమే అనిపిస్తుంది. లోకాలకి మేలు చేస్తూ కూడా కాశ్యపుడు తపస్సుని వదలకుండా బ్రహ్మర్షి అయ్యాడు.

పరిక్షిత్తు మహారాజు తక్షకుడు అనే పాము వలన చనిపోతాడని ఆరోజే చివరి రోజని రాజుని బ్రతికించాలని బయలుదేరాడు. దార్లో తక్షకుడు కన్పించి నువ్వు ఎవరినైనా బ్రతికించవచ్చునేమో గాని, నేను కరిచాక అతన్ని నువ్వు బ్రతికించలేవు అన్నాడు. కావాలంటే నేను ఈ మఱ్ఱి చెట్టుని కరుస్తాను, అవునో కాదో పరీక్షించుకో అన్నాడు తక్షకుడు. కాశ్యపుడు సరే కానివ్వు అదీ చూద్దాం ! అన్నాడు.

తక్షకుడు చెట్టుని కరిచాడు. అది కాలిపోయి బూడిదయింది. కాశ్యపుడు ఆ బూడిదని మళ్ళీ చెట్టుగా చేశాడు. తక్షకుడు చెట్టుని బ్రతికించావేమో గాని పరిక్షిత్తు మహారాజుని బ్రతికించలేవు అన్నాడు.

కాశ్యపుడు దివ్యదృష్టితో చూశాడు. ఆరోజుతో ఆయుష్షు అయిపోయిందని అది బ్రహర్షి శృంగి శాపమని తెలుసుకొని తక్షకుడి దగ్గర ధనం తీసుకుని వెనక్కి వెళ్ళిపోయాడు.

ఒకసారి ఒక సిద్ధుడు బ్రహ్మతేజస్సుతో వేరే సిద్ధులతో కలిసి ఒకసారీ, అంతర్ధానమై ఒకసారీ కనపడుతూ ఉంటే ఆయన దగ్గరకి వెళ్ళి మీరెవరని అడిగాడు కాశ్యపుడు. ఆ సిద్ధుడు నేను పుణ్యకార్యాలు చేసి ఎన్నో సుఖాలు అనుభవించాను కానీ కామక్రోధాలు నన్ను విడిచిపెట్టకపోవటం వలన మళ్ళీ చాలా మంది తల్లులకి పుట్టాను, చాలా మంది భార్యలతో కలిసి బ్రతికాను, పిల్లలు, మిత్రులు బార్యల వియోగాన్ని అనుభవించాను. ఇంక ఈ లోకాన్ని చూడ్డం నాకు ఇష్టం లేదు. బ్రహ్మానందం కోసం తిరుగుతున్నాను అన్నాడు.

కాశ్యపుడు సిద్ధుణ్ణి పరతత్త్వం గురించి చెప్పమని ప్రార్థించాడు. సిద్ధుడు "కుమారా! అంతా చెప్తాను విను. ధర్మకార్యాలు చేయాలంటే శరీరం కావాలి, అందుకే శరీరాన్ని అశ్రద్ధ చేయ్యకుండా రక్షించుకోవాలి. అదెలాగ ? అంటావేమో. ఇష్టమైన ఆహారాన్ని కొంచెంగా తినాలి. ఏది దొరికితే అది తినడం, ఒకేరోజు చాలా సార్లు భోజనం చేయటం, ఒకరోజు ఉపవాసం చేయడం, పగలు నిద్రపోవడం చేయకూడదు.

రోగాలతో చచ్చిన మనిషి కర్మఫలం అనుభవించడానికి మళ్ళీ పుడతాడు. మళ్ళీ కర్మలు చేస్తాడు. మళ్ళీ చస్తాడు. పాపం చేసిన జీవుడు నరకము, పుణ్యం చేసిన జీవుడు స్వర్గము అనుభవిస్తాడు. కానీ ఈ రెండింటికి అతీతమైన మోక్షాన్ని పొందలేడు. పుణ్యఫలం అయిపోగానే తిరిగి భూమిమీద పుడతాడు. ముక్తి పొందేవరకు జీవుడు ఇలా చస్తూ పుడుతూ ఉంటాడు.

ముక్తి ఎలా సంపాదించాలో చెప్తాను విను. దానము, శమము, దమము, బ్రహ్మచర్యం, పరుల ధనాన్ని, పరుల భార్యల్ని ఆశించకపోవడం, తల్లిదండ్రుల్ని గురువుల్ని పూజించడం, పితృదేవతల్ని అర్చించడం, ఇంద్రియ నిగ్రహం ఇలాంటివి కలిగి ఉంటే ముక్తిని పొందవచ్చు. లోకమంతా భగవంతుడే ఉన్నాడన్నది గ్రహించాలి.

పుణ్యాత్ముడు తనను తాను తెలుసుకుని, సుఖం క్షణికమని అన్ని పదార్థాలు నశించేవే అని తెలుసుకోవాలి. జన్మ మృత్యు జరావ్యాధులన్ని ప్రకృతి ధర్మాలని అవి కలిగినప్పుడు ఏకాంత ప్రదేశంలో కూర్చుని మనస్సు ప్రశాంతంగా పెట్టుకుని బాధల్ని వదిలివేయాలి.

"యోగి అయిన వాడు ఇంద్రపదవిని కూడా వదిలివేస్తాడు" అని చెప్పాడు సిద్ధుడు.

అంతా విని మహాత్మా ! మోక్షాన్ని పొందే ఉపాయాన్ని చెప్పమన్నాడు కాశ్యపుడు. "నాయనా ! దంతములు, జిహ్వ,కుత్తుక, తాలువు,కంఠనాళము, హృదయము వీటిలో మనసు ఎక్కడ ఆగుతుందో అక్కడే ఉంచితే మనస్సు ఆత్మని వెతుకుతుంది. ఆత్మ పంచేంద్రియాలకి కనపడదు. ఒక్క మనస్సే దాన్ని చూడగలదు. ఇదే బ్రహ్మవిద్యా రహస్యం", అని చెప్పి సిద్ధుడు అంతర్ధానమయ్యాడు.

'కాశ్యపస్మృతి' అనే గ్రంథంలో ఆహితాగ్ని లక్షణం, ఆవు మొదలైన జంతువుల్ని చంపితే ఏపాపం వస్తుందో, దానికి ప్రాయశ్చిత్తం ఏమిటో, పంచ మహాపాతకాలు, వాటి ప్రాయశ్చిత్తాలు ఏమిటో మొదలైనవాటి గురించి చెప్పబడి ఉన్నాయి.

కాశ్యప మహర్షి కథ వల్ల మనకి ధర్మకార్యాలే చేయాలనీ, దయకలిగి ఉండాలనీ, చెడు చేస్తే మళ్ళీ దాన్ని మనం అనుభవించక తప్పదనీ, మనం చేసే పనులను బట్టే తర్వాత జన్మలో మన పుట్టుక కూడ ఉంటుందనీ తెలుసుకున్నాం. ఆరోగ్యం కాపాడుకోవాలని తెలుసుకున్నాం. కాబట్టి మనందరం మంచి పనులు చేస్తూ ఆరోగ్యంగా ఆనందంగా ఉందాం సరేనా !

# 25. క్రతువు

బ్రహ్మమానసపుత్రుల్లో ఒకడు. దక్షప్రజాపతి కూతురు సన్నతికి అంగుళమంత ఆకారమున్న అరవై వేల మంది తపస్సంపన్నులైన వాలఖిల్య మహర్షులని అనుగ్రహించాడు.

# 26. కృత్సమద మహర్షి

రండి ! రండి! రండి ! దయచేయండీ ... మీరాక మాకెంతో ఆనందము సుమండీ... మనం చదవబోయేది కృత్సమద మహర్షి కథండీ, బ్రహ్మాండమైన కథ నిజంగా మీకు చాలా ఆనందంగా ఉంటుంది మొదలుపెట్టెయ్యండీ..

కృత్సమద మహర్షి శౌనక మహర్షి వంశంలో సునహోత్ర మహర్షికి పుట్టాడు. ఈయనకి ఇద్దరు అన్నలున్నారు. వాళ్ళ పేర్లు కాశుడు, శాల్ముడు. సునహోత్రుడి కొడుకు కనక ఈయన్ని సౌనహోత్రుడని కూడ పిలుస్తారు. బ్రహ్మచారి విప్రర్షి శ్రీమంతుడు అని కూడ పేరుపొందాడు.

కృత్సమద మహర్షి వేదవేదాంగాలు నేర్చుకుని అగ్ని దేవుణ్ణి వేదమంత్రాలతో స్తోత్రం చేశాడు. అగ్నిదేవుడికి ఇష్టమైన యజ్ఞం చేశాడు. సహృదయుడు, అనుపమ భక్తుడు అయిన కృత్సమద మహర్షి చేసిన యజ్ఞానికి అగ్ని ఆనందంతో మహర్షికి దివ్యశరీరం ఇచ్చాడు. అంటే ఏమిటో తెలుసా ? త్రిలోకాల్లో తిరగగల శక్తి, భూమిపైన ఆకాశంలోను గాలిలోను మూడు చోట్ల మూడు శరీరాలు ధరించి తిరగ్గలిగే శక్తినిచ్చాడు.

ఇంద్రుడికి ధుని, చుమురి అనే రాక్షసులు శత్రువులు. వాళ్ళు స్వర్గంలో రహస్యంగా తిరుగుతూ ఇంద్రుణ్ణి ఎలా చంపాలా అనే ప్రయత్నంలో ఉన్నారు. ఇంద్రుడితో సమానమైన తేజస్సున్న కృత్సమద మహర్షిని చూసి ఆ రాక్షసులిద్దరూ ఇంద్రుడనుకుని చంపబోయారు. వేదమంత్రాలతో ఇంద్రుడి గుణగణాలు చెప్పడం మొదలుపెట్టాడు కృత్సమదుడు. అవి విన్న రాక్షసులకి ఇంద్రుడంటే భయం పట్టుకుంది. అదే సమయంలో ఇంద్రుడు వచ్చి వాళ్ళని చంపేశాడు.

మునీంద్రా ! నువ్వు నాకు చక్కటి ప్రియమిత్రుడివి. నీకు ఏం కావాలో కోరుకో అన్నాడు ఇంద్రుడు. మహేంద్రా ! నీ కటాక్షం వల్ల నాకు సర్వైశ్వర్యాలు కలిగి, నామనస్సులో ఎప్పుడూ నువ్వు స్థిరంగా నిలచి జన్మజన్మలకి నీ పాదములందు భక్తి ఉండేటట్లు అనుగ్రహించమని చెప్పి ఇంద్రుణ్ణి తన ఇంటికి తీసుకువెళ్ళాడు. వేదమంత్రాలతో స్తోత్రం చేశాడు కృత్సమదుడు.

అదే సమయానికి ఇంద్రుడి గురువు బృహస్పతి అక్కడికి వచ్చాడు. మహర్షి ఇద్దరినీ వేరువేరుగాను, ఇద్దరినీ కలిపి వేదమంత్రాలతో స్తుతించాడు. ఇంద్రుడు, బృహస్పతి చాలా ఆనందపడి నీకంటే మేధావి ఇంకెవరున్నారు ! అని అభినందించారు .

ఒకసారి ఇంద్రుడు కృత్సమద మహర్షిని పరీక్షించడానికి పక్షిరూపంలో వచ్చి అతని భుజం మీద వ్రాలాడు. కృత్యమదుడు దివ్యదృష్టితో ఆ పక్షి ఇంద్రుడేనని తెలుసుకుని పక్షీంద్రుడుగా స్తుతించాడు. ఇంద్రుడు నిజరూపంలో కనిపించి మిత్రమా ! నువ్వు నిజంగా నాకు మిత్రుడవే. నువ్వు నాదగ్గరకి ఎప్పుడేనా రావచ్చు పోవచ్చు అని చెప్పాడు.

ఇంద్రుడు సహస్రవర్ష సత్రయాగం ప్రారంభించి బృహస్పతిని యాగం చేయించడానికీ ఆయనకి సహాయంగా కృత్సమద మహర్షిని ఉండమన్నాడు. కృత్సమద మహర్షికి అంత గౌరవప్రదమైన స్థానం దొరకడం చూసి అసూయ కలిగింది వరిష్ఠ మహర్షికి. చక్కటి ఉచ్చారణతో సామవేదం పఠిస్తూ యజ్ఞం చేయిస్తున్న కృత్సమదనుణ్ణి. వరిష్ఠుడు ఇంద్రుడు చేస్తున్న యజ్ఞానికి అపశృతులతో సామవేదాన్ని ఉచ్చరిస్తున్నావే పాపం వస్తుందని తెలియదా ? ఏదీ మళ్ళీ చెప్పు అన్నాడు.

అపస్వరాలు పలికితే పాపం నాదే అవుతుంది కదా... అయినా నేను సరిగానే చెప్తున్నాను అన్నాడు కృత్సమద మహర్షి. మళ్ళీ చెప్పమంటే చెప్పలేదు కాబట్టి నువ్వు నీకు

వచ్చిన విద్యలన్నీ పోయి తిండి నీళ్ళు దొరకకుండ అడవిలో క్రూరజంతువైపోతావు అని శపించాడు వరిష్ఠుడు. అదే అడవిలో వేలవేల సంవత్సరాలు అలాగే బ్రతుకుతావని కూడ వరిష్టుడు కృత్సమద మహర్షిని శపించాడు. కృత్సమదుడు వెంటనే క్రూరజంతువుగా మారిపోయి ఎదురుగా ఉన్న ఈశ్వరుడి పాదాలమీద పడిపోయాడు.

నువ్వు చదివిన సామవేదం తప్పులు లేవని కృత్సమద మహర్షిని మూమూలుగా మార్చి నీకు రోగం మరణం లేకుండా అన్ని దుఃఖాలకి దూరంగా శాశ్వతంగా ఉంటావని వరమిచ్చానన్నాడు ఈశ్వరుడు.

వరిష్ఠుడ్ని పిలిచి కృత్సమదనుడికి క్షమాపణ చెప్పమన్నాడు. దేవతలు మహర్షి మీద పూలవాన కురిపించారు. ఇంద్రుడు అభినందించాడు. వరిష్ఠుడు సిగ్గుపడి ఇకనుంచి స్నేహంగా ఉంటానన్నాడు.

కృత్సమద మహర్షి విఘ్నేశ్వర భక్తుడు. మానసికపూజ, బాహ్యపూజ చేసి భక్తులందరిలో మొదటివాడయ్యాడు. మహాయోగి, సంతతభక్తి సమన్వితుడు అయిన కృత్సమదుడు రోజుకి మూడుసార్లు విఘ్నేశ్వర పూజ చేసి తరించాడు.

కృత్తమద మహర్షి కథ చదివారు కదా! వినయ విధేయతలుంటే పెద్దవాళ్ళు మనల్ని మెచ్చుకుంటారు అసూయవల్ల ఎంత పెద్దవాళ్ళయినా దిగజారిపోతారు. అర్ధమయిందిగా. మనం మాత్రం ఎవర్ని చూసి అసూయపడద్దేం.

ఇంక పదండి తర్వాత మహర్షికి దగ్గరకి.

# 27. కౌశిక మహర్షి

**వ**చ్చారా! మనం ఇప్పుడు కౌశిక మహర్షి గురించి తెలుసుకుందాం... మొదలు పెట్టండి మరి.

కౌశిక మహర్షి పిప్పలాద మహర్షి వంశంలో జన్మించాడు. ఇతడు ఒక ముని కుమారుడు. వేద వేదాంగ విదుడు, ధర్మ శాస్త్రజ్ఞుడు, మహాజ్ఞాని అని పేరు పొందాడు. చిన్నతనంలోనే ఉపనయనం చేసుకుని ఎప్పుడూ జపం చేసుకుంటూ వుండేవాడు.

కౌశికుడు హిమవత్పర్వతానికి ఒక వైపు జపం చేసుకుంటూ వుండేవాడు. ఎండ, చలి అనుకోకుండా లాభనష్టాలు చూసుకోకుండా ఎప్పుడూ తపస్సులోనే గడుపుతూ ఉండేవాడు. అలా వేయి సంవత్సరాలు గడిచిపోయాయి.

విసుగు విరామం లేకుండా చేస్తున్న అతడి తపస్సుకి సావిత్రీదేవి ప్రత్యక్షమై ఏంకావాలని అడిగింది కౌశికుణ్ణి. కౌశికుడు మాట్లాడలేదు. ఎన్నిసార్లడిగా అతడు మాట్లాడలేదు. సావిత్రీదేవి కూడా కోపం తెచ్చుకోకుండా శాంతంగా ఉండిపోయింది.

తన జపం పూర్తయ్యాక గాయత్రీమాతకి నమస్కారం చేసి స్తోత్రం చేశాడు కౌశికుడు. అమ్మా! ఆదరించి నన్ను ఆశీర్వదించు అన్నాడు. నా జపనిష్ఠ పెరిగేటట్లు, నేను చేసే జపం నీకిష్టమయేటట్లు అనుగ్రహించమన్నాడు.

నాయనా! శాశ్వత బ్రహ్మప్రాప్తి కలుగుతుంది. ధర్మదేవత యమ కాల మృత్యువులు నీ దగ్గరకి వస్తారు. నీకు శుభం జరుగుతుంది అని కౌశికుడికి చెప్పి సావిత్రీదేవి అంతర్ధానమయింది.

జపంలోనే నూరు దివ్య సంవత్సరాలు గడిపాడు కౌశికుడు. జ్ఞానసిద్ధిని పొంది జ్ఞాన స్వరూపుడయ్యాడు.

ధర్మదేవత కౌశికుడి దగ్గరకివచ్చి నీ జపానికి నాకెంతో సంతోషంగా వుంది. నీకు ఏ పుణ్య లోకం కావాలో కోరుకో అక్కడికి పంపిస్తానన్నాడు.

నేను శరీరం విడిచి ఎక్కడికీ వెళ్ళనన్నాడు కౌశికుడు.

ఈ శరీరం శాశ్వతం కాదు. దీని మీద మోహం విడిచిపెట్టు. పుణ్యలోకాలకి వెళ్ళు అన్నాడు ధర్మదేవత. ఇంకా ఇలా అన్నాడు. అంతా నీ యిష్టంకాదు. సమయం వచ్చినప్పుడు అందరూ వెళ్ళిపోవాల్సిందే! అదిగో యమ కాల మృత్యువులు వచ్చారు చూడమన్నాడు ధర్మదేవత.

యమ కాల మృత్యువులకి ధర్మదేవతకి నమస్కారం చేసి ఎవరికి కలగని భాగ్యం నాకు కలిగింది. మీ నలుగురి దర్శన భాగ్యం కలగడం నా అదృష్టం అన్నాడు కౌశికుడు.

ఇక్ష్వాకు మహారాజు కౌశికుడి దగ్గరకు వచ్చి ధనధాన్యాలేమైన కావాలా? అని అడిగాడు. నేను నీకిచ్చే వాడ్నే కాని నీ నుంచి తీసుకునే వాడిని కాదన్నాడు కౌశికుడు.

మహారాజు మునీంద్రా! నేను క్షత్రియుణ్ణి కాబట్టి యుద్ధం తప్ప ఇంకేది ఆశించను, అడగకూడదు కూడా. నువ్వు బ్రాహ్మణుడివి కనుక నీకు ఏమన్నా కావాలంటే అడగవచ్చు. ఇది ధర్మం. నువ్వే అడుగు ఏంకావాలో అన్నాడు.

ఇద్దరూ ఇలా వాదించుకుంటూ చివరికి కౌశికుడు తనకు జపం వల్ల వచ్చిన ఫలాన్ని రాజుకిచ్చి, రాజు యాగఫలాన్ని తను తీసుకున్నాడు.

యమ కాల మృత్యువులు ధర్మదేవత ఇక్ష్వాకురాజుని, కౌశికుణ్ణి అభినందించారు. వాళ్ళిద్దరు ఆ నలుగురికి సాష్టాంగ నమస్కారం చేశారు. దేవతలు, ఇంద్రుడు లోకపాలకులు అందరు వాళ్ళని అభినందించడానికి వచ్చారు.

పర్వతాలు, సముద్రాలు దేవర్షులు కూడా వచ్చారు. ఇదంతా విని విష్ణుమూర్తి కూడా వచ్చేశాడు. దేవతలు వీళ్ళందరి మీద పుష్పవర్షం కురిపించారు. అప్సరసలు నాట్యం చేస్తుండగా, తుంబుర నారదులు వీణ వాయిస్తుండగ, గంధర్వులు గానం చేస్తుండగ, జయ జయధ్వానాలు ఆకాశమంతటా వినిపించాయి.

కౌశికుడు ఇక్ష్వాకురాజు ఒకేసారి ఇంద్రియాల్ని అరికట్టి అయిదు వాయువులు మనసులో నిలిపి, అక్కడ నుంచి భ్రూమధ్యానికి చేర్చి యోగబలంతో మొదట కౌశిక మహర్షిలోంచి తేజస్సు బ్రహ్మరంధ్రం నుంచి బయటకి వచ్చి, తనలాగే వచ్చిన ఇక్ష్వాకురాజు యొక్క తేజస్సుకి స్వాగతం చెప్పి రెండు తేజస్సులు కలిసి బ్రహ్మదేవుడి ముఖంలో ప్రవేశించాయి.

అక్కడ ఉండి ఇదంతా చూస్తున్న దేవతలు, దేవర్షులు దిక్పాలకులు ఉత్తమగతులంటే ఏమిటో తెలుసుకున్నామని ఆనందించారు.

బ్రహ్మ అక్కడున్న వాళ్ళందరితో కౌశిక ఇక్ష్వాకురాజులు బ్రహ్మసాయుజ్యం పొందడాన్ని చూసిన మీరు కూడ ధన్యులయ్యారు. మీకు శుభవవుతుందని చెప్పాడు.

చూశారా! కౌశిక మహర్షి సావిత్రీదేవి ఉపాసన చేసి గొప్ప బ్రహ్మర్షి అవడమే కాకుండా బ్రహ్మలోనే లీనమయ్యాడు.

ఇదర్రా! కౌశిక మహర్షి కథ !!

# 28. కండు మహర్షి

**పి**ల్లలూ ! ఇంత తొందరగా వచ్చేశారా ! రండి రండి ! నాకంటే ముందే వచ్చేశారే... అంటే మీకు ఋషుల చరిత్రలంటే అంత ఇష్టంగా ఉందన్న మాట.... సరే మరి, ఇపుడు మనం కండు మహర్షి గురించి తెలుసుకుందామా....

కండుముని చిన్నప్పటి నుంచి గౌతమీ తీరంలో తపస్సు చేసుకుంటూ ఉండేవాడు. ఆయన ఆశ్రమం పూల చెట్లతో, మంచి మంచి రుచిగల పండ్లతో చక్కటి లతలతో ఎప్పుడూ వసంతమాసంలా ఉండేది. అక్కడ జంతువులన్నీ ఒకదానితో ఒకటి స్నేహంగా ఉండేవి.

కండు మహర్షి తపస్సు చాలా కఠినంగా ఉండేది. ఆయన వేసవికాలంలో నిప్పుల మధ్య కూర్చునీ, శీతాకాలంలో చల్లటి నీళ్ళల్లో కూర్చునీ తపస్సు చేశాడు. ఆయన తపస్సుకి దేవతలు, గంధర్వులు, సిద్ధులు, విద్యాధరులు అందరూ ఆశ్చర్యపోయారు. ఈయన తపస్సు గురించి విని ఇంత ధైర్యం, ఇంత నిష్ఠ, ఇంత నియమం ఎక్కడా, ఎప్పుడూ చూడలేదని మూడు లోకాల్లోనూ చెప్పుకునేవారు.

తన స్థానం ఎవరు తీసేసుకుంటారోనని మన ఇంద్రుడికి ఎప్పుడూ భయమే కదా! కండు మహర్షి తపస్సుకి భయపడి ప్లమోచన అనే పేరుగల దేవవేశ్యని వెళ్ళి కండు మహర్షి తపస్సుని భగ్నం చెయ్యమన్నాడు ఇంద్రుడు. ఆయన చెప్పినట్లు చెయ్యకపోతే శపిస్తాడని భయం కదా...! అక్కడికీ ప్లమోచన నాకన్న బాగా ఆడిపాడేవాళ్ళు ఉన్నారు కదా, వాళ్లని పంపించండి అంది. ఇంద్రుడు నువ్వే వెళ్ళు నీకు తోడుగా కామం, వసంతం,

చక్కటి చల్లగాలుల్ని పంపిస్తాను పని పూర్తిచేసుకుని రా! అని చెప్పాడు. ఇంకేం చేస్తుంది. ప్లమోచన బయలుదేరి భూలోకానికి వచ్చింది.

ప్లమోచన ఆశ్రమంలో అడుగుపెట్టగానే వసంతం వచ్చేసింది. చెట్లన్నీ పువ్వులతో నిండిపోయి కిందపడి నేలంతా పూలు పేర్చినట్లయ్యింది. ఇంక మన మన్మథుడున్నాడుగా ఆయన కండు మహర్షి మీద బాణం వేశాడు. కండు మహర్షి కళ్ళు తెరిచి చూశాడు. ఇంకేముంది తపస్సు మానేసి మాయలో పడిపోయాడు.

కండు మహర్షి ప్లమోచనతో వందసంవత్సరాలు కలిసి ఉన్నాడు. చాలాసార్లు ప్లమోచన నేను దేవలోకం నుంచి వచ్చాను. నేను దేవవేశ్యని, నన్ను పంపించెయ్యండి అని చెప్పింది. కాని కండు మహర్షి వినలేదు. కొంతకాలం పోయాక కండు మహర్షి యోగదృష్టితో చూసి ప్లమోచనని నా తపస్సు నాశనం చేశావు, అయినా, నీ తప్పులేదు, నువ్వు ఇంద్రుడు పంపితే వచ్చావు కాబట్టి శపించకుండా వదిలేస్తున్నాను. వెంటనే ఇక్కడ నుండి వెళ్ళిపో అన్నాడు.

కండు మహర్షి ప్రమోచనలకి కలిగిన అమ్మాయి పేరు మారిష. ప్రచేతనుడు మారిషని పెళ్ళి చేసుకున్నాడు. వాళ్ళిద్దరికి పుట్టినవాడు దక్షప్రజాపతి.

కండు మహర్షి ఇంద్రుడి మోసం తెలుసుకుని అక్కడినుంచి పురుషోత్తమ క్షేత్రం వెళ్ళి అక్కడ మళ్ళీ తపస్సు మొదలుపెట్టాడు. ఇంతకుముందు కంటే కఠినమైన తపస్సు చేశాడు.

శ్రీ మహావిష్ణువు ప్రత్యక్షమై కండు మహర్షిని ఏం వరం కావాలో కోరుకోమన్నాడు. కండు మహర్షి విష్ణుమూర్తిని అనేక విధాలుగా స్తోత్రం చేసి స్వామీ! ఈ సంసార సాగరం నుంచి తప్పించి పరమపదాన్ని చేరుకునేలా చెయ్యమని అడిగాడు. విష్ణుమూర్తి వరమిచ్చి అంతర్థానమయ్యాడు.

ఇదర్రా... కండు మహర్షి కథ!!

కండు మహర్షికి 'కంథు మహర్షి' అని పేరు కూడా ఉంది. చూశారా ! చిన్నప్పటి నుంచి తపస్సంపన్నుడయినా మధ్యలో వేశ్యమాయలో పడి మళ్ళీ తన తప్పు తెలుసుకుని పశ్చాత్తాపంతో మహా ఉగ్రమైన తపస్సు చేసి శ్రీహరి చరణాల దగ్గరికి చేరుకుని దివ్యపదివిని పొందాడు.

అంటే ఏమిటన్నమాట... తెలియక తప్పు చేసినా తెలిశాక పశ్చాత్తాపపడి, అయ్యో! తప్పుచేశానే అని బాధపడి, ఆ తప్పుని సరిదిద్దుకుని ఇంకెప్పుడూ తప్పులు చెయ్యకుండా అభివృద్ధిలోకి వెళ్ళడం చాలా గొప్పతనం.

మనం కూడ మనకి తెలియకుండా ఏమైనా తప్పులు జరిగితే తెలిసినప్పుడు తప్పునిసరిగా మనకి మనం సరిదిద్దుకోవాలన్నమాట !!

# 29. గర్గ మహర్షి

అమ్మయ్య ! వచ్చేశారా... మీకోసమే ఎదురుచూస్తున్నాను. ఇపుడు మనం తెలుసుకోబోయే మహర్షి పేరు గర్గ మహర్షి. భలే గొప్ప మహర్షి. మనిషి రూపంలో పుట్టిన దేవుళ్ళకే నామకరణం చేసిన మహర్షి. చదవండి మీకే తెలుస్తుందిగా.. మొదలుపెట్టండీ...

గర్గ మహర్షికి స్వయంగా శివుడే గురువు. గర్గుడికి అన్ని విద్యలు శివుడే నేర్పించాడు. గర్గుడు బ్రహ్మమానస పుత్రుడు. ఆయన దగ్గర వేలకు వేలు శిష్యులు వేదాలు, శాస్త్రాలు నేర్చుకునే వాళ్ళు. హైహయవంశం వాళ్ళు, యాదవులు ఇంకా ఎంతోమంది రాజులు గర్గుడిని కులగురువుగా పెట్టుకున్నారు.

ఒకసారి గర్గుడు శిష్యుల్ని తీసుకుని దేవకీ వసుదేవుల కోరిక ప్రకారం వ్రేపల్లె వచ్చాడు. యశోద కృష్ణుడికి పాలిస్తూ ఒక బంగారు ఆసనంమీద కూర్చుంది. శిష్యులతో సహా వచ్చిన గర్గ మహర్షిని చూసి యశోద సత్కారం చేసి కూర్చోమని చెప్పి మహర్షీ ! మీరెవరో గొప్ప తేజస్సుతో మనిషిరూపంలో ఉన్న విష్ణుమూర్తిలా ఉన్నారు. మీ పేరు చెప్తారా? అని అడిగి "స్వామీ ! ఈ చిన్ని కృష్ణుణ్ని దీవించండి" అంది యశోద.

గర్గుడు యశోదానందుల్ని చూసి తల్లీ ! నేను గర్గ మహర్షిని. మీకిద్దరికి ఏకాంతంలో నేను వచ్చిన పని చెప్తాను అన్నాడు.

గర్గుడికి సాష్టాంగ నమస్కారం చేసి చెప్పండి అని రహస్య మందిరానికి తీసికెళ్ళారు యశోదానందులు. గర్గ మహర్షి వాళ్ళతో కృష్ణుణ్ణి గురించి ఇలా చెప్పాడు. మీ యింట్లో ఉన్న ఈ చిన్నవాడు దేవకీ వసుదేవుల కొడుకు. రోహిణికి పుట్టినవాడు ఇతనికి అన్న అవుతాడు. కంసుడు చంపేస్తాడనే భయంతో మీకు పుట్టిన కూతుర్ని తీసికొని ఈ పిల్లవాడిని ఇక్కడ ఉంచారు. ఈపిల్లవాడు సాక్షాత్తూ నారాయణుడే! దుష్టుల్ని శిక్షించడానికి, శిష్టుల్ని రక్షించడానికి మనిషి రూపంలో పుట్టాడు నారాయణుడు.

రాధేశ్వరుడు, భార్గవీకాంతుడు, నలినాక్షుడు, నరనారాయణులు, కపిలుడు మొదలైన వారు విష్ణుమూర్తి అంశతో పుట్టినవాళ్ళే. అంతమంది కలిసి ఒకటిగా ఈ పిల్లవాడు పుట్టాడు.

ఇతడు పుట్టగానే నిజస్వరూపం దేవకీ వసుదేవులకి చూపించాడు. ఇతడు ప్రతియుగంలోనూ పేరు రంగు మార్పులతో పుడతాడు. కృతయుగంలో తెల్లగాను, త్రేతాయుగంలో ఎర్రగాను, ద్వాపరయుగంలో పీతవర్ణంతోను ఇపుడు కృష్ణవర్ణంతో కృష్ణుడు అని పిలవబడతాడు అని చెప్పాడు గర్గ మహర్షి.

ఈ కృష్ణ అనే పేరులో ఎంత గొప్పతనం ఉందో చెప్తాను వినండని గర్గ మహర్షి యశోదానందులకిలా చెప్పాడు. కకారం బ్రహ్మావాచకం, ఋకారం అనంతవాచకం, షకారం

శంకరవాచకం, ణకారం ధర్మవాచకం, అకారం విష్ణువాచకం, విసర్గం నరనారాయణ వాచకం. కృష్ణ నామం స్వరశక్తిమయం. ఈ పేరు పలకడం వల్ల మోక్షం కలుగుతుంది అని చెప్పాడు.

కృష్ణుడికి ఇంకా ఎన్ని పేర్లున్నాయో చెప్పాడు గర్గ మహర్షి. శ్రీకృష్ణుడు, పీతాంబరుడు, కంసధ్వంసి, విష్టరశ్రవుడు, దేవకీనందనుడు, శ్రీమంతుడు, యశోదానందనుడు, హరి సనాతనుడు, అచ్యుతుడు, విష్ణుడు, సర్వేశ్వరుడు, సర్వరూపధరుడు, సర్వాధారుడు, సర్వగతి, సర్వకారణకారుడు, పరిపూర్ణతముడు, పరబ్రహ్మ, గోవిందుడు, గరుడధ్వజుడు, రాధాబంధుడు, రాధికాంతరాత్మ, రాధికాజీవనుడు మొదలయినవి. ఈ పేర్లు వేదాల్లో కూడ ఉన్నాయనీ, ఈ పేర్లు పలకడం వల్ల పాపాలన్నీ పోతాయని చెప్పాడు గర్గ మహర్షి.

మనం చేసిన గొప్ప పనులకి మనలో ఉన్న లక్షణాలని బట్టి అన్ని పేర్లు వస్తాయి. మనమూ పెట్టేసుకోవచ్చు ఒక యాభై పేర్లు... పూర్వం పేరు వినగానే ఆ మనిషి ఎలాంటివాడో తెలిసిపోయేది. ఇప్పుడు సుభాషిణి అని పేరుందనుకోండి. చక్కగా మంచిమాటలే మాట్లాడుతుంది అని అర్థం. కానీ, ఆ అమ్మాయి నోరు విప్పిందో అన్ని తిట్లే ఉంటాయి. అలాగే సుగుణారావు అని ఉన్నాడనుకోండి అతడిలో ఉండేవి సుగుణాలు కావు, అన్ని దుర్గుణాలే ! ఇవి ఇప్పటి మనపేర్లు.

తల్లిదండ్రులు మంచి మంచి పేర్లు ఎందుకు పెడతారో తెలుసా ? ఆ పిల్లలు చక్కగా ఆ పేరులో ఉన్నంత గొప్పగా అవ్వాలని. పోనీ మనం అలా ఉండటానికి ప్రయత్నిద్దామా కష్టమేం కాదుగా ప్రయత్నించడం చెడ్డపనీ కాదు కాబట్టి ప్రయత్నించి చూద్దాం.

ఈ పిల్లవాడి అన్నపేరు బలరాముడు. రాధాకృష్ణులు గోలోకంలో ఉన్న శ్రీదామ రాధికలే! అని కృష్ణుడు చెయ్యబోయే అన్నీ పనుల గురించి విపులంగా చెప్పి జాతకర్మ, నామకర్మ, అన్నప్రాశన అన్ని చేయించాడు గర్గ మహర్షి.

గర్గ మహర్షి శ్రీకృష్ణుణ్ణి ఏకాంతంగా తీసుకువెళ్ళి ప్రదక్షిణ నమస్కారం చేస్తుంటే గర్గ మహర్షి శరీరం పులకరించింది. ఎదురుగా ఉన్నది చిన్నపిల్లవాడే అయినా విష్ణుమూర్తే కదా! తన మనస్సెప్పుడు విష్ణుమూర్తి పాదపద్మాల మీదే లగ్నం అయ్యేట్లు చూడమని కోరుకున్నాడు గర్గ మహర్షి.

గర్గ మహర్షి కొంతకాలం తపస్సు చేసుకుని కంసుడు కృష్ణుడి చేతిలో మరణించాక దేవకీవసుదేవుల దగ్గరకు శిష్యసమేతంగా వచ్చాడు. రామకృష్ణులకు ఉపనయనం చేసే వయస్సు వచ్చిందని, మంచి ముహూర్తం చూసుకుని కావలసిన సామగ్రిని సిద్ధం చేసుకుని తనకు కబురుపంపితే ఉపనయనం చేస్తానని చెప్పాడు.

కృష్ణుడు తలుచుకోగానే బంధుమిత్రులు, మహర్షులు, సర్వదేవతలు అందరూ వచ్చారు. గర్గ మహర్షి బలరామకృష్ణులకి ఉపనయనం చేసి సాందీపని మహర్షి దగ్గర వాళ్ళని శిష్యులుగా పంపించాడు.

హైహయవంశం వాడయిన కార్తవీర్యార్జునుడికి గొప్ప వైరాగ్యం వచ్చి రాజ్యం వదిలేసి తపస్సు చేసుకుందుకు వెళ్ళిపోతానన్నాడు. అతని కులగురువు గర్గుడు ఎంత చెప్పినా వినలేదు. అయితే నువ్వు దత్తాత్రేయుడి గురించి తపస్సు చెయ్యి అన్నాడు గర్గుడు.

కార్తవీర్యార్జునుడు దత్తాత్రేయుడి కోసం తపస్సు చేసి వరం పొంది ఆ గర్వంతో జమదగ్ని మహర్షి హోమధేనువుని తెచ్చేసుకున్నాడు. ఆ మహర్షిని హింస పెట్టవద్దని గర్గుడు ఎంత చెప్పినా వినలేదు కార్తవీర్యార్జునుడు. తర్వాత పరశురాముడి చేతిలో మరణించాడు.

ఒకసారి గర్గ మహర్షిని యాదవులు అవమానించారు. గర్గుడికి కోపం వచ్చి మూర్ఖులారా ! నావలన పుట్టిన కాలయవనుడు మిమ్మల్ని నానాబాధలు పెడ్తాడని శపించాడు. యాదవులు తమ తప్పు తెలుసుకుని బాధపడి బ్రతిమాలుకున్నారు. కృష్ణుడు మిమ్మల్ని రక్షిస్తాడని చెప్పాడు గర్గ మహర్షి.

యవనరాజు దగ్గర ఉన్న గర్గ మహర్షి తనకు సేవలు చేస్తున్న అప్సరసకి కాలయవనుడనే కొడుకుని ప్రసాదించాడు. తర్వాత గర్గుడు తపస్సు చేసుకుందుకు, అప్సరస తన లోకానికి వెళ్ళిపోయారు. యవన మహారాజు కాలయవనుడ్ని పెంచాడు. కాలయవనుడు యాదవుల్ని నానా బాధలు పెడ్తుంటే కృష్ణుడు అతడ్ని చంపేశాడు.

గర్గ మహర్షి "గర్గసంహిత" రాశాడు. ఖగోళశాస్త్రాన్ని రాసిన ఈయన జ్యోతిష్యంలో కూడ గొప్పవాడు.

ఇది పిల్లలూ ! గర్గ మహర్షి కథ !

గర్గ మహర్షి ఎంత గొప్పవాడో అర్థమయిందా? ధర్మప్రవక్తగా, వేదశాస్త్రాలు తెలిసిన వాడుగా, ఖగోళశాస్త్ర గ్రంథకర్తగా, జ్యోతిషశాస్త్ర పండితుడుగా ఎంతగొప్పవాడో చూశారా మరి....

స్వయంగా భగవంతుడికి జాతకర్మ, నామకరణం, ఉపనయనం, చేశాడంటే ఎంత గొప్ప పండితుడో !! చూద్దాం ! మీరు ఎవరెవరు ఎందులో గొప్పవాళ్ళవుతారో...! ప్రయత్నిస్తే కష్టమేమీ కాదు.

# 30. గౌతమ మహర్షి

ఇప్పుడు మనం గౌతమ మహర్షి గురించి తెలుసుకుందాం. ఈ మహర్షులందరూ ఒకరికంటే ఒకరు గొప్పవాళ్ళు. ప్రతీ మహర్షిలోనూ ఒక ప్రత్యేకతే. అందరూ వేల సంవత్సరాలు బ్రతికిన వాళ్ళే. మరి గౌతమ మహర్షి నుంచి మనం ఏం నేర్చుకోవాలో తెలుసుకుందామా?

గౌతమ మహర్షి బ్రహ్మమానసపుత్రులలో ఒకడు. విష్ణుమూర్తి ఒకసారి మోహిని వేషం వేసుకుని దేవతల్ని రాక్షసుల్ని మోహంలో పడేశాడు. ఈ మోహినిని చూశాక అందరికీ బ్రహ్మగారి సృష్టి చప్పగా అనిపించింది.

అందుకని అహల్యని సృష్టించి గౌతమ మహర్షికి సేవ చెయ్యడానికి పెట్టాడు. బ్రహ్మ అహల్యని గౌతముడికి ఇచ్చి పెళ్ళి చెయ్యాలని ఆయన కోరిక. కాని గౌతముడు మాత్రం పెళ్ళి చేసుకుంటానని అనలేదు. ఇంద్రుడు మొదలైన దేవతలందరు అహల్యని తమకిచ్చి పెళ్ళి చెయ్యమని బ్రహ్మని అడిగారు.

ఎవరు భూప్రదక్షిణం ముందుగా చేసి వస్తారో వాళ్ళకి అహల్యనిచ్చి పెళ్ళి చేస్తానని చెప్పాడు బ్రహ్మ. అందరూ భూప్రదక్షిణం మొదలుపెట్టారు. కానీ గౌతముడు తనకి సమీపంలో ఉన్న ఆవుకి ప్రదక్షిణం చేసి ఇదే భూప్రదక్షిణంతో సమానమని చెప్పాడు.

బ్రహ్మ ఇది నిజమేనని గౌతమ మహర్షికి అహల్యనిచ్చి పెళ్ళి చేశాడు. దేవతలందరూ ఇంద్రుడితో తిరిగివచ్చి అహల్యా గౌతముల్ని అభినందించి వెళ్ళిపోయారు. కష్టపడకుండా గౌతమ మహర్షి ఉపాయం చూశారా ! కానీ ఇంద్రుడికి మాత్రం అసూయే.

దండకారణ్యంలో గౌతమ మహర్షి చాలా కాలం తపస్సు చేశాడు. బ్రహ్మ ప్రత్యక్షమై గౌతముడు ఉన్నచోట భూమి ఎప్పుడూ సస్యశ్యామలంగా ఉంటుందని వరం ఇచ్చాడు.

తర్వాత శతశృంగగిరి అనే చోట ఒక పర్ణశాల కట్టుకుని గౌతముడు అతిథులకి చక్కటి భోజనం పెట్టడం మొదలుపెట్టాడు.

ఒకసారి భూభాగం అంతటా కరువు వచ్చింది. గౌతముడు ఉన్న ప్రాంతం తప్ప మిగిలిన చోట అందరూ ఆకలితో చచ్చిపోతున్నారు. కొంతమంది ఆకలికి ఆగలేక శవాల్ని తినేస్తున్నారు. కొంతమంది గౌతమ మహర్షి ఆశ్రమానికి వచ్చారు. వస్తున్న వాళ్ళందరికి అహల్య గౌతములు భోజనం పెట్టి కొత్త బట్టలు ఇచ్చారు.

అలా కొంతకాలానికి ప్రజలు తండోపతండాలుగా భార్యాపిల్లలతో కలిసి వచ్చి అక్కడే బ్రతికేస్తున్నారు. విఘ్నేశ్వరుడు గౌతముడి వ్రతం భంగం చెయ్యాలని అక్కడికి వచ్చి ఆ ఆశ్రమంలోనే ఉన్నాడు. ఆ ఆశ్రమం భూలోక స్వర్గంలా మారిపోయింది.

విఘ్నేశ్వరుడు గౌతమ మహర్షి సహాయంతో శివుడి జటాజూటంలో వున్న గంగను భూమి మీదకి తీసుకువస్తే అమ్మ పార్వతికి సవితిపోరు తప్పుతుందని అనుకుని బ్రాహ్మణులందరిని అక్కడ్నించి తీసుకుపోవడానికి ఉపాయం ఆలోచించాడు.

అహల్య చెలికత్తెని ఆవు రూపంలో గౌతముడి పొలంలో మెయ్యమని చెప్పాడు విఘ్నేశ్వరుడు. గౌతముడు ఒక గరిక తీసి దానిమీద వేశాడు. అది భస్మమయిపోయింది. గోహత్యా పాతకం చేశాడని బ్రాహ్మణులు, అసూయతో స్త్రీలు అహల్యాగౌతముల్ని నిందించారు.

బ్రాహ్మణుల్ని నాకు పాపం నుంచి విముక్తి ఎలా కలుగుతుందని అడిగాడు గౌతముడు. శివుణ్ణి మెప్పించి ఆయన జటాజూటంలో ఉన్న గంగను భూమిమీదకి తెస్తే ముక్తి కలుగుతుందని చెప్పారు బ్రాహ్మణులు.

గౌతముడు దివ్యదృష్టితో తనకి ఇలాంటి స్థితి ఎలా వచ్చిందని చూసి బ్రాహ్మణులు అసూయతో చేశారని తెలుసుకుని వాళ్ళని బండరాళ్ళుగా మారిపొమ్మని శపించాడు. వాళ్ళు గౌతముణ్ణి క్షమించమని అడిగారు. శ్రీకృష్ణుడు భూలోకంలో పుట్టాక మీ శాపం తీరుతుందని చెప్పాడు గౌతముడు. ఇంక విఘ్నేశ్వరుడు దైవకార్యం కోసం అడిగాడు కదా అని గంగను భూమిమీదకి తీసుకురావడానికి నిర్ణయించుకున్నాడు.

గౌతముడు అహల్యతో కలిసి హిమవత్పర్వతం మీద ఒంటి కాలిమీద నుంచుని శివుడి కోసం కఠోరతపస్సు చేశాడు. శివుడు ప్రత్యక్షమై ఏంకావాలో అడగమన్నాడు. గౌతముడు గంగాదేవిని భూమిమీదకి పంపించమని వేడుకున్నాడు.

గంగాదేవి ఆవు మరణించిన చోట ప్రవహించింది. ఆవు బ్రతికింది. బ్రాహ్మణులందరు గంగలో స్నానం చెయ్యడానికి వస్తే గంగ దూరంగా వెళ్ళిపోయింది. గౌతముడు మళ్ళీ గంగను బ్రతిమలాడి తీసుకువచ్చాడు. అప్పటినుంచి దానికి 'గౌతమి' అని పేరు. గోవుని బ్రతికించింది కాబట్టి 'గోదావరి' అనే పేరుతో ప్రవహించింది.

గౌతముడికి శతానందుడనే పేరు గల కొడుకు పుట్టాడు. అతనికి శరద్వంతుడని కూడా పేరుంది. అతడు పుట్టగానే తపస్సు చేసుకునేందుకు వెళ్ళిపోయాడు. తర్వాత గౌతముడికి ఇద్దరు కూతుళ్ళు పుట్టారు. ఆంజనేయుడి తల్లి అంజన గౌతముడి మొదటి కూతురు. రెండవ కూతురు ఉదంక మహర్షి బార్య.

అహల్య పెళ్ళి సమయంనుంచీ ఇంద్రుడు అహల్యమీద కోరిక పెంచుకున్నాడు. ఒకనాటి అర్థరాత్రి గౌతమాశ్రమానికి వచ్చి కోడిలా కూశాడు ఇంద్రుడు. గౌతముడు కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్ళాడు. ఇంద్రుడు గౌతముడి రూపంలో అహల్యతో గడిపాడు. అహల్య ఇంద్రుడని తెలియక గౌతముడే అనుకుని అతని కోరిక తీర్చింది.

ఇంకా తెల్లవారలేదని తిరిగి వచ్చిన గౌతముడితో అహల్య మహాత్మా ! మీరిక్కడే వున్నారుగా ! మళ్ళీ బయటనుంచి రావడం ఏమిటి? ఆశ్చర్యంగా ఉంది అంది.

ఇంద్రుడు పిల్లిలా వెళ్ళిపోదామనుకున్నాడు. పిల్లి వేషంలో ఉన్న ఇంద్రుడిని చూసి గౌతముడు మహాపతివ్రత అయిన అహల్యని మోసం చేశావు కాబట్టి నీవు మగాడివి కాకుండా పోతావు. నీ రాజ్యమంతా శత్రువులు ఎత్తుకుపోయి నీ ఇంద్రపదవి పోయి నువ్వు నాశనమయిపోతావు అని శపించాడు.

తెలియక ముట్టుకున్నా నిప్పు కాలకుండా ఉండదు కదా ! అలాగే తెలియక చేసినా తప్పు తప్పే. నువ్వు చైతన్యం లేని రాయిలాగా పడి ఉండమని శపించాడు అహల్యని.

అహల్య గౌతముడి కాళ్ళమీద పడి వేడుకుంది. శ్రీరాముడి పాదం తగలలగానే నీకు శాపవిముక్తి కలుగుతుందని చెప్పాడు. ఇంద్రుడికి కూడ శాపవిమోచనం చెప్పాడు గౌతముడు.

కొంతకాలం తర్వాత ఇంద్రుడుకి మళ్ళీ ఇంద్రపదవి వచ్చింది. అహల్య కూడ శ్రీరామ పాదస్పర్శతో మామూలు మనిషిగా మారి గౌతముడి సేవలో ఉండిపోయింది.

గౌతమ మహర్షికి బ్రహ్మదత్త మహారాజు ప్రతిరోజు భోజనం పెడ్తున్నాడు. ఒకరోజు భోజనం చేస్తుండగా ఒక మాంసం ముక్క వచ్చింది. గౌతముడు బ్రహ్మదత్తుణ్ణి గ్రద్దవై పుట్టమని శపించాడు. బ్రహ్మదత్తుడు శాపం తీరే ఉపాయం చెప్పమని గౌతముణ్ణి ప్రార్థించాడు. రాముడి చెయ్యి తగలగానే నీకు శాపవిమోచనం కలుగుతుందని చెప్పాడు గౌతముడు.

గౌతమ మహర్షి "గౌతమ ధర్మసూత్రాలు" అనే గ్రంథాన్ని లోకానికి అందించాడు. అలాగే "న్యాయశాస్త్రం", "జ్యోతిషశాస్త్రం" కూడ రాశాడు.

ఇది పిల్లలూ ! గౌతమ మహర్షి కథ!!

గౌతముడు ఎంత గొప్పవాడో ఆయన భార్య అహల్య కూడ అంత గొప్ప ఇల్లాలు, మహాపతివ్రత.

# 31. గౌరముఖ మహర్షి

రండర్రా... రండి! ఇపుడు మనం గౌరముఖ మహర్షి గురించి తెలుసుకుందాం. ఇంతమంది గొప్పగొప్ప మహర్షుల గురించి తెలుసుకుంటుంటే ఏమనిపిస్తోంది మీకు?

అమ్మో ! మనది ఇంత గొప్ప దేశమా ! మనం ఈ దేశంలో పుట్టడం వలన ఎంత అదృష్టవంతులమో అనిపిస్తోంది కదూ... పరవశంలోంచి బయటికి రండర్రా... గౌరముఖ మహర్షి దివ్యచరిత్ర మొదలుపెట్టండి మరి.

గౌరముఖుడు శమీక మహామునికి ప్రియశిష్యుడు. సమస్త వేదశాస్త్రాలు శమీకుడి దగ్గర నేర్చుకున్నాడు. గొప్ప తపశ్శాలి కూడా. విద్య పూర్తయ్యాక గురువు అనుమతి తీసుకుని వేరొక చోట ఆశ్రమం నిర్మించుకుని ముని కుమారులని శిష్యులుగా చేసుకుని ఉంటున్నాడు.

గౌరముఖ మహర్షి ఆశ్రమం అద్భుతంగా ఉంది. ఎలా ఉందో చెప్పనా ? మీకు కూడా బాగా నచ్చుతుంది నిజంగా తెలుసుకోవలసిందే.

ఆ పుణ్యాశ్రమం మోక్షలక్ష్మికి పుట్టిల్లైన అమృతంతో నిండిన సముద్రంలా ఉంది. గురువు యజ్ఞం చేస్తున్నప్పుడు శిష్యులు వెళ్ళి సమిధలు కావాలి అంటే చెట్ల కొమ్మలే అందిస్తాయి. చెట్టు నీడల్లో కూర్చుని శిష్యులు వేదపారాయణ చేస్తూ ఎక్కడైనా మర్చిపోతే అక్కడి చిలుకలు అందిస్తాయి. అక్కడి కోయిలలు వాటి చక్కటి స్వరాలతో దేవతల్ని ఆహ్వానిస్తాయి. బెదిరిపోయి పారిపోతున్న లేడిపిల్లలకి మునిభార్యలు లేతగడ్డి నోటికి అందిస్తారు. అక్కడి చెట్లు ఆకులు ఎక్కడ ఉపయోగించకుండా పోతాయో అని అసలు ముదరవు.

అక్కడి పువ్వులు పూజ మొదలు పెట్టబోయే ముందు పూస్తాయి. ఋషుల భార్యలు ఆరేసుకున్న చీరలు చిరిగిపోతాయేమో అని వాళ్ళు చీరలు తీసుకునేవరకు చెట్లు కదలవు. అక్కడి మునులు ఎప్పుడూ అగ్నిలా ప్రకాశిస్తూ, అందరూ స్నేహంగా గొప్ప తేజస్సుతో ఉన్నారు. వాళ్ళకి గౌరముఖ మహర్షే పెద్ద గురువు, దైవం కూడా.

గౌరముఖ మహర్షి అందమైన జడలు కట్టిన జుట్టుతో, శరీరమే సత్త్వగుణమేమో అన్నట్లు విభూతి నిండిన శరీరంతో, ఆపకుండా చేసే మంత్ర జపంతో, మెడలో రుద్రాక్షమాలతో, కౌపీనం కట్టుకుని ప్రక్కన కమండలం, దండం పెట్టుకుని చెట్టునీడన కూర్చుని శిష్యులకి పరతత్త్వాన్ని గురించి చెప్తూ ఉన్నాడు.

ఒకనాడు దుర్జయ మహారాజు వేటాడి అలసిపోయి గౌరముఖుడి ఆశ్రమానికి వచ్చి సాష్టాంగనమస్కారం చేశాడు. గౌరముఖుడు ఆ రాజుకి సత్కారాలు చేసి కొంచెం ఆగి సేదతీరి వెళ్ళమన్నాడు. రాజు నా సైన్యంతో ఎక్కడ ఉండాలి అని అడిగాడు.

గౌరిముఖ మహర్షి గంగలో స్నానం చేసి విష్ణువుని ప్రార్థిస్తే విష్ణుమూర్తి ప్రత్యక్షమై ఒక మణినిచ్చాడు. అది ఆశ్రమానికి తీసుకువచ్చి పూజ చెయ్యగానే అందమైన భవనాలతో ఒక నగరం ఏర్పడింది.

దుర్జయరాజు తన సైనికులతో అక్కడ విశ్రాంతి తీసుకున్నాడు. మర్నాడు ఉదయమే లేచి మహర్షికి నమస్కారం చేసి బయలుదేరాడు. వెంటనే నగరమంతా మాయమయిపోయింది.

అదంతా చూసిన దుర్జయమహారాజుకి అసూయ కలిగి ఎలాగయినా ఆ మణిని తీసేసుకోవాలని బుద్ధి పుట్టింది. ఒక సైనికుడ్ని పంపి గౌరముఖ మహర్షిని అడిగి ఆ మణిని తీసుకురమ్మన్నాడు.

గౌరముఖుడు సైనికుడ్ని మందలించాడు. రాజు సేనాపతిని పిలిచి సైన్యాన్ని తీసుకుని ఆశ్రమం వెనుకనించి మణిని తీసుకురమ్మన్నాడు. ఆ మణిలోంచి వేలకు వేలు సైనికులు వచ్చి వాళ్ళని చంపారు. దుర్జయరాజు తన దగ్గరున్న సేనతో తానే స్వయంగా యుద్ధానికి వెళ్ళాడు.

గౌరముఖ మహర్షి విష్ణుమూర్తిని ప్రార్థించాడు. విష్ణుమూర్తి తన చక్రంతో నిమిషంలో అందర్నీ చంపేశాడు. నిమిషంలో అందర్ని వధించాడు కాబట్టి ఆ ప్రదేశానికి 'నైమిషం' అని పేరు వచ్చింది. విష్ణుమూర్తి యజ్ఞపురుషుడుగా అక్కడే ఉండిపోయాడు. మహర్షి దిన చర్యలో ఉండిపోయాడు.

కొంతకాలం తర్వాత గౌరముఖ మహర్షి 'ప్రభాసం' అనే సోమతీర్థానికి వెళ్ళి విష్ణుమూర్తిని పూజ చేస్తుండగా మార్కండేయ మహర్షి అక్కడకి వచ్చాడు. గౌరముఖుడు ఆయన్ని సాదరంగా తీసుకొచ్చి దర్భాసనం మీద కూర్చోపెట్టి అతిథి పూజలు చేసి మహామహాత్మా! మీరు రావడం నాకు చాలా ఆనందంగా ఉంది. ఏం పనిమీద వచ్చారో చెప్పండన్నాడు.

మహర్షీ! మీకేమన్నా సందేహాలుంటే అడగండి చెప్తాను అన్నాడు మార్కండేయుడు. స్వామీ ! పితృదేవతలున్నారు అంటారు కదా ! వాళ్ళెవరు ? తెలియజెయ్యండి అన్నాడు.

మార్కండేయుడు ఇలా చెప్పాడు. మహర్షీ ! మొత్తం విశ్వానికి తండ్రి విష్ణువు. అతని వల్ల బ్రహ్మ పుట్టాడు. బ్రహ్మ ఏడుగురు ఋషుల్ని సృష్టించి తననే పూజ చెయ్యమన్నాడు. కాని వాళ్ళు ఆత్మలో పరమాత్మనే ధ్యానిస్తున్నారు. బ్రహ్మకి వాళ్ళ మీద కోపం వచ్చింది.

వాళ్ళకి బ్రహ్మ జ్ఞానం పోవాలని శపించాడు బ్రహ్మ. వాళ్ళు ఏడుగురు వంశోద్ధారకుల్ని కని స్వర్గానికి వెళ్ళిపోయారు. వాళ్ళకు పిల్లలు శ్రాద్ధకర్మలు చేశారు. వాళ్ళు దేవతలకి పితృదేవతలై నూఱు యుగాలు సనాతన లోకంలో ఉండి, మళ్ళీ బ్రహ్మవాదులుగా పుట్టి యోగసిద్ధిని పొంది యోగబలంతో యోగులందరికీ యోగాభివృద్ధి ఇస్తుంటారు. అందుకే వాళ్ళకి శ్రాద్ధం పెట్టాలి.

సప్తలోకాల్లోనూ పితృదేవతలుంటారు. భూలోకంలో ఉన్న ప్రజలు, భువర్లోకంలో ఉన్న పితృదేవతల్ని పూజ చేస్తారు. భువర్లోకం, సువర్లోకం, మహాలోకంలో ఉన్నవాళ్ళు జనలోకంలో ఉన్నవాళ్ళని పూజ చేస్తారు. జనలోకవాసులు, తపోలోకవాసులు సత్యలోకంలో ఉన్న పితృదేవతల్ని పూజ చేస్తారు. దీన్ని గురించి అంతకన్న వివరంగా చెప్పడం ఎవరికీ సాధ్యం కాదు అన్నాడు మార్కండేయుడు.

పితృదేవతల్ని ఎప్పుడెప్పుడు పూజ చెయ్యాలో చెప్తాను విను అన్నాడు మార్కండేయుడు. వ్యతీపాతము, ఆయనము, విషువత్తు, చంద్ర, సూర్యగ్రహణాలు సంక్రమణం మొదలైన పుణ్యదినాల్లోనూ, నక్షత్రగ్రహపీడలప్పుడు, కొత్త ధాన్యాలు ఇంటికి వచ్చినప్పుడు చెయ్యాలి. డబ్బు లేకపోతే తిలతర్పణం ఇస్తే చాలు. అదీ చాతకానప్పుడు ఒక ఆవుకి ఒక పూటకి సరిపడ గడ్డి ఇచ్చినా చాలు. అదీ చెయ్యలేనప్పుడు సూర్యుడు మొదలైన లోకాన్ని రక్షించేవాళ్ళకి ఏదయినా ఒక అడవిలాంటి ప్రదేశానికి వెళ్ళి చేతులు పైకెత్తి నమస్కారం పెట్టి గట్టిగా 'నావల్లకాదు' అని చెప్పినా చాలు అని చెప్పాడు.

ఇంకా మార్కండేయుడు ఇలా చెప్పాడు. పితృకర్మ చెయ్యడానికి యోగి యతి, శిష్యుడు, సోమయాజి, ఋత్విజుడు, సోదరి కొడుకు, అల్లుడు, మేనమామ అర్హులు. నపుంసకుడు, దొంగ, నిందితుడు, రోగి, ఆ గ్రామ యాచకుడు అర్హులు కాదు.

గౌరముఖుడు భృగువంశంలో వాడని చెప్పి అతడిని ఆశీర్వదించి విష్ణుమూర్తిలో ఐక్యమయ్యే విధానం చెప్పి వెళ్ళిపోయాడు మార్కండేయుడు.

మార్కండేయుడు చెప్పినవి శ్రద్ధగా విని చాలా సంవత్సరాలు పితృదేవతాపూజ చేసి శ్రీహరినే మనస్సులో తల్చుకుంటూ గొప్ప తపస్సు చేశాడు గౌరముఖుడు. ఒకనాడు కోటిసూర్యుల కాంతితో విష్ణుమూర్తి ప్రత్యక్షమై గౌరముఖ మహర్షిని తనలో ఐక్యం చేసుకున్నాడు.

గౌరముఖ మహర్షి కథ తెలుసుకున్నారు కదా! దీని వల్ల మీకేం తెలిసింది? మనం నిష్ఠగా శుద్ధిగా ఉండి మంచి మనస్సుతో ఉంటే మన చుట్టూ పరిసరాలు కూడా ఆహ్లాదంగా ఉంటాయి. మన మనస్సు కూడా సంతోషంగా ఉంటుంది. అసూయతో ఎదుటివాడికి ఉన్నదాన్ని చూసి ఏడుస్తే మనకు ఉన్నది నాశనం అయిపోతుంది. ఓంకార స్వరూపమైన పరమాత్మని మనస్సులో ఎప్పుడూ ధ్యానం చేస్తూ మన పనులు చేసుకుంటూ పోతే భగవంతుడు మనకి సహాయపడతాడు.

మార్కండేయుడు ఎంత బాగా చెప్పాడు. నాకు కూడా అనిపిస్తూ ఉండేదర్రా. ఇవాళ మాయింట్లో తద్దినం అనీ, పితృదేవతలకి పెట్టాలనీ అంటారేవిటి? చచ్చిపోయిన వాళ్ళంతా పైన కూర్చుంటారా ? అని, పితృదేవతల గురించీ, వాళ్ళకు తర్పణాలివ్వడం గురించీ తద్దినాలు అంటే వాళ్ళకి పూజచేసి నైవేద్యం పెట్టడమేననీ, వాళ్ళు కూడా దేవతలే అనీ, అది ఎవరు పెట్టచ్చు? ఎవరు పెట్టకూడదు? ఏఏ రోజుల్లో పెట్టాలి అనీ, ఎంత బాగా తెలిసేలా చెప్పాడో మార్కండేయ మహర్షి. పితృదేవతల్ని తృప్తిపరచడం వల్ల మనకి ఎంతో పుణ్యం. దాన్ని మాత్రం మానకూడదు. శక్తి లేని వాళ్ళు ఎలా చెయ్యచ్చు అన్నది కూడ వివరంగా మార్కండేయుడు గౌరముఖ మహర్షి ద్వారా మనకి తెలియజేశాడు.

చూశారా ! గౌరముఖ మహర్షి ఎంత భక్తుడో, ఎంత మంచి మనసున్నవాడో, ఎంతమందిని భక్తులుగా తీర్చిదిద్దాడో !! చివరికి విష్ణుమూర్తిలోనే ఐక్యం అయిపోయాడు. నిజంగా అద్భుతం ! కదూ !!

# 32. చ్యవన మహర్షి

**ఏ**మిటి పిల్లలూ ! మీకు బాగా ఇష్టంగా ఉన్నట్లుంది మహర్షుల గురించి తెలుసుకోవడమంటే. చూశారు కదా .... మన దేశంలో ఎంతమంది మహర్షులు తపస్సు చేశారో.... అయినా ఇంకా మనం తెలుసుకున్నది ఎంతగనక. ఆవగింజలో అరవయ్యో వంతు కూడా లేదు. మనం చక్కటి పుస్తకం ఎన్నుకున్నాం కదా ! మీకు ఆతృతగా వుందనుకుంటా మీ ముఖాల్లో కనిపించేస్తోంది. ఇంకెందుకు ఆలస్యం? ఇప్పుడు మనం చ్యవన మహర్షి గురించి తెలుసుకుందాం.

భృగు మహర్షి భార్య పులోమ అగ్నిహోత్రం సిద్ధం చెయ్యడం హోమానికి కావలసిన సామాన్లు ఏర్పాటు చేయడం చేస్తూ ఉండేది భర్తకి. ఆమె గర్భవతి. తనకు పుట్టబోయే కొడుకు గొప్ప బ్రహ్మర్షి అవాలని కోరుకుంటూ ఉండేది.

ఒకనాడు భృగుమహర్షి స్నానానికి వెడుతూ అగ్నిహోత్రం తయారు చెయ్యమని భార్యకి చెప్పాడు. అగ్నిహోత్రం వెలుగుతుండగా పులోముడనే ఒక రాక్షసుడు పులోమని

చూపించి ఈవిడ ఎవరు? అని అగ్నిదేవుణ్ణి అడిగాడు పులోమ అయితే ఎత్తుకుపోవాలనే ఉద్దేశ్యంతో. అగ్ని నిజం చెప్పకపోతే పాపం వస్తుందనీ, చెప్తే మహర్షికి కోపం వస్తుందనీ ఎటూ కాకుండా ఆవిడ భృగు మహర్షి భార్య అని చెప్పాడు. పులోముడు వెంటనే పందిరూపంలో ఆమెని ఎత్తుకుపోతుండగా పులోమ కడుపులోవున్న పిల్లవాడు క్రింద పడిపోయాడు. అలా పడిపోవడం వల్ల ఆ పిల్లవాడికి "చ్యవనుడు" అనే పేరు వచ్చింది. ఆ పిల్లవాడి తేజస్సు చూడగానే రాక్షసుడు భస్మం అయిపోయాడు.

జరిగిందంతా విని భృగుమహర్షి అగ్నిహోత్రుణ్ణి అతిక్రూరుడు, సర్వభక్షకుడు, అంటే కనిపించిందల్లా తినేసేవాడుగా అయిపొమ్మని శపించాడు. దేవతలందరూ భృగు మహర్షిని బ్రతిమాలి శాపం ఉపసంహరించుకునేలా చేశారు.

చ్యవనుడికి ఉపనయనం చేసి తపస్సు చేసుకునేందుకు పంపించాడు భృగువు. చ్యవనుడు కొన్ని వేల సంవత్సరాలు తపస్సు చేశాడు. అతని చుట్టూ పుట్టలు వచ్చేసి మనిషి ముసలివాడయిపోయాడు.

ఒకసారి సంయాతిరాజు భార్యనీ, కూతుర్నీ, సైన్యాన్నీ తీసుకుని ఆ ప్రదేశానికి వచ్చాడు. అతని కూతురు సుకన్య చాలా అందంగా ఉంది. అక్కడ తిరుగుతూ ఒక పుట్ట దగ్గర రెండు కళ్ళు మెరుస్తుంటే ఆ కళ్ళని పొడిచింది. ఆ కళ్ళు చ్యవనుడివి. చ్యవనుడికి కోపం వచ్చి సంయాతి సైన్యానికి మల మూత్రాలు బయటికి రాకుండా శపించాడు. రాజు భయపడి మహర్షి కాళ్ళమీద పడి తన కూతురు చేసిన తప్పుకి క్షమించమని అడిగాడు.

భవిష్యత్తు తెలిసిన వాడు కనుక చ్యవనుడు సుకన్యను తనకిచ్చి పెళ్ళి చెయ్యమని రాజునడిగాడు. రాజు సుకన్యని పిలిచి చ్యవన మహర్షిని పెళ్ళి చేసుకుంటావా? అనగానే సుకన్య అంతటి గొప్ప మహర్షి తన భర్తగా రావడం తన అదృష్టం అని ఈ పెళ్ళి తనకిష్టమే అంది. సంయాతి రాజు వాళ్ళిద్దరికి పెళ్ళి జరిపించాడు. భర్త ముసలివాడయినా సుకన్య చ్యవన మహర్షిని దేవుడుగా అనుకుని సపర్యలు చేస్తూ శరీరం తుచ్ఛమైందనీ, ఆత్మానందమే ముఖ్యమైందనీ తెలుసుకుంది.

ఇలా వుండగా అశ్వినీ కుమారులు సుకన్య అందాన్ని చూసి సుకన్య ఒంటరిగా వున్నప్పుడు, ఈ ముసలిమొగుడితో ఏముంటావు? నీ అందం అంతా అడవిగాచిన వెన్నెల అయిపోతోంది మాలో ఒకడిని కోరుకో అన్నారు. సుకన్య భర్తకి చెప్పి అతడు చెప్పమన్నట్లుగా నాకు నవయౌవనం ఉన్నవాడిని ఇమ్మని అడిగింది. వాళ్ళు దగ్గరే వున్న ఒక కొలనులో స్నానం చేసి నవయౌవనంతో వచ్చారు.

చ్యవనుడు కూడ వాళ్లతో ఆ కొలనులోనే స్నానం చేసి యౌవనంతో వచ్చాడు. సుకన్య చ్యవనుణ్ణి కోరుకుంది. అశ్వినీ కుమారులు సుకన్యతో నీ పాతివ్రత్యం పరీక్షించాలని ఇలా చేశామని చెప్పి వెళ్ళిపోయారు.

సంయాతి రాజు తన అల్లుడి ముసలితనం పోయిందని తెలిసి చూడడానికి సపరివారంగా వచ్చి కూతుర్ని అల్లుణ్ణి తన యింటికి తీసుకెళ్ళాడు. చ్యవనుడు మామగారి అభివృద్ధికి ఒక యజ్ఞం చేయిస్తానని చెప్పాడు.

మంచి ముహూర్తం చూసి చ్యవనుడు మామగారితో యజ్ఞం చేయించడం మొదలెట్టాడు. అశ్వినీ దేవతలకు ఇచ్చిన మాట ప్రకారం సోమపానమిస్తుంటే ఇంద్రుడు అడ్డుపడ్డాడు. చ్యవనుడు ఇంద్రుడ్ని పట్టించుకోకుండా అశ్వినీ దేవతలతో సోమపానం చేయించాడు.

ఇంద్రుడు చ్యవనుడ్ని చంపడానికి వజ్రాయుధం తీస్తుంటే అతని చెయ్యి అలాగే వుండిపోయేలా చేసి అగ్ని నుంచి ఒక రాక్షసుడ్ని పుట్టించాడు చ్యవనుడు.

ఆ రాక్షసుడు ఎలా వున్నాడో తెలుసా? చేతులు పదివేల ఆమడల పొడుగు, పెద్దపెద్ద కోరలు, సూర్యుడు, చంద్రుడు, ఎంత ఉంటారో అంతంత పెద్ద పెద్ద కళ్ళు, భయంకరమైన అగ్నిలా ఎర్రగా నోరు, భూమిని ఆకాశాన్ని కూడా అంటుకుపోతున్నంత శరీరంతో ఉన్నాడు. ఒక్కసారిగా నోరు తెరిచి ఇంద్రుడ్ని మింగెయ్యబోయాడు. వెంటనే ఇంద్రుడు చ్యవన మహర్షి కాళ్ళమీద పడి క్షమాపణ అడిగాడు. ఆ రాక్షసుడిని మద్యం తాగే వాళ్ళలోనూ, జంతువుల్లోనూ ఉండమని పంపేసి ఆ యజ్ఞం పూర్తి చేయించాడు చ్యవన మహర్షి. ఆ యజ్ఞం చేసిన ప్రదేశానికి 'అర్చీకపర్వతం' అని పేరు.

ఇంద్రుడు చ్యవనుడి మీద కోపంతో ఒక పర్వతాన్ని విసిరాడు. ఇంద్రుడిగారికి ఎప్పుడూ అహంకారం, గర్వం అనుకుంటాను. పాపం ఒకసారి దెబ్బతిన్నా తగ్గలేదు. మన మహర్షి గారు ఊరుకుంటారా! అసలే తపశ్శక్తి అమోఘం కదా ! వెంటనే కమండలం నుంచి నీళ్ళు తీసి ఆ పర్వతం మీద చల్లారు. అది తిరిగి ఇంద్రుడు మీదకి వెళ్ళింది. భయంతో ఇంద్రుడు కళ్ళు తిరిగి పడిపోయాడు. పాపం అమాయకుడులే అని మళ్ళీ మన మహర్షి గారే మొహం మీద నీళ్ళు చల్లి లేపితే ఇంద్రుడు సిగ్గుపడి అమ్మో ! ఈ మహర్షి జోలికి మాత్రం పోకూడదనుకుని వెళ్ళిపోయాడు.

చ్యవన మహర్షి సుకన్యతో నేను ముసలివాణ్ణయినా కూడా అసహ్యించుకోకుండా నాకు సేవలు చేశావు. నీకు ముగ్గురు పిల్లల్ని అనుగ్రహిస్తున్నాను అన్నాడు. ఆ ముగ్గురి పేర్లు దధీతి, ప్రమతి, ఆప్రవానుడు. మహాతపస్సంపన్నులయిన మహర్షులు మంచి ప్రవర్తన కలిగిన సంతానం కోసమే కదా సంసారం చేస్తారు.

కొంతకాలం తర్వాత చ్యవనుడు గంగా యమునా సంగమంలో నీటిలో మునిగి తపస్సు చేస్తుండగా, అందులో ఉన్న జంతువులు ఆయన చుట్టూ తిరుగుతూ ఉన్నాయి. కాని ఏమీ హాని చెయ్యలేదు. అక్కడి నీళ్ళు కూడా చ్యవన మహర్షికి ప్రదక్షిణం చేస్తున్నాయి. ఇలా పన్నెండు సంవత్సరాలు తపస్సు చేశాడు.

ఒకసారి జాలరులు అంటే చేపలు పట్టే వాళ్ళు వల విసిరి లాగి వలలో చిక్కుకున్న చ్యవన మహర్షిని చూసి భయపడిపోయారు. చ్యవనుడు ఫరవాలేదు, మీ కులవృత్తి మీరు చేసుకోవడంలో తప్పులేదు చేసుకోండి అన్నాడు. కాని వాళ్ళు భయంతో నహుషకి మహారాజు విషయం చెప్పారు. వెంటనే వాళ్ళని క్షమించమని అడిగాడు రాజు.

వాళ్ళ తప్పులేదు తనకి ధర కట్టి వాళ్ళకి ఇచ్చి వాళ్ళని పంపించెయ్యమన్నాడు మహర్షి. నహషుడు అర్ధరాజ్యం ఇస్తానన్నాడు, తన ధరకి చాలదన్నాడు మహర్షి. అయితే పూర్తి రాజ్యం ఇచ్చేస్తానన్నాడు నహుషుడు. అది కూడా తనకి తగిన ధర కాదని చ్యవన మహర్షి రాజుకి చెప్పాడు.

ఈలోగా కవిజాతుడనే ముని వచ్చి గోవయితే బ్రాహ్మణులతో సమానం కాబట్టి ఒక గోవునిమ్మని చెప్పాడు. నహషుడు గోవు యొక్క గొప్పతనాన్ని చ్యవన మహర్షి వల్ల తెలుసుకుని ఒక గోవుని తెచ్చి జాలరులకిచ్చాడు. వాళ్ళు తక్కువ వాళ్ళా...! మనం కూడ కొంచెం పుణ్యం సంపాయించుకుందాం, డబ్బు ఎంత వచ్చినా ఒకటే అని ఆ గోవుని చ్యవన మహర్షికిచ్చి నమస్కారం చేశారు. వాళ్ళకి స్వర్గలోకప్రాప్తి, నహుషుడికి ఇంద్రపదవి వచ్చేటట్లుగా మహర్షి ఆశీర్వదించాడు.

మునులు, దేవతలతో కలిసి కూర్చుని ఉన్న సమయంలో భృగు, కుశిక వంశాల్లో బ్రాహ్మణ, క్షత్రియ సంకరం వస్తుందని చెప్పాడు బ్రహ్మ. చ్యవన మహర్షి అది విని కుశిక వంశాన్ని నాశనం చేస్తే ఇంక ఆ రెండింటి మధ్య గొడవలేమీ వుండవు కదా అనుకుని కుశిక రాజుని పరీక్షిద్దామని వెళ్ళాడు. ఎన్నిరకాలుగా పరీక్షిద్దామనుకున్నా కుశికరాజు లొంగలేదు. ఆ రాజు భక్తికి వినయానికి మెచ్చుకుని నీ వంశంలో బ్రహ్మర్షి పుడతాడు అని చెప్పి ఆశీర్వదించాడు చ్యవనుడు. ఆయనే విశ్వామిత్రుడు.

చ్యవన మహర్షి నర్మదానదిలో స్నానం చేస్తుండగా ఒక పెద్ద పాము పాతాళలోకానికి లాక్కుని పోయింది. అక్కడ నాగకన్యలు ఆయనకి భక్తితో సేవచేశారు. పాతాళ రాజయిన ప్రహ్లాదుడు ఆ చ్యవన మహర్షిని చూసి ఇంద్రుడు నన్ను చంపి రమ్మని పంపించాడేమో అని అనుమానించాడు. కానీ, చ్యవన మహర్షిని చూశాక, నమస్కారం చేసి మహాత్మా ! మీరు చాలా నదుల్లో స్నానం చేసివుంటారు, ఏ ఏ నదుల్లో స్నానం చేస్తే పుణ్యమో చెప్పండని అడిగాడు.

చ్యవన మహర్షి రాజా ! నువ్వు విష్ణు భక్తుడివి. నువ్వడిగితే నేను చెప్పకుండా ఎలా ఉంటాను వినమని చెప్పడం మొదలుపెట్టాడు. మనస్సు పవిత్రంగా లేకుండా ఏ నదీస్నానం చేసినా ఉపయోగం ఉండదు. అలా చెయ్యడం వల్ల పాపమే గాని పుణ్యం రాదు. అసలు ఈ తీర్థయాత్రలకంటే సత్యం, భూతదయ, శుచిత్వం కలిగి ఉండటం ముఖ్యం. ఇవన్నీ ఉంటే వాళ్ళ పాదాల క్రిందకి అన్ని తీర్థాలు అవే వస్తాయి. అయినా

ముఖ్యమైనవి మూడు ఉన్నాయి. అవి నైమిశం, చక్రతీర్థం, పుష్కరం. ఈ మూడు భూలోకంలో పవిత్రమైన తీర్థాలని చెప్పాడు చ్యవన మహర్షి. ప్రహ్లాదుడు అన్నీ విని భక్తితో చ్యవన మహర్షిని ఆశ్రమానికి పంపించాడు.

చ్యవన మహర్షి కథ చదివారు కదా ! దీని వల్ల మనకి ఏం తెలిసింది ? మీరెవరైనా చెప్తారా ... నేను చెప్పేయనా? అసలు మన ఋషులలో వుండే గొప్పతనం ఏమిటో మీకు తెలుసా ! వాళ్ళు అహంకారం, మమకారం లేనివాళ్ళు. సర్వం తెలిసినవాళ్ళు. గొప్ప తపశ్శక్తి వున్నవాళ్ళు. కోపాన్ని జయించినవాళ్ళు.

ఇక్కడ మీకు నవ్వొస్తోంది కదూ. ఎప్పుడూ శాపాలిస్తూనే వుంటారు. వాళ్ళకి కోపం లేకపోవడం, రాకపోవడం ఏమిటీ? అని.

అదే అసలు రహస్యం. ఎదుటి వారిలో వుండే గర్వం, కోపం, అహంకారం ఇలాంటివన్నీ అణగ్గొట్టడానికి వాళ్ళు శాపాయుధాన్ని వాడతారు. మళ్ళీ వాళ్ళ ఆయుధాన్ని వాళ్ళు ఉపసంహరించుకునే శక్తి ఉన్న వాళ్ళు కదా ! వాళ్ళకి మనకి పోలికేంటి ? ఎంతగొప్ప వాడు కాకపోతే చ్యవన మహర్షి ఇంద్రుడంతటి వాడి గర్వం వదిలించాడు....??

# 33. జడ మహర్షి

**ర**ండి పిల్లలూ...! రండి రండి ! ఇపుడు మనం జడ మహర్షి గురించి తెలుసుకుంటున్నాం. ఆడపిల్లలూ ? మీరు జడలు చూసుకోకండి. మీ జడ కాదూ... ఏమిటంటున్నారూ... జడత్వమున్నవాడనా అసలు కానే కాదు. మరి వింతగా అనిపిస్తోందా... అదే మరి అసలు వింత. ఈ జడ మహర్షి మహాజ్ఞాని. అమ్మో ! చదవడం మొదలుపెట్టేశారా...... చాలా బావుంది. మీకు తెలుసుకోవాలన్న ఆతృత ఎక్కువయిపోయింది. కానివ్వండి.....

పూర్వం భార్గవుడనే బ్రాహ్మణుడుండేవాడు. ఆయన సమస్త వేద శాస్త్రాలు నేర్చుకున్నాడు. మంచి వాళ్ళకే మంచివాడు. ఈభార్గవుడి కొడుకే జడ మహర్షి.

జడ మహర్షి పుట్టాక ఆయనకి జాతకర్మ, చెవులు కుట్టించడం, ఉపనయనం లాంటి చెయ్యవలసినవన్నీ పూర్తిచేశాడు భార్గవుడు. ఒకనాడు కొడుకుని పిలిచి నువ్వు వెళ్ళి ఒక గురువుగార్ని ఆశ్రయించి విద్య నేర్చుకుని గృహస్థుడవై సంతానాన్ని కని వానప్రస్థాశ్రమానికి వెళ్ళి తపస్సు చేసుకుని అన్నీ పరిత్యజించి, నిర్మోహివి, నిర్జితేంద్రియుడివి నిరంకారివి, నిర్మత్సరుడివి, నిత్యోపవాసివి అయి జీవించమని చెప్పాడు.

కాని జడ మహర్షి మాట్లాడలేదు. తండ్రి చాలా సార్లు అడిగాక తండ్రీ ! నువ్వు చెప్పినవి చాలా జన్మల్లో చేశాను. నేను ఇప్పటికి అయిదువేల జన్మలెత్తాను. అన్ని రకాలయిన

దుఃఖాలు అనుభవించాను. పుత్ర, మిత్ర, కళత్ర, శత్రు, భ్రాతృ వియోగాలన్నీ అనుభవించాను. కొన్ని వేలమంది తల్లుల పాలు త్రాగాను. బాల్యం, యౌవనం, ముసలితనం అన్నీ నాకు తెలుసు. ఎన్నిసార్లో పుట్టాను. ఎన్నిసార్లో చచ్చాను. ఇప్పుడు నీకు కొడుకుగా పుట్టాను. నేను జ్ఞానినై పుట్టాను. నువ్వు చెప్పేవేవీ నా మనసులోకి వెళ్ళవు. జడుడు అనే పేరు నాకు సరిపోతుంది కూడా... అన్నాడు.

అన్నీ విని భార్గవుడు కుమారా ! నీకీ జడత్వం ఎందుకు వచ్చింది ? ఇంత విజ్ఞానం వుంది కదా... నీకేమయినా శాపం వుందా... వివరంగా చెప్పమన్నాడు.

నేను పూర్వజన్మలో బ్రాహ్మణ్యుడైన బ్రాహ్మణుణ్ణి. చాలా మంది శిష్యులకి జ్ఞానోపదేశం చేసిన గురువుని. అజ్ఞానమనే చీకటిని పోగొట్టుకుని, ఎవరికీ దొరకని జన్మజన్మలు గుర్తు చేసుకోగలిగిన జ్ఞానం ఈ జన్మలో పొందాను. నేను ఇంక మోక్షానికి దారి వెతుక్కోవాలి. నీకేమైనా సందేహాలుంటే అడుగు అవి తీర్చి వెళ్ళిపోతానన్నాడు జడ మహర్షి.

భార్గవుడు కొడుకుని చూసి ఆశ్చర్యంతో గర్భంలో వుండగానే జ్ఞానివైన నిన్ను కన్న మేము ఎన్నినోములు నోచి ఉంటామో! ఇల్లాంటి కులదీపంలాంటి కొడుకుని పొందే అదృష్టం ఎంతమందికి దక్కుతుంది? నేను నిన్ను గురువుగా అనుకొని కొన్ని ప్రశ్నల అడుగుతాను, సమాధానం చెప్పమని ఇలా అడిగాడు భార్గవుడు.

ప్రాణికి పుట్టడం, బ్రతకడం, మరణించడం ఇవి ఎలా జరుగుతున్నాయి? ఎలా పుడుతున్నాడు? ఎలా చచ్చిపోతున్నాడు? ఎలా పాపపుణ్యాలు అనుభవిస్తున్నాడు? జ్ఞానం ఎలా పొందుతున్నాడు? అని అడిగాడు.

జడ మహర్షి తండ్రిగారూ ! మొదట మనిషి మరణించే విధం చెప్తాను వినండి. మరణకాలం వచ్చినప్పుడు శరీరం బాగా వేడెక్కి ఆవిర్లు వస్తాయి. మలమూత్రాలు బయటికి వచ్చే దారులు మూసుకుపోయి మలమూత్రాలు రావడం ఆగిపోతుంది. పొట్ట పెరిగి పెదవులు ఎండి, గొంతు తడి ఆరిపోయి, మాటపడిపోయి, కళ్ళు జీవం లేనట్లయి, నాలుక వెనుకకి లాక్కుపోయి, శ్వాసాగిపోతుంది.

ధర్మం తప్పనివాడు, అన్నం నీళ్ళు దానం చేసి పెద్దలని గౌరవించి, అసూయ లేకుండా, అసత్యం పలకకుండా ఉన్నవాడు సుఖంగా మంచిగా మరణిస్తాడు. అలా మంచిగా వుండని వాడు బాధపడ్తూ, కష్టపడ్తూ మరణిస్తాడు.

మరణించాక తల్లిదండ్రుల వల్ల వచ్చిన శరీరం పోయి, వారివారి పనులు, వయస్సు, రూపాన్ని బట్టి జీవులు యాతనా శరీరాల్లో ప్రవేశిస్తారు. ఇలా పాపం చేసిన వాళ్ళ యాతనా శరీరాల్ని యమభటులు కాళ్ళు చేతులు కట్టేసి కర్రలతో కొడ్తూ, వేడి నేలమీద ఈడ్చుకుంటూ, రాళ్లు, గుట్టలు, ముళ్ళు గల భయంకరమైన మార్గంలో నక్కలు పిక్కలు కొరికి తింటూ వెంట వస్తూ ఉండగా తీసికెడతారు.

ఇలా తీసుకెడుతూ వుండగా బంధువులు మిత్రులు అతని దేహాన్ని కాలుస్తుంటే ఆ వేడికి తట్టుకోలేక బాధపడ్డాడు. పన్నెండు రోజులవరకు బంధువులు చేసే పిండప్రదానాలు, భూమిమీద పడుకునే ముఖ్య వ్రతం వల్ల యాతనా శరీరం తృప్తిపడుతుంది. పన్నెండవరోజు మైలస్నానాలు, తర్పణాలు ఇలాంటి వాటి వల్ల యాతనా శరీరం సంతోషపడుతుంది.

పదమూడో రోజు జీవిని యమధర్మరాజు దగ్గరకి తీసుకెడతారు. చిత్రగుప్తుడి దగ్గర పాపాల పట్టీ ఉంటుంది కదా... అది చూసి యమధర్మరాజు శిక్ష వేస్తాడు. వాటి గురించి కొన్ని తెలుసుకుందాం.

**రౌరవం :** ఇది ఉండే ప్రదేశం రెండువేల యోజనాలు. అదంతా ఎర్రటి నిప్పులు భగభగమంటూ ఉంటాయి. అందులో వేస్తే కాలి బూడిద అవడం మళ్ళీ మామూలు అవడం ఇలా జరుగుతూనే ఉంటుంది.

**మహారౌరవం :** ఇది ఎన్నో వేల యోజనాలు. ఇందులో యమభటులు పాపాలు చేసినవాళ్ళని కాళ్ళు, చేతులు కట్టి పడేస్తే కుక్కలు, నక్కలు, పాములు గ్రద్దలు ఒకటేమిటి అన్ని కలిసి పొడిచి కఱచి మాంసం ఎముకలు నమిలి నమిలి బాధపెడ్తాయి.

**తమో నరకం :** ఇది అతి చల్లగా ఉంటుంది. కాళ్ళు, చేతులు కొంకర్లుపోయి ఒకళ్ళరక్తం ఒకళ్ళు తాగేస్తారు.

**నికృంతం :** దీంట్లో చక్రాలు తిరుగుతూ శరీరాల్ని ముక్కలుగా చేస్తుంటే మళ్ళీ అవి అతుక్కుంటూ అవి మళ్ళీ ముక్కలవుతూ ఆచక్రంలో తిరుగుతూనే ఉంటారు.

**అప్రతిష్ఠ నరకం :** పేగులు పిండి మెదలు వేల్లాడుతూ రక్తాలు కారుతున్న కళ్ళతో రాట్నాలమీద వేలవేల సంవత్సరాలు త్రిప్పించబడతారు.

**అసిపత్రవనం :** ఇది కొన్ని వేల యోజనాల్లో వున్న ప్రదేశం. ఇది చాలా చల్లగా వుండి, ఆకులు, పూవులు లాంటి కత్తులతో వున్న చెట్లతో వుంటుంది. పాపాత్ములని దీంట్లో పడేయ్యగానే ఆ కత్తులు నరికేస్తూ ఉంటాయి. పెద్దపెద్ద కుక్కలు అవి నోటితో పట్టుకుని తిరుగుతూ ఉంటాయి.

**తప్తకుంభ నరకం :** ఎప్పుడూ మండుతూ వుండే మంటలమీద పెద్దపెద్ద కుండల్లో సలసలకాగే నూనెలో తలక్రిందులుగా పడేస్తారు.

**అమితకర్ధమ :** ఈ నరకంలో పెద్దపెద్ద పక్షులు ఇనపముక్కులతో పొడుస్తూ వుంటే విపరీతమైన ఆకలి దాహంతో రక్తం కారుతూ అరుస్తూ ఉంటారు. ఇలాంటి నరకాలు ఎన్నో ఉన్నాయని చెప్పాడు జడ మహర్షి.

భార్గవుడు మళ్ళీ ఏ పాపాలు చేస్తే ఏ జన్మ వస్తుందో వివరంగా చెప్పమన్నాడు జడ మహర్షిని.

నరకబాధలు అనుభవించిన తర్వాత వాళ్ళ జన్మలు ఎలా ఉంటాయో విపులంగా చెప్తాను విను అన్నాడు జడ మహర్షి.

కడజాతి వాడి నుంచి దానం తీసుకున్న బ్రాహ్మణుడు గాడిదగాను, అతనికి సహాయం చేసినవాడు పురుగుగాను పుడతారు. గురువుని మోసగించిన వాడు కుక్క, గురువు భార్యతో కలసిన వాడు గాడిద, తల్లిదండ్రులు చెప్పినట్లు విననివాడు గోరువంక, వాళ్ళకి మనోవ్యాధి కలిగించినవాడు తాబేలు, ఒకరి ఉప్పు తిని తర్వాత శత్రువర్గంలో చేరినవాడు కోతి, విశ్వాసహీనుడు చేపగాను, అసూయకలవాడు డేగగాను, ధనం లాంటివి దొంగతనం చేసినవాడు కొంగగానూ, మిత్రుడి భార్యతో కలిసిన వాడు పంది, యజ్ఞం, దానం, వివాహం చేసేటప్పుడు విఘ్నం కలిగించినవాడు, కూతుర్ని ఒకరికిచ్చి పోట్లాడి మళ్ళీ వేరే పెళ్ళి చేసినవాడు పురుగులు గాను, దేవతలకి, పితరులకి, అతిథులకి ముందు అన్నంపెట్టకుండా తానే తినేవాడు కాకి, బ్రాహ్మణుడు శూద్రస్త్రీతో వెడితే కట్టెలోని పురుగుగాను, కృతజ్ఞతలేని వాడు పురుగు, తేలు, చేపగాను, ఆడవాళ్ళని పిల్లలని చంపినవాడు పురుగుగాను, అన్నం దొంగతనం చేసినవాడు ఈగగాను ఇలా రకారకాలుగా పుడతారు. పాపం పూర్తి అయ్యేవరకు మనుష్య జన్మ రాదని చెప్పాడు.

మరి పుణ్యం చేసుకున్న వారి గురించి చెప్పనేలేదని భార్గవుడు అడిగితే జడ మహర్షి పుణ్యం చేసుకున్న వాళ్ళ సంగతి కూడా చెప్తున్నాడు. వాళ్ళు దివ్యాభరణాలు, దివ్యాంబరాలు, దివ్య సుగంధాలు అనుభవిస్తూ విమానంలో స్వర్గానికి వెళ్ళి అక్కడ స్వర్గసుఖాలు అనుభవించి పుణ్యం అయిపోగానే మళ్ళీ మనిషి జన్మ ఎత్తుతారని చెప్పాడు.

భార్గవుడు కుమారా ! గర్భం లోకి మనిషి ఎలా ప్రవేశిస్తాడు ? ఎలా పెరుగుతాడు? వివరంగా చెప్పమన్నాడు. స్త్రీపురుషులు కలిసే సమయంలో పరలోకానికి వెళ్ళిపోయిన జీవుడు చాలా వేగంగా గాలి రూపంలో శుక్లంలో కలుస్తాడు. అది మావిగా పిండంగా మారుతుంది. తర్వాత పంచాంగాలు, ఉపాంగాలు పుడతాయి. అన్ని అవయవాలు పెరిగి ఒక బొటనవ్రేలిమీది ఒకటి వేసుకుని తొడల ప్రక్కన చేతులు పెట్టి, చేతులు మోకాళ్ళ పైన, కళ్లు మోకాళ్ళ వెనుక, ముక్కు మోకాళ్ళ నడుమ భాగంలో, రెండు పిక్కలు దగ్గరకి చేర్చి బాగా ముడుచుకుపోయి మోకాళ్ళ మధ్య ఉండగా ఆ తల్లి కడుపులో వేడిని భరిస్తూ, ఆమె తీసుకునే ఆహారం శరీరాన్ని పెంచుతుండగా పుణ్యపాపాలు అతన్ని ఆశ్రయించడం చేత అతనికి జ్ఞానం కలుగుతుంది. తొమ్మిది మాసాలు నిండిన తర్వాత శిశువు రూపంలో బయటికి వచ్చి ఏడుస్తాడు. మిగిలింది మామూలే మీకు తెలిసిందే కదా...

భార్గవుడు చేతులు జోడించి యోగీంద్రా ! మోక్షాన్ని పొందడానికి యోగవిద్యని కూడా నువ్వే ఉపదేశం చెయ్యమన్నాడు.

జడ మహర్షి ఇలా చెప్పాడు. యోగి అవమానం అమృతంలా, గౌరవం విషంలా, మాట ఎప్పుడు సత్యాన్ని చెప్పేదిగా, తలపులు బుద్ధిగాఉండి బ్రహ్మచర్యాన్ని అవలంబిస్తూ తన ఆత్మని పరమాత్మమీద నిలిపి లోకంలో పరమాత్మ తప్ప యింకేమీ లేదన్నట్లుగా ధ్యానం చేసుకుంటూ పరమాత్మని అనుభవించగలిగిననాడు మోక్షం కలుగుతుందని చెప్పి తాను కూడా యోగ సాధన కోసం వెళ్ళిపోయాడు.

చూశారర్రా...... జడ మహర్షి ఎంత గొప్పవాడో! ఎన్ని జన్మలెత్తాడో అన్నీ ఆయనకి గుర్తున్నాయి. మనకి పొద్దున్న చదివింది రాత్రికి గుర్తుండదు. కన్న తండ్రికే గురువై మనిషి జన్మగురించి, చావుపుట్టుకల గురించి ఎంత చక్కగా వివరించాడో! పుడుతూనే తండ్రికే గురువైన మహర్షి ఇంకెవరు? మన జడ మహర్షి తప్ప.

మనకి కూడ ఏ ఏ పనులు చెయ్యకూడదో తెలుసుకునేలా చెప్పాడు. పాపపుణ్యాల గురించి చక్కగా చెప్పాడు. ఎందుకైనా మంచిది అన్ని రకాల జన్మలెత్తడం మనకి కష్టం గాని మంచిగానే వుందాం. అసలు పాపం చెయ్యనేవద్దు. ఏం!

# 34. జమదగ్ని మహర్షి

**వ**చ్చేశారా ! స్పీడు ఎక్కువయింది. తినగా తినగా వేపాకు తియ్యగా వుంటుందిట. మొదటేమో మహర్షుల కథలు చదవండర్రా... అంటే టి.వి. సీరియల్స్‌లా ఉండవు కదా! వద్దన్నారు. ఎంత బాధపడిపోయారో చదవడానికి. మరిప్పుడో! తెగ ఉత్సాహం చూపించేస్తున్నారు. సరే మరి. ఇప్పుడు మనం తెలుసుకోబోయేది జమదగ్ని మహర్షి గురించి. మొదలుపెట్టేద్దామా... ఓ.కే... కానియ్యండి.

పూర్వం ఋచీక మహర్షి గాధిరాజు కూతురు సత్యవతిని పెళ్ళి చేసుకోవాలనుకున్నాడు. గాధిరాజు ఋచీక మహర్షి తన కూతురికి తగిన వాడో కాదో పరీక్షించాలని వెయ్యి గుఱ్ఱాల్ని తెచ్చి ఇచ్చి తన కూతుర్ని పెళ్ళి చేసుకోమన్నాడు. వెయ్యి గుఱ్ఱాల్ని తెచ్చి ఇచ్చి సత్యవతిని పెళ్ళి చేసుకున్నాడు ఋచీక మహర్షి.

ఒకసారి సత్యవతి తనకి ఒక కొడుకునీ, తల్లిదండ్రులకి ఒక కొడుకునీ, అనుగ్రహించమని ఋచీక మహర్షిని అడిగింది. రాజు బ్రహ్మ మంత్రాలతో రెండు కుండలు తెచ్చి మొదటి కుండలోనున్న దాన్ని ఉపయోగించిన వాళ్ళకి ఉత్తముడైన రాజు, రెండవ కుండలోనున్న దాన్ని ఉపయోగిస్తే తపస్సంపన్నుడయిన బ్రాహ్మణుడు పుడతాడు. మొదటి కుండని నీ తల్లికిచ్చి, రెండవ కుండలోవున్నది నువ్వు తిను అని చెప్పాడు ఋచీకుడు. కాని తల్లి మాటలు విని సత్యవతి, మొదటిది తాను తీసుకుని రెండవ కుండను తల్లికిచ్చింది. సత్యవతికి జమదగ్ని, ఆమె తల్లికి విశ్వామిత్రుడు పుట్టారు.

ఇల్లా పుట్టిన జమదగ్ని రేణుకని పెళ్ళి చేసుకున్నాడు. అతడు తపోమహత్యంతో ఒక హోమధేనువుని సంపాదించాడు. ఈ హోమధేనువు వల్ల ఏం కావాలంటే అది వచ్చేస్తుంది. జమదగ్ని రేణుక అన్ని భోగాలు అనుభవిస్తున్నారు.

ఒకరోజు జమదగ్ని భార్య రేణుకతో కలిసి నర్మదానదీ తీరంలో స్వేచ్ఛగా విహరిస్తున్నాడు. వాళ్ళని చూసిన సూర్యుడు జమదగ్నిని నువ్వు బ్రాహ్మణుడివి, వేదకర్తవి అన్ని తెలిసిన నువ్వు పట్టపగలు ఇలాంటి పని చెయ్యొచ్చునా అని అడిగాడు.

జమదగ్ని సూర్యుడితో ఓయీ ! నువ్వు నాకు చెప్తున్నావా... నేను భృగుమహర్షి శిష్యుణ్ణి. ధర్మాధర్మాలు తెలియని వాణ్ణి కాదు. నువ్వే కాదు బ్రహ్మరుద్రయమాదులు కూడ నన్ను శిక్షించలేరు. నువ్వు మా కార్యాన్ని భంగం చేశావు కనుక నా శాపంతో రాహువుతో మింగబడి తేజస్సు లేకుండా పోతావని సూర్యుణ్ణి శపించాడు జమదగ్ని.

అది విని సూర్యుడు మనం ఇద్దరం సమానమే. నువ్వు శపించి నేను శపించకపోతే ప్రజలు నాకు చాతకాదనుకుంటారు. నీకు క్షత్రియుడితో అవమానం, మరణం కూడ కలుగుతుంది అని ప్రతి శాపం ఇచ్చాడు జమదగ్నికి.

ఇలా వీళ్ళు ఒకళ్ళనొకళ్ళు శపించేసుకుంటుంటే కశ్యపుడి వల్ల విషయం తెలిసిన బ్రహ్మ వాళ్ళ దగ్గరికి వచ్చి ఇద్దరిని శాంతపరిచి ఇద్దరికీ వాళ్ళ శాపాలే వాళ్ళకి మంచి జరిగేలా ఆశీర్వదించి వెళ్ళాడు.

తర్వాత రేణుకకి అయిదుగురు కొడుకులు పుట్టారు. అందులో ఆఖరివాడు పరశురాముడు.

రేణుకాదేవి నీళ్ళు తెచ్చుకునేందుకు నదికి వెళ్ళి చిత్రధరుడనే రాజు భార్యతో కలిసి స్నానం చేస్తుండగా ఆనందంగా చూసింది. ఆ సమయంలో ఆమె చేతిలో వున్న కుండ క్రిందపడి పగిలింది. ఎప్పుడైనా కుండ పగిలితే ఇసుక తీసి అనుకోగానే కుండ వచ్చేసేది. కాని పరపురుషుణ్ణి చూడ్డం వల్ల పాతివ్రత్య భంగం కలిగి కుండరాలేదు. కుండలేకుండా వస్తున్న రేణుకని చూసి జమదగ్ని జరిగింది తెలుసుకుని పిల్లల్ని పిలిచి తల్లిని చంపేయమన్నాడు. పరశురాముడు గొడ్డలి తీసుకువచ్చి వెంటనే నరికేశాడు. తండ్రి అతణ్ణి మెచ్చుకుని ఏం కావాలో అడగమనగానే తల్లిని బ్రతికించమన్నాడు పరశురాముడు.

పూర్వం హైహయ వంశం వాడయినా కార్తవీర్యార్జునుడు దత్తాత్రేయుడితో వరం పొందాడు. ఒకసారి వేటకి వచ్చి విశ్రాంతి కోసం జమదగ్ని ఆశ్రమానికి వచ్చాడు. జమదగ్ని అలిసిపోయిన రాజుకి, సైన్యానికి తమ కామధేనువు సహకారంతో భోజనాలు పెట్టాడు. ఆ ఆవుని ఎలాగయినా తీసికెళ్ళాలని ఇరవై ఒక్కసార్లు జమదగ్నితో యుద్ధం చేశాడు కార్తవీర్యార్జునుడు. చివరకి జమదగ్నిని చంపి కామధేనువు కోసం వెతికాడు. అది ఇంద్రుడి దగ్గరికి వెళ్ళిపోయింది. భృగు మహర్షి వచ్చి జమదగ్నిని బ్రతికించాడు.

తర్వాత పరశురాముడు వచ్చి జరిగింది విని యుద్ధం చేసి కార్తవీర్యార్జునుడిని చంపి ఆశ్రమానికి వచ్చి తండ్రికి చెప్పాడు. జమదగ్ని పరశురాముడితో రాజెంత దుష్టుడయినా చంపడం పాపమని తీర్థయాత్రలు చెయ్యమని చెప్పాడు. విష్ణు స్వరూపుడయినా, కార్తవీర్యుడు తనకి విరోధి అయినా ధర్మానికి కట్టుబడి కొడుకుని కూడ శిక్షించాడు మహర్షి.

జమదగ్ని మహర్షి పితృకార్యం చేస్తూ ఆవుపాలు పిండి ఒకచోట పెట్టాడు. కోపదేవత మహర్షికి శాంతం ఎక్కువ కదా పరీక్షిద్దామని పాలు క్రిందపడిపోయేలా చేసింది. జమదగ్ని శాంతంగానే ఉన్నాడు. కోపదేవత భృగువంశం వాళ్ళు కోపిష్ఠులని విన్నాను అందుకే నిన్ను పరీక్షిద్దామని ఇలా చేశాను, క్షమించమని జమదగ్నిని అడిగి వెళ్ళిపోయింది.

కానీ, పితృదేవతలు జమదగ్నిని నువ్వు మా కోసం పెట్టిన పాలు పారబోస్తే ఊరుకున్నావు కాబట్టి ముంగిపై పుట్టమని శపించారు. జమదగ్ని తెలియక చేశాను క్షమించమన్నాడు. ధర్మరాజు అశ్వమేధ యాగం చేసినప్పుడు నీకు శాపవిమోచనం అవుతుందని చెప్పారు. ఈ విధంగా జమదగ్ని జన్మ రాహిత్యం పొందాడు. అంటే ఇంక జన్మలే రావన్న మాట.

జమదగ్ని మహర్షి కథ గురించి తెలుసుకున్నారు కదా! భగవంతుడి దయ ఉంటే జరగని పని ఏముంది. కష్టపడకుండా కామధేనువు వల్ల అన్ని సుఖాలు వచ్చేశాయి. తండ్రి ఏం చెప్తే అది చేసే కొడుకున్నాడు. ధర్మాన్ని రక్షించేవాళ్ళని ధర్మం తనే రక్షిస్తుంది. ఇదర్రా కథ !!

# 35. జరత్కారు మహర్షి

రండర్రా! ఇప్పుడు మనం జరత్కారు మహర్షి గురించి తెలుసుకుందామా...!

జరత్కారు మహర్షి గొప్ప తపశ్శాలి, జ్ఞాని, బ్రహ్మచారి, ఉన్నచోట వుండక, తిన్న చోట తినక తీర్థయాత్రలు చేస్తూ తిరుగుతూ వుండేవాడు.

ఒకసారి అతనికి పితృదేవతలు కనిపించి పెళ్ళి చేసుకుని సంతానం పొందకపోతే మాకు మోక్షం లేక పుణ్యలోకాలికి వెళ్ళలేక ఇక్కడే వుండిపోవాల్సి వస్తుందని చెప్పారు.

జరత్కారుడు తన పేరుతో కలిసే పేరున్న జరత్కారువుని పెళ్ళి చేసుకుని 'ఆస్తీకుడు' అనే పేరుగల కుమారుణ్ణి పొంది పితృ దేవతలకి పుణ్యలోక ప్రాప్తి కలిగించిన తర్వాత సంసారం వదిలేసి తపస్సు చేసుకునేందుకు వెళ్ళిపోయాడు.

జరత్కారు మహర్షి తాను గొప్ప తపస్సంపన్ను డవడమే కాకుండ అస్తీకుడు అనే వేదవేదాంగాలు నేర్చుకుని గొప్పజ్ఞాని అయిన కొడుకుని పొంది పితృదేవతల ఋణం తీర్చుకోవడమే కాకుండ నాగలోకాన్ని కూడ ఉద్ధరించడానికి కారకుడయ్యాడు.

ఇదర్రా జరత్కారు మహర్షి కథ!!

# 36. జాబాలి మహర్షి

**వ**చ్చేశారా ! ఇప్పుడు జాబాలి మహర్షి గురించి తెలుసుకుందాం. మొదలుపెడదామా... చదవండి మరి. మహాపురుషుల చరిత్రలు విచిత్రంగా ఉంటాయి కదూ.

జాబాల అనేపేరు గల బ్రాహ్మణ యువతికి దేవతా వరప్రసాదంగా పుట్టినవాడు జాబాలి.

జాబాల తన కొడుక్కి ఉపనయనం చేశాక హరిద్రుమతుడికి శిష్యుడిగా అప్పగించింది. గురువుగారు జాబాలిని బ్రహ్మవిద్యా బోధనకి అర్హత వచ్చేవరకు ఆవుల్ని మేపమని పంపించాడు.

జాబాలి గురువుగారి ఆవుల్ని తోలుకుని అడవికి వెళ్ళి అక్కడే గుడుపుతున్నాడు. ఆవులు అంతకంతకీ పెరిగి వేలసంఖ్యలో అయిపోయాయి. దేవతలు ఇతన్ని చూసి మంచి చెయ్యాలని అనుకున్నారు. వాయుదేవుడు ఒక ఆవులో ప్రవేశించి నువ్వు మమ్మల్ని దయగా కాపాడావు. మమ్మల్ని గురువుగారింటికి తోలుకుపో నీకు ఉపకారం చేస్తాం అంది.

జాబాలి గురువుగారింటికి ప్రయాణమయ్యాడు. దార్లో వాయువు, అగ్ని, సూర్యుడు, మద్గియమనే పక్షి అందరూ కలిసి అతనికి మంత్రోపదేశం చేశారు. జాబాలి బ్రహ్మజ్ఞానం కలిగి గొప్ప తేజస్సుతో వెలిగిపోతున్నాడు.

గురువుగారు జాబాలిని చూసి నువ్వు తేజస్సుతో వెలిగిపోతున్నావు, బ్రహ్మజ్ఞానివయ్యావు. ఇంక వెళ్ళి ఆశ్రమం ఏర్పాటుచేసుకుని తపస్సు చేసుకో అన్నాడు.

గురుముఖంగా విద్య నేర్చుకోకపోతే ఆ విద్య నిలబడదు కాబట్టి మీరే నాకు బోధించండి అన్నాడు జాబాలి. గురువు సంతోషంతో జాబాలికి బ్రహ్మజ్ఞానం ఉపదేశించాడు.

తర్వాత జాబాలి సుబ్రహ్మణ్యస్వామిని ఆరాధించి పరతత్త్వ రహస్యాలన్ని తెలుసుకున్నాడు. ఒకసారి పైప్పలాది మహర్షి వచ్చి జాబాలి నడిగి బ్రహ్మజ్ఞానం గురించి తెలుసుకున్నాడు. పైప్పలాదుడికి చెప్పిన బ్రహ్మజ్ఞానాన్నే 'జాబాల్యుపనిషత్తు' అంటారు.

జాబాలి జీవులకీ పశువులకీ అన్నిటికీ ఈశ్వరుడే పతి అని చెప్పాడు. అదెలాగ అన్నాడు పైప్పలాదుడు. పశువులు గడ్డితిని వివేకం లేకుండా యజమాని చెప్పినట్లు చేసి యజమానితో కట్టబడి ఎలావుంటాయో, అలాగే జీవులతో సర్వేశ్వరుడే యజమానిలాగ పనిచేయిస్తున్నాడు కాబట్టి పశుపతి ఈశ్వరుడే అయ్యాడు అని చెప్పాడు జాబాలి.

పైప్పలాది మహర్షి జ్ఞానం ఎలా వస్తుందని అడిగాడు. జాబాలి విభూతి పెట్టుకోవడం వలన జ్ఞానం వస్తుంది. పంచబ్రహ్మ మంత్రాలతో భస్మం తీసుకుని 'అగ్నిరితి భస్మ' అనే

మంత్రంతో అభిమంత్రించి, 'మానస్తోకే తనయే' అనే మంత్రంతో నీళ్ళలో కలిపి తల,నుదురు, వక్షం, భుజాలకి పెట్టుకోవాలి. అలాగే మూడురేఖలు లలాటం మొదలుకొని కనుబొమ్మల మధ్య వరకు పెట్టాలి.

మొదటి రేఖ గార్హపత్యాగ్ని, అధి దేవత బ్రహ్మ. రెండవరేఖ దక్షిణాగ్ని, విష్ణువు అధిదేవత. మూడవరేఖ ఆహవనీయాగ్ని, మహాదేవుడు అధిదేవత. ఇలా త్రిపుండ్రధారణ చేసిన వాడికి మళ్ళీ మళ్ళీ పుట్టడం అనేది ఉండదు.

ఒకసారి సీతారామలక్ష్మణులు చిత్రకూటపర్వతం మీదకి చేరిన సమయంలో భరతుడు రాముణ్ణి వచ్చి రాజ్యం చేసుకోమన్నాడు. రాముడు భరతుణ్ణి ఓదార్చి పధ్నాలుగు సంవత్సరాలు అవగానే వచ్చేస్తానని చెప్పాడు.

జాబాలి శ్రీరాముడి చిత్తశుద్ధిని పరీక్షించడానికి రామా ! నువ్వు కూడ సామాన్యుడిలాగ మాట్లాడుతున్నావు. తల్లిదండ్రులేమిటి? వారికి మాటియ్యడం ఏమిటి? చక్కగా రాజ్యం చేసి ప్రజల్ని రక్షించాలి కదా ! నీ తండ్రికీ నీకూ జన్మనిచ్చేవరకే సంబంధం. అతను పోయాక అతని ఆజ్ఞ పాలించడం అంటే మూర్ఖత్వం అన్నాడు.

అయ్యా! ఎవరెంత యోగ్యులో వారి ఆచరణని బట్టే తెలుస్తుంది. వైదిక క్రియలు మానేసి వనవాసానికి వెడతానని చేసిన ప్రతిజ్ఞ వదిలేసి నువ్వు చెప్పినట్లు చేస్తే నేను ధర్మాన్ని ఇతరులకి చెప్పే హక్కుని పోగొట్టుకుంటాను. 'యథారాజా తథాప్రజా' అన్నారు కదా ! అన్నాడు రాముడు.

జాబాలి రాముడి మాటలు విని రామా ! నేను నాస్తికుణ్ణి కాదు. నీ మనస్సు తెలుసుకునేందుకు అలా అన్నాను అని రాముణ్ణి పూజించి వెళ్ళిపోయాడు.

తేజఃపురానికి రాజు ఋతంభరుడు. అతనికి చాలా మంది భార్యలున్నారు. కాని, సంతానం లేదు. ఒకసారి జాబాలి మహర్షి ఋతంభరుడి రాజ్యానికి వచ్చాడు. రాజు ఆయనని తగిన విధంగా సత్కారం చేసి మహర్షీ ! నాకు సంతానం లేదు. నాకు ఈ బాధ నుంచి విముక్తి కలిగించండన్నాడు.

రాజా ! గోపూజ చేస్తే సంతానం కలుగుతుంది. ఆవుని కొట్టిన పాపాత్ముడు చెయ్యి నరకబడి నరకానికి పోతాడు. ఆవుని ఏ రకంగా హింసించినా నరకానికి పోతారు. ఎందుకంటే ఆవు దేహంలో దేవతలున్నారని చెప్పాడు జాబాలి.

జాబాలి చెప్పినట్లే ఋతంభరుడు ఆవుని పూజించాడు. కాని ఒకనాడు రాజు ఆవుని తీసుకుని వెడుతుంటే సింహం దాని మీద పడి చంపేసింది. రాజు భయపడి జాబాలిని ఏం చెయ్యమంటారని అడిగాడు. ఋతుపర్ణుణ్ణి అడగమని పంపించాడు జాబాలి.

ఋతుపర్ణుడు రాజు చెప్పింది విని రాజా ! ఇంకొక ఆవుని తెచ్చుకుని రామనామం చేస్తూ దాన్ని పూజచేసి ఒక బ్రాహ్మణుడికి దానమియ్యి అని చెప్పాడు. రాజు అలాగే చేసి ఒక కొడుకుని పొందాడు. అతడి పేరు సత్యవంతుడు. అతడు గొప్ప రామభక్తుడు కూడా.

ఇదర్రా జాబాలి మహర్షి కథ !!

జాబాలి మహర్షి గురువుగారు ఏ పని చెప్పినా ఆవుల్ని తోలుకు వెళ్ళమంటే అలాగే చేశాడు. కాని, ఆ పనిని తక్కువగా అనుకోలేదు. ఆవు ఎంత గొప్పదో చూశారా. ఆవుల్ని మేపడంలోనే జాబాలి బ్రహ్మజ్ఞాని అయ్యాడు. మీరు కూడా ఆవుని ఎప్పుడూ కొట్టకండేం.

# 37. జైగీషవ్య మహర్షి

**మ**నం జైగీషవ్య మహర్షి గురించి తెలుసుకుందాం. అందరూ వచ్చేశారా. మొదలుపెడ్దాం. జిగీషువు అంటే జయించాలన్న కోరిక కలవాడు అని అర్థం ఏం జయించాడో చూద్దాం.

జైగీషవ్యుడు కపిల మహర్షికి శిష్యుడు మిత్రుడు కూడా. వీళ్ళిద్దరూ కలిసి అశ్వశిరుడనే రాజుని చూడ్డానికి వెళ్ళారు. రాజు అతిథి సత్కారం చేసి విష్ణుమూర్తి కటాక్షానికి ఏం చెయ్యాలో చెప్పమన్నాడు. కపిలుడు నన్ను విష్ణుమూర్తిగా తెలుసుకో అన్నాడు.

నాకు విష్ణుమూర్తి తెలుసు. అతనికి గద, శంఖం, చక్రం లాంటివి ఉంటాయి, నీకు లేవుకదా అన్నాడు రాజు. కపిలమహర్షి గద, శంఖం, చక్రం అన్నిటితోను విష్ణువుగానూ, జైగీషవ్యుడు గరుడ వాహనంగానూ కనిపించారు.

మరి విష్ణుమూర్తి కమల నాభుడు కదా! బ్రహ్మ ఏడి? అన్నాడు రాజు. కపిలుడు కమల నాభుడుగా జైగీషవ్యుడు బ్రహ్మగానూ మారారు.

ఇదంతా మోసం నేను నమ్మనన్నాడు రాజు. కపిలుడు రాజ్యసభని మాయమైపోయేలా చేశాడు. ఎక్కడ చూసినా క్రూర జంతువులే కనిపంచాయి. రాజు భయపడి కపిలుడికి నమస్కారం చేసి నువ్వే విష్ణువు, జైగీషవ్య మహర్షే బ్రహ్మ. నా తప్పుని క్షమించండి అన్నాడు.

దేవలుడు అనే మహాయోగికి తాను గొప్పవాడినని గర్వం. కాని అతడు సత్యవ్రతుడు, ఉత్తముడు, తపస్వికూడా. ఒకనాడు జైగీషవ్యుడు దేవలుడింటికి వచ్చి కొన్నాళ్ళిక్కడే ఉండి తపస్సుచేసుకుంటానని చెప్పాడు. జైగీష్యవుడి వంటి మహా యోగీశ్వరుడు తనింటి దగ్గర ఉండడమంటే దేవలుడికి చాలా ఆనందంగా అనిపించి అలాగే వుండమన్నాడు దేవులుడు.

జైగీషవ్యుడు తపస్సు చేసుకుంటున్నాడు. ఇలా చాలా సంవత్సరాలు గడిచిపోయాయి. మౌనం వదలడు. నిష్ట విడవడు. ఉగ్రమైన తపస్సు చేస్తూ తేజస్సుతో వెలిగిపోతున్నాడు జైగీషవ్యుడు.

దేవలుడు ఎలాగయినా తన గొప్పని నిరూపించుకోవాలని ఒకనాడు అంతర్ధానమై సముద్రస్నానానికి వెళ్ళేసరికి అప్పటికే స్నానం చేసి తపస్సు చేసుకుంటున్నాడు జైగీషవ్యుడు. తన పని పూర్తిచేసుకుని యోగవిద్యతో తిరిగి వచ్చిన దేవలుడు యధాస్థానములో కూర్చుని మౌననిష్టలో వున్న జైగీషవ్యుడ్ని చూసి ఆశ్చరయపోయాడు.

ఇంకా తన శక్తి నిరూపించుకోవడం కోసం యోగశక్తితో ఆకాశానికి ఎగిరి సిద్ధలోకం చేరేటప్పటికి జైగీషవ్య మహర్షిని సిద్ధులు సేవిస్తూ కనిపించారు.

దేవలుడు పితృలోకం, యమలోకం, సోమలోకం అగ్నిలోకం, రుద్రలోకం ఇలా ఎక్కడికి వెళ్ళినా జైగీషవ్య మహర్షి అక్కడే కనిపించాడు. దేవలుడు మహర్షి పాదాల మీద పడి సామాన్యమైన మనిషిలా నా ఆతిథ్యం అడిగావు, నువ్వింత గొప్పవాడివని నాకు తెలియదు క్షమించమన్నాడు .

దేవలుడు జైగీషవ్య మహర్షికి శిష్యుడయి తన తపస్సు ధారపోసి పితృదేవతలకు ఉత్తమగతులు భూతతృప్తి కలిగించి సన్యాసం తీసుకుని మోక్షాన్ని పొందాడు.

ఒకసారి పార్వతీ పరమేశ్వరులు మేరుపర్వతం మీద తిరుగుతుండగా పార్వతీదేవి "స్వామీ ! అర్థం గొప్పదా ? అర్ధ శక్తి గొప్పదా ? అని అడిగింది శివుణ్ణి. అర్ధశక్తి అర్థంలో కలిసివుంది. కాబట్టి అర్ధమే గొప్పదన్నాడు జైగీషవ్యుడు. మధ్యలో వచ్చాడు కాబట్టి వాణ్ణి శపిస్తానంది పార్వతి. అతడు చాలా గొప్ప బ్రహ్మజ్ఞాని. కావాలంటే పరీక్షించుకో అన్నాడు శివుడు. పార్వతి పరమేశ్వరుల పరీక్షలొ నెగ్గాడు జైగీషవ్యుడు.

ఇదర్రా జైగీషవ్య మహర్షి కధ!!

జైగీషవ్యుడ్ని పార్వతీపరమేశ్వరులు ఎలా పరీక్షించారో తెలుసా ? ఏం కావాలో కోరుకో అన్నారు.

ఏమీ వద్దన్నాడు జైగీషవ్యుడు! అంటే అసలు కోరికలే లేవు ఆయనకి. అంత గొప్ప మహర్షి.

తర్వాత మహర్షి ఎవరో ఏమిటో ఆతృతగా ఉంది కదూ !

# 38. జైమిని మహర్షి

ఇప్పుడు మనం జైమిని మహర్షి గురించి తెలుసుకుంటున్నాం. అసలు ఈ ఋషుల పుట్టుక కూడ చిత్ర విచిత్రంగా ఉంటుంది. వాళ్ళు జీవిత చరిత్ర రాయించుకోడం గాని, ప్రచారం చేసుకోవడం గాని ఇష్టపడేవాళ్ళు కాదు. కీర్తి కాంక్ష అసలుండేది కాదు. ఆత్మజ్ఞానం పొందడం, ఆత్మసౌందర్యం ఆరాధించడమే వాళ్ళ ఆశయం. అలాంటి వాళ్ళల్లో జైమిని మహర్షి ఒకడు. మరింక చదవడం మొదలుపెడదామా...

బ్రహ్మ హృదయంలోంచి ఒక నాదం పుట్టింది. దాంట్లోంచి ఓంకారం పుట్టింది. 'అకార ఉకార మకారాలు కలిసి ఓంకారం'. దీన్ని ప్రణవం అన్నారు. ఈ ప్రణవం వల్ల స్వరం, స్పర్శం, ఊష్మం అంతస్థం అనే లక్షణాలతో అక్షర సముదాయాన్ని కల్పించి నాలుగు నోళ్ళలోంచి నాలుగు వేదాలు చెప్పాడు బ్రహ్మ. అందులో సామవేదం మన జైమిని మహర్షి నేర్చుకున్నాడు. ఈయన గురువు వ్యాసభగవానుడు.

ఒకసారి జైమిని మహర్షి మార్కండేయుడి ఆశ్రమానికి వెళ్ళి మునీంద్రా ! మా గురువుగారు రాసిన మహాభారతంలో తెలియని కొన్ని విషయాలు మిమ్మల్ని అడిగి తెలుసుకోవాలని వచ్చానన్నాడు. మార్కండేయుడు ఇప్పుడు నేను నియమంలో ఉన్నాను, వింధ్య పర్వతం మీద పక్షిరాజులు పింగాక్షుడు, విరాటుడు, వృత్రుడు, సుముఖుడు నలుగురున్నారు. నువ్వు వాళ్ళని అడిగితే అంతా చెప్తారన్నాడు.

ఈ నలుగురు పక్షిరాజులు కందుదుడు మదనికలకి పుట్టిన వాళ్ళు. శమీక మహాముని దగ్గర పెరిగారు. భారతయుద్ధం తర్వాత భీష్ముడు ధర్మరాజుకి చెప్పిన ధర్మాలన్నీ ఈ నాలుగు పక్షులు విన్నాయి. జైమిని మహర్షి ఆ పక్షుల గురించీ వాటికి అంత జ్ఞానం ఎలా వచ్చిందీ చెప్పమని మార్కండేయ మహర్షిని అడిగాడు.

పూర్వం సుకృశుడికి నలుగురు పిల్లలు. సుకృశుడు సత్యనిష్ఠ కలవాడు. అతణ్ణి పరీక్షించాలని సుకృశుణ్ణి మాంసాహారం పెట్టమని పక్షిరూపంలో వచ్చి అడిగాడు ఇంద్రుడు.

సుకృశుడు తన నలుగురు పిల్లల్ని ఆ పక్షిరాజుకి ఆహారంగా వెళ్ళమని చెప్పాడు. వాళ్ళు ఇష్టపడలేదు. పక్షులై పుట్టమని శపించి మళ్ళీ వాళ్ళ కోరిక మన్నించి, రూపం పక్షిదైనా సమస్త విద్యలు కలిగి, మనుష్య భాషలో మాట్లాడగలిగేలా కరుణించాడు సుకృశుడు. వాళ్ళే వింధ్యపర్వత ప్రాంతంలో ఉన్నారు. నీ సందేహాలన్ని తీర్చగల సమర్థులు వెళ్ళిరా అన్నాడు మార్కండేయుడు.

జైమిని వింధ్యపర్వతం మీదకి వెళ్ళి మార్కండేయ మహర్షి చెప్పినట్లు పక్షిరాజుల్ని చూసి నమస్కారం చేసి తను వచ్చిన పని చెప్పాడు. ఆ పక్షి రాజులు శ్రీనారాయణ వూహ చతుష్టయం, పాంచాలీ పంచక విషయం, ఇంద్రుడే అయిదు విధాలుగా పాండవులుగా పుట్టడం, బలరాముడి తీర్థయాత్ర, హరిశ్చంద్రోపాఖ్యానం, క్రోష్టుకి మార్కండేయుల సంవాదం ఇలాంటివి ఎన్నో చెప్పారు. దీన్నే 'మార్కండేయపురాణం' అంటారు. అన్ని విషయాలు తెలుసుకున్నాక జైమిని తన ఆశ్రమానికి వెళ్ళిపోయాడు.

సుబాహుడనే రాజు ధర్మపాలన చేస్తూ, హరి భక్తుడుగా ఉండేవాడు. అతనికి అస్సలు దానగుణం లేదు. ఏమయినా సరే దానం చెయ్యడంలో ఉన్న గొప్పతనం ఏమిటో తెలియచెయ్యాలనుకుని అతడ్ని కలిశాడు జైమిని. మహర్షీ! ముందు నేనడిగిన ప్రశ్నలకి జవాబు చెప్పండి అన్నాడు సుబాహు. అడగమన్నాడు జైమిని మహర్షి.

సుబాహు అడిగాడు, స్వర్గం వల్ల మేలేమిటి ? కీడేమిటి? స్వర్గంలో క్రూరులు, దొంగలు, నీచులు, పీనాసివాళ్ళు, కృతఘ్నులు ఇలాంటి వాళ్ళుండరు. అక్కడ రోగాలు, ముసలితనం, చావు వుండవు. తేజస్సుతో వున్న శరీరాల్తో, ధర్మంగా ఉంటూ చక్కటి భోజనం చేస్తూ సుఖాలు అనుభవిస్తూ వుంటారు. పుణ్యం ఖర్చు అయిపోగానే మళ్ళీ మనిషి జన్మకి వచ్చేస్తారు అని చెప్పాడు జైమిని మహర్షి.

మరి దానాలు చెయ్యడం పుణ్యం ఖర్చు పెట్టుకోవడం మళ్ళీ మనిషి జన్మ ఎత్తడం ఇవన్నీ ఎందుకని సుబాహుడడిగాడు.

రాజా ! దానం చేయక తప్పదు. దానం చెయ్యక పోతే ఆకలి, దాహంతో, బాధపడతారు. జ్ఞానం లేకుండా పోతుంది. అందుకే యజ్ఞాలు చేసే వాళ్ళు కూడ దాన ధర్మాలు చేస్తారు.

ఋషి కూడ తాను తెచ్చుకున్న బిక్షలోంచి ఒక భాగం బ్రాహ్మణుడికీ, ఒక భాగం ఆవుకీ, ఒక భాగం ప్రక్కనున్న వాడికీ పెడతాడు. దానం తప్పకుండా చెయ్యాలి అని జైమిని మహర్షి చెప్పాడు.

ఒకనాడు జనమేజయరాజు జైమిని మహర్షిని మహాత్మా ! ధర్మరాజు కురుక్షేత్ర యుద్ధం తర్వాత చేసిన అశ్వమేధయాగం గురించి చెప్పమన్నాడు. వ్యాసమహర్షి అశ్వమేధయాగం చెయ్యడానికి ఆజ్ఞ ఇచ్చింది మొదలు అంతా వివరంగా జనమేజయుడికి చెప్పాడు జైమిని. దాన్నే 'జైమిని భారతం' అన్నారు.

జైమిని మహర్షి ఒక అపూర్వ జ్యోతిషగ్రంథం, స్మృతి మీమాంస, ఛాందోగ్యానువాదమనే తంత్రగ్రంథం, జైమినీయ శ్రేతసూత్రం, జైమనీయ గృహ్య సూత్రమనే గ్రంథాలు కూడా రాశాడు.

ఇదర్రా జైమిని మహర్షి కథ !!

జైమిని మహర్షి కథ చదివారు కదా ! పుణ్యం చేసుకుంటే స్వర్గానికి వెళ్ళి అది అయిపోగానే మళ్ళీ మనిషిగా పుట్టాలి. మోక్షాన్ని పొందితే ఇంక పుట్టనక్కర్లేదు. ఓంకారాన్ని ప్రణవం అంటారు. దాంట్లోంచి అక్షరరూపం వచ్చింది. నాలుగు వేదాలు వచ్చాయి. వేదాల్నే ప్రమాణాలుగా తీసికుంటారు. కానీ, ఎవరిమాటని కాదు – అనే విషయాలు జైమిని కథ ద్వారా మనకు తెలిశాయి.

మనం కూడ ఉదయాన్నే లేచి స్నానం చేసి ఓంకారం చేసుకుంటే చక్కగా చదువుకోగలుగుతాం. చేసి చూద్దాం సరేనా...

తర్వాత మహర్షి ఎవరో చూద్దాం...!!

# 39. తండి మహర్షి

**పి**ల్లలూ ! వస్తారా.... విశ్రాంతి కావాలా... తర్వాత మహర్షి తండి మహర్షి. నేను చదివేస్తున్నాను. ఇక మీ ఇష్టం. తండి మహర్షి గురించి తెలుసుకోవాలనుకున్న వాళ్ళు వచ్చి చదివెయ్యచ్చు. అందరూ వచ్చేస్తున్నారా...! అయితే మొదలుపెట్టండి ఇంక.....

పూర్వం తండి అనే పేరుగల బ్రాహ్మణుడుండేవాడు. అతడు బ్రహ్మచర్యం తీసుకుని అన్ని వేదాలు శాస్త్రాలు చదివి యోగి, జ్ఞాని, మహర్షి అయ్యాడు.

సమాధిలో ఉండి పదివేల సంవత్సరాలు తపస్సు చేశాడు. పరమేశ్వరుడు ప్రత్యక్షమయ్యాడు. తండి పరమేశ్వరుడ్ని చూసి ఆనందంతో ఓ పరమేశ్వరా ! యోగీశ్వరులు ఎప్పుడూ ఎవరినైతే గొప్పవాడని స్తోత్రం చేసి, ప్రధానమైనవాడని భావించి, పురుషుడని పూజచేసి, అధిష్ఠాన దేవతని అర్చన చేసి, ఈశ్వరుడని ఎంచి ఊహిస్తారో అతడే నువ్వు. నువ్వు అజుడివి, అనాదినిధనుడివి, విభుడివి, ఈశానుడివి, అత్యంతసుఖివి, అనఘుడివి. నిన్ను నేను భక్తితో శరణు కోరుతున్నాను అన్నాడు.

పరమేశ్వరుణ్ణి చూసిన తండికి ఇంకా ఆనందం తగ్గక పరమేశ్వరా ! కామ క్రోధాలు నువ్వే, ఊర్ధ్వ అధోభాగాలు నువ్వే, బ్రహ్మ విష్ణు మహేశ్వరులు నువ్వే, నిత్యానందుడవు, పరమపదమవు, దేహకర్తవు, దేహభర్తవు, దేహివి, ప్రాణగతివి అన్నీ నువ్వే. జనన మరణాలు కలిగించేది నువ్వే. దిక్కులు, యుగాలు, అయనాలు నువ్వే. రాత్రి పగలు చెవులు, కళ్ళుగా, పక్షాలు శిరస్సుగా మాసాలు భుజాలుగా, ఋతువులే వీర్యముగా, మాఘమాసం ధైర్యంగా, సంవత్సరాలు పాదాలుగా అంతట నువ్వే నిండి వున్నావు.

ఈ విధంగా స్తోత్రం చేసిన తండి మహర్షి భక్తికి మెచ్చి పరమేశ్వరుడు వత్సా ! నువ్వు తేజశ్శాలివి, కీర్తిమంతుడివి, జ్ఞానివి, ఋషుల్లో గొప్పవాడివి అవుతావు. నీకేం కావాలో అడగమన్నాడు.

ఈశ్వరా! నీ దయకంటే నాకు కావలసింది ఏమీ లేదు. ఎప్పుడూ నాకు నీ పాదాల దగ్గరే భక్తితో ఉండేటట్లు అనుగ్రహించమన్నాడు తండి మహర్షి.

తర్వాత తండి ఒక ఆశ్రమం నిర్మించుకుని తపస్సు చేసుకుంటూ ఉండిపోయాడు. ఉపమన్యు మహర్షి తండి దగ్గరకు వచ్చి పరమేశ్వరుడి సహస్ర నామాలు చెప్పమని అడిగాడు.

ఇంతకు ముందు దేవతలకి పదివేల నామాలు బ్రహ్మ చెప్పాడు. వాటి నుండి వెయ్యి నామాలు స్వర్గలోకంలో వున్న వాళ్ళకోసం బ్రహ్మ ఇచ్చాడు. భూలోక వాసుల కోసం తండి వెయ్యి నామాలు భూలోకంలోకి తెచ్చాడు. దీన్నే 'తండికృత శివసహస్రనామస్తోత్రం' అన్నారు. ఆ వెయ్యి నామాల గురించి తండి మహర్షి ఉపమన్యుకి చెప్పాడు.

అందులో కొన్ని నామాలు మనం కూడా పలుకుదాం. అన్నీ ఎలాగూ చెప్పుకోలేం కదా... స్థిరుడు, స్థాణువు, ప్రభువు, భీముడు, ప్రవరుడు, వరదుడు, వరుడు, సర్వాత్మ, జటి చర్మా శిఖండి, ఖచరుడు, గోచరుడు మొదలైనవి. ఇలా వెయ్యి నామాలు జపిస్తే అనుకున్న పనులు జరిగి ముక్తి పొందుతారు.

చూశారా ! మనకి కష్టం లేకుండా ముక్తి వచ్చే ఉపాయం తండి మనకి చెప్పాడు. వాళ్ళందరు అంతంత తపస్సులు చేసి మన కోసం శివసహస్రనామస్తోత్రం ఇచ్చి మనం సులభంగా ముక్తి పొందేలా చేశాడు. తండి మహర్షి!

ఋషులు ఎప్పుడు ఎదుటి వాళ్ళ కోసం ఏదో ఒకటి చేస్తుంటారు. కాని వాళ్ళకి కావల్సింది ఏమీ ఉండదు. ముక్తి తప్ప.

ఇదేనర్రా! తండి మహర్షి కథ!!

# 40. దత్తాత్రేయ మహర్షి

ఇపుడు మనం దత్తాత్రేయ మహర్షిని గురించి చదవడం మొదలుపెట్టేదాం. ఎందుకంటే బ్రహ్మ, విష్ణు, ఈశ్వర అంశలో పుట్టాడాయన. గొప్ప మహర్షి.

పూర్వం కౌశికుడనే బ్రాహ్మణుడి భార్య సూర్యోదయం అవగానే తన భర్త మరణిస్తాడని తెలిసి తన పాతివ్రత్యంతో సూర్యోదయాన్నే ఆపేసింది.

సూర్యుడు ఉదయించకపోతే ఇంకేమన్నా ఉందా! అందుకే అందరూ అత్రి మహాముని భార్య అనసూయని ప్రార్థించారు. అనసూయ కౌశిక పత్నిని ఓదార్చి సూర్యోదయం అయ్యేటట్లు కౌశికుడు బ్రతికేటట్లు చేసింది.

బ్రహ్మవిష్ణు మహేశ్వరులు అనసూయ పాతివ్రత్యానికి మెచ్చి ఏంకావాలో అడగమన్నారు. మీ ముగ్గురి అంశతో ఒక కొడుకు కావాలని అడిగింది. కోరుకున్నట్లే అనసూయకి కొడుకు పుట్టాడు. ఆయనే దత్తాత్రేయుల వారు.

చిన్నప్పటినుంచీ దత్తాత్రేయుడు గొప్పయోగి. మిగిలిన మునుల పిల్లలు ఇతణ్ణి వదలకుండా తిరుగుతున్నారు. దత్తాత్రేయుడికి పిల్లలందరూ తన దగ్గరే ఉంటుంటే తపస్సు చేసుకోవడానికి వీలుపడట్లేదని వాళ్ళని ఎలా అయినా తప్పించుకోవాలని ఒక నది నీళ్ళల్లో వుండిపోయాడు. పిల్లలు కూడా అక్కడే వుండిపోయారు. దత్తాత్రేయుడు లక్ష్మీదేవితో పాటు పైకి వచ్చి ఆటలు పాటలు మొదలెట్టేసరికి పిల్లలు అతణ్ణి అసహ్యించుకుని వెళ్ళిపోయారు. ఇలా ఎందుకు చేశాడో పిల్లలకేం తెలుస్తుందీ, యోగులకి మాత్రమే తెలుస్తుంది.

రాక్షస వీరులైన జంభుడు మొదలైన వాళ్ళు ఇంద్రుడి మీద యుద్ధానికి వచ్చారు. వాళ్ళతో యుద్ధంలో దేవతలు గెలవలేక బృహస్పతిని సలహా అడిగారు. అత్రి మహర్షి కొడుకు దత్తాత్రేయుడు మీకు సహాయం చేస్తాడని చెప్పాడు బృహస్పతి.

అందరూ కలిసి దత్తాత్రేయుణ్ణి పూజచేశారు. దత్తాత్రేయుడు యుద్ధం చెయ్యడం నావల్ల కాదన్నాడు. మహాత్మా ! నీ దగ్గర ఉన్నది లక్ష్మీదేవనీ, నీవు విష్ణుమూర్తివనీ సర్వసమర్ధుడివనీ మాకు తెలుసు. కరుణించమని వేడుకున్నారు. దత్తాత్రేయుడు మీరు అన్నీ తెలుసుకున్నారు కదా. వెళ్ళి ఆ రాక్షసుల్ని యుద్ధం వంకతో ఇక్కడికి తీసుకురండి. క్షణంలో వాళ్ళని చంపుతానన్నాడు.

జంభుడు సైన్యంతో అక్కడికి వచ్చి లక్ష్మీదేవిని చూసి ఆమెని దొంగతనంగా తీసుకెళ్ళిపోయాడు. దత్తాత్రేయుడు దేవతలతో ఇప్పుడు రాక్షసులు బలహీనులయ్యారు. యుద్ధం ప్రారంభించండి అన్నాడు. దేవతలు రాక్షసుల్ని క్షణంలో చంపారు.

ఆ రోజుల్లో హైహయవంశం వాడు కార్తవీర్యార్జునుడు రాజ్యం నేను పాలించలేను తపస్సు చేసుకుని యోగసిద్ధి పొందటానికి వెళ్ళిపోతానన్నాడు. దత్తాత్రేయుడ్ని ఆరాధిస్తే నీకు కావలసినవన్నీ దొరుకుతాయని చెప్పాడు గర్గ మహర్షి.

కార్తవీర్యార్జునుడు దత్తాత్రేయుణ్ణి పూజచేసి ఆయన పెట్టిన పరీక్షలన్నింటికీ నిలబడి అనుగ్రహం పొందాడు. అప్పుడు కార్తవీర్యుడికి చేతులు ఎన్ని వచ్చాయో తెలుసా? వెయ్యి చేతులు అంతేకాదు, ఇంకా భూమి మొత్తాన్ని పాలించగల సమర్ధత, సిరిసంపదలు, భూలోకంలోను, పాతాళలోకంలోను కూడ తిరగ గలిగేలా రథం, ధర్మకార్యాల మీద మనస్సు లగ్నమయ్యేటట్లు వరం పొందాడు. ఇవన్నీ ఇచ్చేను కాని ఎప్పుడయితే అధర్మంగా మహర్షుల్ని బాధపెడతావో అప్పుడే నువ్వు చస్తావ్ ! అని షరతు కూడా పెట్టాడు దత్తాత్రేయుడు.

ఆయన అన్నట్లే చివరికి ఈర్ష్యతో జమదగ్ని మహర్షిని కామధేనువు కోసం చంపినందుకు పరశురాముడి చేతిలో చచ్చిపోయాడు. ఎంత గొప్ప వరాలు పొందినా కార్తవీర్యార్జునుడి అసూయే ఆయన్ని నాశనం చేసింది. అందుకే పెద్దవాళ్ళు అసూయ ఉండకూడదూ.... అని చెప్తుంటారు.

అలర్కరాజు దత్తాత్రేయుణ్ణి స్వామీ ! స్థిరంగా ఉండే జ్ఞానం నాకు ఉపదేశించండి అనడిగాడు. దానికి దత్తాత్రేయుడు రాజా ! నాది అనే మాటని విడిచిపెట్టు. నాది అనేది అహంకారంలో పుట్టి, మమకారం అనేటువంటి మొదలు కలిగి, గృహం అనే చిగుళ్ళువేసి భార్య పిల్లలు అనే కొమ్మలతో, ధనం ధాన్యం అనే పెద్ద ఆకుల్తో, పుణ్యం పాపం అనే పువ్వులు పూసి, సుఖం దుఃఖం అనే పండ్లు పండి ఎంతోకాలం ఇలాగే ఉండి, అజ్ఞానం అనే వేళ్ళతో ముక్తి మార్గాన్ని కప్పేస్తున్న దాన్ని విద్య అనేటటువంటి గొడ్డలి తీసుకుని, ధర్మకార్యాలు మంచివాళ్ళతోనే కలిసి ఉండడం అనే రాయి మీద పదునుపెట్టి ఎవరయితే నరికేస్తారో వాళ్ళకే నిత్యానందం దొరుకుతుంది.

ఇంకా ఇలా చెప్పాడు. సర్వసంగ పరిత్యాగం వల్ల నాది అన్నదిపోయి, వైరాగ్యం దానివల్ల జ్ఞానం, మోక్షం వస్తాయన్నాడు.

రాజా ! యోగి ముందుగా మనస్సుని జయించాలి. గౌరవాన్ని విషంగానూ, అవమానాన్ని అమృతంగానూ అనుకుని తను ఎక్కడుంటే అదే ఇల్లుగా అనుకుని దొరికినదే ఆకలికి తిని, తనకి ఉన్నదే ధనంగా అనుకుని నాది అన్నమాటని వదిలి పెట్టినప్పుడే యోగపురుషుడవుతాడు అని చెప్పాడు.

అలర్కుడు దత్తాత్రేయుడు చెప్పినట్లుగా నడుచుకుని కొడుకుకి రాజ్యం ఇచ్చి తపస్సు చేసుకుని యోగి అయ్యాడు.

దత్తాత్రేయుడు విల్లు అమ్ములు పట్టుకుని రెండు వేటకుక్కలు కూడా వస్తుంటే చెంచువాడిలా ఉంటాడు.

ఇదీ దత్తాత్రేయ మహర్షి కథ ! చదివారు కదా !

బ్రహ్మ విష్ణు మహేశ్వరుల అంశలో పుట్టి తల్లిదండ్రులకి మోక్షం ఇచ్చి, అన్నీ తెలిసి అన్ని అనుభవించగలిగి కూడ ఇతరులకి జ్ఞానబోధ చెయ్యడానికి తను ఆచరించి చూపించాడన్నమాట.

అన్నీ నావి, నాది అనుకోవద్దనీ, నాది అనేది విషవృక్షం లాంటిదనీ, దాన్ని ఎలా నరకాలో ఎంత బాగా చెప్పాడో కదూ... మనం కూడ కొంతయినా ఆచరించ వచ్చనుకుంటాను. ఆచరించి చూద్దాం.... ప్రయత్నిస్తే తప్పులేదుగా...

# 41. దధీచి మహర్షి

**మ**నం ఇప్పుడు దధీచి మహర్షి గురించి తెలుసుకుందాం. మరి మీరు రెడీయేనా? దధీచి మహర్షి కూడా చాలా గొప్ప ఋషి.

దధీచి మహర్షి తల్లిదండ్రులు ఎవరో తెలుసా ? తండ్రి, చ్యవన మహర్షి తల్లి సుకన్య. దధీచి చిన్నతనం నుంచీ సరస్వతీ నది దగ్గర ఆశ్రమం ఏర్పాటు చేసుకుని తపస్సు చేసుకుంటూ ఉండేవాడు. దధీచికి తపశ్శక్తి వల్ల వచ్చిన తేజస్సు చూసి సరస్వతి ఆనందపడుతుండేది.

కానీ, అతడి తపస్సుకి భయపడి ఇంద్రుడు విఘ్నం చెయ్యడానికి పంపించిన అలంబుస అనే అప్సరస దధీచి మహర్షి తపస్సుని భగ్నం చేసింది. వాళ్ళకి పుట్టిన వాడు సారస్వతుడు. సరస్వతి సారస్వతుణ్ణి పెంచింది. సారస్వతుడు కూడ దధీచి అంతటి తపస్సంపన్నుడై కరువు రోజుల్లో ఋషులందరికీ భోజనం పెడ్తుండేవాడు.

ఒకనాడు ఇంద్రుడు దధీచిని నువ్వు చాలా గొప్పవాడివి. నీకు ఉత్తమమైన శాస్త్రాలు చెప్తానని చెప్పి శాస్త్రాలన్నీ దధీచికి చెప్పాడు. ఇవి ఎవరికైనా చెప్తే నీ తల నరికేస్తానని కూడ చెప్పాడు.

ఇది తెలుసుకుని అశ్వినీ దేవతలు దధీచిని కలిసి ఇంద్రుడు చెప్పిన శాస్త్రాలు వాళ్ళకి చెప్పమని అడిగారు. చెప్తే ఇంద్రుడు తలనరికేస్తానన్నాడు కదా అన్నాడు దధీచి. నీకు ఏమీ కాకుండా మేం చేస్తామని చెప్పి అశ్వినీ దేవతలు మొదట దధీచి తల తీసి వేరే చోట దాచి అతడికి గుఱ్ఱం తల అతికి శాస్త్రాలు నేర్చుకున్నారు.

ఇంద్రుడు వచ్చి దధీచి తల నరికేశాడు. అశ్వినీ దేవతలు వాళ్ళు దాచిన దధీచి తల మళ్ళీ అతికించారు. దధీచి బ్రతికిపోయాడు. ఆలోచన బావుంది కదూ !

దధీచి ఒకనాడు తన బాల్య స్నేహితుడైన క్షువుడనే రాజుని చూడ్డానికి వెళ్ళాడు. క్షువుడు దధీచిని గౌరవంగా తీసుకెళ్ళాడు. ఇద్దరు మాట్లాడుకుంటూ వుండగా బ్రాహ్మణుడు గొప్పవాడని దధీచి, కాదు క్షత్రియుడే గొప్పవాడని క్షువుడు వాదనలోకి దిగారు. వాదన పెరిగి ధధీచికి కోపం వచ్చి క్షువుణ్ణి పొడిచాడు. క్షువుడు దధీచిని ముక్కలు ముక్కలుగా నరికేశాడు. శుక్రాచార్యుడు వచ్చి ఆ ముక్కల్ని కలిపి దధీచిని బ్రతికించి శివుణ్ణి గురించి తపస్సు చెయ్యమని చెప్పి వెళ్ళిపోయాడు.

ధధీచి శివుణ్ణి గురించి ఘోరతపస్సు చేశాడు. మూడు లోకాలు దధీచి తపస్సుకి భయపడిపోతుంటే, శివుడు ప్రత్యక్షమై దధీచికి ఎప్పుడు కావాలంటే అప్పుడే మరణించగలిగే శక్తి, వజ్రంతో సమానమయిన శరీరం, ముల్లోకాల్ని జయించగల శక్తిని ఇచ్చాడు.

ఇన్ని వరాలొచ్చినా దధీచి క్షువుడు చేసిన అవమానం మర్చిపోలేక అతనింటికి వెళ్ళి ఒక తన్ను తన్ని నువ్వు కాదు నీ విష్ణువు కూడ నన్నేం చేయలేడని చెప్పి వచ్చేశాడు.

క్షువుడు విష్ణువు గురించి తపస్సు చేసి తనకి జరిగిన అవమానం చెప్పాడు. విష్ణువు దధీచిని తప్పించి నువ్వు చెయ్యగలిగింది ఏమీ లేదు, అతడు క్షమాపణ అడగడం గొప్ప తపశ్శాలి అని చెప్పాడు. క్షువుడు దధీచిని క్షమించమని అడిగాడు. బ్రాహ్మణుల కోపం నీటి మీద రాసిన గీతల్లా ఎక్కువకాలం ఉండవు కదా! అలాగే ఇద్దరు స్నేహితులు మళ్ళీ కలిసిపోయారు.

దధీచి ధర్మరక్షణ కోసం ఒక ఆశ్రమంలో శిష్యులకి విద్యాభ్యాసం మొదలుపెడితే ఆ శిష్యులు వారి శిష్యులు ఇలా.. కోటాను కోట్ల ఋషులైపోయారు. దధీచి 'సువర్చ' అనే పేరుకల అమ్మాయిని పెళ్ళిచేసుకున్నాడు.

ఇలా ఉండగా ఒకసారి దక్షప్రజాపతి యజ్ఞం చెయ్యాలని అనుకుని దధీచిని శిష్యులతో కలిసి రమ్మని పిలిచాడు. దధీచి శిష్యుల్ని తీసుకుని వెళ్ళాడు. దక్షప్రజాపతి శివుణ్ణి, శివభక్తుల్ని పిలవలేదు. దధీచికూడ తనకి భయపడి వచ్చాడనుకుని మహర్షీ! నేను శివుణ్ణి, శివభక్తుల్ని పిలవలేదు. నీకు ఇష్టమైతే ఉండు. కష్టమైతే వెళ్ళిపో అన్నాడు దక్షుడు.

దధీచి తోక త్రొక్కిన పాములా లేచి దక్షప్రజాపతిని నీకీ దుర్బుద్ధి ఎలా పుట్టింది? దేవాదిదేవుడైన శివుడు లేకుండా యజ్ఞం ఎలా చేస్తావు? అని శివుణ్ణి స్తోత్రం చెయ్యడం మొదలుపెట్టాడు. దక్షప్రజాపతి ఇక్కడ శివుణ్ణి తలిచే వాళ్ళుంటే వెళ్ళిపొండన్నాడు. దధీచి శిష్యుల్తో సహాలేచి నేనెన్ని చెప్పినా నువ్వు లెక్క చేయడం లేదు. నీ యజ్ఞం సర్వనాశనమయిపోతుంది. నువ్వు చేస్తున్న యజ్ఞానికి వచ్చిన వాళ్ళు కూడా నాశనమయిపోతారని శపించాడు. తర్వాత వీరభద్రుడి వల్ల దక్షయజ్ఞం నాశనమయిపోయింది.

రాక్షసులు దేవతల మీద విజృంభించి యుద్ధం చేస్తున్నారు. దేవతలు వాళ్ళ బాధపడలేక శస్త్రాస్త్రాలన్నీ దధీచికి ఇచ్చి దాచమన్నారు. ఇంద్రుడిలాంటి పెద్దవాళ్ళు చెప్పారుకదాని దధీచి సరే అని ఎక్కువకాలం దాచలేక అన్నీ మింగేశాడు. అవన్నీ జీర్ణమయిపోయి రక్తనాళాల్లోను ఎముకల్లోనూ చేరిపోయాయి.

దేవతలొచ్చి దధీచిని అస్త్రాలిమ్మన్నారు. మీరు చాలాకాలం రాలేదు కదా, అందుకే అవన్నీ మింగేశాను. ఎముకల్లో కలిసిపోయాయి నన్ను చంపి తీసుకోమన్నాడు.

దేవతలు ఏం చెయ్యలేక దధీచిని చంపలేక ఏడ్వడం మొదలుపెట్టారు. దధీచి వాళ్ళని ఓదార్చి మీకు తప్పనిసరిగా కావాలి అనుకున్నప్పుడు రండి. నా శరీరం నేను విడిచేస్తాను. నా అస్థులే విలువైన ఆయుధాలుగా మీకు ఉపయోగపడతాయని చెప్పి వాళ్ళని పంపించాడు.

వృత్రాసురుడనే రాక్షసుడు దేవతల్ని చంపెయ్యడం మొదలెట్టాడు. అతన్తో యుద్ధం చెయ్యలేక బ్రహ్మని ప్రార్థించారు దేవతలు. వాళ్ళని దధీచి దగ్గరకు వెళ్ళి అతని అస్థుల్ని తీసుకుని ఆయుధాలుగా ఉపయోగిస్తే వృత్రాసురుణ్ణి చంపచ్చని చెప్పాడు బ్రహ్మ.

దేవతలు దధీచికి జరిగింది వివరంగా చెప్పారు. దధీచి తనని చంపి అస్థుల్ని తీసికెళ్ళమన్నాడు. దేవతలు మహాత్మా! మిమ్మల్ని చంపితే మాకు బ్రహ్మహత్యా పాతకం వస్తుంది. మీకు మీరుగా మరణించగల వరం మీకుంది అనుగ్రహించండి స్వామీ! అన్నారు.

దధీచి వాళ్ళు అడిగినట్లుగా శరీరాన్ని విడిచి పెట్టి పరమేశ్వరుడిలో ఐక్యమయిపోయాడు. దధీచి అస్థుల్ని బ్రహ్మ చక్రం, వజ్రాయుధం లాంటి ఆయుధాల్ని చేసుకుని రాక్షసుల్ని చంపారు.

దధీచి మరణించేనాటికి ఆయన భార్య సువర్చల గర్భవతి. భర్తతోపాటే సతీ సహగమనం చేస్తుంటే బ్రహ్మ వచ్చి అమ్మా ! నీ కడుపులో మహాత్ముడైన బాలుడున్నాడు సహగమనం చెయ్యద్దన్నాడు.

కానీ, సువర్చల మీ దేవతలు చిత్రవిచిత్రంగా చేస్తున్నారు. నా భర్తని చంపారు. నన్ను వైధవ్యాన్ని అనుభవించమంటున్నారు. నా భర్త మరణానికి కారణమయిన దేవతలు

పశువులుగా ప్రవర్తిస్తారని చెప్పి శపించి చితిలో దూకింది. ఆవిడ కడుపులో పిల్లాడు పిప్పలచెట్టుకింద పడ్డాడు.

పిప్పల చెట్టు చంద్రుడ్ని అడిగి అమృతం తెచ్చి ఆ పిల్లవాడికిచ్చి పెంచింది. పిప్పలచెట్టు పెంచిన ఆ పిల్లాడే పిప్పలాది మహర్షి అయ్యాడు. పిప్పలాదుడు పెరిగి పెద్దవాడయ్యాక తపస్సుచేసి శివుణ్ణి మెప్పించి తన తండ్రిని చంపిన దేవతల్ని చంపగలిగేలా వరం అడిగాడు. దేవతల్ని చంపడం తప్పని పితృలోకంలో వున్న తల్లిదండ్రుల్ని చూసుకునే శక్తినిచ్చాడు శివుడు.

ఇది పిల్లలూ దధీచి మహర్షి కథ !!

దధీచి మహర్షి ఎంత గొప్పవాడో చూశారా! గొప్ప తపశ్శాలే కాకుండా తను మరణించి తన ఎముకల్ని ఆయుధాలుగా ఉపయోగించుకుని రాక్షసుల్ని చంపమన్నాడు. తన శరీరాన్ని మంచి పనికోసం ఉపయోగించాడు. గొప్పవాళ్ళెప్పుడూ వేరే వాళ్ళకోసమే బ్రతుకుతారని అర్ధమయింది కదా !

# 42. దక్ష మహర్షి

ఇప్పుడు ఎవరి గురించి తెలుసుకుంటున్నామా... అని ఆలోచించేస్తున్నారా! అంత శ్రమ వద్దు. నేను చెప్తున్నాను కదా, దక్షమహర్షి . పరమేశ్వరుడి మావగారు. ఇంతకన్నా గొప్పతనం ఏముందీ.... చదవడం మొదలుపెట్టేయ్యండీ....

బ్రహ్మ మానసపుత్రులు తొమ్మండుగురు. వాళ్ళపేర్లు చెప్తాను. ఎప్పుడైనా ఎవరేనా అడిగితే చెప్పాలి కదా. భృగువు, మరీచి, అంగిరసుడు, వసిష్ఠుడు, దక్షుడు, అత్రి. పులస్త్యుడు, పులహుడు, క్రతువు వీళ్ళంతా బ్రహ్మ మానస పుత్రులు. బ్రహ్మ కుడి బొటన వ్రేలి నుంచి మన దక్షమహర్షి పుట్టాడు.

దక్షుడు మనువు కూతురు ప్రసూతిని పెళ్ళి చేసుకున్నాడు. అతనికి పదహారు మంది కూతుళ్ళు కలిగారు. వాళ్ళందరికీ పెళ్ళిళ్ళు చేసి వాళ్ళ వల్ల మనవల్ని కూడ పొందాడు. దక్షుడికి యాభయిమంది కూతుళ్ళని కూడా చెప్తారు. అందరినీ గొప్పవాళ్లకిచ్చి పెళ్ళి చేశాడు.

ఇప్పుడు దక్షుడి గురించి తెలుసుకుందాం. దక్షమహర్షి విష్ణుమూర్తి గురించి తపస్సు చేసి సృష్టి చెయ్యడానికి తగిన శక్తినిమ్మని ఎన్నో రకాల జీవరాసుల్ని సృష్టించాడు. కాని వాటి వంశాలు పెరగలేదు. బ్రహ్మని అడిగాడు వంశాలు వృద్ధి పొందట్లేదు, ఏం చెయ్యాలని. బ్రహ్మ దక్షుణ్ణి పెళ్ళి చేసుకోమన్నాడు.

దక్షుడు వరుణ ప్రజాపతి కూతురు అసిక్నిని పెళ్ళి చేసుకున్నాక అయిదువేల మంది కొడుకులు కలిగారు. దక్షుడు కొడుకులందర్నీ పిలిచి మీరందరూ పెళ్ళి చేసుకుని వంశాన్ని వృద్ధి చెయ్యమన్నాడు. వాళ్ళు సరేనని వెళ్ళారు కానీ, ఏమయ్యారో దక్షుడికి తెలియలేదు.

దక్షుడు మళ్ళీ వైతరణిని పెళ్ళి చేసుకుని వెయ్యిమంది కొడుకుల్ని పొంది వాళ్ళకి కూడ వాళ్ళ అన్నలకి చెప్పినట్లే చెప్పి పంపాడు. వాళ్ళు కూడా తిరిగి రాలేదు. దక్షుడికి మళ్ళీ వైతరణి వల్ల అరవై మంది కూతుళ్ళు పుట్టారు. వాళ్ళందరికి పెళ్ళి చేసి సృష్టి పెంచాడు.

తన కొడుకుల్ని తపస్సు చేసికొని గొప్పవాళ్ళై పెళ్ళి చేసుకుని సృష్టి చెయ్యమంటే కనిపించకుండా అయిపోడానికి కారణం నారద మహర్షేనని తెలిసి నారదుడ్ని నీకీర్తి నాశనమవుతుంది, నువ్వు అందరితో కలహ భోజనుడని పిలిపించుకుంటావు. నువ్వు ఏ లోకానికెళ్ళినా ఉండే చోటు లేక నిత్య సంచారిగా ఉంటావని శపించాడు దక్షుడు. ఈ రోజునుండి పురుషుడు విషయ సుఖాన్ని అనుభవిస్తేనే కానీ జ్ఞానాన్ని పొందలేడు అని కూడా చెప్పాడు దక్షుడు.

దక్షుడి కూతుళ్ళని పెళ్ళి చేసుకున్న చంద్రుడు అందర్ని సమానంగా చూడకుండా రోహిణిని మాత్రమే ప్రేమగా చూస్తున్నాడని మిగిలిన కూతుళ్ళ వలన తెలుసుకుని చంద్రుణ్ణి క్షయరోగివి, పిల్లలు లేనివాడివి అవమని శపించాడు దక్షుడు. దక్షుణ్ణి క్షమించమని అడిగాడు చంద్రుడు. దక్షుడు మళ్ళీ చంద్రుడి కళలన్నీ ఉండేటట్లు అనుగ్రహించాడు. తన భార్యలవల్ల పిల్లలు పుట్టలేదు కానీ, తార వల్ల బుధమహర్షి పుట్టాడు చంద్రుడికి.

బ్రహ్మ ఒకసారి సత్రయాగం చెయ్యాలనుకుని అందర్నీ పిలిచాడు. విష్ణు మహేశ్వరులు, ఇంద్రుడు మిగిలిన దేవతలు, ఋషులు అందరూ వచ్చి కూర్చున్నారు. దక్షుడు కూడ యజ్ఞం చూడ్డానికి వచ్చాడు. అతడు రాగానే అందరూ లేచి నుంచున్నారు కానీ, బ్రహ్మ, ఈశ్వరుడు లేవలేదు.

దక్షుడికి తగిన సత్కారాలు, పూజలు అన్నీ అయ్యాక లేచి నన్ను చూసి కూడ శివుడు లేవలేదు. శివుడికి పొగరెక్కువ, అల్లుడినన్న గర్వం, శూద్రుడికి వేదాలిచ్చినట్లు వీడికి నాపిల్లనిచ్చాను. కనీసం పలకరించలేదు కాబట్టి ఇంద్రాదుల్లో వున్నా కూడా ఇతనికి యాగభాగం అందకుండా ఉండాలని శపించాడు. సభలో వాళ్ళు దక్షుణ్ణి ఇది తప్పనివారిస్తే దక్షుడు లేచి వెళ్ళిపోయాడు.

నందికేశ్వరుడు దక్షుణ్ణి శపించాడు. భృగుమహర్షి లేచి నందిని శపించాడు. ఇలా ఒకళ్ళ నొకళ్ళు శపించుకున్నారు. కాకపోతే అందరూ గొప్పవాళ్ళే కదా ఎవరికీ ఏమీ జరక్కుండా అందరూ బాగానే ఉన్నారు.

ఇవన్నీ చూసిన విష్ణుమూర్తికి మాత్రం బాధనిపించి వెళ్ళిపోయాడు. అయినా ఒకళ్ళనొకళ్ళు ఇలా శపించేసుకుంటే వాళ్ళ పెద్దరికం ఏమయినట్లు....

దక్షుడికి శివుడికి మధ్య మాత్రం శతృత్వం పెరుగుతూనే ఉంది. పరమేశ్వరుడు లేకుండా యాగం ఉండదని తెలిసికూడా దక్షుడు వాజపేయ యాగం చేసి వెంటనే బృహస్పతి

యాగం ప్రారంభించాడు. దాన్ని చూడ్డానికి మునులు, ప్రజాపతులు, దేవతలు, అందరూ వెడుతూ ఆకాశమార్గంలో ఆ యాగం గురించే చెప్పుకుంటున్నారు.

దక్షుడి కూతురు, శివుడి భార్య అయిన "సతీదేవి" భర్తని చూసి మనమూ వెడదాం అంది. సతీ! నువ్వు దక్షుడి కూతురివే అయినా నా భార్యవి కనుక నిన్ను అవమానిస్తారు. ఆ అవమానం భరించడం కంటే చావడమే మంచిదనిపిస్తుంది, వెళ్ళద్దు అన్నాడు శివుడు.

కాని సతి తల్లిదండ్రుల్ని, అక్క చెల్లెళ్ళని చూడాలని దక్షుడి యజ్ఞశాలకి వెళ్ళింది. తల్లి అక్క చెల్లెళ్ళు ఆమెని పలకరించారు. దక్షుడు మాత్రం అవమానపరిచాడు.

తండ్రీ ! లోకంలో జీవులందరికీ ఇష్టుడైన ఈశ్వరుడికి ఇష్టమైన వాళ్ళు, ఎక్కువయినవాళ్ళు అని ఉండరు. అలాంటి పరమేశ్వరుణ్ణి నువ్వు నిర్లక్ష్యం చేశావు కనుక నేను ఇక్కడే ప్రాణత్యాగం చేస్తున్నానని యోగమార్గంలో అగ్నిని సృష్టించుకుని దగ్ధమయిపోయింది సతీదేవి. శివభక్తులు కోపంతో దక్షుణ్ణి చంపబోతే భృగు మహాముని వాళ్ళందర్నీ తరిమి కొట్టించాడు.

ఈ సంగతి విన్న శివుడు కోపంతో తన జటాజూటం నుంచి ఒక వెంట్రుక తీసి వీరభద్రుడ్ని సృష్టించి దక్షయజ్ఞం నాశనం చెయ్యమన్నాడు. వీరభద్రుడు వీరావేశంతో వెళ్ళి దక్షుణ్ణి అతని అనుచరుల్ని చంపి, యజ్ఞం నాశనం చేసి దక్షుడి తల నరికి కైలాసానికి వెళ్ళాడు.

బ్రహ్మ విష్ణు దేవతలు కైలాసానికి వెళ్ళి శివుడితో దక్షుణ్ణి బ్రతికించ మన్నారు. మేక ముఖం కలవాడుగా దక్షుణ్ణి బ్రతికించాడు శివుడు.

దక్ష మహర్షి పరమేశ్వరుణ్ణి చూసి క్షమాపణ అడిగాడు. అందరూ కలిసి యజ్ఞం పూర్తి చేయించి దక్షుణ్ణి దీవించి వెళ్ళిపోయారు.

దాక్షాయణి అయిన సతీదేవి మళ్ళీ హిమవంతుడికి మేనక వలన పుట్టి శివుణ్ణి పెళ్ళి చేసుకుంది.

దక్షుడు రాసిన ధర్మశాస్త్ర గ్రంధానికి 'దక్షస్మృతి' అని పేరు – దాంట్లో ఏడు అధ్యాయాలున్నాయి. మొదటి అధ్యాయం చతురాశ్రమ వర్ణన గురించి, రెండవ అధ్యాయం ఉదయాన్నే లేచి చెయ్యాల్సిన కార్యక్రమాల గురించి, మూడవ అధ్యాయం గృహస్థాశ్రమం గురించి, నాలుగవది భార్యభర్తల ధర్మాల గురించి, అయిదవది చెయ్యవలసిన పన్లు చెయ్యకూడని పన్లు, ఆరవది పుట్టుకకి మృత్యువుకి సంబంధించిన మైలల గురించి, ఏడవ అధ్యాయం యోగం గురించి చెప్పబడింది.

దక్షుడు బ్రహ్మమానసపుత్రుడై సృష్టికార్యంలో బ్రహ్మకి సహాయం చేసి అన్ని జీవరాసుల సృష్టిని పెంచాడు. మనిషి గర్వంతో పెద్దవాళ్ళని నిర్లక్ష్యం చేస్తే ఏమవుతుందో మనకి తెలియచెప్పాడు. దక్షస్మృతి అనే పేరు గల గ్రంథం మనిషి జీవితాన్ని ఎలా గడపాలి అన్నది ప్రతి అధ్యాయంలోనూ ప్రతి విషయం ప్రజలకి తెలిసేలా వ్రాసి మనకి అందుబాటులోకి తెచ్చాడు.

# 43. దీర్ఘతమో మహర్షి

**నా**కంటే ముందే రడీగా వున్నారా...! మీకు ఋషుల కథల మీద ఇష్టం పెరిగినట్లుంది. చూశారా మరి! మీ కోసం ఎంతమంది మహర్షుల కథలు అందించామో. చదవండింకా.... ఇంకా.. ఇప్పటి మనం చదవబోయేది, తెలుసుకోబోయేది ఎవరిగురించో చెప్పండి. దీర్ఘతమ మహర్షి గురించి.

ఈ మహర్షి ఉతథ్య మహర్షికి మమతకి పుట్టినవాడు. బృహస్పతి ఇతని తమ్ముడు. ఉతథ్యుడికి ఎప్పుడూ తపస్సు చేయడం, తీర్థయాత్రలు చేయడం, అంటే చాలా ఇష్టం. గొప్ప జ్ఞానవంతుడై వుండేవాడు. దేవతల గురువు బృహస్పతి ఈ మహర్షికి సోదరుడున్న మాట.

ఉతథ్యుడి భార్య మమత గర్భవతిగా వున్న రోజుల్లో బృహస్పతి తన సోదరుణ్ణి చూడ్డానికి వచ్చాడు. మమత అతనికి అతిథి సత్కారాలు చేసింది. శాపగ్రస్థుడైన బృహస్పతి అన్న భార్య అని కూడ చూడకుండా ఆమెని బలవంతం చేశాడు. మమత కడుపులో వున్న పిల్లవాడు బృహస్పతిని అవమానించాడు. బృహస్పతి ఆపిల్లవాణ్ణి గుడ్డివాడుగా పుట్టమని శపించాడు. అలా పుట్టు గుడ్డివాడిగా పుట్టిన వాడే మన దీర్ఘతమో మహర్షి.

దీర్ఘతముడు గ్రుడ్డివాడుగా పుట్టినా వేదవేదాంగాలు చదివి విజ్ఞానవేత్త, కీర్తిగలవాడు, తపశ్శాలి అయ్యాడు. తండ్రి దీర్ఘతముడికి ప్రద్వేషిణిని ఇచ్చి పెళ్ళి చేశాడు. పేరుకి తగ్గట్టే ప్రద్వేషిణి అందర్నీ ద్వేషించడంలో గొప్పది. దీర్ఘతముడికి ప్రద్వేషిణి యందు చాలా మంది కొడుకులు పుట్టారు.

ఒకసారి దీర్ఘతముడు ఒక్కడూ తపస్సు చేసుకుంటూ వున్నాడు. అక్కడికి కామధేనువు కొడుకు వచ్చి దీర్ఘతముణ్ణి నువ్వు గ్రుడ్డివాడివైనా శక్తిమంతుడివి. నీకు నేను పిల్లలు లేని వాళ్ళకి పిల్లల్ని పుట్టించగల విద్యని నేర్పిస్తాను. దీనివల్ల వంశనాశనం అయిపోతున్న వాళ్ళ వంశం నిలబెట్టినవాడ వవుతావని చెప్పి ఆ విద్యని దీర్ఘతముడికి నేర్పించాడు.

ఈ విద్య ఎలా పనిచేస్తుందో చూద్దామని భార్యని సహకరించమంటే తిట్టింది. అది ఆవిడ జన్మ హక్కు కదా. సరే ఈ విద్యని పరీక్షించుకోవాలి కదా పిల్లలులేని వాళ్ళ దగ్గరకి వెళ్ళి తాను నేర్చుకున్నది పనిచేస్తోందని నిరూపించుకున్నాడు. తన భర్త అందరితో తిరుగుతున్నాడనుకుని ప్రద్వేషిణి అసహ్యించుకుని ఇంట్లోంచి పొమ్మంది.

విషయం తెలుసుకోకుండా భర్తనని చూడకుండా నన్నవమానించావు కాబట్టి ఇక మీదట ప్రతిస్త్రీకి జీవితాంతం ఒక్క భర్తే ఉండాలి. వాడు ఉన్న చచ్చిపోయినా ఇంకొకణ్ణి పెళ్ళి చేసుకోకూడదు. అలా చేస్తే ఆమెకి అపకీర్తి, నింద వస్తాయని శపించాడు దీర్ఘతముడు.

ప్రద్వేషిణి పిల్లల్ని పిలిచి మీ తండ్రి నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నాడు, తీసుకువెళ్ళి గంగలో పడెయ్యమంది. పిల్లలు అలాగే చేశారు. దీర్ఘతముడు కాళ్ళు చేతులు కట్టేసి బుట్టలో

గంగా నదిలో పడేసినా దాంట్లోనే వేదాలు వల్లెవేసుకుంటున్నాడు. అలలు ఎటువైపు వెడితే అటువైపు ఆ బుట్ట కొట్టుకుపోతోంది.

కొన్నాళ్ళ తర్వాత బలి అనే మహారాజు గంగాభిషేకం చేద్దామని వచ్చి నదిలో కొట్టుకువస్తున్న దీర్ఘతముణ్ణి చూసి ఇంటికి తీసుకెళ్ళి అతని గురించి మొత్తం తెలుసుకుని, అంతటి మహర్షిని చూడగల్గినందుకు ఎంతో సంతోషించాడు.

దీర్ఘతముణ్ణి రాజసౌధానికి తీసికెళ్ళి సపర్యలు చేసి బలిమహారాజు తనకి పిల్లలు లేరని పిల్లలు కలిగేటట్లు చూడమని ప్రార్థించాడు. తన భార్య సుధేష్ణని మహర్షి దగ్గరకు వెళ్ళమన్నాడు. కాని సుధేష్ణ ఆ మహర్షి రూపం చూసి అసహ్యించుకుని పనిమనిషిని పంపింది. ఆపనిమనిషికి పదకొండుమంది కొడుకులు పుట్టారు.

ఆ పదకొండుమంది తన పిల్లలే అనుకుని బలిరాజు ఆ పిల్లలకి వేదం నేర్పించాలని దీర్ఘతముడి దగ్గరకు తీసుకువచ్చాడు. మహర్షి ఈ పిల్లలు సుధేష్ణకు పుట్టిన వాళ్ళు కాదని పనిమనిషి పిల్లలని చెప్పాడు. బలి బాధపడి మళ్ళీ సుధేష్ణని మహర్షి దగ్గరకి పంపాడు.

సుధేష్ణ వలన బలిమహారాజుకి అయిదుగురు కొడుకులు పుట్టారు. వాళ్ళు పెరిగి పెద్దవాళ్ళయి అంగదేశం, కళింగదేశం, వంగదేశం, పుండ్రము, సుహ్మము అనే రాజ్యాలు పాలించారు. ఈ రకంగా దీర్ఘతమో మహర్షి చాలా రాజవంశాల్ని నిలబెట్టాడు.

ఇదర్రా పిల్లలూ.... దీర్ఘతమో మహర్షి కథ!!

పిల్లలు కావాలంటే ఆపరేషన్లు గట్రా ఈ రోజుల్లో బాధలు. ఇది వరకు దానికీ ఒక విద్య ఉండేది. దాన్ని ఉపయోగించి ఆ రోజుల్లోనే దీర్ఘతముడు పిల్లలు లేని వాళ్ళకి పిల్లల్ని అనుగ్రహించి వాళ్ళ వంశాలు నిలబెట్టాడు. చాలా బాగుంది కదూ.

# 44. దుర్వాస మహర్షి

**మ**నం దుర్వాస మహర్షి గురించి తెలుసుకుందాం. అందరూ వచ్చేశారా... ఇంకా కొంతమంది మిగిలిపోయారా. మనకి దుర్వాసుడు అంటే కోపిష్ఠి అనే తెలుసు. కాని దుర్వాస మహర్షి చాలా గొప్పవాడు.

అత్రి మహర్షి తపస్సుకి అనసూయ పాతివ్రత్యానికి త్రిమూర్తులు ఇచ్చిన వరప్రసాదం దుర్వాసుడు. దుర్వాసుడు పెరిగి ఉపనయనం అయిపోయాక బ్రహ్మచర్యం తీసుకుని గొప్ప తపస్సు చేశాడు. దేవతలు అతని తపస్సుకు మెచ్చుకుని మూడు లోకాల్లోనూ తిరగగల శక్తిని ఇచ్చారు. తపస్సు వల్ల వచ్చిన శక్తితో, తేజస్సుతో మూడు లోకాల్లోనూ తిరుగుతూ ఉండేవాడు దుర్వాసుడు.

ఒకనాడు దుర్వాసుడు విష్ణుమూర్తిని దర్శించి ఆయన ఇచ్చిన పారిజాతపువ్వునీ, మధ్యలో వింధ్యాధర స్త్రీలిచ్చిన పూలదండల్నీ పట్టుకొస్తుంటే ఇంద్రుడు ఎదురొచ్చాడు. దుర్వాసుడు ఆ దండలు ఇంద్రుడికి వేస్తే అతడు తీసి తన ఏనుగుకి వేశాడు. ఏనుగు ఆ దండల్ని చించి పారేసింది.

దుర్వాసుడికి కోపం వచ్చి ఇంద్రుడు ఐశ్వర్యాలన్ని గంగపాలైపోవాలనీ ఐరావతం తల తెగిపోవాలనీ శపించాడు. అందుకే అమృతం సముద్రంలోకి పోయింది. ఐరావతం తల వినాయకుడికి వెళ్ళింది.

దుర్వాసుడు ధర్మదేవత నిజరూపాన్ని చూడాలని దత్తాత్రేయుడితో కలిసి ఆహారం తీసుకోకుండా నిప్పులలోనూ, నీళ్ళ మధ్య పదివేల సంవత్సరాలు తపస్సు చేశాడు. ధర్మదేవత కనిపించలేదు. దుర్వాసుడు కోపంతో ధర్మదేవతని శపిద్దామనుకుంటూ ఉండగా ధర్మదేవత బ్రాహ్మణరూపంలో సపరివారంగా వాళ్ళ ఎదురుగా వచ్చాడు. దుర్వాసుడు ఇంకా కోపంలోనే ఉండడం, చూసి మహాత్మా ! ఋషులకు కోపం ఉండకూడదు అన్నాడు.

నాకోపం గురించి మాట్లాడుతున్నావు అసలు నువ్వెవరన్నాడు దుర్వాసుడు. నేను ధర్మదేవతని నీ కోపం తగ్గించడానికి వచ్చానన్నాడు.

నువ్వు నాకు కన్పించడానికి పదివేల సంవత్సరాలు కావల్సివచ్చాయా? ఇప్పుడు కూడా నువ్వు నా శాపానికి భయపడి వచ్చావు. నువ్వు సుఖం తెలియని రాజుగానూ, దాసీదాని కొడుకుగానూ, ఛండాలుడుగానూ పుట్టమని ధర్మదేవతని శపించాడు దుర్వాసుడు.

అదే విధంగా ధర్మదేవత ధర్మరాజు, విదురుడు, వీరబాహుడు గాను పుట్టాడు. కర్మఫలం అనుభవించడం అంటే ఇదేనేమో !

కృతయుగంలో సుప్రతీకుడనే మహారాజుకి దుర్వాస మహర్షి వరం వల్ల భార్య విద్యుత్ప్రభకు దుర్జయుడనే కొడుకు పుట్టాడు. అతణ్ణి వెంటనే పదహారేళ్ళ వాడుగా చేసి, ఇంకొక భార్యకి సుద్యుమ్నుడనే కొడుకు కలిగేలా వరమిచ్చాడు దుర్వాసుడు.

దుర్వాస మహర్షి గంధమాదన పర్వతం మీద తపస్సు చేసుకుంటూ ఉండగా బలిచక్రవర్తి కొడుకు సాహసికుడు, తిలోత్తమ కలిసి మహర్షి ఉన్నాడని కూడా మర్చిపోయి విచ్చలవిడిగా ప్రవర్తిస్తుంటే ఇద్దర్నీ రాక్షసులుగా భూమిమీద పుట్టమని శపించాడు దుర్వాసుడు.

శ్రీకృష్ణుడి చేతిలో మరణించిన గార్ధభాసురుడు, బాణుడి ఇంట్లో పుట్టిన ఉష వీళ్ళిద్దరే దుర్వాసుడి శాపం వల్ల పుట్టినవాళ్ళు.

ఇంద్రుడు అప్సరసల పాటలు వింటూ ఉండగా నారదుడు అక్కడికి వచ్చాడు. ఇంద్రుడు ఇక్కడున్న అప్సరసల్లో ఎవరు గొప్ప అని నారదుణ్ణి అడిగాడు. దుర్వాసుడి దృష్టి ఎవరైతే మరల్చగలరో వాళ్ళు గొప్పన్నాడు నారదుడు.

అందరూ మావల్లకాదన్నారు కానీ, వపు అనే అప్సరస నేను దుర్వాసుణ్ణి తీసుకువస్తానని చెప్పి మహర్షి తపస్సు చేసుకుంటున్న చోట ఆడడం, పాడడం మొదలుపెట్టింది. దుర్వాసుడు వపుని చూసి పక్షివై పుట్టమని శపించాడు. ఆమె క్షమించమని అడగ్గానే శాపమోక్షమిచ్చాడు.

దుర్వాసుడు పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించుకుని ఔర్వ మహర్షి కుమార్తె 'కందళి'ని చేసుకోవాలనుకున్నాడు. ఔర్వ మహర్షి ఆమె కోపిష్ఠిదని క్షమించమన్నాడు. కోపిష్ఠి అయినా పర్వాలేదని కందళిని పెళ్ళి చేసుకున్నాడు దుర్వాసుడు.

ఎంతచెప్పినా కందళిని తన గుణాన్ని మార్చుకోలేదు. విసిగిపోయిన దుర్వాసుడు ఒకసారి కోపంగా చూశాడు. అంతే కందళిని భస్మమైపోయింది.

ఔర్వ మహర్షి తన కుమార్తెను చూద్దామని వచ్చి ఆమె భస్మమయిపోయిందని తెలిసి దుర్వాసుణ్ణి అంబరీషుడి వల్ల ఘోరమై అవమానం పొందుతావని శపించాడు.

దుర్వాసుడు తిరుగుతూ తిరుగుతూ అంబరీషుడి దగ్గర ఆతిథ్యం అడిగాడు. అంబరీషుడు సరేనన్నాడు. దుర్వాసుడు శిష్య సమేతంగా స్నానానికి వెళ్ళి ఎంతకీ రాకపోతే ద్వాదశి వ్రతనిష్ఠలో వున్న అంబరీషుడు బ్రాహ్మణుల అనుమతితో కొంచెం నీరు త్రాగాడు.

దుర్వాసుడు తిరిగి వచ్చాక తాను రాకుండా నీళ్ళు తాగినందుకు అంబరీషుణ్ణి శిక్షించాలని తన తలనుండి ఒక వెంట్రుక తీసి మంత్రించి పంపాడు. ఈలోగా అంబరీషుణ్ణి కాపాడ్డానికి విష్ణుమూర్తి చక్రం అడ్డం వేశాడు. దుర్వాసుడు చక్రానికి భయపడి ఈశ్వరుణ్ణి శరణువేడాడు. శివుడు తనవల్ల కాదన్నాడు. దుర్వాసుడు విష్ణుమూర్తిని ప్రార్థిస్తే అంబరీషుణ్ణి వేడుకోమన్నాడు. అంబరీషుణ్ణి వేడుకోగానే ఆ చక్రం మాయమయింది. ఇదంతా ఔర్వ మహర్షి శాపమేనని అర్థం చేసుకున్నాడు దుర్వాసుడు.

శబరితాపసుడు తపస్సు చేసుకుంటుంటే దుర్వాసుడు అక్కడికి వెళ్ళాడు. శబరుడు దుర్వాసుణ్ణి మెప్పించి ఆతిథ్యమిచ్చి ఆయనవల్ల గొప్ప పుణ్యాన్నిచ్చే వ్రతాలెన్నో తెలుసుకుని సత్యతప్తుడనే పేరుతో తరించాడు.

ముద్గల మహర్షిని పరీక్షించాలని దుర్వాసుడు అతనికి అతిథిగా వెళ్ళాడు. ముద్గలుడు తను ఉపవాసముండి దుర్వాసుడికి భోజనం పెట్టేవాడు. అలా ఎన్నిసార్లు వచ్చినా ముద్గలుడు విసుక్కోకుండా తనకి లేకపోయినా దుర్వాసుడికి పెట్టి పంపిస్తుంటే దుర్వాస మహర్షి అతడికి శరీరంతో స్వర్గానికి వెళ్ళే వరం ఇచ్చాడు.

దుర్వాస మహర్షి ఒకసారి కుంతి భోజుడింటికి వెళ్ళాడు. అతనికి సపర్యలు చేయడానికి కుంతిభోజుడు తన కుమార్తె కుంతిని అప్పగించాడు. కుంతి చేసిన సేవలకి మెచ్చుకుని దుర్వాసుడు కుంతిని వరం కోరుకోమన్నాడు.

ఏ దేవుడ్ని ఉపాసిస్తే ఆ దేవుడు వల్ల కొడుకుపుట్టేలా మంత్రం చెప్పమని అడిగింది కుంతి. కుంతి కోరినట్లుగా మంత్రం ఉపదేశించాడు దుర్వాసుడు.

ఒకనాడు పదహారువేలమంది గోపికలు, ఎనిమిది మంది భార్యలతో వున్న శ్రీకృష్ణుణ్ణి చూడాలనిపించి ద్వారకకి వెళ్ళాడు దుర్వాసుడు. శ్రీకృష్ణుడు ఉగ్రసేనమహారాజు, దేవకీవసుదేవులతో ఎదురెళ్ళి భక్తిగా తీసుకొచ్చి యోగమాయని సపర్యలకి పెట్టాడు.

కొంతకాలం తర్వాత శివుని అంశ వల్ల పుట్టిన యోగమాయని దుర్వాసుడికిచ్చి పెళ్ళి చేశాడు శ్రీకృష్ణుడు. దుర్వాసుడు రాత్రివేళ శ్రీకృష్ణుడు అష్టమహిషులదగ్గర, పదహారువేలమంది గోపికల దగ్గర ఒకేసారి ఉండడాన్ని చూసి ఆశ్చర్యపోయి శ్రీకృష్ణుణ్ణి స్తోత్రం చేశాడు.

అందర్నీ వదిలేసి శివపార్వతులున్న కైలాసానికి వెళ్ళి శివుడి కాళ్ళమీద పడి ఇంక భూలోకం అంటే విసుగు పుట్టింది, ఇక్కడే ఉండిపోతానన్నాడు దుర్వాసుడు. నా అంశంతో పుట్టిన యోగమాయ నీ భార్య, అదీ గాక విష్ణుమూర్తే శ్రీకృష్ణుడు. వాళ్ళని వదిలేసి నువ్వు ఇక్కడ ఉండకూడదని చెప్పి పంపించేసింది పార్వతీదేవి.

భూభారాన్ని తగ్గించాలని శ్రీకృష్ణుడు ఆలోచించి దుర్వాసుణ్ణి తల్చుకోగానే విషయం తెలిసిన మహర్షి ద్వారకకి వచ్చాడు. అక్కడ యాదవులు సాంబుడనే వాడికి ఆడవేషం వేసి ఈమెకి కొడుకెప్పుడు పుడతాడని మహర్షిని వేళాకోళం చేశారు. దుర్వాస మహర్షి మూర్ఖులారా! ఈమెకి ముసలం పుట్టి యాదవకులం నాశనం చేస్తుందని శపించి, శ్రీకృష్ణుడి కోరిక తీరిందని వెళ్ళిపోయాడు.

దుర్యోధనుడు పాండవుల్ని అవమానించాలని దుర్వాసుణ్ణి శిష్యసమేతంగా ద్వైతవనంలో వున్న పాండవుల దగ్గరికి వెళ్ళమన్నాడు. దుర్వాసుడు సరేనని వెళ్ళగానే ధర్మరాజు ఎదురెళ్ళి దుర్వాసుణ్ణి పూజచేశాడు. దుర్వాసుడు స్నానం చేసి శిష్యులతో కలిసి భోజనానికి వస్తానని చెప్పాడు.

వీళ్ళందరికి భోజనం ఎలా పెట్టాలా అని భయపడ్డాడు దర్మరాజు. ద్రౌపది తల్చుకోగానే శ్రీకృష్ణుడు వచ్చి వండుకునే గిన్నె తెమ్మని దాంట్లో ఒక మెతుకు తిని పాండవులకి భయం లేదని చెప్పాడు.

శ్రీకృష్ణుడి ప్రభావం వల్ల దుర్వాసుడికి శిష్యులకి ఆకలి దాహం లేకుండా పోయింది. దుర్వాసుడు యోగదృష్టితో దుర్యోధనుడి కుళ్ళు బుద్ధి తెలుసుకున్నాడు.

శ్రీరాముడు యముడితో రహస్యంగా మాట్లాడుతూ ఎవర్నీ లోపలకి రానివ్వద్దని లక్ష్మణుణ్ణి గుమ్మం దగ్గర కాపలా పెట్టాడు. కాని అదే సమయంలో దుర్వాసుడు నన్ను లోపలికి పంపకపోతే శపిస్తానన్నాడు.

లక్ష్మణుడు భయపడి అన్నకి ఈ విషయం చెప్పడానికి లోపలికి వెళ్ళాడు. రాముడు తను చెప్పింది వినలేదు కాబట్టి లక్షణుణ్ణి నగరాన్ని వదిలేసి వెళ్ళిపొమ్మన్నాడు రాముడు. ఈ విధంగా లక్ష్మణుడు తన అవతారం చాలించడానికి దుర్వాసుడు కారకుడయ్యాడు.

పరమేశ్వరుడి అంశలో పుట్టిన దుర్వాసుడు ఎంతో మందిని శిష్యుల్ని చేసుకుని అటు దేవతలకి ఋషులకి, ఇటు మనుషులకి కూడా గొప్ప ఉపకారం చేశాడు. శివుడి మీద పవిత్రమైన రుద్రకవచాన్ని చెప్పాడు.

చదివారా ! దుర్వాస మహర్షి గురించి. ఇక్కడ ఉన్నాడు అక్కడ లేడు అని కాకుండా ఎవరిదగ్గర పడితే వాళ్ళ దగ్గర వుండి, ఎవరికి ఏం కావాలన్నా చేశాడు దుర్వాస మహర్షి.

శ్రీరామావతారంలో సాయపడ్డాడు శ్రీ కృష్ణావతారంలోనూ సాయపడ్డాడు.

ఎంతగొప్పవాడో దుర్వాస మహర్షి !!

# 45. దేవద్యుతి మహర్షి

**రం**డిపిల్లలూ! దేవద్యుతి కథ చదువుదాం... పూర్వం సరస్వతీనదీ తీరంలో యక్షప్రగ్రుణ అనే పేరుతో ఒక పర్వతం ఉండేది. అక్కడ చక్కటి పుణ్యాశ్రమాలున్నాయి. అక్కడ సుమిత్రుడనే ఋషి కుమారుడు దేవద్యుతి తపస్సు చేసుకుంటున్నాడు.

అతడు మండువేసవిలో పంచాగ్నిలోను, శీతాకాలంలో నీళ్ళలోను నిలబడి, గాలి నీరు కందమూలాలు తిని కాలక్షేపం చేస్తూ కఠోర దీక్షతో తపస్సు చేస్తున్నాడు. అతని తపస్సు ప్రభావానికి అతని తేజస్సు మూడు లోకాల్లోనూ వ్యాపించింది.

దేవద్యుతుడి తపస్సుకి ముని సంఘాలన్నీ తల్లడిల్లిపోయాయి. ఆ ఋషి ఎప్పుడూ పురుష సూక్తి విధానంలో రోజూ మంచి పువ్వుల్తో పూజ చేస్తుండేవాడు. షోడషోపచారాల్తో పూజ చేస్తున్న దేవద్యుతికి వైశాఖ శుద్ధ ఏకాదశినాడు విష్ణుమూర్తి ప్రత్యక్షమయ్యాడు.

వెంటనే దేవద్యుతుడు సాష్టాంగ ప్రణామం చేసి స్తోత్రం చేశాడు. వాసుదేవా! సురాంతకా! వనజనాభా! భక్తవత్సలా! కృష్ణా! కృపాసముద్రా! శ్రీహరా! జగన్మయా! నన్ను దయచూడు. పరతత్త్వం నువ్వే. నీవు నిర్గుణుడవు, శుద్ధ బుద్ధాత్ముడవు, చిన్మయుడవు నువ్వు నన్నెప్పుడు కాపాడు తండ్రీ! అని వేడుకున్నాడు.

దేవద్యుతి విష్ణుమూర్తిని చేసిన స్తుతిని 'యోగసారస్తుతి' అంటారు. అది విని విష్ణుమూర్తి దేవద్యుతుణ్ణి కరుణించి అదృశ్యమయ్యాడు.

హరి కృప పొందిన దేవద్యుతుడు పిశాచి రూపంతో బాధపడుతున్న చిత్రసేనుడనే వాడిని ప్రయాగ స్నానం చేయించి పిశాచి జన్మ పోయేలా చేశాడు.

ఇదర్రా దేవద్యుతి కథ !!

# 46. దేవల మహర్షి

**రం**డి పిల్లలూ...! మీకోసమే చూస్తున్నాను. దేవల మహర్షి గురించి తెలుసుకుందాం. మొదలుపెట్టండి మరీ....!

పూర్వం దేవుడనే మనువుండేవాడు. అతని కొడుకు ప్రజాపతి. ప్రజాపతి కొడుకు ప్రత్యూషుడు. ప్రత్యూష్యుడికి ఇద్దరు కొడుకులు. మొదటివాడు దేవలుడు రెండవవాడు విభువు.

దేవలుడు నల్లగా ఉండేవాడు. అందుకే అతడిని 'అసితుడని' కూడా పిలిచేవాళ్ళు.

దేవలుడు పెద్దవాడయ్యాక విద్యాభ్యాసానికి వ్యాసుడి దగ్గరకి పంపాడు తండ్రి. దేవలుడు చక్కటి గుర్తుభక్తితో విద్యనేర్చుకున్నాడు. వ్యాసుడు తాను రాసిన మహాభారతాన్ని వ్యాప్తి చెయ్యమని పితృలోకం పంపించాడు దేవలుడిని. గురువు గారు చెప్పినట్లే చేశాడు దేవలుడు. గురువుగారిని మించిన శిష్యుడని అందరూ మెచ్చుకున్నారు.

దేవలుడు గొప్ప తపస్విగా, సత్యవ్రతుల్లో మొదటివాడుగా బ్రహ్మనిష్ఠ గలవాడుగా పేరుపొందాడు.

ఒకసారి జైగీషవ్యుడు దేవలుడున్న చోటికి వచ్చి తపస్సు చేసుకుంటూ ఉండిపోయాడు. బృహస్పతి లాంటి పెద్దలందరు వచ్చి దేవల జైగీషవ్యులున్న ప్రదేశాన్ని దివ్యతీర్థంగా ప్రశంసించారు. దేవలుడు అందరి దగ్గర సెలవు తీసుకుని సింధునదీ తీరానికి వెళ్ళిపోయాడు.

దేవలుడు ఒక చెఱువులో స్నానం చేస్తుంటే 'హూహూ' అనే పేరుగల గంధర్వుడు అదే చెఱువులో తన భార్యల్తో స్నానం చేస్తూ దేవలుడి పాదాలు పట్టుకుని బాధపెట్టడం మొదలుపెట్టాడు. దేవలుడు కోపంతో గంధర్వుడిని మొసలిగా పుట్టమని శపించాడు.

గంధర్వుడు దేవలుడిని రక్షించమని ప్రార్థించాడు. నువ్వు మొసలివై ఒక ఏనుగుని పట్టుకున్నప్పుడు ఏనుగుని రక్షించడానికి విష్ణుమూర్తి వస్తాడు. అప్పుడు నీకు శాపవిమోచనం అవుతుందని చెప్పాడు దేవలుడు.

మీరు గజేంద్రమోక్షం అనే కథలో తెలుసుకునే వుంటారు. ఆ గజేంద్రుణ్ణి పట్టుకున్న మొసలే ఈ గంధర్వుడు.

బ్రహ్మదేవుడు సృష్టి చేశాడు గానీ, వస్త్రాలు తయారు చెయ్యడం రాక శివుడికి ఆపని అప్పగించాడు. శివుడు ఇది నావల్ల కాదు నా ప్రియశిష్యుడు దేవలుడికి అప్పగిస్తానని చెప్పాడు. శివుడి ఆజ్ఞ ప్రకారం దేవలుడు వస్త్రాలు తయారుచేసి దేవతలకిచ్చి వాళ్ళ ఆశీస్సులు పొందాడు.

దేవలుడు కఠోర దీక్షలో వుండి తపస్సు చేసుకుంటుంటే రంభ వచ్చి తనతో గడపమని అడిగింది. దేవలుడు అందుకు అంగీకరించలేదు. తన మాట వినలేదు గనుక శూద్రుడిగా పుట్టమని దేవలుడిని శపించింది.

రంభ శాపం వల్ల దేవాంగకులంలో పుట్టిన దేవలుడు రకరకాల వస్త్రాల్ని తయారు చెయ్యడం మొదలుపెట్టి తన కొడుకులు దివ్యాంగుడు, విమలాంగుడు, ధవలాంగుడు ముగ్గురితో కలసి నేత పరిశ్రమని లోకంలో వ్యాపించేలా చేశాడు.

దేవాంగుడు పైలోకాలకెళ్ళాడు. అక్కడ శేషుడి కూతురు చంద్రలేఖని, సూర్యుడి సోదరి దేవదత్తిని పెళ్లిచేసుకుని వంశవృద్ధి జరిగాక సన్యాసం తీసుకుని మోక్షాన్ని పొందాడు.

ఒకసారి నారదుడు దేవలుడి దగ్గరకి వచ్చి ఈ ప్రపంచం ఎల్లా పుట్టిందీ, ప్రళయకాలంలో ఏమవుతోంది? మొదలయిన విషయాలు అడిగి తెలుసుకున్నాడు.

దేవలుడు తీర్థయాత్రలు చేస్తూ గంగాస్నానం చేసి విష్ణుజపం చేస్తుండగా అతడికి పితృదేవతలు కనిపించి పున్నామ నరకం నుంచి రక్షించమని వేడుకున్నారు.

నాయనా! బ్రహ్మచర్యం వలన ముని ఋణం తీరుతుంది. అగ్నిహోత్రానికి సంబంధించిన పనులవల్ల దేవ ఋణం తీరుతుంది. పెళ్ళిచేసుకుని మంచి సంతానం పొందితేనే పితృదేవతల ఋణం తీరుతుంది. కాబట్టి నువ్వు పెళ్ళి చేసుకుని మాకు మోక్షంకలిగేలా చెయ్యమన్నారు పితృదేవతలు.

అయ్యా! నేను పెద్దవాడ్నయ్యాను. ఈ వయస్సులో నాకు పిల్లనెవరిస్తారు? అని అడిగాడు దేవలుడు.

కౌండిన్యుడనే మహామునికి ఒక కుమార్తెవుంది. ఆమెని నువ్వు పెళ్ళి చేసుకో. ఆమెను నీ కోసమే బ్రహ్మ సృష్టించాడని చెప్పారు పితృదేవతలు.

దేవలుడు బయలుదేరి కౌండిన్యుడి ఇంటికివెళ్ళి అతని కుమార్తెనిచ్చి పెళ్ళి చెయ్యమని అడిగాడు. దేవలుడి గురించి తెలిసిన కౌండిన్యుడు తనకుమార్తెను దేవలుడికిచ్చి పెళ్ళి జరిపించాడు.

కొంతకాలానికి దేవలుడికి సువర్చల అనే కూతురు కొంతమంది కొడుకులు పుట్టారు. పితృదేవతల ఋణం కూడా తీర్చుకున్నాడు దేవలుడు.

సువర్చలని ఆమె కోరిక ప్రకారం శ్వేతకేతుడికిచ్చి పెళ్ళి జరిపించాడు.

దేవల మహర్షి మహాధర్మశాస్త్రాన్ని ప్రతిపాదించాడు. ఈయన రాసిన 'దేవలస్మృతి' ఇంకా పూర్తిగా దొరకలేదు.

దేవల మహర్షి, దివ్యర్షి, మహాతపస్వి, యోగీశ్వరుడు, ధర్మశాస్త్ర ప్రవక్త, మహా పురుషుడుగా ప్రసిద్ధికెక్కాడు. భారతదేశ మహర్షుల్లో గొప్ప ఋషిగా పేరు పొందాడు.

ఇదర్రా దేవల మహర్షి కథ !!

# 47. ధౌమ్య మహర్షి

ఇప్పుడు మనం ధౌమ్య మహర్షి గురించి తెలుసుకుందాం. ధౌమ్య మహర్షి తండ్రి వ్యాఘ్రపాదుడు అనే మహర్షి. ధౌమ్య మహర్షికి ఒక అన్న ఉన్నాడు. అతని పేరు ఉపమన్యు.

ఉపమన్యు ధౌమ్యుల తపస్సు గురించి మనం ఉపమన్యు మహర్షి కథలో తెలుసుకున్నాం. వీళ్ళిద్దరు పరమేశ్వరుడిని గురించి ఘోర తపస్సు చేశారు. పరమేశ్వరుడు పరివారంతో సహా ఉపమన్యు ధౌమ్యులకి ప్రత్యక్షమయ్యాడు. వాళ్ళిద్దరు వేదమంత్రాలతోనూ సహస్రనామాల్తోనూ శివుణ్ణి స్తుతించారు.

ఈశ్వరుడు వాళ్ళిద్దర్ని ఏంకావాలో అడగండి అన్నాడు. ఉపమన్యు దేవా! ఎప్పుడు శివభక్తి కలిగివుండేటట్లు, సర్వవిషయ జ్ఞానమూ, క్షీరాన్నంమీద కలిగిన ఇష్టమే నీ దర్శనం వరకు వచ్చింది. కాబట్టి నీ అభిషేకానికుపయోగించే ఆవుపాలు మాకే కాకుండా మా వంశంలో అందరికి ఎప్పుడు సమృద్ధిగా దొరికేటట్లు అనుగ్రహించు. అంతేకాదు నాతోనే వుంటూ నన్నే అనుసరిస్తున్న నా తమ్ముడు ధౌమ్యుడిని కూడా అనుగ్రహించు అని ప్రార్ధించాడు.

నువ్వు ఏం కావాలని అడిగావో అన్నీ మీకు ఇస్తున్నాను. అంతేకాదు మీకు జనన, మరణాలు, వృద్ధాప్యము లేకుండా మీరెక్కడ వుంటే అక్కడ ఆవుపాలు సమృద్ధిగా దొరికేటట్లు అనుగ్రహిస్తున్నాను. చివరికాలంలో మీరు మీ బంధువులు కూడా మోక్షం పొంది నన్ను చేరతారు. నీ తమ్ముడు ధౌమ్యుడు హరి ప్రియులైన పాండవులకి గురువుగా వుండి శ్రీకృష్ణుడి కటాక్షం పొందుతాడు అని చెప్పి అంతర్ధానం అయ్యాడు పరమేశ్వరుడు.

అన్నగారి దగ్గర సెలవు తీసుకుని భగీరథిని దాటి 'ఉత్కచ' అనే తీర్థం వెళ్ళి అక్కడ ఆశ్రమం ఏర్పాటు చేసుకుని తపస్సు ప్రారంభించాడు ధౌమ్యుడు.

అంగారవర్ణుడనే గంధర్వరాజు పాండవులతో స్నేహంగా ఉండేవాడు. ఒకసారి ఆ గంధర్వరాజు అర్జునుడి చేతిలో ఓడిపోయాడు. తర్వాత ఇద్దరూ స్నేహితులయ్యారు.

అర్జునుడితో ఎంత గొప్ప మహారాజయిన కష్టాలు పడకుండా ఉండాలంటే ఒక పురోహితుడు ఉండాలి అని చెప్పాడు గంధర్వుడు. ఆ పురోహితుడు కూడా వేదాలు చదువుకున్నవాడు, జపాలు, హోమాలు, యజ్ఞాలు చేయించగలవాడు, సత్యాన్నే పలికేవాడు, బ్రాహ్మణులలో ఉత్తముడు అయివుండాలి. అగ్ని పరిగ్రహము, బ్రహ్మణ సంగ్రహము లేకపోతే రాజు రాణించడని చెప్పాడు అంగారవర్ణుడు.

అలాంటివాడు ఎవరో చెప్పండి నేను వెళ్ళి అడిగి తీసుకువస్తాను అన్నాడు అర్జునుడు గంధర్వరాజుతో...

'ఉత్కచ' అనే తీర్థంలో తపస్సు చేసుకుంటున్న ధౌమ్యుడు మీకు అన్ని విధాలా తగిన బ్రహ్మణుడని చెప్పాడు గంధర్వరాజు.

పాండవులు ధౌమ్యుడి దగ్గరకి వెళ్ళి తమకి పౌరోహిత్యం చెయ్యమని అడిగారు. ధౌమ్యుడు అంగీకరించాడు. గొప్ప తేజస్సుతో బుద్ధిలో బృహస్పతి సమానుడు, వేదవేదాంగవేత్త, గొప్ప ఋషి అయిన ధౌమ్యుడు పాండవులకి పురోహితుడుగా వున్నాడు.

ద్రౌపదీ స్వయంవరంలో అర్జునుడు మత్స్యయంత్రం పడేసినప్పుడు పాండవుల వైపు పురోహితుడుగా వుండి పెళ్ళి జరిపించాడు ధౌమ్యుడు.

కృష్ణుడి అనుమతితో సుభద్రని పెళ్ళిచేసుకున్నాడు అర్జునుడు. వాళ్ళకి కలిగిన అభిమన్యుడికి, జాతకర్మ ఉపనయనం లాంటివన్నీ చేసి వేదవేదాంగాలు నేర్పించాడు ధౌమ్యుడు.

ధర్మరాజు రాజసూయ యాగం చెయ్యాలనుకుని చెయ్యలేనేమో అని భయపడ్తుంటే, ధైర్యం చెప్పి అందరు ఆనంద పడేలా యాగం పూర్తి చేయించాడు ధౌమ్యుడు.

ధర్మరాజు జూదంలో ఓడిపోయి అరణ్యవాసానికి వెడుతున్నప్పుడు సామవేదం చదువుతూ ధౌమ్యుడు, అగ్నిహోత్రం పట్టుకుని వేలకొలదీ బ్రహ్మణులు కూడా బయలుదేరివెళ్ళారు. వాళ్ళనిచూసి ధర్మరాజు ధౌమ్యుడి పాదాలమీద పడి మహాత్మా! మీరే ఏదేనా ఉపాయం చెప్పాలి. వీళ్ళందర్ని ఎలా పోషించాలని అడిగాడు.

ధౌమ్యుడు ధర్మరాజుకి ధైర్యం చెప్పి సూర్యభగవానుణ్ణి ప్రార్థించమన్నాడు. ధర్మరాజు ధౌమ్యుడు చెప్పిన ప్రకారం చేసి బ్రహ్మణులందరికీ భోజనం పెట్టగలిగాడు.

ఒకనాడు రోమశ మహర్షి ధర్మరాజు దగ్గరకి వచ్చి ఇంద్రుడు తీర్థయాత్రలు చేయించమని నన్ను పంపాడు. నేను కూడా ధౌమ్యుడితో కలిసి మీతోనే వుంటానని చెప్పాడు.

నారదుడు కూడా ధర్మరాజుకి తీర్థయాత్రలు చెయ్యమని చెప్పాడు. ధౌమ్యుడు, రోమశుడు మిగిలిన బ్రహ్మణోత్తములు అందరూ తనతో కలిసి వస్తుంటే తీర్థయాత్రలకి బయలుదేరాడు ధర్మరాజు.

ఒకనాడు బ్రాహ్మణులందర్నీ చూసి మీ అందరి ఆశీర్వచనాలతో మా అరణ్యవాసం పూర్తయింది. ఒక సంవత్సరం అజ్ఞాతవాసం చెయ్యడానికి మిమ్ముల్నందర్నీ వదిలి వెళ్ళాలంటే బాధగావుంది. ఏ విఘ్నలు లేకుండా మా అజ్ఞాతవాసం కూడా పూర్తయేటట్లుగా ఆశీర్వదించమని అడిగాడు ధర్మరాజు.

బాధపడుతున్న ధర్మరాజుని చూసి ధర్మరాజా! ఒక్కొక్కసారి శత్రువులకోసం సరయిన సమయం వచ్చేవరకు ఎదురు చూడక తప్పదు. దేవేంద్రుడంతటి వాడు నిషధ పర్వతం మీద మారు వేషంలో తిరిగాడు. విష్ణుమూర్తి భగవంతుడయివుండి అదితిగర్భంలో వున్నాడు. ఔర్వుడు తల్లి తొడలో దాక్కున్నాడు. మార్తాండుడు ఆవు శరీరంలో అజ్ఞాతంగా వున్నాడు. తర్వాత అందరూ సుఖంగానే వున్నారు. కదా! అలాగే నువ్వు కూడా ఒక సంవత్సరం పూర్తవగానే సుఖంగా వుంటావని ఓదార్చాడు ధౌమ్యుడు.

ధౌమ్యుడు పాండవులతో మీరు రాజకుమారులు కనుక సేవకులుగా ఎలా వుండాలో తెలియదు. నేను మీకు సేవాధర్మాలు గురించి చెప్తాను అవి ఆచరించి కొంతకాలం మీరు రాజకుమారులమనే మాట మర్చిపొండని చెప్పి వాళ్ళకి ఎన్నో విషయాలు చెప్పాడు.

పాండవులు అజ్ఞాతవసానికి బయలుదేరేముందు అగ్నిహోత్రం వెలిగించి వెళ్ళినపని జరగాలని పూజచేశాడు. పాండవులు ధౌమ్యుడికి, అగ్నిహోత్రానికి ప్రదక్షిణ చేసి బయలుదేరి వెళ్ళారు.

చివరకి మహాభాతర యుద్ధం పూర్తయ్యాక శ్రీకృష్ణుడు చెప్పినట్లుగా ధర్మరాజుకి శాస్త్రోక్తంగా పట్టాభిషేకం చేశాడు ధౌమ్యుడు.

అంతేకాకుండా ధర్మరాజుతో దేవ, పిత్రు పూజలు అతిధి తర్పణాలు, బ్రహ్మణార్చనలు లాంటి ధర్మకార్యాలన్నీ చేయించి మొదటినుంచి చివరి వరకు పాండవుల పౌరోహిత్యం అద్భుతంగా చేసి అందరిలో గొప్పవాడిగా నిలిచి మోక్షాన్ని పొందాడు ధౌమ్యుడు.

ఇదర్రా ధౌమ్య మహర్షి కథ !!

# 48. నరనారాయణ మహర్షులు

**మ**నమిప్పుడు తెలుసుకోబేయే..... మహర్షి కాదు మహర్షులు. ఎవరో చెప్పేస్తున్నా 'నరనారాయణులు' వీళ్ళు జంట కవుల్లాగ జంట ఋషులు, కవలలు కూడా. విష్ణువే రెండు రూపాలుగా పుట్టడం వల్ల వీళ్ళిద్దరెప్పుడూ స్నేహంగా వుంటూ బదరికావనంలో తపస్సు చేసుకుంటూండేవారు. వెయ్యి సంవత్సరాలుగా ఇలాగే తపస్సు చేస్తుంటే ఇంద్రుడికి వీళ్ళని చూసి, ఈర్ష్య వచ్చింది.

ఇంకేముంది ఇంద్రుడు నరనారాయణుల తపస్సు భంగం చెయ్యడానికి సింహాలు, పులులు, తోడేళ్ళు, అన్ని రకాల జంతువుల్ని పంపాడు. అయినా వాళ్ళు కాస్త కూడా కదల్లేదు. అప్సరసల్నిచ్చి మన్మథుడ్ని వెళ్ళమన్నాడు. అమ్మో ! వాళ్ళతో నేను పెట్టుకోనన్నాడు మన్మథుడు. ఇంద్రుడు బ్రతిమాలుకుని మన్మథుడితో సరే ననిపించాడు.

అప్సరసలు, మన్మథుడు బదరికావనంలో అడుగుపెట్టగానే వసంతఋతువు వచ్చినట్లయి కోయిలలు కూయడం మొదలుపెట్టాయి. చల్లటి గాలి వీచడం, అప్సరసల పాటలు ఆటలు వినిపించడం వలన నరనారాయణులు కళ్ళు తెరిచి చూస్తే పదహారువేలమంది అప్సరసలు మన్మథుడితో సహా కనిపించారు. మీరంతా అలసిపోయి నట్లున్నారు మీకు విందు ఏర్పాటు చేస్తామని నారాయణుడు కుడి తొడమీద కొట్టగానే "ఊర్వశి చెలికత్తెలతో వచ్చింది. వాళ్ళ అందం చూసి అప్సరసలు సిగ్గుపడిపోయారు.

వీళ్ళని కూడ తీసికెళ్ళి ఇంద్రుడి కివ్వండి అని చెప్పాడు నారాయణుడు. మీ పాద సేవ చేసుకుంటాం మేం వెళ్ళమన్నారు అప్సరసలు. నారాయణుడు ఏదయినా కోరుకోండి ఇస్తానన్నాడు. దొరికింది అవకాశమని మీరు మాకు భర్తగా కావాలన్నారు.

అప్సరసలు అయితే ద్వాపరయుగంలో నేను కృష్ణుడిగా పుడతాను మీరు రాజకన్యలుగా పుట్టి నన్ను చేసుకుందురుగాని, ఇప్పటికి మీరొచ్చిన చోటికి వెళ్ళిపొండని పంపించాడు.

ఇంద్రుడు ఇంకచేసేదేమీ లేక ఊర్వశిని చెలికత్తెలని తనతో తీసికెళ్ళాడు.

ఒకసారి ప్రహ్లాదుడు తీర్థయాత్రలు చేస్తూండగా సరస్వతీ నదీతీరంలో ఒక పెద్ద మఱ్ఱిచెట్టు మీద చాలా బాణాలు, ఆ చెట్టు కింద ఆ ఇద్దరు ఋషులు కనిపించారు. వాళ్ళని చూసి ప్రహ్లాదుడు అయ్యా ! ఈ దొంగ జపమెందుకు ? ఒక ప్రక్క జపం, ఒక ప్రక్క బాణాలు. ఇది ధర్మం కాదు కదా! అన్నాడు. ఋషులు నీకెందుకయ్యా! మేం బ్రాహ్మణ్యంలోనూ, క్షాత్రంలోనూ కూడ గొప్పవాళ్ళం అన్నారు.

ప్రహ్లాదుడు బాణాలంటే మీకు చులకనగా వుందా? ఏదీ నాతో యుద్ధం చెయ్యండనగానే నరుడు లేచి విల్లెక్కుపెట్టి యుద్ధానికి దిగాడు. ఇలా వెయ్యి సంవత్సరాలు యుద్ధం చేశారు.

శ్రీ మహావిష్ణువు వచ్చి ప్రహ్లాదా వీళ్ళతో పెట్టుకోకు. వీళ్ళు నా వాళ్ళు, స్నేహంగా వుండమని చెప్పి వెళ్ళిపోయాడు. నరనారాయణులు కూడా మేం నీతో సరదాగా యుద్ధంచేశాం. నీ మీద మాకు శత్రుత్వం లేదని చెప్పి పంపేశారు.

పూర్వం సహస్రకవచుడనే రాక్షసుడుండేవాడు. వాడికి పుడుతూనే వెయ్యి కవచాలు. వాడు లోకంలో ఎవ్వరినీ బ్రతకనియ్యడం లేదు. వాణ్ణి ఎలాగయినా చంపాలని నరనారాయణులు ఒకళ్ళు యుద్ధం చెయ్యడం, ఒకళ్ళు తపస్సు చెయ్యడం ఇలా ఒకళ్ళ తర్వాత ఒకళ్ళు వాడితో యుద్ధం చేసి తొమ్మిది వందల తొంభై తొమ్మిది కవచాలూడగొట్టారు. వాడికింక టైమయిపోయి చచ్చిపోయి కర్ణుడుగా ఒంటి కవచంతో పుట్టాడు. నరనారాయణులు కూడా అర్జునుడు, కృష్ణుడుగా పుట్టి కర్ణుణ్ణి చంపారు.

కొంతకాలం తర్వాత నారదుడు బదరికావనానికి వచ్చి నరనారాయణులకి పూజచేసి మహాత్మా ! సిద్ధిపొందడానికి ఏంచెయ్యాలి? అనడిగాడు.

నారదా ! ధ్రువము, అచలము, ఇంద్రియగోచరము, సూక్ష్మము అయి సర్వానికి అంతరాత్మ అయి వెలుగుతున్న తత్త్వాన్నే ఆరాధించు అన్నారు నరనారాయణులు. నారదుడు అసలు మూలాకృతి ఎలా ఉంటుందో చెప్పండన్నాడు. అది తెలుసుకోవాలంటే నువ్వింకా ధ్యానం చెయ్యాలి. ఇప్పుడు నీకు చెప్పినా తెలియదన్నారు నరనారాయణులు.

నారదుడు పాలసముద్రానికి ఉత్తరం వైపున శ్వేతపర్వతం మీద చాలామంది తపస్సు

చేసుకుంటుంటే తనుకూడ అక్కడ అనేక వేల సంవత్సరాలు తపస్సు చేశాడు. విష్ణుమూర్తి నారదుడికి తత్త్వాన్ని గురించి చెప్పి వెళ్ళిపోయాడు.

నారదుడు జరిగిందంతా నరనారాయణులకి చెప్పాడు. నువ్వు పుణ్యాత్ముడివి అక్కడ జరిగినదంతా ఇక్కడ మేం చూశాం. ఒంటరిగా వుండి విష్ణువుని ధ్యానించమని చెప్పారు నరనారాయణులు.

విశాలుడనే రాజు శత్రువుల వల్ల రాజ్యం పోయి విష్ణువుని గురించి తపస్సు చేస్తుంటే నరనారాయణులు అక్కడికి వెళ్ళి రాజా నీకు ఏ వరం కావాలో కోరుకో అన్నారు. విశాలుడు నాకు విష్ణుమూర్తి తప్ప ఇంకెవరు ఏమీ ఇవ్వలేరన్నాడు.

రాజా ! విష్ణుమూర్తే మమ్మల్ని పంపించాడు. నీకేం కావాలి? అన్నారు నరనారాయణులు. విష్ణుమూర్తికి ఇష్టమయిన యాగాలు చెయ్యడానికి సరిపడ సంపద కావాలన్నాడు రాజు. అయితే కల్కిభగవానుడి గురించి తపస్సు చెయ్యి. కల్కివ్రతం చెయ్యి అని చెప్పారు.

విశాలుడు కల్కి వ్రతం చేసి సంపదల్ని పొంది విష్ణుమూర్తికి ఇష్టమయిన యాగాలు చేసి ముక్తి పొందాడు.

శౌనక మహర్షి నాలుగు వేదాలు, వాటి అర్థాలు నేర్చుకుని గొప్ప జ్ఞాని అయ్యాడు. ఒకసారి శిష్యులతోపాటుగా తిరుగుతూ మనోహరంగా వున్నదీ, రకరకాల యోగులతో, హరిభక్తులతో, వనదేవతలతో, మునికన్యలతో అందంగానూ, అన్ని పుణ్యాలకి నిలయంగానూ, పవిత్రంగానూ ఉన్న నరనారాయణుల ఆశ్రమానికి వచ్చాడు శౌనక మహర్షి.

నారాయణుడు శౌనక మహర్షిని చూసి ఏం కావాలి అని అడిగాడు. శౌనకుడు నారాయణుడికి నమస్కారం చేసి దేవా ! నేను సర్వ వేదశాస్త్రాలు చదివాను. కానీ వాటి లోతైన అర్థాలు తెలియడం లేదన్నాడు. నారాయణుడు నారదుడికి చెప్పినట్లే వేదసారమైన విష్ణువుని గురించి చెప్పి హరిభక్తి తప్ప ఇంక ఏ ఉపాయం లేదని చెప్పాడు.

శౌనకుడు నారదుడి జన్మవృత్తాంతం చెప్పమన్నాడు. నారదుడు పుట్టిన దగ్గర్నుంచి విష్ణుభక్తుడయ్యేవరకు నారాయణుడు శౌనకుడికి చెప్పాడు.

వేదాల్ని చదివే అధికారం లేనివాడు ముఖ్యంగా చెయ్యాల్సిన పనులేమిటని శౌనకుడు అడిగాడు. అలాంటి వాళ్ళు దానధర్మాలు, సత్యంపలకడం, బావులు, చెఱువులు లాంటివి త్రవ్వించడం, కొడుకుని పొందడం, బ్రాహ్మణ పిల్లలకి ఉపనయనానికి, పెళ్ళిళ్ళకి సాయపడడం, స్వంతధనంతో బ్రాహ్మణులని రక్షించడం, బ్రాహ్మణుడికి ఇల్లు కట్టించివ్వడం ఇలాంటివి విష్ణువు దగ్గరకు చేరే మార్గాలు అని చెప్పాడు నారాయణనుడు.

ఉత్తముడైన కవియొక్క ఉత్తమమైన గ్రంథాన్ని తీసుకున్న ఉత్తముడికి పుణ్యలోకం కలుగుతుంది. శౌనక మహర్షీ! ఇవన్నీ ఎందుకు? విష్ణువే ధర్మం, గతి, శాశ్వతుడు. హరిభక్తి కంటే మించింది లేదని చెప్పాడు నారాయణుడు.

శౌనకుడు నరనారాయణులు చెప్పింది విని ఆనందంతో తన ఆశ్రమానికి వెళ్ళాడు.

ఇదర్రా నరనారాయణ మహర్షుల కథ !!

భగవంతుడు తన గురించి తెలియపర్చి, ఎలా పుణ్యలోకాలు చేరుకోవాలో తెలియని వాళ్ళకి తనే మనిషిగా పుట్టి తెలియచెప్పాడు. నరనారాయణుడంటే విష్ణుమూర్తి కదా..... మనం కూడా అదృష్టవంతులమే ఈ కథ చదవడం వల్ల...!

# 49. నారద మహర్షి

**పి**ల్లలూ ! రండి, ఇపుడు మీరు తెలుసుకోబోయేది నిజంగా చాలా చాలా గొప్ప ఋషి. ఎంత గొప్పంటే అసలు ఆయన పేరు లేని పురాణం లేదు. ఈ అద్భుతమైన భరతఖండంలో అమృతభాషలో చెప్పిన గొప్ప ఋషుల్లో గొప్పవాడు. పేరు చెప్పండి చూద్దాం. మన పౌరాణిక సినిమాల్లో కూడ ఈ ఋషిపేరు లేకుండా ఉండదు.

ఏమిటి తల్లీ ఎన్.టి.రామారావా ! కాదు తల్లీ రామారావు మహర్షికాదు. కొంచెం ఆలోచించండి. క్లూ ఇవ్వనా.... సరే కలహభోజనుడు, కలహప్రియుడు, కాకపోతే లింకు మాష్టారు. చెప్పేశారు వెనకాల ఎవరో చెప్పేశారు 'నారదుడు'. సరిగ్గా చెప్పావు నాయనా! సినిమాలు బాగా చూస్తావనుకుంటాను ఇపుడు మనం తెలుసుకోబోయేది నారదమహర్షి గురించే !!

విష్ణుమూర్తి నాభికమలం నుంచి బ్రహ్మని పుట్టించి సృష్టి చెయ్యమన్నాడు. బ్రహ్మ చాల సంవత్సరాలు తపస్సుచేసి సనకగునందనుల్ని, సనాతన సనత్కుమారుల్ని పుట్టించాడు. పులహుడు, కళ్ళ నుంచి యత్రికత్రువులు, ముక్కు నుంచి అరుణుణ్ణీ పుట్టిస్తే వాళ్ళు మొత్తం క్షత్రియకులాన్ని పుట్టించారు. బ్రహ్మ నుదిటి నుంచి ఏకాదశ రుద్రులు, చెవులనుండి పులస్త్యుడు ఎడమ భాగం నుంచి స్వాయంభువ అనే మనువు శతరూప అనే సుందరి ముఖము నుంచి అంగిరసుడు, ఎడమచేతి వైపు నుంచి భృగుదక్షులు, గ్రీవము నుండి నారదుడు పుట్టారు.

నారదుడు ఎలా పుట్టాడో తెలిసింది కదా! నారదుడు సరస్వతీదేవి దగ్గర సంగీత విద్య నేర్చుకున్నాడు. వాయుదేవత నుంచి 'మహతి' అనే వీణని తీసుకుని బ్రహ్మలోకానికి వచ్చి, తన గానంతో బ్రహ్మని సంతోషపెట్టాడు. బ్రహ్మ నారదుడికి విష్ణుభక్తిని గురించి చెప్పి, ఎప్పుడూ హరిభక్తుడిగా ఉండాలని చెప్పి అష్టాక్షరీ మంత్రం ఉపదేశం చేశాడు.

ఒకసారి బ్రహ్మ కొడుకులందర్నీ పిలిచి పెళ్ళి చేసుకుని, సంతానాన్ని కనండి, మీకు భార్యల్ని సృష్టిస్తాను అన్నాడు. నారదుడు నేను పెళ్ళి చేసుకోను, హరిభక్తుడిగానే ఉండిపోతానన్నాడు.

తండ్రినైన నా మాట వినలేదు కాబట్టి నువ్వు తత్త్వజ్ఞానం మర్చిపోయి గంధర్వుడుగా పుట్టి, ఆడవాళ్ళతో తిరుగుతూ వుంటావని శపించాడు బ్రహ్మ.

విష్ణుభక్తుడినైన నన్ను శపించావు కాబట్టి, ముల్లోకాల్లోను నీకు పూజలు లేకుండా పోతాయని నారదుడు బ్రహ్మని శపించాడు.

గంధర్వరాజొకడు తనకి ఎంత ధనం వున్న పిల్లలు లేరని వసిష్ఠ మహర్షిని ఏదయినా ఉపాయం చెప్పమన్నాడు. వసిష్ఠుడు శివపంచాక్షరీ మంత్రం కవచంతో సహా చెప్పి రోజూ చేసుకోమన్నాడు. ఆ గంధర్వరాజు భక్తితో శివుణ్ణి ధ్యానించాడు. శివుడు ప్రత్యక్షమై నీకు విష్ణుభక్తుడు కొడుకుగా పుడతాడని చెప్పాడు.

కొంతకాలానికి గంధర్వరాజుకి ఒక కొడుకు పుట్టాడు. వసిష్ఠుడు అతనికి ఉపబర్హణుడు అని పేరు పెట్టి శ్రీహరి మంత్రం ఉపదేశించాడు. ఈ ఉపబర్హణుడే మన నారదుడు.

ఒకసారి ఉపబర్హణుడు గండకీనదీతీరంలో శ్రీహరిని ధ్యానిస్తుండగా గంధర్వకన్యలు యాభయిమంది అతన్ని ప్రేమించి పెళ్ళి చేసుకున్నారు. అందులో అందరికన్న పెద్దది మాలావతి.

విశ్వస్రష్టలైన బ్రహ్మలు దేవసత్రయాగం చేస్తుంటే ఉపబర్హణుడు భార్యల్తో సహా వెళ్ళాడు. అక్కడ విష్ణుగాధలు పాడుతూ వుండగా అతడు భార్యల్ని మర్చిపోయి రంభ చీర పట్టుకు లాగి విశ్వస్రష్టలతో భూలోకంలో శూద్రుడుగా పుట్టేలా శాపం పొందాడు.

ఈ విషయం భార్యలకి చెప్పి ప్రాణాలు విడిచాడు ఉపబర్హణుడు. మాలావతి నా భర్త ఈ రోజు బ్రతకకపోతే యమధర్మం నశించి, ఈశ్వర జ్ఞానం కూడ నశించిపోవాలని శపిస్తుంది. విష్ణుమూర్తి దేవతలు ఎంత చెప్పినా మాలావతి వినలేదు.

అందరూ బ్రహ్మని సలహా అడిగారు. బ్రహ్మ దేవతల్తో ఇతడు పూర్వజన్మలో నా కొడుకు నారదుడు. నా శాపం వల్ల లక్ష సంవత్సరాలు గంధర్వుడుగా ఉండాలి. ఇంకా వెయ్యి సంవత్సరాలు మిగిలివుంది కాబట్టి, ఇప్పుడు తిరిగి బ్రతుకుతాడని చెప్పాడు.

ఉపబర్హణుడు మళ్ళీ బ్రతికి వెయ్యి సంవత్సరాలు భార్యలతో గడిపి తర్వాత శ్రీహరిని తల్చుకుని శరీరం వదిలేశాడు.

ఆ రోజుల్లో కన్యాకుబ్జాన్ని ద్రుమిళుడనే యాదవ రాజు పాలించేవాడు. అతడికి పిల్లలు లేరు. కశ్యప మహర్షి అనుగ్రహంతో యాదవరాజు భార్య కళావతి గర్భవతి అయ్యాక ఆమెని ఒక బ్రాహ్మణ కుటుంబానికి అప్పగించి గంగాతీరానికి వెళ్ళిపోయాడు. కళావతికి హరిభక్తుడైన కొడుకు పుట్టాడు.

అతడు పుట్టగానే కన్యాకుబ్జంలో వానలు పడి కరువు తగ్గిపోయింది. జ్ఞానసంపన్నుడు, జలమిచ్చినవాడు కనుక నారదుడు అని పేరుపెట్టారు. యోగులందరికీ సేవ చేస్తూ, విష్ణుకథలు వింటూ పెరుగుతున్నాడు నారదుడు.

తల్లి మరణించాక నారదుడు పరమాత్మణ్ణి చూడాలని ఒక రావి చెట్టుక్రింద కూర్చుని శ్రీహరిని ప్రార్థించాడు. విష్ణుమూర్తి “నారదా ! నువ్వీ జన్మలో నా అసలు స్వరూపాన్ని చూడలేవు. అయినా ప్రళయం వచ్చినపుడు మళ్ళీ చేసే సృష్టిలో ఉత్తముడిగా పుడతావ”ని

వరమిచ్చాడు. విష్ణుమూర్తి చెప్పినట్లు బ్రహ్మ ప్రాణం వల్ల మళ్ళీ ఉత్తముడుగా దేవలోకంలో పుట్టాడు.

బ్రహ్మ ఒకనాడు నారదుణ్ణి పిలిచి పెళ్ళి చేసుకుని పిల్లల్ని పొందితే పున్నామ నరకం నుంచి తప్పించుకున్న వాడివీ, నా మాట విన్నవాడివీ కూడా అవుతావన్నాడు.

ముందు నేను కైలాసం వెళ్ళి శివుణ్ణి చూసి, నరనారాయణుల్ని చూసి వారి అనుమతి తీసుకుని చేసుకుంటాను అన్నాడు నారదుడు. నాకీ పన్లు చేసుకునే శక్తినిమ్మని బ్రహ్మని అడిగాడు.

నారదుడు కైలాసం వెళ్ళి శివుణ్ణి చూసి శ్రీహరి మంత్రం, స్తోత్రకవచం, పూజా విధానం, గృహస్థధర్మం తెలుసుకుని బదరికావనం వెళ్ళి అక్కడ నారాయణ మహర్షిని చూసి తత్త్వాన్ని ఉపదేశించమన్నాడు. నీకు ఇప్పుడే చెప్పినా అర్థం కాదు. కొంతకాలం తపస్సుచేసుకోమన్నాడు నారాయణ మహర్షి.

నారదుడు శ్వేతద్వీపానికి వెళ్ళి ఒంటరిగా విష్ణుమూర్తి గురించి తపస్సు చేసి విష్ణుమూర్తి అద్భుత రూపాన్ని చూశాడు. విష్ణుమూర్తి నారదుడికి తత్త్వాన్ని గురించి చెప్పాడు. నారదుడు ఆనందంతో బదరికావనం వచ్చి జరిగిందంతా నారాయణ ఋషికి చెప్పి మహర్షీ ! బ్రహ్మ నన్ను పెళ్ళిచేసుకుని పిల్లల్ని కనమని చెప్తున్నాడు. అది ఎంతవరకు మంచిది అన్నాడు.

నారదా ! పురుషుడితో ప్రకృతి కలిసే ఉంటుంది. శివుడికి దుర్గ, విష్ణువుకి లక్ష్మి ఇలాగే నీకు కూడ నీ పూర్వజన్మలో భార్య అయిన మాలావతే భార్యగా వస్తుంది. నీకు పెళ్ళి తప్పదు వెళ్ళిరా అని నారాయణ మహర్షి చెప్పాడు.

నారదుడు హిమాలయాలకి వెళ్ళి తపస్సు చేసుకోవడం మొదలుపెట్టాడు. ఇంద్రుడు అప్సరసల్ని పంపినా అతడు చలించలేదు.

కామం జయించానని విష్ణుమూర్తి దగ్గర చెప్పాడు నారదుడు. విష్ణుమూర్తి అది నీ గొప్పకాదు, శివుడి కటాక్షం వల్ల జరిగిందన్నాడు.

అంబరీషుడు తనకూతురు "శ్రీమతి"కి స్వయంవరం ప్రకటించాడు. నారదుడు తన స్నేహితుడు పర్వతరాజుతో కలిసి అక్కడికి బయలుదేరుతూ ఒకరికి తెలియకుండా ఒకరు అవతలివాడికి కోతిమొహం రావాలని విష్ణుమూర్తిని కోరుకున్నారు.

స్వయంవరంలో "శ్రీమతి" విష్ణువుని వరిస్తే వీళ్ళిద్దరి కోతిమొహాలు చూసి అందరూ నవ్వారు. నారదుడికి గర్వభంగం అయింది.

నారదుడు సృంజయుడి కూతురు సుకుమారి పూర్వజన్మలో తన భార్య అయిన మాలావతి అని తెలుసుకుని ఆమెనే పెళ్ళి చేసుకున్నాడు.

నారదుడు తన మామగారైన సృంజయునికి తేజోవంతుడైన కొడుకు కలగాలనీ, అతడి మలమూత్రాలు, చమట అన్నీ బంగారమవుతాయనీ వరమిచ్చాడు. అతడి పేరు సువర్ణష్ఠీవి.

దక్షుడికి ఇంకోసారి నారదుడిపైన చాలా కోపం వచ్చింది –

తన పిల్లలకి తత్త్వజ్ఞానం చెప్పి సంసారంలోకి రాకుండా వంశవృద్ధి జరగకుండా చేశాడు కాబట్టి కలహప్రియుడని పిలువబడతాడనీ ఏ లోకంలోనూ ఉండడానికి చోటుండదని, నారదుణ్ణి శపించాడు దక్షుడు. నారదుడు అతని మాటల్ని పట్టించుకోలేదు.

వ్యాసుడు వేదాలు చదివే అర్హత లేని స్త్రీలకోసం, శూద్రులకోసం మహాభారతం రాసికూడా ఆత్మానందం కలగట్లేదని నారదుణ్ణి అడిగితే విష్ణుభక్తి వల్లనే కలుగుతుందని చెప్పాడు. వ్యాసుడు శ్రీమద్భాగవతాన్ని రాసి తన కుమారుడైన శుకుడితో చదివించి ఆత్మానందం పొందాడు.

ప్రాచీనబర్హి అనే రాజుకి, చేసిన యజ్ఞాలు చాలు శివుణ్ణి ధ్యానిస్తూ అన్ని విషయాలమీద విరక్తిని పెంచుకోమని బోధించాడు నారదుడు.

ఇంద్రుడు తన దగ్గరున్న అప్సరసలలో ఎవరు ఎక్కువ అందంగా ఉన్నారని నారదుణ్ణి అడిగాడు. దుర్వాసుణ్ణి ఎవరు తపస్సు నుంచి బయటకి తీసుకువస్తే వాళ్ళు అందంగా వున్నట్లని చెప్పాడు నారదుడు. అప్సరసలు అందరూ భయపడ్తుంటే "వవు" అనే అప్సరస గర్వంతో వెళ్ళి దుర్వాసుడితో పక్షిగా పుట్టమని శాపం పొందింది.

నారదుడికి విష్ణుభక్తులందరిలో తనే గొప్పవాడినని గర్వం వచ్చింది. ఒకసారి శ్వేతద్వీపానికి వెళ్ళి అందర్లో విష్ణువెవరో గుర్తించలేక ప్రార్థించాడు. విష్ణువు కనిపించి నీ కంటే విష్ణుభక్తులు లేరు కదా! నన్ను గుర్తుపట్టలేకపోవడమేమిటి? అని ఒక సరస్సు చూపించి దాంట్లో స్నానం చెయ్యమన్నాడు. వెంటనే నారదుడు చారుమతి అనే అమ్మాయిగా మారి కాశిరాజు దగ్గర పెరిగి పెళ్ళి చేసుకుని కొడుకుల్ని కన్నాడు.

కొడుకులందరు యుద్ధంలో మరణించినప్పుడు చారుమతి పేరుతో వున్న నారదుడు అగ్నిలో పడగానే నారదుడి రూపం మళ్ళీ వచ్చేస్తుంది. దాంతో విష్ణుమాయ విష్ణువుకి తప్పించి ఎవరికీ తెలియదని గర్వం పోగొట్టుకున్నాడు నారదుడు.

చిత్రకేతుడనే రాజు కొడుకు పోయినందుకు ఏడుస్తుంటే నారదుడు అవన్నీ పూర్వజన్మ కర్మలనీ, చచ్చినవాడు మళ్ళీ తిరిగి తన దగ్గరకి రాడనీ చెప్పి విష్ణుతత్త్వాన్ని బోధించాడు.

ధర్మరాజు నారదుణ్ణి ఏరూపంలో హరిని పూజించవచ్చని అడిగితే కామంతో గోపికలు, భయంతో కంసుడు, శతృత్వంతో శిశుపాలుడు, ప్రేమతో మీ సోదరులు హరిని పూజ చేస్తూనే వున్నారు కదా! ఎలాగయినా విష్ణువుని పొందవచ్చని చెప్పాడు నారదుడు.

నారదుడు మూడులోకాల్లోనూ తిరుగుతూ ఎంతోమందికి, భక్తి, జ్ఞానం, వైరాగ్యం గురించి చెప్పాడు. సృంజయుడికి షోడశమహరాజుల చరిత్ర, హిరణ్యకశిపుడి భార్యని ఇంద్రుడు చంపబోతుంటే ప్రహ్లాదుడు పుట్టబోతున్నాడని, ధ్రువుడికి విష్ణుభక్తిని గురించి,

శ్రీరామలక్ష్మణులు ఇంద్రజిత్తుడి నాగాస్త్రానికి బంధింపబడ్డే విష్ణుతత్త్వం చెప్పి గరుత్మంతుడ్ని తల్చుకోమని, భీష్ముడికి కంబాదుల కథ, ధర్మరాజుకి కర్ణుడి కథ, ఇంద్రుడికి భృగువనే బ్రాహ్మణుని కథ, వసుదేవుడికి విదేహర్షభుడికథ, శ్రీకృష్ణుడికి అనిరుద్ధుడి కథ, వ్యాసుడికి ఆత్మానందం గురించి చెప్పాడు.

నారదుడు దుష్టశిక్షణకి, శిష్టరక్షణకి ఇద్దరికీ లింకులు పెట్టి కలహం కుడా మంచికే చేశాడు. శ్రీకృష్ణుడికి రుక్మిణి గురించి చెప్పి వాళ్ళ పెళ్ళి జరిగేలా చేశాడు. కంసుడు కృష్ణుడి చేతిలో చచ్చిపోవడానికి కూడా నారదుడే కారణం.

నారదుడు నారద పురాణం, కల్కి పురాణం, వామనపురాణం, బ్రహ్మ వైవర్తపురాణం, శ్రీమద్భాగవతపురాణం అన్నీ వ్యాసుడితో రాయించాడు. నారద, బ్రహ్మల మధ్య జరిగిన వాదనే శివపురాణంలో వున్న జ్ఞానసంహిత.

నారదుడికి వేదశాస్త్రాలు, సంగీతం, వాద్యం అన్నీ తెలిసికూడ బ్రహ్మజ్ఞానం మాత్రం సనత్కుమారుడి దగ్గర తెలుసుకున్నాడు. శుక మహర్షికి నారదుడే విష్ణుతత్త్వాన్ని గురించి చెప్పి మహాయోగిని చేశాడు.

విష్ణుమూర్తిని గురించి అంతా తెలుసు అనుకున్న నారదుడికి విష్ణుమూర్తి ఎక్కడున్నాడో తెలియలేదు చూడండి. ఒకసారి నారదుడు స్నానం చేస్తుంటే తాబేలు కనిపించింది. నారదుడు దాన్ని చూసి ఎక్కడ ఏం జరుగుతున్నా నువ్వు ఈ నీళ్ళలో రాజులా తిరుగుతున్నావు అదృష్టవంతుడివన్నాడు. ఈ గంగాజలం లేకపోతే నేనెక్కడుంటాను ఆ గొప్ప నదికే వుంది అంది. నారదుడు నదిని నువ్వు చాలా గొప్ప అన్నాడు. నదంది నాకంటే పెద్దది సముద్రం వుందిగా! అని. సముద్రం దగ్గరికెళ్తే నాదేముంది భూదేవి లేకపోతే నేనెక్కడ ఉంటాను అంది. భూదేవి కులపర్వతాలే నాకంటే గొప్ప అంది. కులపర్వతాలన్నీ మమ్మల్ని సృష్టించిన బ్రహ్మదే అంతా అన్నాయి. బ్రహ్మ నాదేం లేదు లోకానికి ఆధారమైన వేదాలదే అంతా అన్నాడు. వేదాలు యజ్ఞాలు లేకపోతే మాదేం లేదు అన్నాయి. యజ్ఞాలు మాకు విష్ణువే పరమాత్మ అతడే మమ్మల్ని నడిపిస్తున్నాడు అన్నాయి.

చివరికి నారదుడు విష్ణుమూర్తి దగ్గరకి వెళ్ళి పూజించాడు. తిరిగి తిరిగి మళ్ళీ అక్కడికే వెళ్ళాడన్నమాట.

వసుదేవుడికి పుట్టిన శ్రీకృష్ణుడు రాజ్యం చేస్తూ నారదుడితో మహాభోగినయికూడా అందరితో నిందలుపడ్తున్నాను అంటే నారదుడు శ్రీకృష్ణుడు ఎలా ఉండాలో చెప్పాడు.

నారదుడు సమంగమునిని చూసి ఇంత నిశ్చింతగా ఎలా ఉన్నావని అడిగాడు. ఏం జరిగినా వారి కర్మలవల్లే కదా. సుఖానికి పొంగిపోవడం, దుఃఖానికి క్రుంగిపోవడం నాకు లేదు కనక ఇలా ఉన్నానని సమంగముని నారదుడికి చెప్పాడు.

ఆచరించవలసిన ధర్మాల గురించి నారదుడిని అడిగాడు గాలవుడు. దైవాన్ని పూజించడం, తల్లిదండ్రుల్ని ఆరాధించడం, అతిథుల్ని ఆదరించడం, అహంకారం వదిలెయ్యడం, నిజం చెప్పడం అని నారదుడు గాలవుడికి చెప్పాడు.

నారదా! నువ్వు అన్ని లోకాలకి పూజ్యుడవి కదా నీ నమస్కారం తీసుకుందుకు అర్హులు ఎవరు? అనడిగాడు కృష్ణుడు. వాయువు, వరుణుడు, ఇంద్రుడు, అగ్ని, లక్ష్మీనారాయణులు బ్రహ్మ మొదలైన వాళ్ళందర్నీ చెప్పి తన వినయం ప్రకటించుకున్నాడు నారదుడు.

నారదుడు దేవకీదేవికి అన్నదానం గురించి చెప్పాడు. నారదసూత్రాల్లో భక్తిమార్గం తప్ప వేరే మార్గం భగవంతుణ్ణి చేరడానికి లేదని చెప్పాడు. నారదుడు చెప్పిన నారదస్మృతిలో తెలుసుకోవలసిన ధర్మాలు ఎన్నో ఉన్నాయి. శిల్పశాస్త్ర గ్రంథాన్ని కూడా నారదుడు రాశాడు. నారదుడు సర్వశాస్త్రవేత్త, బ్రహ్మజ్ఞాని కూడా.

ఇదండీ నారదుడి కథ!!

నారదుడి గురించి మనం తెలుసుకున్నది చాలా తక్కువ. ఇంతకన్నా చెప్తే మీకు అర్థం చేసుకోవడం కష్టం. అసలు నారదుడు కలవని ఋషులు గానీ, దేవతలు గానీ, భగవంతుడు గానీ ఉన్నారా !

ఎంతమంది దగ్గరో జ్ఞానం సంపాదించి ఎంతమందికో పంచిపెట్టాడు. ఎన్నో జన్మలెత్తాడు. ఎవరితో పోట్లాడినా, ఎవరి మధ్య కలహం రేపినా అన్నీ మంచి కోసమే చేశాడు కానీ, అసూయతో చెయ్యలేదు.

అదీ.. నారద మహర్షి ప్రత్యేకత!

# 50. నిదాఘ మహర్షి

ఇప్పుడు మనం నిదాఘ మహర్షిన గురించి తెలుసుకుందాం....

బ్రహ్మ కుడి చెవి నుండి పుట్టిన పులస్త్యుడు బ్రహ్మకి అన్ని విధాల సమానంగా వుండి సత్త్వ గుణ సంపదతోరన వెలిగి పోతుండేవాడు.

పులస్త్యుడి కొడుకే నిదాఘుడు. బ్రహ్మచర్య వ్రతాన్ని ఆచరించి శ్రద్ధ, భక్తి, వినయం వున్నవాడు.

నిదాఘుడు ఋభు మహర్షికి శిష్యుడు.

నిదాఘ మహర్షి ఎలా శిష్యరికం చేశాడో ఆ గురుశిష్యుల సంబంధం మనం ఋభు మహర్షి కథలో తెలుసుకున్నాం.

ఋభు మహర్షి వల్ల ఎంతో జ్ఞానం పొంది, సంసార సిద్ధికి మోక్షమార్గం తెలుసుకుని, గురువుగారి వల్ల అన్ని విషయాలు తెలుసుకుని, సందేహాలు తీర్చుకుని బ్రహ్మ జ్ఞానాన్ని పొందాడు నిదాఘ మహర్షి.

అంతేకాదు గురుభక్తి గురించి, గురుశిష్యుల అనుబంధంఒ గురించి కూడ మనకి తెలియచేశాడు నిదాఘ మహర్షి.

ఇదర్రా! నిధాఘ మహర్షి కథ!!!

# 51. పరాశర మహర్షి

**పి**ల్లలూ ! ఇప్పుడు మనం పరాశర మహర్షి గురించి తెలుసుకుందాం. ఈ మహర్షి వసిష్ఠుడికి మనుమడు, శక్తి మహర్షికి కొడుకు, వ్యాస మహర్షికి తండ్రి. ఎంత గొప్ప మహర్షో అర్థమయిపోయింది కదా...! ఇంక చదవండి మరి.

కల్మాషపాదుడనే రాజు వేటాడి వస్తూ దార్లో కనిపించిన శక్తి మహర్షిని పక్కకి తప్పుకో అన్నాడు. మహర్షి బ్రాహ్మణుడు ఎదురొస్తే నమస్కరించాలి గాని ఇలా మాట్లాడటం తప్పు కదా! అని అడిగితే కర్రతో కొట్టాడు. రాజుని రాక్షసుడుగా మారిపోతావని శపించాడు శక్తి మహర్షి. రాజు రాక్షసుడుగా మారిపోయి కూడ శక్తి మహర్షిని చంపేశాడు.

వసిష్ఠుడు కొడుకు పోయినందుకు భాధపడ్తూ కోడల్ని ఓదార్చి నీ కడుపులో పన్నెండేళ్ళ నుంచి వుండి వేదాలు చదువుతున్న కొడుకున్నాడు దుఃఖపడకన్నాడు. వసిష్ఠుడికి మనుమడు పుట్టాడు. తాత దగ్గరే పెరుగుతున్నాడు. ఆయనే పరాశర మహర్షి.

ఒకనాడు తల్లిని అడిగి తండ్రి రాక్షసుడి వల్ల మరణించాడని తెలుసుకున్నాడు. నా తండ్రిని ఒక రాక్షసుడు చంపుతున్నప్పుడు ఎవరూ అడ్డుపడలేదు కాబట్టి లోకాన్ని నా తపస్సుతో నాశనం చేస్తానని ప్రతిజ్ఞ చేశాడు.

వసిష్ఠుడు అది తెలుసుకుని పరాశరుణ్ణి అలా చేయడం తప్పని చెప్పి నీ తండ్రిని చూడాలనుంటే శివుడి గురించి తపస్సు చెయ్యి. ఆయనే నీ తండ్రిని నీకు చూపిస్తాడని చెప్పాడు.

పరాశరుడు తపస్సు చేసి శివుడి అనుగ్రహంతో స్వర్గలోకంలో వున్న తండ్రిని చూసి ఆశీర్వాదం తీసుకుని మళ్ళీ ఆశ్రమానికి వచ్చి తల్లికి, తాతకి చెప్పాడు.

పరాశరుడు రాక్షసుల్ని చంపడానికి సత్రయాగం చెయ్యడం మొదలుపెట్టాడు. రాక్షసులందరూ హోమాగ్నిలోపడి చచ్చిపోతున్నారు. మహర్షులందరూ కలిసి పరాశరుణ్ణి చూసి నాయనా ! నువ్వు ఇలా హింస చెయ్యకూడదు. రాక్షసవంశం నాశనమయిపోతోంది. లోకానికి ఉపయోగించే పనులు చెయ్యాలి గాని ఇలాంటి హింసా కార్యక్రమాలు మానెయ్యి అన్నారు. మీరు చెప్పింది నేను వినాలి. కానీ, ఈ అగ్నిని ఇలా వదిలేస్తే నన్నే తినేస్తుంది కదా! అన్నాడు పరాశరుడు. మహర్షులు దాన్ని హిమాలయాల్లో వదిలేసి రమ్మన్నారు.

ఒకనాడు తీర్థయాత్రలు చేద్దామని పరాశరుడు బయలుదేరి యమునానది ఒడ్డుకి వచ్చి నది దాటుదామని పడవ ఎక్కాడు. ఆ పడవని దాశరాజు కూతురు సత్యవతి (మత్స్యగంధి అంటారు) పడవ నడుపుతోంది. ఆమెని చూసి ఇష్టపడి సత్యవతి పూర్వజన్మలో

దేవకన్య అని దివ్యదృష్టితో తెలుసుకుని సత్యవతికి విషయం చెప్పాడు. నాకు ఏ దోషం రాకుండా కన్యగానే వుండేలా వరమిస్తే మీరు చెప్పినట్లు చేస్తాను అంది సత్యవతి.

పరాశరుడి వల్ల సత్యవతికి శ్రీ వేదవ్యాసుడు పుట్టాడు. పరాశరుడు సత్యవతి అడిగిన వరాలిచ్చి కొడుకుని దీవించి వెళ్ళిపోయాడు. వ్యాసుడు కూడా తల్లికి నమస్కరించి తపస్సు చేసుకుందుకు వెళ్ళిపోయాడు.

జనకమహారాజు పరాశరుడి దగ్గరకి వెళ్ళి ధర్మాన్ని గురించి చెప్పమన్నాడు. పరాశరుడు రాజా ! పండు కావాలంటే దాని గింజ ఎంత అవసరమో మనిషికి సుఖం కావాలంటే ధర్మం అంతే అవసరం అని ధర్మాల్ని గురించి వివరంగా చెప్పాడు పరాశరుడు.

జనకమహారాజు మహర్షీ! తపస్సు వల్ల ఉపయోగం ఏమిటని అడిగాడు. రాజా ! మనిషి ఇంద్రియాల్ని జయించి ధర్మార్థకామమోక్షాలు పొందడానికి తపస్సే, కారణమవుతుందని, హింస అహింసల గురించి కూడా చెప్పాడు పరాశరుడు. జనకమహారాజుకి ఇంకా జ్ఞానాన్ని గురించి కూడ వివరంగా చెప్పాడు. దీన్నే 'పరాశరగీత' అంటారు.

పరాశరుడు శిష్యులందరికి జ్ఞానబోధ చేసేవాడు. పాపాలు లేకపోతే పుణ్యం వస్తుందేకానీ మోక్షం రాదని, మంచి గురువు చెప్పినట్లు చేసి జ్ఞానం సంపాదించి మోక్షాన్ని పొందాలి అప్పుడే మళ్ళీ జన్మ వుండదని చెప్పాడు పరాశరుడు.

భద్రసేనుడనే మహారాజుకి ఒక కొడుకుండేవాడు. అలాగే మంత్రికి కూడా. ఆ ఇద్దరు పిల్లలు రుద్రాక్షలు వేసుకుని శివుడ్ని ధ్యానించడం తప్ప బంగారాన్ని పెట్టుకునేవాళ్ళు కాదు. పరాశరుడు భద్రసేనుడికి వాళ్ళిద్దరూ అల్పాయుష్కులని చెప్పి శివజపం ఉపదేశించి పూర్తి అయుష్షు కలిగేలా చేశాడు.

వ్యాసభగవానుడు ఋషులందరితోను కలిసి వెళ్ళి తండ్రి పరాశరుణ్ణి అడిగి కలియుగధర్మాలు అడిగి తెలుసుకున్నాడు. దానిపేరు 'పరాశరస్మృతి'. దాంట్లో ఆచారకాండం, ప్రాయశ్చిత్తకాండం వున్నాయి.

ఇంకా "పరాశరహోరాశాస్త్రం" అని గొప్ప జ్యోతిషగ్రంథం విష్ణుతత్త్వం గురించి వుంది. ఇల్లాంటి గ్రంథాల్తో మహర్షులని ఉద్ధరించాడు పరాశరుడు.

చూశారా ! పరాశరుడు గొప్ప గ్రంధకర్తే కాకుండా, గొప్ప మహర్షికి తండ్రి, మనుమడు అయ్యి ఎంత కీర్తి పొందాడో! జనకమహారాజంతటి వాడికే జ్ఞానాన్ని బోధించాడంటే....!!

ఇదర్రా పరాశర మహర్షి కథ !!

# 52. పిప్పలాద మహర్షి

**మ**నం తెలుసుకోబోయేది పిప్పలాద మహర్షి గురించి. ఈ పేరు గమ్మత్తుగా ఉంది కదూ. ఇది ఎందుకు వచ్చిందో మీకు చక్కగా చెప్తాను. అసలు మహర్షులు సుఖం చూసుకోరు. ఎక్కడోక్కడ ఎలాగొలా బ్రతికేస్తారు. వాళ్ళకి కావలసిందల్లా లోకకల్యాణం. అంటే అందరూ బాగుండాలని, కాని, మనమో ? అవన్నీ ఇప్పుడెందుకులే....! మరి మొదలుపెడ్దామా.....

చ్యవన మహర్షి సుకన్యలకి పుట్టిన వాడు దధీచి మహర్షి. దధీచి మహర్షి సువర్చలకి పుట్టినవాడు పిప్పలాదమహర్షి. దేవతలు దధీచిని ఎముకలు కావాలని అడిగితే యోగాగ్నిలో శరీరాన్ని ఆహుతి చేసుకుని ఇచ్చేశాడు దధీచి మహర్షి. దేవతలు ఆ ఎముకల్తో బ్రహ్మాచక్రం, వజ్రాయుధం చేసుకుని రాక్షసుల్ని చంపేశారు.

అప్పటికి సువర్చల గర్భవతి. దధీచి మరణించగానే తనుకూడా దేవతలు వద్దని చెప్తున్నా వినకుండా సహగమనం చేసింది సువర్చల ఆసమయంలో కడుపులో ఉన్న పిల్లవాడు ఒక పిప్పలచెట్టు క్రింద పడిపోయాడు.

పిప్పలచెట్టు చంద్రుణ్ణి అడిగి అమృతం తెచ్చి ఆ పిల్లాణ్ణి పెంచింది. ఆ పిల్లవాడే మన పిప్పలాద మహర్షన్న మాట. పిప్పలచెట్టు పెంచింది కాబట్టి పిప్పలాదుడు అని పేరొచ్చింది. అమృతం తాగాడు కనుక ఆకలి, దాహం లేవు.

పిప్పలాదుడు ఆ చెట్టే ఆశ్రమంగా తపస్సు చేసుకుంటూ గొప్ప తేజస్సుతో వెలిగిపోతున్నాడు. అతనికి మనసులో దేవతల మీద కోపం. ఎందుకంటే అతని తల్లిదండ్రులు మరణించడానికి కారణం వాళ్ళే కదా !

ఒకసారి చంద్రుణ్ణి నా తల్లి దండ్రుల్ని చంపిన దేవతలందర్నీ నాశనం చెయ్యాలి ఉపాయం చెప్పమన్నాడు. శివుణ్ణి గురించి తపస్సు చెయ్యి, ఆయన ఎలా చెప్తాడో అలా చెయ్యమని చంద్రుడు పిప్పలాదుడికి చెప్పాడు.

పిప్పలాదుడు శివుడి గురించి ఘోరతపస్సు చేశాడు. శివుడు ప్రత్యక్షమై ఏంకావాలనడిగాడు. స్వామీ ! నాకు నా తల్లిదండ్రుల్ని చంపిన దేవతలందర్నీ నాశనం చెయ్యాలని ఉంది. ఎందుకంటే తల్లిదండ్రుల వియోగం, అదీగాక కళ్ళు తెరవని పసిగుడ్డుని నాకెంత బాధగా ఉంటుందో మీకు తెలుసుకదా ! అందుకే అడిగానన్నాడు పిప్పలాదుడు.

నాయనా ! నీ తల్లిదండ్రుల్ని చూసుకునే శక్తినిస్తాను. దేవతల్ని చంపడం మంచి పనికాదు. అయినా పుట్టినవాళ్ళు ఎప్పటికైనా మరణించక తప్పదు కదా! అని స్వర్గలోకానికి వెళ్ళే శక్తినిచ్చాడు శివుడు.

తల్లిదండ్రుల్ని చూసి వాళ్ళు చెప్పినవి విని ఆశీర్వాదం తీసుకుని తన ఆశ్రమానికి వచ్చి తపస్సు చేసుకుంటున్నాడు పిప్పలాదుడు.

కాంతకాలం తర్వాత పిప్పలాదుడికి పెళ్ళి చేసుకోవాలనిపించింది. ఒకనాడు అనవన్యరాజుకూతురు పద్మని చూసి ఆమెని చేసుకోవాలనుకున్నాడు. అనవన్య రాజు విష్ణు భక్తి కలవాడు. ఇంద్రపదవిని కూడా వద్దని వదిలేసినవాడు.

పిప్పలాదుడు అనవన్యరాజుని అతని కూతురు పద్మనిచ్చి పెళ్ళి చెయ్యమని అడిగాడు. ఆ రాజుకి వందమంది కొడుకులు, ఒక్కతే కూతురు. మునికి తన కూతుర్ని ఎలా ఇవ్వడమా అని ఆలోచించాడు.

కులగురువు రాజుకి పిప్పలాదుడు మహాయోగి దధీచికి కొడుకు, నువ్వేమి ఆలోచించకు. ఇతడు కూడ మహాతపశ్శక్తి ఉన్నవాడు. నీ కూతురు సుఖపడ్తుందని చెప్పాక పద్మనిచ్చి పిప్పలాదుడికి పెళ్ళి చేశాడు. తేజస్సుతో వెలిగిపోతున్న పిప్పలాదుడు, అందగత్తె పద్మ చూడముచ్చటగా వున్నారు.

పద్మ గొప్ప పతివ్రత, భర్తకి సేవచేస్తూ ఆశ్రమంలో వుండిపోయింది. ధర్మదేవత పద్మని పరీక్షించాలని ఈ జడలు కట్టిన మహర్షితో ఏం బ్రతుకుతావు. నీ అందానికి తగ్గట్టుగా మాతో వుండాలి నువ్వు అన్నాడు. పద్మ కోపంతో నీ చివరికాలంలో నాశనమయిపోతావని శపించింది.

ధర్మదేవత నిజస్వరూపంలో కనిపించి నిన్ను పరీక్షించడానికి ఇలా అన్నాను కాని నిజంగా కాదని శాపవిమోచనం చెయ్యమని అడిగాడు పద్మని. శాపం అనుభవించక తప్పదని కలియుగంలో ఒంటి పాదంతో ఉండి మళ్ళీ కృతయుగం వచ్చేసరికి పరిపూర్ణంగా నాలుగు పాదాల్తో వుంటావని చెప్పింది పద్మ.

నీభర్త మార్కండేయుడి కంటే ఆయుష్షు, కుబేరుడి కంటే ఎక్కువ ధనం, కపిలుడి కన్నా గొప్ప ఋషి, శివుడితో సమానంగానూ నిత్య యౌవనంతోనూ ఉంటాడని దీవించాడు పద్మని ధర్మదేవత.

పద్మ భర్తకి జరిగిందంతా చెప్పింది. పిల్పలాదుడు భార్యని ఎంతో గౌరవించాడు. వాళ్ళకి అయిదుగురు కొడుకులు పుట్టారు. పిప్పలాదుడు తపస్సుతో కాలం గడుపుతూ తన దగ్గరికి వచ్చిన వాళ్ళ సందేహాలు తీరుస్తున్నాడు.

ఒకనాడు పిప్పలాద మహర్షిని చూడ్డానికి కాత్యాయన మహర్షి సంతతి వాడు కబంధుడు, భృగువంశం వాడు వైదర్భి, అశ్యలాయన వంశం వాడు కౌశల్యుడు, గర్గ మహర్షి వంశం వాడు సౌర్యాయనుడు, సత్యకాముని వంశం వాడు శైభ్యుడు, భరద్వాజుడి వంశం వాడు సుకేశుడు మొదలైన గొప్ప వాళ్ళందరూ వచ్చి వాళ్ళ సందేహాలు ఇలా అడిగారు.

సృష్టి ఎలా జరుగుతోంది? అని అడిగితే మహాత్మా! చంద్రుడు సూర్యుడు కలిసి నడిపిస్తున్నారు. సూర్యుడే ప్రాణం. ప్రాణాగ్నులు ఇతని నుంచే పుడ్తున్నాయి. పరబ్రహ్మ

పురుషుడుగా అంతర్ముఖంలో కర్మసాక్షిగానూ, బహిర్గతంలో కాలస్వరూపుడుగానూ మొత్తం ప్రపంచాన్ని నడుపుతున్నాడు.

కాలస్వరూపం అంటే దక్షిణాయనంలో చంద్రమండలప్రాప్తి, ఉత్తరాయనంలో బ్రహ్మలోకప్రాప్తి కలిగిస్తున్నాడు. మొదటిదానికి యజ్ఞయాగాదులు బావులు, చెఱువులు తవ్వించడం లాంటివీ, రెండోదానికి బ్రహ్మచర్యం శ్రద్ధాభక్తులు ఆత్మజ్ఞానం వుండాలి అని చెప్పాడు పిప్పలాదుడు.

సంవత్సరానికి పన్నెండు మాసాలుంటాయి. మాసం ప్రజాపతి స్వరూపం. శుక్లపక్షం ప్రాణస్వరూపం. పురుషుడి శుక్రం స్త్రీ శోణితంతో కలిసినప్పుడు ప్రజాసృష్టి జరుగుతుంది. కానీ, ఇది రాత్రి భాగంలోనే కాని, పగటి భాగంలో జరిగితే ఆయువు తగ్గిపోతుంది.

ఈ శరీరాన్ని భరించే వాళ్ళు ఎవరు? ప్రకాశింప చేసేవాళ్ళు ఎవరు? అందులో గొప్ప వాళ్ళెవరు? అని అడిగారు మహర్షులు.

ప్రాణం శరీరాన్ని నిలబెడుతుంది, ప్రకాశింప చేస్తుంది కూడా. ఇంద్రియాలు ఇది ఒప్పుకోలేదు. మేమే నిలబెడతున్నామన్నారు. కాని ప్రాణం పోగానే ఇంద్రియాలు పోతున్నాయి కదా. భగవంతుడే ప్రాణరూపంలో శరీరంలో ఉన్నాడు కనుక ప్రాణమే శ్రేష్ఠమైంది కూడా అన్నాడు పిప్పలాద మహర్షి.

ఇంకా ఇలా అడిగారు మహర్షులు. ప్రాణం ఎలా పుడుతుంది? శరీరంలోకి ఎలా వెళ్ళి, విభజించబడ్తుందని?

ఆత్మనుంచే ప్రాణం పుడ్తుంది. మనిషి కోరడాన్ని బట్టి శరీరంలో ప్రవేశించి ప్రాణం, ఆపానం, వ్యానం, ఉదానం, సమానం అని అయిదు భాగాలుగా విభజించబడుతుంది. ప్రాణం పంచేంద్రియాల్లో వుంటుంది. అపానం పనికిరాని పదార్థాల్ని బయటకి పంపిస్తుంది. సమానం తిన్న పదార్థాల్ని జీర్ణం చేస్తుంది. వ్యానం గుండెనుంచి బయల్దేరి నూట ఒక్కనాడులు ఒక్కొక్కటి డబ్బయి రెండు వేలుగా మారి శరీరమంతా వ్యాపించడానికి ఉపయోగిస్తుంది. ఉదానం మనిషి చేసిన పాపపుణ్యాలని బట్టి జీవుడ్ని పై లోకాలకి తీసుకువెడుతుంది. ఇవన్నీ తెలుసుకుని నడుచుకుంటే మనిషికి ఎప్పుడూ మరణించాలనుకుంటే అప్పుడు ఏలోకానికి వెళ్ళాలనుకుంటే అక్కడికి వెళ్ళచ్చు అన్నాడు పిప్పలాద మహర్షి.

మహాత్మా ! "నిద్రించేది మేల్కొనేది ఏమిటి? సుఖమెలా వస్తుంది?" అని అడిగారు మహర్షులు.

పిప్పలాదమహర్షి "ఇంద్రియాలన్నీ మనస్సుతో కలిసి బైటకి వెళ్ళడాన్ని మహర్షులు నిద్ర అంటాము." అన్నీ కలిసి పరమాత్మలో లీనమవడం వల్లే సుఖం కలుగుతుంది" అని చెప్పాడు.

దేవా ! ఆఖరివరకూ ఓంకారం ఉపాసించినవాడు ఏలోకానికి వెడతాడని అడిగారు మహర్షులు.

రోజుకి ఒక్కసారి ఓంకారం ఉపాసిస్తే మనిషిగా పుడతారు. రెండుసార్లు చేస్తే చంద్రమండలం చూసి వచ్చి నరలోకానికి వెడతారు. మూడుసార్లు చేస్తే సూర్యమండలంలోంచి బ్రహ్మలోకానికి వెడతారు.

శరీరం ఆరోగ్యంగా ఉండడానికి ప్రాణం నుంచి శ్రద్ధ, ఇంద్రియాలు, శరీరం, అన్నం, వీర్యం అన్నీ కలిసి మనిషిలో నామ రూప రుచి భేదాల్లేకుండా కలిసిపోతున్నాయి. అలాంటి వాడే షోడశకళాపురుషుడు లేకపోతే అమృత స్వరూపుడు అంటారని చెప్పాడు పిప్పలాద మహర్షి.

పిప్పలాదుడు ఇంకా ఇలా చెప్పాడు. శరీరం పంచభూతాల్తో తయారయింది. శరీరంలో గట్టిగా ఉండే చోటుని పృథివి అని, ద్రవ ప్రదేశాన్ని జలమని, వెచ్చగా ఉండే ప్రదేశాన్ని తేజమని, సంచరించేదాన్ని వాయువని, ద్వారమై ఉండేది ఆకాశమని అంటాం.

ఇంకా రసం నుండి రక్తం, రక్తం నుంచి మాంసం, మాంసం నుంచి మేధస్సు, మేధస్సు నుంచి ఎముకలు, ఎముకల నుంచి మజ్జ, మజ్జ నుంచి పురుషుడి శుక్లం, స్త్రీకి శోణితం ఉంటున్నాయి. వీటి కలయికవల్లే మనిషి పుట్టుక జరుగుతుంది.

ఈ విధంగా మనిషి ఎలా పుడతాడు? ఎలా బ్రతకాలి? మన మరణం మన చేతిలో ఎలా వుంది? అసలు ప్రాణం అంటే ఏమిటి? ఓంకారం వల్ల ఏలోకాలకి వెళ్ళచ్చు? అనేవన్నీ మనకి చెప్పాడు పిప్పలాద మహర్షి. ఆయన గ్రంథాలు "గర్భోపనిషత్తు", "పరబ్రహ్మోపనిషత్తు."

మీకు ఇంకా వివరంగా చెప్పాలంటే మీ వయస్సు చాలదు. అందుకే ఇంతకంటే వివరం పెద్దయ్యాక తెలుసుకుందాం సరేనా !

ఇదర్రా పిప్పలాద మహర్షి కథ !!

# 53. పులస్త్య మహర్షి

**రం**డి పిల్లలూ ! ఇపుడు మనం పులస్త్య మహర్షిని గురించి తెలుసుకుందాం. పులస్త్య మహర్షి ముందు ఎలా పుట్టాడో తెలుసుకుందామా! మీకు తెలిస్తే చెప్పండి. తెలియదా, అయితే వినండి బ్రహ్మగారి కుడి చెవి నుంచి పుట్టాడు. బ్రహ్మగారు చెప్పినట్లే తపస్సు చేసుకుంటూ క్రోధం, కామం జయించి అపరశివుడిలా వెలిగిపోతూ ఉన్నాడు పులస్త్య మహర్షి.

బ్రహ్మ ఆజ్ఞ ప్రకారం కర్దమ ప్రజాపతి తన కూతురు హవిర్భువుని పులస్త్యుడికిచ్చి పెళ్ళి చేశాడు. వీళ్ళకి అగస్త్యుడు పుట్టాడు. తర్వాత పులస్త్యుడు సంసారం వదిలిపెట్టేసి తృణబిందు ఆశ్రమానికి వచ్చి తపస్సు చేసుకుంటున్నాడు.

అందమైన ఇద్దరు ఆడపిల్లలు ఆ ఆశ్రమంలో తిరుగుతూ పులస్త్యుడున్న చోటికి వచ్చారు. వాళ్ళు ఆ ఆశ్రమంలో వున్న పూలు చెట్లు చూసుకుంటూ కబుర్లు చెప్పుకుంటూ

హాయిగా తిరిగేస్తున్నారు. తపస్సుకి విఘ్నం కలగడానికి ఇష్టపడక పులస్త్యుడు నాకు కనపడిన ఆడపిల్ల వెంటనే గర్భవతవుతుందని శపించాడు. ఆ పిల్లలిద్దరూ పారిపోయారు.

ఈ సంగతి తెలియక తృణబిందుడనే రాజర్షి కూతురు ఆశ్రమంలో తిరుగుతూ పులస్త్యుడున్న చోటికి వచ్చి వెంటనే గర్భవతి అయింది. ఏడుస్తూ తండ్రికి చెప్పింది. తృణబిందుడు దివ్యదృష్టితో చూసి ఈ విధంగా జరగడం పులస్త్యుడి శాపం వల్ల అని తెలుసుకుని కూతుర్ని తీసుకుని పులస్త్యుడి దగ్గరకి వెళ్ళి జరిగింది చెప్పి ఆమెని పెళ్ళి చేసుకోమన్నాడు. పులస్త్యుడు అంగీకరించగానే ఇద్దరికీ పెళ్ళి చేసి ఆమెని అక్కడే వదిలి వెళ్ళిపోయాడు తృణబిందుడు.

ఆమె కూడ అక్కడే వుండి మహర్షికి కావలసినవి అందిస్తూ వుండేది. కొంతకాలానికి ఆమెకి ఒక కొడుకు పుట్టాడు. కడుపులో ఉండగానే తండ్రి చదివే శ్రుతులన్నీ విన్నాడు. అతనికి విశ్రవసుడని పేరు పెట్టారు.

విశ్రవసుడు తండ్రిలాగే విద్యలు నేర్చి తపస్సు చేసుకుంటూ దేవవర్ణిని పెళ్ళి చేసుకుని రావణ, కుంభకర్ణ, విభీషణ, శూర్పణఖలను పొందాడు.

రావణుడు బ్రహ్మ వల్ల వరం పొంది గర్వంతో కార్తవీర్యార్జునుడితో యుద్ధానికి వెడితే కార్తవీర్యుడు జైల్లో పడేశాడు. పులస్త్యుడు కార్తవీర్యుడింటికి వెళ్ళి రావణుణ్ణి విడిచిపెట్టమని అడిగాడు. కార్తవీర్యుడు పులస్త్యుడికి సత్కారం చేసి ఆయన చెప్పిన విధంగా రావణుణ్ణి విడిపించి సంపదలిచ్చి పంపాడు.

ఒకసారి పరాశరుడు రాక్షసుల మీద కోపంతో సత్రయాగం మొదలుపెట్టి రాక్షస సంహారం చేస్తుండగా వసిష్ఠుడు వచ్చి ఆపాడు.

పరాశరుడు దగ్గరకి వచ్చిన పులస్త్యుడు అంత కోపంలో ఉండి కూడ యాగం ఆపమనగానే ఆపినందుకు ఆనందించి పరాశరుణ్ణి వరం కోరుకోమన్నాడు.

తన మనసెప్పుడు వేదపురాణాల మీద ధ్యాసతో ఉండాలని, వేదశాస్త్రాల్లో గొప్ప ప్రతిభ కలిగి ఉండాలని కోరుకుని పులస్త్యుడి దగ్గర వరం పొందాడు పరాశరుడు.

భీష్ముడు గంగా నదీతీరంలో తండ్రికి పితృకర్మలు చేస్తుంటే పులస్త్యుడు అక్కడికి వెళ్ళాడు. భీష్ముడు మహర్షిని పూజించి ఆయన పాదాలు తలమీద పెట్టుకుని స్వామీ ! ఆజ్ఞాపించండి అన్నాడు. భీష్మా! నీకేమయినా సందేహాలుంటే అడుగు చెప్తాను అన్నాడు పులస్త్య మహర్షి. మీరు తీర్థప్రియులు కదా! తీర్థయాత్రల వల్ల కలిగే ఫలితాల గురించి చెప్పండని భీష్ముడు అడిగాడు.

పులస్త్యుడు భీష్మా ! ఇంద్రియాల్ని జయించడం, గర్వం, కోపం, ప్రతిఫలాన్ని ఆశించకపోవడం, మితంగా తినడం, నిజాన్నే పలకడం, ఎప్పుడు సంతోషంగా ఉండడం

మంచిపన్లే చెయ్యడం ఇలాంటివి చేసేవాళ్ళకి అన్ని తీర్థాలవల్ల వచ్చే ఫలితము దానికదే వచ్చేస్తుంది. ఎక్కడికీ తిరగక్కర్లేదు. పుష్కర తీర్థంలో స్నానం చేస్తే బ్రహ్మలోకం వస్తుంది. జంబూమార్గం, తండులికాశ్రమం, అగస్త్యసరం వీటి వల్ల అశ్వమేధయాగం చేసిన పుణ్యం, రుద్రకోటి అనే తీర్థాలు కురుక్షేత్రం, సోమతీర్థం, నర్మద, దక్షిణ సింధు, చరణ్వతి, సరస్వతి, సాగర సంగమం, పింగళతీర్థం ఇలా అన్ని తీర్థాలకి దేని ఫలితం దానికే వుందని పులస్త్యుడు తీర్థాల విశేషాలన్నీ భీష్ముడికి చెప్పాడు. భీష్ముడు అన్ని తీర్థాలకి వెళ్ళి ప్రశాంతంగా కాలం గడుపుతున్నాడు.

పులస్త్యుడు స్మృతికర్త, బ్రహ్మ, మహర్షి, సర్వజ్ఞుడు, సర్వదేవతల పూజలందుకున్నవాడు అని పేరు తెచ్చుకున్నాడు.

ఆయన రాసిన గ్రంథాల్లోవి అర్థం చేసుకునే వయస్సింకా మీకు లేదు. ఇంకా కొంచెం పెద్దయ్యాక తెలుసుకుందురుగాని, అన్నీ తెలుసుకోవడమే కాదు ఆచరించాలి కూడా...

చూశారా.. పులస్త్య మహర్షి బ్రహ్మ గారి చెవిలోంచి పుట్టినా కొంచెంకూడా గర్వం లేకుండా అందరికీ తెలియనివి, అడిగినవి చెప్పి మనకోసం కూడ గ్రంథాలు రాసి ఉంచాడు. అదర్రా ! జీవితం అంటే !!

# 54. పైల మహర్షి

**ఇ**ప్పుడు మనం పైల మహర్షి గురించి తెలుసుకుందాం. ఈయన తల్లితండ్రులెవరో తెలియదు. వ్యాసభగవానుడికి శిష్యుడు పైల మహర్షి.

శిష్యులకి ఋగ్వేదం చెప్తుండేవాడు. ఈయన్ని ఋగ్వేదధ్యాపకుడంటారు. వ్యాస మహర్షి తన దగ్గరుంచుకుని విద్యలన్నీ నేర్పించాడు. పైలుడు విద్యలన్నీ నేర్చుకున్నాక గొప్ప తపస్సు చేసి పైల మహర్షి అయ్యాడు.

భగవంతుడు సత్యవతీదేవి యందు పరాశరుడుగా పుట్టి వేదరాశిని ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము, అథర్వవేదము అని నాలుగు భాగాలుగా విభజించి పైల మహర్షికి ఋగ్వేదం, వైశాంపాయనుడికి యజుర్వేదం, జైమినికి సామవేదం, సుమంతునికి అథర్వవేదం ఉపదేశించాడు.

పైలమహర్షి నేర్చుకున్న ఋగ్వేదం చాలా ఋక్కుల్తో కూడుకుని వుండటంచేత "బహ్వృచశాఖ" అని పేరు పొందింది. పైలుడు ఈవేదాన్ని ఇంద్రప్రమితి, పాష్కలుడు అనే శిష్యులకి చెప్పాడు. ఇంద్రప్రమితి తనకొచ్చింది మాండూకేయుడికి చెప్పాడు. మాండూకేయుడు దేవమిత్రుడికి, దేవమిత్రుడు సౌభరికి, సౌభరి తన కొడుకు శాకల్యుడికి చెప్పారు.

శాకల్యుడు తాను నేర్చుకున్నది అయిదు భాగాలుగా చేసి వాత్స్యుడు, శాలీయుడు, మౌద్గల్యుడు, గోముఖుడు, 'శిశిరుడు మొదలైన వాళ్ళకి చెప్పాడు. శిశిరుడు తన శిష్యులకి, పాష్కలుడు నాలుగు విభాగాలుగా నలుగురుకి చెప్పాడు. ఈ విధంగా ఋగ్వేదం చాలామంది ఋషులు నేర్చుకున్నారు.

పైల మహర్షి ఋగ్వేదం నాలుగువైపులా వ్యాపించేలా చేశాడు.

ఇదర్రా పైలమహర్షి కథ!!

# 55. బకదాల్భ్య మహర్షి

**పి**ల్లలూ! ఇపుడు మనం తెలుసుకోబోయేది ఒక అతి అద్భుతమైన మహర్షి గురించి. నిజంగా చదువుతుంటే శరీరం పులకరిస్తుంది. ఏం గొప్పతనం!! ఎంత ఆయుష్షు !! ఎంత వినయం!! మహాద్భుతం.

ఇంక ఆలస్యం చెయ్యకండి. నాకే కంగారుగా ఉంది. మీకు ఎప్పుడెప్పుడు తెలియచేద్దామా అని ఎదురు చూశాను. ఇప్పటికి నాకు అవకాశం దొరికింది. మొదలుపెట్టండి మరి.

చాలా చాలా యుగాలకి పూర్వం దాల్భ్యుడనే మహర్షి ఉండేవాడు. ఆయన విష్ణుమూర్తిని ప్రార్థించి ఎన్నికల్పాలయిపోయినా సరే మరణం లేకుండా ఉండే కొడుకు కావాలని వరం పొంది ఒక కొడుకుని పొందాడు. ఆహా ! ఎంత అదృష్టం. ఆయన ఎంత పుణ్యాత్ముడో ! అంత గొప్ప కొడుకుని కన్న తండ్రి తక్కువ వాడు కాదు కదా...!

ఆ పిల్లవాడు బక పుష్పం ఉన్నంత అందంగా చక్కటి సువాసనతో ఉన్నాడని బకుడని పేరు పెట్టారు. తండ్రి పేరు కూడా కలిసి బకదాల్భ్యుడు అని, ఇతడ్ని పెంచిన తల్లిదండ్రులవల్ల ద్వ్యాముష్యాయణుడు, గ్లావుడు, గ్లావమైత్రేయుడు అని కూడ పేర్లున్నాయి.

బకదాల్భ్యుడు చిన్నతనంలోనే ముఖ్య ప్రాణోపాసనం చేసిన మహాతపశ్శాలి, మహాత్ముడు అయ్యాడు. ఒకసారి ఒక తెల్లకుక్క కొన్ని చిన్న కుక్కలను ఒకదానితోక ఒకటి నోటితో పట్టుకుని వలయాకారంలో తిరిగి కూర్చుంటే చూసి ఋత్విజుల విధుల్ని నిర్ణయించాడు.

బకదాల్భ్యుడు ద్వైతవనంలో ఆశ్రమం ఏర్పాటు చేసుకుని ఉన్నాడు. గొప్ప తపస్సు చేసి మరణాన్నే జయించి, అపర శివుడిలా తేజస్సుతో వెలిగిపోతున్నాడు. కొంతకాలం తర్వాత పాండవులు ద్వైతవనంలో ఉండడానకి వచ్చారు. వాళ్ళని పెద్ద పెద్ద మునులందరూ వెళ్ళి పలకరించి వస్తున్నారు.

బకదాల్భ్య మహర్షి ఒకసారి పాండవులని చూడ్డానికి వెళ్ళి ధర్మరాజు దగ్గర అతిథి సత్కారం తీసుకుని నాయనా ! ఉత్తములైన బ్రాహ్మణులు మీ దగ్గరికి వచ్చి పోతూ వుంటే అగ్నికి, వాయువు తోడైతే అరణ్యాన్ని ఎలా దహిస్తాయో, మా బ్రాహ్మణులు, మీ క్షత్రియులు కలిసినప్పుడు శత్రువులు కూడా అలాగే నశిస్తారు అన్నాడు. యుద్ధంలో ఏనుగుకి దారి చూపించడానికి అంకుశం ఎలా ఉపయోగపడ్తుందో, రాజుని ధర్మమార్గంలో త్రిప్పడానికి బ్రాహ్మణుడు అలాగే ఉపయోగపడతాడన్నాడు.

తర్వాత బకదాల్భ్యుడు చిరంజీవుల్లో ఒకడై బ్రహ్మచారై ఎన్నో యుగాలు బ్రతికి సముద్రం మధ్యన ఒక దీవిలో తపస్సు చేసుకుంటున్నాడు.

ఒకసారి ధర్మరాజు అశ్వమేధయాగం చెయ్యడానికి యజ్ఞాశ్వాన్ని విడిచిపెట్టినప్పుడు కృష్ణార్జునులు గుఱ్ఱంతో తిరుగుతూ మహర్షి ఉన్న చోటుకి వచ్చారు. అక్కడ కొన్ని యుగాలుగా పెరిగిన శరీరం, జడలు, గడ్డంతో, కోటి సూర్యుల తేజస్సుతో ఉన్న బకదాల్భ్యుణ్ణి చూసి కృష్ణార్జునులు రథం దిగి నడిచి వెళ్ళి నమస్కారం చేశారు.

అర్జనుడు మహర్షిని చూసి ఆశ్చర్యపోయాడు. శరీరం చుట్టూ పుట్టలు,. మోకాళ్ళు మోచేతులు నించీ చెట్లు, పుట్టల్లో ఎన్నో రకాల పాములు ఆ చెట్లమీద ఎన్నో రకాల పక్షులు చూసి అర్జనుడు మహర్షికి నమస్కారం పెట్టి ఈ మీ వింతకి పరమార్థం ఏమిటని అడిగాడు.

అర్జునా ! క్షణంలో పోయే ఈ శరీరానికి తూగుటుయ్యాలాలు, పూలపాన్పులు ఎందుకు? ఈ మట్టి ఆకులు చాలవా? అన్నాడు బకదాల్భ్యుడు. అర్జునుడు స్వామీ ! మీ వయస్సెంత ? అన్నాడు.

బకదాల్భ్యుడు నేను పుట్టాక ఇరవై మంది బ్రహ్మలు వెళ్ళారు. ఎంతో మంది మార్కండేయులు వెళ్ళిపోయారు. నీకొక చిత్రమైన విషయం చెప్తాను విను. ప్రళయ కాలంలో ఏడు సముద్రాలు, ముల్లోకాలు కొట్టుకొచ్చి ఇక్కడికి చేరాయి. అప్పుడిక్కడ ఒక మఱ్ఱి చెట్టుండేది. దాని కొమ్మలు వెయ్యిపైగానే ఉన్నాయి. ఒక్కొక్క కొమ్మకి వెయ్యేసి బ్రహ్మాండాలు వ్రేలాడుతున్నాయి. ఆ మఱ్ఱి చెట్టుకి చిటారుకొమ్మ మీద ఒక చిగురాకు మీద పడుక్కుని కుడి కాలి బొటన వ్రేలు నోట్లో పెట్టుకుని ఒకసారి నవ్వుతూ ఒకసారి ఏడుస్తూ నన్ను ప్రేమతో చూసి భయం లేదని అభయమిచ్చాడు ఒక బాలుడు. రమ్మనేవాళ్ళు లేక పొమ్మనే వాళ్ళు లేక అంతటికి తానే నాయకుడయ్యి హాయిగా పడుకుంటే అతని నాభిలోంచి ఒక కమలం దాంట్లోంచి ఒక బ్రహ్మ వచ్చి ఈ సృష్టినంతా చేశాడు. అతడే శ్రీకృష్ణుడుగా పుట్టి నీకు బావై ఈ బాధలన్నీ పడుతున్నాడని చెప్పి కృష్ణుడ్ని కౌగిలించుకుని ఎలావున్నావయ్యా మూడులోకాల కుటుంబీ ! అన్నాడు బకదాల్భ్య మహర్షి శ్రీకృష్ణుణ్ణి.

కృష్ణుడు బకదాల్భ్యుణ్ణి పొగుడుతుంటే, పొగడ్త ఎంతటి గొప్పవాడ్నయినా నాశనం చేస్తుంది, ఒక కథ చెప్తాను వినమన్నాడు మహర్షి. అర్జునుడికి కథలంటే ఇష్టం. వెంటనే చెప్పండి చెప్పండి అన్నాడు.

నేను ఒక మర్రి చెట్టు దగ్గర తపస్సు చేసుకుంటుంటే నాలుగు ముఖాల బ్రహ్మ వచ్చి నీకేం కావాలో కోరుకో ఇస్తానన్నాడు. నీలాంటి వాళ్ళని ఇరవైమందిని చూశాను. నువ్వు నాకేమిస్తావన్నాను. నేను, బ్రహ్మకి కోపం వచ్చి వెర్రివాడ్ననుకుంటున్నావా? అన్నాడు. నేను నవ్వుతున్నాను. ఈలోగా మా ఇద్దరి మధ్యా భూమి చీలి పెద్దగాలి వచ్చి మమ్మల్ని వేరే బ్రహ్మాండంలో పడేసింది. అక్కడ ఎనిమిది తలల బ్రహ్మ మీరెవరో నాకనవసరం నాసేవ చెయ్యండన్నాడు. మళ్ళీ అలాగే జరిగి పదహారు తలల బ్రహ్మ తన సేవ చెయ్యమన్నాడు. బ్రహ్మాండాలు దాటుతూ బ్రహ్మల్ని చూస్తూ అలా వెడుతూనే వున్నాం. చాలా ముఖాలున్న బ్రహ్మల్ని చూస్తూనే వున్నాం.

చివరికి వెయ్యి తలలు, అమితమైన తేజస్సు కలవాడు అయిన బ్రహ్మ మమ్మల్ని చూసి ఎదురొచ్చి యోగక్షేమాలడిగి నేను నా పరివారం అంతా మీ ఆధీనంలోనే వున్నాం. మీకేం కావాలో అడగండి చేస్తాం అన్నాడు. బ్రహ్మలందరు సిగ్గుతో తలవంచుకుని గర్వం నశించి మహాపురుషా! నువు విష్ణుమూర్తివని, మా గర్వం అణగాలనే ఇలా చేశావని అర్థమయింది. క్షమించమని అడిగారు. అందుకని అర్జునా! గర్వం పనికిరాదు అన్నాడు బకదాల్భ్యుడు.

కృష్ణార్జునులు బకదాల్భ్య మహర్షిని స్తుతించి ధర్మరాజు చేస్తున్న అశ్వమేధయాగానికి రమ్మని బ్రతిమలాడారు. నవరత్నాలు పొదిగిన బంగారు పల్లకీలో మహర్షిని కూర్చోబెట్టి ధర్మరాజుకి కబురు చేసి మహర్షిని తీసుకువెళ్ళారు. ఋత్విజుల్ని మంత్ర పాఠకుల్ని నియమించి తాను బ్రహ్మగా ఉండి అశ్వమేధయాగం పూర్తి చేయించాడు మహర్షి.

కొంతకాలం తర్వాత బకదాల్భ్యుడు తన దగ్గర చాలినన్ని కోడెదూడలు లేవని ధృతరాష్ట్రుణ్ణి అడిగాడు. ధృతరాష్ట్రుడు చచ్చిపోయిన దూడల్నిచ్చి తీసుకోమన్నాడు.

మహర్షి కోపంతో బ్రహ్మర్షులంటే నీకు వెటకారంగా ఉందా? నిన్ను సర్వనాశనం చేస్తానని ధృతరాష్ట్రుడి రాజ్యం అంతరించిపోయేలా అభిచారిక హోమం ప్రారంభించాడు.

ధృతరాష్ట్రుడు పరుగెత్తుకు వెళ్ళి మహర్షి కాళ్ళ మీద పడ్డాడు. మాలాంటి వాళ్ళు లేకపోతే నీలాంటి వాళ్ళకి పట్టపగ్గాలుంటాయా ! క్షమించాను ఫో ! అన్నాడు మహర్షి. ధృతరాష్ట్రుడు వెంటనే గోవుల్ని పంపించాడు.

మన భారత బ్రహ్మర్షులు దుష్టశిక్షణ, శిష్టరక్షణ చెయ్యడంలో పరమేశ్వరుడంతటి వాళ్ళు.

ఇదర్రా పిల్లలు బకదాల్భ్యమహర్షి కథ !!

నేను చెప్పినట్లే చాలా బాగుందా? అద్భుతంగా లేదూ? ఎన్ని కల్పాలు బ్రతికేడో! ఇప్పటికీ ఉండే ఉంటాడు. కాని మనికి తెలియదు కదా ! నియమనిష్ఠలతోనూ, ధర్మంగానూ, భగవంతుణ్ణి ధ్యానిస్తూ ఉంటే మనం కూడ అన్నీచెయ్యగలం.

# 56. భరద్వాజ మహర్షి

**రం**డి పిల్లలూ ! ఇపుడు భరద్వాజ మహర్షిని గురించి తెలుసుకుందాం. సప్తఋషులంటూంటారు విన్నారు కదా ! వాళ్ళల్లో ఒకడు మనం తెలుసుకోబోయే భరద్వాజ మహర్షి. ఈయన తపస్సు చేసిన ఆశ్రమం పేరు 'భరద్వాజతీర్థ'

బృహస్పతి తన అన్నగారైన ఉతథ్యుడింటికి వచ్చాడు. బృహస్పతికి శాపం ఉండటం వల్ల వదిన గారైన మమతని ఇష్టపడ్డాడు. మమత తప్పని చెప్పినా వినిపించుకోలేదు. మరి శాపప్రభావం కదా! వీళ్ళిద్దరికీ పుట్టినవాడు 'భరధ్వాజుడు' మమత నాకిష్టం లేదు కాబట్టి ఈ పిల్లాడ్ని నేను పెంచనంది. బృహస్పతి నువ్వే పెంచమని మమతకి చెప్పి వెళ్ళిపోయాడు. మరుత్తులు ఆ పిల్లాణ్ణి పెంచుతున్నారు. దుష్యంత మహారాజు కొడుకు భరతుడు చక్రవర్తై వందలకొద్ది అశ్వమేధయాగాలు చేసినా పిల్లలు లేక బాధపడుతున్నాడు. మరుత్స్తోకియం అనే యాగం చేశాడు భరతుడు. మరుత్తులు భరద్వాజుణ్ణి భరతుడికి అప్పగించారు. మమత బృహస్పతులు ఇద్దరితో వదిలివేయబడి భరతుడు పెంచినవాడు కాబట్టి భరద్వాజడని పేరు.

'భరద్వాజుడు' మహాతపస్వి కదా! తండ్రి భరతుడితో యజ్ఞాలు చేయించడం వల్ల నలుగురు కొడుకులు కలిగారు. కొంతకాలం తర్వాత భరద్వాజుడు కూడ పెళ్ళి చేసుకున్నాడు. కూతురు దేవకర్ణి, కొడుకు మనువు అనే ఇద్దరు పిల్లల్ని పొందాడు.

భరద్వాజుడు కొంతకాలం తర్వాత భరతుడి దగ్గర నుంచి గంగాతీరం వెళ్ళి ఆశ్రమం నిర్మించుకుని అక్కడ తపస్సు చేసుకుంటూ వున్నాడు. గంగానదిలో స్నానం చేస్తూ ఒక అప్సరసని చూశాడు. ఆమె వల్ల భరద్వాజుడికి ద్రోణుడనే కొడుకు కలిగాడు.

ద్రోణుడు, వృషతుడనే రాజు కొడుకు ద్రుపదుడు కలిసి చదువుకున్నారు. ద్రుపదుడు పాంచాల దేశానికి రాజు అయ్యాడు. ద్రోణుడికి వేదవిద్యలు, విలువిద్యలు నేర్పించి 'కృపి' అనే అమ్మాయినిచ్చి పెళ్ళి చేశాడు భరద్వాజుడు. ద్రోణుడికి అశ్వత్థామ పుట్టాడు. ఇలా భరద్వాజ వంశం వృద్ధి అయింది.

భరద్వాజుడు భృగుమహర్షిని అడిగి అనేక విషయాలు తెలుసుకున్నాడు. భరద్వాజుడు మూడు కాలాలు తెలుసుకోకలిగిన జ్ఞానంతో గొప్ప తపశ్శక్తితో చాలామంది శిష్యుల్తో తన ఆశ్రమంలో వున్నాడు.

ఒకనాడు శ్రీరాముడు అరణ్యవాసానికి వెడుతూ భరద్వాజుడి ఆశ్రమానికి వచ్చాడు. మహర్షి శ్రీరాముణ్ణి విష్ణుమూర్తిగా గుర్తుచేసి మర్నాడు ఉదయాన్నే బయలుదారి చిత్రకూటానికి వెళ్ళమన్నాడు.

శ్రీరాముడు అరణ్యవాసం అయిపోయాక మహర్షి ఆశ్రమానికి వచ్చి తిరిగి అయోధ్య వెడుతున్నట్లు చెప్పాడు. నువ్వువిష్ణుమూర్తి అవతారమే అయినా నీకేంకావాలో అడగమన్నాడు మహర్షి.

మహాత్మా ! మీ ఆశ్రమంలో ఉన్నట్లే సాకేతపురం చుట్టూ చక్కటి ఉద్యానవనాలు ఉండేలా చెయ్యమని వరం తీసుకుని అయోధ్యకి బయలుదేరాడు రాముడు.

భరద్వాజుడు తీర్థయాత్రలు చేస్తూ వ్రేపల్లె వచ్చి యమునానదిలో స్నానం చెయ్యాలనుకుని అక్కడున్న వాళ్లని రేవు చూపించమన్నాడు. వాళ్ళు ఆయన్ని ఆటలు పట్టించారు.

గోపాల బాలకులతోనూ, బలరాముడితోనూ అందరితో కలిసి అక్కడ తిరుగుతున్న శ్రీకృష్ణుడు పరుగుపరుగూ వచ్చి మహర్షికి నమస్కారం చేసి ఆతిథ్యం తీసుకోమన్నాడు. భారద్వాజుడు అతణ్ణి శ్రీకృష్ణుడయిన విష్ణుమూర్తి అవతారంగా తెలుసుకుని స్తోత్రం చేశాడు.

పూర్వం మనువంశం వాడయిన వీతహవ్యుడనే రాజుకి వందమంది కొడుకులు. వాళ్ళు కాశేశుడనే రాజుతో యుద్ధం చేసి ఓడించారు. తర్వాత అతడి కొడుకు సుదేవుణ్ణి రక్షించమని భరద్వాజుణ్ణి అడిగాడు దివోదాసుడు. సుదేవుడి కొడుకు దివోదాసుణ్ణి కూడా ఓడించారు.

భరద్వాజుడు రాజుకి అన్ని విద్యలు తెలిసిన కొడుకు ప్రతపర్ణుణ్ణి అనుగ్రహించాడు. హైహేయుల్ని అందర్నీ చంపగా వీతహవ్యుడు మిగిలి భరద్వాజాశ్రమానికి వెళ్ళి మహర్షిని రక్షించమన్నాడు.

భరద్వాజుడు తన శిష్యుల్తోపాటు వీతహవ్యుడ్ని ఉండమన్నాడు. ప్రతర్ధనుడు వెతుక్కుంటూ వచ్చి మహర్షి ఆశ్రమంలో వీతహవ్యుడున్నాడేమో అని అడిగాడు. మహర్షి అప్పటికే వీతహవ్యుడ్ని బ్రాహ్మణ్ని చేశాడు గనుక ఇక్కడ క్షత్రియులు ఎవ్వరూ లేరని చెప్తే ప్రతర్ధనుడు వెళ్ళిపోయాడు. ఈ విధంగా మహర్షి అందర్నీ రక్షిస్తూ ఉండేవాడు.

భరద్వాజుడు రాజధర్మాల్ని చెప్తూ రాజుకి గద్ద చూపు, కొంగ వినయం, కుక్క విశ్వాసం, సింహ పరాక్రమం, కాకి సంశయం, పాము నడక ఉండాలని, ధర్మకార్యక్రమాలు ఎలా చెయ్యాలో, దోషుల్ని ఎలా దండించాలో కూడా శత్రుంజయుడనే రాజుకి చెప్పాడు.

ఒకసారి గొప్పగొప్ప మునులందరూ మన భరద్వాజుడి దగ్గరకొచ్చి శాస్త్రోక్తంగా ఉదయం ముఖం కడుక్కోవటం దగ్గర్నుంచి పడుక్కునే వరకు అన్ని పనులు ఎలా చెయ్యాలో తెలుసుకున్నారు. ఏ కొత్త పని మొదలుపెట్టినా తూర్పువైపు తిరిగే మొదలుపెట్టాలని అన్ని విషయాలు వివరంగా చెప్పాడు భరద్వాజుడు. ఈ గ్రంథాన్నే 'భరద్వాజ స్మృతి' అన్నారు.

పిల్లలూ ! మీకొక గొప్ప విషయం చెప్తాను. మీరు మీ స్నేహితులకి కూడా చెప్పుకోవచ్చు. ఆశ్చర్యం కలిగించే విషయం. భరద్వాజుడు 'వైమానిక శాస్త్రం' అంటే విమానాలు ఎలా తయారు చెయ్యాలి అని, ఒక గ్రంథం రాశాడు. మనం ఇప్పుడు తెలుసుకుంట్నుది భరద్వాజ మహర్షికి ఎపుడో తెలుసన్నమాట. దీంట్లో ఏమేమున్నాయో చెప్తానేం.

ఈ విమానం ఎలా వుంటందంటే విరగనిది కోసినా తెగకుండా కాలిపోకుండా ఉండేది, నాశనంకాకుండానూ వుంటుంది. ఈ పుస్తకంలో ఎనిమిది అధ్యాయాలున్నాయి. ఎక్కడైనా దొరుకుతుందేమో చూడండి. దొరికితే నాక్కూడా చెప్పండి. చెప్పడం మర్చిపోకండేం !

ఈ విమానంలో శత్రువుల మాటలు వినగలిగేలా, ఫోటోలు తీసుకోగలిగేలా, శత్రువిమానం రాకపోకలు తెలుసుకోగలిగేలా పైలట్లని మూర్ఛపోయేలా చెయ్యకలిగేవి చాలా పరికరాలుంటాయి. అంటే ఇవి యుద్ధవిమానాలేమో.

విమానానికి 31 భాగాలుండాలనీ. విమానం నడిపే వాళ్ళకి వేరువేరు బట్టలుండాలనీ, కాలాన్ని బట్టి తినడానికి మూడు రకాల ఆహార పదార్థాలుండాలనీ వాటి వల్ల గాలిలో ఉండే ఇరవై అయిదు రకాల విషాలు ఏం చెయ్యకుండా వుంటాయనీ రాశాడు.

పదహారు రకాల లోహాల్తో తయారు చేస్తే ఏ వాతావరణానికయినా తట్టుకుని చెక్కు చెదరకుండా వుంటుందిట. చెప్పడానికి నాకు చదవడానికి మీకు అవకాశం లేక కాని ఈ విమానం తయారు చేసే పద్ధతి అద్భుతంగా వుంది కదూ.... మనం మళ్ళీ కలుసుకోగలిగితే ఆ గ్రంథం మీలో ఒక్కళ్ళకయినా దొరికితే వివరంగా తెలుసుకుందాం కాదు ! కాదు ! విమానం మనమే తయారుచేద్దాం సరేనా !

# 57. భృగు మహర్షి

**పి**ల్లలూ ! ఇప్పుడు ఏ మహర్షి గురించి తెలుసుకుంటున్నామో మీరింకా ఊహించలేదుకదా. నేనే చెప్తాను. ఈ మహర్షులు మాత్రం అబ్బ ! ఎవరికి వాళ్ళే గొప్ప. ఒకళ్ళు కూడా తీసిపోరు కదా ! ఇప్పుడు మనం తెలుసుకోబోయే మహర్షి 'భృగు'.

ఈయన ఎంత గొప్పవాడో తెలుసా. డైరక్టుగా బ్రహ్మగారి హృదయంలోంచి పుట్టాడు. ఎంత అదృష్టమో కదా ! ఈయన వంశం భృగువంశమంటారు. ఈ వంశంలో పుట్టినవాళ్ళు చ్యవన, జమదగ్ని, శుక్ర, దధీచి మొదలైనవాళ్ళు. విష్ణుమూర్తి అవతారం పరశురాముడు కూడ ఈ వంశమే.

భృగుమహర్షి ఖ్యాతిని పెళ్ళి చేసుకుని ధాత విధాతల్నీ శ్రీ అనే కూతుర్నీ, ఉశన వల్ల యశనుడనే కొడుకునీ, పులోమ వల్ల చ్యవనుడినీ పొందాడు. యశనుడంటే ఎవరోకాదు రాక్షస గురువు శుక్రాచార్యుడే.

భృగుమహర్షి భార్య పులోమని ఒక రాక్షసుడు ఎత్తుకు పోవాలని ఆమె ఎక్కడ వుందని అగ్నిదేవుణ్ణి అడిగాడు. అగ్ని భృగుమహర్షి ఆశ్రమంలో వున్న ఈమే పులోమ అని చెప్పాడు.

రాక్షసుడు పులోమని ఎత్తుకుపోతుంటే ఆమె గర్భంలో వున్న పిల్లాడు కిందపడిపోయాడు. భృగుమహర్షి అగ్ని దేవుణ్ణి ఇదంతా జరగడానికి కారణం నువ్వే కాబట్టి ఏది కనిపిస్తే దాన్ని తింటూ సర్వభక్షకుడిగా వుండమని శపించాడు. అగ్నిదేవుడు బ్రతిమాలుకుంటే సర్వభక్షకుడివైనా అందరితో గౌరవించబడ్తావన్నాడు.

పూర్వం దేవతలు రాక్షసుల్ని స్వర్గలోకంలో లేకుండా గెంటేవారు. రాక్షస గురువు శుక్రాచార్యుడు శివుణ్ణి మెప్పించి సంజీవిని తెస్తానని వెళ్ళాడు. ఇదే సమయంలో దేవతలు రాక్షసుల్ని చంపెయ్యడం మొదలుపెట్టారు. భృగుమహర్షి భార్య ఉశన దగ్గరకు వెళ్ళి తమను కాపాడమని శరణు కోరారు రాక్షసులు.

ఇంద్రుడితో సహా దేవతలందర్ని స్తంభించిపోయేలా శపించింది ఉశన. కొంతమంది దేవతలు విష్ణుమూర్తిని ప్రార్థించారు. స్త్రీని చంపడం పాపం కదా భయపెడదామనుకున్నాడు విష్ణుమూర్తి. ఈ లోపునే ఉశన విష్ణుమూర్తినే శపించాలని అక్షరం అనబోయేలోగా విష్ణుమూర్తి ఆవిడ కంఠంలో బాణం వేశాడు. వెంటనే ఆమె చనిపోయింది.

భృగు మహర్షి వచ్చి ఇదంతా చూసి ఒక స్త్రీని చంపావు, నీకు ఇంత అహంకారమా? అని భూలోకంలో మనిషివై పుడుతూ మరణిస్తూ సుఖదుఃఖాలనుభవిస్తావని విష్ణుమూర్తిని శపించాడు. మంత్రజలంతో ఉశనని బ్రతికించాడు.

నేనిచ్చిన వరాల్తో నన్నే శపిస్తావా? అన్నాడు విష్ణుమూర్తి. నిన్ను శపించడం ఎవరితరం? దుష్టుల్ని శిక్షించడానికి, శిష్టుల్ని రక్షించడానికి అవతారం ఎత్తడానికి నన్ను ఉపయోగించుకున్నావు. నీఅవతారం వల్ల దర్మసంస్థాపన అవుతుందిలే అన్నాడు భృగు మహర్షి.

భృగు మహర్షి శక్తిని చూసి మిగిలిన ఋషులు ఆశ్చర్యపోతూ ముక్కు మీద వేలేసుకున్నారు.

సరస్వతీ నదీ తీరంలో మహర్షులందరూ కలిసి ఒక యాగం చేస్తుండగా వాళ్ళల్లో ఒకళ్ళకి ఒక సందేహం వచ్చేసింది. వెంటనే త్రిమూర్తుల్లో ఎవరు గొప్పవాళ్ళు అని భృగు మహర్షిని తేల్చి చెప్పమన్నారు.

భృగు మహర్షి బయల్దేరి ముందు బ్రహ్మలోకం వెళ్ళాడు. బ్రహ్మ నిండు సభలో ఉన్నాడు. భృగు మహర్షి వెళ్ళి మాట్లాడకుండ నిలబడ్డాడు. భృగు మహర్షి స్తోత్రం చెయ్యలేదని బ్రహ్మగారికి కోపం వచ్చింది. అక్కడ నుంచి బయలదేరి కైలాసానికి వెళ్ళాడు భృగుడు.

శివుడు పార్వతీ సమేతంగా విశ్రాంతి తీసుకుంటూ భృగు మహర్షిని చూసి లేచి వచ్చాడు. కాని భృగు మహర్షి మాట్లాడలేదు. శివుడు కోపంతో శూలంతీశాడు. పార్వతి అడ్డుపడింది.

మళ్ళీ వైకుంఠం వెళ్ళి విష్ణుమూర్తి గుండెలమీద తన్నాడు భృగుడు. వెంటనే విష్ణుమూర్తి లేచివచ్చి నువ్వు రావడం చూడలేదు క్షమించమన్నాడు. నీపాదాలకున్న నీళ్ళు తగిలి నా పొట్టలో వున్న లోకాలు పవిత్రమయ్యాయి. నీ పాదం నా భుజాలకి అలంకారమైంది. నువ్వు రావడం వల్ల నేను ధన్యుణ్ణయ్యాను అన్నాడు– విష్ణుమూర్తి. విష్ణుమూర్తిని ఆనంద భాష్పాలతో అభిషేకం చేసి మళ్ళీ ఆశ్రమానికి వచ్చి తన కోసం ఎదురు చూస్తున్న వాళ్ళకి విష్ణుమూర్తే గొప్పవాడని చెప్పాడు భృగు మహర్షి.

యువనాశ్వుడనే రాజు పిల్లలు లేక భృగు మహర్షిని ప్రార్థించాడు. మహర్షి పుత్రకామేష్టి చేయించి మంత్రజలం జాగ్రత్త పెట్టమని బ్రాహ్మణులకిచ్చాడు. అందరూ నిద్రపోతున్న సమయంలో రాజుకి దాహం వేసి ఆ నీళ్ళు తాగేశాడు. భృగు మహర్షికి ఆ విషయం తెలిసి నీభార్య తాగాల్సిన మంత్రజలం నువ్వే తాగావు, కొడుకుని కూడా నువ్వేకంటావు అన్నాడు.

తర్వాత వంద సంవత్సరాలకి రాజు ఎడమభాగం చీల్చుకుని గొప్ప తేజస్సుతో ఏడుగురు చక్రవర్తుల్లో ఒకడైన మాంధాత పుట్టాడు.

ఒకసారి వింధ్యపర్వత ప్రాంతంలో బాగా కరువొచ్చింది. పితృదేవతలకి ఏమీ పెట్టలేని స్థితిలో భృగు మహర్షి కైలాస పర్వత ప్రాంతానికి వచ్చి ఆశ్రమం కట్టుకుని వున్నాడు. పులి మొహంతో భార్యను తీసుకుని ఒక విధ్యాధరుడొచ్చి నాకు ఈ ముఖం ఎలా వచ్చిందో తెలియదు, ఇది పోయే మార్గం చెప్పమని బ్రతిమాలుకున్నాడు.

నువ్వు ఏకాదశి నాడు ఉపవాసం చేసి ద్వాదశి నాడు తలస్నానం చేశావు, ఆ కీడు ఇలా చేసిందన్నాడు భృగు మహర్షి. మాఘమాసంలో స్నానం చేశాక నువ్వు మళ్ళీ మామూలుగా అవుతావని చెప్పాడు.

భృగు మహర్షి ధర్మశాస్త్ర ప్రవక్తగా పేరు పొందాడు. ఈయన జ్యోతిష శాస్త్రం రాశాడు. దాంట్లో ఎనిమిది అధ్యాయాలున్నాయి. సృష్టికోసం బ్రహ్మతో సృష్టించబడి చివరకి బ్రహ్మలోనే ఐక్యం అయిపోయాడు భృగు మహర్షి.

ఆయనకు అరికాల్లో జ్ఞాన నేత్రం వుందని, విష్ణుమూర్తి దీనిని చిదిపి భృగుడికి గర్వభంగం చేశాడని కూడా కథ వుంది.

ఇదర్రా భృగు మహర్షి కథ !!

# 58. బృహస్పతి మహర్షి

**పి**ల్లలూ! రండి... రండి... ఇప్పుడు మనం గొప్ప మహర్షి గురించి తెలుసుకుందాం. బుద్ధివైభవంలో గొప్పవాడైన బృహస్పతి గురించి తెలుసుకుందామా! మొదలుపెట్టండి మరి.

అంగిరస మహర్షి భార్యపేరు శ్రద్ధ. వాళ్ళకి ముగ్గురు కొడుకులు మొదటివాడు బృహస్పతి పుడుతూనే గొప్ప బుద్ధి వైభవాన్ని సంపాదించినవాడు. రెండవవాడు ఉతథ్యుడు గొప్ప ఋషి, తీర్థయాత్రలంటే ఇష్టం కలవాడు. మూడో వాడు సంవర్తనుడు. గొప్ప యోగీశ్వరుడు, జ్ఞానసంపన్నుడు.

విష్ణుమూర్తి ఆదేశించిన ప్రకారం సప్తమహర్షులు వచ్చి అన్ని ధర్మశాస్త్రాల రహస్యాలు బృహస్పతికి చెప్పి వెళ్ళారు. అందుకే బృహస్పతి బుద్ధిమంతులందరి కంటే బుద్ధిమంతుడయ్యాడు.

మనం ఎంత శక్తి, ప్రజ్ఞ వున్నా కూడా చక్కటి గురువు ఒకడుంటేనే గానీ రాణించం అనుకున్నారు దేవతులు. గురువుగా ఎవరుంటే బాగుంటుందా అని ఆలోచించుకుంటున్నారు.

చివరికి అందరూ కలిసి బృహస్పతిని గురువుగా పెట్టుకోవాలని అనుకుని బృహస్పతి దగ్గరకెళ్ళి అడిగారు.

నాకంటే గొప్పవాడు శుక్రాచార్యుడున్నాడు. నా సోదరుడు సంవర్తనుడున్నాడు. ఇంకా ఎంతోమంది పెద్దలుండగా నన్నడుగుతున్నారు. నేనందుకు అర్హుడిని అవునోకాదో ఆలోచించండి అన్నాడు బృహస్పతి.

దేవతలందరు ఏకకంఠంతో గురుపదవి తీసుకుని ఆసామ్రాజ్యా సింహాసనాన్ని ఎక్కే అర్హత నీకంటే ఇంకెవరికీ లేదని మీదగ్గరికొచ్చాము. మీరింక ఆలోచించవద్దని ప్రార్థించారు.

బృహస్పతి మహాప్రసాదంగా తీసుకుని మీరు చెప్పినట్లే అంగీకరిస్తున్నాను అన్నాడు. దేవతలు, దిక్పాలకులు రెండువైపుల కొలుస్తుండగా అప్సరసలు నాట్యం చేస్తుండగా ఐరావతంమీద ఇంద్రుడికి ముందు కూర్చోబెట్టుకుని, బృందారకులు మందారాలు వర్షంగా కురిపిస్తుంటే దేవనగరానికి తీసుకెళ్ళి గురుసింహాసనం మీద కూర్చోబెట్టి పట్టాభిషేకం చేసి ఒక్కొక్కళ్ళే అతని పాదాలకి నమస్కారం చేశారు. ఈ విధంగా బృహస్పతి దేవతలకి గురువయ్యాడు.

బృహస్పతి కూడా తనకి దేవతలిచ్చిన గౌరవానికి తగినట్లుగా వాళ్ళని కంటికి రెప్పలా కాపాడుతున్నాడు.

భృగువంశంవాడయిన శుక్రాచార్యుడు తనే అందరిలోకి గొప్పవాడిని, బుద్ధిమంతుడిని అనుకుని దేవతలు తప్పకుండా గురుపదవి తనకే ఇస్తారని ఎదురుచూస్తూ ఆ పదవి బృహస్పతికిచ్చారని విని అసూయపడ్డాడు.

దేవతలు గురువుని పెట్టుకున్నారు. మనంకూడా ఒక గురువుని సంపాదించాలని ఆలోచించి రాక్షసులు శుక్రుడి దగ్గరికొచ్చి ఆయనని తమకు గురువుగా వుండమని ప్రార్థించారు.

దేవతలకి తగిన బుద్ధి చెప్పాలంటే ఇదే సరయిందనుకుని శుక్రాచార్యుడు రాక్షసులకి గురువయ్యాడు.

పూర్వం వసువనే రాజు గొప్ప విష్ణుభక్తుడుండేవాడు. అతడు రాజ్యం వదిలేసి తపస్సు చేసుకోవడం చూసి ఇంద్రుడు అతడి దగ్గరకి వెళ్ళి నాతో స్నేహంగావుండు, నీకొక విమానం ఇస్తాను, నాదగ్గరికి ఎప్పుడు రావాలనుకుంటే అప్పుడు రావచ్చు. రాజ్యం మాత్రం వదల వద్దని చెప్పాడు. ఇంద్రుడికి స్నేహితుడై రెండులోకాల్లోనూ తిరుగుతూ ఉన్నాడు కనుక, ఆ రాజుకి వసువుకి ఉపరిచరవసువని కూడ పేరు.

ఉపరిచరవసువు బృహస్పతికి శిష్యుడై ధర్మశాస్త్రాలన్నీ నేర్చుకుని ధర్మపరిపాలన చేశాడు. గురువు అనుమతి తీసుకుని అశ్వమేధయాగం చేశాడు. విష్ణుమూర్తి వసువుకి కనిపించి యాగభాగం తీసుకుని వెళ్ళిపోయాడు. తనకు కనిపించలేదని బృహస్పతి బాధపడ్డాడు. శిష్యుడి అదృష్టానికి సంతోషించి యాగం పూర్తి చేయించాడు.

బృహస్పతి నడిగి సర్వధర్మాలూ నేర్చుకున్నాడు ఇంద్రుడు. ఎలావుంటే జయలక్ష్మి తనని వదిలి వెళ్ళకుండా వుంటుందో చెప్పమని అడిగి తెలుసుకున్నాడు ఇంద్రుడు.

వసుమనుడనే రాజు బృహస్పతినడిగి రాజధర్మాలన్నీ తెలుసుకున్నాడు. రాజుకు ప్రజలే శరీరమని, ప్రజలకు రాజే ఆత్మ అనీ, రాజు లేకపోతే ఏమీ లేనట్లే అని చెప్పాడు.

రక్షించడంలోను అర్చించడంలోను రాజు, ప్రజలు ఇద్దరు ఒకళ్ళకొకళ్ళు సహకరించుకుంటేనే ఆ రాజ్యం శోభిస్తుంది, అలా చేయనప్పుడు శోకిస్తుంది అన్నాడు బృహస్పతి.

మాంధాత బృహస్పతిని అడిగి గోదాన ఫలితాన్ని గురించి తెలుసుకుని గోదానం ఎలా చెయ్యాలో చెప్పమన్నాడు. ఒకమంచి రోజు ఉపవాసం చేసి ఆవులున్న ప్రదేశానికి కూడ వెళ్ళి ఒక రాత్రి ఒక పగలు అక్కడ ఉండి మర్నాడు ఉదయాన్నే ఆవుని పేరుపెట్టి పిలిచి "తల్లి గోవు, వృషము తండ్రి, గర్భ ప్రదేశము స్వర్గము ధరణి సంప్రతిష్ఠ" అని పలికి తన పాపాలన్నీ పోయేటట్లు బ్రహ్మణుని చేతిలో నీళ్ళు విడిచి గోదానం చెయ్యాలి. కోపంలేని వాడు మాత్రమే ఈ దానానికి అర్హుడని చెప్పాడు బృహస్పతి.

ఆశ్వయుజమాసం బహుళాష్టమి మొదలు మూడు రోజులు ఉపవాసం చేసి పశువులశాల నుండి గోమూత్రం, గోమయం తీసుకుంటే అనుకున్నవన్నీ నెరవేరుతాయని కూడా చెప్పాడు బృహస్పతి. మాంధాత బృహస్పతి చెప్పినట్లు చేసి మోక్షాన్ని పొందాడు.

ఒకనాడు మనువు బృహస్పతిని జ్ఞానయోగం గురించి తెలియ చెప్పమన్నాడు. మంచిపనులు చెయ్యడం నిష్ఠగా వుండడం జ్ఞానయోగం అనిపించుకుంటుంది.

అమావాస్యనాడు చంద్రుడు కనిపించకపోతే చంద్రుడు లేనట్టేనా? కాదుకదా! అలాగే మనస్సుకి పట్టుబడనంత మాత్రాన భగవంతుడు లేనట్టుకాదు.

తేరిన నీటిలో ప్రతిబింబం ఎలా కనిపిస్తుందో మనస్సు ప్రశాంతంగా వున్నప్పుడే భగవంతుడిని చూడగలం. ఇలా అనేక విధాలుగా జ్ఞానయోగం గురించి బృహస్పతి మాంధాతకి చెప్పాడు.

మన వయస్సుకి ఇంతకంటే ఎక్కువ అర్థం చేసుకోవడం కష్టం. కనుక జ్ఞానయోగం ఇంతవరకు మనకి చాలు.

ఇంద్రాదులుగానీ, దేవతలుగానీ కష్టనష్టాలు కలిగినప్పుడు బృహస్పతిని సలహా అడిగేవాళ్ళు. బృహస్పతి వాళ్ళకోసం ఎవరిని ప్రార్థించాలో వాళ్ళని ప్రార్థించి బాధలు తీర్చేవాడు.

వింధ్య పర్వతం బాగా పెరిగిపోయి లోకాన్ని తారుమారు చేసి ఉపద్రవం కలిగిస్తుంటే బృహస్పతి దేవంలందర్నీ తీసుకుని బ్రహ్మదగ్గరకెళ్ళాడు. బ్రహ్మ అగస్త్యుడిని ప్రార్థించమన్నాడు. అందరూ కలిసి అగస్త్యుడి దగ్గరకెళ్ళారు. అగస్త్యుడు వచ్చిన పని చెప్పమని అడిగాడు బృహస్పతిని. ఋషివర్యా! నీయందలి బ్రహ్మ తేజము, లోపాముద్రయందలి పతివ్రతాతేజము కలిసి వింధ్యపర్వతమువలన లోకానికి కలుగుతున్న బాధని పోగొట్టమని అడిగాడు బృహస్పతి.

అగస్త్యుడు వింధ్య గర్వాపహరణం చేసి లోకానికి మంచి చేశాడు.

శుక్రాచార్యుడు రాక్షసుల్ని దేవతల నుంచి రక్షించడానికి కావలసిన మంత్ర శక్తులు సంపాదించాలని ఈశ్వరుణ్ణి గురించి తపస్సు చెయ్యడానికి వెళ్ళాడు.

ఆ సమయంలో బృహస్పతి శుక్రాచార్యుడి రూపం ధరించి రాక్షసులందరికి వేదశాస్త్రాలన్నీ అబద్ధాలనీ, వాటివల్ల ముక్తి ఏమీ రాదని, సురాపానం చెయ్యవచ్చనీ, యజ్ఞసమయంలో చేసే బలి మంచిదనీ యజ్ఞపశువుకి మోక్షంరాదనీ  చెప్పాడు. యజ్ఞపశువుకిమోక్షం వస్తుందంటే తమవాళ్ళనే యజ్ఞపశువులుగా నియమించవచ్చు కదా! అన్నాడు. యజ్ఞోపవీతం తీసెయ్యమన్నాడు. ఆచారాలన్నీ వదిలేసి చక్కగా దిగంబరంగ ఇష్టం వచ్చినట్లు ఉండవచ్చని జాతిమత బేధాలుండక్కర్లేదని చెప్పాడు బృహస్పతి. ఈ రకంగా రాక్షసులందర్నీ ధర్మవిరుద్ధంగా ప్రవర్తించేలా చేశాడు.

తర్వాత అసలు శుక్రాచార్యుడు వచ్చి రాక్షసులందరికీ అసలు గురువు తనేనని, వాళ్ళందరు బృహస్పతివల్ల మోసపోయారని ఎంత చెప్పినా వినలేదు రాక్షసులు. బృహస్పతి చెప్పిన మాటలే వాళ్ళకి బాగానచ్చాయి. అందుకే శుక్రాచార్యుణ్ణి గెంటేశారు.

రాక్షసులు సర్వభ్రష్టులయిపోయారని తెలుసుకుని శుక్రాచార్యుడు ప్రహ్లాదుడిని కలిసి జరిగింది వివరించి రాక్షసులకి అర్థమయ్యేలా చెప్పమన్నాడు. ప్రహ్లాదుడు నచ్చ చెప్పాక రాక్షసులు తాము మోసపోయామని తెలుసుకుని క్షమించమని అడిగారు శుక్రాచార్యుణ్ణి.

ఇదంతా బృహస్పతి చేసిందేనని తెలుసుకున్న శుక్రాచార్యుడు మాతృ సమానురాలితో కలిసి పాపపుపని చేసి అవమానం పొందుతాడని శపించాడు బృహస్పతిని శుక్రాచార్యుడు.

ఒకనాడు బృహస్పతి అన్నగారయిన ఉతథ్యుడి ఇంటికి వచ్చాడు. ఉతథ్యుడు ఇంట్లోలేడు. వదినగారు మమత మరిదిని ఆదరించి భోజనం పెట్టింది. బృహస్పతి మమతను తనతో గడపమని అడిగాడు. మమత తాను తల్లి సమానురాలినని, అదీగాక గర్భవతినని ఎంతచెప్పినా బృహస్పతి మమతను విచిపెట్టలేదు.

తీర్థయాత్రల నుంచి వచ్చిన ఉతథ్యుడు జరిగింది విని ఇదంతా శుక్రాచార్యుడి శాపం వల్ల జరిగిందని తెలుసుకుని మమతను ఓదార్చాడు.

బృహస్పతిని మాత్రం వదిలిపెట్టలేదు. బృహస్పతి భార్యకు కూడా తన భార్యకు జరిగినట్లే జరుగుతుందని శపించాడు.

కొంతకాలం తర్వాత బృహస్పతి తారని పెళ్ళిచేసుకుని సుఖంగా వున్నాడు. శశాంకుడు బృహస్పతి శిష్యుడు. ఏకసంథాగ్రాహి అవడంవల్ల ఎంతో ప్రేమతో విద్య నేర్పిస్తున్నాడు బృహస్పతి. తారకి కూడా ఇష్టుడయ్యాడు శశాంకుడు.

ఇంద్రుడు యాగం చేస్తుంటే బృహస్పతి అక్కడికి వెళుతూ తారా శాంకుల్ని ఇంటిదగ్గర ఉంచాడు. శశాంకుడివల్ల తారకి బుధుడు పుట్టాడు. శశాంకుడు తారను తనతో తీసికెళ్ళిపోయాడు. బృహస్పతి తనభార్యని తనకిమ్మని అడిగినా శశాంకుడు ఇవ్వలేదు. బ్రహ్మవచ్చి శశాంకుడిని ఒప్పించి తారని బృహస్పతితో పంపాడు. ఇదంతా శుక్రాచార్యుడి శాపంవల్ల జరిగిందేనని బృహస్పతి తెలుసుకున్నాడు.

శాపప్రభావం తీరిపోయాక తార బృహస్పతిని సేవిస్తూ ఉండిపోయింది. బృహస్పతి తారకి ఒక కొడుకుని అనుగ్రహించాడు. అతడిపేరు కచుడు.

మరుత్తుడనే రాజు బృహస్పతిని యజ్ఞం చేయించమని అడిగాడు. బృహస్పతి అందుకు ఒప్పుకున్నాడు. కానీ, ఇంద్రుడు మరత్తుడిమీద ఈర్ష్యతో అదే సమయంలో తానుకూడా యజ్ఞం చేస్తున్నాను ముందు తన దగ్గరికే రమ్మన్నాడు బృహస్పతిని.

మరుత్తుడితో తాను ఇంద్రుడి యజ్ఞం చేయిండానికి వెడుతున్నాను. అది అయిపోయాక నీతో చేయిస్తానని చెప్పి వెళ్ళాడు బృహస్పతి. మొదట తనతో యజ్ఞం చేయిస్తానని చెప్పి మాట మార్చినందుకు మరుత్తుడు బాధపడి బృహస్పతి తమ్ముడు సంవర్తుడిని దగ్గరకి వెళ్ళి యజ్ఞం చేయించమని అడిగాడు.

ఇంద్రుడు ఆ యజ్ఞం ఆపెయ్యమని మరుత్తుడికి చెప్పాడు. మరత్తుడు వినలేదు. సంవర్తుడి సహాయంతో యజ్ఞం మొదలయ్యింది. ఇంద్రుడు వ్రజాయుధం పంపాడు. సంవర్తుడు దాన్ని కదలకుండా ఉండిపోయేలా చేశాడు. ఇంద్రుడు బృహస్పతి కలిసివచ్చి సంవర్తుణ్ణి క్షమించమని అడిగారు. మరుత్తుడు సంతోషంగా యజ్ఞం పూర్తిచేశాడు.

బృహస్పతి నర్మదా నదీ తీరంలో 'వాచస్పతి' అనే పేరుతో గురుకులాన్ని ఏర్పాటుచేసి ఎంతోమంది శిష్యులకి జ్ఞానోపదేశం చేస్తున్నాడు. వాళ్ళకోసం అన్ని సౌకర్యాలు కూడా ఉండేలా చూస్తూ జ్ఞానరహస్యాలన్ని బోధిస్తున్నాడు.

ఛాయ సూర్యుల కుమారుడైన శని తండ్రి సూర్యుణ్ణి తనకి కూడా విద్య నేర్పించమని అడిగాడు. కుమారా! విద్యాబుద్ధులు నేర్పించగల వాళ్ళలో బృహస్పతిని మించినవాడు లేడని, అతని దగ్గరకి వెళ్ళి నేర్చుకోమని చెప్పాడు సూర్యుడు.

బ్రహ్మణ బాలుడి రూపం ధరించి బృహస్పతిని శిష్యుడిగా అనుగ్రహించమని అడిగాడు శని. అందుకు అంగీకరించి విద్యాబుద్ధులు నేర్పుతున్నాడు బృహస్పతి. అందరికంటే ముందే నేర్చుకుని బృహస్పతికి ప్రియశిష్యుడయ్యాడు శని.

ఇంత వెంట వెంటనే చెప్పింది చెప్పినట్లుగా నేర్చుకుంటున్న విద్యార్థి వీడెవడా అని ఆశ్చర్యంతో దివ్యదృష్టితో చూసి నువ్వు నాకు అసత్యం చెప్పి విద్య నేర్చుకున్నావు కనుక నీ దృష్టి క్రూరంగానూ, నువ్వు జనాన్ని పీడించేవాడివిగానూ ఉంటావని శపించాడు శనిని బృహస్పతి.

నన్ను శపించావు కాబట్టి నా పీడ నీక్కూడ తప్పదనీ అయినా గురుదేవుడవు కనుక ప్రమాదం ఉండదనీ ప్రతి శాపం ఇచ్చి వెళ్ళిపోయాడు శనైశ్చరుడు.

ఒకనాడు బృహస్పతికి రాజుకొడుకుని తనే చంపినట్లుగా అపనింద వచ్చింది. అతడు వెంటనే శనిని తల్చుకున్నాడు. శని అశరీరవాణిగా వచ్చి రాజకుమారుడు ఊయలలోనే వున్నాడని చెప్పాడు. రాజు మంత్రులు బృహస్పతిని క్షమించమన్నారు.

బృహస్పతి ఇది మీ తప్పు కాదు శని పీడవల్ల జరిగిందని చెప్పాడు. శని అక్కడ ప్రత్యక్షమై గురువుగారి పాదాలమీద పడి క్షమాపణ అడిగాడు. మంచివాళ్ళ జోలికి మాత్రం వెళ్ళవద్దని చెప్పాడు బృహస్పతి శనైశ్చరుడికి.

బృహస్పతి చెప్పిన ధర్మాలన్నీ "బృహస్పతిస్మృతి" అనే పుస్తకంలో వున్నాయి. ఇంద్రుడికి చెప్పిన ధర్మాల గురించి కూడా ఇదే పుస్తకంలో వివరంగా వున్నాయి.

ఇదర్రా! దేవతల గురువు బృహస్పతి మహర్షి కథ !!

# 59. మతంగ మహర్షి

**వ**చ్చేశారు కదా ! ఇప్పుడు మతంగ మహర్షి కథ చదువుదాం. పూర్వం గౌతమ మహర్షి వంశంలో ఒక బ్రాహ్మణుడికి పుట్టినవాడు మతంగ మహర్షి. తండ్రి వేదశాస్త్రాలు యజ్ఞానికి సంబంధించిన పన్లు అన్నీ నేర్పాడు.

ఒకనాడు తండ్రి పనిమీద పంపిస్తే వెడుతూ దార్లో ఒక గాడిదపిల్లని కొట్టాడు మతంగుడు. అది ఏడుస్తూ తల్లికి చెప్పింది. వాడు పూర్వజన్మలో పాపపు పన్లు చేశాడు అందుకే ఇప్పుడు కూడా అదే చేశాడు అంది తల్లి.

మతంగ మహర్షికి అన్ని జాతుల భాషలు వచ్చు. గాడిద చెప్పింది విని దాని దగ్గరకెళ్ళి నువ్వు శాపం వల్ల గాడిదవయినట్లున్నావు. నేను పూర్వజన్మలో ఎవరినో నీకు

తెలుసా? అని అడిగాడు. నువ్వు బ్రాహ్మణ స్త్రీకి, మంగలివాడికి పుట్టావు అందుకే నువ్వు హింస చెయ్యగలిగావు అంది.

మతంగుడు తండ్రికి జరిగిందంతా చెప్పి తపస్సు చేసుకునేందుకు వెళ్ళి కొన్నివేల సంవత్సరాలు తపస్సు చేశాడు. ఇంద్రుడు వచ్చి ఏం కావాలన్నాడు. బ్రహ్మ విద్వర్యుడ్ని కావాలన్నాడు మతంగుడు. అది అంత తేలిక కాదు. ఇలాంటి తపస్సుకు పదిరెట్లు ఎక్కువచేస్తే ఛండాలుడుగా పదివేలరెట్లెక్కువ చేస్తే ఛండాలుడు సూద్రుడుగానూ, నూరు రెట్లెక్కువ చేస్తే సూద్రుడు వైశ్యుడిగానూ, దానికి వెయ్యి రెట్లెక్కువ చేస్తే వైశ్యుడు క్షత్రియుడుగానూ, క్షత్రియుడు బ్రాహ్మణుడుగాను, బ్రహ్మణ నియమాలు పాటించి శమ,దమ, సత్య హింసలచేత, ఈర్ష్యలేకుండా వుండి ఇంతకంటే లక్షరెట్లు ఎక్కువ తపస్సుచేసి ఎన్నో జన్మలెత్తుతే గాని బ్రహ్మవిదుడవుకాలేవని చెప్పాడు ఇంద్రుడు.

మతంగుడు పట్టువదలని విక్రమార్కుడిలాగా కాలిబొటనవేలొక్కటే నేలమీదుంచి మరో వంద సంవత్సరాలు తపస్సు చేశాడు. మళ్ళీ ఇంద్రుడొచ్చి నీ కెంత చెప్పినా అర్థం కావట్లేదు. కాబట్టి ఈ జన్మనుంచి రెండవ జన్మకి బ్రహ్మ విదుడయ్యేలా వరమిస్తున్నాను. ఇంక తపస్సు ఆపమన్నాడు. ఇంద్రుడి వరాలు పొందాక మాతంగుడు పెళ్ళి చేసుకుని ప్రసన్నుడనే వాడికి తండ్రి అయ్యాడు.

కొంతకాలం తర్వాత ధర్మవ్యాధుడనే చెంచురాజు కూతురు అర్జునకిచ్చి ప్రసన్నుడికి పెళ్ళి జరిపించాడు.

మతంగుడు తల్లి చచ్చిపోయిన ఒక ఏనుగు పిల్లని తెచ్చి పెంచుతున్నాడు. అది కూడా కొంచెం పెరిగాక మతంగ మహర్షిని తండ్రిలాగ గౌరవిస్తూ తొందరగా పూజకి కావల్సిన సామాన్లు తీసుకురావడం, నీళ్ళు తెచ్చి ఆశ్రమం శుభ్రం చెయ్యడం అన్ని చెస్తోంది.

ఇంద్రుడు మారు రూపంలో వచ్చి మతంగ మహర్షిని ఏనుగుని నాకియ్యి. ఏనుగు నీకెందుకు? నువ్వు బ్రాహ్మణుడివి నీకు గోవులు, ధనం ఇస్తాను తీసుకోమన్నాడు.

మతంగ మహర్షి బ్రాహ్మడికి జంతువులెందుకు అన్నవాడివి నాకు గోవులు ధనం మాత్రం ఎందుకు? అన్నాడు. నువ్వు రాజువి కావు ఇంద్రుడవని నాకు తెలుసు. నాకు ఏ వరాలు వద్దు. నా ఏనుగుని నాకొదిలేసి వెళ్ళిపొమ్మన్నాడు.

ఇంద్రుడు నీ తపస్సుకి ఫలితంగా నిన్ను, కొడుకులాంటి నీ ఏనుగుని కూడ స్వర్గలోకం తీసికెళతానని తనతో తీసుకెళ్ళాడు. ఇంద్రలోకానికి వెళ్ళే అదృష్టం మహామహులకు గాని కలగదు. మన మతంగ మహర్షి మాత్రం పట్టుదలతో సాధించాడు.

ఇదర్రా! మతంగ మహర్షి కథ!!

# 60. మరీచి మహర్షి

**అం**దరూ వచ్చేశారు కదా! సరే, మనమిప్పుడు మరీచి మహర్షి గురించి తెలుసుకుందాం. నవబ్రహ్మలని చెప్పుకున్నాం కదా. వాళ్ళల్లో ఒకడు మరీచి మహర్షి. తండ్రి బ్రహ్మ చెప్పినట్లు తపస్సు చేసుకుంటూ ఎప్పుడు పిలిస్తే అప్పుడు పలుకుతూ ఉండేవాడు. అంటే తండ్రిమాట చక్కగా వినేవాడన్న మాట!

కర్దమ ప్రజాపతికి తొమ్మిదిమంది కూతుళ్ళు, ఒక కొడుకు ఉన్నారు. విష్ణుమూర్తి అంశతో పుట్టిన కపిల మహర్షే ఆ కొడుకు. తొమ్మిది మంది కూతుళ్ళని నవబ్రహ్మలకిచ్చి పెళ్ళి చేశాడు. అందులో మరీచి మహర్షికి పెద్దకూతురు కళనిచ్చాడు. మన మరీచి కళతో కలిసి గొప్పతేజస్సుతో వెలిగిపోయాడు.

ఒకనాడు మరీచి కళను పిలిచి బ్రహ్మ నన్ను సృష్టిలో తనకు సాయపడమన్నాడు. నీకు ఎలాంటి పిల్లలు కావాలో అడగమన్నాడు. స్వామీ! మనకన్న గొప్పవాడై అన్ని రకాల జీవుల్నీ సృష్టించగల తపశ్శక్తి వున్న ఒక కొడుకుని, అన్ని లోకాల్లోనూ కీర్తినియ్యగల ఒక కూతుర్ని ఇమ్మంది. మరీచి కళని ఆశీర్వదించాడు.

కొంతకాలం తర్వాత మరీచి కళలకి కశ్యపుడనే కొడుకు, పూర్ణిమ అనే కూతురు పుట్టారు. వాళ్ళు కోరుకున్నట్లుగానే కశ్యపుడు గొప్ప మహర్షై దక్షప్రజాపతి పిల్లల్ని పెళ్ళి చేసుకుని సర్వభూతాల్ని సృష్టించాడు.

పూర్ణిమ చంద్రబింబంలాగే ముద్దుగా ఉండేది. పెరిగి పెద్దదయ్యాక విష్ణుమూర్తి పాదాల్ని కడిగిన నీరుగా మారి గంగానదిగా ప్రవహించింది. ఆమెకి దేవకుల్య అనే అమ్మాయి, అఖిల విష్టపవ్యాపకుడు అనే కొడుకుపుట్టి వాళ్ళ వల్ల కూడ చక్కటి సంతతి పెరిగింది.

ఈ రకంగా మరీచి మహర్షి తండ్రి బ్రహ్మగారి అనుమతి ప్రకారం చక్కటి పిల్లల్తో వంశాన్ని పెంచాడు.

మరీచి మహర్షి మహాజ్ఞాని, విరాగి, తపస్వి కాకుండా 'మరీచిస్మృతి' అనే ధర్మశాస్త్రం కూడా రాశాడు. ఇందులో పగలు చెయ్యాల్సిన పనులు, శుచిగా లేకపోడం, శ్రాద్ధకర్మలు ప్రాయశ్చిత్తాలు మొదలయినవి ఉన్నాయి. ఇదే కాకుండా వ్యవహారాల గురించి కూడా వుంది. అంటే ధనం దాన్ని దాచుకోవడం, తాకట్టు పెట్టడం లాంటివి. ఆరోజుల్లో తాకట్టు పెట్టుకోవడం లాంటివి పద్ధతుల్లో జరిగేవేమో. ఆ గ్రంధం మాత్రం పూర్తిగా మనకి దొరకలేదు.

ఇదర్రా మన మరీచి మహర్షి కథ!!

బ్రహ్మగారు పుట్టించి ఏం చెయ్యమన్నాడో అది చేసి గొప్ప తపస్సంన్నుడై తండ్రిని మించిన కొడుకనిపించుకున్నాడు. మనల్ని మన తల్లిదండ్రులు పుట్టించారు కనుక మనం కూడ అమ్మానాన్న చెప్పినట్లు విని వాళ్ళకి మంచి పేరు తీసుకురావాలి. తెలిసిందా...!

# 61. మంకణ మహర్షి

రండి పిల్లలూ ! ఇప్పటి వరకూ మీరు గొప్ప గొప్ప మహర్షులు బ్రహ్మాండాలు, వేదాలూ, ఉపనిషత్తులూ లాంటివి తెలుసుకున్నారు కదా! ఇప్పుడు ఒక వెరైటీ మహర్షిని గురించి తెలుసుకుందాం. భలే ఫన్నీగా ఉంటాడు. కాసేపు మీ క్కూడ నవ్వొస్తుంది. మరింక చదవండి....

పూర్వం మాతరిశ్వుడనే గొప్ప తపశ్శాలుండేవాడు. ఆయన భార్య సుకన్య. వాళ్ళ కొడుకే మన మంకణ మహర్షి.

మంకణ మహర్షి ఆశ్రమం ఉత్తములైన బ్రాహ్మణులతోనూ చక్కటి పూల, పండ్ల చెట్లతోనూ, సాధు జంతువులతోనూ, మునుల వేదఘోషతోనూ నిండి ఉండేది. ఈ ఆశ్రమాన్ని సారస్వత తీర్థం అంటారు.

ఒకసారి మంకణ మహర్షి బ్రహ్మర్షులందర్నీ పిలిచి సత్త్రయాగం ప్రారంభించాడు. అందరూ వచ్చారు, ఏర్పాట్లన్నీ జరిగాయి. కానీ సరస్వతీనది అక్కడ ప్రవహించట్లేదని అనుకుంటూండగా బ్రహ్మ సరస్వతిని తల్చుకుని అక్కడ ప్రవహించేలా చేసి వాళ్ళ యాగం చక్కగా జరిగేలా చేశాడు. అక్కడ సరస్వతీ నదికి 'సుప్రభ' అని పేరు.

సరస్వతీనదికి నైమిశారణ్యంలో 'కనకాక్షి' అని, గయలో 'విశాల' అని, ఉద్దాలకుడు యాగం చేసిన చోట 'మనోరమ' అని, కురుక్షేత్రంలో కరువు వచ్చినపుడు 'సురేణువు' లేక 'సురతన్వ' అని వసిష్ట మహర్షి యాగం చేసినపుడు 'ఓఘవతి' లేక 'ఓఘమాల' అని, ఇంకొక చోట విమలోదక సువేణి అనే పేర్లతో ప్రవహించింది. ఈ ఏడు నదులు కలిసిన చోటునే 'సారస్వతతీర్థం' అంటారు. అక్కడే మంకణ మహర్షి ఆశ్రమం ఉంది.

మంకణ మహర్షికి ఒకసారి వేలికి దర్భ గుచ్చుకుని రక్తానికి బదులుగా ఆ "ఆకురసం" రావడం మొదలయ్యింది. ఇంకేముంది నా తపస్సు ఎంత గొప్పదో అందుకే రక్తం ఈరకంగా వస్తోందని గంతులెయ్యడం మొదలెట్టాడు. ఆనందంతో అతను వేసే గంతులు నృత్యంగా మారిపోయి ఆపకుండా చేస్తున్న నృత్యానికి ఏం చెయ్యాలో తెలియక చూసి చూసి ముగ్ధమోహనంగా అనిపించేసరికి ఆ పరిసరాలన్ని నాట్యం చెయ్యడం మొదలుపెట్టాయి.

ఈ నాట్యానికి లోకాలన్నిటికి ఉపద్రవం వస్తుందో ఏమో అని అది ఎల్లా ఆపాలో తెలియక బ్రహ్మతో కలిసి అందరూ శివుణ్ణి కలిశారు. శివుడు మంకణ మహర్షిని ఇంతవుత్సాహంగా నాట్యం చేస్తున్నావు కారణం ఏమిటి తండ్రీ! అనడిగాడు.

మంకణ మహర్షి జరిగింది చెప్పి అందుకే ఆనందం పట్టలేక ఇలా చేస్తున్నానన్నాడు. చేసింది చాలు ఇంక ఆపెయ్యి అని మంకణ మహర్షి వేలు గీరాడు శివుడు.

అక్కడినుంచి బూడిద కారడం మొదలుపెట్టింది. వెంటనే మంకణ మహర్షి శివుడి కాళ్ళ మీద పడి క్షమించమన్నాడు. నువ్వు తపస్సు చేసిన ఈ ప్రదేశాన్ని 'సప్తసారస్వతంగా' అనుగ్రహిస్తున్నానన్నాడు శివుడు.

కొంతకాలం తర్వాత మంకణ మహర్షి పెళ్ళి చేసుకుని ఆకథుడనే కొడుకుని కని సుఖంగా ఉన్నాడు.

# 62. మార్కండేయ మహర్షి

**అం**దరూ వచ్చేశారుగా! ఇప్పుడు మనం తెలుసుకోబోయే మహర్షి మార్కండేయ మహర్షి. ఎప్పుడేనా పేరు విన్నట్లుగా వుందా... ఆలోచించండి. కంగారెందుకు? చించండీ... అదుగో ఎవరో చెప్పేశారు. సరిగ్గా చెప్పావు. మనం తుమ్మినపుడు పెద్దవాళ్ళు పలికే పేరు. ఎందుకో తెలుసా?

ఎందుకంటే మన భారత మహర్షుల్లో మృత్యువు అంటే చావు లేకుండా వరాలు పొంది ఇప్పటికీ సజీవంగా వున్నాడు మార్కండేయ మహర్షి. తల్లిదండ్రులు వాళ్ళ పిల్లలు కూడా అంతకాలం ఉండాలని కోరుకుని మార్కండేయుడంత ఆయుష్షు రావాలని దీవిస్తుంటారు. అదన్న మాట విషయం. ఇప్పుడు ఆయన గురించి వివరంగా తెలుసుకుందాం....

పూర్వం భృగుమహర్షి కొడుకు విధాత. అతని కొడుకు మృకండుడు భార్య తనూజ. మృకండుడు హరిహరుల కోసం తపస్సు చేశాడు. కొంతకాలానికి వాళ్ళు దర్శనం ఇచ్చి నీకోరిక చెప్పమన్నారు. మృకండుడి ఇష్ట ప్రకారం విష్ణుమూర్తి సకల గుణాలు ఉన్న కొడుకునీ, శివుడు ఆ పిల్లవాడికి రోగాలవీ లేకుండా వుండేలాగా వరాలిచ్చారు. కానీ, అతడికి ఆయుష్షు తక్కువన్నారు. కొంతకాలం తర్వాత మకృండుడుకి మన మార్కండేయుడు కలిగాడు.

మార్కండేయుడు కొంచెం పెద్దవాడయ్యాక తల్లిదండ్రులు నాయనా! నువ్వు విష్ణుమూర్తి, శివుడు ఇచ్చిన వరం వల్ల పుట్టావు కానీ, నీకు ఆయుష్షు తక్కువ అని చెప్పాడు మృకండుడు.

తండ్రీ! మీరిచ్చిన ఈ శరీరంతోనే శివుణ్ణి మెప్పించి చిరంజీవిగా ఉంటానని చెప్పాడు మార్కండేయుడు. ఊరకే చెప్పడం కాదు సాధించాడు కూడా. అదికూడా చూద్దాం.....

ఇంకేముంది! మార్కండేయుడు తపస్సు మొదలుపెట్టాడు. ఈలోగా అతనికి పదహారేళ్ళు వచ్చాయి. యమధర్మరాజు వచ్చేశాడు. కానీ, మార్కండేయుడు తపస్సులో ఉండిపోయాడు. శివుడు వచ్చి నా భక్తుడి వైపు చూశావంటే ఊరుకోనని యముడికి చెప్పాడు. వీళ్ళిద్దరూ గొడవపడుతుండగా మార్కండేయుడు శివుడి కాళ్ళు పట్టుకుని అప్పటికి చావునుంచి తప్పించుకున్నాడు.

అసలు, చావే లేకుండా వుండాలంటే ఏం చెయ్యాలని శివుణ్ణి అడిగాడు మార్కండేయుడు. విష్ణుమూర్తిని ప్రార్థించమన్నాడు శివుడు.

మార్కండేయుడు మళ్ళీ విష్ణుమూర్తి కోసం తపస్సు మొదలు పెట్టాడు. పదివేల సంవత్సరాలు తపస్సు చేశాడు. ఇంద్రుడున్నాడు కదా తపస్సు భంగం చెయ్యడానికి, ఆయన ఎన్ని చేసినా మార్కండేయుడు చలించలేదు. దీన్నే దీక్ష అంటారు. దేన్నయినా సాధించాలి అనుకున్నప్పుడు అంత పట్టుదలగా ఉండాలి.

మనం మార్కులు రాకపోతే పంతుళ్ళ మీద పెడతాం కాని మన పట్టుదల గురించి మాట్లాడం. అదే పట్టుదల సినిమాకెళ్ళడానికి చూపించి సాధిస్తామే! అలాగన్నమాట....!

విష్ణుమూర్తి మార్కండేయుడికి కనిపించి ఏంకావాలి? అన్నాడు. స్వామీ! ఎన్ని యుగాలయినా ఈ శరీరంతోనే చావు అనేది లేకుండా చెయ్యమని విష్ణుమూర్తిని బ్రతిమలాడి వరం తీసుకుని చివరికి సాధించాడు. మొత్తం లోకాలకే పేరు తెచ్చాడు. ఆహా! ఆ తల్లిదండ్రులకి శతకోటి నమస్కారాలు చెయ్యొచ్చు. అలాంటి కొడుకుని కన్నందుకు...!

ఇంకా మార్కండేయుడు శివధ్యానం చేస్తూ తపస్సులోనే ఉండిపోయాడు. వంద సంవత్సరాలు భూమంతా నీటితో నిండిపోతే మార్కండేయుడికి ఏం చెయ్యాలో తెలియక భయపడ్తుంటే ఒక పిల్లవాడు మఱ్ఱిచెట్టు ఆకు మీద కన్పించాడు.

మార్కండేయుడు ఆ పిల్లవాడి పొట్టలోకి వెళ్ళి కొంతకాలం ఉండి శ్రీహరిని తల్చుకుని బయటికి వచ్చి చూస్తే ఆ పిల్లాడు కనిపించలేదు. భూమ్మీద ఉన్న నీళ్ళన్నీ ఇంకిపోయి ఆ ప్రదేశమంతా మామూలుగా అయిపోయింది. మహర్షి మళ్ళీ తపస్సులోకి వెళ్ళిపోయాడు.

ఒకసారి పార్వతీపరమేశ్వరులిద్దరూ ఆకాశంలో తిరుగుతూ మార్కండేయుడి దీక్ష చూసి ఆశ్చర్యపోయి శివుడు నాలుగు చేతులు, విభూతి రుద్రాక్షలు ధరించి, త్రిశూలం ఢమరకం మొదలైనవి పట్టుకుని ఎద్దునెక్కి పార్వతీ సహితంగా కన్పించాడు. మార్కండేయుడు ఎంతో సంతోషించి శివపార్వతులని స్తోత్రం చేసి స్వామీ! విష్ణుమాయ తెలుసుకోవడం చాలా కష్టం. విష్ణుమూర్తి యందు భక్తి మృత్యువుని జయించగలిగేలా అనుగ్రహించమన్నాడు. శివుడు నీ ఇష్ట ప్రకారమే జరుగుతుందని చెప్పి అంతర్ధానం అయ్యాడు.

మార్కండేయుడు విష్ణుమూర్తిని ధ్యానం చేస్తూ భూలోకం అంతా తిరుగుతుండగా ప్రళయం వచ్చింది. ఆ నీళ్ళల్లో ఒక పెద్ద శరీరంతో గొప్ప తేజస్సుతో ఒక మనిషి కనిపించి ఏదో అడగబోయేలోగా, అతను పీల్చినగాలికి లోపలికి వెళ్ళి మళ్ళీ పూర్వ ప్రపంచాన్ని అంటే ముందు జరిగినవన్నీ చూసి కొంతకాలం వున్నాక బయటికి వచ్చి మళ్ళీ చిన్న పిల్లాణ్ణి చూశాడు మార్కండేయుడు.

మార్కండేయుడికి ఇది అర్థం కాలేదు. విష్ణుమూర్తి కనిపించి మహర్షీ! భయపడకు ప్రళయం వచ్చినప్పుడు నిన్ను కాపాడాలని నా హృదయంలో దాచాను. అక్కడ మళ్ళీ

నువ్వు భయపడకుండా పూర్వం ఉన్న ప్రపంచాన్నే చూపించాను. ప్రళయకాలంలో వచ్చిన నేను యోగనిద్రలోకి వెళ్ళిపోతాను. నేను జీవుల్ని పెంచుతాను. శివుడు నడిపిస్తాడు. ఇంక నువ్వు నిశ్చింతగా వుండమన్నాడు మార్కండేయుడు. విష్ణుమూర్తికి స్తోత్రం చేసి మళ్ళీ తపస్సులోకి వెళ్ళిపోయాడు. బ్రహ్మ మళ్ళీ సృష్టి చెయ్యడం మొదలుపెట్టాడు.

పాండవులు అరణ్యవాసం చేస్తున్నప్పుడు ధర్మరాజు మనస్సుకి బాధ తగ్గించాలని వచ్చాడు. మార్కండేయుడు అదే సమయానికి శ్రీకృష్ణుడు కూడా వచ్చాడు. ధర్మరాజుకి కలిగిన సందేహాలు తీర్చమని మార్కండేయుడికి చెప్పి వెళ్ళిపోయాడు శ్రీకృష్ణుడు.

మార్కండేయుణ్ణి పూజించాక ధర్మరాజు మనుషుల కర్మగతుల గురించి చెప్పమన్నాడు. రాజా! మొదటి కల్పంలో బ్రహ్మ పవిత్రమైన ధర్మంతో కూడుకున్న శరీరాల్ని పుట్టించాడు. అందులోంచి మంచి ప్రవర్తన కలవాళ్ళు, సత్యసంకల్పం వున్న వాళ్ళు, జ్ఞానవంతులు, ఎక్కువ ఆయుష్షు ఉన్నవాళ్ళు అయ్యారు. రానురాను మనుషులు అల్పాయుష్కులు, దరిద్రులు, రోగాలతో బాధపడేవాళ్ళు, మాయమాటలు చెప్పేవాళ్ళు, తయారయి వాళ్ళు వాళ్ళ పాపపుణ్యాలకి తగినట్లు పుడుతూ, ఛస్తూ వాళ్ళ కర్మఫలం అనుభవిస్తున్నారు. ధర్మ మార్గంలో వుండేవాళ్ళు మంచిపనులు చేస్తూ, పిల్లల్తో చేయిస్తూ పుణ్యం పొందుతున్నారు. మంచి చేస్తే మంచిని, చెడు చెయ్యడం వల్ల చెడుని అనుభవిస్తున్నారు. ఇదే కర్మగతి అన్నాడు మార్కండేయుడు.

మార్కండేయుడు ధర్మరాజుకి బ్రాహ్మణ ప్రభావం గురించి, దుంధుమారుడనే రాజు గురించి, అత్రి గౌతముల వాదన గురించి వైవస్వత చరిత్ర, వామదేవుడి చరిత్ర ఇలాంటివన్నీ చెప్పాడు. ధర్మరాజు ఎన్నో విషయాలు మార్కండేయుణ్ణి అడిగి తెలుసుకున్నాడు.

మార్కండేయుడు తన ఆశ్రమానికి వెళ్ళిపోయాక గౌరముఖ మహర్షి అక్కడికి వెళ్ళి పితృదేవతల గురించి మార్కండేయ మహర్షి నడిగి తెలుసుకున్నాడు.

మార్కండేయుడు ధర్మ పక్షుల గురించి చెప్పిన దాన్ని 'మార్కండేయ పురాణమని' పిలుస్తారు. క్రోష్టుకి అనే ముని మార్కండేయుణ్ణి ప్రపంచ విషయాలు చెప్పమన్నాడు. బ్రహ్మ జన్మ గురించి, అన్ని ద్వీపాల గురించి, సూర్యుడి గొప్పతనం గురించి అన్నీ చెప్పాడు మార్కండేయుడు. కఠోరదీక్షతో విష్ణుమూర్తి కటాక్షంతో మృత్యువిజయం, మహాతపశ్శక్తి సంపాదించి ఇప్పటికీ ఎక్కడో బ్రతికే ఉన్నాడు. ఆ మహర్షిని భక్తితో తల్చుకుంటే మనకి కూడ అనుకున్నది జరుగుతుంది రోగాలు కూడా ఉండవు.

ఇదర్రా మార్కండేయ మహర్షి కథ !!

పట్టుదల ఉంటే మార్గం వెతుక్కుని కావాలనుకున్నది సాధించగలమన్న విషయం అర్ధమయిందా ! మీరు కూడా పట్టుదలతో వృద్ధిలోకి రావడానికి ప్రయత్నించండి.

# 63. మాండవ్య మహర్షి

రండర్రా ! రండీ... మీకోసమే ఎదురుచూస్తున్నాను. ఇపుడు మీరు చదవబోయే కథలో మాండవ్య మహర్షి చిన్నతనంలో తెలియక చేసిన తప్పుకు ఎలా శిక్ష అనుభవించాడో, అలాగే చేసిన తప్పుకి శిక్ష ఎలాంటి వాళ్ళూ తప్పించుకోలేరనేది కూడ ఈ కథలో తెలుసుకుంటారు. ఇప్పుడు మనం తెలుసుకోబోయేది మాండవ్య మహర్షి గురించి.

మాండవ్యుడు ఒక ముని కుమారుడు. చిన్నప్పటి నుంచి వేదవిద్యలు నేర్చుకుని తపస్సు చేసి బ్రహ్మర్షి అయ్యాడు. భూమి మీద ఉన్న అన్ని తీర్థాలు తిరిగి ఒక అడవిలో ఆశ్రమం ఏర్పాటు చేసుకుని సంవత్సరాలు గడిచిపోతున్నా ఋతువులు మారిపోతున్నా తపస్సులోనే ఉండిపోయాడు.

మాండవ మహర్షికి ఒక శూలం తగలడం వల్ల కలిగిన బాధతో సూర్యుడుదయించే సరికి దీన్ని ఉపయోగించిన వాడు చావాలని శపించాడు.

మాండవ్య మహర్షి బాధని లెక్కచెయ్యకుండా నే తపస్సు చేసుకుంటుంటే మిగిలిన మునులందరూ రాత్రివేళ పక్షిరూపంలో వచ్చి ఎవరికీ అపకారం చెయ్యనివాడివి నీకీ కష్టాలేమిటని అడిగారు. మహర్షి కర్మఫలం అనుభవించాలి కదా! అన్నాడు. ఈ మాటలు కాపలా వున్న రక్షకభటులు విని రాజుకి చెప్పారు.

రాజు పరుగెత్తుకుంటూ వచ్చి మహాత్మా ! తెలియక తప్పు చేశాను. మీరు మహర్షులని తెలియదు. మావాళ్ళు దొంగ అని చెప్తే ఆలోచించకుండా శిక్ష వేశాను క్షమించమని అతని కంఠంలో వున్న శూలాలు తీయడానికి ప్రయత్నించాడు రాజు. అవి ఊడి రాలేదు. ఆ చివర ఈ చివర కోసినా ఒక ముక్క మాత్రం మహర్షి కంఠంలో ఉండిపోయింది. అప్పటినుంచి "ఆణిమాండవ్యుడని" పేరు వచ్చింది. ఆ ముక్కకి పూలబుట్ట తగిలించుకుని తిరిగేవాడు.

మాండవ్యుడు యమధర్మరాజుని కలిసి నేను చేసిన తప్పేమిటి? ఎందుకు నాకీ శిక్ష వేశావు ? అని అడిగాడు. చిన్నతనంలో తూనీగల్ని బాధపెట్టావు, అందుకే ఇప్పుడు అనుభవిస్తున్నావు అన్నాడు యముడు.

అప్పుడు నా వయస్సెంత ? ఏ వయస్సు వరకూ బాల్యం అంటారు? బాల్యంలో చేసినదానికి శిక్ష వుండదంటారు కదా! అని అడిగాడు.

పుట్టినది మొదలు పన్నెండేళ్ళ వరకూ బాల్యం అంటారు అన్నాడు యమధర్మరాజు. మాండవ్యుడు నేనప్పుడు బాల్యంలోనే ఉన్నా నాకు శిక్ష వేశావు కాబట్టి నువ్వు భూలోకంలో ఒక శూద్రుడికి పుడతావని శపించాడు. అతడే విదురుడు.

జనకమహారాజుకి జ్ఞానం సంపాదించడం అంటే ఇష్టం. ఎప్పుడూ చుట్టూ మహర్షుల్ని పెట్టుకుని చర్చాకార్యక్రమాల్లో ఉండేవాడు. మాండవ్యుడు ఒకసారి జనకమహారాజుని కోరికలకి కారణం ఏమిటి ? అని అడిగాడు.

డబ్బే దీనికంతకీ మూలం. ఆవుతో పాటు కొమ్ములు పెరిగినట్లు మనిషికి కోరికలు పెరిగి దాంతో మమకారం పెరిగి అట్టలు కట్టుకుపోయినట్లయిపోయి దాంట్లోంచి బయటకు రాలేడు. అందుకే కోరికల్ని చంపుకోవాలని అన్నాడు జనక మహారాజు.

ఒకసారి శ్రీకృష్ణుడు ధర్మరాజుకి శివస్తుతి వల్ల కలిగే విశేషాలు చెప్పాడు. అప్పుడు మిగిలిన మహర్షులు కూడ వాళ్ళ వాళ్ళ అనుభవాలు చెప్తున్నారు మాండవ్యుడు నా కంఠంలో శూలం దిగినప్పుడు నేను శివస్తుతి చేసుకుంటూండగా శివుడు దర్శనమిచ్చి శూలబాధ తెలియకుండా, అన్ని తీర్థాల్లోనూ స్నానం చేసిన ఫలితాన్ని రోగం, పీడ, పుట్టుక, చావు లేకుండా వజ్ర సమానమయిన శరీరంతో ఉంటావని వరమిచ్చాడు" అన్నాడు.

మాండవ్య మహర్షి కథ చదివారు కదా !!

బాల్యంలో పన్నెండేళ్ళ వరకు తప్పు చేస్తే భగవంతుడు కాపాడ్తాడు. కాని ఆ తర్వాత చేసే చెడ్డపన్లకి మాత్రం ఎలా వడ్డిస్తాడో మనం ఇంతకు ముందే తెలుసుకున్నాం కాబట్టి మంచి పన్లు చేస్తూ మంచిగా ఉందాం. సరేనా...!

# 64. ముద్గల మహర్షి

ఇప్పుడు మనం ముద్గల మహర్షిని గురించి తెలుసుకుందాం. మనిషి ఎప్పుడూ చెయ్యాల్సిన పన్లు దానం, ధర్మం, పరోపకారం. దాన తపాల్లో తపం కన్నా దానం గొప్పది. అదికూడ అన్యాయంగా సంపాదించినదాన్తో దానం చెయ్యకూడదు. మనం కష్టపడి సంపాదించింది దానం చేస్తేనే మంచి జరుగుతుంది. దాన ధర్మాలు చెయ్యడంలో ముద్గల మహర్షి చాలా గొప్పవాడు.

ముద్గలుడు విద్యలన్నీ నేర్చుకున్నాక పెళ్ళి చేసుకుని పిల్లల్తో కలిసి కురుక్షేత్రంలో ఉండేవాడు. అతడు భిక్షకి వెళ్ళి వచ్చి వచ్చినదాన్తో భార్యాబిడ్డల్ని పోషించేవాడు. అతను త్యాగమే ధనమనీ, భోగం రోగమనీ, తపమే ధర్మమనీ, నిష్ఠగా ఉండడమే ఉత్సవమనీ, ఉపవాసముండడమే మహాభోగమనీ అనుకుంటూండేవాడు. భార్య పిల్లలు కూడా ఆయన చెప్పినట్లు వినేవాళ్ళు.

ముద్గల మహర్షి కుటుంబం పాడ్యమినాడు మొదలు పెట్టి పధ్నాలుగు రోజులు సంపాదించిన ధాన్యంతో ఒక పర్వదినం రోజు వండుకుని మొదట పితృదేవతలకి పెట్టి తర్వాత అతిథులకి పెట్టి వాళ్ళు తినేవాళ్ళు. తినడం కోసం జీవించడం కాదు; జీవించడం కోసం తినాలన్నది ఆయన ఉద్దేశ్యం సందేశం కూడ.

ఒకసారి దుర్వాస మహాముని వాళ్ళింటికి భోజనానికి వచ్చాడు. తర్వాత ముద్గల మహర్షిని పరీక్షించాలని ప్రతి పర్వదినంరోజు వచ్చి తను తినకల్గింది తిని మిగిలింది విసిరేసి వెళ్ళేవాడు దుర్వాస మహర్షి. పాపం వాళ్ళకి తినడానికి మిగిలేది కాదు. అసలే

వాళ్ళు తినేదే పదిహేను రోజులకి ఒకసారి కదా! అయినా ప్రతి పర్వదినంరోజూ వచ్చి తినేసి వెళ్ళిపోయేవాడు. వాళ్ళు కూడా ఏమీ అనుకోకుండా పెట్టేవాళ్ళు.

దుర్వాస మహర్షి ఒకరోజు ముద్గల మహర్షిని మహర్షీ ! నిన్ను పరీక్షించాలని ఇలా చేశాను. నువ్వు చేసిన అన్నదానం చాలా గొప్పది. మనిషి నాలుక ఎప్పుడూ రుచుల కోసం ఎదురు చూస్తూ ఉంటుంది. నువ్వు జీవితంలో బ్రతకడానికి అవసరమయిన అన్నాన్ని కూడా అతిథి సేవకి వదిలేశావు. ఇంతకన్నా గొప్ప వాళ్ళెవరు? నీకు శరీరంతో స్వర్గానికి వెళ్ళగలిగే వరం ఇస్తున్నానన్నాడు.

కొంతకాలం తర్వాత స్వర్గలోకం నుంచి విమానం వచ్చి ముద్గల మహర్షినీ, అతడి భార్యాపిల్లల్నీ ఇంద్రలోకం తీసుకువెళ్ళడానికి ఒక దేవదూత వచ్చాడు.

ముద్గల మహర్షి దేవదూతని మహాత్మా! మీరిలా రావడం నాకు చాలా ఆనందంగా ఉంది. ఇక్కడ నా వ్రతాన్ని వదిలేసి నన్ను అక్కడికి రమ్మంటున్నారు. వచ్చే ముందు అసలు మీలోకంలో ఉండే గుణాలు, దోషాలు తెల్సుకోవాలనుకుంటున్నాను అనడిగాడు.

దేవదూత మహర్షీ! మీ భూలోకం మీదే మా స్వర్గలోకం వుంది. అక్కడికి రావడానికి అందరూ అర్హులు కారు. అది ముప్పై వేల యోజనాలు ఆక్రమించి వుంటుంది. గొప్ప తపస్సంపన్నులు, యజ్ఞయాగాలు చేసిన వాళ్ళు, ఇంద్రియాల్ని జయించిన వాళ్ళు, దానాలు చేసిన వాళ్ళు, దేవతలు, సాధ్యులు, ఇలా అందరూ ఉత్తమమైన వాళ్ళే వుంటారు. అక్కడ వాళ్ళందరూ చాలా సుఖంగా ఉంటారు.

దాని పైన బ్రహ్మలోకం వుంటుంది. అది శోకం లేనిది. బ్రహ్మలోకమే మిగిలిన లోకాల్ని ప్రకాశింప చేస్తుంది. అన్ని లోకాలు నాశనమయినా కూడా బ్రహ్మలోకం అలాగే ఉంటుంది అని గుణాల గురించి చెప్పాడు దేవదూత.

ఇంక దోషాలు చెప్తాను వినమన్నాడు. స్వర్గలోకంలోకి వచ్చిన మనిషి తాను చేసిన పుణ్యం అయిపోగానే మళ్ళీ భూలోకంలో పుడతాడు. కాని కర్మఫలం మాత్రం చేసిన పుణ్యం ప్రకారమే ఉంటుంది. స్వర్గలోకంలో సుఖాలు అనుభవించి భూలోకంలో పడిన మనిషి కొంత కష్టపడతాడు. సుఖానికి అలవాటుపడ్తాడు కదా! స్వర్గలోకంలో కూడా భూలోకంలో వున్నట్లే అహంకారం ఈర్ష్యలాంటివి ఉంటాయి. ఒక్కమాటలో చెప్పాలంటే భూలోకం కర్మభూమి, స్వర్గలోకం ఫలభూమి అని చెప్పాడు దేవదూత.

ముద్గలుడు మహాత్మా! మీ స్వర్గలోకానికి ఒక నమస్కారం. నా లోకమే నాకు బావుంది. మళ్ళీ మళ్ళీ జన్మరాకుండా శాశ్వతంగా బ్రహ్మలోకంలో వుండడమే నాకిష్టం. ఆ అర్హత వచ్చే వరకు నేను ఇక్కడే ఉంటాను. నాకు సుఖాలు వద్దు. కొంచెం కష్టపడినా తర్వాత శాశ్వతంగా సుఖంగా ఉండే బ్రహ్మలోకం కోసం ఎదురు చూస్తాను. మీరు వెళ్ళిరండి అన్నాడు. చివరికి ముద్గల మహర్షి అనుకున్నది సాధించి బ్రహ్మలోకానికి వెళ్ళాడు కూడా....

ఇది పిల్లలూ ! ముద్గల మహర్షి కథ !!

పట్టుదల, పద్ధతి, సాధించాలన్న కోరిక వుంటే మనిషి సాధించలేనిది ఏమీ లేదు. చూశారా! ముద్గల మహర్షి స్వర్గలోకానికి రమ్మన్నా సుఖాలు నాకక్కరలేదు. నాకు కావలసింది బ్రహ్మలోకం కాబట్టి దాన్నే సాధిస్తానన్నాడు. చేసి చూపించాడు. మనం కూడ ప్రయత్నిస్తే పెద్ద కష్టమేం కాదు. ఏమన్నా కావాలనుకుంటే సాధించగలం. మరి తర్వాత మహర్షిని పలకరిద్దామా.....

# 65. మృకండు మహర్షి

**వ**చ్చేశారు కదా .... మనం మృకండు మహర్షి గురించి తెలుసుకుందాం. మృకండు మహర్షి తండ్రి మృగశృంగ మహర్షి. తల్లి పేరు సువృత్త. మృగశృంగ మహర్షికి నలుగురు భార్యలు, పెద్ద భార్య సువృత్త.

మృకండు మహర్షి నాలుగు వేదాలు సకల విద్యలు నేర్చుకుని, చక్కటి వినయ విధేయతలున్న వాడిగా పేరు తెచ్చుకున్నాడు. మృకండుడు పెద్దవాడయ్యాక ముద్గల మహర్షి కూతురు మరుద్వతినిచ్చి పెళ్ళి చేశారు.

మృకండుడు పిల్లలు కలగలేదని తీర్థయాత్రలకి బయలుదేరి అన్ని తీర్థాలు తిరుగుతూ తల్లులతో సహా కాశీకి చేరుకున్నాడు. అక్కడ గంగాస్నానం చేసి అందరూ డుంఢి వినాయకుణ్ణి దర్శించుకుని ఒక్కొక్క శివలింగాన్ని ప్రతిష్ఠించారు.

ఆ శివలింగాన్ని చూసిన వాళ్ళకి కోరికలు నెరవేరేలాగ శివుడి అనుగ్రహం ఉంది. మృకండు మహర్షి ప్రతిష్ఠించిన శివలింగాన్ని మృకండీశ్వరుడు అంటారు. దీన్ని దర్శించిన వాళ్ళకి తలచినపన్లు నెరవేర్తాయి. అలాగే మరుద్వతీశ్వరుణ్ణి దర్శిస్తే జన్మరాహిత్యం కల్గుతుంది.

మృకండుడి తల్లుల పేర్ల మీద ప్రతిష్ఠించిన శివలింగాల్లో సృవ్వత్తేశ్వర దర్శనం మంచి శీలాన్ని ఇస్తుంది. ఏ పని తలపెట్టినా విఘ్నం లేకుండా చేస్తుంది. కమలేశ్వరుణ్ణి దర్శనం చేసుకుంటే కావాలనుకున్న పన్లు చక్కగా జరుగుతాయి. విమలేశ్వరుణ్ణి దర్శనం చేసుకుంటే విమల జ్ఞానం వస్తుంది.

ఇలా ఒక సంవత్సరకాలం మృకండుడు కాశీలోనే వున్నాడు. తల్లులు పెద్దవాళ్ళయిపోవడం వల్ల అక్కడే మరణించారు.

మరుద్వతీ మృకండులు కాశీలోనే ఉండిపోయి గంగాస్నానం చేసి శివుణ్ణి ప్రార్థిస్తూ గడుపుతున్నారు.

కొంతకాలం తర్వాత మృకండుడికి శివుడు ప్రత్యక్షమై ఏంకావాలనడిగాడు. పిల్లలు కావాలి అనుగ్రహించమన్నాడు మృకండ మహర్షి. చాలా గుణవంతుడు విద్యావంతుడయి పదహారేళ్ళే బ్రతికే కొడుకు కావాలా? గుణం లేనివాడు చదువు రాని వాడు చిరంజీవి కావాలా? అనడిగాడు శివుడు.

మృకండు మహర్షి ఆయువు తక్కువున్నా ఫర్వాలేదు. విద్యావంతుడు, సుగుణవంతుడు కావాలన్నాడు. అలాంటి కొడుకు వల్లే కదా తల్లిదండ్రులకి ఆనందం..... శివుడు అనుగ్రహించాడు.

కొంతకాలం తర్వాత మృకండు మహర్షికి కొడుకు పుట్టాడు. వెంటనే ఆకాశం నుంచి పుష్పవర్షం కురిసింది. దేవదుందుభులు మ్రోగాయి. నదులు నిండుగా ప్రవహించాయి. వ్యాసభగవానుడు శిష్యుల్తో సహావచ్చి, దేవతలు జయజయ ధ్వానాలు చేస్తుండగా ఆ పిల్లవాడికి నామకరణం చేశాడు. ఆ పిల్లవాడి పేరు 'మార్కండేయుడు'. ఆ పిల్లవాణ్ణి కన్న మరుద్వతీ మృకండు మహర్షుల్ని అందరూ అభినందించాడు.

ఎవరికీ చూడడానికి దొరకని వ్యాసభగవానుడు వచ్చేసరికి మృకండుడు ఆనందం పట్టలేక ఆయన పాదాల్ని ఆనందభాష్పాల్తో కడిగి కృతజ్ఞత చెప్పుకుని ఆయన్ని పూజించి, గౌరవించి, సన్మానించి పంపాడు.

మార్కండేయుడు పెరిగి పెద్దవాడై తల్లిదండ్రులు చెప్పినట్లు తపస్సు చేసి చిరంజీవిగా వరం పొంది తల్లిదండ్రుల్ని ఆనందపరిచాడు.

ఇదర్రా మృకండు మహర్షి కథ !!

ఎంత పుణ్యం చేసుకున్నారో ఆ తల్లిదండ్రులు...

పిల్లలు గుణవంతులై వృద్ధిలోకి వస్తే ఆ తల్లిదండ్రులకి ఎంతో పేరు ఎంతో ఆనందం. పిల్లకి కూడా చక్కటి జీవితం ఉంటుంది.

మరి మనం కూడ మన అమ్మానాన్నల్ని ఆనందంగా ఉండేలా చూద్దామా..!

# 66. మృగశృంగ మహర్షి

**మ**నం తెలుసుకోబోయే మహర్షి పేరు మృగశృంగ మహర్షి. పేరు గమ్మత్తుగా వుంది కదూ! మృగం అంటే లేడి. శృంగం అంటే కొమ్ములు అని అర్థం. కానీ ఈ పేరేమిటో? ఈ మహర్షి గొప్పతనం ఏమిటో? తెలుసుకోండి మరి...

పూర్వం కృతయుగంలో కుత్సుడనే బ్రాహ్మణుడుండేవాడు. వేదశాస్త్ర విద్యలు నేర్చుకుని కర్దమ ప్రజాపతి కూతుర్ని పెళ్ళి చేసుకున్నాడు. కొంతకాలం తర్వాత వాళ్ళకి ఒక కొడుకు పుట్టాడు. అతని పేరు వత్సుడు.

వత్సుడు పెరిగి పెద్దవాడయి శ్రద్ధా భక్తుల్తో బ్రహ్మచర్యం పాటిస్తూ వేదశాస్త్ర విద్యలన్నీ నేర్చుకుని కావేరి నది పశ్చిమతీరానికి చేరాడు.

కావేరీ నది ప్రవహించిన భూభాగంలో పశ్చిమ భాగం పవిత్రమైంది. అక్కడ మూడు నెలలు తపస్సు చేసి తత్త్వజ్ఞానం పొంది అక్కడినుంచి బయల్దేరి సహ్యాజానది ఉత్తరభాగంలో ఉన్న నారాయణాద్రిలో ఆశ్రమం ఏర్పాటు చేసుకుని తపస్సు ప్రారంభించాడు వత్సుడు.

నారాయణాద్రికి దగ్గర్లో కళ్యాణతీర్థంలో స్నానం చేసి తపస్సు చేస్తూ ఆత్మజ్ఞానంతో ఆనందాన్ని పొందేవాడు వత్సుడు. కొంతకాలం తపస్సు చేస్తూ శరీరాన్ని మర్చిపోయాడు. మహర్షి శరీరం ఎండు కట్టెలా అయిపోయింది. అక్కడ తిరిగే లేళ్ళు వాటి కొమ్ముల్ని వత్సుడు శరీరానికి రాసుకుని వెడుతుండేవి. అందుకే వత్సుణ్ణి మృగశృంగుడని అక్కడి మునులు పిలిచేవాళ్ళు.

మృగశృంగుడు తన తపశ్శక్తితో విష్ణుమూర్తిని దర్శించి స్తుతించి స్వామీ! నన్ను కాపాడమని ప్రార్థించాడు. విష్ణుమూర్తి మహర్షీ! నువ్వు వచ్చే జన్మలో ఋభువసు మహర్షిగా పుడతావు. అదే నీ చివరి జన్మ. ఇప్పటి వరకు నువ్వు బ్రహ్మచర్యంతో ఋషుల్ని సంతోషపెట్టావు. ఇప్పుడు యజ్ఞం చేసి పితృదేవతల్ని సంతోషపెట్టమని చెప్పి మహర్షి కోరిక ప్రకారం ఆ తీరంలో వెలిశాడు విష్ణుమూర్తి.

మృగశృంగ మహర్షి ఇంటికి వచ్చి జరిగింది తల్లిదండ్రులకి చెప్పాడు. కుత్సుడు ఉతథ్య మహర్షి కూతురు సువృత్తనిచ్చి మృగశృంగుడికి పెళ్ళి చెయ్యాలని నిశ్చయించుకున్నాడు.

ఒకనాడు సువృత్త ముగ్గురి చెలికత్తెలతో కలిసి కావేరిలో స్నానం చేసి వస్తుండగా ఒక ఏనుగు తరుముకు వచ్చింది. వాళ్ళు భయంతో పరిగెడుతూ ఒక పాడుపడ్డ నూతిలో పడి చనిపోయారు.

మృగశృంగుడికి విషయం తెలిసి వాళ్ళ శరీరాల్ని జాగ్రత్తగా చూడమని అక్కడి వాళ్ళకి చెప్పి సహజనదిలో కంఠందాకా నీళ్ళలో మునిగి యమధర్మరాజు కోసం తపస్సు చేసి నలుగుర్నీ బ్రతికించాడు.

మృగశృంగుడికి సువృత్తకి పెళ్ళి జరిగింది. చెలికత్తెలు ముగ్గురు కూడా మమ్మల్ని నువ్వే బ్రతికించావు కనుక మమ్మల్ని పెళ్ళి చేసుకోమన్నారు మృగశృంగ మహర్షిని.

వ్యాస మహర్షి సలహామీద వాళ్ళని కూడా పెళ్ళి చేసుకున్నాడు మృగశృంగుడు. వాళ్ళ నలుగురికి నలుగురు కొడుకులు పుట్టారు.

కొంతకాలం తర్వాత మృగశృంగుడికి సంసారం మీద విరక్తి వచ్చి అందర్నీ వదిలేసి తపస్సు చేసుకుందుకు అడవిలోకి వెళ్ళి అక్కడ మృగాల్తో తిరుగుతూ జీవితాన్ని ప్రశాంతంగా గడిపి చివరికి శరీరాన్ని వదిలేశాడు.

విష్ణుమూర్తి చెప్పినట్లుగా తర్వాత జన్మలో ఋభువసువనే పేరుతో పుట్టి చివరికి మోక్షం సాధించాడు.

ఇది పిల్లలూ! మృగశృంగ మహర్షి కథ!!

చూశారా తపశ్శక్తితో యమధర్మరాజునే లొంగదీసుకుని చనిపోయిన వాళ్ళని బ్రతికించుకున్నాడు.

# 67. మైత్రేయ మహర్షి

మైత్రేయుడు ఎంత గొప్పవాడంటే తల్లి గర్భంలో వుండగానే ధర్మశాస్త్రాలు, వేదవేదాంగాలు అన్నీ నేర్చేసుకున్నాడు. చిన్నతనంలోనే రాక్షసులందర్నీ నాశనం చేసే యజ్ఞం చేశాడు. పులస్త్య బ్రహ్మర్షి దగ్గర దివ్యజ్ఞానసిద్ధి పొందాడు.

ఒకసారి గురువు పరాశర మహర్షిని మీ దగ్గర విద్యలన్నీ నేర్చుకున్నాను. దేవతలందరికీ మూలమైన భగవంతుడు విష్ణుమూర్తే అంటారు కదా. ఆయన తత్త్వాన్ని నాకు వివరించండని అడిగాడు మైత్రేయ మహర్షి.

ఇవే కాకుండా భూమి మొదలైన భూత ప్రమాణాలు, సప్తసాగరాలు, సప్తద్వీపాలు, సప్తకులపర్వతాలు, సూర్యగ్రహం మొదలైన వాటి సంచారాలు, చతుర్విధ భూతనిర్మాణం, చతుర్దశ మన్వంతరాలు, చతుర్యుగ ప్రమాణాలు, కల్పకల్ప విభాగం, యుగధర్మాలు, దేవర్షి చరిత్రలు, బ్రాహ్మణ వర్ణధర్మాలు, బ్రహ్మచర్యం మొదలైన వాటి గురించి కూడ చెప్పమన్నాడు.

పరాశరుడు ఆనందంతో విష్ణుతత్త్వం గురించి చక్కగా వివరంగా చెప్పాడు మైత్రేయుడికి. మనం కొన్ని విషయాలు తెలుసుకుందాం. ఎందుకంటే విష్ణుతత్త్వం గురించి పూర్తిగా తెలుసుకోగలిగేంత వయస్సు, జ్ఞానం మనకి లేవు.

పుట్టడం, చావడం మళ్ళీ పుట్టడం మళ్ళీ చావడం ఇవన్నీ ఏ జీవికి ఒకే చోట జరగదు. ఎవరి కర్మని బట్టి వాళ్ళకి జరుగుతూ ఉంటుంది.

డబ్బు సంపాదించడం, దాచడం, ఖర్చుపెట్టడం, ఇదంతా దుఃఖానికే, కాని, ఎవరికేనా చాలా డబ్బుంది అంటే అది సంతోషపడే విషయం కాదు.

స్త్రీలు, స్నేహితులు, చుట్టాలు, పిల్లలు, ఇళ్ళు, పొలాలు ఇవన్నీ పోవడం రావడం వల్ల కష్టమే గాని సుఖముండదు.

అసలు దుఃఖానికి కారణం మనం చేసే పని. అది విత్తనం. అదే చెట్టులాగ పెరిగి పెద్దదవుతుంది.

పుడుతూ ఉండడం, రోగాలు, వృద్ధాప్యంతో బాధపడుతూ ఉండడం ఇవన్నీ లేకుండా భగవన్నామం చేసుకుని మోక్షానికి ప్రయత్నించడమే మంచిదని జ్ఞానులు చెప్తున్నారని అన్నీ వివరంగా పరాశరుడు మైత్రేయ మహర్షికి చెప్పాడు.

మైత్రేయుడు అన్ని తీర్థాలు తిరుగుతూ కామ్యకవనంలో పాండవుల్ని చూసి బాధపడి దుర్యోధనుడికి బుద్ధి చెప్పాలని వాళ్ళదగ్గరకి వెళ్ళాడు. ధృతరాష్ట్రుడు మహర్షిని సత్కరించి పాండవులెలా వున్నారని అడిగాడు. మహామునుల దీవనలందుకుంటున్న పాండవులకి కష్టాలెందుకుంటాయి? వాళ్ళు ధర్మం తప్పితే సూర్యచంద్రులు గతులు తప్పుతారు. బలంలో ఒక్కక్కడు నూరేసి ఏనుగులకి సమానమని చెప్పాడు మైత్రేయుడు.

మైత్రేయ మహర్షి చెప్తుంటే దుర్యోధనుడు తొడలు కొట్టుకుంటూ కూర్చున్నాడు. దుర్యోధనా! నా మాట లక్ష్యపెట్టక నన్ను గౌరవించని నువ్వు భీముడితో తొడమీద గదతో కొట్టించుకుని ఛస్తావ్! అని శపించాడు మైత్రేయుడు.

దృతరాష్ట్రుడు మైత్రేయుడి కాళ్ళమీదపడి క్షమించమన్నాడు. మైత్రేయుడు వినకుండా కోపంతో వెళ్ళిపోయాడు.

కొంతకాలం తర్వాత విదురుడు మైత్రేయుడి దగ్గరికి వెళ్ళి గంగానది దగ్గర ఇసుక మీద పద్మాసనం వేసుకుని ఇంద్రియాల్ని అరికట్టి ఆచార, వ్రతాల, ఉపవాసాల్తో కృశించిపోయిన పుణ్యపురుషుడయిన మైత్రేయ మహర్షి పాదాలకి నమస్కారం చేసి మహర్షీ! భగవంతుడు స్వతంత్రుడైనా ఎన్నో అవతారాలెత్తుతాడు కదా... ఏఏ పన్లు చేశాడు? ఏ తత్త్వాలు బోధించాడు? ఇల్లాంటి విషయాలన్నీ తెలుసుకోవాలనుంది వివరంగా చెప్పమని అడిగాడు.

మైత్రేయ మహర్షి విదురుడితో లోకానికంతకి ఈశ్వరుడు హరి. జీవుడు భగవంతుడి మీద ఆధారపడ్డాడు. నారాయణుడు అన్నింటికీ తాను ఆధారమవుతాడు కానీ, తాను ఆధారపడడు. హరి భజన వల్ల సమస్త కష్టాలు పోతాయని చెప్పాడు. ఇంకా విష్ణుమూర్తి అవతారాలు అన్నింటి గురించి కూడా చెప్పించుకుని విని విదురుడు ఆనందంగా వెళ్ళిపోయాడు.

ఒకసారి మైత్రేయుడి ఆశ్రమానికి వ్యాసుడు చెప్పకుండా వచ్చాడు. మైత్రేయుడు భక్తితో పూజచేసి చక్కటి భోజనం పెట్టి స్వామీ! మీరాక నాకు చాలా ఆనందంగా వుంది. మీరాకకు కారణం చెప్పండన్నాడు.

మహర్షీ! తపము, దానము ఈ రెండింటిలో ఏది గొప్పదో తెలుసా! దానమే గొప్పది. అలాగే దానాలన్నింటిలో అన్నదానం చాలా గొప్పది.

ఎందుకంటే ప్రాణం శరీరంలో ఉంటుంది. శరీరానికి బలం అన్నం వల్లనే వస్తుంది. జ్ఞానవంతులు అన్నదానం చేస్తారు. తపము, విద్య, దానము, ధర్మగుణాన్ని పెంచుతాయి. ఉన్నతమైన విద్య భగవంతుణ్ణి చూపించే మార్గం. నువ్వు చేసిన అన్నదానం వల్ల నేను ఎంతో ఆనందాన్ని అనుభవిస్తున్నాను అని చెప్పి వ్యాసుడు మైత్రేయుణ్ణి అభినందించి వెళ్ళిపోయాడు.

ఇది పిల్లలూ! మైత్రేయ మహర్షి కథ!!

మైత్రేయ మహర్షి చెడ్డవాడయిన దుర్యోధనుణ్ణి బాగుచేద్దామని మంచి మాటలు చెప్పినా వినలేదని శపించాడు. వినయ విధేయతలు గల విదురుడికి విష్ణుతత్త్వాన్ని బోధించాడు. తాను వ్యాసుడి నుండి తపంకంటే కూడ దానం అందులో అన్నదానం గొప్పదని తెలుసుకున్నాడు. ఆయన తెలుసుకోవడం ద్వారా మనకి తెలియచెప్పాడు.

# 68. యాజ్ఞవల్క్య మహర్షి

ఇప్పుడు మనం చదవబోయే మహర్షి మాత్రం స్వయంగా బ్రహ్మదేవుడే. వేదాల్ని భూలోకంలో పరిచయం చెయ్యడం కోసం మనకి యాజ్ఞవల్క్య మహర్షిని భూలోకంలో పుట్టించాడు. చాలా గొప్ప జ్ఞాని. చదవబోతున్నారుగా మీకే తెలుస్తుందిలెండి.

పూర్వం గంగానదీ తీరంలో ఉన్న జమత్కార పురంలో యజ్ఞవల్కుడు అనే బ్రాహ్మణుడుండేవాడు. అతడి భార్య సుకన్య. అతడు బ్రహ్మని గురించి తపస్సు చేసి బ్రహ్మవిద్యని వ్యాప్తి చెయ్యడానికి బ్రహ్మనే తనకు కొడుకుగా పుట్టమనడిగాడు.

బ్రహ్మ సరేనన్నాడు. కార్తీకశుద్ధ ద్వాదశీ ఆదివారం ధనుర్లగ్నంలో యజ్ఞవల్కుడికి కొడుకుగా పుట్టాడు. ఆ పిల్లాడు బ్రహ్మగారంత తేజస్సుతో వెలిగిపోతున్నాడు. అతడికి యాజ్ఞవల్క్యుడు, బ్రహ్మరాతుడు, దైవరాతుడని పేర్లు పెట్టారు.

యాజ్ఞవల్క్యుడికి అయిదో ఏడువచ్చాక అక్షరాభ్యాసం, ఎనిమిదో ఏడు వచ్చాక ఉపనయనం చేసి విద్య నేర్చుకుందుకు పంపించారు. ఋగ్వేదం పాష్కలుడి దగ్గర, సామవేదం జైమిని మహర్షి దగ్గర, అథర్వణ వేదం ఆరుణి ఋషి దగ్గర నేర్చుకున్నాక యాజ్ఞవల్క్యుణ్ణి వైశంపాయనుడి దగ్గరకి పంపించారు.

వైశంపాయనుడి దగ్గర శిష్యుడిగా చేరాలంటే చాలా కష్టం. ఎంతో గురుభక్తి, వినయం, విధేయత వుంటే తప్ప వైశంపాయనుడు శిష్యుడిగా తీసికోడు.

గురువుగారి కంటే ముందే లేచి ఆయన సేవ చేసుకుని గురువుగారితో మంచి వాడనిపించుకుని యజుర్వేదం, వేదరహస్యాలు, పరమార్ధ రహస్యాలు అందరికంటే ముందే నేర్చేసుకున్నాడు యాజ్ఞవల్క్యుడు.

కాని యాజ్ఞవల్క్యుడు నాకు అన్ని వేదాలు వచ్చు. నేను బ్రహ్మహత్యాపాతకం కూడ ఏడు రోజుల్లో పోగొట్టగలనని గర్వంగా అనడం మొదలుపెట్టాడు. గురువుగారికి ఇది తెలిసి నిజం తెలిసికోడానికి అతని గర్వం అణిగించడానికి తన మేనల్లుణ్ణి కాలితో తన్ని నా బ్రహ్మహత్యాపాతకం ఎవరైనా తగ్గిస్తారా? అని శిష్యుల్ని అడిగాడు.

యాజ్ఞవల్కుడు వాళ్ళకేం తెలుసు నాకే వచ్చు అన్నాడు. గురువుగారు కోపం వచ్చి మూర్ఖా! నాకు రాని విద్య నీ దగ్గరేముంది? నీ గర్వం అణగాలనే ఇలా చేశాను అన్నాడు వైశంపాయనుడు.

నేను చెప్పిన వేదాలన్నీ ఇక్కడే వదిలేసి వెళ్ళిపొమ్మన్నాడు. శిష్యుడు ఎంత బ్రతిమిలాడినా వినలేదు గురువు.

గురుదేవా! మీ ఆజ్ఞ ప్రకారమే చేస్తానని యాజ్ఞవల్క్యుడు రక్తం రూపంలో వేదాలన్నీ అక్కడే వదిలేసి తపస్సు చేసి వైశంపాయనుడి బ్రహ్మహత్యాపాతకం పోగొట్టాడు.

ఆ రక్తం గడ్డలు కట్టి వుంటే తిత్తరపక్షులు తిని తిత్తరులనే వేదాలు చెప్పాయి. వాటినే “తైత్తిరీయోపనిషత్తు” అంటారు.

యాజ్ఞవల్క్యుడు సూర్యుణ్ణి ఆరాధించి తన గురువుగారు చేసింది చెప్పాడు. నీకు శుక్లయజుర్వేదం నేర్పిస్తాను అది ఎవరికీ రాదు. నువ్వు నీ గురువుకంటే గొప్పవాడివవుతావని చెప్పాడు సూర్యుడు.

ఇలా శుక్లయజుర్వేదం కూడా నేర్చుకుని ఎంతో మంది శిష్యులు మళ్ళీ వాళ్ళకి శిష్యుల్తో ప్రచారంలోకి తెచ్చాడు. యాజ్ఞవల్క్యుడి మొదటి శిష్యుడు కణ్వుడు.

ఒకసారి జనక చక్రవర్తి యాగం చేసి ఋషులందర్నీ పిలిచాడు. యాజ్ఞవల్క్యుడు కూడ వెళ్ళాడు. యాగం అయిపోయాక జనకుడు మీలో గొప్పవాడెవరో చెప్తే ఆయనకి ధనరాశుల్ని ఇస్తాననీ మీరే తేల్చుకుని చెప్పండి నాకంత శక్తి లేదనీ అన్నాడు.

ఎవరికి వాళ్ళు లేవలేదు. యాజ్ఞవల్క్యుడు మాత్రం శిష్యుల్ని పిలిచి ఆధనం ఇంటికి తీసికెళ్ళండి అన్నాడు. శాకల్యముని లేచి నువ్వే గొప్పవాడివని నీకు నువ్వే నిర్ణయించుకుంటావా? నాతో వాదించమన్నాడు.

శాకల్యమునితో వాదించి ఆయన్ని ఓడించాడు యాజ్ఞల్క్యుడు జనకుడు ఆయనని సన్మానించి పంపాడు.

జనకచక్రవర్తి యాజ్ఞవల్క్యుణ్ణి అడిగి ఎన్నో ఆధ్యాత్మిక విషయాలు తెలుసుకున్నాడు. అవన్నీ మనం ఇప్పుడు అర్థం చేసుకోవడం కష్టం. కొంచెం పెద్దవాళ్ళం అవ్వాలి.

తర్వాత విశ్వావసుడు యాజ్ఞవల్క్యుణ్ణి తత్త్వబోధన చెయ్యమని అడిగి విశ్వావిశ్వాలు, మిత్రావరుణులు, జ్ఞానజ్ఞేయాలు తపోతపాలు, సూర్యాతిసూర్యులు, విద్యావిద్యలు, వేద్యావేద్యాలు వంటి చాలా విషయాల గురించి తెలుసుకున్నాడు.

మిథిలాపురానికి దగ్గర్లో ఒక అడవిలో కతుడనే ఋషికి లక్ష్మీదేవి కటాక్షంతో కాత్యాయని అనే కూతురు పుట్టింది. కతుడు ఆ అమ్మాయిని యాజ్ఞవల్క్యుడికిచ్చి పెళ్ళి చేశాడు.

మిత్రుడనే ఒక బ్రాహ్మణుడికి మైత్రేయి అనే పేరు గల ఒక అమ్మాయుంది. ఆమె చిన్నప్పటి నుంచి విద్యావంతురాలు. యోగీశ్వరి గార్గి అనే ఒక గొప్ప విద్యావంతురాలి దగ్గర విద్యలన్నీ నేర్చుకుని ఒక సభలో పండితులతోనూ, గార్గితోనూ కూడా వాదించి చాలా పేరు తెచ్చుకుంది మైత్రేయి.

మైత్రేయి యాజ్ఞవల్క్యుణ్ణి తప్పించి వేరే ఎవర్నీ పెళ్లి చేసుకోనని తండ్రికి చెప్పింది. మిత్రుడు కాత్యాయనికి విషయం చెప్పాడు. భర్త దగ్గర మాట తీసుకుని మైత్రేయిని యాజ్ఞవల్క్యుడికిచ్చి పెళ్ళి చేసింది కాత్యాయని, మైత్రేయి, కాత్యాయిని చాలా స్నేహంగా ఉండేవాళ్ళు.

మహర్షులందరూ కలిసి ఒక గొప్ప యోగికి పట్టాభిషేకం చెయ్యాలని నిర్ణయించుకున్నారు. అందరికంటే గొప్ప యోగరహస్యాలు తెలిసినవాడు యాజ్ఞవల్క్యుడేనని అతనికి యోగీంద్ర పట్టాభిషేకం మాఘశుద్ధ పౌర్ణమినాడు చేశారు.

యాజ్ఞవల్క్యుడు ఋషులకి చెప్పిన విషయాలే 'యోగశాస్త్రం', 'యోగయాజ్ఞవల్క్యం' అనే పేరుతో పన్నెండు అధ్యాయాల్తో గ్రంథాలుగా వచ్చాయి.

కొంతకాలం తర్వాత ఆత్మజ్ఞానం గురించి భార్యలకి బోధించి మమకారాలు వదిలి ఆత్మని గురించి మాత్రమే తెలుసుకోమని చెప్పి సన్యాసం తీసుకున్నాడు.

'యాజ్ఞవల్క్యస్మృతి' అనే గ్రంథంలో నాలుగు కాండలున్నాయి. మొదటి దాంట్లో పధ్నాలుగు విద్యలు, పరిషత్తు, సంస్కాత, స్నాతకం, పౌరోహితం, వివాహం మొదలైనవి.

రెండో కాండలో న్యాయస్థానం, శిక్ష, స్త్రీధనం గురించి మూడు, నాలుగు, కాండల్లో అపరకర్మ, అశౌచశుద్ధి, యతి ధర్మాలు, మోక్షమార్గం, యమ నియమాలు, ప్రాయశ్చిత్తాలు మొదలైనవి.

చేసే పనులు, పొందిన జ్ఞానం రెండూ కలిస్తేనే మోక్షం కలుగుతుంది. ఒక్క జ్ఞానం వల్ల మోక్షం రాదని చెప్పాడు యాజ్ఞవల్క్యుడు.

ఇదర్రా యాజ్ఞవల్క్య మహర్షి కథ !!

సాక్షాత్తూ బ్రహ్మగారే నాలుగు వేదాల్ని భూమి మీదకి తీసుకు రావడానికి ఈ మహర్షి రూపంలో పుట్టి మనకి అనేక విషయాలు తెలియజెప్పాడు.

ఆకాలంలోనే ఆడవాళ్ళు చదువులు, సభల్లోకి వచ్చి వాదనలలో కూడా పాల్గొనడం జరిగిందన్న మాట. న్యాయం, శిక్ష, స్త్రీధనాన్ని గురించి అప్పటి నుంచే వుంది.

ఎంత గొప్పవాడికయినా గర్వం పనికిరాదని, తల్చుకుంటే గురువుని మించిన శిష్యుడిగా రాణించవచ్చని ఇలా చాలా విషయాలు తెల్సుకున్నాం.

# 69. రురు మహర్షి

**పి**ల్లలూ! మీ కోసమే ఎదురు చూస్తున్నాను. అమ్మయ్యా వచ్చారు కదా! రురు మహర్షి గురించి చదివేద్దాం. కానియ్యండి మరి.....

భృగు మహర్షికి పులోమయందు చ్యవన మహర్షి కలిగారు.

చ్యవన మహర్షికి సుకన్య వల్ల ప్రమతి మహర్షి

ప్రమతికి ఘృతాచి వల్ల రురు మహర్షి

ఇదర్రా బంధుత్వం. ఇప్పుడు రురు మహర్షికి, భృగు మహర్షి ఏమవుతాడో చెప్పండి చూద్దాం.... మీకే వదిలేశాను.

రురువు ధర్మాత్ముడు, తపశ్శాలి, విద్యావంతుడు, అందగాడు కూడా. మరి పుట్టింది ఏ వంశంలో...

రురువు ఒకసారి స్థూలకేశ మహాముననిని చూడడానికి వెళ్ళాడు. అక్కడ అందాలరాశి అయిన ప్రమద్వరని చూశాడు. అంతే! రురు మహర్షి బ్రహ్మచర్యం ఏమయిందో? (ప్రమద్వరని ఇష్టపడ్డాడు.)

ఇంటికి వెళ్ళి తండ్రికి చెప్పాడు. తండ్రి ప్రమతి పెద్దవాళ్ళని వెంట తీసుకుని స్థూలకేశ మహర్షి దగ్గరికి వెళ్ళి తన కొడుకు రురుడికి ప్రమద్వరనిచ్చి పెళ్ళి చెయ్యమని అడిగాడు.

అందరూ సరే అనుకుని రురుడికి ప్రమద్వరకి పెళ్ళి చెయ్యడానికి నిర్ణయించుకున్నారు.

రురు ప్రమద్వరల పెళ్ళికి రెండురోజులే వ్యవధి వుంది. ప్రమద్వర పువ్వులు కోస్తూ క్రింద పడుకుని వున్న త్రాచుపాముని చూడకుండ తొక్కింది. అది ప్రమద్వరని కాటేయడం ప్రమద్వర ప్రాణం పోవడం జరిగిపోయింది.

రురుడు బాధతో ఒక ఏకాంత ప్రదేశంలో కూర్చుని బాధపడ్తుంటే ఒక దేవదూత వచ్చి మనిషి ప్రాణం పోతే మళ్ళీ రాదు. అయినా నీకు ఒక ఉపాయం చెప్తాను. నీ ఆయుష్షు సగం ఆమెకిస్తానంటే ఆమెని బ్రతికించవచ్చన్నాడు.

రురుడు సరేనని తన ఆయుష్షులో సగం ప్రమద్వరకిచ్చాడు. వెంటనే ప్రమద్వర లేచింది. అక్కడున్న మునులు, ప్రమతి, స్థూలకేశుడు అందరూ ఎంతో ఆనందించారు.

రురుప్రమద్వరల పెళ్ళి జరిగిపోయింది. ఇద్దరూ అన్యోన్యంగా గృహస్థాశ్రమం నిర్వర్తిస్తున్నారు. రురుడు పాములమీద పగబట్టి కనిపించిన ప్రతి పాముని చంపడం మొదలుపెట్టాడు.

ఒకనాడు రురుడు వనంలో తిరుగుతుండగా డుండుభుడనే పాము కనిపించింది. రురుడు వెంటనే దాన్ని చంపబోయాడు. ఆపాము మహర్షీ! నేను నీకు అపకారం చెయ్యలేదు. నేను క్రూరసర్పాన్ని కూడా కాదు. నువ్వు భార్గవ వంశంలో పుట్టావు. ఇలాంటి పని చెయ్యకూడదని చెప్పాడు డుండుభుడు.

రురుడు ఆపాముని చూసి నువ్వు ఎవరు? నీకు పాము రూపం, మనిషి భాష ఎలా వచ్చాయని అడిగాడు.

రురుడితో నేను పూర్వజన్మలో సహస్రపాదుడనే మహర్షిని. శాపం వల్ల ఇలా పాముగా మారాను. నీ దయవల్ల నిన్ను చూడగానే నాకు శాపవిమోచనం అయిందని చెప్పి మనిషిగా మారి రురుడికి నమస్కారం చేసి వెళ్ళిపోయాడు డుండుభుడు.

రురు మహర్షి ప్రమద్వరని పెళ్ళిచేసుకున్నాక కూడా తపోదీక్ష, వేదాధ్యయనం ఏదీ వదలకుండా గొప్ప తేజస్సుతో వెలుగుతున్నాడు.

కొన్నాళ్ళకి రురుప్రమద్వరలకి ఒక కొడుకు కలిగాడు. అతడి పేరు శునకుడు.

ఇదర్రా! రురు మహర్షి కథ!!

# 70. రోమశ మహర్షి

**పి**ల్లలూ! మనం ఏ మహర్షి గురించి తెలుసుకుంటాన్నామో చెప్పనా! వినండి మరీ.. రోమశ మహర్షి గురించి మరి మొదలుపెట్టండి...!

రోమశుడు చిన్నప్పటి నుంచే బ్రహ్మచర్యంతో వుండి తపస్సు చేసి ఆత్మజ్ఞానం పొందాడు. అతడు భూమిమీదున్న అన్ని తీర్థాల్లో స్నానం చేసి, అందరు దేవతల దర్శనం చేసుకుని భూలోకంలోనూ, స్వర్గలోకంలోనూ స్వేచ్ఛగా తిరగగలిగే శక్తిని కూడ పొందాడు.

ఒకసారి రోమశుడు ఇంద్రలోకం వెళ్ళి ఇంద్రుడి పక్కన కూర్చున్న అర్జునుణ్ణి ఆశ్చర్యంగా చూశాడు. అర్జునుణ్ణి రోమశుడికి పరిచయం చేశాడు ఇంద్రుడు. అర్జునుడు వచ్చి రోమశుడికి సాష్టాంగనమస్కారం చేశాడు.

తర్వాత ఇంద్రుడు భూలోకం వెళ్ళి అర్జునుడు తన దగ్గర ఉన్నట్లుగా ధర్మరాజుకి చెప్పి, అన్ని తీర్థాల విశేషాలు చెప్పి ధర్మరాజుని అన్ని తీర్థాల్లోనూ స్నానం చేసేటట్లు చూసి పవిత్రుడుగా చెయ్యమని రోమశ మహర్షిని ప్రార్థించాడు.

ఇంద్రా! పాండవులకి మంచి చెయ్యడం కంటే కావల్సిందేముంది అని బయలుదేరి ధర్మరాజు దగ్గరికెళ్ళి జరిగింది చెప్పి తీర్థయాత్రలకి రమ్మని తీసుకెళ్ళాడు రోమశ మహర్షి.

కామ్యకవనంలో వున్న బ్రాహ్మణులు, సోదరులు, ద్రౌపది అందరితో కలిసి బయలుదేరాడు ధర్మరాజు. రోమశుడు ధర్మాల్ని గురించి చెప్తూ పాండవుల్ని నైమిశం, అశ్వతీర్థం, గంగాఘోషం, కన్యాతీర్థం, గోమతి, భాహుద, మహానదులు, ప్రయాగ, గంగా యమునా సంగమం మొదలైన తీర్థాలన్నిట్లో స్నానం చేయించి ఆవు, బంగారం దానం ఇప్పించాడు. ఎంతో మంది మహర్షుల చరిత్రలు కూడ వినిపించాడు రోమశుడు.

తర్వాత గంధమాదన పర్వత ప్రాంతంలో నడవడానికి వీలులేక పోవడంతో భీముడు ఘటోత్కచుణ్ణి పిలిపించాడు. ఘటోత్కచుడు పాండవుల్ని, ధౌమ్యుడ్ని, ద్రౌపదిని ఎత్తుకుని మిగిలిన వాళ్ళని రాక్షసులతో ఆకాశమార్గంలో గంగా తీరంలో వున్న నరనారాయణాశ్రమానికి తీసుకువచ్చాడు.

రోమశుడు మాత్రం తన తపశ్శక్తితో చేరుకున్నాడు. అక్కడ ఆరు రోజులుండి అన్ని పుణ్యక్షేత్రాలు చూశారు. అక్కడ ఇంద్రుడు అర్జునుణ్ణి పాండవులకి అప్పగించాడు. అందరూ కలిసి రోమశుడితో ఆరేళ్ళు గడిపి ధర్మ రహస్యాలన్నీ తెలుసుకున్నారు.

పూర్వం వేదనిధి అనే బ్రాహ్మణ కుమారుణ్ణి గంధర్వ కన్యలు ప్రేమించారు. కానీ బ్రహ్మచర్యవ్రతంలో ఉన్న అతడు అందుకు అంగీకరించలేదు. అందుకని గంధర్వ కన్యలు అతని మీద పడి అతడ్ని మార్చాలనుకున్నారు. వేదనిధి వాళ్ళని పిశాచాలయి పొమ్మని శపించాడు. వాళ్ళు అతన్ని కూడా పిశాచంగా శపించారు.

వేదనిధి గంధర్వ కన్యలు కూడా పిశాచాలుగా మారిపోయారు. వాళ్ళని వెతుక్కుంటూ వాళ్ళ తల్లిదండ్రులు తిరుగుతూ వచ్చి రోమశముని పాదాలమీద పడి వాళ్ళెక్కడున్నారో చెప్పమని ప్రార్థించారు.

బాధపడకండి అందరూ నాతో వచ్చి మాఘస్నానం చెయ్యండి. మాఘమాసంలో తీర్థస్నానం చేస్తే సప్తజన్మల పాపం పోతుంది. ప్రయాగలో మాఘస్నానం చేసిన వీరసేనుడు భద్రకుడు గురించి చెప్తాను వినమన్నాడు రోమశ మహర్షి.

రోమశ మహాముని దేవద్యుతి కథ వేదనిధికిలా చెప్పాడు. సరస్వతీ నదీ తీరంలో 'యక్షప్రస్రణ' అనే పర్వతం వుంది. సుమిత్రముని కొడుకు దేవద్యుతి వేసవికాలంలో నిప్పుల్లోనూ, శీతాకాలంలో నీళ్ళల్లోనూ ఉండి గాలి, నీళ్ళు, కాయలు, దుంపలు తింటూ కఠోరమైన తపస్సు చేశాడు. తపస్సు వల్ల అతని తేజస్సు మూడులోకాల్లోను వ్యాపించింది. వైశాఖశుద్ధ ఏకాదశినాడు విష్ణుమూర్తి ప్రత్యక్షమై తనని స్తోత్రం చేసిన మునిని అనుగ్రహించి అంతర్ధానమయ్యాడు.

తర్వాత పిశాచరూపంలో ఉన్న చిత్రసేనుడ్ని దేవద్యుతి ప్రయాగ స్నానం చేయించడం వల్ల అతని పిశాచజన్మ పోయింది.

అలాగే మనం కూడ ప్రయాగ స్నానం చేస్తే నీ కొడుక్కి గంధర్వకన్యలకి కూడ శాప విమోచనం అవుతుందని చెప్పి వాళ్ళతో ప్రయాగలో స్నానం చేయించి వాళ్ళకి పూర్వపు రూపం వచ్చేలా చేశాడు రోమశమహర్షి.

రోమశుడు ప్రయాగ గొప్పతనం ఇలా చెప్పాడు. ప్రయాగ తీర్థంలో బ్రహ్మయజ్ఞం చేశాడు. ఈపాయ పేరు 'అసితతోయవేణి'. ఈ నీళ్ళు త్రాగిన వాళ్ళకి స్వర్గప్రాప్తి కలుగుతుంది. విష్ణుమూర్తి దీంట్లో స్నానం చేసి లక్ష్మీదేవిని పొందాడు. ఊర్వశి శాపవిమోచనం పొందింది. ఇంద్రుడికి దీంట్లో స్నానం చేసిన తర్వాతే కొడుకు పుట్టాడు. నరనారాయణలు దీంట్లో మునిగి ఆకలిదప్పులు పోగొట్టుకున్నారు. కశ్యపుడు శివ దర్శనం చేసింది ఇక్కడే. భరద్వాజుడు ఇక్కడే తపస్సు చేసుకున్నది. సనకాదులు యోగసిద్ధి పొందింది కూడా ఇక్కడే. మోక్షం కావాలనుకున్న వాళ్ళకి మోక్షం, పనులు పూర్తవ్వాలనుకున్న వాళ్ళకి పనులు, సాధకులకి సిద్ధి దొరుకుతుందని చెప్పాడు.

ఈ రకంగా రోమశ మహర్షి అనేక తీర్థాల్లో స్నానం చేసి గొప్ప పవిత్రుడయ్యాడు. ఎంతో మందికి తీర్థయాత్రా విశేషాలు చెప్పాడు. ఇప్పటికీ భక్తితో తీర్థయాత్రలు చేసే వాళ్ళకి రోమశ మహర్షి అక్కడ కనిపిస్తాడట.

ఇది పిల్లలూ! రోమశ మహర్షి కథ !!

తీర్థయాత్రల వల్ల ఎలాంటి ఫలితాలుంటాయో ఎక్కడెక్కడ స్నానాలు చెయ్యాలో ఏవి పవిత్రమైన తీర్థాలో అన్ని వివరంగా మనకి తెలిసేలా చెప్పాడు కదా!

మనం కూడా మనకి వీలయినపుడు జీవితంలో ఒకసారయినా తీర్థయాత్రలు చేద్దాం.

# 71. రైభ్య మహర్షి

మనం రైభ్య మహర్షిని గురించి తెలుసుకుందాం.

రైభ్యుడు చిన్నతనం నుంచే వేదాధ్యయనం ప్రారంభించాడు. ఇతనికి గురుభక్తి చాలా ఎక్కువ. గురువుగారి కంటె ముందుగా నిద్రలేచి ఆయన పడుక్కునే వరకు ఆయనకు కావల్సినవన్నీ చేస్తూ చదువుకునేవాడు.

గురువుగారు కూడా అతని గురుభక్తికి సంతోషించి అన్ని వేద శాస్త్రాలు అతనికి బాగా వచ్చేటట్లు నేర్పించాడు. మొత్తం అన్నీ నేర్చుకున్నాక గురువుగారి ఆజ్ఞ తీసుకుని బృహస్పతి దగ్గరికి వెళ్ళాడు.

రైభ్యుడు తనకి సందేహాలు కలిగినప్పుడు బృహస్పతినడిగి తెలుసుకునే వాడు. ఒకసారి వసు మహారాజుని తీసుకుని బృహస్పతి దగ్గరకి వెళ్ళి దేవా! మోక్షం కర్మలు చెయ్యడం వల్ల వస్తుందా? జ్ఞానాన్ని సంపాదించడం వల్ల వస్తుందా? అనడిగాడు.

మునీంద్రా! తామరాకు మీద నీరు ఎట్లాయితే అంటుకోదో అట్లాగే చేసిన కర్మల్ని పరమేశ్వరార్పణమస్తు అని భగవంతుడికి అర్పిస్తే మనల్ని ఏ కర్మా అంటదు. దీనికి ఒక కథ చెప్తాను వినమన్నాడు బృహస్పతి.

కథే కదా మనక్కూడ ఇష్టమేగా విందాం.

పూర్వం సంయముడనే మహారాజు భగీరథీ తీరంలో తిరుగుతుండగా ఒక బోయవాడు లేళ్ళ గుంపుని కొట్టబోతే సంయముడు ఆపి పాపం! అవేం చేశాయి? వాటిని చంపకు అన్నాడు.

బోయవాడు చంపడానికి మానడానికి నేనెవర్ని? అంతా ఈశ్వరేచ్ఛ అన్నాడు. సంయముడు ఎందుకు ఇలా మాట్లాడుతున్నావ్! అన్నాడు. బోయివాడు వీపు మీదున్న ఇనప వల క్రిందపడేసి దీంట్లోంచి అగ్ని పుట్టించమన్నాడు సంయముడిని. అతడి వల్ల కాలేదు.

బోయవాడు మంటల్ని పుట్టించి ఆర్పేశి ఇలా అన్నాడు. ఈ మంటలు ఎల్లా అయితే వెలిగి ఆరిపోతున్నాయో, అలాగే భగవంతుడు ప్రకృతి స్థితుడైనప్పుడు జీవులు నశించి, వికృతడై మళ్ళీ పుట్టిస్తాడు.

ఇంక శరీర ధర్మాలకొస్తే ఎవరికేదిష్టమో అది చేసి పరమాత్మకి అర్పించాలి.

అంటే మనం ఏదేనా తింటున్నా త్రాగుతున్నా, ఎవరికేనా ఏమన్నా ఇస్తున్నా ఏపని చేస్తున్నా 'పరమేశ్వరార్పణం' అంటే అది భగవంతుడికే చెందుతుందని చెప్పగానే దేవతలు బోయవాడి మీద పుష్పవర్షం కురిపించారు.

తర్వాత దేవతలు విమానంలో బోయవాణ్ణి సంయముడు చూస్తూండగానే తీసుకుపోయారు. బృహస్పతి చెప్పింది విని రైభ్యవసువులు ఆనందంగా వెళ్ళారు.

కొంతకాలం తర్వాత రైభ్యుడు పెళ్ళి చేసుకున్నాడు. అతడికి అర్వావసువు, పరావసువు అని ఇద్దరు కొడుకులు పుట్టారు. పిల్లద్దరికి వేద విద్యలు నేర్పించి వాళ్ళతోపాటు రైభ్యుడు చదువుతుంటే మిగిలిన మహర్షులు ఆనందంగా చూసి ఆశీర్వదించి వెళ్ళేవాళ్ళు.

రైభ్య మహర్షి కొడుకులు అర్వావసువు, పరావసువుల్ని చూసి భరద్వాజుడి కొడుకు అవక్రీతుడు అసూయపడేవాడు. రైభ్యుడు, భరద్వాజుడు మాత్రం అన్నదమ్ముల్లా కలిసి మెలిసి వుంటూ తపస్సు చేసుకుంటూ వుండేవాళ్ళు.

అన్నీ వేదాలు రావాలని అవక్రీతుడు ఇంద్రుడి గురించి తపస్సు చేశాడు. వేదాలు గురువు ద్వారా నేర్చుకోవాలి గానీ తపస్సు ద్వారా కాదన్నాడు ఇంద్రుడు.

అవక్రీతుడు వినకపోతే ఇంద్రుడు సరే తీసుకో వరమయితే ఇస్తానుగాని అలా వచ్చిన వేదాలు నీకు ఎంతవరకు ఉపయోగ పడతాయో మాత్రం చెప్పలేనన్నాడు.

అవక్రీతుడుకి వేదాలు నేర్చుకున్నానన్న గర్వం పెరిగిపోయింది. బృహస్పతి గర్వం మంచిదికాదని ఎంత చెప్పినా వినలేదు.

ఒకరోజు రైభ్యుడి కోడల్ని అవమానించాడు అవక్రీతుడు. రైభ్యుడు ఒక రాక్షసిని, ఒక రాక్షసుడ్ని పుట్టించి అవక్రీతుడ్ని చంపించాడు.

భరద్వాజుడు కొడుకుకి జరిగినది న్యాయమే అని దహనక్రియ జరిపించి పుత్రశోకం భరించలేక శరీర త్యాగం చేశాడు.

ఒకనాడు రైభ్యుడి కొడుకు రాత్రి యింటికి వస్తూండగా ఒక మృగం మీదపడింది. దాన్ని కొట్టడానికి కర్రవిసిర్తే అది అక్కడే నిద్రపోతున్న తండ్రి రైభ్యుడికి తగిలి మరణించాడు.

రైభ్యుడి కొడుకు అర్వావసువు తపస్సు చెయ్యడం ప్రారంభించాడు. అతని తపస్సుకి మెచ్చుకుని దేవతలు వరాలు కోరుకోమన్నారు. రైభ్య భరద్వాజ అవక్రీతుల్ని బ్రతికించమన్నాడు అర్వావసువు.

అప్పటి నుండి అవక్రీతుడు గర్వం వదిలి అందరితో కలిసిమెలిసి వున్నాడు.

రైభ్యుడు తీర్థ యాత్రలు చేస్తూ అనంతశాయిని, రంగధాముణ్ణి, కంచి వరదరాజుని, వెంకటేశ్వరస్వామిని, అహోబలేంద్రుణ్ణి సింహాచల నాయకుణ్ణి, శ్రీకూర్మపతిని, పురుషోత్తముణ్ణి అందర్నీ దర్శించి ప్రయాగ వెళ్ళి గయలో పితృదేవతలికి పిండ ప్రదానం చేసి ఒకచోట తపస్సు చేసుకుంటూ వుండిపోయాడు.

అలా తపస్సు చేస్తూవుండగా సనత్కుమారుడు రైభ్యుడి దగ్గరికి వచ్చి అతని తపోదీక్షని పొగిడాడు. రైభ్య మహర్షి తపస్సుకు మెచ్చి విష్ణుమూర్తి కనిపించి ఏం కావాలనడిగాడు. సనకాదులుండే చోటికి నన్ను కూడ పంపమని మోక్ష సామ్రాజ్యాన్ని పొందాడు రైభ్య మహర్షి.

ఇదర్రా రైభ్యమహర్షి కథ!!

విద్య గురువు ద్వారా నేర్చుకోవాలనీ, ఏ పని చేసినా భగవంతుడి మీద భారం వెయ్యాలనీ ఇల్లాంటివి చాలా తెలుసుకున్నాం కదా!

# 72. లోమశ మహర్షి

**పి**ల్లలూ! లోమశ మహర్షి గురించి తెలుసుకుందామా...

అరణ్యక మహర్షి ఎప్పుడూ అరణ్యంలోనే వుండడం వల్ల అరణ్యం తప్ప ఆయనకి ఏమీ తెలియదు. కాని తత్త్వజ్ఞానం గురించి తెలుసుకోవాలని కోరికతో అదే పనిగా తీర్థయాత్రలు చేస్తున్నాడు. ఒక్కడు కూడా జ్ఞానం ఉపదేశించేవాడు కనిపించలేదు.

ఒకనాడు ఒక మహర్షి కనిపించాడు. ఆయన్ని స్వామీ! మీపేరు ఏమిటి? మీరెక్కడ నుంచి వస్తున్నారని అడిగాడు. ఆ మహర్షి వత్సా! నేను దేవలోకం నుంచి వస్తున్నాను. నన్ను లోమశుడంటారు అన్నాడు.

అరణ్యక మహర్షి ఆయనకి సాష్టాంగ నమస్కారంచేసి మహాత్మా! సంసార సాగరం నుంచి తరించే వుపాయం చెప్పండన్నాడు.

లోమశ మహర్షి వత్సా! మార్గాలయితే చాలా వున్నాయి. కానీ, 'రామ'మంత్రం కంటే సంసారం నుంచి దాటించే మంత్రం ఇంకొకటి లేదు. ఇది వేదశాస్త్ర పరమ రహస్యం. ఇంతకంటే వేరు మంత్రాలు, వ్రతాలు, క్రతవులు, యోగాలు, యాగాలు, దానాలు, మౌనాలు ఏమీలేవు అని చెప్పాడు.

రామస్మరణ వల్ల ఛండాలుడైనా, వేదశాస్త్రాలు చదివిన బ్రహ్మణుడిలాగే ముక్తి పొందగలడు. నువ్వు నన్ను వినయ విధేయతలతో అడిగావు గనుక చెప్పాను. నువ్వు మాత్రం నాస్తికులకీ, శ్రద్ధహీనులకీ, భక్తిహీనులకీ, కామక్రోధాది దూషితులకీ, శాంతంలేనివాళ్ళకీ, అహంకారమున్నవాళ్ళకీ ఈ రహస్యం చెప్పదన్నాడు.

అరణ్యక మహర్షి ఆనందంతో లోమశ మహర్షి పాదాలు వదలకుండ స్వామీ! శ్రీరామచంద్రమూర్తిని నేనెప్పుడూ చూడలేదుకదా! నాకు రామధ్యానం చేసే పద్ధతిని కూడా చెప్పమన్నాడు.

లోమశ మహర్షి ఆలోచించి ఎప్పుడూ అరణ్యంలోనే వున్న ఇతడు ఎలా ధ్యానించి రాముణ్ణి చూడగలుగుతాడు? అని దయతో రాముడు ఎలావుంటాడో చెప్తాను వినమన్నాడు.

అయోధ్యలో చిత్రమండపంలో వున్న కల్పవృక్షం క్రింద వున్న నవరత్నాలు పొదిగిన బంగారు సింహాసనం మీద కూర్చుని, పూర్ణిమనాటి చంద్రుడిలా ఉండే మొహంతో, నీలిరంగులో వుండే శరీరంతో, మణులు పొదిగిన కిరీటంతో, నల్లటి జుట్టుతో, మకర కుండలాల్తో, వైఢూర్యమణుల్లాంటి పలువరుసతో, పువ్వులావుండే నాలుకతో, శంఖంలాంటి మెడతో, ఎత్తైన భుజాల్తో, శుభలక్షణాలు కలిగిన ముక్కుతో, రకరకాలయిన ఆభరణాల్తో వున్న ఆజానుబాహువులయిన చేతుల్తో, లక్ష్మీనివాసము విశాలము అయిన వక్షస్థలంతో,

గంభీరమైన నాభి, మృదువైన పాదాలు కలిగి దేదీప్యమానంగా వెలిగే శ్రీరామచంద్రుణ్ణి మనసారా ధ్యానించి, చేతులారా పూజించి, నోరార భజించి చాలా సులభంగా మోక్షాన్ని పొందవచ్చు. ఇంతకన్న సులభమయిన మార్గం లేదని చెప్పాడు లోమశ మహర్షి.

లోమశ మహర్షి ఇంకా రామకథంతా చెప్తున్నాడు. అరణ్యక మహర్షి వింటూ వున్నాడు.

వత్సా! త్రేతాయుగంలో సూర్యకులంలో విష్ణుమూర్తి నాలుగు రకాల ఆకృతుల్తో పుట్టాడు. లక్ష్మణుడితో కలిసి కౌశికుడి యజ్ఞం పాడుచేస్తున్న మారీచ సుబాహుల్ని చంపి, అహల్యాశాపవిమోచనంచేసి, మిథిలకి వెళ్ళి శివధనుస్సు విరిచి సీతని పెళ్ళిచేసుకున్నాడు. అప్పటికి రాముడికి పదిహేనో సంవత్సరం.

అరణ్యవాసానికి వెళ్ళి పన్నెండు సంవత్సరాలు చిత్రకూట పర్వతం మీద వుండి తర్వాత పంచవటి వెళ్ళాడు. అక్కడే రావణుడు సీతనెత్తుకుపోయాడు. మార్గశిర శుద్ధ ఏకాదశినాడు రాత్రి హనుమంతుడు సీతని చూశాడు. ద్వాదశినాడు సీతని పలకరించి, త్రయోదశినాడు లంకను కాల్చి పూర్ణిమనాడు తిరిగివెళ్ళి ఏడోరోజుకి రాముణ్ణి కలిశాడు.

శ్రీరాముడు ఉత్తరఫల్గుణీ నక్షత్రం అష్టమినాడు బయలుదేరి ఏడురోజులకి సముద్రతీరం చేరుకుని దశమినాడు సేతువు మొదలుపెట్టి, త్రయోదశికి పూర్తి చేసి సైన్యాన్ని దాటించి శుక్లద్వాదశి నుంచి కృష్ణచతుర్ధి వరకు యుద్ధంచేసి రావణుణ్ణి చంపాడు.

మొత్తం డబ్బయి రెండు రోజులు పట్టింది యుద్ధానికి. పద్నాలుగు సంవత్సరాలు పూర్తవగానే రాముడు అయోధ్యకి వచ్చి పట్టాభిషేకం చేయించుకున్నాడు.

అప్పటికి రాముడికి నలభై రెండు, సీతకి ముప్పైయి మూడు సంవత్సరాలు. సీత రావణుడి చెరలో పదకొండు నెలల పద్నాలుగు రోజులుంది.

రాముడు అశ్వమేధయాగం చేసినప్పుడు రథం నీ దగ్గరకి వస్తుంది. నువ్వు రాముని చూసి ఆయన పాదాల దగ్గరే మోక్షం పొందుతావని లోమశ మహర్షి, అరణ్యక మహర్షికి చెప్పాడు.

మనం ఇంతకు ముందు అరణ్యక మహర్షిని గురించి తెలుసుకున్నప్పుడు చదివాం కదా! సరిగ్గా లోమశ మహర్షి చెప్పినట్లే జరిగింది కదూ!

చూశారా! ఎంత చక్కగా జరగబోయేది చెప్పాడో లోమశ మహర్షి. అంతేకాదు శ్రీరాముడిని ఎంతబాగా మనకళ్ళకి కనిపించేటట్లు వర్ణించాడో!

ఇదర్రా! లోమశ మహర్షి కథ!!

మనం కూడా 'రామ'నామం చేసుకుందాం. మన జీవితం కూడా ఏ కష్టాలు లేకుండ గడిచిపోతుంది.

# 73. వసిష్ఠ మహర్షి

**పి**ల్లలూ! ఇప్పుడు మనం తెలుసుకోబోతున్న వసిష్ఠ మహర్షి చాలా చాలా చాలా గొప్పవాడు. నిజంగా ఇలాంటి గొప్ప గొప్ప ఋషుల గురించి రాసినా చదివినా, చదివి వినిపించినా కూడా పుణ్యమే. ఈయన ఎంత గొప్పవాడో చెప్పనా!..

వసిష్ఠ  మహర్షి భారతదేశంలో బ్రహర్షులందరిలో గొప్పవాడు. నవ బ్రహ్మల్లో గొప్పగా కీర్తించ తగినవాడు. సప్తమహర్షుల్లో ఉత్తముడు. ఇక్ష్వాకువంశ క్షత్రియులకి కులగురువు. త్రిలోక పూజ్యురాలైన అరుంధతికి ప్రాణనాథుడు.

వసిష్ఠుడు దక్షుడి కూతురు "ఊర్జ"ని పెళ్ళి చేసుకుని ఆమెకి ఏడుగురు కొడుకుల్ని అనుగ్రహించాడు. ఆ ఏడుగురికి సప్తమహర్షులని పేరు.

తర్వాత వసిష్ఠుడు గొప్ప తపస్సు చేస్తూ రెండో బ్రహ్మలోకంలా వుండేలా ఒక అడవిలో ఆశ్రమం నిర్మించుకుని చాలామంది పితామహుల్లాంటి బ్రహర్షుల్నే శిష్యులుగా పొందాడు.

ఒకనాడు అయోధ్య రాజయిన ఇక్ష్వాకుడు వసిష్ఠ మహర్షిని ఇంటికి తీసుకు వెళ్ళి కొన్నాళ్ళు తనింట్లోనే వుండమని పరిచర్యలు చేశాడు. రాజుని పిలిచి నీకేం కావాలనడిగాడు వసిష్ఠుడు.

మహర్షీ! మీరు మా కుల గురువుగా వుండాలని ప్రార్థించాడు రాజు.

వసిష్ఠుడికి దివ్యదృష్టి వుంది కదా! దాని వల్ల శ్రీ మహావిష్ణువే ఈ వంశంలో శ్రీరాముడిగా పుడతాడని తెలుసుకుని కులగురువుగా వుండడానికి అంగీకరించాడు.

అప్పటి నుంచి ఇక్ష్వాకువంశ రాజులందరికి వసిష్ఠ మహర్షి కులగురువుగా వున్నాడు.

ఇక్ష్వాకుడి తరువాత అతని కొడుకు నిమి రాజ్యానికి వచ్చి వసిష్ఠుణ్ణి చాలా గౌరవంగా చూశాడు. ఒకసారి నిమి వెయ్యి సంవత్సరాల సత్రయాగం చెయ్యాలనుకుంటున్నాను మీరు హోతగా వుండాలని గురువుగారిని అడిగాడు.

వసిష్ఠుడు నాకు అభ్యంతరం లేదు కానీ, నీ కంటే ముందే ఇంద్రుడు వంద సంవత్సరాలు యాగం చెయ్యాలనడిగాడు. అందుకు సరేనన్నాను. కనుక అది అయిపోగానే ఇది మొదలుపెడ్దాం అని చెప్పి వెళ్ళిపోయాడు.

నిమి సత్రయాగానికన్నీ సిద్ధం చేసుకుని గౌతమ మహర్షిని హోతగా పెట్టుకుని యాగం ప్రారంభించాడు.

వంద సంవత్సరాలు అయిపోగానే వసిష్ఠుడు తిరిగి వచ్చి నిమిని చూసి నన్ను హోతగా వుండమని చెప్పి వేరే వాళ్ళని కనీసం నాకు ఒకమాట కూడ చెప్పకుండా పెట్టుకున్నావు కాబట్టి నువ్వు శరీరం లేకుండా పోతావని శపించాడు. నిమి కూడా వసిష్ఠుడ్ని శపించాడు.

అప్పుడు గౌతమ మహర్షి మొదలైన వాళ్ళు ఆ శరీరం పాడవకుండా చూస్తూ యాగం పూర్తి చేశారు. ఇంద్రుడు మొదలైన దేవతలంతా నిమి కోరిక ప్రకారం అన్ని జీవుల కళ్ళమీద ఉండేలా వరమిచ్చారు.

అంటే మనం కళ్ళార్పుతూ వుంటాము అందుకే నన్నమాట!

వసిష్ఠుడు శరీరం విడిచిపెట్టి తన తేజస్సునీ, యోగ విద్యా బలాన్ని మిత్రవరుణుల్లో ప్రవేశపెట్టాడు.

మిత్రవరుణులు ఊర్వశిని చూసి ఆ తేజస్సుని బయటికి వదిలేస్తే దాన్ని రెండు కుండల్లో దాచింది ఊర్వశి. కొంతకాలం తర్వాత వసిష్ఠుడు మళ్ళీ శరీరాన్ని పొంది అగస్త్యుడితో పాటుగా కుండ నుండి బయటికి వచ్చి 'కంభసంభవుడు' అనే పేరు పొందాడు.

నిమి శాపం వల్ల శరీరాన్ని విడిచినా వసిష్ఠుడు కారణజన్ముడు కనుక మళ్ళీ శరీరాన్ని పొందాడు.

ఒకసారి వసిష్ఠుడు కర్దమప్రజాపతి ఇంటికొచ్చి అక్కడే వుండగా కర్దముడు తన కూతురు అరుంధతిని మహర్షికి సేవ చెయ్యడానికి పెట్టాడు.

వసిష్ఠుడు దివ్య దృష్టితో అరుంధతిని తన భార్య అవుతుందని తెలుసుకొని కర్దముణ్ణి అడిగి పెళ్ళి చేసుకున్నాడు.

ఒకసారి అరుంధతి పాతివ్రత్యం పరీక్షించాలని ఒక కమండలం ఇచ్చి నేను వచ్చేదాకా దీన్ని కింద పెట్టకుండా చేత్తోనే పట్టుకుని వుండమని చెప్పి ఎక్కడికో వెళ్ళాడు వసిష్ఠుడు.

ఎంతకాలమైనా వసిస్ఠుడు తిరిగి రాకపోతే అరుంధతి మాత్రం కమండలం కింద పెట్టకుండా పట్టుకుని అట్లాగే కూర్చుంది. ఆమె పాత్రివ్రత్యానికి భయపడి బ్రహ్మ మొదలైన దేవతలు వసిష్ఠుణ్ణి వెదికి తీసుకొచ్చారు.

అరుంధతి ఆ కమండలం వసిష్ఠుడికిచ్చి పాదాలకి నమస్కారం చేస్తుంటే దేవతలు పూల వర్షం కురిపించారు. బ్రహ్మ దీర్ఘాయుష్షు, సుమంగళీత్వం ఇచ్చి ఆశీర్వదించాడు అరుంధతిని.

అరుంధతీవసిష్ఠులు అశ్రమానికి వచ్చి సుఖంగావున్నారు. గృహస్థాశ్రమంలోనే యోగం, భోగం, జపం, దానం, త్యాగం, ధర్మం అన్నీ అనుసరిస్తూ అందరికీ ఆదర్శంగా వున్నారు.

ఒకసారి గాధి కొడుకైని విశ్వామిత్రుడు వేటకోసం వచ్చి అలసిపోయి వసిష్ఠాశ్రమానికి వచ్చాడు. వసిష్ఠుడు విశ్వామిత్రుడికి, అతని సైన్యానికి తన దగ్గరున్న కామధేనువు సహాయంతో భోజనాలు పెట్టాడు.

భోజనం చేశాక విశ్వామిత్రుడు నువ్వు బ్రాహ్మణుడివి, నేను రాజుని కాబట్టి ఈ కామధేనువుని నాకియ్యి, నీకు బోలెడు ధనమిస్తాను అన్నాడు.

నేను దీని సహాయంతో పితృదేవతలకి ఆతిథ్యం ఇస్తున్నాను. ధనం, మణులు, గుఱ్ఱాల వల్ల నాకేం ఉపయోగం? కామధేనువుని ఇవ్వనన్నాడు వసిష్ఠుడు.

విశ్వామిత్రుడు కామధేనువుని బలవంతంగా తీసికుపోతుంటే నిన్ను నువ్వే రక్షించుకోమన్నాడు వసిష్ఠుడు కామధేనువుతో. వెంటనే కామధేనువులోంచి అనేక వేలమంది సైన్యం వచ్చి విశ్వామిత్రుడి సైన్యాన్ని నాశనం చేశారు.

విశ్వామిత్రుడు అవమానం భరించలేక శివుడి గురించి తపస్సు చేసి శస్త్రాస్త్రాలు పొంది మళ్ళీ వసిష్ఠుడి మీద దండెత్తి ఏమీ చెయ్యలేక బ్రహ్మగురించి తపస్సు మొదలుపెట్టాడు.

విశ్వామిత్రుడు ఒక రాక్షసుణ్ణి పంపించి వసిష్ఠుడి నూర్గురు పిల్లల్ని చంపించాడు. వసిష్ఠుడు, ఆ బాధ భరించలేక అగ్నిప్రవేశం చేద్దామనుకున్నాడు. కాని మంటలు చల్లగా అయిపోయాయి. రాయి మెడకు కట్టుకుని సముద్రంలో దూకాలనుకుంటే నీళ్ళు పక్కకి తోసేశాయి. ఎన్నివిధాల ప్రయత్నించినా ఆత్మహత్య కుదర్లేదు వసిష్ఠుడికి.

తర్వాత కోడలికి పరాశరుడు పుడతాడని తెలిసి ఆత్మహత్యా ప్రయత్నం విరమించాడు.

భరతకులం వాడయిన సంవర్తుడు సూర్యుడు కూతురు తపతిని ఇష్టపడ్డాడు. గురువు వసిష్ఠుణ్ణి తపతితో పెళ్ళి చేయించమని అడిగాడు సంవర్తుడు.

వసిష్ఠుడు సరేనని చెప్పి సూర్యుడి దగ్గరికి వెళ్ళి జరిగింది చెప్పి తపతికి సంవర్తుడితో పెళ్ళి జరిపించమని చెప్పి ఒప్పించి పెళ్ళి జరిపించాడు.

శ్రీరాముడికి పూర్వం అసరణ్యుడనేవాడు దైవ ద్రోహం చేసి కుష్ఠ రోగంతో బాధపడుతుంటే ఆరోగ్య వ్రతం ఉపదేశించి రోగాన్ని తగ్గించాడు వసిష్ఠ మహర్షి.

దశరథుడి కూతురు శాంతని రోమపాదుడికి పెంచుకోవడానికి ఇవ్వనంటే ఒప్పించి పంపాడు వసిష్ఠుడు.

పరశురాముడు దశరథుణ్ణి చంపడానికి వస్తే శాంతని బ్రాహ్మణుడికిచ్చి పెళ్ళి జరిపించి రక్షించాడు.

దశరథుడికి నలుగురు కొడుకులు పుట్టినప్పుడు వాళ్ళకి నామకరణం తానే చేశాడు వసిష్ఠ మహర్షి.

దశరథుడు చనిపోయినపుడు భరత శత్రుఘ్నులకి చెప్పి రాజ్యాన్ని కాపాడాడు.

శివధనుస్సుని ఎక్కుపెట్టి శ్రీరాముడు సీతని పెళ్ళి చేసుకుంటుంటే మిగిలిన ముగ్గురికీ కూడా తానే దగ్గరుండి పెళ్ళి జరిపించాడు వసిష్ఠ మహర్షి.

వసిష్ఠుడు జనక మహారాజుకి మోక్షం గురించి, మోక్షాన్ని పొందే మార్గం గురించి వివరంగా చెప్పాడు.

అలాగే దిలీపుడు కూడా వసిష్ఠుణ్ణి మోక్ష మార్గం గురించి అడిగి తెలుసుకున్నాడు.

పూర్వం సూర్యవంశపు రాజయిన సూర్యారుణుడు తన కొడుకు సత్యవ్రతుణ్ణి ఊరి నుంచి గెంటేశాడు. తర్వాత తాను కూడ తపస్సు చేసుకుందుకు అడివిలోకి వెళ్ళిపోయాడు. ఆరాజ్యం అరాజకం కాకుండా వసిష్ఠుడు కాపాడాడు.

విశ్వామిత్రుడు భార్య పిల్లలు తినడానికి లేక ఇబ్బందులు పడుతుంటే సత్యవ్రతుడు మాంసం తీసికొచ్చి వాళ్ళని పోషిస్తున్నాడు. ఒకరోజు ఏ జంతువూ దొరకకపోతే వసిష్ఠుడి

దగ్గరున్న ఆవుల్లో ఒక ఆవుని చంపి మాంసం తీసుకుంటుండగా వసిష్ఠుడు చూసి నువ్వు చేసిన తప్పులకి త్రిశంకుడవుతావు అని శపించాడు.

సత్యవ్రతుడు శరీరంతోనే స్వర్గానికి వెళ్ళేలా యాగం చేయించమని వసిష్ఠుడు అతడ్ని చివాట్లు పెట్టి అలాంటివి కుదరవన్నాడు.

విశ్వామిత్రుడు సత్యవ్రతుడితో యజ్ఞం చేయించి త్రిశంకు స్వర్గానికి పంపించగలిగాడే కానీ వసిష్ఠుడి మాటకి తిరుగులేక స్వర్గానికి చేర్చలేకపోయాడు.

త్రిశంకుడి కొడుకు హరిశ్చంద్రుడు సత్యవ్రతుడని వసిష్ఠుడు చెప్పాడు. కాదని నిరూపించడానికి ఎంతో ప్రయత్నించి విఫలుడయ్యాడు విశ్వామిత్రుడు.

సకల సంపదలతో తులతూగే మాంధాత చక్రవర్తి వసిష్ఠుణ్ణి తన సభలో బంగారు సింహాసనం మీద కూర్చోబెట్టి తనకి జ్ఞానం తెలిపి మోక్షం పొందేలా చెయ్యమని ప్రార్థించాడు.

కర్మ స్వరూపం, బ్రహ్మ స్వరూపం, వేదవేదాంత పురాణ స్వరూపం, ఉపాసక స్వరూపం, భగవదవతార రహస్యం, భక్తియోగ స్వరూపం అన్నీ వివరంగా చెప్పి, 'అష్టాక్షరీ' మంత్రరత్నాన్ని ఉపదేశించి వెళ్ళిపోయాడు వసిష్ఠ మహర్షి.

వసిష్ఠ మహర్షి రాసిన గ్రంథాల్లోంచి వసిష్ఠ ధర్మసూత్రం, వృద్ధ వాసిష్ఠ, యోగ వాసిష్ఠ, జ్ఞానవాసిష్ఠ, జ్యోతిర్వాసిష్ఠ మొదలైనవి ఉన్నాయి. వసిష్ఠ మహర్షి స్మృతికర్తల్లో ఒకడు.

వసిష్ఠస్మృతిలో ముప్పై అధ్యాయాలున్నాయి.

ఇదన్రా వసిష్ఠ మహర్షి కథ!!

బ్రహ్మ తేజస్సే బలంగా వున్న రూపంతో, పరమ పవిత్రమైన మన భారతంలో వసిష్ఠుడు పుట్టడం వల్ల భూలోకం వెలిగి పోయింది. అల్లాంటి వసిష్ఠ మహర్షి సప్తఋషిమండలంలో శాశ్వతంగా ఉండిపోయాడు.

మన భారతదేశం ఎంత పవిత్రమైందో అర్థమయిందా ..!

# 74. వామదేవ మహర్షి

ఇప్పుడు మనం వామదేవ మహర్షిని గురించి తెలుసుకుందాం.

ఇంతమంది మహర్షుల్ని మనం చూస్తూ, అంటే తెలుసుకుంటూ వస్తున్నాం కదా... ఒకళ్లని మించి ఒకళ్ళు గొప్పవాళ్ళే వున్నారుకదా! ఈ మహర్షిని కూడా చూద్దాం....

వామదేవుడు తల్లి కడుపులో ఉండగానే పూర్వజన్మ పుణ్యం వల్ల ఆత్మజ్ఞానం పొందాడు. సంసారంలో ఇరుక్కోకుండా, రోగాలు, మళ్ళీ మళ్ళీ జన్మలు లేకుండా సర్వజ్ఞుడు, అపూర్వుడు, అద్వితీయుడై వెలిగాడు.

వామదేవుడు పెరిగి పెద్దవాడై చాలామంది శిష్యులికి జ్ఞానాన్ని బోధిస్తూ అపర శివుడిలా శరీరమంతా విభూతితో వుండేవాడు. జుట్టు జడలు కట్టి ఉండేవాడు. ఆయన నిరాశ్రయుడు, నిరహంకారి.

శిష్యులతో భూసంచారం చేస్తూ కుమార శిఖరం దగ్గర కుమారస్వామిని చూసి పూజించి ప్రణవోపాసనం గురించి తెలియ చేయ్యమన్నాడు వామదేవ మహర్షి. కుమారస్వామి ప్రణవం గురించి చెప్పకలిగినవాడు ఒక్క శివుడేనని చెప్పాడు.

శివుడే ప్రణవమనీ, ఆయనకి అయిదు ముఖాలు, పదిచేతులు ఉంటాయనీ, ఆయన స్వయంభువుడనీ, ఆయనే ప్రణవార్ధమనీ చెప్పి మహర్షీ! నీకు తెలియంది లేదు. అయినా కొన్ని విషయాలు చెప్తాను వినమని ఓంకారం ఎలా స్మరించాలి, ఎలా ఉచ్ఛరించాలి, గురుశిష్య సంబంధమెలా ఉండాలి, శివతత్త్వమంటే ఏమిటి అన్నీ తెలియ చెప్పి నువ్వు ఎవర్ని కాపాడాలనుకుంటావో వాడు తప్పకుండా తరిస్తాడని చెప్పి కైలాసానికి బయలుదేరాడు కుమారస్వామి.

కుమారస్వామితో పాటు వామపాదుడు కూడా కైలాసానికి వెళ్ళి శివుడి పాదాల మీదపడి చాలాకాలం కైలాసంలో వుండిపోయాడు.

వామదేవుడు శివపంచాక్షరీ మంత్రంతో భూలోకమంతా తిరుగుతుండగా ఒక భయంకరమైన రాక్షసుడు వామదేవుడి మీద పడ్డాడు. వామదేవుడు భయపడ లేదు.

కానీ, రాక్షసుడికి మాత్రం వామదేవుణ్ణి పట్టుకోగానే ఇనుము స్వచ్ఛమై బంగారమైనట్లు, మానససరోవరంలో మునిగిన కాకి రాజహంస అయినట్లు, అమృతం త్రాగిన మనిషికి దేవత్వం వచ్చినట్లు పాపాలన్నీ పూర్తిగా పోయి నిర్మలమైన మనస్సుతో మహర్షీ! నా తప్పు క్షమించు నీవల్ల కలిగిన ఈ దివ్యత్వానికి నీకు కృతజ్ఞతలు అన్నాడు రాక్షసుడు.

అసలు ఇలా ఎందుకయ్యావు? అనడిగాడున వామదేవుడు. నేను పూర్వం యవన రాజ్యానికి రాజుగా వున్నప్పుడు చాలామంది స్త్రీలని బంధించి జైల్లో పెట్టాను. తర్వాత రకరకాల జన్మలెత్తి ఇప్పుడు రాక్షసుడుగా పుట్టి నీవల్ల మోక్షం పొందానని చెప్పాడు రాక్షసుడు.

మహర్షీ! ఇంతటి గొప్ప మహత్తు మీకు ఎలా వచ్చిందో చెప్పండని అడిగాడు రాక్షసుడు. శివుడికి ఇష్టమైందీ, భూషణంగా శివుడు ధరించేదీ అయిన పవిత్రమయిన విభూతి నా శరీరం మీద వుంది కాబట్టి అలా జరిగింది. ఇదంతా విభూతి చేసిన పనే కాని నాది కాదు. దాని గొప్పతనం ఒక త్రినేత్రుడికే తెలుసు. శ్రద్ధ, భయం, భక్తి కలిగి ఎవరు ఈ విభూతిని రాసుకుంటాడో అతడికి అన్ని పాపాలు నశిస్తాయని చెప్పాడు వామదేవుడు. రాక్షసుడు మహర్షికి నమస్కరించి వెళ్ళిపోయాడు.

ఒకసారి నృగమహారాజు వేట కోసం వచ్చి అలిసిపోయి తనతో వచ్చిన వాళ్ళనుంచి తప్పిపోయి ఒక చెట్టుక్రింద గుఱ్ఱాన్ని చెట్టుకుకట్టి కూర్చున్నాడు. ఇంతలో ఒక ఆటవికుడు

నాలుగువేల కిరాత సైన్యంతో వచ్చి రాజుమీద యుద్ధానికి వచ్చాడు. అదే సమయంలో ఆ రాజులోంచి ఒక స్త్రీ వచ్చి వాళ్ళందర్నీ చంపేసింది.

కాని ఇదంతా రాజుకి అర్థంకాక గుఱ్ఱమెక్కి వామదేవుడు ఆశ్రమానికి వెళ్ళి జరిగింది చెప్పి ఇదంతా ఏమిటని అడిగాడు. రాజా! నువ్వు పూర్వ జన్మలో శూద్రుడివి. కాని బ్రాహ్మణులని గౌరవించి వాళ్ళు చెప్పినట్లు శ్రావణ శుద్ధ ద్వాదశినాడు బుద్ధవ్రతం చేశావు. ఈ జన్మలో క్షత్రియుడుగా పుట్టడానికి, రాజ్యం రావడానికి ఇప్పుడు జరిగినదానికి అదే కారణం. స్త్రీ రూపంలో వచ్చి శత్రువుల్ని చంపింది కూడా ఆ బుద్ధ దేవతే అని చెప్పాడు వామదేవుడు.

అయోధ్యరాజైన శల్యుడు వేటకి వెళ్ళి ఒక మృగం దొరక్క రథం మీద తిరుగుతుండగా సారథి గుఱ్ఱాలు అలిసిపోయాయి ఇంక తిరగలేవని చెప్పాడు. వాళ్ళు వామదేవుడినడిగి పనయిపోగానే ఇచ్చేస్తామని చెప్పి గుఱ్ఱాలు తెచ్చుకుని తిరిగి ఇవ్వకుండా ఇంటికి వెళ్ళిపోయారు.

వామదేవుడు అడిగినా శల్యుడు గుఱ్ఱాలు ఇవ్వలేదు, నువ్వు నా ధనాన్ని ఎత్తుకుపోయావు కాబట్టి రాక్షసుల చేతుల్లో చస్తావని శల్యుణ్ణి శపించాడు వామదేవుడు. అలాగే రాక్షసులు ఆ రాజుని చంపేశారు.

తర్వాత శల్యుడి తమ్ముడు తలుడు రాజయ్యాడు. తలుడు కూడా వామదేవుడి గుఱ్ఱాలు తిరిగి ఇవ్వక అడిగినందుకు వామదేవుణ్ణి చంపడానికి విషంతో వున్న బాణాన్ని వేశాడు. వామదేవుడు కోపంతో ఈ బాణం నీ కొడుకుని చంపుతుందన్నాడు. అది అలాగే చేసింది. తలుడు మళ్ళీ బాణం తియ్యబోతే అతడి చెయ్యి కదల్లేదు. తలుడు బ్రతిమాలుకున్నాడు. అతడి భార్య పరుగెత్తుకు వచ్చి వామదేవుడి కాళ్ళమీద పడి క్షమించమని భర్తని మంచివాడుగా చేసి కొడుకుని బ్రతికించమని అడిగింది.

వామదేవుడు అలాగే చేసి తన గుఱ్ఱాలన్నీ తీసుకుని వెళ్ళిపోయాడు.

కోసలరాజయిన వసుమనుడు వామదేవ మహర్షిని రాజధర్మాల గురించి చెప్పమని అడిగాడు.

రాజా! ధర్మాన్ని మించిన వస్తువే లేదు. ధర్మప్రవర్తన ఉన్న రాజులందరూ చక్రవర్తులౌతున్నారు. ధనంకంటే ధర్మాన్ని ఎక్కువగా ఏ రాజు చూస్తాడో ఆ రాజ్యం బాగుంటుంది.

ధర్మం, దుర్గాన్ని సంరక్షించుకోవడం, యుద్ధం చేయ్యడంలో నేర్పరితనం, రాచకార్యాల్ని వివేకంతో విచారించడం, ప్రజలు సుఖంగా వుండేలా పాలించడం ఈ అయిదు వుంటే చాలు అని రాజధర్మాల్ని చెప్పాడు వామదేవుడు.

దశరథమహారాజు ఆజ్ఞ ప్రకారం సీతారామలక్ష్మణులు అడవికి వెడుతుండగా అయోధ్య వాసులంతా ఏడుస్తూ రాముడి వెనకాల బయలుదేరారు. ఎంత చెప్పినా వినలేదు.

వామదేవుడు అయోధ్య వాసుల్ని ఉద్దేశించి ఇలా చెప్పాడు. శ్రీరాముడు ఆదినారాయణుడు, సీతమ్మ ఆదిమహాలక్ష్మి, లక్ష్మణుడు శేషావతారం.

విష్ణుమూర్తి మొదట మత్స్యావతారం, తర్వాత కుర్మావతారం, వరాహావతారం, నృసింహావతారం, వామనావతారం, పరశురామావతారం ఎత్తి రాక్షసుల్ని దుష్టుల్ని ఎలా నాశనం చేశాడో ఇప్పుడు శ్రీరాముడిగా అవతారం ఎత్తి రావణుడు మొదలైన రాక్షసుల్ని చంపడానికి వెడుతున్నాడు.

మీరు శ్రీరాముణ్ణి ఆశీర్వదించి పంపించాలేగాని, ఇలా ఏడుస్తూ పంపిస్తే ఆయన ఏ పనికోసం అవతారమెత్తి మన దగ్గరికి వచ్చాడో ఆపని నిర్విఘ్నంగా జరగదని నచ్చ చెప్పి వెనక్కి పంపాడు.

పూర్వం సుబాహుడు అనే రాజు నారాయణ ధ్యానం చేస్తూండేవాడు. జైమిని మహర్షి రాజా! దానాలు చేయ్యకపోతే ఆకలి బాధ కలుగుతుంది. ప్రతి మనిషి దానం తప్పకుండా చెయ్యాలని చెప్పినా వినలేదు సుబాహుడు.

సుబాహుడు చనిపోయాక వైకుంఠం చేరాడు కాని అక్కడ తిండిలేక బాధలు పడ్తుంటే వామదేవుణ్ణి ప్రార్థించాడు. వామదేవుడు సుబాహుణ్ణి ధ్యానం ఉన్నా దానం తప్పదని చెప్తే నువ్వు వినలేదు. అన్నదానం అన్నింటికన్నా ముఖ్యమని చెప్తే అదీ చెయ్యలేదు. అందుకే ఇప్పుడు అనుభవిస్తున్నావు అన్నాడు.

ఈ బాధ కలగకుండా వుండాలంటే ఏఏ దానాలు చెయ్యాలనడిగాడు సుబాహుడు. అన్నదానం, ఉదకదానం, ఉదకపాత్ర దానం, భూదానం, గోదానం, సువర్ణ దానం, ఛత్ర దానం, ఉపాసహదానం అని వామదేవుడు చెప్పాడు.

ఇప్పుడు ఈ బాధ ఎలా తీరుతుంది అని అడిగాడు సుబాహుడు.

నువ్వు నీ భార్యతో సహా రోజూ భూలోకం వెళ్ళి మీ శవాలు అక్కడే వున్నాయి, తిని బ్రతకండి. ఏ రోజయితే శుకరాజు చెప్పిన వాసుదేవ స్తోత్రం వింటారో ఆరోజు మీకు పాపం నశిస్తుందని చెప్పి, శుకరాజుతో అతని కొడుక్కి వాసుదేవస్తోత్రం వినిపించి దాన్ని సుబాహు భార్యతో సహా వినేటట్లుగా చేసి వాళ్ళకి మంచి జరిగిలా చేశాడు. సుబాహుడికి భార్యకి శ్రీమహావిష్ణువు దర్శనం కలగడానికి కారకువయ్యాడు వామదేవుడు.

ఈరకంగా వామదేవ మహర్షి భక్తియుక్తులయిన మహర్షులకి తరుణోపాయాలు చెప్తూ లోక కళ్యాణం కోసమే జీవించిన ధన్యుడు.

వామదేవ మహర్షి కథ చదివారు కదా!!

ఏ మహర్షిని గురించి చదివినా అందులో మంచిని తెలుసుకుని ఆచరణలో పెట్టాలన్నదే మన ఆశయం..... !

# 75. వాల్మీకి మహర్షి

**పి**ల్లలూ! ఇప్పుడు మనం వాల్మీకి మహర్షి గురించి తెలుసుకుంటున్నాం..... అప్పుడే మీరు తెలిసిపోయినట్లు ముఖం పెట్టేస్తున్నారు. ఓహో! రామాయణం రాసినాయనా! సరిగ్గానే చెప్పారు. ఇప్పుడు మనం పూర్తిగా వాల్మీకి మహర్షి గురించి తెలిసేసుకుంటున్నాం.

వాల్మీకి తండ్రి బ్రహ్మమానస పుత్రుడైన ప్రచేతసుడు. వాల్మీకి అసలు పేరు ప్రాచేతసుడు. చిన్నప్పుడే తండ్రి శాపం వల్ల బోయ కులంలో కిరాతకుడుగా పుట్టాడు. మళ్ళీ అయ్యో పాపం అనుకుని తండ్రి నీకు మహాపురుషులు కొంతమంది దివ్యమంత్రం ఉపదేశిస్తారు. అప్పుడు మంచివాడయిపోతావని శాప విమోచనం కూడా చెప్పాడు.

తమసా నదీ తీరంలో ఒక మహారణ్యంలో ఒక కిరాతకుడు జంతువుల్ని చంపిన మాంసంతోనూ, దారి కాచి వచ్చిపోయే వాళ్ళ దగ్గర ధనం ఎత్తుకుపోయి భార్యా పిల్లల్ని పోషిస్తున్నాడు.

ఒకసారి సప్తమహర్షులు దారి తప్పి అరణ్యంలో తిరుగుతూ చచ్చిన జంతువులు, గ్రద్దలు, మాంసం ముక్కలు, వాటికోసం పోట్లాడుకుంటున్న వేట కుక్కలు వున్న ప్రాంతానికి వచ్చారు.

కిరాతకుడు వాళ్లని అడ్డగించి వాళ్ళ దగ్గరున్న ధనం ఇవ్వమన్నాడు. వాళ్ళు మా దగ్గరేముందిరా నీకివ్వడానికి? అయినా ఇన్ని కిరాతకాలు చేసి సంపాయిస్తున్నావు ఎన్నాళ్ళు బ్రతుకుతావు? ఏం పట్టుకు వెడతావు? అన్నారు.

నాకోసం కాదు నా భార్య పిల్లల కోసం చేస్తునానన్నాడు కిరాతకుడు. నీ భార్య పిల్లలు నువ్వు తెచ్చిపెడితే తింటారు కానీ, నీ పాపంలో భాగం పంచుకోరు. ఈ పాపమంతా నువ్వే అనుభవించాలి. నువ్వు తీసికెళ్ళిన సొమ్ము వాళ్ళు తింటారు. ఎందుకురా! ఇంత పాపం మూటకట్టుకుంటున్నావు! అన్నారు.

బోయవాడు అయ్యా! ఈ విషయం నాకు తెలియదు. నేను పెట్టిన దానితోపాటు నా పాపంలో కూడ భాగం పంచుకుంటారనుకున్నాను. ఎంతో తప్పు చేశాను. ఇప్పుడు నేను ఏం చేయ్యాలి? అన్నాడు.

సప్త ఋషులు ఆ కిరాతకుణ్ణి స్నానం చేసి రమ్మని శ్రీరామ మంత్రాన్ని ఉపదేశించారు. కాని అతడికి పలకడం చాతకాలేదు. అందుకుని 'మరా మరా' అనమని చెప్పి వెళ్ళిపోయారు.

ఆ కిరాతకుడు దంపలు పళ్ళు తింటూ ఆ ఋషుల్ని తల్చుకుంటూ వాళ్ళు చెప్పినట్లే ధ్యానం చెయ్యడం మొదలుపెట్టాడు. ఎవరొచ్చి పిల్చినా వెళ్ళలేదు. బోయకులం వాళ్ళంతా వీడికి బ్రహ్మరాక్షసి పట్టిందేమోనని వదిలేశారు.

అతడు గొప్ప తేజస్సుతో వెలిగిపోతున్నాడు. ఇంద్రుడు ఎంతమందిని పంపించినా మనిషి కదలలేదు. అక్కడ జనసంచారం లేకపోవడంతో అతడి చుట్టూ పుట్టలు పెరిగిపోయి

నల్లత్రాచులు, తీగలు పెరిగి పక్షులు గూళ్ళు కట్టుకుని, క్రూర జంతువులు తిరుగుతూ వున్నాయి. అయినా అతని ఆత్మ 'రామ' శబ్ద ధ్యానంతో నిండిపోయింది.

సప్త ఋషులు తిరిగివస్తూ మారిపోయిన ఆ ప్రదేశాన్ని చూసి ఆశ్చర్యపోయి ఎవరో మహానుభావుడు తపస్సు చేసుకుంటున్నాడనుకుని అంతలోనే జ్ఞాపకం తెచ్చుకుని అతణ్ణి పిలిచారు. ప్రాచేతసుడు శాపవిమోచనమయి వాళ్ళకి నమస్కారం చేశాడు. నువ్వు ఇప్పుడు మా అంతటి వాడివయ్యావు అని చెప్పి వెళ్ళిపోయారు సప్తఋషులు.

వాల్మీకుడు బ్రహ్మదీక్షలో ఉండగా విష్ణుమూర్తి శ్రీరాముడి రూపంలో ప్రత్యక్షమయ్యాడు. వాల్మీకి శ్రీరాముణ్ణి స్తోత్రం చేశాడు. శ్రీరాముడు నువ్వు నా చరిత్ర రాస్తే నాకు ఆనందం, నీకు కీర్తి, మోక్షం కలుగుతాయని ఆశీర్వదించాడు.

వాల్మీకి గంగా తీరంలో ఆశ్రమం ఏర్పాటు చేసుకుని అనేకమంది శిష్యుల్తో భూత భవిష్యత్తు వర్తమానాలు తెలుసుకుని జీవిస్తున్నాడు.

రాముడు లోకుల అపవాదుకి భయపడి సీతని అరణ్యంలో వదలేసినప్పుడు వాల్మీకి రక్షించి, ఆమెకి పుట్టిన కుశలవుల్ని అల్లారు ముద్దుగా పెంచి విద్యాబుద్ధులు నేర్పించాడు.

ఒకసారి వాల్మీకి శిష్యుల్ని తీసుకుని తమసా నదీ తీరానికి వెళ్ళి స్నానం చేస్తూ పక్షుల జంటని చుశాడు. కిరాతకుడొకడు అందులో ఒక పక్షిని కొట్టాడు. మగపక్షి కిందపడి చచ్చిపోయింది. ఆడపక్షి ఏడుస్తోంది.

వాల్మీకి అది చూసి బాధపడి ఒక శ్లోకంతో ఆ కిరాతకుణ్ణి శపించాడు. ఆ శ్లోకాన్ని భరద్వాజుడు చక్కగా పలికి గురువయిన వాల్మీకికి వినిపించాడు.

వాల్మీకి తన శోకం, శ్లోకంగా రావడమేమిటా! అని అంతా ఈశ్వరేచ్ఛ అనుకుంటూ స్నానం పూర్తి చేసి వెళ్ళిపోయాడు.

ఒకనాడు బ్రహ్మదేవుడు వాల్మీకి దగ్గరకి వచ్చాడు. వాల్మీకి బ్రహ్మని పూజించి ఆజ్ఞాపించండి నేనేం చెయ్యాలో! అన్నాడు.

నువ్వు చెప్పిన శ్లోకం సరస్వతీ దేవి నా కోరిక ప్రకారం చెప్పించింది. నువ్వు రామకథ రాయడం మొదలుపెట్టు. అంతేకాదు నువ్వు రాసిన రామాయణం ఎంతవరకూ లోకంలో వుంటుందో అంతవరకూ నీకూ అన్ని లోకాల్లోనూ తిరగగల శక్తి, ఏదనుకుంటే అది జరిగేలా, ఎప్పుడనుకుంటే అప్పుడు మోక్షం పొందేలా వరం ఇస్తున్నాను అన్నాడు బ్రహ్మ.

శిష్యులు తను పలికిన మొదటి శ్లోకాన్ని రాగయుక్తంగా చదువుతుంటే విని ఆనందంతో వాల్మీకి దర్భాసనం మీద పద్మాసనం వేసుకుని యోగధ్యానంలోకి వెళ్ళి రామాయణం మొత్తం చూసి శ్రీరామ జననం మొదలు పట్టాభిషేకం వరకు, ఉత్తరకాండతో కలిపి ఇరవై నాలుగు వేల శ్లోకాలు ఎంతో మధురంగా, మనోహరంగా రాశాడు.

ఆ మనోహరగాథని కుశలవులకి నేర్పించాడు. ఆ కవలలు ముని సభల్లో పాడుతుంటే విని ఆనందించని వాళ్ళూ, దాన్ని తప్పుపట్ట కల్గిన వాళ్ళూ లేరు.

నైమిశారణ్యంలో శ్రీరాముడు అశ్వమేధ యాగం చెయ్యడం మొదలుపెట్టి ఒక సంవత్సరం అయింది. వాల్మీకి తన శిష్యుల్ని వెంట పెట్టుకుని అశ్వమేధ యాగం చూడ్డానికి వెళ్ళాడు. వెళ్ళేటప్పుడు కుశలవుల్ని పిలిచి రాజమార్గాల్లోనూ, రాజ భవనాల్లోనూ, బ్రాహ్మణ సభల్లోనూ, రాముడి భవన ద్వారం దగ్గర ఎవరడిగినా ఎప్పుడడిగినా రామాయణ గానం చెయ్యండి. ఎవరు పెట్టినా ఏమీ తినకండి. మీరు ఎవరి పిల్లలు? అని అడిగితే వాల్మీకి మహర్షి శిష్యులమని చెప్పండి అని చెప్పాడు వాల్మీకి.

శ్రీరాముడు కుశలవుల్ని పిలిపించుకుని రామయణగానం ఇరవై సర్గలు విన్నాడు. వాళ్ళకి మణి మణిక్యాలు ఇవ్వబోతుండే మేము కాయలు, పళ్ళు, దుంపలు తిని బ్రతుకుతాం. మాకివన్నీవద్దన్నారు కుశలవులు. మొత్తం రామాయణం ఎన్ని సర్గలని అడిగాడు రాముడు.

కుశలవులు 500 సర్గలు, ఇరవై నాలుగువేల శ్లోకాలని చెప్పారు. మిగిలిన కథ కావాలంటే మీ యాగం అయిపోయాక వినిపిస్తామని చెప్పారు.

రాముడు వాళ్ళగానం విన్నాక వాళ్ళు తన కొడుకులే అని తెలుసుకుని వాల్మీకి మహర్షిని సీతతో వచ్చి సభలో చెప్పమన్నాడు.

వాల్మీకి సీతని, కుశలవుల్ని తీసుకుని వచ్చి నిండు సభలో సీత క్షేమంగా వుందనీ, ఆమె పిల్లలే ఈ కవలలనీ ఇది సత్యం కాకపోతే తనకున్న తపశ్శక్తి నానశనమయిపోతుందనీ సభలో చెప్పాడు.

సీత పడ్డ కష్టాలు విని సీతను చూడగానే ప్రజలంతా ఏడ్చేశారు.

శ్రీరాముడు సీతతో కూడా శపథం చేయించమని వాల్మీకిని ప్రార్థించాడు. సీత కూడ మూడుసార్లు శపథం చేసి తనని తీసుకు పొమ్మని భూదేవి అయిన తన తల్లిని ప్రార్థించింది.

వెంటనే భూమిలోంచి రత్నసింహాసనం వచ్చి సీతను కూర్చోపెట్టుకుని తీసికెళ్ళిపోయింది.

దుఃఖపడుతున్న రాముడికి బ్రహ్మాది దేవతలు సీతారాముల అసలు కథ చెప్పి వెళ్ళిపోయారు. శ్రీరాముడు వాల్మీకిని పూజించి అశ్వమేధ యాగం పూర్తి చేసి కుశలవుల్ని తీసుకుని అయోధ్యకి వెళ్ళాడు.

వాల్మీకి మహర్షి శ్రీమద్రామయణాన్ని రాసి, పిల్లల్తో గానం చేయించి, తాను మోక్షం పొంది, అది చదివిన వాళ్ళకి, విన్నవాళ్ళకి కూడా మోక్షం వచ్చేలా అనుగ్రహించి, రఘువంశాన్ని ఉద్ధరించిన మహానుభావుడు.

వాల్మీకి మహర్షి కథ చదివితే రామాయణం చదివితే వచ్చేంత పుణ్యమే వస్తుంది.

అద్భుతంగా వుంది కదర్రా వాల్మీకి మహర్షి కథ !!

# 76. విపుల మహర్షి

**మ**నం విపుల మహర్షి గురించి తెల్సుకుందాం. విపుల మహర్షి గొప్ప గురుభక్తి కలవాడు. అయినా మీరే తెల్సుకుంటారు కదా! పలకరించండి మరి.

భృగువంశంలో పుట్టాడు విపులుడు. అతడు దేవశర్మ అనే గురువుగారి దగ్గర విద్యలు నేర్చుకున్నాడు. అతని శ్రద్ధ భక్తి, వినయం, విధేయత, గుణం అన్నీ చూసి దేవశర్మకి విపులుడంటే చాలా యిష్టం.

దేవశర్మ భార్య చాలా అందగత్తె. ఆమెపేరు రుచి, మహాపతివ్రత. ఆమె అందాన్ని చూసిన ఇంద్రుడు దేవశర్మ లేకుండా ఎప్పుడు ఆశ్రమానికి వద్దామా అని చూస్తున్నాడు. దేవశర్మకి ఆ విషయం తెలిసి రుచిని చాలా జాగ్రత్తగా చూస్తున్నాడు.

ఒకనాడు దేవశర్మ వేరే గ్రామం వెళ్ళాల్సివచ్చి విపులుణ్ణి పిలిచి సంగతి చెప్పి తన భార్యని జాగ్రత్తగా చూసుకోమని, ఇంద్రుడు ఏ రూపంలోనయినా రావచ్చని చెప్పాడు. దేవశర్మ వెళ్ళగానే ఇంద్రుడు వచ్చాడు. రుచి ఎవరో వచ్చారనుకుని ఏం పని మీద వచ్చారనడిగింది.

వెంటనే విపులుడు గురుపత్నిలో ప్రవేశించి ఆమె శరీరం కదలకుండా చేశాడు. ఇంద్రుడు ఎన్ని సైగలు చేసినా ఆమెలో చలనం లేదు. ఇంద్రుడు సిగ్గుపడి మళ్ళీ మళ్ళీ పలకరించాడు. ఆమె నోటి నుండి నువ్వెందుకొచ్చావు ఫో! అని మగాడి గొంతుతో విన్పించింది.

ఇంద్రుడికి అప్పుడర్థమయింది. వెంటనే విపులుడు బయటికి వచ్చి వెంటనే వెళ్ళకపోతే ఇక్కడే భస్మం చేస్తానని చెప్పగానే ఇంద్రుడు వెళ్ళిపోయాడు. రుచికి విషయం తెలిసి విపులుణ్ణి అభినందించింది. దేవశర్మ రాగానే జరిగింది చెప్పాడు విపులుడు. దేవశర్మ శిష్యుణ్ణి మెచ్చుకుని ఏం కావాలో కోరుకోమన్నాడు.

విపులుడు గురుదేవా! ఎప్పుడూ ధర్మకార్యాలు చేస్తూ, బుద్ధి భగవంతుడి మీదే వుండేటట్లు అనుగ్రహించమన్నాడు.

విపులుడు గురువు అనుమతి తీసుకుని వేరేచోట ఆశ్రమం ఏర్పాటు చేసుకుని తపస్సులో మునిగిపోయాడు. కొంతకాలం తర్వాత అతని తపశ్శక్తితో భూలోకంలోనూ, స్వర్గలోకంలోనూ కూడా స్వేచ్ఛగా తిరగ్గలిగే శక్తిని పొందాడు విపులుడు.

రుచి ఒకసారి తన అక్క ఇంటికి బయల్దేరి వెడుతూ వుంటే ఒక అప్సరస విడిచి వెళ్ళిన దేవ కుసుమాలు దొరికతే తల్లోపెట్టుకుంది. అవి చూసి ఆమె ఆక్క కూడా అలాంటి పువ్వులు కావాలని అడిగింది రుచిని.

గురువు ఆజ్ఞ ప్రకారం తపశ్శక్తితో విపులుడు అలాంటి పువ్వులు తీసికొస్తుండగా ఇద్దరు మనుషులు ఏదో గొడవ పడుతూ కనిపించారు. ఇంకా కొంత దూరం వెళ్ళాక నలుగురు మనుషులు పాచికలాడుకుంటూ కనిపించారు. ఆ పువ్వులు గురుపత్నికిచ్చాడు విపులుడు.

గురువుగార్ని తాను చూసిన మనుషుల గురించి అడిగాడు విపులుడు. నువ్వు మొదట చూసిన ఇద్దరు అహోరాత్రులు, తర్వాత చూసినవాళ్ళు ఋతువులు. మనిషి తాను చేసిన పాప పుణ్యాలు ఎవరు చూడట్లేదనుకుంటాడు. కాని ఆహోరాత్రులు, ఋతువులు వాటిని గమనిస్తూనే వుంటాయి అని చెప్పాడు దేవశర్మ.

ఇప్పుడు నీకు కనిపించడానికి కారణం నువ్వు గురుపత్నిని రక్షించినప్పుడు మంచి పని కోసమే గురుపత్నిలో ఆవహించావు. కాని అది తప్పే కాబట్టి వాళ్ళు నీకు కనపించారు.

ఆ దోషం లేకుండా నేను నీకు వరమిస్తున్నానని దేవశర్మ విపులుడికి వివరంగా చెప్పాడు. గురువాజ్ఞ తీసుకుని తపస్సు చేసుకునేందుకు వెళ్ళిపోయాడు విపుల మహర్షి.

ఇదర్రా విపుల మహర్షి కథ!!

# 77. విశ్రవస మహర్షి

**ర**ండర్రా! ఇప్పుడు మనం తెలుసుకోబోయే మహర్షి. ఎవరంటే విశ్రవస మహర్షి. ఆయన్నే విశ్రవో బ్రహ్మ అనికూడా అంటారన్నమాట. మొదలు పెట్టి చదవండింక....!

విశ్రవోబ్రహ్మ తండ్రి పులస్త్యుడు. తల్లి తృణబిందు. విశ్రవోబ్రహ్మ పుట్టడం గమ్మత్తుగా జరిగింది.

పులస్త్యుడు బ్రహ్మ కుడిచెవి నుంచి పుట్టాడు. గొప్ప తపశ్శాలి, జ్ఞానవంతుడు. అన్నింటిలోనూ బ్రహ్మగారితో సమానంగా వుండేవాడు.

ఒకసారి పులస్త్యుడు తృణబిందుడి ఆశ్రమంలో తపస్సు చేసుకుంటున్నాడు. అతని కుమార్తె చెలికత్తెల్తో అక్కడ తిరుగతూ దర్భాసనం మీద కూర్చుని తపస్సు చేసుకుంటున్న పులస్త్యుణ్ణి చూసింది. వెంటనే ఆమె గర్భవతయింది.

ఆ మహర్షిని చూడగానే గర్భం వస్తుందన్న శాపం విషయం ఆమెకి తెలియక తండ్రికి తన పరిస్థితి చెప్పింది. తృణబిందుడు మహర్షి దగ్గరకివెళ్ళి విషయం చెప్పి ఆమెని పెళ్ళి చేసుకోమన్నాడు.

తృణబిందుని కూతుర్ని పులస్త్యుడు పెళ్ళి చేసుకున్నాడు. ఆమె అందం, వినయం చూసి పులస్త్యుడు నీకు గొప్పవాడైన కొడుకు పుడతాడని చెప్పాడు.

రెండు వంశాల్ని ఉద్ధరించకలిగిన కొడుకు విశ్రవోబ్రహ్మ ఒక మంచి ముహూర్తంలో పుట్టాడు. తల్లి కడుపులో వుండగానే తండ్రి పులస్త్యుడు చదివే శ్రుతులన్నీ విన్నాడు. కనుక అతడికి "విశ్రవోబ్రహ్మ" అని పేరు పెట్టారు.

విశ్రవోబ్రహ్మ శుక్లపక్ష చంద్రుడిలా పెరుగుతూ తండ్రిలాగే వేదవిద్యలు నేర్చుకుని, గొప్ప తపశ్శక్తిని కూడా పొందాడు. బ్రహ్మచర్యం, ధర్మం, వైరాగ్యం, శాంతం, ఆచారం, కృపాగుణము అన్నీ కలబోసి పుట్టిన విశ్రవసుడు తల్లిదండ్రుల అనుమతి తీసుకుని తపస్సు చేసుకుందుకు వెళ్ళాడు.

కొంతకాలం తర్వాత తండ్రిని మించిన తనయుడిగా పేరుపొంది దేవవర్ణిని పెళ్ళిచేసుకుని కుబేరుణ్ణి పొందాడు. కైకసిని చేసుకుని రావణ, కుంభకర్ణ, విభీషణ, శూర్పణఖల్ని మూడవ భార్య కైకసి చెల్లెలు పుష్పాకి మహోదర మహాపార్శ్వాదులు పుట్టారు. నాల్గవ భార్య కైకసి రెండవ చెల్లెలు అయిన రాకకి ఖరదూషణుడు త్రిశిరుడు పట్టారు.

కుబేరుడంతటి ధనవంతుణ్ణి, రావణుడంతటి శివభక్తుణ్ణి, విభీషణుడంతటి ధర్మపరాయణుణ్ణి పొందిన విశ్రణ్ణి ఎంతగొప్ప వాడో మరి వసు.

ఇదర్రా విశ్రవస మహర్షి కథ !!

# 78. విశ్వామిత్ర మహర్షి

**ఆ**మ్మో! అప్పుడే వచ్చేశారా! రానురాను మీకు కూడా మహర్షుల కథల మీద చాలా ఇష్టం పెరిగిపోయింది, చుశారా! మీక్కూడ చాలా విషయాలు తెలుసుకోవాలనే వుంటుంది. కానీ... సమయం తక్కువ. ఒకవైపు స్కూలు చదువు, ఒక వైపు టి.వి. రెండోదాన్ని కొంచెం వదులుకుంటే మనం చాలా విషయాలు పుస్తకాలు చదవడం ద్వారా తెలుసుకోవచ్చు.

ఇప్పుడు మనం తెలుసుకోబోయే మహర్షి ఎవరో ఊహించండి చూద్దాం:– టైము వేస్టేందుకు చెప్పెయ్యనా సరే! ఇప్పుడు మనం తెలుసుకోబోయే మహర్షి విశ్వామిత్రుడు.

భృగువంశం వాడయిన ఋచీక మహర్షి గాధిరాజుని అతని కూతురు సత్యవతినిచ్చి పెళ్ళి చేయ్యమన్నాడు. గాధిరాజు తెల్లటి రంగుతో, నీలరంగు చెవులున్న గుఱ్ఱాల్ని తెస్తే చేస్తాన్నాడు. ఇదంతా మీరు ఋచీక మహర్షి కథలో తెలుసుకున్నారు కదా. ఋచీక మహర్షి భార్య సత్యవతికి, ఆమె తల్లికి పిల్లల కోసం బ్రాహ్మ రాజమంత్రాల్తో రెండు పాత్రలిస్తే ఇద్దరూ మార్చుకుంటారూ.... గుర్తొంచిందా అలా విశ్వామిత్రుడు గాధిరాజుకు పుట్టాడు.

విశ్వామిత్రుడు చిన్నప్పటినుండి రాజభోగాల్తో అల్లారు ముద్దుగా పెరుగుతూ కృశాశ్వుడి దగ్గర అనేక అస్త్రశస్త్రాల ప్రయోగాల్ని గురించి తెలుసుకుని గొప్ప విలుకాడయ్యాడు.

కొంతకాలం తర్వాత విశ్వామిత్రుడి తండ్రి గాధిరాజు చనిపోయాక విశ్వామిత్రుడు కన్యాకుబ్జానికి రాజయి ధర్మసహితంగా ప్రజారంజకంగా పాలించాడు.

కొన్నివేల సంవత్సరాలు రాజ్యం చేశాక ఒకనాడు సైన్యసమేతంగా అడవికి వేటకోసం వెళ్ళి బాగా అలసిపోయి దగ్గర్లో వున్న వసిష్ఠుడి ఆశ్రమానికివచ్చాడు.

విశ్వామిత్రుణ్ణి గౌరవించి అతడికి అతని సైన్యానికి కూడ అతిథి మర్యాదలు చేసి అందరికీ భోజనం పెట్టాడు వసిష్ఠుడు.

అంతమందికి వసిష్ఠుడు భోజనం పెట్టగలిగాడు అంటే దానికి కారణం అతని దగ్గరున్న కామధేనువే అని తెలుసుకుని దాన్ని తనకిమ్మని అడిగాడు విశ్వామిత్రుడు. వసిష్ఠుడు అందుకు ఇష్టపడలేదు.

విశ్వామిత్రుడు బలవంతంగా కామధేనువుని తీసుకుని వెళ్ళిపోతుంటే అది వసిష్ఠుడికేసి దీనంగా చూసింది. అప్పుడు వసిష్ఠుడు అతని దగ్గర సైన్యముంది, నాకు నువ్వు తప్ప ఏముంది? నిన్ను నువ్వు రక్షించుకోవడానికి అనుమతిస్తున్నానన్నాడు.

వెంటనే కామధేనువులోంచి వేలవేల సైనికులు పుట్టి విశ్వామిత్రుడి సైన్యాన్ని నాశనం చేశాయి. దీన్ని భరించలేక విశ్వామిత్రుడు రాజ్యం వేరేవాళ్ళకిచ్చి హిమాలయాలకెళ్ళి శివుణ్ణి గురించి తపస్సు చేశాడు.

శివుడు ప్రత్యక్షమై విశ్వామిత్రుడికి కావలసిన అస్త్రాలు శస్త్రాలు అన్నీ ఉపదేశించాడు.

విశ్వామిత్రుడు మళ్ళీ వసిష్ఠుడి మీద యుద్ధానికి వెళ్ళాడు. వసిష్ఠుడి మీద ఎన్ని శస్త్రాస్త్రాలు వేసినా అవి పని చేయ్యలేదు. చివరికి బ్రహ్మాస్త్రం వేశాడు. వసిష్ఠుడు దాన్ని మింగేసి బ్రహ్మ తేజస్సుతో వెలిగిపోయాడు.

బ్రహ్మత్వం ముందు క్షత్రియ బలం పనికిరాదని బ్రహ్మత్వం పొందాలని నిర్ణయించుకుని తపస్సు ప్రారంభించాడు విశ్వామిత్రుడు. బ్రహ్మ ప్రత్యక్షమై రాజర్షిత్వం ఇచ్చి అదృశ్యమయ్యాడు.

ఇక్ష్వాకువంశం రాజయిన త్రిశంకుడు వసిష్ఠుడి శాపం వల్ల స్వర్గానికి వెళ్ళడానికి లేక విశ్వామిత్రుణ్ణి ఆశ్రయించాడు. విశ్వామిత్రుడు యాగం చేసి త్రిశంకుణ్ణి స్వర్గానికి పంపాడు. కాని ఇంద్రుడు అతడ్ని స్వర్గంలో ఉండడానికి అర్హుడు కాదని తలక్రిందులుగా తోయించాడు.

అది చూసిన విశ్వామిత్రుడు అతని కోసం వేరే స్వర్గాన్ని సృష్టించాడు దాన్నే 'త్రిశంకు స్వర్గం' అంటారు. అది విశ్వామిత్ర సృష్టి!

ఒకసారి అంబరీషుడు యజ్ఞం చేస్తుంటే ఇంద్రుడు యజ్ఞ పశువుని దాచేశాడు. మునులు నరపశువయినా ఫర్వాలేదన్నారు. అంబరీషుడు లక్ష అవుల్ని తీసుకుని ఎవరేనా తన యజ్ఞానికి పశువుగా వస్తాడేమో అని అడుగుతుండగా ఋచీకుడు తన కొడుకు శునశ్శేపుడ్ని పంపాడు.

శునశ్శేపుడు పారిపోయి విశ్వామిత్రుడ్ని రక్షించమని శరణు కోరాడు. విశ్వామిత్రుడు శునశ్శేపుడికి రెండు మంత్రాలు చెప్పి పంపాడు. బలిపశువుగా బలి ఇచ్చే సమయానికి ఆ రెండు మంత్రాలు శునశ్శేపుడు పలకగానే ఇంద్రాది దేవతలూ వచ్చి అతడికి దీర్ఘాయుష్షు, అంబరీషుడికి యాగఫలం ఇచ్చి వెళ్ళిపోయారు.

విశ్వామిత్రుడు ఏమయినా సరే ఋషిత్వం, మహర్షిత్వం, బ్రహ్మర్షిత్వం పొందాలనుకున్నాడు. వెంటనే పుష్కర నదీ తీరానికి వెళ్ళి వేల సంవత్సరాలు తపస్సు చేసి బ్రహ్మను మెప్పించి రాజర్షి అయ్యాడు.

హిమాలయ ప్రాంతానికి వెళ్ళి వేల సంవత్సరాలు తపస్సు చేసి బ్రహ్మదేవుడితో మహర్షిత్వాన్ని పొంది విశ్వామిత్ర మహర్షయ్యాడు.

అక్కడి నుంచి తూర్పు దిక్కుకి వెళ్ళి చాలా సంవత్సరాలు కదలకుండా తపస్సు చేశాడు. ఆ ప్రదేశాన్ని 'సిద్ధాశ్రమ'మంటారు.

ఇంక ఆయన తపస్సు తీవ్రతకి తట్టుకోలేక బ్రహ్మగారు విశ్వామిత్రుడికి బ్రహ్మర్షిత్వం, దీర్ఘాయుష్షు, బ్రహ్మతేజం ఇచ్చేశాడు.

విశ్వామిత్రుడికి మాత్రం వసిష్ఠుడు ఒప్పుకుంటేనే కాని తాను బ్రహ్మర్షి కాదని అనుకుని వసిష్ఠుడి దగ్గరికి వెళ్ళాడు. ఏమయ్యా 'ఋషీ'! రా! అన్నాడు వసిష్ఠుడు.

విశ్వామిత్రుడు వెళ్ళిపోయి కొంతకాలం తర్వాత మళ్ళీ వచ్చాడు. వసిష్ఠుడు ఏమయ్యా 'రాజర్షీ'! అన్నాడు.

విశ్వామిత్రుడు వెళ్ళిపోయి మళ్ళీ కొంతకాలం తర్వాత వచ్చాడు. వసిష్ఠుడు ఏమయ్యా 'బ్రహ్మర్షీ'! అన్నాడు. ఎంతో ఆనందంతో వసిష్ఠుడ్ని పూజించాడు విశ్వామిత్రుడు. వాళ్ళిద్దరూ స్నేహితులయిపోయారు.

ఒకసారి ఇంద్రుడు సభలో అందర్నీ అసలు అబద్ధం చెప్పనివాడున్నాడా? అనడిగాడు. అందరూ హరిశ్చంద్రుడున్నాడన్నారు. కానీ విశ్వామిత్రుడు ఏమయినా సరే హరిశ్చంద్రుడితో అబద్ధం చెప్పించాలని చూశాడు. ఎన్నో కష్టాలు పడ్డాడు కానీ అబద్ధం చెప్పలేదు హరిశ్చంద్రుడు. చివరికి విశ్వామిత్రుడే అతడి సత్యధర్మానికి మెచ్చుకుని వరాలిచ్చాడు.

విశ్వామిత్రుడు హరిశ్చంద్రుణ్ణి హింసలు పెడుతుంటే విశ్వేదేవతలు అడ్డుపడ్డారు. వాళ్ళని భూలోకంలో పుట్టమని శపించాడు విశ్వామిత్రుడు. వాళ్ళే ద్రౌపదికి పుట్టిన ఉపపాండవులు.

విశ్వామిత్రుడు యజ్ఞం చేస్తుంటే తాటక, మారీచ, సుబాహులనే రాక్షసులు అడ్డుపడ్డారు. దశరథుడి దగ్గరికి వెళ్ళి రామలక్ష్మణుల్ని పంపించమని అడిగాడు విశ్వామిత్రుడు. దశరథుడు ఇష్టపడలేదు. దశరథుడికి రాముడంటే విష్ణుమూర్తేనని నచ్చ చెప్పి రామలక్ష్మణులతో రాక్షసుల్ని చంపించాడు.

శ్రీరామ పాదస్మర్శతో అహల్యా శాప విమోచనం చేయించి, మిథిలకి తీసికెళ్ళి శివధనుర్భంగం చేయించి శ్రీరామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్నుల పెళ్ళి జరిపించి చిన్నప్పటి నుంచే శ్రీరామలక్షణులు కారణజన్ములని లోకానికి తెలియడానికి కారణమయ్యాడు.

విశ్వామిత్రుడు 'విశ్వామిత్రస్మృతి' అనే గ్రంథాన్ని తొమ్మిది అధ్యాయాల్లో శ్లోక రూపంలో రాశాడు.

ఈవిధంగా విశ్వామిత్రుడు పట్టుదలతో బ్రహ్మర్షి పదవిపొంది, బ్రహ్మ సృష్టికి ప్రతిసృష్టి చేసి, చండశాసనుడు అని పేరు తెచ్చుకుని, కౌశిక మహర్షి అనేపేరుతో సప్తర్షి గణంలో చేరాడు.

విశ్వామిత్రుడు దయతలిస్తే గడ్డిపోచనైన గొప్ప పర్వతం చేయగలడు. కోపం వస్తే మాత్రం గొప్ప పర్వతాన్ని కూడా గడ్డిపోచ చెయ్యగలడు.

త్రిశంకుడికి స్వర్గాన్ని, శునశ్శేపుడికి దీర్ఘాయుష్షుని ఇచ్చాడు. కోపం వున్నది వసిష్ఠుడి మీద, కష్టాలు పెట్టింది సత్యహరిశ్చంద్రుణ్ణి. సత్యవ్రత దీక్ష ప్రాధాన్యతని లోకానికి చాటి చెప్పడం కోసం!!

ఏమయినా మహాపట్టుదల గలవాడు సుమా.... !

ఇది పిల్లలూ! విశ్వామిత్రుడి కథ!!

# 79. వ్యాఘ్రపాద మహర్షి

ఇప్పుడు మనం వ్యాఘ్రపాద మహర్షి గురించి తెలుసుకుందాం. పేరు అలా వుందేంటి? అనిపిస్తోందా! ఆయన పాదాలు పెద్ద పులి పాదాల్లా వుంటాయని ఆయనకాపేరు వచ్చింది.

అంతేకాదు వ్యాఘ్రపాదుడు జంతువుల్లో వుండే కామం, క్రోధం, మదం, మాత్సర్యం అనే నాలుగు చెడ్డ గుణాలని వదిలేసి వాటి యందు వ్యాఘ్రంలా వుండేవాడు, అందుకు కూడ ఆయనకి ఆ పేరు వచ్చిందేమో!

వ్యాఘ్రపాదుడు ఒక ముని కూతుర్ని పెళ్ళి చేసుకున్నాడు. ఆయన యజ్ఞం చెయ్యడం, చేయించడం, అధ్యయనం చెయ్యడం, చేయించడం వీటితో కాలం గడిపేవాడు.

ఆయనకి ఇద్దరు కొడుకులు కలిగారు. వాళ్ళపేర్లు ఉపమన్యు, ధౌమ్యుడు, ఉపమన్యు మహాజ్ఞాని, మహాయోగి అయ్యాడు. ధౌమ్యుడు మహర్షి అయి పాండవులకి పురోహితుడయ్యాడు.

ఒకసారి వ్యాఘ్రపాదుడు కాశికా పట్టణం వెళ్ళి కాశీ విశ్వేశ్వరుడిని భక్తితో స్తోత్రం చేశాడు. దాన్నే మనం ఇప్పటికీ విశ్వనాథాష్టకం అంటూంటాం. ఆ స్తోత్రానికి కాశీలో శివుడు ప్రత్యక్షమై మహర్షికి అడిగినవన్నీ ఇచ్చాడు.

వ్యాఘ్రపాదుడు మహర్షులకి బోధించిన దాన్ని 'వ్యాఘ్రపాద స్మృతి', అంటారు.

ఏ యుగాలకి ఏ ధర్మాలు చెప్పారో అవి పాటించాలిగాని ధర్మప్రవక్తల్ని తిట్టకూడదన్నాడు వ్యాఘ్రపాదుడు.

వ్యాఘ్రపాద స్మృతిలో బ్రహ్మచారి, గృహస్థు, యతి, వానప్రస్థుడు మొదలైన వాళ్ళకి సంబంధించిన విషయాలు వాళ్ళు ఆచరించాల్సిన విషయాలు ఉన్నాయి.

ఇదర్రా పిల్లలూ.... ! వ్యాఘ్రపాద మహర్షి కథ !

# 80. వైశంపాయన మహర్షి

రండి! రండి! మనం వైశంపాయన మహర్షి గురించి తెలుసుకుందాం. ఈయన చాలా గొప్ప ఋషి. మహాభారతంలో ఈ ఋషి పేరు ఎక్కువ విని వుంటాం. అసలు వేదాల్ని అన్ని వైపులా వ్యాప్తి చేసింది ఈ వైశంపాయన మహర్షే.

వైశంపాయన మహర్షి ఒక ముని కొడుకు. చిన్నప్పుడే వ్యాస మహర్షికి అప్పగించాడు తండ్రి. వ్యాసుడు ఈ పిల్లవాడికి విద్యాబుద్ధులు చెప్పి కొంచెం పెద్దవాడయ్యాక యజుర్వేదం నేర్పి ఈ వేదాన్ని అన్ని లోకాల్లోనూ వ్యాపించేలా చెయ్యమన్నాడు.

వైశంపాయనుడు యజుర్వేదాన్ని ఇరవై ఏడు శాఖలుగా విభజించి తన శిష్యుల్తో అన్ని లోకాల్లోనూ వ్యాపించేలా చేశాడు.

వైశంపాయనుడి ఆశ్రమంలో ఎంతోమంది శిష్యులు వేదం నేర్చుకుంటూ వుండేవాళ్ళు.

యాజ్ఞవల్క్యుడనే శిష్యుడు నాలుగు వేదాలు నేర్చుకుని గురుభక్తి కలిగి ప్రియశిష్యుడుగా ఉండేవాడు. కాని రానురాను యాజ్ఞవల్క్యుడికి గర్వం ఎక్కువయి పోయింది. అహంకారం ఉండకూడదని గురువుగారు ఎంత చెప్పినా వినకపోవడంతో తాను నేర్పిన వేదం తన దగ్గరే కక్కేసి వెళ్ళమని చెప్పి బయటకి పంపేశాడు యాజ్ఞవల్క్యుడుని వైశంపాయనుడు.

తనకి అత్యంత ప్రియమైనవాడు, గురుభక్తి వున్నవాడు అయినా సరే! అహంకారి కాబట్టి శిష్యుణ్ణి శిక్షించాడు వైశంపాయనుడు. పూర్వం కృష్ణద్వైపాయనుడనే బ్రహ్మర్షి వేదాల్ని భాగాలుగా చేసి శిష్యుల్తో అన్ని లోకాల్లోనూ వ్యాపించేలా చేశాడు. వేదవ్యాసుడు తన విజ్ఞానంతో మహాభారతాన్ని రచించి విశ్వానికి ఉపయోగించేలా చేశాడు.

కృష్ణద్వైపాయనుడు మహాభారతాన్ని భూలోకంలో జనమేజయుడికి చెప్పడానికి వైశంపాయన మహర్షిని పంపాడు.

జనమేజయుడికి పురాణ పుణ్యకథలు వినడమంటే చాలా ఇష్టం. ఒకసారి వ్యాసుడు శిష్యులతో జనమేజయుడి దగ్గరికి వెళ్ళాడు. వ్యాసుడికి ఎదురెళ్ళి అర్ఘ్య పాద్యాలిచ్చి పూజించి జనమేజయుడు కౌరవ పాండవుల గురించి చెప్పమని అడిగాడు.

వ్యాసుడు మహాభారతమంతా వైశంపాయనుడు నీకు చెప్తాడని చెప్పి వైశాంపాయనుణ్ణి జనమేజయుడికి అప్పగించి వెళ్ళాడు.

వైశంపాయనుడు గురువుగారికి మనస్సులో నమస్కారం చేసి వినేవారికి కోరిన కోరికలిచ్చేది, జన్మజన్మల పాపాన్ని పోగొట్టేది, ధర్మార్థ కామమోక్షాలకి గొప్ప సాధనమైంది, సత్యవాక్యాలతో వంద వేల శ్లోకాలతో వున్నది, వ్యాసమహామునితో వ్రాయబడింది అయిన భారతాన్ని జనమేజయుడికి వివరంగా చెప్పాడు.

జనమేజయుడు మళ్ళీ సందేహాలు అడిగాడు. యుద్ధం తర్వాత పాండవులు కౌరవులు స్వర్గానికి వెళ్ళి ఎక్కడ వున్నారు? అని

వైశంపాయనుడు రాజా! కొంచెం పుణ్యం చేసుకున్న వాళ్ళు ముందు స్వర్గానికి వెడతారు. తర్వాత నరకానికి వెడతారు. దుర్యోధనుడు వీరస్వర్గం పొందాడు. కాబట్టి, ముందు స్వర్గానికి వెళ్ళి తర్వాత కలిలో కలిసిపోయాడు. అతని తమ్ముళ్ళు రాక్షసులయ్యారు అని చెప్పాడు.

ఎవరెవరు ఎక్కడెక్కడ చేరారో చెప్తాను విను. అర్జునుడు నారాయణుడి ప్రక్కన చేరాడు, కర్ణుడు ద్వాదశాదిత్యుల ప్రక్కన, భీముడు మరుద్గణాల్లో, నకుల సహదేవులు అశ్వినీ దేవతల్లోనూ ఉన్నారు అని చెప్పాడు వైశంపాయనుడు.

ధృతరాష్ట్రుడు కుబేర లోకంలోనూ, పాండురాజు ఇంద్ర భవనంలో, అభిమన్యుడు చంద్రుడిలో, ద్రోణుడు బృహస్పతిలో, భీష్ముడు వసువుల్తో, ధర్మరాజు, విదురుడు ధర్మదేవతలో ఇలా ఇంకా ఎవరెక్కడెక్కడ ఉండిపోయారో వివరంగా చెప్పాడు వైశంపాయనుడు.

తర్వాత వైశంపాయనుడు జనమేజయుడికి హరివంశ కథలన్నీ చెప్పాడు. ఆ కథలపేర్లు కొన్ని మీకు చెప్తాను. కథలు చెప్పాలంటే కష్టం. ఈసారి మనం కలుసుకున్నప్పుడు మీరు కోరుకుంటే ఒక్కొక్క కథ 'హరివంశ కథలు' అనే పుస్తకంలో మీకు తెలియపరుస్తాను సరేనా! ఇప్పుడు కొన్నికథలపేర్లు చెప్తాను.

పృథు చక్రవర్తి చరిత్ర, మన్వంతర వివరణ, కువలయాశ్వ చరిత్ర, త్రిశంకు చరిత్ర, జాంబవతీ చరిత్ర, దత్తుని చరిత్ర, యయాతి చరిత్ర, ఇలా చాలాచాలా కథలున్నాయి. ఇవన్నీ వైశంపాయనుడు జనమేజయుడికి చెప్పాడు.

మీకు కూడా తెలుసుకోవాలనుకుంటే అడగండి. మీకోసం ఋషుల దివ్య కథలు అయిపోయాక హరివంశ కథలు మీకు అందిస్తాను.

చివరగా జనమేజయుడు వైశంపాయనుణ్ణి అడిగి మోక్ష మార్గం గురించి కూడా తెలుసుకున్నాడు.

వైశంపాయనుడు రాసిన 'నీతిప్రకాశిక' అనే గ్రంథంలో యుద్ధ నీతి గురించి తెలియచెయ్యబడింది. దాంట్లో సేనా నాయకుడి విధులు, సైనిక విన్యాసం, ప్రాచీక భారతదేశ శస్త్రాస్త్రాల గురించి, సుమారు నూట ముప్ఫై ఆరు రకాల ఆయుధాల గురించి రాశాడు. యుద్ధం వివరంగా ఎలా చెయ్యాలి సైన్య సమీకరణ మొదలు ఎనిమిది సర్గలున్నాయి దీంట్లో.

బహుశా వైశంపాయన మహర్షికి ఇది తెలియదు అన్నది లేదేమో. ఇంతటి మేధావిని గురించి తెలుసుకున్న మనం ఎంతో ధన్యులం. ఈ మహర్షుల గురించి మనకు తెలియచేస్తున్న వాళ్ళకి కూడా మనం కృతజ్ఞతలు తెలియచెప్పవచ్చు.

ఎంత చక్కటి కథలు!! మనమెంతో ధన్యులం!

# 81. వ్యాస మహర్షి

**పి**ల్లలూ! రండి... వచ్చెయ్యండి... ఇప్పుడు మనం కారణజన్ముడు పరమేశ్వర స్వరూపుడు, మహర్షుల్లో గొప్పవాడు అయిన వ్యాస మహర్షిని గురించి తెలుసుకుందాం. ఈయన చాలా చాలా గొప్ప మహర్షి.

మొదలు పెట్టేద్దాం... చాలా ఆతృతగా వుంది.

ఆదికాలంలో ప్రజాసృష్టికోసం విష్ణుమూర్తి నాభినుంచి బ్రహ్మని పుట్టించాడు. మిగిలిన సృష్టి మొత్తం బ్రహ్మకి అప్పగించాడు. విష్ణుమూర్తి ముఖం నుంచి వేదాలు ఆవిర్భవించాయి. తన మనస్సు నుంచి అపాంతరతముడనే పేరుగల వాణ్ణి పుట్టించి వేదాలన్నీ నేర్చుకోమని చెప్పాడు విష్ణుమూర్తి.

అపాంతరతముడు విష్ణుమూర్తి చెప్పినట్లు వేదాలన్నీ నేర్చుకున్నాడు. విష్ణుమూర్తి అతడిని అన్ని మన్వంతరాల్లోను పుట్టి వేదాలు వ్యాపింపచేస్తాడని, విష్ణుతత్త్వం గ్రహించి ముల్లోకాల్లోనూ ధర్మాలన్నీ తెలుసుకుని గొప్ప ఋషి అవుతాడని, తర్వాత కాలంలో వసిష్ఠుడికి మనుమడయిన పరాశరుడికి పుట్టి వేదాలు వ్యాప్తి చేసి, అందరి ధర్మ సందేహాలు తీర్చి లోకహితం కోసం శ్లోకాలుగా రాస్తాడని చెప్పాడు.

పూర్వం పరాశర మహర్షి తీర్థ యాత్రలు చేస్తూ యమునానదీ తీరానికి వచ్చి ఒక నావ మీద ఎక్కాడు. దాశరాజు కూతురయిన సత్యవతి ఆ నావ నడుపుతోంది. ఆమెని చూసి ఇష్టపడ్డాడు. పరాశరుడు దివ్యదృష్ఠితో ఆమె పూర్వ జన్మ గురించి తెలుసుకుని తన కోరిక ఆమెకి చెప్పాడు. వాళ్ళకి వేదమయుడైన వేద వ్యాసుడు కలిగాడు. పరాశరుడు కుమారుణ్ణి దీవించి సత్యవతికి చెప్పి తీర్థయాత్రలకి వెళ్ళిపోయాడు.

వేదవ్యాసుడు లోకకళ్యాణం కోసం తపస్సు చెయ్యడానికి బయలుదేరి తల్లికి నమస్కరించి అమ్మా! మీకు అవసరమైనప్పుడు నన్ను తల్చుకోండి, నేను వస్తాను అని చెప్పి వెళ్ళిపోయాడు.

వేద వ్యాసుడు యమునా నదీ తీరంలో పుట్టాడు. కాబట్టి, కృష్ణ ద్వైపాయనుడని, వేదాల్ని విభజించిన వాడవడం వల్ల వేదవ్యాసుడని, పరాశరుడి కుమారుడుగా పారాశర్యుడని, సత్యవతీ పుత్రుడుగా సాత్యవతేయుడని కూడా పేర్లున్నాయి.

వేదవ్యాసుడు ఒక ఆశ్రమం ఏర్పాటు చేసుకుని ఎంతోమంది శిష్యులతో వెలిగిపోతున్నాడు.

కొంతకాలం తర్వాత కురువంశానికి రాజయిన శంతన మహారాజు సత్యవతిని పెళ్ళిచేసుకోవాలనుకున్నాడు. సత్యవతి తండ్రి దాశరాజు ఒక షరతు పెట్టాడు. తన కూతురు సత్యవతికి పుట్టిన పిల్లలకే రాజ్యం ఇవ్వాలని శంతన మహారాజుకి చెప్పాడు. మహారాజు

అందుకు అంగీకరించలేదు. అతని మొదటి కొడుకు భీష్ముడు దాశరాజు మాటనే బలపర్చి తను పెళ్ళిచేసుకోకుండా ఉండిపోయి సత్యవతీ శంతనులకి పుట్టిన పిల్లలకే రాజ్యం ఇస్తానని ప్రతిజ్ఞ చేశాడు. దీన్నే భీష్మ ప్రతిజ్ఞ అంటారు.

సత్యవతీ శంతనులకి పెళ్ళి జరిగింది. కొన్నాళ్ళకి వాళ్ళకి కొడుకులు చిత్రాంగదుడు విచిత్రవర్యుడు కలిగారు. వాళ్ళు పెరిగి పెద్దవాళ్ళయాక, శంతనుడు మరణించాడు. వాళ్ళల్లో చిత్రాంగదుడు గంధర్వులతో యుద్ధం చేసి మరణించాడు. భీష్ముడు విచిత్ర వీర్యుణ్ణి రాజుగా చేసి అతడికి పెళ్ళికూడ చేశాడు.

విచిత్ర వీర్యుడికి పిల్లలు కలగలేదు. కానీ, కొంత కాలానికి అతడు కూడా మరణించాడు. సత్యవతి భీష్ముణ్ణి పెళ్ళిచేసుకోమని ఎంత చెప్పినా అతడు వినలేదు. నేను నా ప్రతిజ్ఞ ప్రకారం పెళ్ళి చేసుకోకూడదు చేసుకోను అన్నాడు భీష్ముడు.

మనం చెప్పిన మాట వినకపోతే మన పెద్దవాళ్ళు మనల్ని కూడా ఏమిటీ? ఏదో భీష్మ ప్రతిజ్ఞలాగా నీ మాటనీదేకాని నామాట వినవా? అంటుంటారు. ఇదే భీష్మపతిజ్ఞ అంటే.

సత్యవతి తన కొడుకయిన వ్యాస మహర్షిని పిలిచి జరిగినదంతా చెప్పి తన కోడళ్ళకి పిల్లలు కలిగేటట్లు చూడు లేకపోతే వంశం నాశనమయిపోతుందని చెప్పింది.

వ్యాసుడు అందుకు అంగీకరించి ఒక సంవత్సరం అంబిక అంబాలికల్ని పరిశుద్ధులవడానికి వ్రతం చేయించమన్నాడు. తర్వాత అంబిక అంబాలికల్ని వ్యాసుడి దగ్గరకి పంపించింది సంతానం కోసం సత్యవతి.

వ్యాసుడి రూపం చూసి భయపడి కళ్ళుమూసుకున్న అంబికకి దృతరాష్ట్రుడు పుట్టు గ్రుడ్డితో పుట్టాడు. వ్యాసుణ్ణి చూసి అచేతనంగా అయిపోయిన అంబాలికకి పాండురోగంతో పాండురాజుపుట్టాడు.

సత్యవతి అంబికకి నచ్చచెప్పి వ్యాసుడి దగ్గరకి వెళ్ళమంది. కానీ, అంబిక తన దాసిని పంపించింది. ఆ దాసి వ్యాసుడికి నమస్కరించి మహర్షిని భక్తి శ్రద్ధలతో సేవించింది. ఆమెకి యమధర్మరాజు విదురుడుగా మహాజ్ఞానిగా పుట్టాడు.

తర్వాత కౌరవులు పాండవులు పుట్టడం పాండురాజు మరణించడం జరిగిపోయింది. వ్యాసభగవానుడు వచ్చి సత్యవతికి అమ్మా! రాబోయే కాలం అన్నీ కష్టాలేవుంటాయి. సంసారంమీద ప్రేమవదిలి నీ కోడళ్ళని కూడా తీసుకుని పుణ్యలోకాలు చేరడానికి ప్రయత్నించమని చెప్పాడు. తన కోడళ్ళతోపాటు తపస్సు చేసుకుని శరీరం విడిచిపెట్టింది సత్యవతి.

లక్క యింట్లోంచి బయటపడిన పాండవులకి శాలిహోత్రుడి ఆశ్రమంలో వున్న కొలనులో స్నానం చేసిన వాళ్ళకి ఆకలి దాహం వుండవని వాళ్ళని కూడ అలా చెయ్యమని చెప్పాడు వ్యాసుడు.

మత్స్యయంత్రం పడగొట్టాక ద్రౌపదిని అయిదుగురికి పెళ్ళి చెయ్యడం ఎలాగా అని ఆలోచిస్తున్న ద్రుపదుడికి ద్రౌపది పూర్వ జన్మ వృత్తాంతం చెప్పి పాండవులకి ద్రౌపదితో పెళ్ళి జరిపించాడు.

ద్వైతవనంలో వున్న పాండవులు భీష్మ, ద్రోణ, కృపాచార్యుల్ని ఓడించగలమో లేదోనని సందేహిస్తున్న సమయంలో వ్యాసభగవానుడు వచ్చి "ప్రతిస్మృతి" అనే విద్యని ధర్మరాజుకి ఉపదేశం చేశాడు. దాన్ని ధర్మరాజు అర్జునుడికి ఉపదేశించాడు. దాని వల్ల అర్జునుడు తపస్సు చేసి దేవతల్ని మెప్పించి అస్త్రశస్త్రాల్ని సంపాదించాడు.

దృతరాష్ట్రుడు కురుక్షేత్ర యుద్ధంలో పాండవులు ఓడిపోతారా? కౌరవులు ఓడిపోతారా? అని అడిగినప్పుడు వ్యాసుడు పాండవులకే జయం కలుగుతుందని చెప్పాడు.

సంజయుడు చెప్పినట్లు శ్రీకృష్ణుడు సాక్షాత్తు విష్ణుమూర్తే నని ఆయన చెప్పినట్లు సంధి చేసుకోవడం మంచిదని లేకపోతే యుద్ధం తప్పదని చెప్పాడు వ్యాసభగవానుడు.

సమయం దగ్గరకొచ్చిందనీ, యుద్ధం తప్పదనీ, యుద్ధంలో కౌరవులు మరణిస్తారనీ చెప్పి ఎప్పటికప్పుడు యుద్ధం గురించి తెలియచెప్పే శక్తి సంజయుడికిస్తున్నాను అతడిని అడిగి విషయాలు తెలుసుకోమని దృతరాష్ట్రుడికి చెప్పి అంతర్ధానమయ్యాడు వ్యాసుడు.

కురుక్షేత్ర యుద్ధంలో అభిమన్యుడు మరణించాక దుఃఖంలో వున్న పాండవులని ఓదార్చాడు వ్యాసుడు.

అశ్వత్థామ నారాయణాస్త్రం వ్యర్థమయిపోయిందని బాధపడ్తున్నప్పుడు నారాయణుడే శ్రీకృష్ణుడు అతని అంశ అర్జునుడూ అయినప్పుడునీ అస్త్రం వాళ్ళ మీదెలా పనిచేస్తుందని అతని అజ్ఞానాన్ని పోగొట్టాడు వ్యాసభగవానుడు.

అర్జునుడికి యుద్ధం చేస్తుంటే తనకంటే ముందు ఒక మహాపురుషుడు శూలంతో రాజుల్ని చంపుతున్నట్లు తను ఊరకే బాణాలు వేస్తున్నట్లు కనిపించింది. దీనికి అర్ధమేమిటని వ్యాస భగవానుణ్ణి అడిగాడు అర్జునుడు.

శంకరుడే కరుణించి అర్జునుడికి సహాయపడ్డాడని చెప్పి అర్జునుడిలో శివభక్తిని పెంచి ఉత్సాహపరిచాడు వ్యాసుడు. శంకరుడినే మనస్సులో తల్చుకుంటూ యుద్ధం చెయ్యమని చెప్పాడు.

కౌరవులు యుద్ధంలో మరణించినప్పుడు పుత్రుల మీద ప్రేమతో ధృతరాష్ట్రుడు గాంధారి పాండవుల్ని శపించకుండా ఇదంతా వాళ్ళు స్వయంగా చేసుకున్నదే అని వివరించాడు వ్యాసుడు.

యుద్ధం తర్వాత బంధుమిత్రులు, అనేకమంది రాజులు పోయినందుకు బాధపడ్తున్న ధర్మరాజు దగ్గరకి వచ్చి రాజ్యాన్ని అనాథగా వదిలి బాధపడ్డం ధర్మం కాదని, సుద్యుమ్నుడి

చరిత్ర సేనజిత్తుడి మాటలు, ధర్మాధర్మాలు, ప్రాయశ్చిత్త విశేషాలు అన్నీ చెప్పి, మరుత్తుడి కథ చెప్పి అశ్వమేధయాగం కూడా చేయించాడు వేదవ్యాసుడు.

వ్యాసుడి ఉపదేశం ప్రకారం ధృతరాష్ట్రుడు ఒక ఆశ్రమం ఏర్పాటు చేసుకుని గాంధారితో కలిసి ఉంటున్నాడు. పాండవులతో కలిసి వున్న దృతరాష్ట్రుడి దగ్గరకి వ్యాస భగవానుడు వచ్చి వాళ్ళ కోరిక ప్రకారం దివ్యదృష్టితో చనిపోయిన వాళ్ళందర్నీ చూడగలిగేలా చేసి ఎవరెవరు ఎక్కడెక్కడి చేరారో చూపించాడు.

యాదవస్త్రీలని రక్షించడానికి అస్త్రం తీసిన అర్జునిడికి అస్త్రాలు పనిచెయ్యలేదు. అర్జునుడు వేదవ్యాసుడి పాదాల మీద పడి తన అవమానం గురించి చెప్పి దుఃఖించాడు.

నాయనా! కృష్ణావతారం అయిపోయాక ఆయన ప్రభావం నీ మీద లేదు. కాలం మనది కానప్పుడు మనం ఏంచేసినా అది కలిసిరాదు. జ్ఞానమున్నవాడివి కనుక విషయాలు తెలుసుకుని నువ్వుకూడా సర్వసంగ పరిత్యాగం చేసి నీవాళ్ళతో కలిసి ఉత్తమ గతులు పొందమని చెప్పాడు.

పాండవులందరు శరీరాలు విడిచిపెట్టాక పాండవుల కీర్తి విస్తరింప చెయ్యడానికి రాజుల చరిత్రలు ప్రజలకు తెలియచెయ్యడానికి, దేవదేవుడి లీలలు, సర్వదేవతల జన్మలు ఇల్లాంటివి ఎన్నో తెలియపరుస్తూ సర్వజ్ఞుడు, సత్యదర్శి సర్వవిజ్ఞానభవుడు అయిన వేదవ్యాసుడు మహాభారతాన్ని పంచమవేదంగా రచించి మనకి అందించాడు.

వేదవ్యాసుడు నడిచి వెడుతుండగా దార్లో ఒక పురుగు భయంతో పరుగెడుతూ కనిపించింది. వ్యాసుడు ఆ పురుగుని నీ బ్రతకే నికృష్టం కదా! బ్రతికి ప్రయోజనం ఏముందీ? చచ్చిపోడమే సుఖం కదా! భయపడ్డావెందుకన్నాడు వ్యాసుడు.

మహాత్మా! నేను పురుగునయినప్పుడు నాకంత విషయ పరిజ్ఞానం ఉండదు కదా! బ్రతకడమంటే సుఖం చావడమంటే భయం తప్ప నాకింకేమీ తెలియవు. అన్ని జీవులకి తెలిసేది ఇదేకదా అంది.

నీకు శూద్ర, వైశ్య, క్షత్రియ జన్మలు వరుసగా వచ్చేలా నేను వరమిస్తాను, నువ్వు ధర్మమార్గంలో నడుచుకో అన్నాడు వ్యాసుడు. ఆ పరుగు మహర్షి చెప్పినట్లే నడుచుకుని క్షత్రియజన్మలో వ్యాసుడికి కన్పించి పూజించింది.

నువ్వు ఆవులకోసం గాని బ్రహ్మణుడి కోసం గాని ఏదైనా త్యాగం చేస్తే నీకు బ్రాహ్మణ జన్మవచ్చేలా చూస్తానన్నాడు వ్యాసుడు. తర్వాత ఆరాజు బ్రహ్మణుగా పుట్టి యజ్ఞాలుచేసి, తీర్థయాత్రలు చేసి ఇంద్రుడికి ప్రియశిష్యుడిగా అయ్యాడు. ఇదంతా ఆ పురుగుమీద వ్యాసభగవానుడు చూపించిన దయ.

విష్ణు ప్రభావం వల్ల పుట్టిన కృష్ణద్వైపాయనుడు అంటే మన వేదవ్యాసుడు బ్రహ్మ చెప్పగా వేదాల్ని నాలుగు భాగాలుగా చేసి ఋగ్వేదం పైలుడికి, యజుర్వేదం వైశంపాయనుడికి, సామవేదం జైమినికి, అథర్వణవేదం సుమంతుడికి చెప్పి, వాళ్ళ వాళ్ళ శిష్యుల్లో వ్యాప్తిపొందేలా చేశాడు.

ఇలా చతర్వేదాలు, అష్టాదశ పురాణాలు, చతుర్ధశ విద్యలు అన్నీ నేర్చుకుని, బ్రహర్షులు, దేవర్షులు, రాజర్షులు చదివి అందరికీ చెప్పగలిగేలా చేశాడు వేదవ్యాసుడు.

వ్యాసుడు పరమేశ్వరుణ్ణి ఆరాధించి పక్షి రూపంలో వున్న ఘృతాచి అనే అప్సరస యందు ఒక కొడుకుని పొందాడు. అతడి పేరు శుకుడు. పుడుతూనే అన్ని వేదాలు నేర్చుకుని వ్యాస భగవానుడంతటి వాడయ్యాడు శుకుడు. తండ్రి దగ్గర సమస్త విషయాలు తెలుసుకుని చివరకు యోగమార్గంలో శుకుడు అంతర్ధానమయ్యాడు.

వ్యాస మహర్షి రచనలు “వ్యాససంహిత”, “వ్యాసస్మతి”. వీటిలో మనకి నిత్యకర్మల గురించి అనేక విషయాల గురించి చెప్పబడివుంది. వ్యాసభగవానుడు కారణజన్ముడు. ఇదర్రా వ్యాస మహర్షి కథ!!

# 82. శక్తి మహర్షి

**ఇ**ప్పుడు శక్తి మహర్షి గురించి తెల్సుకుందాం...

శక్తి మహర్షి వసిష్ఠుడికి పెద్దకొడుకు.

ఒకసారి ఇక్ష్వాకు వంశం వాడయిన కల్మాషపాదుడనే వాడు శక్తి మహర్షికి అడ్డంగా వచ్చి మహర్షిని ప్రక్కకి తప్పుకోమన్నాడు.

రాజా! ఇదేమిటని సద్బ్రాహ్మణుడు ఎదురయితే నమస్కరించాలి గాని నన్నే తప్పుకో అంటున్నావు. అంత తెలియని వాడివా! నాకు భక్తితో నమస్కరించి నువ్వు ప్రక్కకి వెళ్ళాలి. అయినా నేను నీకు అడ్డుగా లేను. సరయిన మార్గంలోనే నడుస్తున్నానని చెప్పాడు శక్తి.

కల్మాషపాదుడు అహంకారంతో కఱ్ఱతో కొట్టి శక్తి మహర్షిని చంపేశాడు. అప్పటికే గర్భవతిగా వున్న శక్తి భార్యకి పరాశరుడు కలిగాడు.

తల్లి గర్భంలో పన్నెండు సంవత్సరాలు ఉండి శక్తి మహర్షి చదివిన వేదాలన్నీ విని నేర్చుకుని పుడుతూనే వేదాధ్యయన సంపన్నుడుగా పుట్టాడు పరాశరుడు. అంత చక్కటి బ్రహ్మ జ్ఞాని శక్తి మహర్షి.

ఇదర్రా! శక్తి మహర్షి కథ!!

# 83. శతానంద మహర్షి

ఇంతాలశ్యమా! రండి తొందరగా... నేను మొదలు పెట్టేస్తున్నా... ఇప్పుడు మనం శతానంద మహర్షి గురించి తెలుసుకుందాం...!

గౌతమ మహర్షి బ్రహ్మతో సృష్టింపబడిన అహల్యని పెళ్ళి చేసుకున్నాడు. ఇద్దరూ కలిసి ప్రపంచంలో కరువు వ్యాపించినప్పుడు తమ తపశ్శక్తితో చాలాకాలం మూడు లోకాల వాళ్ళకి అన్నం వస్త్రాలు కూడా ఇచ్చారు.

ఇలా చాలాకాలం గడిచిన తర్వాత గౌతముడు అహల్యని ఏంకావాలో కోరుకోమన్నాడు. స్వామీ! నాకు కావల్సింది ఏముంటుంది? సుగుణవంతుడైన ఒక కొడుకుని ప్రసాదించండి అంది అహల్య.

గౌతముడు అహల్యని తీసుకుని వందచోట్ల త్రిప్పి వంద రకాలుగా ఆనందపడేలా చేసి ఆమె కోరిక అనుగ్రహించాడు. వాళ్ళకి ఒక కొడుకు పుట్టాడు. వంద రకాలుగా ఆనందంపొంది కన్నారు కాబట్టి వాళ్ళు కొడుక్కి శతానందుడని పేరు పెట్టారు.

శతానందుడు చినప్పటినుంచి తండ్రి గుణాల్ని పుణికి పుచ్చుకున్నాడు. తండ్రి దగ్గరే అన్ని వేదశాస్త్రాలు నేర్చుకుని గొప్ప తపశ్శాలయ్యాడు. శతానందుడి జ్ఞానసంపద, బుద్ధివైభవం, తపశ్శక్తి విని జనక మహారాజు తన పురోహితుడిగా వుండమని అడిగాడు.

గౌతమ మహర్షి ఆనందంగా శతానందుణ్ణి కులగురువుగా జనక మహారాజు దగ్గరకి పంపించాడు.

ఒకసారి రామలక్షణులు మారీచుడు మొదలైన రాక్షసుల్ని చంపి, అహల్యా శాపవిమోచనం చేసి విశ్వామిత్రుడితో కలసి మిథిలాపురానికి వచ్చారు. జనకుడు శతానందుడు ఎదురు వెళ్ళి తీసికువచ్చారు. రామలక్ష్మణుల్ని గురించి విశ్వామిత్రుడి వలన విని తన తల్లి శాపవిమోచనమయినందుకు శతానందుడు సంతోషంగా రామలక్ష్మణుల్ని అభినందించాడు. వాళ్ళకి విశ్వామిత్రుడి గురించి వివరంగా చెప్పాడు.

శ్రీరాముడు శివధనుర్భంగం తర్వాత దశరధుడివైపు వసిష్ఠుడు, జనకుడి వైపు శతానందుడు ఉండి సీతారాముల కళ్యాణం జరిపించారు.

చాలాకాలం శతానందుడు ధర్మకార్యాలు చేయిస్తూ జనకుడి కుల గురువుగా ఉండిపోయాడు.

కొంతకాలం తర్వాత శతానందుడికి తన భార్య వల్ల సత్యధృతుడనే ఒక కొడుకు కలిగాడు. అతడు పుడుతూనే చేతిలో బాణంతో పుట్టాడు కాబట్టి, అతడికి శరద్వంతుడని కూడా పేరువచ్చింది.

ఎప్పుడూ శరం వదలకుండా ఉండడంవల్ల ఇతడికి ధనుర్వేదం మీదే ఎక్కువ ఇష్టం ఉండేది. గొప్ప తపశ్శక్తితో ఎన్నో అస్త్రాల్ని పొంది ఇంకా అస్త్రాల్ని పొందాలని తపస్సు చేస్తూనే వుండేవాడు.

సత్యధృతుడికి ఇద్దరు పిల్లలు. వాళ్ళపేర్లు కృపుడు, కృపి వాళ్ళని ఎక్కువకాలం శంతన మహారాజు పెంచాడు. కృపుడు కూడా ధనుర్విద్యలో గొప్పవాడై కౌరవ పాండవులకి గురువయ్యాడు.

ఈ విధంగా శతానంద మహర్షి వినయం, విధేయత, ధర్మం లాంటి ఎన్నో సుగుణాలవల్లనే కాకుండా మంచికొడుకు, మంచి మనుమల్ని కూడా పొంది ఇంకా గొప్పవాడయ్యాడు.

ఇదర్రా! శతానంద మహర్షి కథ!!

# 84. శమీక మహర్షి

**శ**మీక మహర్షి అంగిరసుడి సంతతివాడు. ఒక ముని కూతుర్ని పెళ్ళి చేసుకుని ఒక కొడుకుని పొందాడు. అతడిపేరు శృంగి. శమీక మహర్షి గృహస్థాశ్రమం నిర్వహిస్తూ శిష్యులకి విద్యాబోధన చేసేవాడు.

శమీకుడు ఒకరోజు శిష్యులతో కలిసి ఒక అరణ్యంలో తిరుగుతుండగా ఒక గంట కనిపించింది. ఆగంటని మెల్లగా తీసి చూశాడు. దాని కింద నాలుగు పక్షి పిల్లల్ని చూసి ఆశ్చర్యపడ్డాడు.

ఇప్పటివరకు ఇక్కడ కురుక్షేత్ర యుద్ధం జరిగింది. భీష్ముడు అంపశయ్య మీద వుండి ధర్మరాజుకి ధర్మాల గురించి చెప్తున్నాడు. అలాంటి ఈ ప్రదేశంలో గ్రుడ్లు ఎల్లా పడ్డాయి? గంట ఎక్కడి నుంచి వచ్చి ఆ పక్షి పిల్లల్ని రక్షించింది? అనుకుని పక్షి పిల్లల్ని ఇంటికి తీసుకురమ్మని శిష్యులకి చెప్పి తానే స్వయంగా పండ్లు కాయలు తినిపించాడు శమీకుడు.

పక్షి పిల్లలు కొంచెం పెరిగి ఎగరడం మొదలుపెట్టాక శమీకుడు వాటికి పక్షిరూపం ఎలా వచ్చిందో చెప్పమన్నాడు. మా తండ్రిపేరు సుకృశుడు. ఆయన సత్యనిష్ఠ పరీక్షించడానికి దేవేంద్రుడు ముసలి పక్షిరూపంలో వచ్చి ఆకలిగా వుంది మాంసాహారం పెట్టమన్నాడు. మమ్మల్ని దేవేంద్రుడికి ఆహారంగా వెళ్ళమంటే మేం వినలేదని మమ్మల్ని శపించి మనుష్య భాషలో మాట్లాడగలిగే శక్తి మాత్రం ఇచ్చాడు మా తండ్రి అని చెప్పి ఆ పక్షులు వింధ్య పర్వతాల వైపు ఎగిరిపోయాయి.

శమీక మహర్షికి సత్యనిష్ఠ, తపస్సమాధి, బ్రహ్మజ్ఞాన దీక్ష ఇవే ఆహార పానీయాలైపోయాయి. వృద్ధుడౌతున్నా కూడా బ్రహ్మజ్ఞానం వల్ల వచ్చిన తేజస్సుతో బ్రహ్మర్షి అయ్యాడు. మౌనవ్రతంలో చాలా కాలం వుండిపోయాడు.

ఒకనాడు పరీక్షిన్మహారాజు వేటకి వెళ్ళి అలిసిపోయి, శమీకుడి ఆశ్రమానికి వచ్చాడు. కానీ శమీకుడు తపస్సులో వుండి పరీక్షిత్తుని పలకరించలేదు. పరీక్షిత్తుకి కోపం వచ్చి బ్రాహ్మణుడుకి ఇంతగర్వమా? మంచినీళ్ళడిగితే కూడా ఇవ్వనంత అహంకారమా? నా వైపు చూడడానిక్కూడ కష్టంగా వుందా? అని కోపంతో అక్కడ ఒక చచ్చిన పాముని శమీకుడి మెడలోవేసి వెళ్ళిపోయాడు.

దూరంనుంచి ఇది చూసిన శిష్యుడు పరుగెత్తు వెళ్ళి శమీకుడి కొడుకు శృంగికి చెప్పాడు. తన తండ్రి మెడలో పాముని వేసినవాడు ఏడు రోజుల్లో పాము విషంతోనే చస్తాడని శపించి తండ్రి దగ్గర కూర్చుని గట్టిగా ఏడుస్తుంటే శమీకుడు కళ్ళు తెరిచి మెడలో వున్న పామును తీసి పడేసి ఏం జరిగిందని కొడుకు నడిగాడు.

శృంగి జరిగినదంతా చెప్పాడు. శమీకుడు కొడుకుని మందలించి బ్రాహ్మణుడికి క్షమాగుణం వుండాలికాని కోపం వుండకూడదని శాపాన్ని తిప్పుకోమని చెప్పాడు.

శృంగి శాపాన్ని తిప్పే శక్తి నాకు లేదన్నాడు. అప్పుడు శమీకుడు కృష్ణా! పరమేశా! హరా! పిల్లవాడు తెలియక చేశాడు క్షమించమని అడిగాడు.

శమీకుడు గౌరముఖ మహర్షిని పిలిచి శాపాన్ని గురించి పరీక్షిత్తుకు చెప్పమని చెప్పి పంపాడు. పరీక్షిత్తు శమీకుడికి కృతజ్ఞతలు చెప్పుకొని, శ్రీశుక మహర్షి ద్వారా మోక్ష మార్గం తెలుసుకుని మోక్షాన్ని పొందాడు.

ఇదర్రా శమీక మహర్షి కథ!!

# 85. శృంగి మహర్షి

**పి**ల్లలూ! శృంగి మహర్షిని గురించి తెలుసుకుందాం.

అంగిరస సంతతివాడైన శమీక మహర్షి కొడుకు శృంగి మహర్షి. తండ్రిని మించిన తనయుడు.

ముని కుమారులు వేటకోసం వచ్చిన పరీక్షిత్తు శమీకుడి మెడలో పాముని వెయ్యడం దూరం నుంచి చూసి భయపడి శృంగి మహర్షికి చెప్పారు. బ్రహ్మను గురించి తపస్సు చేస్తున్న శృంగి మహర్షి వచ్చి తండ్రిని చూసి ఒక క్షత్రియుడు బ్రాహ్మణుణ్ణి అంత అవమానపరుస్తాడా? అని మండిపడి కోపంతో...

ఎప్పుడూ ఆశ్రమంలో ఉండేవాళ్ళని కూడా దూషించనివాడు, శత్రువులు లేని వాడు, ఎప్పుడు కందమూలాలు తింటూ సమాధినిష్ఠలో వుండేవాడు, విష్ణుమూర్తిని తప్ప వేరే ప్రపంచాన్నే చూడనివాడు, నాకు గురువు అయిన నా తండ్రి మెడలో ఒక క్షత్రియుడు పాము వేస్తాడా?

దానాలు తీసుకుంటూ దీవనలిస్తూ వాళ్ళ వృద్ధినే కోరుకుంటూ అడవుల్లో శాంతంగా బ్రతికే బ్రహ్మర్షులంటే అంత చులకనా? అంటూ హరికేశవులు అడ్డువచ్చినా సరే ఈ రోజు నుంచి ఏడవరోజుకి పాముకాటు వల్ల పాము విషంతోనే మరణించమని శపించి ఏడుస్తూ తండ్రి దగ్గరికెళ్ళాడు శృంగి.

శృంగి జరిగిందంతా తండ్రికి చెప్పాడు. శమీకుడు పుత్రా! నువ్వు చేసింది తప్పునాయనా! మహర్షులు శాంతంగా వుండాలేగానీ కోపం చూపించకూడదు. ఇంత శాపం పొందేటంత తప్పు రాజు చెయ్యలేదు. ధర్మవిరుద్ధమైన పని చేసి పాపం చేశావు. శాపం తిరిగి తీసుకోమన్నాడు.

శమీకుడు మందలించాక శృంగి తాను నేను చేసింది తప్పేనని శాపం తిరిగి తీసుకునేశక్తి తనకు లేదని బాధపడ్డాడు.

ఇదర్రా! శృంగి మహర్షి కథ !!

తొందరపాటు వల్ల ఎంత అనర్థం జరిగిందో చూశారా! పాపం చిన్న వాడుకదా! తండ్రి ఏమయిపోతాడోననే భయంతో శపించాడు. కానీ, రాజుమీద నిజం కోపం కాదు. తర్వాత తండ్రి చెప్పాక అర్థం చేసుకున్నాడు.

అందుకే తొందరపాటు ఉండకూడదు. కొంచెం శాంతంగా ఆలోచించాలనమాట. అప్పుడు అనర్థాలు జరగవు.

# 86. శరభంగుడు

**ఈ**యన దండకారణ్యంలో వుండేవాడు. ఈయన్ని తీసికెళ్ళడానికి స్వర్గలోకం నుంచి ఇంద్రుడితో సహా దేవతలంతావచ్చారు. అయినాసరే రాముడు దండకారణ్యం వచ్చాక రాముడి దర్శనం చేసుకున్నాకే శరీరాన్ని విడుస్తానన్నాడు. చివరకి అలాగే చేశాడు. ఈయన ఆశ్రమం జాహ్నవీ నదికి దగ్గర్లోవుంది.

# 87. శంఖలిఖిత మహర్షులు

**బ**హుదానదీ తీరంలో పవిత్రమైన ఒక ఆశ్రమంలో తపస్సంపన్నుడైన బ్రాహ్మణుడు ధర్మపత్నీ సమేతంగా ఉండేవాడు. వాళ్ళకి ఇద్దరు కొడుకులు కలిగారు.

అందులో ఒకడికి జ్ఞానయోగాన్ని సూచించే శంఖం గుర్తు చేతిలో వుంది. అందుకే అతడికి శంఖుడని పేరు పెట్టారు. రెండోవాడి నుదటి మీద తపస్సు, ధర్మం దీక్షగా కలవాడని తెలుస్తుండడం వల్ల అతనికి లిఖితుడని పేరు పెట్టారు.

శంఖలిఖితులిద్దరూ చక్కగా పెరిగి పెద్దవాళ్ళయ్యాక ఉపనయనం చేసి తండ్రి వేదవేదాంగాలు నేర్పించాడు. వాళ్ళిద్దరు ఎంతో ప్రేమగా, రామలక్ష్మణుల్లాగా, సూర్యచంద్రుల్లాగా, అశ్వనీ దేవతల్లాగా వెలిగిపోతున్నారు.

వాళ్ళిద్దరూ బ్రహ్మచర్యం తీసుకుని తల్లితండ్రుల అనుమతి తీసుకుని తపస్సు చేసుకుందుకు వెళ్ళారు. తపస్సులో వున్న వాళ్ళిద్దర్ని చూస్తుంటే సాక్షాత్కరించిన ధర్మదేవతలో, అవతారమెత్తిన ఆది విద్యలో అన్నట్లుండేవాళ్ళు.

విశ్రాంతి సమయంలో ఇద్దరూ ఒకేచోట వుండి చక్కగా మాట్లాడుకుంటూ ఉండేవాళ్ళు. వాళ్ళెప్పుడూ అబద్ధమాడరు, ఆ పవిత్ర సోదరులకి తపస్సే ఇంద్ర భోగం, మోక్షలక్ష్మీ వాళ్ళకి ధర్మపత్ని, ఆశ్రమంలో వుండే జంతు సంతానం వాళ్ళకి ఆత్మసంతానం. ఇలాంటి వాళ్ళిద్దర్ని చూసి దేవతలు మెచ్చుకుంటూ, గంధర్వులు ఆడుకుంటూ, కిన్నరులు పాడుకుంటూ వున్నారు.

కొంతకాలం గడిచాక ఒకనాడు లిఖితుడు శంఖుడి ఆశ్రమానికి వచ్చాడు. కొంతసేపు కూర్చుని అక్కడ ఒక చెట్టుకి వున్న రెండు పండ్లు కోసుకుని తిని చెయ్యికడుక్కుని కూర్చున్నాడు. తర్వాత అన్న శంఖుడు వచ్చి జరిగింది తెలుసుకుని విచారంగా కూర్చున్నాడు.

లిఖితుడు అన్నా! ఏమయింది అనడిగాడు. నా అనుమతి లేకుండా చెట్టు పండ్లు కోసుకు తిన్నావు. ఇంత బ్రహ్మజ్ఞానివి, ఇంత చిన్న తప్పు ఎందుకు చేశావు? దొంగతనానికి యమదండన తప్పదుకదా! నీకు. నా చెట్టు పండ్లు కోశావు, నాకు నష్టం వచ్చిందనికాదు. ఎంతటి మునీశ్వరులైన ధర్మసంశయం కలిగినప్పుడు మనల్నే కదా అడుగుతున్నారు. అధర్మం మనం చేసినప్పుడు ధర్మం చెప్పే అధికారం మనకు వుండదు కదా అన్నదే నా బాధ అన్నాడు శంఖుడు.

లిఖితుడు అన్నా! ఇప్పుడు నన్నేం చెయ్యమంటావో చెప్పు. నువ్వేం చెయ్యమన్నా చేస్తాను, నాకు ఏ శిక్ష విధించినా భరిస్తానన్నాడు.

దొంగతనం చేసినవాడు రాజదండన పొందితే యమదండన పొందక్కర్లేదు. మన దేశపు రాజు సుద్యుమ్నుడు ధర్మ ప్రభువు. అతనికి జరిగింది చెప్పి శిక్ష అనుభవించి వచ్చెయ్యి అన్నాడు. లిఖితుడు అన్న పాదాలకి నమస్కారం చేసి రాజు దగ్గరికి బయల్దేరాడు.

లిఖిత మహర్షి వచ్చాడన్న వార్త విన్న రాజు ఎదురెళ్ళి భయ భక్తులతో నమస్కారం చేసి లోపలికి తీసికెళ్ళి ఆయన పాదాలు పట్టుకుని తపోనిధీ! మీర్కిడకు రావడం వల్ల నా జన్మ ధన్యమైంది. నా గృహం పావనమైంది, ఏం చెయ్యమంటారో ఆజ్ఞాపించండి అన్నాడు.

జరిగిందంతా రాజుకి చెప్పి గురువుగారికి చెప్పకుండా చెట్టు పండ్లు తిన్నాను కనుక నేను దొంగని. నువ్వు రాజువి కనుక నన్ను శిక్షించమన్నాడు లిఖితుడు.

అది విని రాజు మూర్ఛపోయాడు. మంత్రిగారు వచ్చి రాజుకి ఉపచారాలు చేశాడు. తెలివొచ్చిన తర్వాత రాజు మునీంద్రా! అంత తపశ్శాలివైన నిన్ను నేను దండించడమా! నిప్పుకి చెదలుపడ్తాయా? పరమ పుణ్యుడవయిన నీకు దొంగతన దోషమంటుతుందా? నేను ఆలోచించకుండా చెప్పింది చేస్తానని మాటిచ్చాను, అయ్యో! ఎంతపని చేశాను! అని బాధపడ్డాడు.

రాజా! నువ్వు నా మాట వినివలసిందే. ఇంక తప్పదు, దీనివల్ల నీకు ఏ పాపమూ రాదు అన్నాడు లిఖితుడు.

రాజు మనస్సులో భగవంతుణ్ణి ధ్యానించి లిఖితుడి చేతులు నరికేసి కళ్ళనుంచి నీళ్ళు కారుతుంటే చేతులు జోడించి నిలబడ్డాడు.

లిఖిత మహర్షి ఆనందంతో అన్నగారి దగ్గరికి పరుగెత్తి అన్నా! మహారాజుతో దండితుణ్ణి అయ్యానని చెప్పి స్నానానికి వెళ్ళి అర్ఘ్యమివ్వడానికి చేతులులేవే అనుకుని నీళ్ళలో మునిగి లేచేసరికి చేతులు వచ్చేశాయి.

శంఖుడు తమ్ముణ్ణి కౌగిలించుకుని లిఖితా! ఇది మన తపస్సు ప్రభావమే. ఇంక నువ్వెళ్ళి ఇంతకు ముందులాగే వుండమని చెప్పాడు.

శంఖలిఖితులిద్దరూ గొప్ప స్మృతికర్తలు. ''శంఖస్మృతి'', ''లిఖితస్మృతి'', "శంఖలిఖితస్మృతి" ఇలా అనేక స్మృతులున్నాయి. ఆ అన్నదమ్ములిద్దరూ అన్యోన్యంగా వుండి బ్రహ్మచారులై, తపసిద్ధులై, స్మృతికర్తలు కూడా అయ్యారు.

ఎంతోమంది అన్నదమ్ములకి వీళ్ళు మార్గదర్శకులు.

ఇదర్రా శంఖలిఖిత మహర్షుల కథ!!

# 88. శాండిల్య మహర్షి

మనం శాండిల్య మహర్షిని గురించి తెల్సుకుందామా!

చదవడం మొదలుపెట్టండి మరీ .... !

పూర్వం శండిలుడనే ఋషి ఉండేవాడు. ఆయన కొడుకే శాండిల్యుడు. చిన్నప్పటి నుంచీ శాండిల్యుడు శివభక్తుడు.

ఉపనయన సంస్కారాలయ్యాక గురువుగారి దగ్గర బ్రహ్మ విద్యోపదేశం పొంది బ్రహ్మచర్య దీక్షతో అతిధ్వన్వుడనే బ్రహ్మఋషిని బ్రహ్మవిద్యాబోధన చెయ్యమని అడిగాడు.

అతిధన్వుడు వత్సా! సామమునకు గతి స్వరం, స్వరానికి గతి ప్రాణం, ప్రాణానికి గతి అన్నం, అన్నానికి గతి నీళ్ళు, నీళ్ళకి గతి పైలోకం. పైలోకం అంటే స్వర్గలోకం. దానికి గతి ఈలోకం. ఎందుకంటే పైలోకానికి వెళ్ళాలంటే కావలసిన తపస్సు, పూజలు, దానాలు అన్నీ ఇక్కడ చేస్తేనే కదా ఆ లోకానికి వెళ్ళగలం. అందుకే ఈ లోకాన్ని రథంతరసామము అంటారు అని చెప్పాడు.

ఈ లోకానికి గతి ఆకాశం. ఆకాశం నుంచే సర్వజీవులు పుట్టి ఆకాశంలోనే తిరిగి చేరుకుంటున్నాయి. కాబట్టి ఆకాశమే అన్నింటికీ ఆధారం. దీన్ని 'ఉద్గీథ' అంటారు. ఈ ఉద్గీథ ధ్యానించే బ్రహ్మ విద్వద్యుడయ్యాడు అని కూడ అతిధన్వుడనే బ్రహ్మర్షి శాండిల్యుడికి చెప్పాడు.

శాండిల్యుడు ఒకనాడు సరోవరంలో స్నానం చేస్తూ ధాన్యమాలిని అనే అప్సరసని చూసి ఇష్టపడి ఆమెని తనతో గడపమని అడిగాడు దానికి ఆమె మూడు రోజుల తర్వాత వస్తానని చెప్పి వెళ్ళి పోయింది.

అలా వెళ్ళిన ధాన్యమాలిని గంధమాదన పర్వతం మీదకి వెళ్ళి తన్మయత్వంగా పాడుకుంటోంది. రావణాసురుడు దిగ్విజయ యాత్ర చేసి సేనాసమేతుడై అక్కడ వుండడం ధాన్యమాలిని చూడలేదు. కాని రావణుడు ధాన్యమాలినిని చూసి ఆమె వద్దన్నా వినకుండా ఆమెని అవమానపరిచాడు.

శాండిల్యుడికిచ్చిన మాటప్రకారం ధాన్యమాలిని మూడురోజుల తర్వాత అతని దగ్గరికి వెళ్ళింది. శాండిల్యుడు దివ్యదృష్టితో చూచి అపవిత్రురాలివైన నువ్వు నా దగ్గర కొచ్చావు కాబట్టి మొసలివై ఈ సరోవరంలోనే వుండమని శపించాడు.

ధన్యమాలిని స్వామీ! ఇందులో నా తప్పులేదు. రావణుడి ముందు నేను నిస్సహాయురాల్నై ఏమీ చెయ్య లేకపోయానని ప్రార్థించింది. అయితే ఆంజనేయుడు రామకార్యంలో ఇటు వచ్చినప్పుడు నీకు శాపవిమోచనం అవుతుందని చెప్పి వెళ్ళిపోయాడు శాండిల్య మహర్షి.

విదర్భదేశాన్ని సత్యరథుడనే రాజు పాలిస్తుండేవాడు. నియమనిబద్ధుడై రాజ్యం చేస్తుండగా శత్రువులు అతడ్ని చంపేశారు. అప్పటికి అతని భార్య గర్భవతి. శత్రువులకి కనిపించకుండా వెళ్ళి ఒకచోట చెట్టుక్రింద కూర్చుని విశ్రాంతి తీసుకుంటుండగా ఆమెకు కాన్పు అయ్యింది. మగ పిల్లవాడు పుట్టాడు.

ఆ పిల్లాణ్ణి అక్కడ పడుకోబెట్టి మంచినీళ్ళు త్రాగుదామని సరోవరం దగ్గరికి వెళ్లిన రాణిని దాంట్లో వున్న మొసలి మింగేసింది. ఆ దార్లో వెడుతున్న ఒక బ్రాహ్మణ స్త్రీ ఆ పిల్లాడి ఏడుపు విని ఆక్కడ నిలబడి ఏం చెయ్యాలా! అని ఆలోచిస్తుండగా అటువైపే వెడుతున్న ఒక ముష్టివాడు, తీసికెళ్ళి పెంచమ్మా! నీకు మంచే జరుగుతుందని చెప్పాడు.

ఆమె ఆ పిల్లవాణ్ణి తీసికెళ్ళి తన కొడుకుతో పాటు పెంచుతోంది. అక్కడి బ్రాహ్మణులు ఇద్దరి పిల్లలకి ఉపనయం చేశారు. వాళ్ళిద్దరు విభూతి పూసుకుని తల్లితో కలసి బిక్షకి వెడుతూ శివాలయం కనిపిస్తే అక్కడికి వెళ్ళారు.

అక్కడ శాండిల్య ముని ఈ పిల్లల్ని చూసి కర్మని తప్పించుకోడం ఎవరి తరం? పుట్టింది మహారాజమాతకి, తింటుంట బిచ్చ మెత్తుకుని అన్నాడు.

ఆ తల్లి ఆశ్చర్యపడి శాండిల్యుడితో స్వామీ! ఇతని తల్లితండ్రులెవరు? ఎందుకు మరణించారు? చెప్పమని అడిగి ఆ పిల్లవాడు రాజ కుమారుడని తెలుసుకుంది. అతని తల్లితండ్రులు చేసిన పాపమేమిటని అడిగింది శాండిల్య మహర్షిని.

అతని తండ్రి శివభక్తుడు, కాని కష్టం వచ్చినప్పుడే శివపూజ చేసేవాడు. చివరికి శివపూజ పూర్తిగా విడిచి పెట్టి చనిపోయాడు. ఇతని తల్లి పూర్వ జన్మలో తన సవతికి విషం పెట్టి చంపింది. అందుకే ఇప్పుడు మొసలి వల్ల చనిపోయిందని చెప్పాడు శాండిల్యుడు.

అప్పుడా బ్రాహ్మణ స్త్రీ శివపూజ గురించి చెప్పమని అడిగింది. శుక్ల కృష్ణ త్రయోదశీ తిథుల్లో పగలు ఉపవాసముండి సాయంత్రం శివపూజ చేసి దానము, దక్షిణలిచ్చి పురోహితుణ్ణి తృప్తి పరచి ఆ తర్వాత భోజనం చెయ్యాలని శాండిల్యుడు శివపూజ గురించి వివరించాడు.

ఇదర్రా ! శాండిల్య మహర్షి కథ!!

చూశారు కదా..... శివభక్తితో బ్రహ్మర్షి దివ్యదృష్టిని కూడా పొందాడు శాండిల్య మహర్షి.

శివుడికి మూడో కన్నున్నట్లు శాండిల్యుడికి కూడా దివ్యదృష్టి వుందన్నమాట....

# 89. శుక మహర్షి

**పి**ల్లలూ! ఇప్పుడు మనం తెలుసుకోబోతున్న మహర్షి చాలా గొప్ప ఋషి. అతనికంటే ఘనుడు అన్నట్లు ఈ మహర్షులు ఒకళ్ళకంటె ఒకళ్ళు నేనంటే నేను అన్నట్లున్నారు కదూ..!

పరమ పవిత్రమైన భారత బ్రహ్మర్షుల్లో శ్రీశుక మహర్షి చాలా గొప్పవాడు. వేదవ్యాస మహర్షి తపస్సు చేసి పొందిన కొడుకు. శ్రీశుక మహర్షిని పోలిన మహర్షి త్రిభువనాల్లోనూ ఎక్కడ వెదికినా లేదు.

పూర్వం వేదవ్యాస మహర్షి 'కర్ణికారం' అనేవనంలో పరమేశ్వరుణ్ణి గురించి తపస్సు చేసి నీటికి, గాలికి, ఆకాశానికి, భూమికి, అగ్నికి సమానమైన కొడుకు కావాలని కోరుకుని వరం పొందాడు.

ఆయన కోరుకున్నట్లుగానే ఘృతాచి అనే చిలుక రూపంలో వున్న అప్సరస కారణంగా శ్రీశుకుడు పుట్టాడు.

శుక మహర్షి పుట్టినప్పుడు ఆకాశగంగ వచ్చి స్నానం చేయించింది. ఆకాశం నుంచి కృష్ణాజినం, దండం వచ్చాయి. దివ్యదుందుభులు మ్రోగాయి, దేవతలు గానం చేస్తూ, పుష్ప వర్షం కురిపించారు. పార్వతీ సహితంగా పరమేశ్వరుడు వచ్చి ఉపనయం చేశాడు. ఇంద్రుడు కమండలం, దేవతలు ఎప్పుడూ మాయని దివ్య వస్త్రాలు ఇచ్చారు.

శ్రీశకుడికి పుట్టకతోనే వేదాలు వచ్చేశాయి. అయినా బృహస్పతి దగ్గర మిగిలిన విద్యలన్నీ నేర్చుకున్నాడు. అతడు తిరిగి తండ్రి దగ్గరకు వచ్చి ఉండిపోయాడు.

కొంతకాలం తర్వాత వ్యాసుడు తన కొడుకు శుకుణ్ణి మోక్ష మార్గం గురించి తెలుసుకోమని జనక మహారాజు దగ్గరకి పంపించాడు. కాని నడిచి మాత్రమే వెళ్ళమని చెప్పాడు వ్యాస మహర్షి.

తండ్రి చెప్పిన ప్రకారం శ్రీశుకుడు మిథిలా నగరానికి వెళ్ళాడు. ద్వారపాలకులు మొదట లోపలికి పంపించలేదు, తర్వాత పంపారు. జనక మహారాజు మంత్రితో సహా ఎదురొచ్చి అర్ఘ్య పాద్యాలిచ్చి లోపలికి తీసుకెళ్ళాడు. బంగారు సింహాసనం మీద కూర్చోపెట్టి పూజచేశాడు.

జనక మహారాజుని మోక్షమార్గం గురించి చెప్పమన్నాడు శుక మహర్షి. జనకమహారాజు మోక్షమార్గం గురించి విపులంగా శుక మహర్షికి చెప్పి పంపాడు. తర్వాత శుక మహర్షి తండ్రి దగ్గరే వుండి శిష్యులకి బోధించటం ప్రారంభించాడు.

శ్రీశుకుడు తండ్రి వలన కాలావయవ నిరూపణ, చతుర్యుగ ధర్మాలు, బ్రహ్మం, దాని విజ్ఞానం, సర్వ వర్ణ ధర్మాలు, దానగుణ ప్రాశస్త్యం, మైత్రి గుణలాభం, ఇంద్రియ నిగ్రహం ఇలాంటివెన్నో నేర్చుకున్నాడు.

తండ్రితో అన్ని విషయాల గురించి చెప్పించుకుని ఆచరించి బ్రహ్మర్షియై వెలిగాడు శుకుడు. ఆత్మజ్ఞానంతో బాహ్య ప్రపంచం మర్చిపోయి శరీరం మీద దుస్తులు కూడా లేకుండా తిరుగుతుంటే అల్లరి పిల్లలు వెంటపడేవాళ్ళు.

తక్షకుడి విషంతో ఏడు రోజుల్లో మరణించేలా శాపాన్ని పొందిన పరీక్షిత్తు దగ్గరకి శ్రీశుకుడు వెళ్ళి అతనికి ముక్తి కలిగేలా తన తండ్రి రాసిన భాగవత కథ వినిపించాడు. మిగిలివున్న ఏడు రోజులు వేరేది ఆలోచించక భగవంతుడి యందే మనస్సుంచి ధ్యానం చెయ్యమని చెప్పి పరీక్షిత్తుకు బ్రహ్మలోకం కలిగేలా చేశాడు.

శ్రీశుకుడు తండ్రి ఆశ్రమంలోనే వుండి సుమంతుడు మొదలైన వాళ్ళతో వేదాధ్యయనం చేస్తుండేవాడు. కొంతకాలం తర్వాత మిగిలిన వాళ్ళందరు మూడు లోకాల్లోను వేదాలు విస్తరించేలా చెయ్యడం కోసం వెళ్ళారు.

ఒకరోజు నారదుడు వ్యాస మహర్షి ఆశ్రమానికి వచ్చి ఎక్కడా వేదాధ్యయనం వినిపించడం లేదని అడిగాడు. వ్యాసుడు శిష్యులు లేకపోవడం వలన వినిపించడం లేదని చెప్పాడు.

నువ్వు, నీ కొడుకయినా అధ్యయనం చెయ్యండని చెప్పి శుకుణ్ణి నీకేంకావాలో అడగమన్నాడు నారదుడు. ఈలోకంలో పుట్టిన నాకు ఏది మంచో చెప్పమన్నాడు శుక మహర్షి. యోగసిద్ధి మంచిదని నారదుడు చెప్పగానే శుక మహర్షి ప్రదక్షిణం చేసి తండ్రికి చెప్పి కైలాస పర్వతం మీద తపస్సు చేసి యోగ సిద్ధి పొందాడు.

నారదుడు శ్రీశుకుణ్ణి చూడ్డానికి వెడితే అతనికి ఆత్మయోగం చెప్పి ఆకాశంలోకి ఎగిరిపోయాడు శుకుడు. మిగిలిన సిద్ధులు ఆశ్చర్యపోయారు. అలా వెళ్ళిపోతూ మృగాలికి, పక్షులకి, పర్వతాలకి తన తండ్రి వచ్చి శుకా! అని పిలిస్తే ఓయని పలకమని చెప్పాడు శుక మహర్షి.

శుకుడు ఆకాశ గంగ మీద ఆకాశంలో వెడుతూ వుంటే దాంట్లో స్నానం చేస్తున్న స్త్రీలు అతన్ని చూసి సిగ్గుపడలేదు, కాని అదే వ్యాసుడు వెడుతుంటే సిగ్గుపడ్డారు. అది చూసిన వ్యాసుడికి తనని చూసుకుని తనకే సిగ్గనిపించింది. ఎందుకంటే శ్రీశుకుడు పసిబిడ్డ మనసులాంటి మనసున్నవాడు, ఆడ, మగ ఎవరో తెలియనివాడు.

వ్యాసుడు శుకుడు కనిపించక శుకా! అని పిలుస్తే 'ఓ'యని వినిపింపిందిట. ఇంతలో ఈశ్వరుడు వచ్చి బాధపడుతున్న వ్యాసుణ్ణి ఓదార్చి నీకు కావలిసనట్లే నీ కొడుకు చాలా గొప్పవాడయ్యాడు, ఇంకెందుకు బాధపడతావని చెప్పి పంపించాడు.

ఇదర్రా శుక మహర్షి కథ!!!

బాగిందికదూ!

# 90. శుక్ర మహర్షి

రండమ్మా! మీరు మంచిపిల్లలు. ఎంత చక్కగా అర్థం చేసుకుంటున్నారో! మీకు ఆ ఇంగ్లీషు చదువుల్లోపడి ఈ ఋషులూ, కథలూ ఇవన్నీ ఎమిట్రా బాబో.... అనుకుంటున్నారేమో అనుకున్నాను. కానీ మీరేమో, తర్వాత ఏ ఋషి గురించి తెలుసుకుంటున్నాం? అని ఉత్సాహంతో ముందు కొచ్చేస్తున్నారు.

ఇంకెందుకు మొదలుపెట్టండి మరి.......

ఇప్పుడు మనం తెలుసుకుంటున్న మహర్షి 'శుక్ర మహర్షి'.

భృగు మహర్షి నవబ్రహ్మల్లో ఒకడు. ఆయన కొడుకు ఉశనసుడు. ఇతడు చిన్నతనంలోనే అన్ని విద్యలు సంపాదించి మహా తపస్సు చేసి 'మృతసంజీవని' అంటే చనిపోయినవారిని బ్రతికించడం అనే గొప్ప విద్యని సంపాదించి లోకానికే మంచి చేశాడు.

ఇన్ని విద్యలు నేర్చుకున్న ఉశనసుడు మహాగర్వంతో కుబేరుణ్ణి మోసం చేసి ధనమంతా ఎత్తుకుపోయాడు. ఇది తెలిసి శివుడు శూలంతో వచ్చి గర్జన చేశాడు. ఉశనసుడు భయపడి ఎక్కడకెళ్ళినా శివుడు ఎలాగూ వదిలిపెట్టడని తెలిసి శివుడి దగ్గరికే వెళ్ళాడు. అప్పటికే కోపంలో వున్న శివుడు అతణ్ణి మింగేశాడు.

శివుడి కడుపులో కొట్టుకుంటున్న ఉశనసుడు బయటకి రాకుండా తన దేహ రంధ్రాలన్నీ మూసేసి మూత్రద్వారం ఒకటే వుంచాడు శివుడు. చేసేది లేక అందులోంచే బయటకు వచ్చిన ఉశనసుణ్ణి మళ్ళీ కోపంతో శూలం తీస్తుంటే పార్వతి వారించింది.

నీ దయతో బ్రతికిపోయాడు అని పార్వతీ దేవికి చెప్పి, అతడికి గొప్ప తేజస్సిచ్చి వీడు సవ్యంగా రాలేదు కనుక మంచివాళ్ళకి కాకుండా రాక్షసులకి గురువు అవుతాడు. ఇప్పటి నుండి ఇతడి పేరు శుక్రాచార్యుడని చెప్పాడు శివుడు. తర్వాత కుబేరుడి ధనమంతా కుబేరుడికి ఇప్పించాడు.

అప్పటి నుండి దేవగురువు బృహస్పతి, రాక్షస గురువు శుక్రాచార్యుడు.

శుక్రాచార్యుడ్ని గురువుగా పెట్టుకుని హిరణ్యకశిపుడు 72,61,60,000 సంవత్సరాలు మూడు లోకాల్ని ఏకచ్ఛత్రాధిపతిగా తనని కాదనగలిగేవాడు లేకుండా పాలించాడు.

కొంతకాలం తర్వాత రాక్షసులకి వరుసగా అపజయాలే కలుగుతుంటే శుక్రాచార్యుడుకి మొరపెట్టుకున్నారు రాక్షసులు. రాక్షసులకి నేను శివుణ్ణి ధ్యానించి శస్త్రాస్త్రాలు తీసుకువస్తానని చెప్పి శివుణ్ణి ధ్యానించాడు శుక్రాచార్యుడు.

నువ్వు దేవతల్ని ఓడించాలంటే తలక్రిందులుగా వెయ్యి సంవత్సరాలు తపస్సు చేస్తేనే ఆశక్తి వస్తుందని చెప్పాడు శివుడు.

శుక్రుడు తపస్సు మొదలు పెట్టాడు. ఈలోగా ఇంద్రుడు రాక్షసుల్ని చంపేస్తుంటే వాళ్ళందరూ వెళ్ళి శుక్రాచార్యుడి తల్లి ఉశనని కాపాడమని అడిగారు. భృగుపత్ని అయిన ఉశన నిద్రాదేవతని ఇంద్రుడి పైకి పంపడంతో ఇంద్రుడు ఒకచోట కునికిపాట్లు పడుతూ ఉండిపోయాడు.

దేవతలంతా వెళ్ళి విష్ణువుని ప్రార్థించారు. ఇంద్రుణ్ణి విష్ణుమూర్తి తనలోకి ప్రవేశించమని యుద్ధానికి వెళ్ళాడు. కాని ఉశన విష్ణువునే శపించబోతుంటే విష్ణువు ఆమెతల నరికేశాడు.

ఆసమయంలో భృగుమహర్షి వచ్చి తన భార్యని చంపిన విష్ణుమూర్తిని భూమి మీద ఏడుసార్లు పుట్టమని శపించాడు. ఇది విష్ణులీల కాక మరేమిటి?

శుక్రచార్యుడు శివుణ్ణి మెప్పించి శస్త్రాస్త్రాలు తీసికుని వస్తే దేవతలకి కష్టమని తన కూతురు జయంతిని శుక్రుడికి సపర్యలు చెయ్యడానికి పెట్టాడు ఇంద్రుడు.

శుక్రాచార్యుడికి శివుడు ప్రత్యక్షమై వరాలిచ్చాడు. తరువాత శుక్రుడు జయంతిని పెళ్ళి చేసుకోమని అడిగాడు. పదివేల సంత్సరాలు నాతోనే వుంటానంటే చేసుకుంటానని చెప్పింది జయంతి. శుక్రుడు అలాగే వుండిపోయాడు.

శుక్రడెంతకీ రాకపోవడం వల్ల బృహస్పతి శుక్రుడి రూపంతో రాక్షసుల్ని మోసం చేశాడు. వెయ్యి సంవత్సరాల తర్వాత శుక్రుడు వచ్చి జరిగింది తెలుసుకుని రాక్షసులకి నిజం చెప్పినా వాళ్ళు వినలేదు.

కొంతకాలం తర్వాత అసలు నిజం తెలిసిన రాక్షసులు శుక్రాచార్యుణ్ణి వెతికి తమ తప్పుకి క్షమించమని అడిగారు, శుక్రుడు వినలేదు. చివరికి ప్రహ్లాదుడు వెళ్ళి రాక్షసులు తెలియక చేశారు కాబట్టి వాళ్ళని క్షమించమన్నాడు.

శుక్రుడు మళ్ళీ బలిని చక్రవర్తిగా చేసి 20,30,64,000 సంవత్సరాలు పరిపాలించేలా చేశాడు.

వృషపర్వుడనేరాజు శుక్రుణ్ణి తన దగ్గరుంచుకుని భక్తి గౌరవాలతో చుస్తున్నాడు. రాక్షసులందర్నీ శుక్రుడు మృతసంజీవని విద్యతో బ్రతికించేస్తుంటే వాళ్ళని చంపడం కుదరక ఆ విద్య ఎలా నేర్చుకోవాలా? అని ఆలోచించి దేవతలు బృహస్పతి కొడుకు కచుణ్ణి 'మృతసంజీవని' నేర్చుకునేందుకు పంపించారు.

కచుడు శుక్రాచార్యుడికి సేవచేసి ప్రియశిష్యుడయ్యాడు. అంతేకాకుండా గురువుగారి కూతురు దేవయానికి స్నేహితుడయ్యాడు.

రాక్షసులు ఒకసారి కచుణ్ణి చంపేసి చెట్టుకి కట్టేస్తే శుక్రుడు బ్రతికించాడు. మళ్ళీ రాక్షసులు కచుణ్ణి బూడిదచేసి మద్యంలో కలిపి శుక్రుడితో త్రాగించారు.

తండ్రిని కచుడెక్కడున్నాడో చూసి తీసుకురమ్మంది దేవయాని. శుక్రుడు కడుపులో వున్న కచుడ్ని బ్రతికించి, అతడికి మృతసంజీవని విద్యను నేర్పించి బయటకొచ్చి తనను కూడా బ్రతికించమన్నాడు. కచుడు బయటకి వచ్చి గురువుగార్ని కూడా బ్రతికించాడు.

కచుడికి మృతసంజీవనీ విద్య నేర్పిస్తే దేవతలకి మంచి జరుగుతుందని తెలిసి కూడా కచుడి గురుభక్తికి మెచ్చి ఆ విద్యని నేర్పించి గొప్పతనాన్ని నిరూపించుకున్నాడు శుక్రాచార్యుడు.

కచుణ్ణి తనని పెళ్ళి చేసుకోమన అడిగింది దేవయాని. గురువు కూతుర్ని పెళ్ళి చేసుకోవడం ధర్మం కాదని చెప్పాడు కచుడు. దేవయాని కోపంతో నువ్వు నేర్చుకున్న విద్య నీకు ఉపయోగపడదని కడుణ్ణి శపించింది.

పోన్లే నాకు ఉపయోగించకపోయినా ఫర్వాలేదు. నేను నేర్చుకున్నది పరోపకారం కోసం. నువ్వు నన్ను శపించావు కనుక బ్రాహ్మణుడెవ్వడూ నిన్ను పెళ్ళి చేసుకోకుండా నిన్ను నేను శపిస్తున్నానని చెప్పి కచుడు వెళ్ళిపోయాడు.

రాజు వృషపర్వుడి కుమార్తె శర్మిష్ఠ తన వెయ్యిమంది చెలికత్తెలతోనూ, దేవయానితోనూ వన విహారానికి వచ్చి  దేవయానితో మాట పట్టింపు వచ్చి పాడుపడ్డ బావిలో ఆమెని తోసి వెళ్ళిపోయింది.

యయాతిరాజు వేటకి వచ్చి దాహం తీర్చుకుందామని నీళ్ళకోసం బావిలోకి చూసి అందులో వున్న దేవయానిని బయటకి తీసి వెళ్ళిపోయాడు.

నేనింక ఇంటికి రానని తండ్రికి కబురుచేసింది దేవయాని. శుక్రాచార్యుడు ఎంత బ్రతిమాలినా వినకుండా శర్మిష్ఠని ఆమె చెలికత్తెల్ని నా దాసీలుగా చేస్తేనే వస్తానని చెప్పింది.

విషయం తెల్సిన వృషపర్వుడు కూతరు శర్మిష్ఠని ఆమె వెయ్యిమంది చెలికత్తెలనీ దేవయానికి దాసీలుగా చేశాడు.

ఒకనాడు అందరూ కలసి వన విహారానికి వెళ్ళినప్పుడు అక్కడ యయాతి రాజు కనిపించాడు. దేవయాని తండ్రి శుక్రాచార్యుడికి చెప్పి యయాతిని పెళ్ళి చేసుకుంది. దేవయానితో శర్మిష్ఠని చెలికత్తెల్ని కూడా పంపించి యాయాతిని పిలిచి శర్మిష్ఠని భార్యగా చూడవద్దని చెప్పాడు శుక్రాచార్యుడు.

ఒకనాడు శర్మిష్ఠ తనకి పిల్లల్ని అనుగ్రహించమని యాయాతిని బ్రతిమాలింది. క్రమంగా శర్మిష్ఠకి ముగ్గురు కొడుకులు పుట్టారు.

దేవయానికిదంతా తెలిసి తండ్రికి చెప్పింది. శుక్రుడు యయాతిని ముసలివాడవయిపొమ్మని శపించాడు. మళ్ళీ తన తొందరపాటుకి చింతించి యయాతితో నీ ముసలితనం నీకొడుకుకు ఇచ్చి సుఖాలనుభవించాక మళ్ళీ నీ యౌవనం నీకొడుక్కిచ్చి నీ ముసలితనం నువ్వు తీసికోవచ్చు అంతేకాదు, అందుకు ఇష్టపడిన కొడుకే నీ తర్వాత రాజయి వంశం నిలబెడ్తాడు అన్నాడు శుక్రాచార్యుడు.

శుక్రాచార్యుడు బలిచక్రవర్తితో వందలకొద్దీ యజ్ఞాలు చేయించి, దానాలిప్పించి, సత్యం, త్యాగం, ధర్మం, దయ, యోగం అతనికి పంచ ప్రాణాలుగా చేసి తను గొప్ప గురువుగా నిరూపించుకున్నాడు.

ఒకనాడు విష్ణుమూర్తి వామనరూపంలో బలిచక్రవర్తిని మూడడుగులు దానం అడిగితే బలి సరేనన్నాడు. కాని శుక్రుడు బలి చక్రవర్తికి ఈ దానం ఇవ్వద్దు. దీనివల్ల రాక్షస లోకం నాశనం అయిపోతుంది. అంతా సర్వనాశనం అయిపోతున్నప్పుడు మాట తప్పినా పర్వాలేదని ఎంత నచ్చచెప్పినా వినలేదు బలిచక్రవర్తి.

గురువుగా శుక్రాచార్యుడు తాను తయారుచేసిన శిష్యుణ్ణి చూసి గర్వించాడు. అతనికి యిష్టమైనట్లే చెయ్యమని చెప్పాడు.

శుక్రాచార్యుడు "ఔశనసంహిత" అనే గ్రంథం రాశాడు. దాంట్లో వివాహాల గురించి, కులాంతర వివాహాల గురించి కూడా రాశాడు.

శౌనకుడు మొదలయిన మునులందరు శుక్రాచార్యుణ్ణి ధర్మశాస్త్రం గురించి వివరంగా చెప్పమని అడిగినప్పుడు తండ్రికి నమస్కరించి చెప్పడం మొదలుపెడితే అది తొమ్మిది అధ్యాయాల్లో 'ఔశనసస్మృతి' అనే గ్రంథంగా తయారయ్యింది.

దాంట్లో బ్రహ్మచారి విధుల గురించి, గాయిత్రీ మంత్రం గురించి, శ్రాద్ధ విషయాలు, గృహస్థు చెయ్యాల్సిన ప్రేతకర్మ, అశౌచం, ప్రాయశ్చిత్తం, మొదలయినవన్నీ వివరంగా వున్నాయి.

శుక్రాచార్యుడు ఎంత గొప్పవాడో చూశారా. ఏ వైద్యుడు చెయ్యలేని పని చనిపోయినవాళ్ళని బ్రతికించడం తన మృతసంజీవని విద్యతో చేశాడు. ఏ దేవతలకి, ఏ రాక్షసులకి రాని విద్య అది.

నవబ్రహ్మల్లో ఒకడిగా పుట్టి, రాక్షసులకి గురువై రాక్షసులకే మంచి చేశాడు కానీ, తన వాళ్ళయిన దేవతలకు చెయ్యలేదు. స్వార్థం చూపించలేదన్నమాట! ఎంత గొప్పవాడో చూశారా!

శుక్రాచార్యుణ్ణి ధ్యానిస్తే మనికి కూడా ఆరోగ్యం ఆయుష్షు కలుగుతాయి తెలుసా!

ఇది పిల్లలూ ! శుక్రమహర్షి కథ!

# 91. శ్వేతకేతు మహర్షి

వచ్చారా! మనమిప్పుడు శ్వేతకేతుడనే మహర్షి గురించి తెలుసుకుందాం సరేనా!

పూర్వం మంత్ర ద్రష్ట, మంత్రవేత్త, మంత్ర మహితుడు, మహాతపస్వి అయిన ఉద్ధాలకుని కొడుకు శ్వేతకేతుడు.

అష్టావక్రుడి మేనమామ శ్వేతకేతుడు. ఇద్దరూ ఒకే సమయంలో పుట్టారు. స్వచ్ఛమైన తెల్లటి రంగుగల శరీరంతో పుట్టాడని శ్వేతకేతుడకి ఆ పేరు పెట్టారు. అష్టావక్రుడు శ్వేతకేతుడు ఒకే చోట పెరిగారు.

శ్వేతకేతుడు చిన్నతనంలోనే సర్వ వేదశాస్త్రాలు, వేద రహస్యాలు, ధర్మ మర్మాలు తెలుసుకుని పూర్ణిమనాటి చంద్రుడిలా వెలిగిపోయాడు.

శ్వేతకేతుడు మహా తపస్సు చేసి బ్రహ్మజ్ఞానం పొంది వేదతత్త్వం, క్రియాస్వరూపం, కర్మఫల త్యాగం, ఆత్మజ్ఞానం సంపాదించి బాల సూర్యుడిలా ప్రకాశించాడు.

శ్వేతకేతుడికి పెళ్ళి చేయ్యాలని నిర్ణయించుకున్నాడు ఉద్దాలకుడు.

అదే సమయంలో మహాతపస్వి, వేదవేత్త, శాస్త్రవిజ్ఞుడు, ఆచారవంతుడు, ధర్మజ్ఞుడు అయిన దేవల మహర్షి తన కూతురు సువర్చలకి పెళ్ళి చేయ్యాలని వరుడి కోసం వెతుకుతున్నాడు.

సువర్చల విద్య, వినయం, విజ్ఞానం, అందం అన్నీ కలబోసి లక్ష్మీదేవిలా వుంటుంది. ఎవర్నిచ్చి చెయ్యాలా? అని దేవలుడు ఆలోచిస్తున్నాడు.

తండ్రితో గ్రుడ్డివాడు, గ్రుడ్డివాడు కానివాడు ఒకేకాలంలో వున్న మహాత్ముడైతేనే నేను పెళ్ళి చేసుకుంటానని చెప్పింది సువర్చల.

దేవల మహర్షి ఋషి కుమారుల్ని అందర్నీ పిలిపించి అల్లాంటివాడిని నువ్వే ఎంచుకోమని చెప్పాడు సువర్చలకి. ఏకకాలంలో అంధుడై, అంధుడు కానివాడు ఎవరుంటారని ఒక్కొక్కళ్ళే వెళ్ళి పోతున్నారు.

శ్వేతకేతుడు దేవలుడి దగ్గరికి వెళ్ళి నమస్కారం చేసి నేను అలాంటివాడ్నే అన్నాడు. సువర్చలకి వివరంగా చెప్పాడు. ప్రపంచం మిధ్య, వినడం, మాట్లాడడం, చూడడం, తాకడం, పన్లు చెయ్యడం ఇల్లాంటివన్నీ మిథ్య అని ఏ జ్ఞాన నేత్రానికి తెలుసో ఆ జ్ఞాన నేత్రం లేనివాడు గ్రుడ్డివాడు. అది నాకుంది కాబట్టి నేను గ్రుడ్డివాణ్ణి కాదు.

కాని నేను గ్రుడ్డివాణ్ణి .... లోకుల దృష్టిలో వాళ్ళల్లాగా నేను వస్తువులు చూడట్లేదు. వారి అజ్ఞాన దృష్టి నాకు లేదు. కాబట్టి వాళ్ళదృష్టిలో నేను గ్రుడ్డివాడిని.

ఈవిధంగా ఒకే క్షణంలో నేను గ్రుడ్డివాణ్ణి, గ్రుడ్డివాణ్ణి కాని వాణ్ణి కూడా. అందుకే నన్ను పెళ్ళి చేసుకోమన్నాడు శ్వేతకేతుడు.

సువర్చల అంగీకరించగానే దేవలుడు, ఉద్దాలకుణ్ణి మిగిలిన ఋషులందర్నీ పిలిచి సువర్చలాశ్వేతకేతులకి పెళ్ళి జరిపించి సువర్చలని అత్తవారింటికి పంపాడు. శ్వేతకేతుడు వేరే ఆశ్రమం ఏర్పాటు చేసుకుని గృహస్థధర్మం నిర్వర్తించాడు.

సువర్చాలా శ్వేతకేతులు ధర్మకార్యాలు చేస్తూ గుణవంతులైన పిల్లల్ని కని పితృదేవతల్ని, యజ్ఞాలు చేసి దేవతల్ని, తపస్సు అధ్యయనం అనే సత్ప్రవర్తనతో ఋషుల్ని సంతోషపెట్టి భూలోకంలోనే స్వర్గలోకం చూస్తూ అందరికీ చూపిస్తూ అపూర్వ దంపతుల్లా వెలిగారు.

శ్వేతకేతుడు బ్రహ్మజ్ఞాన విషయాలన్నీ భార్యకి చెప్పి ఆమెని కూడా జ్ఞానవంతురాల్ని చేసి చివరికి ఇద్దరు సన్యాసం తీసుకుని మోక్షం పొందారు.

సమంగానది దగ్గర సోమకశిచి తీర్థం దగ్గర శ్వేతకేతు తపస్సు చేసిన ప్రదేశాన్ని 'శ్వేతకేతుతీర్థం' అంటారు. ఇక్కడే సరస్వతీదేవి మనిషిరూపంలో శ్వేతకేతుడికి దర్శనమిచ్చింది.

దంపతులిద్దరూ చక్కగా జ్ఞానవంతులై అన్యోన్యంగా వుండి ధర్మకార్యాలు చేసి మోక్షం పొందారు. ఇద్దర్లో ఎవరికి ఎవరు తీసిపోలేదు.

# 92. శౌనక మహర్షి

ఇప్పుడు మనం శౌనక మహర్షి గురించి తెలుసుకుందాం. శౌనక మహర్షి అంటే మనకి నైమిశారణ్యం గుర్తుకొస్తుంది. కదూ!

పూర్వం విజ్ఞానఖని తపస్సంపన్నుడైన ఒక మహర్షి శునకుడనే పేరుతో వుండేవాడు. ఆ మహర్షి కొడుకే మన శౌనక మహర్షి. ఇంతమంది మహర్షుల పేర్లు చూస్తున్నాం కదా! మీకేం తెలుస్తోంది. చాలా వరకూ తండ్రి పేరులోంచే కొడుకు పేరు వస్తోంది. ఇక్కడ కూడా అంతే. తండ్రి శునకుడు. కొడుకు శౌనకుడు.

అయితే శౌనకుడు వేదవేదాంగాలు నేర్చుకుని, అన్ని యజ్ఞాలు చేయించగల సామర్థ్యం వచ్చాక తపస్సు చేసుకుందుకు నైమిశారణ్యానికి వెళ్ళాడు.

నైమిశారణ్యం ఎంత అందంగా వుండేదో కొంచెం మనం కూడా తెలుసుకుందాం. ఎందుకంటే మనం చూడగలమో లేదో.... అప్పుడున్నట్లుగా ఇప్పుడుందో లేదో.....

నైమిశారణ్యం విష్ణుమూర్తి మందిరంలా, మాధవీ మన్మధులకి ఇష్టమయినట్లూ, సరస్వతీదేవితో కలిసివున్న బ్రహ్మగారిల్లులా, ఈశ్వరసభలా, వహ్ని, వరుణ, సమీరణ, చంద, రుద్ర, హైమవతీ, కుబేర, గాలవ, శాండిల్యలాంటి మునులతో కూడుకుని, కుబేరుడి ఖజానాలా, రఘురాముడి యుద్ధంలా, పరశురాముడి పౌరుషంలా, కురుక్షేత్రంలా ఇంకా వేదాల్లా గాయత్రీ నిలయమై అమరావతీ పట్టణంలా, వైకుంఠపురంలా, పురుషోత్తముడి

సేవకవసరమైన ఫలాల్తో, లంకానగరంలా, సుగ్రీవుడి సైన్యంలా, గొప్ప గొప్ప మునుల తపస్సులతో పవిత్రమై, సూర్యరథంలా ఉండే ఆ ప్రదేశానికి శ్రీవిష్ణుక్షేత్రం అనే పేరు వచ్చింది.

అల్లాంటి నైమిశారణ్యంలో బ్రహ్మజ్ఞానిగా వెలిగిపోతున్న ఆ శౌనక మహర్షి ఎంతోమంది మునుల్ని శిష్యులుగా చేసుకుని ఉండిపోయాడు.

ఒకసారి శౌనకుడు వెయ్యి సంవత్సరాలు జరిగే సత్త్రయాగం చెయ్యాలని అనుకుని దాన్ని జరిపించడానికి సూతుణ్ణి ఎంచుకున్నాడు. సూతుడు ఎన్నో గ్రంథాలు చదివి, ఎన్నో పురాణాలు విని దివ్యజ్ఞానం పొందినవాడు.

సూతుడితో మునీంద్రా! వాణీదేవికి భూషణాలు, అన్ని పాపాలకు భీషణాలు, హృదయతోషణాలు అంతేకాక, ఆ భాషణాలు కల్యాణ విశేషణాలు. అలాంటి విష్ణుకథలు మళ్ళీమళ్ళీ వినాలనిపిస్తోంది, చెప్పమన్నాడు శౌనక మహర్షి.

అక్కడ మునులందరికి భగవంతుడి ఏకవింశత్యవతార కథలు అంటే విష్ణుమూర్తి అవతారం ఎత్తిన కథలు, అన్ని పురాణలు కూడా వాళ్ళకి విన్పించాడు సూతుడు.

కొన్నాళ్ళ తర్వాత మళ్ళీ శౌనకుడు లోకానికంతకీ మంచి జరగాలని ద్వాదశ సంవత్సర సత్త్రయాగం మొదలుపెట్టి మళ్ళీ సూతుణ్ణి పిలిచి మునులందరికీ భారత కథలు చెప్పించాడు.

ఈరకంగా నైమిశారణ్యం శౌనక మహర్షి చేసే యాగ సమయంలో విజ్ఞాన కథలు, పురాణాలు, ఇతిహాసాలు, సూతుడు శౌనకాదులకి చెప్తుంటే ఆ ప్రదేశం పుణ్యక్షేత్రమై బ్రహ్మలోకంలా అనిపించేది.

పాండవులు అరణ్యవాసానికి వెళ్ళినప్పుడు గంగాతీరంలో ఒక చెట్టు కింద ఒక రాత్రి గడిపి మళ్ళీ బయలుదేరారు. అక్కడున్న బ్రాహ్మణులు వాళ్ళ దగ్గరున్న అగ్ని హోత్రంతోపాటు పాండవుల వెనకాలే బయలుదేరారు. ధర్మరాజు దుఃఖంతో మూర్ఛపోయాడు. శౌనకుడు ధర్మరాజుని లేపి రాజ్యము ధనము పోయాయని బాధపడుతున్నవా? ధనం వల్ల దుఃఖమేకాని మంచి జరగదని చెప్పాడు.

ధర్మరాజు నేను ధనాన్ని ఎప్పుడూ నాకోసం కావాలనుకోలేదు. గృహస్థధర్మాలు నడపాలి కదా అందుకే అడిగానని చెప్పాడు. ఇప్పుడు నా బాధకి కారణం ఈ బ్రాహ్మణులందరూ నాతో వచ్చేస్తున్నారు కదా! వీళ్ళకి భోజనం ఎట్లా పెట్టాలో ........

ధర్మరాజు శౌనక మహాముని చెప్పినట్లు విని సూర్యుడ్ని ఆరాధన చేసి, ఆయన అనుగ్రహంతో అనేకవేల బ్రాహ్మణులకి అతిథిపూజ చేసి తర్వాత వెళ్ళాడు.

మునులందరూ మళ్ళీ చేరి శౌనక మహామునిని పద్మపురాణం చెప్పించమని అడిగారు. అదే సమయానికి సూతుడు వచ్చాడు. అందరూ ఆనందించి మాకు పద్మపురాణం చెప్పమని అడిగారు.

పద్మపురాణమంటే విష్ణుమూర్తి నాభినుంచి పుట్టిన కమలం గురించి చెప్పేది. కల్పాంతంలో మత్స్యరూపంలో వున్న ఆదిదేవుడు సముద్రం నుంచి వేదవేదాంగ పురాణలతో పద్మపురాణం కూడా దేవలోకంలోనూ, మనుష్య లోకంలోనూ ప్రతిష్టించబడింది.

దానిని హరి బ్రహ్మకి, బ్రహ్మ నారదుడికి, నారదుడు వ్యాసుడుకి, వ్యాసుడు నాకు చెప్పారని సూతుడు శౌనకాది మహామునులకి పద్మపురాణం వివరంగా చెప్పాడు.

శౌనకమహర్షి బ్రహ్మజ్ఞానిగా, బహువిధ యజ్ఞకర్తగా, మహాధర్మవేత్తగా కూడ ప్రసిద్ధికెక్కాడు. 'మదనరత్నప్రదీప' అనే ధర్మశాస్త్రం, 'చరణవ్యూహ' అనే ధర్మశాస్త్రం కూడ ఈయనవే. మను ధర్మశాస్త్రంలో శౌనకుడు ధర్మశాస్త్ర కర్తగా ఉండటమే కాకుండా 'ప్రణకల్ప' అనే గ్రంథం కూడా రచించాడు.

శౌనక మహర్షి సూతుడు చేత ఎన్నో పురాణాలు, భారత కథలు, విష్ణుకథలు అన్నీ చెప్పించడం వల్ల ఎంతోమంది మునులు విని తరించారు. మనకి కూడా కాలం కలిసి వచ్చి, భగవంతుడు అనుగ్రహిస్తే దశవతార కథలు, భారత కథలు తెలుసుకునేందుకు ఇలాగే మళ్ళీ కలుద్దాం..

ఇదర్రా శౌనక మహర్షి కథ!!

# 93. సనక సనందన సనత్కుమార సనత్సుజాత మహర్షులు

**పి**ల్లలూ! వచ్చేశారుకదా! ఇప్పుడు మనం చదవబోయే మహర్షులు సనక, సనందన, సనత్కుమార, సనత్సుజాత, మహర్షులు. వీళ్ళని నలుగుర్ని కలిపి సనకాదులు అని పిలుస్తారు. వీళ్ళు బ్రహ్మగారి మనస్సు నుండి పుట్టి, బ్రహ్మమానస పుత్రులుగా పిలవబడుతున్నారు.

బ్రహ్మ సనకాదుల్ని తనకు సృష్టి కార్యంలో సాయం చెయమన్నాడు. నువ్వు భగవద్ధ్యానామృతంలో మునిగి మమ్మల్ని సృష్టించావు. కాబట్టి, మాక్కూడ అదే వచ్చింది. మేము సృష్టి కార్యంలో నీకు సాయం చెయ్యలేం. నువ్వు ఎప్పుడు పిలిస్తే అప్పుడు వచ్చి నీకు మేలు చేస్తాం అన్నారు సనకాదులు.

సనకాదులు వాళ్ళిష్టం వచ్చినట్లు అన్నిలోకాలు తిరిగుతూ వైకుంఠానికి వచ్చారు. అక్కడ శ్రీమహావిష్ణువుని చూడాలనుకుంటే జయవిజయులనే ద్వారపాలకులు అడ్డగించారు. శ్రీ మహావిష్ణువుని చూడనివ్వలేదనే కోపంతో వాళ్ళని భూలోకంలో పుట్టమని శపించారు.

ఈ గొడవకి లక్ష్మీనారాయణులు బయటికి వచ్చారు. సనకాదులు వాళ్ళిద్దర్ని రెప్పవాల్చక చూస్తూ వుండిపోయారు. ఆనందంతోనూ భక్తితోనూ లక్ష్మీనారాయణులకి స్తోత్రం చేశారు.

గోవిందుడు సనకాదుల్ని నా ద్వారపాలకులికి మంచి శిక్ష వేశారు. వీళ్లు భూలోకంలో పుట్టి నాకు శత్రువులై నాతో యుద్ధం చేసి నా చక్రానికి ఆహుతై తిరిగి నా దగ్గరికే వస్తారు. తర్వాత వాళ్ళకి చావు పట్టుకలుండవు అన్నాడు నారాయణుడు.

సనకాదులు ఆనందభాష్పాల్తో ఆ దివ్యమంగళ విగ్రహానికి మళ్ళీమళ్ళీ మ్రొక్కి, లక్ష్మీదేవిని స్తుతించి విడవలేక, వెళ్ళలేక తమ ఆశ్రమానికి వెళ్ళారు.

గొప్ప హరిభక్తుడు, బ్రాహ్మణ పూజ చేసేవాడు, ప్రజలకిష్టమయ్యేలా పరిపాలన చేసేవాడయిన పృథు చక్రవర్తి దగ్గరకి ఆకాశమార్గంలో బాలసూర్యుల్లా, సిద్ధవర్యులు, గొప్ప జ్ఞానవంతులయిన సనకాదులు వచ్చారు.

పృథు చక్రవర్తి ఎంతో ఆనందంతో ఎదురెళ్ళి అర్ఘ్య పాద్యాలిచ్చి సింహాసనం మీద కూర్చోబెట్టి వారి పాదాలు కడిగి తలమీద చల్లుకుని యోగీశ్వరేశ్వరులారా! నెనెంత పుణ్యం చేసుకున్నానో మిమ్మల్ని చూడగలిగాను. చాలా అనందంగా వుంది. ఈ సంసారంలో దేనివలన నాకు మోక్షం కలుగుతుందో చెప్పండన్నాడు.

రాజా! శ్రద్ధ, భగవద్ధర్మ చర్య, భగవంతుడి గురించి తెలుసుకోవాలనే కోరిక, నారాయణ కథలు వినడం, అహింస, ఎప్పుడూ భక్తిమార్గాన్నే అనుసరించడం మోక్ష సాధనాలు. ధర్మార్థకామాలు మూడు విడిచిపెట్టి పరమ పురుషార్థమైన మోక్షానే కోరుకుంటే తప్పకుండా మోక్షం కలుగుతుందని పృథుణ్ణి ప్రశంసించి ఆకాశమార్గంలో అందరూ చూస్తుండగా వెళ్ళిపోయారు సనకాదులు.

ఒకసారి ఈశ్వరుడు సనత్కుమార మహర్షి దగ్గరికి వచ్చాడు. మహర్షి ఈశ్వరుడికి ఉపచారాలు చేసి త్రిలోచనా! ఏం చెయ్యమంటారో చెప్పండి చేస్తానన్నాడు. నీతో మాట్లాడిపోదామని వచ్చానన్నాడు ఈశ్వరుడు.

ఇంకా ఇలా అన్నాడు. ధ్యానంలో చూడ తగ్గది ఏది? తత్త్వాలెన్ని? సాంఖ్యమంటే ఏమిటి? ఇలాంటి ఆధ్యాత్మిక విషయాలెన్నో తెలుసుకుందామని వచ్చానన్నాడు శివుడు.

సనత్కుమారుడు తత్త్వములు ఇరవై అయిదు. అవి భూతములు అయిదు, వాటి గుణాలు పది, ఇంద్రియాలు అయిదు, మనస్సు, బుద్ధి అహంకారము ప్రకృతి మొత్తం ఇరవయి నాలుగు. ఇంకొక తత్త్వం దేహమందుండే పురుషుడు. కాష్టంలో వుండే నిప్పులా శరీరంలో పురుషుడుంటాడు. అతణ్ణి చూడగలగడమే అమృతార్థతత్త్వం. దీన్ని చూసినవాడు మృత్యువుని కూడా జయిస్తాడు. ఇవన్నీ కలిసి చూడడమే ఏకత్వమంటే. దీన్నే బ్రహ్మాన్ని చూడడం అంటారు.

తనను తానే చూసుకోగలిగివాడు జ్ఞాని. జిహ్వయందు సోముడు, వాణియందు అగ్ని, ప్రాణమందు వాయువు, బలంలో కౌశికుడు, బుద్ధియందు ఈశానుడు, అపానంలో సూర్యుడు, సమానంలో అప్సరసలు, కళ్ళల్లో సూర్యుడు, శరీరంలో అంఘ్రులు, చెవుల్లో శేషుడు, ఉపస్థంలో ప్రజాపతి, బుద్ధియందు బ్రహ్మ ఈ అన్నింటితో కలిసి ఆత్మ వుంటుంది. ఆత్మని చూడగలిగినవాడే యోగి అన్నాడు సనత్కుమారుడు.

యోగి అయినవాడు జనాలెవరూ తిరగని చోటు చూసుకుని ఇంద్రియాల్ని మనస్సుతో లాగిపట్టి ఆకలిదప్పులు మర్చిపోయి హృదయంలో దేవుణ్ణి చూస్తాడు అని చెప్పాడు సనత్కుమారుడు.

సనత్కుమారుడు ఈశ్వరుడికి సాంఖ్య యోగాన్ని గురించి కూడా చెప్పాడు. ఈశ్వరా! ఇన్నెందుకు? సంగమే బంధము. సర్వసంగ పరి త్యాగమే మోక్షం. ఇది పరమ రహస్యం, పరమ తత్త్వం కూడా.

శివుడు సనత్కుమారుడు చెప్పినవన్నీ విని సంతృప్తి పొంది తన కైలాసానికి వెళ్ళిపోయాడు. సనకాదులు స్వేచ్ఛా విహారానికి ఆకాశవీధిలో వెళ్లారు.

రావణుడు సర్వలోక దిగ్విజయ యాత్రచేసి సనత్కుమారుడి దగ్గరికి వెళ్ళి మహాత్మా! అనాది మధ్యలయుడెవ్వరు? ఎవరితో విశ్వసృష్టి జరిగింది? ఎవర్ని స్మరిస్తే బంధ విముక్తి అవుతుంది? ఇలాంటి సందేహాలు తీర్చమనడిగాడు.

రావణా! అనఘుడు, అవ్యయుడు మొదలైన గుణాలతో వున్న శక్తే బ్రహ్మం. ఆ బ్రహ్మమే నారాయణ, కృష్ణ, హరి, విష్ణు, గోవింద అనే పేర్లతో పిలవబడుతోంది. హరి చేతిలో మరణించిన వారందరి గురించి రావణుడికి చెప్పాడు సనత్కుమారుడు.

మహర్షీ! నాకా యోగం వుందా? అనడిగాడు రావణుడు. కృతయుగం చివర్లో హరి భూలోకంలో రాముడనే పేరుతో మనిషిగా పుట్టినప్పుడు నువ్వు అతనికి విరోధివై యుద్ధంలో అతని చేతిలో మరణించి మోక్షాన్ని పొందుతావని చెప్పి సనత్కుమారుడు అదృశ్యుడయిపోయాడు.

మార్కండేయుడు పితృదేవతల మహిమ గురించి తెలియచెయ్యమని సనకాదుల్ని అడిగాడు. ఇదంతా మనం మార్కండేయ మహర్షి కథలో తెలుసుకున్నాం. మార్కండేయుడి సందేహాలన్నీ తీర్చి అతనికి వరాలిచ్చి దివ్యదృష్టి, సర్వవిజ్ఞానము పొందేలా చేశాడు సనత్కుమారుడు.

రైభ్య మహర్షికి సనత్కుమారుడు విశ్వమంతా వ్యాపించి వున్న తన విశ్వరూపం చూపించి అతనికి గయాశ్రాద్ధ ఫలము, ఫల్గునీ నదీస్నాన ఫలితాల గురించి వివరంగా చెప్పాడు.

ఒకసారి నారదుడు సనత్కుమారుణ్ణి తనకు జ్ఞానబోధ చెయ్యమని ప్రార్థించాడు. సనత్కుమారుడు నీకు తెలిసినవి చెప్పు, తెలియనవి నేను చెప్తానని, నారదుడు చెప్పినవన్నీ విని వీటిన్నిటికన్నా ఆత్మజ్ఞానమే గొప్పదని చెప్పి అతనికి అఖండ ఆత్మజ్ఞానం ఉపదేశించాడు.

నైమిశారణ్యంలో మునులందరూ సనత్కుమారుణ్ణి రుద్రమహాత్మ్యం గురించి చెప్పమని అడిగారు. అలా వివరించిన గ్రంథాన్నే 'సనత్కుమార సంహిత' అన్నారు.

ఆ గ్రంథంలో బ్రహ్మ విష్ణూత్పత్తి, హరి విరించి సంవాదం, సప్తద్వీప సప్తవర్ష చరిత్ర, శివలింగపూజ, శివలింగప్రళయోత్పత్తి, శివాష్టకం, జ్ఞానప్రశంస, మోక్షవిచారం మొదలైనవన్నీ ఉన్నాయి.

సనత్కుమార మహర్షి మహాయోగి, మహాజ్ఞాని అయినా కూడా మనకోసం 'గృహవాస్తు శ్రాస్తం', 'శిల్ప శాస్త్రం' రాశాడు.

ఒకనాడు నారదుడు సనత్సుజాతుడ్ని విష్ణుతత్త్వం గురించీ, సకలజీవుల్ని పుట్టించేవాడు, నడిపించేవాడు, తనలో లయంచేసుకునేవాడు అయిన శ్రీహరిని గురించీ చెప్పమని అడిగి తెలుసుకున్నాడు.

వృత్రాసురుడు ఇంద్రుడితో యుద్ధం చేసి పడిపోయినప్పుడు రాక్షసులు అతణ్ణి శుక్రాచార్యుడి దగ్గరికి తీసికెళ్ళారు. గురుశిష్యుల ప్రార్థన విని సనత్కుమారుడు విష్ణుతత్త్వాన్ని, కర్మఫలం ఎలా అనుభవిస్తాడు. జీవుడు మొదలైన విషయాలు వివరంగా చెప్పగా విన్నారు. అమృతంలాంటి అతడి మాట పరిశుద్ధమైన మనస్సుతో ప్రాణాలు విడిచి విష్ణువుని చేరాడు వృత్తాసురుడు.

ధృతరాష్ట్రుడు విదుర నీతినంతా విని ఇంకా ధర్మాల గురించి చెప్పమన్నాడు విదురుణ్ణి. నేను శూద్రుణ్ణి కనుక ఇంతకంటే చెప్పేందుకు అర్హత లేదు. బ్రహ్మర్షి సనత్కుమారుడు వివరంగా చెప్తాడని మహర్షిని ప్రార్థించి ధృతరాష్ట్రుడికి మృత్యుతత్త్వాన్ని గురించి చెప్పమన్నాడు విదురుడు.

జీవికి మృత్యువనేది లేదు. అంతరాత్ముడైన పురుషుడు బొటన వ్రేలంత వుండి శరీరంలో వుంటాడు. అజ్ఞానులు ఇతనిని చూడలేరు. బ్రహ్మవిద్యా నిష్ణాతుడైన మానవుడు ప్రజ్ఞారూపుడై తన లోపలగల పరమాత్ముణ్ణి తెలుసుకుంటే అతడు శరీరాన్ని విడిచిపోనేపోడు. అలాంటి వాడికి చావులేదు, మోక్షము లేదు. బ్రహ్మతోనే సంబంధం.

నేను అన్నది ఆత్మ. సర్వం ఆత్మ. ఉన్నది లేనిది ఆత్మే. మనలో ఉన్న భగవంతుడు అంటే ఆత్మ ఒక్కడే సత్యం. ఎవరికీ ఎవరూ ఏమీకారు. లోకమంతా నిండివున్నది ఆత్మే. నాకు చావు పుట్టుకలు లేవు, నేనే ఆత్మ, నెనెప్పుడూ ఆనంద స్వరూపుణ్ణే అనుకుని నిష్ఠగా, నియమంగా ఉండేవాడు ఎన్నివేల సంవత్సరాలయినా బ్రతకగలడని చెప్పి సనత్సుజాతుడు ఆకాశమార్గంలో అంతర్ధానమయ్యాడు.

ఈవిధంగా సనక, సనందన, సనత్కుమార, సనత్సుజాత మహర్షులు ఆకాశ మార్గంలో తిరుగుతూ, ఏలోకానికి కావాలంటే ఆలోకానికి వెడ్తూ అడిగిన వాళ్ళందరికి మోక్షమార్గం ఉపదేశిస్తూ దివ్యతేజస్సుతో వెలిగిపోతూ వుంటారు.

ఇదర్రా! మన సనక సనంద సనత్కుమార సనత్సుజాత మహర్షుల కథ!!

అద్భుతంగా వుంది కదూ....!

# 94. సహస్రద మహర్షి

ఇప్పుడు మనం తెలుసుకోబోయిది సహస్రపాద మహర్షి గురించి.

సహస్రపాదుడు అంటే అర్థం తెలుసా మీకు? వెయ్యి పాదాలు కలవాడని. చాలా వేగంగా నడవచ్చుకదా!

సహస్రపాదుడికి ఖగముఖుడు అనే స్నేహితుడుండేవాడు. అతడు కూడ మన సహస్రపాదుడిలా తపోధనుడు నిగ్రహోను గ్రహుడు.

ఒకసారి ఖగముఖుడు తపస్సు చేసుకుంటుంటే సహస్రపాదుడు స్నేహితుడి మెడలో గడ్డి పరకల్ని పాములుగా చేసి వేశాడు.

ఖగముఖుడు ధ్యానంలో వున్నాడు కదా! ఉలిక్కిపడ్డాడు. కోపం వచ్చి స్నేహితుణ్ణి పాముగా మారమని శపించాడు.

డుండుభుడు అనే పేరుతో పాముగా మారిన తర్వాత జరిగినదంతా మనం రురు మహర్షి కథలో తెలుసుకున్నాం.

సహస్రపాదుడు పాముల మీద పగబట్టిన రురు మహర్షితో హింస చెయ్యకూడదని చెప్పి అతనితో పాముల్ని చంపే కార్యక్రమం ఆపించాడు.

ఇదర్రా! సహస్రపాదుడి కథ!!

# 95. సంవర్త మహర్షి

**ర**ండి! వచ్చెయ్యండి..... ఇప్పుడు మనం సంవర్త మహర్షి గురించి తెలుసుకుంటున్నాం. చదవడం మొదలుపెట్టెయ్యండి.

బ్రహ్మ మానస పుత్రుడయిన అంగిరసుడు తన ధర్మపత్ని శ్రద్ధ యందు పొందిన కొడుకు సంవర్తుడు.

సంవర్తుడు జ్ఞాని, యోగి, తపశ్శాలి, నిస్సంగి, నిర్మముడు, నిరుపమ శక్తిసంపన్నుడు.

సంవర్తనుడు ప్రపంచ విషయాలకి విరక్తుడై విరాగియై యోగీశ్వరుడై బంధువులు, మిత్రులు, శిష్యులు దగ్గరకి రాకుండా వుండడానికి దిగంబరత్వాన్ని అవలంబించి, హాయిగా అరణ్యాల్లో తిరగడం మొదలుపెట్టాడు.

పూర్వం మనువంశ రాజైన మరుదత్తుడు, ధర్మతత్పరతతో దయా దాక్షిణ్యాలతో, శక్తియుక్తుడుగా రాజ్యం పరిపాలిస్తున్నాడు.

ఇంద్రుడికి అసూయ ఎక్కువైపోయి ఏంచెయ్యాలా అని ఆలోచిస్తున్నాడు.

అదే సమయంలో మరుదత్తుడు ఇంద్రుణ్ణి మించి పోవాలని ఒక మహాయజ్ఞం బృహస్పతిని చేయించమని అడిగాడు. ఇంద్రుడు పిలిచాడు వెళ్ళాలన్నాడు బృహస్పతి.

ఈలోగా నారదుడు కనిపించి బృహస్పతి తమ్ముడు సంవర్తుడు నీతో యజ్ఞం చేయిస్తాడని మరుదత్తుడికి చెప్పాడు.

మరి సంవర్తుణ్ణి గుర్తించడం ఎలా? అనడిగాడు మరుదత్తుడు. నారదుడు అతడ్ని ఎలా గుర్తించాలో వివరంగా చెప్పాడు.

సంవర్తు కలిసి యజ్ఞం చేయించమని అడిగి బృహస్పతి తనను ఎలా అవమానపరిచాడో చెప్పాడు మరుదత్తుడు. అన్న దగ్గర అనుమతి తీసుకుని వస్తేనే నేను చేయిస్తాను, ఎందుకంటే అతడు నాకు గురువులాంటివాడన్నాడు సంవర్తుడు. మరుదత్తుడు జరిగిందంతా సంవర్తుడికి చెప్పి ఇంద్రుడే నా యజ్ఞం పూర్తి కాకుండా చూస్తున్నాడని బ్రతిమలాడి చివరికి ఒప్పించాడు.

మరుదత్తుడితో యజ్ఞం మొదలుపెట్టించి చివరిసారిగా ఆలోచించుకో ఇంద్రుడికి బృహస్పతికి శత్రువవుతావేమో అన్నాడు సంవర్తుడు. మరుదత్తుడు మునీంద్రా! మీరుండగా నేనెవరికి భయపడను, సూర్యచంద్రులు ఉన్నంతవరకు నువ్వే నా గురువు అన్నాడు భక్తితో.

హిమవత్పర్వతానికి ఉత్తర భాగంలో వున్న ముంజవంతమనే పర్వతం మీద శివుడి దయతో యజ్ఞం మొదలుపెట్టడానికి మరుదత్తుడికి ఎన్నో పసిడి మోపులు తెచ్చిచ్చాడు సంవర్తుడు.

ఇక్కడ సంవర్తుడు మరుదత్తుడితో యజ్ఞం చేయిస్తుంటే అక్కడ బృహస్పతి ఇంద్రుడితో యజ్ఞం చేయిస్తున్నాడు.

ఇంద్రుడు అగ్ని హోత్రుడ్ని పిలిచి ఎలాగేనా సంవర్తుడు చేయిస్తున్న యజ్ఞం ఆపమని పంపించాడు.

అగ్నిహోత్రుడు మరుదత్తుడి దగ్గరికి వచ్చి ఆతిథ్యం తీసుకుని రాజా! బృహస్పతి నీతో యజ్ఞం చేయించి ఇంద్రపదవి వచ్చేలా చెయ్యడానికి అంగీకరించి నన్ను స్వయంగా ఇక్కడికి పంపాడు. సంవర్తు వల్ల యజ్ఞం పూర్తవదని చెప్పాడు.

మరదత్తుడు అందుకు అంగీకరించక నాకు సంవర్తుడు ఎలా చేయించినా ఫర్వాలేదన్నాడు.

సంవర్తుడు నీ రాయబారం పూర్తియింది కదా ఇంక వెళ్ళమన్నాడు – అగ్నిహోత్రుణ్ణి, అగ్నిహోత్రుడు జరిగినది ఇంద్రుడికి చెప్పి ఇంక నావల్ల కాదన్నాడు.

ఇంద్రుడు గంధర్వపతయిన ధృతరాష్ట్రుణ్ణి పిలిచి మరదత్తుణ్ణి ఎలాగయినా బృహస్పతితో యజ్ఞం చేయించుకుందుకు ఒప్పించమని చెప్పాడు. వినకపోతే ఇంద్రుడి వజ్రాయుధం నిన్ను యముడి దగ్గరికి పంపుతుందని చెప్పమన్నాడు.

మరుదత్తుడి దగ్గరకు వెళ్ళి ఇంద్రుడు చెప్పమన్నట్లు చెప్పాడు ధృతరాష్ట్రుడు.

గంధర్వరాజా! మొదట నేను బృహస్పతిని అడిగాను. అతడు అంగీకరించి సమయానికి మాట తప్పాడు. ఇప్పుడు సంవర్తుడు అంగీకరించి యజ్ఞం మొదలు పెట్టాక వద్దు వెళ్ళిపొమ్మనడం న్యాయమేనా మీరే చెప్పండన్నాడు మరుదత్తుడు.

అదే సమయంలో వజ్రాయుధం వేగంగా వస్తుండడం చూసి భయపడ్తున్న మరుదుత్తడ్ని సంవర్తుడు అది నీ దాకా రాదు భయపడకన్నాడు.

నాకు 'సంస్తంభ' విద్య వచ్చని దాని వల్ల దేవతలు కూడా నా ముందాగలేరని ఇంద్రుడికి తెలుసు. నాశక్తి ముందు దేవతలకి ఆయుధాలు ఏవయినా సరే పని చేయ్యవని చెప్పాడు సంవర్తుడు. అప్పటికే వజ్రాయుధం శక్తి హీనమై గాలిలో తిరిగుతోంది.

మరుదత్తుడాశ్చర్యంతో సంవర్తుడి కాళ్ళ మీద పడి నమస్కారం చేశాడు. నీకేం కావాలో కోరుకోమన్నాడు సంవర్తుడు.

మునీంద్రా! ఇంద్రుణ్ణి విరోధం మాని యజ్ఞంలో తన హవ్య భాగం తీసుకోమని చెప్పమని అడిగాడు మరుదత్తుడు.

సంవర్తుడు యజ్ఞం పూర్తిచేసి తన మంత్రబలంతో ఇంద్రాదులందర్నీ సేవకుల్లా రప్పించాడు. సంవర్తుడు మరుత్తుడు వాళ్ళకి ఎదురు వెళ్ళి తీసుకువచ్చి ఆసనం మీద కూర్చోబెట్టారు.

మరుదత్తుడు ఇంద్రుడికి నమస్కరించి నీరాకవల్ల నా జన్మము, జన్మము కూడా సఫలమయ్యాయి. సంవర్తుడు నీ గురువు బృహస్పతికి తమ్ముడు. నీకు గురు సమానుడు. నాకు అన్నీ అతడే కనుక కోపం మాని యజ్ఞం పూర్తి చేయించమన్నాడు. ఇంద్రుడు సరేనన్నాడు.

సంవర్తుడు రెండవ అగ్నిలా ప్రకాశిస్తూ యజ్ఞం పూర్తి చేయించి దేవతలందర్నీ తృప్తి పరిచాడు. తర్వాత మరుదత్తుణ్ణి దీవించి సంవర్తుడు వెళ్ళిపోయాడు.

మరుదత్తుడు ఆనందంతో ఆదర్శప్రాయంగా రాజ్యపాలన చేసి షట్చక్రవర్తులో ఒకడయ్యాడు.

సంవర్తుడు దేవతలనే శాసించగల సర్వశక్తిసంపన్నుడై మహర్షి, మహాయోగి, సర్వేశ్వరుడితో సమానమైనవాడయ్యాడు.

ఇతను రాసిన 'సంవర్త స్మృతి'లో, కన్యావివాహవర్ణన, గోదానమహాత్మ్యం, ఆచారవ్యవహారం, దినచర్య, ఉపవాసవ్రతం, బ్రాహ్మణ భోజనం, గాయత్రీ జపం, ప్రాణాయామం లాంటి విషయాలెన్నింటి గురించో వివరంగా తెలియచేశాడు. అంతేకాదు అన్ని దానాల్లోకి అన్నదానమే గొప్పదనీ, ఇక ముందు కూడా దాన్ని మించిన దానం లేదని చెప్పాడు సంవర్త మహర్షి.

# 96. సారస్వత మహర్షి

ఇప్పుడు మనం సారస్వత మహర్షి గురించి తెల్సుకుంటున్నాం. మరి మొదలెడదామా......

సారస్వత మహర్షి దధీచి మహర్షి కొడుకు. సరస్వతీ నది ఇతణ్ణి పెంచి ధధీచి వల్ల వరాలు పొందింది. అన్ని నదులలోకి పవిత్రమైన నదిగా, దాంట్లో స్నానం చేసిన వాళ్ళ పాపాలు పోయి పవిత్రులయ్యేలా వరం పొందింది.

దధీచి మహర్షి గురించి మనం ఇంతకు ముందే తెల్సుకున్నాం కదా! అలాంటి గొప్ప మహర్షి కొడుకంటే ఇంకా ఎంత గొప్పవాడో మరి .......!

దేవతలు దధీచి మహర్షి ఎముకలతో చేసిన ఆయుధాల్తో రాక్షసులందర్నీ చంపిన తర్వాత ఒక్కసారిగా కరువు ఏర్పడి ప్రజలందరు వలస వెళ్ళిపోవడం మొదలుపెట్టారు. అక్కడి వాళ్ళిక్కడ, ఇక్కడి వాళ్ళక్కడ అందరూ కాందిశీకులయి పోయారు.

సారస్వతుడు సర్వసతీ నదీ తీరంలో తన ఆశ్రమంలో వేదపారాయణ చేస్తూ, తన తపశ్శక్తితో కరువుని పోయేలా చేశాడు. పన్నెండు సంవత్సరాలు ఏడిపించి వదిలిన ఈ కరువు వల్ల శిష్యులు, గురువులు చెల్లాచెదరయిపోయారు.

మళ్ళీ ఋషులందరూ తమ తమ ఆశ్రమాలకి చేరుకుని వేదాధ్యయనం మొదలుపెట్టారు. కాని పన్నెండు సంవత్సరాలు వదిలెయ్యడం వల్ల చెప్పేవాళ్ళకి, చెప్పుకునేవాళ్ళకి కూడా కష్టమయిపోయింది.

ఒక శిష్యుడు తిరుగుతూ తిరుగుతూ, సరస్వతీ నదీ తీరంలో వేదఘోష విని అక్కడ సారస్వత మహర్షి వేదం నేర్పించడం చూసి మిగిలిన ఋషులకి చెప్పాడు. ఋషులందరూ అక్కడికి చేరారు. తమ దగ్గరకొచ్చి తమకికూడ వేదం నేర్పమన్నారు.

సారస్వతుడు గురువు దగ్గరికి మీరే వచ్చి నేర్చుకోవడం ధర్మంగాని , గురువు మీ దగ్గరికి రావడం ధర్మం కాదన్నాడు. ఋషులు మరి మేము వృద్ధులము నీవు బాలుడవు ఇది దోషం కాదా! అనడిగారు. వేదాల్లో చిన్నవాళ్ళ దగ్గర పెద్దవాళ్ళు నేర్చుకోకూడదనేం లేదు. ఇది గురుశిష్య సంబంధం మాత్రమే అన్నాడు సారస్వతుడు.

అప్పుడు ఋషులు శిష్యులు కూడా బారులు బారులుగా వచ్చి గురుశుశ్రూష చేస్తూ వేదం చదువుకున్నారు.

ఈరకంగా సారస్వతుడు లోకంలో కరువు బాధని పోగొట్టి, వేదాల్ని కూడా మళ్ళీ ఉద్ధరించాడు.

ఇది పిల్లలూ! సారస్వతుడి కథ!!

# 97. సాందీపని మహర్షి

**పి**ల్లలూ! మన మిప్పుడు సాందీపని మహర్షి గురించి తెలుసుకుందాం. ఈపేరెప్పుడేనా విన్నారా? ఆలోచించండి. కృష్ణుడి గురువుగారు ఎవరు? ఇప్పుడు గుర్తోచ్చిందా.....! పోన్లే అసలు తెలుసుకదా అంతేచాలు. ఇప్పుడు ఆయన గురించి తెల్సుకుందాం......

అవంతీపురంలో వేదజ్ఞులు, శాస్త్రజ్ఞులు, పురాణజ్ఞులు అయినటువంటి బ్రాహ్మణులుండే వాళ్ళు. అందులో సందిపని మహర్షి కొడుకు సాందీపుడు.

సాందీపుడు చిన్నతనంలోనే అన్ని వేదశాస్త్రాలు నేర్చుకుని అన్ని వేదరహస్యాలు తెలుసుకుని దయాశాలి, ప్రియదర్శనుడు, సాత్త్వికుడు, విష్ణుపూజారతుడు, వివేకధనుడు అంటూ ఎన్నోపేర్లతో పిలవబడేవాడు. తండ్రికి తగ్గ తనయుడునిపించుకున్నాడు.

సాందీపనికి పెళ్ళి చేశాక ఒక కొడుకు పుట్టాడు. అతడు ఏకసంతా గ్రాహి. తండ్రి దగ్గర అన్ని విద్యలు నేర్చుకున్నాడు. అతడికి విష్ణు పాదపద్మాల దగ్గరే వుండాలని, సంసారం, చావు, పుట్టుక ఇలాంటివి తనకిష్టం వుండదని అంటూండేవాడు.

ఒకరోజు మాఘ పౌర్ణమినాడు స్నానం చేస్తూ ఈ పుణ్యకాలం దాటితో మళ్లీరాదు అనుకుని విష్ణుమూర్తిని తల్చుకుని నీళ్ళల్లో మునిగిపోయాడు. ఎంత వెతికించినా కనపడలేదు.

సాందీపని మహర్షి బంధాలుండకూడదని సరిపెట్టుకున్నాడు, కానీ ఆయన భార్య మాత్రం ఏడుస్తూనే వుండేది.

కంసుణ్ణి వధించాక దేవకీ వసుదేవులు బలరామకృష్ణులకి గర్గుడు మొదలైన మహార్షులతో ఉపనయనం చేయించి దానాలు, ధర్మాలు అన్నీ చేసి సాందీపని దగ్గర విద్యాభ్యాసం కోసం పెట్టారు.

బలరామకృష్ణులు స్వతహాగా జగద్గురువులు, సంపూర్ణులు, సర్వజ్ఞులు అయినా కూడా గురుశుశ్రూషతో నేర్చిన విద్యే సరైన విద్యని లోకానికి తెలియచెప్పడం కోసం గురువు దగ్గర చేరి చదువుకున్నారు.

బలరామకృష్ణులు మహావైభవరాశియైన కాశీకి బ్రహ్మచారులై చేరి అక్కడ అవంతీపురంలో వున్న సాందీపని మహర్షికి సాష్టాంగ నమస్కారం చేశారు. సర్వజగత్తుని నియంత్రించగల బలరామకృష్ణులు తనకి సాష్టాంగపడ్డం ఎంత అపురూపం! ఎంత అద్భుతం! ఎంత అదృష్టం! అనుకుని సాందీపని మహర్షి వాళ్ళని శిష్యులుగా అంగీకరించి విద్యాభ్యాసం మొదలుపెడితే రోజుకి ఒక విద్య చొప్పున చెప్పింది చెప్పగానే నేర్చేసుకున్నారు.

అదృష్టమంటే అందరినీ వరించదు. త్రిమూర్తుల్ని పరీక్షించే శక్తి భృగుమహర్షికి, త్రిమూర్తుల్ని చంటి పిల్లల్ని చేయగల శక్తి అనసూయకి, శ్రీరాముడికి గురువయ్యే అదృష్టం వసిష్ఠుడికి, విష్ణుమూర్తిని కొడుకుగా పొందిన యోగం కశ్యపుడిది, పధ్నాలుగు లోకాల్ని సంరంక్షించే బలరామకృష్ణులకి పాఠం చెప్పే అదృష్టం వేలాది మహర్షుల్లో ఒక్క సాందీపనికే కలిగింది. సాందీపని మహాయోగం ఎంత గొప్పదో!!

బలరామకృష్ణులు విద్యాభ్యాసం అయిపోయాక గురువుగారికి, గురుపత్నికి నమస్కారం చేసి గురు దక్షిణగా ఏంకావాలనడిగారు. సాందీపని మహర్షి తన కొడుకు వృత్తాంతం చెప్పి నేనయితే ఇవన్నీ మామూలే అనిసరి పెట్టుకున్నానుగాని, నా భార్య అతనికోసం ఏడ్వనిరోజు లేదు. మాకు తప్పకుండా గురుదక్షిణివ్వాలని వుంటే నా కొడుకుని తీసుకురండని చెప్పాడు సాందీపని మహర్షి.

బలరామకృష్ణులు సముద్రుడి దగ్గరకెళ్ళి మా గురుపుత్రుణ్ణివ్వమని అడిగారు. సముద్రుడు అతణ్ణి నాలో వున్న పంచజన్య అనే రాక్షసుడు మింగేశాడని చెప్పాడు.

అప్పుడు కృష్ణుడు సముద్రంలోకి వెళ్ళి రాక్షసుడి పొట్ట చీల్చాడు. లోపల గురుపుత్రుడు లేడుగాని ఒక శంఖం వుంది. అది తీసుకుని యమపురం వెళ్ళి శంఖారావం చేశాడు. యముడు భయపడి బయటకి వచ్చి. బలరామకృష్ణులకి నమస్కారం చేసి ఆ పిల్లవాణ్ణి వాళ్ళకి అప్పగించాడు.

బలరామకృష్ణులు గురుపుత్రుణ్ణి తీసికొచ్చి సాందీపని మహర్షికి అప్పగించి నమస్కరించి ఆశీర్వాదం తీసుకుని వెళ్ళిపోయారు.

సాందీపని మహర్షి ఎంతోమంది శిష్యులకి విద్యాదానం చేస్తూ భార్య కొడుకులతో సుఖంగా ఉన్నాడు.

సాందీపని మహర్షి కథ చదివారు కదా! ఈ మహర్షి గొప్పతనం ఎంత చెప్పినా అది తక్కువే అవుతుంది.

# 98. సుకృశ మహర్షి - ధర్మపక్షులు

ఇప్పుడు సుకృశ మహర్షి గురించి తెల్సుకుందాం -

సుకృశ మహర్షి మహా తపస్సంపన్నుడు. మహర్షి.

ఒకసారి ఇంద్రుడు సుకృశ మహర్షిని పరీక్షించాలని పక్షి రూపంలో వచ్చి మాంసాహారం పెట్టమని అడిగాడు.

సుకృశుడు తన నలుగురు పిల్లల్ని పక్షికి ఆహారంగా వెళ్ళమంటే ఒక్కడు కూడా వెళ్ళమన్నారు.

సుకృశుడు కోపంతో తన నలుగురు పిల్లల్ని పక్షులుగా మారమని శపించాడు.

కానీ, వాళ్ళు బాధపడ్తుంటే వాళ్ళ మానవభాషలో మాట్లాడగలిగే శక్తి కలిగి విద్యావేత్తలుగా వుంటారని చెప్పాడు.

తర్వాత సుకృశ మహర్షి తానే స్వయంగా పక్షికి ఆహారంగా వెళ్ళాడు. ఇంద్రుడు ప్రత్యక్షమై సుకృశుడికి ఎన్నో వరాలిచ్చి అదృశ్యమయ్యాడు.

సుకృశుడి పిల్లలే ధర్మపక్షులుగా వింధ్య పర్వత ప్రాంతంలో నివసిస్తున్నాయి. వీళ్ళనే జైమిని పక్షులని కూడ అంటారు.

ఇదర్రా! సుకృశ మహర్షి కథ!!

# 99. స్థూలకేశ మహర్షి

**రం**డర్రా! మొదలుపెట్టేద్దామా మరి... మీ కోసమే ఎదురు చూస్తూ వున్నాను. కానియ్యండి...

ఇప్పుడు మనం తెలుసుకో బోయే మహర్షి స్థూలకేశ మహర్షి. పూర్వం మహాతపస్సంపన్నుడు. విద్యావంతుడు, అపారతేజుడు అయిన స్థూలకేశుడనే మహర్షి. దయామయుడు, తత్త్వవిదుడు అని ఖ్యాతి గడించాడు. అతని ఆశ్రమం పరమ పవిత్రంగా ప్రశాంత నిలయంలా ఉండేది.

విశ్వావసుడనే గంధర్వరాజు మేనక అనే అప్సరసని ఇష్టపడ్డాడు. వాళ్ళిద్దరు స్థూలకేశుడి ఆశ్రమంలో ఆయనకి తెలియకుండానే కలుసుకుంటూ వుండేవాళ్ళు.

కొన్నాళ్ళకి మేనక గర్భవతయింది. మేనక చక్కటి అమ్మాయిని ప్రసవించి స్థూలకేశుడి ఆశ్రమంలో వదిలేసింది. విశ్వావసుడు కూడా ఆ పిల్ల నాకెందుకని అక్కడే వదిలేసి స్వేచ్ఛగా వెళ్ళిపోయాడు.

ఇల్లా పిల్లల్ని కనేసి వదిలెయ్యడం ప్రతి యుగంలోనూ ఉందేమో?

స్థూలకేశుడు స్నానంచేసి నది దగ్గర్నుంచి వచ్చే సరికి ఆశ్రమం దగ్గర ముద్దులు మూటకట్టే ఒక పసి పిల్ల కనిపించింది. దివ్యదృష్టితో అంతా తెలుసుకుని ఆ పసిపిల్లని పెంచడం మొదలుపెట్టాడు స్థూలకేశుడు.

సర్వసంగ పరిత్యాగి అయిన ఆ మహర్షి, ఈశ్వరుణ్ణి తప్ప ఏమీ తెలియని ఆ మహర్షి ఆ పిల్లకి జాతకర్మ, నామకరణం శాస్త్రీయంగా చేసి 'ప్రమద్వర' అని పేరుపెట్టి అన్ని విద్యలూ నేర్పిస్తున్నాడు.

ఒకసారి స్థూలకేశుడ్ని చూడ్డానికి రురు మహర్షి వచ్చి, సౌందర్యమూర్తి అయిన ప్రమద్వరని చూసి అంతటి ధర్మాత్ముడు, బ్రహ్మచర్యవ్రతుడు అయిన రురు మహర్షి ప్రమద్వర మీద ఇష్టం కలిగి ఇంటికి వెళ్ళి తండ్రికి చెప్పాడు.

ప్రమతి మహర్షి స్థూలకేశుడిని అడిగి ప్రమద్వర-రురులకి పెళ్ళిచెయ్యాలని నిర్ణయించాడు.

రురుప్రమద్వరల పెళ్ళి ఎలా జరిగిందో మనం రురు మహర్షి కథలో తెలుసుకున్నాం కదా...!!

చూశారా! స్థూలకేశుడు దొరికిన అమ్మాయిని తన స్వంత కూతుర్లా పెంచి పెద్దచేసి, ఒక మహర్షి, గుణసంపన్నుడు అయిన రురువుకి కన్యాదానం చేశాడు.

ఇదర్రా! స్థూలకేశ మహర్షి కథ!!

# 100. సౌభరి మహర్షి

వచ్చారా! రండీ.....! ఇప్పుడు మనం సౌభరి మహర్షి గురించి తెల్సుకుందామా.... సరే అనండి మరీ......

పూర్వం కాంపిల్యపురంలో సౌభరి అనే బ్రాహ్మణుడు అఖిల వేదశాస్త్రాలు నేర్చుకుని గొప్ప తపస్సంపన్నుడై తపోధనంతో పాటు, వ్రతనియమధనం కూడా సంపాదించాడు.

సౌభరి మొదట చాంద్రయణాది వ్రతం, తర్వాత మాసోపవాసం చేశాడు. తర్వాత మాఘమాసంలో నీళ్ళలో ఉండి ఘోర తపస్సు ప్రారంభించాడు.

ఇలా వంద సంవత్సరాలు గడిచాక ఆ నీళ్ళల్లో సామమదమనే పేరుగల చేప ఒకటి పిల్లలు, మనమలు, ముని మనుమలు, అలాఅలా ఇంకా తరతరాలతో ఆనీళ్ళల్లో మహారాజులా బ్రతుకుతూ సౌభరి ముని చుట్టూ తిరుగుతోంది.

దాని సుఖాన్ని చూసి సౌభరి తాను కూడా పెళ్ళి చేసుకోవాలనుకున్నాడు. అనుకున్నదే తడవుగా సౌభరి మాంధాత దగ్గరికి వెళ్ళి నీ కూతుళ్ళలో ఒక కూతుర్ని నాకిచ్చి పెళ్ళి చెయ్యమన్నాడు.

ఆ మాటలు విన్న మాంధాత ఇక్ష్వాకువంశం వాళ్ళు ఎవరు ఏమడిగినా ఇచ్చేస్తారు సరే, కానీ, (నెరిసిన గడ్డం, జడలుపడిన జుట్టు వయసుడిగిన సౌరభి వంక చూసి ఇయ్యకపోతే శపిస్తాడేమో అని భయపడి) మా కులంలో కన్యల్ని కోరుకున్నవాడికే ఇచ్చి పెళ్ళి చేస్తారని చెప్పాడు. నువ్వు ముసలివాడివి నిన్ను చూస్తే నా కూతుళ్ళు ఒప్పుకుంటారని అనిపించడంలేదన్నాడు.

రాజా! నువ్వు చెప్పింది నిజమే. నీ కూతుళ్ళకి నన్ను చూపించు. ఎవరు ఇష్టపడితే వాళ్ళే చేసుకుంటారు. లేకపోతే నేనే వెళ్ళిపోతాను అన్నాడు సౌభరి.

మాంధాత సరేనని కూతుళ్ళని పంపించాడు. సౌభరి తన తపోబలంతో మనోహరమైన రూపంతో కూర్చున్నాడు. మాంధాత యాభై మంది కూతుళ్ళు సౌభరినే చేసుకుంటామన్నారు.

మాంధాత సౌభరికి తన కూతుళ్ళనిచ్చి పెళ్ళి చేశాడు. వాళ్ళని తీసుకుని సౌభరి ఆశ్రమానికి వచ్చాడు. విశ్వకర్మని పిలిచి వీళ్ళు యాభై మంది రాజకుమార్తెలు సుకుమారులు నా ఆశ్రమంలో వుండలేరు, వాళ్ళకి చక్కటి భవనాలు కట్టిమ్మన్నాడు. భార్యలతో సహా ఆ భవనాల్లో సౌభరి సుఖంగా వున్నాడు.

కొంతకాలం తర్వాత మాంధాత తన కూతుళ్ళు ఎలా ఉన్నారో చూడాలని వచ్చి తన కళ్ళని తనే నమ్మలేకపోయాడు. ఏ కూతుర్ని అడిగినా చాలా సంతోషంగా ఉన్నాననే చెప్పింది. ఆనందంగా తిరిగి వెళ్ళిపోయాడు మాంధాత.

సౌభరి యాభై మంది భార్యలకి నూటయాభైమంది పిల్లలు కలిగారు. కొంతకాలం తర్వాత సౌభరి సర్వసంగపరిత్యాగం చేసి చాలా సంవత్సరాలు తపస్సులో ఉండిపోయాడు.

ధర్మరాజు అశ్వమేథయాగం చేస్తుంటే ఆ అశ్వం వెంట అర్జునుడు మొదలైన వాళ్ళు వచ్చారు. కాని ఆ అశ్వం ఒక రాయికి అంటుకుని రాలేదు. ఇదేమిటని వెంటవచ్చిన సౌభరిని అడిగాడు అర్జునుడు.

ఉద్దాలకుడి భార్య అయిన చండిక శాపం వల్ల రాయిలా పడిపోయింది. అర్జునుడు చేతితో ముట్టుకుంటే ఆ రాయి మళ్ళీ స్త్రీ అవుతుందని చెప్పాడు. అర్జునుడు చండికకి శాప విముక్తి చేశాడు.

ఇది పిల్లలూ ! సౌభరి మహర్షి కథ!!

# 101. హరీత మహర్షి

**రం**డి!రండి! మనం ఇప్పుడు హరీత మహర్షి గురించి తెల్సుకుంటున్నాం. భృగువంశంలో వేదవేదాంగవేత్త, బ్రహ్మజ్ఞాని గోత్రప్రవరుడు అయినటువంటి ఒక మహర్షి ఉండేవాడు. ఇతని కొడుకు హరీత మహర్షి.

హరీత మహర్షి సంతానమే 'హరితస' గోత్రం వాళ్ళుట. మీలో ఎవరేనా 'హరితస' గోత్రం వాళ్ళుంటే మీరుకూడా భృగువంశం వాళ్ళన్నమాట. వీళ్ళనే వైశానసులని కూడా అంటారు.

హరీతుడు తపోదీక్షలో బాహ్యప్రపంచాన్నే మరిచి పోయిన గొప్పశక్తి కలవాడు, గొప్పజ్ఞాని. ఒకసారి దిలీపుడు వేటకి వచ్చి హరీత మహర్షి ఆశ్రమానికి వచ్చాడు. అది మాఘమాసం. మహర్షి దిలీపుణ్ణి అతిథి మర్యాదలు చేసి దగ్గర్లో వున్న నదిలో స్నానం చేసి రమ్మని అతని వంశం వాళ్లందరు మహాపురుషులు ధర్మప్రభువులు అయిన చక్రవర్తులు పుట్టేటట్లుగా దీవించి మాఘమాస గొప్పతనాన్ని అతని గురువు అయిన వసిష్ఠుడి దగ్గర తెలుసుకోమని చెప్పి పంపాడు.

హరీత మహర్షి "లఘుహరీతస్మృతి" అనే గ్రంథంలో బ్రహ్మచర్యాశ్రమ ధర్మాలు, గృహస్థధర్మ నిర్వహణ, వానప్రస్థ ధర్మాలు, సన్యాసం, యోగము మొదలయినవాటి గురించి వివరించాడు.

హరీత మహర్షి 'వృద్ధహరీత స్మృతి'లో అంబరీషుడికి చెప్పినట్లుగా మనకి కూడా తెలియచేసిన వివరాలు.

పురుషోత్తముడే అనాదియైన దేవుడు. అందుకే ధర్మాలలో కెల్లా గొప్పధర్మం ఆ పురుషోత్తముడి పాదపద్మాలయందు భక్తే. ఈగ్రంథంలో మంత్రవిధానం, సమారాధన ఎలా చెయ్యాలి, విష్ణుమూర్తి పూజావిధానం, స్త్రీ ధర్మాలు, ప్రాయశ్చిత్తము ఇలా ఎన్నో విషయాలను గురించి చెప్పాడు. ఇంతకంటే ఎక్కువ వివరంగా నేను రాసినా మీకు అర్థం చేసుకునేంత వయస్సు లేదు.

'హరితగీత' అనే గ్రంథం కూడా భారతగీతలలో గొప్పది. హరీతుడి ధర్మసూత్రాలు కూడా చాలా మంది మహర్షులు అనుసరించారు.

'ఓం నమో భగవతే వాసుదేవాయ' అని వింటూంటాం కదా! అదికూడా వృద్ధహరీత స్మృతి నుంచి వచ్చిన మంత్రమే!

రండర్రా! అలిసిపోయినట్లున్నారు. నూర్గురు మహర్షుల దివ్యకథలు మీరు చదివారు అంటే ఒక యజ్ఞం చేసినట్లే.

అంతమంది గురించి తెలిసికోవడమంటే మాటలా! మజాకానా! ఇంతమంది గొప్పగొప్ప మహర్షులు మన దేశంలో పుట్టారంటే మీకు గర్వంగా, ఆశ్చర్యంగా, అద్భుతంగా, భక్తిగా ఇంకా చాలా చాలా అనిపిస్తోంది కదూ....!

మీరు నూర్గురు గురించి చదివారూ అంటే మనదేశంలో నూర్గురు మహర్షులే పుట్టారని కాదు.  ఇంకా ఎంతోమంది ఉన్నారు. అందులో కొంతమందిని మీకు కొంచెం పరిచయం చేస్తాను.

చాలామందిని నేను మీకు పరిచయం చెయ్యలేకపోవచ్చు. ఎందుకంటే మిలాగే నేనూ చూడలేదు గనుక. మీకు కళ్ళకి కట్టినట్లు ఋషులు, చరిత్రలు, వాళ్ళ తపస్సులు విద్యలు, నియమనిష్ఠలు, లోకం కోసం చేసిన వాళ్ళు చేసిన గొప్ప పనులు ఇలాంటివి ఎన్నో తెలియచెప్పి ఈ దేశంలో మనం పుట్టినందుకు గర్వపడేందుకు అధికారముందనీ, వాళ్ళ పవిత్రమైన ఆశీర్వచనాలవల్లే ఇంతకుముందు కానీ, ఇప్పుడు కానీ, ఇక మీదటకానీ, ఎప్పటికీ మనదేశం జ్ఞానంతోను, సంపదలతోనూ సస్యశ్యామలంగా, ప్రపంచానికే గర్వకారణంగా వుంది. వుంటుంది కూడా! దీంట్లో ఏ మాత్రం సందేహం లేదనీ చెప్తున్నాను. మీరు కూడా నాతో ఏకీభవిస్తున్నారా....! చాలా సంతోషం. రండి మరికొందర్ని ఋషుల్ని మీకు పరిచయం చేస్తాను.

**102. అప్రవానుడు** : ఈయన చ్యవన మహర్షికి కొడుకు. ఔర్వ మహర్షికి తండ్రి.

**103. అరిష్టిషేనుడు** : ఈయన ఆశ్రమంలో కొంతకాలం పాండవులున్నారు.

**104. అశ్వలాయనుడు** : శౌనకమహాముని శిష్యుడు. గృహ్యాసూత్రాలు చేశాడు.

**105. ఇంద్రమిత్ర** : వ్యాస మహర్షికి శిష్యుడు. పైల మహర్షికి శిష్యుడు. ఋగ్వేదాన్ని నాలుగు భాగాలుగా చేసి పాఫ్కాలుడు, యాజ్ఞవల్క్యుడు, పరాశరుడు, మార్కండేయుడు, అగ్నిమతి మొదలైన ఋషులకి ఉపదేశం చేశాడు.

**106. ఉషస్తి** : ప్రాణాలు నిలుపుకోవడానికి ఏం తిన్నా ఫర్వాలేదని, శనగలు తిని చూపించాడు.

**107. కంథుడు** : భార్య ప్రమోచన, కూతురు మరీష.

**108. చిరకారి** : మేథానిధి కొడుకు. ఒకసారి మేథానిధికి తన భార్యమీద కోపం వచ్చి చిరకారిని పిలిచి నీ తల్లిని చంపెయ్! అన్నాడు. చిరకారి ఆపని అప్పుడే చెయ్యకుండా ఆలోచిస్తూ కూర్చున్నాడు. ఈలోగా మేథానిధి కోపం తగ్గిపోయి నీకు చిరకారి పేరే బాగుందిరా అబ్బాయ్! అన్నాడు.

**109. పంచరఖుడు** : ఈయన మిథిలానగర చక్రవర్తి జనకుడికి తత్త్వోపదేశం చేసిన మహానుభావుడు.

**110. మనస్వి** : దేవల మహర్షి కొడుకు.

**111. మందకర్ణి** : ఈయన గాలిని భోజనం చేసి, నేలమీద పడుక్కని పదివేల సంవత్సరాలు తపస్సు చేస్తే భయపడిపోయిన దేవతలు ఈయన తపస్సు భగ్నం చెయ్యడానికి అయిదుగురు అప్సరసల్ని పంపారు. అంటే ఆయన తపస్సుకి అంత పవరన్నమాట.

**112. మహీదాసుడు** : ఋగ్వేద విహితకర్మల్ని గురించి సూత్రాలు చేశాడు. వీటిని అశ్వలాయనసూత్రాలు అంటారు.

**113. మాండూకేయుడు** : ఈయన ఇంద్రప్రమతి శిష్యుడు. ఋగ్వేదాన్ని ప్రచారం చేశాడు.

**114. శిలాదుడు** : నందీశ్వరుడి తండ్రి. జపేశ్వరంలో రుద్రుడ్ని గురించి తపస్సు చేసి అయోనిజుడు మృత్యుంజయుడు అయిన నందిని కొడుకుగా పొందాడు.